
జ్ఞాన యోగం

# జీవిత పరమార్ధము - వేదాంత శాస్త్రము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "చీచాటిచీమడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# జీవితపరమార్థము - వేదాంతశాస్త్రము

© కొండూరి నాగమణి

తొలి ముద్రణ: 1995

ప్రతులు : 1000

PLACED ON THE SHELF
Date..................

వెల: రూ. 50/-

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No ..........................
Date ..............................
TIRUPATI.

ప్రాప్తిస్థానము:
**కొండూరి హనుమంతరావు**
1-10-23, అశోక్‌నగర్
హైదరాబాదు - 500 020.
ఫోన్: 633311

ముద్రణ:
**విష్ణ కంప్యూటర్ సర్వీసెస్**
నల్లకుంట, హైదరాబాదు-500 044.
ఫోన్: 667476, 636242

ఓం శ్రీ సద్గురుభ్యో నమః

# ప్రేరణ

"ఏమిటండీ ! ఇంత చిన్న వయసులోనే భగవద్గీత, భాగవతం వంటి వేదాంత గ్రంథాలు చదువుతున్నారు ! కొన్నాళ్ళకు పనికిరాకుండా సన్న్యాసిలా అవుతారా ?" అని ఒకసారి ఒకరు నన్ను ప్రశ్నించారు. "ఎలా పనికిరావాలో (సంఘానికి / కుటుంబానికి) తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఇటువంటి మంచి పుస్తకాలను చదువుతున్నాను" అని అప్పటికి సమాధానం చెప్పానే కాని ఆ క్షణం నుండే నాలో ఒక అంతర్మథనం ప్రారంభమైంది. "ఏమిటీ ఈ లోకం విపరీత ధోరణి? వేదాంత శ్రవణం, పఠనం కేవలం వృద్ధులకు మాత్రమేనా ? చిన్న వాళ్ళు చదివితే, వేదాంత విషయాలు వింటే వైరాగ్యంతో సన్న్యాసులవుతారా? కేవలం విరక్తితో సన్న్యసించటం కోసమే వేదాంత శాస్త్రం ఉద్దేశించబడిందా! అలా కుటుంబానికి, సంఘానికి ఎటువంటి సేవ చేయకుండా విరక్తులుగా మారేటట్లయితే భయంకరమైన కురుక్షేత్ర సంగ్రామ సమయంలో యుద్ధభూమి యందు శ్రీ కృష్ణపరమాత్మ అర్జుననకు గీతాబోధ ఎందుకు చేసినట్లు? పిన్నవయసులో శ్రీ రామునికి వశిష్ఠులవారు యోగాన్ని బోధించింది ఎందుకు? " అని నిరంతరం ఆలోచిస్తూ ఉండేదాన్ని. అప్పటినుండే నాలో ఒక పట్టుదల పెరిగింది. నిత్యము కానటువంటి దేహము పై మోహమును విడిచిపెట్టి నిస్వార్థబుద్ధితో, ఈశ్వరార్పణ బుద్ధితో నిష్కామకర్మ చేయటం, అనిత్యమైన ఈ దేహముతో, మిథ్యామాత్రమైన ఈ ప్రపంచంలో "తామరాకుపై నీటి బొట్టు" లా జీవిస్తూనే శాశ్వతమైన జీవిత పరమార్థమగు మోక్షమును ఏ విధంగా సాధించవచ్చునో తెలియచేయటానికే వేదాంతశాస్త్రము ఉద్దేశించబడిందనే సత్యమును సులభంగా పదిమందికీ అర్థమయ్యే విధంగా సరళమైన భాషలో వీలయినంత స్పష్టంగా తెలియచేయాలన్న తీవ్రమైన ఆసక్తి పెరిగింది.

వేదాంతమంటే వయసుమళ్ళిన స్థితిలో చేయుపురాణకాలక్షేపం వంటిది కాదనీ, యుక్తవయస్సునుండే సత్సాంగత్యం, సద్గ్రంథపఠనం వలన క్రమంగా లౌకిక విషయవాంఛలపట్ల ఆసక్తి తగ్గి, నిష్కామసేవ యందు ఆసక్తి కలిగి, భక్తి

మార్గంలో ప్రవేశించి, అనన్యమైన భక్తితో అంతటా వ్యాపించియున్న పరమాత్మ స్వరూపమును గుర్తించి, చిత్తైకాగ్రతను పొందుటచే బ్రహ్మ అపరోక్షానుభూతి పొందగలుగుతారని మన వేదాంతశాస్త్రమునందు సుస్పష్టంగా చెప్పబడి ఉన్నదని, కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గములు పరస్పర సహకారులు మాత్రమేకాని, పరస్పర విరుద్ధములు కావనీ తెలియచేస్తూ ఒక పుస్తకం వ్రాయాలనే తపన నాలో పెరిగింది.

ఈ విషయంలో ఎవరిని ఆశ్రయించాలా అని అన్వేషిస్తున్న సమయంలో దైవకృపవలన మా మామగారు శ్రీ కొండూరు రామారావుగారు శ్రీ మల్లాప్రగడ శ్రీరంగారావుగారికి నన్ను పరిచయం చేయుటం జరిగింది. వారు ఎంతో ఆప్యాయంగా నా ఆవేదనను అర్థం చేసుకొని "జీవిత పరమార్థము - వేదాంత శాస్త్రము" అనే పేరుతో పుస్తకం వ్రాయి. అందులో నీవు ఆశించిన విధంగా వివిధమైన వేదాంత గ్రంథములను పరిశీలించి, అన్ని విషయములు సమగ్రంగా వ్రాసే అవకాశం ఉంటుందని" అమూల్యమైన సలహా ఇచ్చి నన్ను ప్రోత్సహించారు. వారి సలహామేరకు భారత, భాగవత, భగవద్గీతాదులు, ఉపనిషత్తులు, వివేక చూడామణి, యోగవాశిష్ఠము, వేదాంత పంచదశి, రామకృష్ణభోదామృతము, వివేకానందుని రచనలు మొదలైన ఎన్నో ఉత్తమమైన ఆధ్యాత్మిక గ్రంథములను పరిశీలించి వాటిలో కర్మ, భక్తి, జ్ఞాన, యోగమార్గముల ద్వారా జీవిత పరమార్థమగు జన్మరాహిత్యమును పొందుటకు బోధించబడిన వివిధ అంశములను ఒక క్రమ పద్ధతిలో సేకరించి వ్రాయటం జరిగింది. సమస్త జీవరాశులలో మానవ జన్మ యొక్క ప్రత్యేకత, మానవ జీవిత పరమార్థము ఏమిటి? ఆ జీవితపరమార్థమును సాధించుటకై మానవులు చేయవలసిన సాధన ఏమిటి? కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గములు ఒకదానితో ఒకటి ఏవిధంగా పరస్పర సంబంధాన్ని కలిగి ఉన్నాయి? మొదలైన విషయములను గురించి ప్రస్తావించటం జరిగింది. ముఖ్యంగా ఈ నాటి ప్రజలు ప్రతిరోజూ (ప్రతి క్షణం) ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఉత్తమమైన పరిష్కారం ఆధ్యాత్మికచింతన ద్వారా మాత్రమే లభిస్తుందన్న విషయంతో పాటు ఈ పుస్తకంలో చెప్పదలిచిన విషయములలో ప్రధానమైనవి (1) వేదాంత శాస్త్ర విచారణకు వయసుతో నిమిత్తం లేదు

(2) వేదాంతశాస్త్ర విచారణ సన్న్యసించటం కోసం కాదు (3) వేదాంత శాస్త్రము జాతి మత కుల లింగభేదములతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు తెలుసుకొని ఆచరించదగినది (4) వయసుమీరి శరీర పటుత్వం తగ్గిపోయిన తరువాత వేదాంతశాస్త్ర విచారణ చేసే అవకాశము తక్కువ, కష్టమైన విషయం కూడా. అంతేకాక ఆ వయసులో వేదాంత విచారము చేత తాను తెలుసుకోగలిగినది, ఇతరులకు చెప్పగలిగినదీ ఏమి ఉండదు. కాబట్టి ఏ క్షణాన మృత్యువు ముంచుకొస్తుందో తెలియని ఈ జీవితస్వల్ప కాలం పరిసమాప్తి కాకముందే వేదాంత విచారణ చెయ్యాలి. (5) నిష్కామకర్మాచరణ ద్వారా చిత్తశుద్ధి కలిగి, నిర్మలమైన మనసునందు భక్తి భావము పెంపొంది, అనన్య భక్తి ద్వారా ఆత్మజ్ఞానము, అంతటా నిండియున్న పరమాత్మస్వరూపమే తానని తెలుసుకొన్న జీవికి చిత్తశాంతి కలిగి చిత్తవృత్తుల లయముచే యోగసిద్ధికలుగునని ఈ పుస్తకమునందు చెప్పబడింది.

ఈ గ్రంథ రచనలో తమ పూర్తి సహాయ సహకారములను అందించి, చక్కగా పరిష్కరించి నన్ను ప్రోత్సహించిన శ్రీ ఈశ్వరప్రగడ వేంకట శేషావతారముగారి పరిచయభాగ్యం కూడ మా మామగారి ద్వారానే కలిగింది.

ఆధ్యాత్మిక ప్రేరణ నాలో కలిగించి, తన సంకల్పబలంతో ఈ గ్రంథ రచన చేయించిన సద్గురువు మా అమ్మగారు శ్రీమతి రుక్మిణి. "మాతృదేవోభవ" అన్నది శ్రుతి. ఆ దైవమే నా ఆధ్యాత్మిక గురువు కావటం, నన్ను భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయిబాబా సన్నిధికి చేర్చటం నా పూర్వ జన్మ సుకృతం అని భావిస్తాను.

పుత్రికా వాత్సల్యంతో నన్ను ఆదరించి, గ్రంథం ఈ విధంగా రూపు దిద్దుకోవటానికి తమ సంపూర్ణ సహాయసహకారములు అందజేసి పరిచయ వాక్యములు వ్రాసి ఆశీర్వదించిన మల్లాప్రగడ శ్రీరంగారావుగారికి, శ్రీ ఈశ్వరప్రగడ వేంకటశేషావతారం గారికి, వారిరువురి పరిచయభాగ్యం కలిగించి అనుక్షణం నన్ను అనేక విధములుగా ప్రోత్సహించిన మా మామగారు శ్రీ కొండూరు రామారావుగారికి సవినయంగా కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

గ్రంథ రచన సమయంలో నాకు పరోక్షంగా అపూర్వమైన సహకారాన్ని అందించిన మా అత్తగారు శ్రీమతి కొండూరు రఘునాథాంబగారికి కృతజ్ఞతాంజలి ఘటిస్తూ అటువంటి అత్తగారిని ప్రసాదించిన ఆ భగవంతునికి నమస్కరిస్తున్నాను.

ఈ పుస్తకం ముద్రించబడి విడుదల కావటానికి ఆర్థిక సహకారం అందించిన తిరుమల తిరుపతి దేవస్థానంవారికి నాహృదయపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

పుస్తక ఆవిష్కరణకు అవసరమైన ఆర్థిక సహాయమును అందించు బాధ్యత తాము కూడా స్వీకరించి, నన్ను ఆప్యాయంగా ప్రోత్సహించిన ఆప్తులు, మండలీక ఆశ్రమం (తెనాలి) నిర్వాహకులు శ్రీ చావలి శ్రీరామ్‌గారి అభిమానం మరపురానిది. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

తీరికలేని కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్నప్పటికీ తమ అమూల్యమైన సమయమును కేటాయించి, ఈ పుస్తకమును ఆమూలాగ్రము చదివి "తొలిపలుకులు" వ్రాసి తమ ఆశీస్సులను అందించి ప్రోత్సహించిన శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారికి (Information Adviser to P.M.) సవినయంగా కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

పుస్తకం విడుదల కావటంలో నాకు ఎనలేని ప్రోత్సాహాన్ని, తోడ్పాటును అందించిన మరొక ముఖ్యమైన వ్యక్తి శ్రీ యమ్.కె.ఆర్. వినాయక్, I.A.S. (M.D. A.PSFC) గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

భారత ఆహార సంస్థలో ఉద్యోగం చేస్తూ కూడా ఈ గ్రంథ రచన నిరాటంకంగా పూర్తి చేగలగటానికి సహాయసహకారములు అందించిన మా ఆఫీసు వారందరికీ కూడా కృతజ్ఞతను తెలియచేయటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.

గ్రంథ రచనకు అవసరమైన, అమూల్యమైన ఆధ్యాత్మిక గ్రంథములన్నీ అందించి సహాయపడిన శ్రీ మద్దిపట్ల కృష్ణారావు దంపతులకు, యథాశక్తి నాతో

సహకరించిన శ్రీవారు కొండూరు హనుమంతరావుగారికి, మా చిరంజీవులకు, అనేకవిధములుగా నన్ను ప్రోత్సహించి, సహకరించిన అన్నయ్య తనికెళ్ళ విజయరాఘవమూర్తికి, శ్రీ జి. వల్లీశ్వరన్‌గారికి, ఈ గ్రంథం గురించి తమ అమూల్యమైన అభిప్రాయములను తెలియజేసిన పూజ్యులు బ్రహ్మశ్రీ సూరి రామకోటి శాస్త్రి గారికి, వేదుల సూర్యనారాయణ శర్మగారికి, సన్నిధానం తారక బ్రహ్మశాస్త్రిగారికి, రాయుడు గారికి వినయపూర్వకంగా కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

పుస్తకం అందంగా అచ్చువేయించి యిచ్చిన "విప్ల కంప్యూటర్ సర్వీసెస్" అధినేతలు శ్రీ విజయసేనారెడ్డిగారికి, జె. మారుతి గారికి, కవరు పేజీ అందంగా తయారు చేసి యిచ్చిన శ్రీ గోపి గారికి నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

పుస్తకరచనలో, ఆవిష్కరణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఆప్తులందరికీ నా నమస్సుమాంజలి సమర్పించుకుంటూ, ఎంతో కొంతైనా ఈ గ్రంథం వలన పాఠకలోకం ప్రయోజనాన్ని పొందగలిగితే నా కృషి సఫలమైనదిగా భావిస్తాను. దోషములను సహృదయంతో మన్నించి ఆదరిస్తారనే విశ్వాసంతో

"ఎందరో మహానుభావులు" అందరికీ నా వందనములు సమర్పిస్తున్నాను.

ది. 2.3.95 — కొండూరి నాగమణి

హైదరాబాదు



జననం 1956, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన దుగ్గిరాల గ్రామంలో. తండ్రి కీ.శే. తనికెళ్ళ జోగారావు గారు, తల్లి శ్రీమతి రుక్మిణి.

శ్రీ కొండూరి రామారావు, శ్రీమతి రఘునాదాంబగార్ల తృతీయ కుమారుడు శ్రీ కొండూరు హనుమంతరావు గారితో వివాహం. ఇద్దరు కుమార్తెలు (ప్రశాంతి, శిరీష), కుమారుడు (ప్రేమసాయి రఘురాం).

1976లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా బి.యస్.సి. డిగ్రీ, 1984-85లో తెలుగు భాషలో ఎమ్.ఎ డిగ్రీ లభించాయి. భారత ఆహార సంస్థ (FCI) లో 1979 నుండీ టెక్నికల్ అసిస్టెంటుగా ఉద్యోగం. డాక్టరు ఆర్.టి. కాకడే గారు వ్రాసిన "షిరిడీ నుండి పుట్టపర్తి" పుస్తకంలో అనుబంధ ప్రకరణలు తెలుగులోను, ఆంగ్లంలోను వ్రాసే అవకాశంతో పాటు భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా గారి దివ్యానుగ్రహం వలన కీ.శే. శ్రీ యన్. కస్తూరి గారు ఆంగ్లంలో వ్రాసిన "సత్యం శివం సుందరం" నాల్గవ భాగమును, 'లవింగ్ గాడ్" (LOVING GOD) పుస్తకములను తెలుగులోకి అనువదించే అవకాశం లభించింది. భగవాన్ కృప వలన మరికొన్ని ఆంగ్ల పుస్తకములను తెలుగులోనికి అనువదించే ప్రయత్నం జరుగుచున్నది.

# ప్రథమ అధ్యాయము

**విషయము**

మానవజీవిత వైశిష్ట్యము - జీవితపరమార్థము

వేదాంత శాస్త్ర విచారణ ఆవశ్యకత

# జీవిత పరమార్థము - వేదాంతశాస్త్రము

"లబ్ధ్వా కథం చిన్నరజన్మ దుర్లభం
తత్రాపి పుంస్త్వం, శ్రుతిపారదర్శనమ్
యస్త్వాత్మ ముక్త్యై, న,యతేత, మూఢధీః
స ఆత్మ హో స్వం విని హంత్య సద్గహాత్"

వివేక చూడామణి 4 శ్లో

సృష్టిలోని సమస్త జీవరాసులలోను విశిష్టమైనది మానవజన్మ. మరే జీవికీలేని బుద్ధికుశలత మానవ జాతికి మాత్రమే ప్రసాదించబడినది. విచక్షణా జ్ఞానము, నిత్యానిత్యవస్తు వివేకము, వస్తు పరిశీలనా జ్ఞానము మానవులకు మాత్రమే కలవు. జంతువులు కర్మానుభవమును పొందగలవేకాని, మోక్షమును పొందు ప్రయత్నము చేయలేవు. సాధనచేసి జన్మరాహిత్యమును పొందగల అవకాశము మానవులకు మాత్రమే కలదు.

అటువంటి దుర్లభమైన మానవజన్మను పొందినవారు అపు రూపమైన ఈ సదవకాశమును దుర్వినియోగపరచుకొనకుండా మానవ జీవిత పరమార్థమగు మోక్షమును పొందు ప్రయత్నముచేయాలి. స్వస్వరూపజ్ఞానము మోక్షప్రాప్తిని కలిగించును. శాశ్వత ఆనంద స్థానమగు మోక్షమును పొందుటయే "జీవిత పరమార్థము".

మోక్షమనునది ఒకరిచే ఇవ్వబడు వస్తువుకాదు. చనిపోయాక ఏవోమరో లోకములలో పొందబడునదికాదు. మోక్షమనునది జీవించి యుండగనే సాధనచేసి పొందవలసిన (పొందగల) అపరోక్ష అనుభూతి.

భగవంతుని వ్యక్త స్వరూపమైన ఈప్రపంచమునందు అంతటనూ, సమస్త జీవరాశియందును, తనయందును సమానముగా వ్యాపించి ఉన్న ఆత్మ స్వరూపమును గుర్తించి, బ్రహ్మాత్మైక్య అపరోక్ష అనుభూతిని పొందుటే మోక్షము.

అయితే ఇట్టి పరమార్థమును పొందుటకు మానవులు చేయవలసిన సాధన ఏమిటి ? ఎట్లు చేయవలెను ? అను విషయములను గురించి వేదాంతశాస్త్రమునందు బోధించబడిన సాధనములను గురించి

తెలుసుకొనుటకై వేదాంతశాస్త్ర విచారణ తప్పనిసరిగా చేయవలసి ఉన్నది. జీవిత పరమార్థమును పొందుటకై వేదాంత శాస్త్రమునందు కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గములు ప్రతిపాదించబడినవి.

ప్రస్తుత కలియుగమున హింస, ద్వేషము, మతకల్లోలములు పెచ్చు పెరిగి, అధర్మము, అవినీతి తాండవించుచున్న ఈకాలమునందు కనీస మానవత్వము కూడా కరువై, స్వార్థమే తప్ప పరమార్థమును గురించి ఆలోచించు ప్రయత్నము కూడా చేయలేకపోతున్న ఈనాటి మానవులకు వేదాంతశాస్త్ర విచారణ ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. నిత్యజీవితమునందు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకొని తమసమస్యలకు సందేహములకు పరిష్కారమును వేదాంతశాస్త్రము ద్వారా పొందవచ్చుననే విషయాన్ని మరలగుర్తు చేయుటకు ముఖ్యముగా ఈపుస్తకమునందు ప్రయత్నము చేయబడినది.

కేవలము వయస్సు మళ్ళిన వారికి, ఉద్యోగ, వ్యాపారములనుండి విరమించి విశ్రాంతి తీసుకొనేవారికి, లేదా ఏదో కొంతసేపు పురాణ కాలక్షేపము కొరకో, పుస్తక పఠనము కొరకో మాత్రమే ఈవేదాంత శాస్త్ర విచారణకాదని, యుక్త వయసు నుండే వేదాంత విచారణ ప్రారంభించ వలసియున్నదని నొక్కి వక్కాణించబడుచున్నది.

అనన్య భక్తాగ్రేసరుడై వెలుగొందిన ప్రహ్లాదకుమారుని వయసు ఎంత? ధృవతారగా కీర్తి గడించిన ధృవుడు కఠిన తపస్సు నాచరించి నప్పుడు ఆబాలుని వయసెంత ? జగద్గురువై ప్రపంచమునకు ఆధ్యాత్మ ప్రబోధం చేసిన ఆదిశంకరుల వయసెంత ? ఈ ఉదాహరణలను బట్టి విచారించి చూస్తే వేదాంత శాస్త్ర విచారణకై వృద్ధాప్యము వచ్చేదాకా వేచి ఉండనవసరంలేదనీ, యుక్తవయసునుండీ వేదాంత శాస్త్ర విచారణ చేయవలసియున్నదని బోధపడుతున్నదికదా! వయసుడిగిపోయి, ఇంద్రియ పటుత్వము సడలిపోయి, శరీరము రోగగ్రస్తమై, బుద్ధిమాంద్యమును పొందుకాలంలో, మృత్యువుకు చేరువయ్యేదశలో ప్రారంభించే వేదాంత విచారణ ఆవ్యక్తికి ఎంతవరకు ఉపయోగపడుతుందో, సమాజానికి ఎంతవరకు ఉపయోగిస్తుందో ఒక్కసారి ఆలోచించి చూడండి ! అట్టిస్థితిలో తాను తెలుసుకొని ఆచరించగలిగేదేమున్నది ? ఇతరులకు చెప్పగలిగేది

ఏమున్నది ?

అంతేకాకుండా వేదాంత గ్రంథములు ఎవరైనా చదువుతూ ఉన్నా, వేదాంతోపన్యాసముల పట్ల విషయముల పట్ల ఆసక్తి కనపరిచినా వెంటనే "ఇంతచిన్నవయసునుండీ వేదాంతం ఏమిటి ? ఇప్పటినుండీ విరక్తి పెంచుకుంటే జీవితం ఎలా గడుస్తుంది ?" అంటూ చుట్టు ప్రక్కలవారు నిరుత్సాహపరుస్తూ ఉండటం చాలమందికి అనుభవమే ! వేదాంతం వలన శాశ్వతమైనదీ, సత్యమైనదీ ఏదో తెలుసుకొని అనిత్యమైన దానిని, అసత్యమైన దానిని విడిచిపెట్టి, అటువంటి అనిత్య విషయముల పట్ల మొహం తొలగిపోయి వివేకం, విచక్షణాజ్ఞానం కలుగుతుంది. మనకర్తవ్యం ఏమిటో చక్కగా బోధపడుతుంది. జీవితం పట్ల అవగాహన ఏర్పడుతుంది. అందుచేతనే మోహవశుడై, కర్తవ్య విమూఢుడై నిలిచిన అర్జునునకు శ్రీకృష్ణ భగవానుడు కురుక్షేత్ర మహాసంగ్రామ సమయమునందు యుద్ధరంగంలో గీతాబోధచేసి అతడు తన స్వధర్మమును చక్కగా నిర్వర్తించేలా ప్రబోధించటం జరిగింది. కావున వేదాంత శాస్త్ర ఆవశ్యకత ఈనాటి ప్రజలు ముఖ్యంగా గుర్తించవలసిఉన్నది. వేదాంత బోధనిష్కామమైన కర్తవ్య పాలనకు, ఉత్తమలక్ష్య సాధనకు తోడ్పడుతుందేకాని, చేయవలసిన కర్తవ్యమును విస్మరించి సోమరులుగా, సంఘమునకు ఉపయోగపడనివారుగా చేయదు. ఈసూక్ష్మమును చక్కగా ప్రతిఒక్కరూ గుర్తించాలి.

ఈ వేదాంతశాస్త్రము అనగా ఏమిటి ?

వేదాంత శాస్త్రము అనగా ప్రతిజీవి యొక్క ఆత్మకథ అని చెప్పవచ్చును. ఆత్మకథ కాబట్టి అందరికీ ప్రియతమమైనది. జాతిమత కుల లింగ భేదములెన్నకుండా ప్రతిఒక్కరూ చదివి ఆనందించదగినది. మానవజీవిత వైశిష్ట్యమును గురించి, మానవుడిగా జన్మించినందులకు ఈజీవితపరమార్థమును తెలుసుకొని, లక్ష్యమును సాధించుటకు వేదాంత శాస్త్రమునందు బోధింపబడిన మార్గములను గురించి, తెలుసుకొని ఎల్లరూ తమ జీవితము సార్థకము చేసుకొనుటకు ప్రయత్నించవలెను.

ఈప్రపంచమునందలి సమస్త విషయభోగముల వలన కలిగెడి ఆనందము పరిమితమైనది, పరతంత్రమైనది, అశాశ్వతమైనది. రెండు

దుఃఖముల మధ్య పొందెడి తాత్కాలిక ఆనందమని చెప్పబడినది. కాని, వేదాంత శాస్త్రవిజ్ఞానము వలన కలిగెడి ఆనందమో ..... శాశ్వతము, అపరిమితము, స్వతంత్రము. దుఃఖసంపర్కమేలేనిది. హేతువాదమునకు నిలువజాలినది, మూఢవిశ్వాసమని తిరస్కరింపరానిది. అంతేకాక నేడు ప్రపంచమానవాళి ఎదుర్కొనుచున్న అనేక సమస్యలను సులభముగ పరిష్కరించగలుగునది ఈజ్ఞానమే.

వేదాంత శాస్త్ర విచారము కేవలము ఏదో వృద్ధాప్యమునందు చేయవలసినదని, బాధ్యతలన్నీతీరిన తరువాత కాలక్షేపము కొరకు తప్ప నిత్యజీవితములో చిన్న వయసునుండీ వేదాంత విచారము చేసినచో విరక్తులై, సన్న్యాసులై, సంసార జీవితమును గడపలేరని ఒక దురభిప్రాయము నేటికాలములో ప్రబలి ఉన్నది. కాని, అట్టి అభిప్రాయము ఎంతమాత్రము సమంజసము కాదు. జీవితమును సఫలవంతము గాను సౌఖ్యవంతముగాను, పరుల సేవ కొరకై పాటుపడునట్లుగాను చేసి, స్వార్ధచింతన క్రమముగా తగ్గింపచేసి పరమపదమును పొందునట్లుగా సరియైన మార్గమును బోధించగలిగినది వేదాంతశాస్త్రమే.

దుర్లభమైన వేదాంత సిద్ధాంతములు త్రికాలసత్యములు. తర తరములవారికి, సమస్త ప్రపంచ మానవజాతికి ఉపయోగపడి కర్తవ్యపరాయణతను బోధించునట్టివి. జాతిమత విద్వేషములతో అట్టుడికిపోతూ, హింసాద్వేషములతో అల్లకల్లోలముగానున్న నేటి ప్రపంచమునందు ఐకమత్యమును, మానవత్వమును పెంపొందించి, శాంతి సౌఖ్యములను ప్రసాదించగలిగినది ఆధ్యాత్మికచింతన మాత్రమే. స్వార్ధము, వంచన, క్రూరత్వములను నశింపచేసి భూతదయ, అహింస సత్యమును పెంపొందింపచేయునవి వేదాంత శాస్త్రము మాత్రమే.

పఠన్తు శాస్త్రాణి యజన్తుదేవాన్
కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః
ఆత్మైక్య బోధేన వినావిముక్తిః
నసిద్ధ్యతి బ్రహ్మ శతాన్తరేఽ పి

వి. చూ. ౬.

"శాస్త్రములను పఠింతురుగాక ! ఇంద్రాదిదేవతలను యజ్ఞములచే

సేవింతురు గాక ! కర్మలను చేయుదురుగాక, దేవతలను ఉపాసింతురు గాక ! ఆత్మైక్యజ్ఞానము లేకుండా నూరు బ్రహ్మాంతరములలో కూడా ముక్తి సిద్ధింపదు !" అట్టి జ్ఞానమును పొందు మార్గమును వేదాంతశాస్త్రము సులభముగా, వివరముగా బోధించుచున్నది.

## మానవ జన్మయొక్క విశిష్టత

**దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహ హేతుకమ్**
**మనుష్య త్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయ :**
**వివేక చూడామణి 3శ్లో.**

మానవ జన్మ, మోక్షమును పొందవలెననెడి కోరిక తత్త్వదర్శులగు మహనీయుల ఆశ్రయము అను ఈమూడును అత్యంత దుర్లభమైనవి. బహుప్రయాసచేతకాని లభింపనివి. కేవలము ఈశ్వరానుగ్రహము కలవారికే లభించునవి.

**లబ్ధ్వా కథంచిత్ నరజన్మదుర్లభం**
**తత్రాపి పుంస్త్వం శ్రుతి పారదర్శనమ్**
**యః స్వాత్మముక్త్యైనయతేతమూఢధీః**
**సఆత్మహాస్వం వినిహన్త్య సద్గ్రహాత్.**
**వి.చూ. 4.శ్లో.**

"దుర్లభమైన మనుష్య జన్మను ఎటులనో పొంది, అందును పురుషత్వమును, శాస్త్రాంత జ్ఞానమును పొంది కూడా ఏమూఢబుద్ధి కలవాడు తనయొక్క మోక్షము కొరకు ప్రయత్నించడో అతడు ఆత్మఘాతకుడు, చెడ్డపట్టుదలవలన తనను తానే చంపుకొనుచున్నాడు. (నశింపచేసికొనుచున్నాడు).

"నరుడుగా జన్మించగలగడమే దుర్లభం" అని ఇంతగానొక్కి చెప్పటంలోగల కారణం ఈసృష్టిలోకల జీవరాసులన్నింటిలో కూడా మానవజాతి అత్యంత ఉత్తమమైనది కావటమే. మరేజీవరాశికి లేనటువంటి ప్రత్యేకత మానవునిలో ఉంది. అది మానవుని బుద్ధి విశేషమే. సూక్ష్మ జీవుల మొదలుకొని అన్ని జీవులలోను ప్రాణమయకోశం

వృక్షాదులలో వికసిస్తుంది. కాని మనోమయకోశం అత్యంత ప్రారంభదశలో మాత్రమే ఉంటుంది. పశువులలోను, డాల్ఫిన్లు మొదలగు చేపలలోను, కొన్ని పక్షులలోను ఈమనోమయకోశం మరికొంతవికసిస్తుంది.

మానవునిలో ఈమనోమయకోశం బాగుగా వికసించిఉంటుంది. మానవులలో కూడా విజ్ఞానసముపార్జనచేసి, భక్తిజ్ఞాన వైరాగ్యములను పొందినవారిలో ఈమనోమయకోశము పరిపూర్ణముగా వికసిస్తుంది. మనోమయకోశము యొక్క సూక్ష్మభాగములనే విజ్ఞానమయ, ఆనందమయ కోశములని అంటారు. యుక్తాయుక్తవిచక్షణాశక్తి, నిత్యానిత్యవస్తువివేచనాశక్తి, వస్తుపరిశీలనా జ్ఞానము, అన్నీ తెలుసుకొనగలశక్తీ కేవలము మానవునికి మాత్రమే కలవు. పశుపక్ష్యాదులు కేవలము కర్మానుభవమును పొందగలవేకాని మోక్షమును పొందు ప్రయత్నమును చేయలేవు. మానవేతర జన్మలు పుణ్యాపాప కర్మఫలమును అనుభవించుటకు మాత్రమే వచ్చుచున్నవి. ఇంద్రాదిదేవతలు స్వర్గభోగములను అనుభవించుటచే వారి పుణ్యక్షయమగును. కాని తత్కాలములో చేయబడిన ఏకర్మమువలన వారికి పుణ్యము పెరగదు. మానవునిగా మరల జన్మించి కర్మచేసినప్పుడు మాత్రమే కర్మఫలము కలుగును. అట్లే పెద్దపులికికాని, పిశాచము మొదలగు వానికిగాని అవిచేయు దుష్కర్మములవలన వాటి పాపము పెరగదు. వాటి స్వభావముననుసరించి ఆజన్మ అయిన తరువాత మరొక జన్మను పొందును. పుణ్యాపాపఫలములు, అధోగతి, ఊర్ధ్వగతి మానవులకే సాధ్యములు. తననుతాను తెలుసుకొని స్వస్వరూపజ్ఞానముతో మరి జన్మలేకుండా చేసుకొనగల శక్తి కేవలము మానవునికే కలదు.

ప్రపంచములోని అన్ని దుఃఖాలకూ మూలకారణమైనట్టి జన్మనే లేకుండా చేసుకొనగలశక్తి మానవునికి మాత్రమే కలదు.

**జంతునాం నరజన్మదుర్లభమతః పుంస్త్వం, తతో, విప్రతా**
**తస్మాద్వైదిక ధర్మమార్గపరతా, విద్వత్త్వ మస్మాత్పరమ్ !**
**ఆత్మానాత్మవివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థితి**
**ర్ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యైర్వినాభ్యతే ॥**

**వివేకచూడామణి**

"ప్రాణులకు మనుష్య జన్మకష్టముచే లభ్యమైనది. దానికంటె

పురుషత్వము. దానికంటె బ్రాహ్మణత్వము, దానికంటె వైదిక ధర్మ మార్గమునందు ఆసక్తి, దానికంటె అధికముగా పాండిత్యము, ఇది ఆత్మ, ఇది ఆత్మకంటె భిన్నమైనది అను వివేకము, బాగుగా అనుభవము, బ్రహ్మరూపముతో ఉనికియనురూపముగల ముక్తియు, శతకోటి జన్మలందుచేయబడిన పుణ్యములు లేకుండా పొందబడదు."

జన్మించు స్వభావముగల ప్రాణులకు మనుష్య జన్మలభించుట అత్యంత దుర్లభమైనది. అటువంటి మానవజన్మయందు ఉపనిషత్తులందు చెప్పబడిన మహావాక్యములను విచారించుటచే కలుగు "ఆత్మజ్ఞానము' 'ను పొందు అధికారముగల పురుషజన్మ మిక్కిలి పుణ్యముచేత పొంద బడుచున్నది. అట్టిపురుషత్వము కంటెను నిరంతరము తదేకపరత్వముతో బ్రహ్మవిచారణ జరుపుకొనుటకు వీలుపడగల సన్న్యాసమును స్వీకరించుటకు అర్హత కలదియు, తాను తరించి పరులనుకూడా తరింపచేయు అవకాశము కలదియు అగు విప్రత్వము అనంతపుణ్యసాధ్యము.

విప్రత్వము లభించినంతమాత్రముననే కృతకృత్యులైనట్లు భ్రమ పడరాదు. ఆబ్రాహ్మణ్యము కంటెను వేదోక్తధర్మమునందు ఆసక్తి, అట్టి వేదోక్తధర్మమును ఆచరించుటయందు శ్రద్ధ మిక్కిలి దుర్లభము. ఎందువలననగా సకలజీవులు కోరుకొనెడి సుఖమును పొందుటకుగాని, దుఃఖమును పోగొట్టుకొనుటకుగాని ఇట్టిధర్మాచరణము అత్యంత ఆవశ్యకము. అట్టివైదిక ధర్మపరత్వము కంటెను వేదశాస్త్రాది పాండిత్యము మరింత దుర్లభము.

**"జ్ఞాత్వాకర్మాణి కుర్వీత",**

"తదేవ వీర్యవత్తరం భవతి యదేవవిద్యయాకరోతి"- ఇత్యాది వాక్యములను బట్టిమంత్రమంత్రార్థములయొక్కయు, విధినిషేధాదుల యొక్కయు విజ్ఞానము ఆవశ్యకమని విశదమగుచున్నది. తత్త్వజ్ఞానము నకును, అంతేకాక ఆత్మజ్ఞాన సాధనమగు ఉపనిషద్వాక్యార్థ విచారణకు పాండిత్యము అత్యంత ఆవశ్యకము కావున అది అత్యంత దుర్లభముగా చెప్పబడినది.

అట్టి పాండిత్యము కంటెను ఆత్మానాత్మవివేచనము మిక్కిలి

దుర్లభము. ఎందువలననగా వేదశాస్త్రమును అధ్యయనము చేయుటవలన తాను పొందిన పరోక్షజ్ఞానరూపమగు పాండిత్యము పరులకు బోధించుటకు మాత్రమే ఉపయోగపడును. కాని, తాను తరించవలెనన్నచో తదేకనిష్ఠతో ఉక్తియుక్తులద్వారా ఆత్మస్వరూపమును, అనాత్మస్వరూపమును వేరుపరచి తెలుసుకొనవలెను. అప్పుడే ఆపాండిత్యము సార్థకమగును.

అట్టి పాండిత్యము కంటెను స్వానుభవము అనగా "అపరోక్ష జ్ఞానము" అనబడు బ్రహ్మాత్మైక్య సమ్యక్పరిజ్ఞానము మిక్కిలి దుర్లభము. ఇట్టి అపరోక్షానుభూతివలన కాని ఆత్మయందు అనాత్మధర్మములను, అనాత్మవస్తువులందు ఆత్మధర్మమును ఆరోపించుట యనెడి విపరీతభావన నశించదు. ఈస్వానుభవమే లేకున్నచో అనాత్మవాసనాబలముచే సర్వానర్థములకు కారణభూతమగు "మిధ్యా జ్ఞానము" మొలకెత్తుచునే యుండును. కావున నిరంతరము నిధిధ్యాసనము చేయుచు "బ్రహ్మసత్యం జగన్మిధ్యా జీవోబ్రహ్మైవనాపరః."

**"ఏకమే వాద్వితీయంబ్రహ్మ"; "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ";**

'తత్త్వమసి', 'నేహనానాస్తికించన" - ఇత్యాది వాక్యార్థములను విచారించుటవలన కలుగు సత్యజ్ఞానమును బలపరచుకొనవలెను. అట్టి పూర్ణాత్మానుభవము దృఢపడిన కొలది మిధ్యా జ్ఞానము నిశ్శేషముగా నశించును.

ఆస్వానుభవముకంటెను బ్రహ్మాత్మనాసంస్థితిరూపమగు జీవన్ముక్తి, అత్యంతదుర్లభము. నేను అసంగుడను, అద్వితీయుడను, సచ్చిదానంద స్వరూపుడను అను స్వానుభవము వలన జీవన్ముక్తునకు వేరు కర్తవ్యములుండవు. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను త్రిపుటి భేదములు ఉండవు. కావున స్వస్వరూపముగా గుర్తింపబడిన నిర్వికల్పబ్రహ్మముగా నిరంతరము అప్రమత్తుడై యండుటను "బ్రహ్మాత్మనా సంస్థితి" అందురు. ఇట్టి జీవన్ముక్తదశకు చేరుకొనుటయే జీవితపరమావధి. ఇట్టి దశ కోట్లకొలది జన్మలలో చేసిన అనంతపుణ్యఫలమువలనకాని లభింపదని జగద్గురువుల బోధ.

విశిష్టమైన, దుర్లభమైన మానవజన్మయొక్క జీవిత పరమార్థము

'బ్రహ్మాత్మనాసంస్థితి' రూపమగు జీవన్ముక్తిని పొందుట అని వేదాంతశాస్త్రము స్పష్టముగా బోధించుచున్నది.

సంసారచక్రమున పరిభ్రమించునట్టి జీవులు ఉత్తమ, మధ్యమ, అధమ శరీరమలను పొందుటకు ఆయా జీవులు చేసుకున్న పుణ్యాపాపమిశ్రమకర్మల యొక్క ఫలమే కారణము. ఇది పుణ్యము, ఇదిపాపమని, ఇది మంచి చెడులకు సంబంధించిన మిశ్రమకర్మ అని మూడువిధములైన కర్మస్వరూపములను తెలుసుకొనుటకు సాధనమైనదిబుద్ధి. సదసద్వివేచనముకల అట్టి బుద్ధి మానవులకు మాత్రమే కలదు. పశుపక్ష్యాదులకు ఇట్టిశక్తి లేదు. ఆబుద్ధి శక్తిచేత మానవుడు మంచిచెడులను తెలుసుకొనగలడు. మంచిని ఆచరించగలడు. చెడును విసర్జించగలడు. తత్ఫలితమును అనుభవించగలడు. ఇటువంటి సదవకాశము మానవజన్మయందు మాత్రమే కలుగుచున్నది. అందుచేత ప్రాణికోటికి మానవజన్మదుర్లభమని తెలుసుకొనవలెను.

**"సృష్ట్వాపురాణి వివిధాని, అజఃఆత్మశక్త్యా**
**తృప్తింజగామన, చ, మానవసృష్టిజాలమ్"**
**భాగవతము**

"బ్రహ్మ ఈప్రపంచములో అనేక ప్రాణులను సృష్టించి కూడా తృప్తిచెందలేదు. ఆత్మోద్ధరణకై ఆలోచింపగల మానవజాతిని సృష్టించి భగవానుడు తృప్తిచెందెను" అని భాగవతమున చెప్పబడినది. సర్వజీవ సముదాయము భగవంతుని యొక్క అంశమే. "మమైవాంశో జీవలోకః' ' జీవభూతః సనాతనః" అని భగవద్గీతా శాస్త్రమునందు చెప్ప బడినది. సమస్త జీవరాశి భగవంతుని అంశమే అయినను మానవుడు మాత్రమే భగవంతుని గుర్తింపగల సమర్థుడు. కనుక, కుమారుని చూచి తండ్రి సంతుష్టిచెందినట్లు తనను తెలిసికొను శక్తిగల మానవజాతిని సృష్టించి భగవానుడు తృప్తిచెందెను. పశపక్ష్యాదులకు, క్రిమికీటకాదులకు, చెట్టు చేమలకు, రాయిరప్పలకు లేని పరిశీలనాశక్తి మానవునిలో ఉండుటచేత ఈసృష్టిలో మానవుడు శ్రేష్ఠుడైనాడు. నరుడు నారాయణుడే. జీవుడు శివుడే. ఈతత్త్వ రహస్యమును పరిశీలనద్వారా గుర్తించగల అవకాశము, అర్హత మానవునకు మాత్రమే లభించును.

బ్రహ్మసంతతివాడైన మనువునుండి మానవజాతి జన్మించినట్లు పురాణములు చెప్పుచున్నవి. "మన్" (To Think) అనుధాతువు వలన ఆలోచించు మనస్సుకలవాడే మానవుడు. భౌతికమునుండి అభౌతికమునకు, అశాశ్వతముకాకుండా శాశ్వతమునకు, అసత్తువైపునకు కాకుండా సత్తువైపునకు, చీకటివైపుకు కాకుండా వెలుగునకు ప్రయాణించగలశక్తి, జన్మకర్మరూపమగు మృత్యువునుండి మోక్షరూపమగు, ఆనందమయమైన అమృతత్త్వమువైపునకు పురోగమించగలశక్తి మానవునకు మాత్రమే సాధ్యము.

**అసతోమా సద్గమయా**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**
**ఉపనిషత్**

తనలో నిగూఢముగా నిక్షిప్తమై ఉన్న పరమాత్మ స్వరూపమును గుర్తించగలశక్తి, నిత్యానిత్యవస్తువివేకమునకు సంబంధించిన బుద్ధి కేవలము మానవునికి మాత్రమేకలదు. అటివానినే వివేకి అనీ, బుద్ధిమంతుడనీ పెద్దలు అందురు.

పుణ్యపాపముల పరిశీలన, ధర్మాధర్మముల వివేచన, న్యాయాన్యాయముల విచారణ, దేహ ఆత్మల విశ్లేషణ, జీవబ్రహ్మ సమ్యక్ భావన - ఇట్టివన్నియు మానవులకు మాత్రమే సాధ్యము.

అట్టి మానవుని సృష్టించి భగవంతుడు తృప్తిచెందుట సహజమే కాని ఆశ్చర్యపడవలసినదికాదు.

**"ఆత్మావై పుత్రనామాసి"**

"- (నీ) ఆత్మ (నీ) పుత్రరూపములో ఉన్నది."

అని కన్నబిడ్డను చూచి తండ్రి సంతసించునట్లు తనశక్తిని గుర్తించగల మానవుని చూచి భగవంతుడు సంతసించును. మానవ జన్మయందు సార్థకత సంపాదించుకొనుటకు భగవదను గ్రహముకూడా అనుకూలింపవలెను. మానవజన్మలభించుట భగవంతునికృపయేనని భావించవలెను.

**జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువంజన్మమృతస్యచ ।**
**తస్మాదపరిహార్యే z ర్థేనత్వం శోచితుమర్హసి ॥**

**భగవద్గీత 2అ. 27 శ్లో**

పుట్టిన దెల్లను గిట్టకమానదు. గిట్టినది మరల పుట్టియేతీరును. ఇది అనివార్యమైన ప్రకృతినియమము. దీనిని అతిక్రమించుటకు ఎవ్వరికినీ సాధ్యముకాదు. అట్టిచో తప్పనిసరియగు మరణమును గురించి దుఃఖించుట ఎందులకు ?

**ఆహారనిద్రాభయమైధునాని, సామాన్యమేతత్పశుభిః**
**నరాణామ్ ।**
**తథాపి మనః ఏకం విశేషం నరస్యస్వాత్మోద్ధరణాయలోకే ॥**

**శ్రీశంకరభగవత్పాదులు**

ఆహారనిద్రాభయాదులు పశువులు, పక్షులకు వలె మానవునకుకూడా సహజమే. కాని ఆత్మోద్ధరణకై ఆలోచింపగల విశిష్టమైన మనస్సు కేవలము మానవునకు మాత్రమే కలదు.

ప్రపంచమునందు మాతృగర్భమునుండి భూమిపై అవతరించు ప్రాణులలో మానవునకు ఒక విశిష్టత కలదు. పుట్టినజీవుడు "క్వా ! క్వా!' ' అనుధ్వనిచే రోదనము చేయుచుండును. ఈరోదనము నందలి ఆంతర్యమును పరిశీలించినచో మానవజన్మయొక్క ఉత్కృష్టత మనకు స్ఫురించును.

జీవుని నోటినుండి వెలువడు 'క్వా' అను శబ్దమును పరిశీలించి శాస్త్రము "జన్మించుచున్న జీవుడు" నాగమ్యమెక్కడ ? నాలక్ష్యమెక్కడ ? నాజన్మకు సార్ధకత ఎక్కడ" అని ఆవేదనతో ప్రశ్నించుచున్నట్లు పేర్కొనుచున్నది. అందువలననే పుట్టుచునే తనపుట్టుకకు పరమార్థమునకై పరితపించు ప్రాణి మానవుడు మాత్రమే.

బంధములకు లోబడిన మానవుడు బంధవిముక్తిని సంపాదించుకొనుటయే ముఖ్యకర్తవ్యము. బంధవిముక్తిరూపమైన మోక్షప్రాప్తి కేవలము మానవులకు మాత్రమే సాధ్యము. దేవతలకు కాని, రాక్షసులకు కాని మోక్షము పొందుట సాధ్యముకాదు. మోక్షప్రాప్తికావలెనన్నచో దేవతలుకూడా

మానవులుగా జన్మించి ప్రయత్నించవలసినదే. అందుచేతనే సర్వవేదాంతశాస్త్రము" మానవజన్మ అనేక వేలజన్మముల పుణ్యముల పంట" అని చెప్పుచున్నది.

తన ప్రజ్ఞావిశేషముచేత మానవుడు మాధవుడు కాగలడు. అజ్ఞాన ప్రాబల్యముచేత మానవుడు దానవుడు కాగలడు. మాధవత్వమును గుర్తించి, మృత్యువును జయించి, పునర్జన్మలేకుండా శాశ్వతానందస్థానమును పొందుటకు మానవునిగా పుట్టిన వానికే అన్ని విధముల సాధ్యము. అందుచేతనే నరజన్మమును పొందుటదుర్లభమని శాస్త్రము ఘోషించుచున్నది. ఇట్టి దుర్లభమైనట్టి, ఉత్తమమైనటువంటి మానవజన్మను ప్రసాదించినందుకు మనము భగవంతునికి కృతజ్ఞులమై యుండవలయును. ఈకృతజ్ఞతాభావమే భక్తియోగమునకు పునాది.

వేదాంతశాస్త్రము జన్మకారణమును గురించి పలువిధములుగా పరిశీలించినది. విత్తనములేనిదే చెట్టులేనట్లు కర్మఫలమనే బీజములేనిచో జన్మవృక్షము కలుగదని శాస్త్ర సిద్ధాంతము. అనగా నేటి జన్మకు కారణము క్రిందటి జన్మలలోని కర్మఫలబీజములే. కర్మఫలము మిగిలియున్నప్పుడే జన్మకలుగును. కర్మఫలములేనిచో జన్మకు అవకాశమే లేదు. అందుచే మానవునిగా పుట్టినవానికి పూర్వజన్మకర్మపరిపాకవిశేషమే ప్రధానహేతువు. ఇది శాస్త్ర ప్రమాణముచే అంగీకరించవలసి యున్నది.

పూర్వజన్మలో కలిగిన సంకల్పములకు అనుగుణముగా జీవుడు ఆయాకర్మలను చేయుచుండును. సత్త్వరజస్తమో గుణములననుసరించి ఆకర్మలు సాత్త్వికములు, రాజసికములు, తామసికములని మూడువిధములు. సాత్త్వికకర్మలు ఆచరించువారు. ఉత్తమలోకములకు రాజసకర్మలు చేయువారు సుఖదుఃఖ మిశ్రితలోకములకు, తామసికకర్మలు చేసేవారు దుఃఖభూయిష్టమైన జన్మమును పొందెదరు. ఈకర్మలయొక్క ఫలతారతమ్యమును బట్టియే స్త్రీ, పురుష, నపుంసక జన్మలు, దేవమానవ పశుపక్షి క్రిమికీటకాది జన్మలు కలుగుచున్నవి.

"రమణీయ చరణాః రమణీయం యోనిమాపద్యేరన్
కపూయచరణాః కపూయం యోనిమాపద్యేరన్

శ్వానయోనింవాసూకరయోనింవా"

ఛాందోగ్యోపనిషత్తు

అనగా పవిత్రకర్మలు చేయువారు ఉత్తమ జన్మను పొందెదరు. నీచమైన, హీనమైన కర్మలు చేయువారు కుక్క, పంది మొదలగు నీచ జన్మములను పొందెదరు" అని అర్థము. అందువలన కర్మకూ జన్మకూ అవినాభావసంబంధము కలదు.

వర్తమాన జన్మకు పూర్వజన్మకారణమైనట్లు రాబోవు జన్మకు ఈజన్మములోని కర్మలే కారణములని మనము తప్పనిసరిగా గ్రహించవలసియున్నది. ఇట్టి హేతుసిద్ధాంతమునను సరించి పూర్వజన్మలో మనము చేసుకున్న సత్కర్మఫలముగా మానవులమై పుట్టినామని మనము విశ్వసించి తీరవలెను. అట్లు మానవజన్మకాక మరొక జన్మకలిగినచో జీవితపరమార్థమును సాధించుకొనగల అవకాశముకాని, అదృష్టముకాని లేకుండాపోవును.

మరణానంతరము జరుగు పరిణామములను గురించి దివ్యజ్ఞానసమాజమువారు (Theosophysists) మరియు అరవిందఘోష్, శ్రీరామకృష్ణపరమహంస శిష్యులైన స్వామిఅభేదానంద (Life beyond death గ్రంథకర్త) మొదలైనవారు అనేక వివరములను చెప్పియున్నారు. సంక్షిప్తముగా చెప్పవలెనన్నచో ఒకజీవి మరణించినపుడు అతని "పుర్యష్టకము" అనబడు సూక్ష్మశరీరము స్థూలశరీరమునుండి విడిపోయి పైకివెళ్ళును. పంచప్రాణములు, పంచజ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, మనస్సు, బుద్ధి అను పదిహేడు కలసి "సూక్ష్మ శరీరము" అనబడును. ("సూక్ష్మాంగంభోగసాధనమ్" ఆత్మబోధ - శ్రీశంకరులు)

కొంతకాలము తరువాత ఈసూక్ష్మశరీరము నుండి పంచ ప్రాణములతోకూడిన ప్రాణమయకోశము అనుపార విడిపోయి సమిష్టిప్రాణమయకోశములో కలసిపోవును. మిగిలిన కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు కూడ మరికొంతకాలమైన తరువాత జీవుని నుండి విడిపోవును. జీవునిచుట్టు ఉన్న మనసు, బుద్ధి అను మనోమయ,

విజ్ఞానమయ కోశములతోకలసి ఉత్కటమైన పుణ్యపాపములు అను భవించుటకు కర్మదేవతలచే అతడు పుణ్యలోకములకు కాని నరకమునకుగాని కొనిపోబడును. ఆపుణ్యపాపములు అనుభవించిన తరువాత మనోమయకోశము విడిపోయి అతని స్థూలమైన మనస్సు సమిష్ఠి మనోమయకోశములో కలసిపోవును.

అప్పుడు జీవునిచుట్టూ విజ్ఞానమయకోశము, దానిపై మనోమయకోశము యొక్క వాసనలు మాత్రమే ఉండును. దీనినే "(Psychic body)" "సైకిక్‌బాడీ" అని అందురు. తల్లిదండ్రులు స్థూల శరీరమను ప్రాణమయకోశమును ఉద్భవింపచేస్తారు. ఈశిశువుయొక్క శరీరము మొదట అణురూపముగా ఉండి తరువాత వృద్ధిపొందుతుంది. ఏదో ఒకదశలో ఈవిజ్ఞానమయకోశముతోను, పూర్వజన్మసంస్కారములతోను కూడిన జీవుడు అన్నమయ ప్రాణమయకోశములతోకూడిన శిశుశరీరమును ఆవేశించును.

ఇహజన్మలో కర్మఫలమును నిర్ణయించునవి మూడు కారణాంకములు. 1. పూర్వజన్మలోని వాసనలు లేక సంస్కారములు. ఇవి విజ్ఞానమయికోశము అనబడుబుద్ధిని అంటుకొని ఉంటాయి. 2. ఈజన్మలో తనచుట్టూ ఉన్న వాతావరణ ప్రభావము అని చెప్పబడు జీవుల సమష్టికర్మ 3. ఈ జన్మలో జీవుడు విచక్షణతో బుద్ధిపూర్వకముగా చేయుకర్మ ఈమూడింటివలన కర్మఫలము ఉదయించుచున్నది. అందరికీ ఈకర్మపరిణామము ఒకేవిధముగా ఉండదు.

**కర్మణోహ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చవికర్మణః**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనాకర్మణోగతి :**
**గీత 4-17 శ్లో**

ఎవరికి ఏజన్మకలుగునో, స్వర్గనరకాదులు ఎంతకాలము అను భవించవలెనో సాధారణనియముల ప్రకారము చెప్పుటకు ఎంతమాత్రము సాధ్యముకాదు.

మానవజన్మ పొందిన వాడు పరిణామ క్రమములో వెనుకకు వెళ్లి జంతువుగా కాని, కీటకముగాకాని, చెట్టుగాగాని జన్మించుట సాధారణముగా సంభవించదు. కాని, ఆతనికర్మవిశేషముచేత ఉత్తమమైనట్టి జన్మనుకాని,

నీచజన్మనుకొని పొందుచున్నాడు (రమణీయచరణాం ....యోనివా). "పునర్జన్మ కలుగుట వాడుచేసిన కర్మమును బట్టి, వాని విజ్ఞానమును బట్టి జరుగును" అని కఠోపనిషత్తుచెప్పుచున్నది. "యధాకర్మయధాశ్రుతమ్'

"కఠోపనిషత్తు"

మానవునికి విజ్ఞానమయకోశం వికాసం చెందటం వలన, పశుపక్ష్యాదులకు మనోమయకోశము కొద్దిగా వికసించి విజ్ఞానమయకోశము వికసించకపోవుటవలన, సాధారణముగా మానవజన్మతరువాత జంతు పక్షి మొదలగు జన్మలు కలుగవు. అయితే ఏదైనా ప్రత్యేక కారణం ఉన్నట్లయితే అట్టి జన్మవలన కలుగవలసిన లాభము ఉన్నప్పుడు కర్మదేవతలు కొద్దికాలము మానవుని జంతుజన్మలను అనుభవింపచేస్తారు. ఇదిచాలా అరుదుగా జరుగుతుంది. (ఉదా॥ రమణ మహర్షి ఆశ్రమంలోని కూరలమ్మి ఆవుగా మరల జన్మించి ఆశ్రమంలో ఉండటం, ఆఆశ్రమంలోనే ఉండే మాధవుడు తెల్ల నెమలిగా జన్మించినట్లు చెప్పుకొనటం. అలాగే సచ్చరిత్రలో షిరిడీసాయినాధునిచే చెప్పబడిన చెన్న బసప్ప (కప్ప) వీరభద్రప్ప (పాము) లు ఉదాహరణగా చెప్పవచ్చును.

విజ్ఞానమయకోశం సూక్ష్మతరమైనది కాబట్టి ఆప్రభావం మరొక జన్మపై ఉంటుంది.

మానవేతర జన్మలయందు కర్మ చేయుటకు కాని, చేయకుండుటకుగాని స్వతంత్రులము కాము. అందుచే పుణ్యాపాపముల హాని వృద్ధులు ఉండవు.

## జీవిత పరమార్థం

అమూల్యమైన మానవ జన్మను పొంది కూడా దానిని సద్వినియోగము చేసుకొనుటకు ప్రయత్నించనిచో అట్టి వారు జీవిత సాఫల్యమును పొందలేని మూఢమతులని చెప్పకతప్పదు. అట్టి మూర్ఖత్వమును పారద్రోలుటకు వేదశాస్త్రములు అవకాశము కలిగించుచున్నవి.

సృష్టిలోని సమస్తజీవరాసులలో మానవజీవి ఉత్కృష్టతను,

విశిష్టతను శాస్త్రములు వేనోళ్లకొనియాడుచున్నవి. స్వర్గనరకములు, సుఖదుఃఖములు, శాంతిసౌఖ్యములు మానవుడుతాను చేయు కర్మవిశేషముపై ఆధారపడియున్నవని గ్రహించి నిష్కామముగా సత్కర్మలను మాత్రమే ఆచరించుచు, జీవితపరమార్థమును సాధించుటకు ప్రయత్నించవలెను.

**యతఃప్రవృత్తి ర్భూతానాంయేనసర్వమిదంతతమ్**
**స్వకర్మణాతమభ్యర్చ సిద్ధింవిందతిమానవః**
**భగవద్గీత 18అ-46శ్లో.**

"ఈసమస్త భూతములకును కారణమైన వాడును, సర్వప్రపంచము నందును నిండియున్నవాడును అగు ఈశ్వరుని తన కర్మలచేత ఆరాధించుట వలన మానవుడు సిద్ధిని పొందుచున్నాడు.

మానవులు అన్నివేళలయందును ఏదోఒక పనినిచేస్తూనే ఉంటారు. తాముచేసే పనిచేతనే ఈశ్వరుని ఆరాధించుట సాధ్యమే అని భగవద్గీత చాటిచెప్పుచున్నది. ఈశ్వరారాధనారూపమగు కర్మ, జీవితములోని ఇతరకర్మలకన్న వేరుగా నుండనక్కరలేదు. "స్వకర్మణా" తను చేయు కర్మచేతనే "తమభ్యర్చ" ఈశ్వరుని బాగుగా అర్చించి మానవుడు సిద్ధిని పొందగలడు అని భగవద్గీత చెప్పుచున్నది. జడమును, నశించునట్టిదియును అగు శరీరము మాత్రము కాక అందుండు చైతన్యము యొక్క అంశము అగుటచేత మానవుడు కూడా ఈశ్వరస్వరూపుడే.

**"మమైవాంశో జీవభూతస్సనాతనః" - గీత**

"అనాదికాలమునుండి నాఅంశయే ఈజీవలోకమునందు జీవుడైనాడు" అను గీతావాక్యానుసారముగా మానవుని పుట్టుక పరమాత్మ నుండియనియు, శారీరకముగా చూచినచో మానవుడు అల్పుడుగా ఉన్నప్పటికినీ నిజమునకు ఈశ్వరాంశయేననియు తెలియుచున్నది. ఇట్లు భగవంతుని అంశగా అవతరించిన మానవుడు "తాను చేరుకోవలసిన గమ్యమేది ? ఆగమ్యమును ఎట్లుచేరుకొనవలెను?" అని బాగుగా విచారించవలయును.

పరిణామక్రమములో ఈజీవరాసులన్నింటియందును మానవజన్మము తుదిమెట్టు. ఇచటనుండి వెనుకకు పోవుట అనగా హీనజన్మమును పొందుట అభివృద్ధికానేరదు. మానవజన్మపొందిన తరువాత కోరదగినది మరేదియునులేక, దేనికిని ప్రయత్నము చేయనవసరములేక సంపూర్ణముగా సంతృప్తుడై ఉన్నచో ఇదియే జీవితపరమావధి అని భావించవచ్చును. కాని జన్మించిన ప్రతిప్రాణీకూడా ఏదో ఒక విధముగా బాధలకు గురియై వాటినుండి తప్పించుకొనుటకు గాని ఆరోగ్య, ఐశ్వర్యములను పొందుటకుగాని సర్వదా ప్రయత్నించుచుండుట మనము గమనించు విషయమేకదా ! మానవుడు కోరునది పూర్ణముగా లభించినప్పుడు కాని అతని ప్రయత్నము సఫలముకాదు సమాప్తికాదు. అందుచేత మానవుని యొక్క జీవిత లక్ష్యము, పరమార్థము ఏది ? అని ముందుగా విచారించవలసియున్నది.

ప్రతిప్రాణియు ఈశ్వరస్వరూపుడగుటచేతను, ఈశ్వరుడు నాశరహితుడగుటచేతను జీవులందరికిని తమ జన్మపక్కగు శాశ్వతత్వము నందు ఆసక్తి కలదు. అజ్ఞానము వలన మానవుడు నశించు నట్టిదైన ఈశరీరమే తానని భావించి తనను నాశవంతునిగా తలచుచు దుఃఖమును పొందుచున్నాడు. అట్టిమానవులు అజ్ఞానమును వీడి, నాశము లేని ఆత్మయే తామని తెలుసుకొనుటకు ప్రయత్నము చేసి శాశ్వతసుఖప్రాప్తికై కృషిచేయవలయును.

మానవులను పశుపక్ష్యాదులకంటె ఉన్నతస్థానమునందు ఉంచునది జ్ఞానము. కావున సత్యమును అన్వేషించుటయే విజ్ఞులకు జీవితములో ముఖ్యకర్తవ్యము. అట్టి సత్యవస్తువు లభించువరకు మానవుని అన్వేషణ సాగుచునే యుండును అట్టి సత్యపదార్థము లభించిన తరువాత యత్నములన్నియు ముగియును. అట్టిపరిపూర్ణమైనటువంటి జ్ఞానమును పొందుటకు ప్రయత్నించుట మానవుని ముఖ్యకర్తవ్యము.

జీవరాసులన్నియు తెలిసియో, తెలియకో సుఖముకొరకై ప్రయత్నించుచుండును. సుఖముకోరుకోని ప్రాణి ఏదియును లేదు. నిరతిశయమగు ఈసుఖప్రాప్తి మానవుని సహజస్వభావమైయున్నది. కాని అజ్ఞానమనెడు పొరకప్పియుండుటవలన మానవులు ఈభౌతిక సుఖములకై

ప్రాకులాడి దుఃఖమును పొందుచున్నారు. నిత్యసత్యము, శాశ్వత
అయిన స్వస్వరూపమును తెలిసికొన్నవారికి బ్రహ్మానంద
అనుభవమునకు వచ్చును. అట్టిస్వస్వరూపమును తెలుసుకొనుట
మానవ జీవిత లక్ష్యము, పరమార్థమై ఉన్నది. ప్రతిజీవుడు తన
తెలియకుండానే "కో హం?" అని ప్రతిజన్మలోనూ వేదనచెంది అన్వేష
చేయుచుండును. దీనినే "జీవుని వేదన" అంటారు. తెలిసి 'కో హం
అని అన్వేషణ చేయుటయే సాధన . పూర్ణమైనటువంటి జీవితమ
సంపూర్ణమైన జ్ఞానము, పరిపూర్ణమైన సుఖానుభవము ఇవియే మానవు
ముఖ్యలక్ష్యములు-గమ్యములు.

ఇట్టి ఆనందమే సచ్చిదానందము. ఇట్టి సచ్చిదానంద స్థితి
పొందిన పిదప ఇక పొందవలసినది ఏదియును లేదు. వారప్పుడ
నిష్కాములై ముక్తిని పొందెదరు. ఈస్థితినే ముక్తి, మోక్షము, నిర్వాణము
కైవల్యము, అపరోక్షానుభూతి, పరమేశ్వరప్రాప్తి, బ్రహ్మాత్మైక్య సంస్థి
యని పలు విధములుగా వ్యవహరింతురు. కావున ముక్తి మనస్సుయొక
ఏకాగ్రస్థితి. దీనికొరకై ఎక్కడికో పోనవసరములేదు. ఇది మరణానంతరమ
మరోలోకమున పొందబడునదికాదు. ఇక్కడనే, ఇచ్చటనే ఈజీవితమునం
పొందవచ్చును. అట్టిస్థితిని పొందుటయే మానవజీవిత పరమార్థము.

సచ్చిదానంద స్వరూపుడగు పరమాత్మనుండి, అగ్నినుం
నిప్పురవ్వలవలెనూ, సూర్యుని నుండి కిరణములవలెను
సముద్రమునుండి అలలవలెను వెలువడునటువంటి సృష్టిజాలమ
అజ్ఞానముచే తమను తాము మరచి తమ నిజస్వరూపమును, శక్తిని
గ్రహించలేక నానావిధములైన జన్మలను పొందుచు "పునరపిజననం
పునరపిమరణం పునరపిజననీ జఠరే శయనం" అన్నట్లుగా అనేక
జన్మములను పొందిన తరువాత కడపటి జన్మమునందు ముక్తిని
పొందెదరు. ప్రతిమానవుడు ఇదియే తమ కడపటి జన్మకావలయునని,
మరొక జన్మ కలగకుండా చేసుకొనుటకై ప్రయత్నించుటయే
జీవితపరమార్థము.

ఇటువంటి జన్మరాహిత్యమును పొందుట మానవజీవితలక్ష్యము,
జన్మహక్కు అయినప్పటికిని మానవుడు సంఘజీవి యగుటవలన

తానుండునటువంటి సంఘమునకు శక్తివంచనలేకుండా సేవచేయుట కూడా ఆతని ముఖ్య కర్తవ్యమే. ఈశ్వరుని వ్యక్తరూపమగు ఈజగత్తులోని ప్రతిప్రాణికూడా ఆపరమాత్మ యొక్క అంశయే అగుట వలన ఏప్రాణిని సేవించినప్పటికిన్నీ అది ఆ పరమాత్మకే చెందుతుంది.

**"ఆకాశాత్ పతితం తోయం యధాగచ్ఛతి సాగరం**
**సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి**
**సంధ్యావందనం**

మానవసేవయే మాధవసేవ. ఏజీవికి సేవ చేసినా, ఏజీవిని సుఖపెట్టినా అది ఆపరమాత్మునికే చెందుతుంది. కొందరు మహానుభావులు అన్నట్లుగా "సర్వదేవతిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అనగా సర్వజీవులను ప్రేమగా మాత్రమే చూడాలని, తిరస్కరించరాదని అవగతమవుతుంది. ఏజీవిని తిరస్కరించినా, బాధించినా ఆపరమాత్మను బాధించినట్లే అవుతుంది.

**"సత్యజ్ఞానానందరూపా సామరస్య పరాయణా"**
**లలితాసహస్రము.**

సత్య జ్ఞానానంద స్వరూపుడగు ఆపరమాత్మతో తాదాత్మ్యము నొంది ఆశక్తులన్నింటిని సమగ్రముగా అలవరచుకొని ఆయాశక్తులను స్వార్థమునందుకాక వ్యక్తస్వరూపమగు ప్రపంచ సేవ యందు విని యోగించుటయే జీవిత పరమార్ధము.

మానవుడు తన కర్తృత్వభావరూపమగు వ్యక్తిత్వమును మరచి పరమేశ్వర శక్తి ప్రవహించుటకు ఒక ఉత్తమమైనటువంటి సాధనముగా, పరికరముగా తనను తాను మలచుకొనుటయే జీవితపరమార్ధము. అరణ్యములో పుట్టిన వెదురు మాధవుని పెదవుల స్పర్శచే మురళీ రవళిగా ధ్వనించి సార్థకత నొందిన విధముగా సర్వకర్మఫలమును భగవంతునకు అర్పించి తాను నిమిత్తమాత్రుడై భగవంతుని శక్తిని ప్రసరింపచేయు సాధనముగా తనను తాను మలచుకొనవలెను. ఇట్టి నిష్కామ కర్మచేయువాడు కర్మయోగి అనబడును. ఈనిష్కామ కర్మయోగము వలన భక్తి జ్ఞానములు కలిగి ముక్తి కలుగును. ఇట్టి

ముక్తిని పొందుటయే జీవిత పరమార్థము.

ఆహారనిద్రా భయాదులను, కామక్రోధాది మనోవికారములను నియమబద్ధమొనర్చి నీతివర్తనము కలవాడే మానవనామమునకు అర్హుడు. ఆధ్యాత్మిక జ్ఞానమే నైతిక జీవితమునకు ప్రాణాధారము. ధర్మము అనబడు నీతియే మానవత్వమును సంపాదించును.

ధర్మమనునది మానవునకు కుటుంబము నందును, సంఘమునందును, దేశమందును, జాతి మతములందును ఇతరులతో కల సంబంధబాంధవ్యములను చక్కదిద్దును. "స్వంతలాభము కొంతమానుకు పొరుగువాడికి సాయపడవోయ్" అని శ్రీగురజాడ అప్పారావుగారు అన్నట్లుగా స్వార్థమును తగ్గించుకొనుచు, త్యాగభావమును పెంపొందించుకొనుచు మానవజాతి అభ్యున్నతికి కావలసిన సద్గుణములను అలవరచుకొనుటయే మానవుని కర్తవ్యము,

ఇట్లు మానవత్వ పరిధులు దాటి క్రమముగా దైవత్వమును పొందగలుగుటయే జీవిత పరమార్థము. అట్టి మానవుడు స్వార్థరహితుడై. పూర్ణత్యాగియై లోకమంతను తనకుటుంబముగనే భావించుకొనును (వసుధైవ కుటుంబకః) మానవజాతి మాత్రమే కాక చరాచరాత్మకమగు ఈసృష్టి అంతయు వానికి భగవంతుని స్వరూపముగనే భాసించి "సర్వంఖల్విదం బ్రహ్మ" మను బ్రహ్మానుభవము కలుగును.

**ఆత్మవత్ సర్వభూతాని పరద్రవ్యాణిలోష్ఠవత్**
**మాతృవత్ పరదారాంశ్చయః పశ్యతి సపశ్యతి"**

"సమస్త ప్రాణులను తనవలె చూచుకొనుట, ఆత్మభావన; పరుల సొమ్మును మట్టికంటెను హీనముగా భావించుట, పరస్త్రీలను తల్లివలె భావించుట, ఇట్టి ప్రవృత్తికల వాడే నిజమైన ధార్మిక దృష్టి కలవాడు.

అట్లు బ్రహ్మజ్ఞానము కలిగిన పిదప బ్రహ్మమే తానై "అహం బ్రహ్మాస్మి" యనెడి ఉత్కృష్టతిని పొంది సత్యాజ్ఞానానందాత్మకుడగును సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అన్నవిధముగా నిత్యసత్య జ్ఞాన స్వరూపుడగును "ప్రజ్ఞానంబ్రహ్మ" ప్రజ్ఞాన జ్యోతిని వెలిగించుకొని అంతర్ముఖుడై ఆత్మానందమును నిరంతరము పొందగలుగును.

ఇట్టి పరమోత్కృష్టమైన స్థితిని చేరుకొనుటయే మోక్షమును పొందుట, ముక్తిని పొందుట అని అందురు. ఇట్టి స్థితిని పొందిన వానికి మరు జన్మ ఉండదు. దుఃఖమునకు కారణమైన జన్మే లేకుంటే మరి దుఃఖముకూడా ఉండదు. కేవల సుఖానుభవము మాత్రమే శాశ్వతమగును.

**"భారతవర్ష జంతువుల భాగ్యములేమని చెప్పవచ్చు ! నీ**
**భారత వర్షమందు హరిపల్కుఉ బుట్టుచు జీవకోటికిం**
**ధీరతతోడ : దత్త్వము పదేశము సేయుచు జెల్మి సేయుచు**
**న్నారయ బాంధవాకృతి గృతార్థుల, జేయుచు నుండు నెంతయున్".**
**(శ్రీ మహాభాగవతము 5వ స్కంధము 19 అధ్యాయం 55వ పద్యము)**

ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క విశేషం ఉంటుంది. హిమాలయములు భారతదేశంలోనే ఎందుకున్నాయి ? ఇతర దేశాలలో అవి ఎందుకు లేవు ? అని అడిగితే ఆప్రశ్న అసంగతము అని చెప్పాలి. మంచు పర్వతాలు ఇతర దేశాలలో ఉన్నా "దేవతాత్మ" అనగా దేవత ఆత్మగాగల నగాధిరాజము ఈహిమాలయములు మాత్రమే (కాళిదాను కుమారసంభవము). అట్లే అనేక దేశాలలో మహానుభావులు, ప్రవక్తలు, ఋషులు జన్మించుమాటనిజమే అయినప్పటికీ సాక్షాత్తూ శ్రీహరి అవతారపురుషునిగా అనేక పర్యాయములు జన్మించి జీవకోటికి తత్త్వోపదేష్ట అయిన పుణ్యభూమి ఈభారతదేశము. ఆధునిక మహాపురుషులలో ముఖ్యులైన మెహర్‌బాబా భారతదేశములో "ఓం బిందువు" (OM POINT) ఉన్నదని, భగవదవతారములు ఇక్కడ జన్మించుటయు, ఇతరప్రదేశముల యందు అవతరించిన పూర్ణపురుషులందరూ భారతదేశమును తప్పకదర్శించుటయూ జరుగుతుందని చెప్పారు. మను స్మృతియందు "ఈదేశములో జన్మించిన ఉన్నత జన్మ సంజాతులైన వారి సన్నిధి వలన ఇతరదేశములలోని వారుకూడా సమగ్రమైన ధర్మమార్గమును, జీవనవిధానమును ఉపదేశింపబడెదరని చెప్పబడినది". ఇది భారతదేశముయొక్క ప్రత్యేకత.

**"ఏతద్దేశ ప్రసూతస్య సకాశాత్ అగ్ర జన్మనః**
**స్వంస్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాః సర్వమానవాః"**
**"మనుస్మృతి"**

భారతదేశంలో జన్మించిన వారు సత్యనిష్ఠవలన ప్రపంచానికే మార్గదర్శకులవుతారు. అని మనువు ఉవాచ.

పుడుతూనే 'క్వా! ... క్వా ! అంటూ నాగమ్యం ఎక్కడ ? నాలక్ష్యం ఎక్కడ ? నాజన్మ యెక్కడ ? అని రోదించే జీవి పెరుగుతున్న కొలదీ తన లక్ష్యాన్ని మరచిపోయి సంసారమనే సాగరంలో పడిపోయి కొట్టుమిట్టాడుతూ తపించటానికి కారణం ఏమిటి ? తన స్వస్వరూపమునుమరచిపోవటమే.

వేదాంత శాస్త్రము జీవిత పరమార్థమును సాధించుటకు అనేకవిధములైన సాధనములను, మార్గములను బోధిస్తున్నది.

"ఉత్తిష్ఠత ! జాగ్రత ! ప్రాప్య వరాన్ని బోధత"

కఠోపనిషత్తు

"లెండు ! మేల్కొనుడు ! శ్రేష్ఠమైన గురువులను పొంది జ్ఞాన బోధను పొందుదురుగాక !" అని హెచ్చరిస్తూ అజ్ఞానమనే అంధకారంలో గాఢనిద్రలో తమ్ముతాము మరచిన మానవాళిని తట్టిమేల్కొలుపుతున్నది. ఇంద్రియములన్నియు జవసత్త్వములను కోల్పోయి, ఏమీ చేయలేని స్థితి ప్రాప్తించే వరకు కాలాన్ని వ్యర్థంచేస్తూ గడపకుండా ముందుగా జాగ్రత్తపడవలెనని గురువులు బోధించుచున్నారు.

"యావత్స్వస్థమిదం శరీరమరుజం - యావచ్చదూరే జరా
యావచ్చేంద్రియ శక్తిః అప్రతిహతాయావత క్షయోనాయుషః
ఆత్మశ్రేయ సితావదేవ మహతాంకార్యః ప్రయత్నోమహాన్
సందీప్తే భవనేతు కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః"?

-శ్రీ శంకరాచార్యులు

ఎంతవరకు శరీరము స్వాస్థ్యము కలిగి ఉంటుందో, రోగము లేకుండా ఉంటుందో, ఎంతవరకు వృద్ధాప్యము దూరముగా ఉంటుందో, ఎంతవరకు ఇంద్రియశక్తి అడ్డగింపబడకుండా ఉండునో, ఆయుర్ధాయము ఎంతవరకు క్షీణించకుండా ఉంటుందో, అంతవరకే ఆత్మశ్రేయస్సునందు మహాత్ములచే గొప్ప ప్రయత్నము చేయబడవలెను.

అట్లుకాక వార్ధక్యము మీదపడి, ఇంద్రియముల పటుత్వము

సడలిపోయిన తరువాత ముసలితనంలో ఏదో కాలక్షేపంగా వినవలసిందీ, ఆచరించవలసినదీ అని అనుకోవటం చాలా పొరపాటు అటువంటి పెద్ద వయసులో మంచిమాటలు విందామంటే చెవులు పనిచేయవు. గుడికి వెళ్ళి వేదాంతశ్రవణం, పురాణకాలక్షేపం చేదామంటే నడిచివెళ్ళటానికి కాళ్ళుకూడా సహకరించవు. కంటిచూపు మందగించిపోతుంది. ఏమి చేయాలన్నా స్వతంత్రంగా చేయగల అవకాశంకూడా ఆవయసులో తక్కువగానే ఉంటుంది.

"వృద్ధస్థావత్ చింతాసక్తః" అన్నారు శంకరులు. వార్ధక్యములో మానసిక చింతలు పెరుగుతవే కాని తరగవు. మరి అటువంటి స్థితిలో ఏమంచి మాటలు విని ఎవరికి ఏమి మంచిని చేయగలరు ? సంఘానికి దేశానికి ఏమి మేలు చేయగలరు ? మాట తడబడిపోతున్న స్థితిలో ఎవరికి ఏమి బోధలు చేసి ఏమి మార్పును తేగలరు ? అప్పుడు మనలోవచ్చేమార్పు ఎవరికి ఉపకరిస్తుంది ? వేదాంతం అంటే కేవలం సన్యాసులకు, సాధువులకు మాత్రమే పనికి వస్తుందనీ లేదా అటువంటి విషయాలను వినటం మొదలుపెడితే సన్యాసులుగా మారిపోతారనే దురభిప్రాయం మనలో ఇంకాపోలేదు. ఇది ముఖ్యంగా మనకి మనం చేసుకుంటున్న గొప్ప అపకారం.

**ఇహచేద శక్యద్బోద్ధుం ప్రాక్శరీరస్యవిస్రసః**
**తతః సర్గేషులోకేషు శరీరత్వాయ కల్పతే - శ్రుతి.**

ఈశరీరము పడిపోకమునుపే ఆత్మ జ్ఞానమునొందుట మంచిది. లేకున్న జీవుడు సృష్టిలో నానా విధములైన జన్మములు పొందవలసి వచ్చును.

అంత్య సమయంలో కాకుండా యుక్తవయస్సునుండే ప్రతిఒక్కరూ వేదాంత శాస్త్రమును గురించి విని, తెలుసుకొని, అర్థంచేసుకుని ఆచరించవలసిన ఆవశ్యకత ఈరోజులలో ఎంతైనా ఉంది. మనము చేసే ప్రతి కర్మనూ వేదాంత శాస్త్రము శాస్త్రబద్ధంగా విశ్లేషించి కర్మ ఏవిధంగా చేయాలో బోధపరుస్తుంది. కర్మలను నిష్కామంతో ఆచరించి, భగవంతుని వైపు మళ్ళించి కర్మయోగం ద్వారా జీవిత పరమార్థమును ఏవిధంగా సాధించవచ్చునో తెలియచేస్తుంది. నిజమైన భక్తి అంటే

ఏమిటో తెలియపరుస్తుంది. యోగమంటే కేవలం ఉచ్ఛ్వాస, నిశ్వాస వ్యాయామంకాదు. "జీవుని పరబ్రహ్మతో కలుపు సాధనమార్గము", "యోగాః చిత్తవృత్తి నిరోధః" అని నేర్పుతుంది. జ్ఞానం అంటే "ఓజీవుడా ! నీవు ఎక్కడెక్కడో వెదికే భగవంతుడూ. నువ్వూ వేరు వేరు కాదు ! అది నీవే అయివున్నావు (తత్త్వమసి)" అని నచ్చచెపుతుంది.

నీలో దేదీప్యమానంగా వెలిగే ఆత్మజ్యోతి పై ఆవరించి యున్న అజ్ఞానపు పొరలు కరిగిపోయేలా చేసి జ్ఞానజ్యోతిని ప్రకాశింపచేస్తుంది.

కర్మ, భక్తి జ్ఞానము, యోగము – వీటికిగల పరస్పర సంబంధమును గురించి తెలియచేసి వీటిలో ఏమార్గం ద్వారానైనా ప్రయాణించి "ఆత్మసాక్షాత్కారము" అనే గమ్యాన్ని సులభముగా చేరుకోవచ్చునని తెలియజేస్తుంది. మార్గాన్ని గురించి క్షుణ్ణంగా తెలిసిన మార్గదర్శి తోడుగా ఉంటే గమ్యమును చేరుకోవటం మరింత సులభం కదా ! అందుచేతనే మనలో నిజమైన ఆర్తి కలిగినప్పుడు, దృఢమైన వైరాగ్యము కలిగినప్పుడు, ఆధ్యాత్మిక చింతన తీవ్రమైనప్పుడు, మనకర్మ పరిపక్వత చెందినప్పుడు, కరుణా మాతృహృదయంతో సదా శివుడే సద్గురువై ముక్తిమార్గాన్ని చేరుకునే ఉపాయాన్ని స్వయంగా ఉపదేశిస్తాడు. "ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైతవాసనా' అని అప్పయ దీక్షితులవారు చెప్పారు. యధార్థమునకు ఈశ్వరానుగ్రహం లేకుంటే అద్వైత భావనాసంబంధమైన వాసన కొంచెము కూడా కలుగదు. కావున ఈశ్వరానుగ్రహం వలననే మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుషులతోటి సాంగత్యం లభిస్తాయి. అందుచేత వేదాంత శాస్త్రము జీవిత పరమార్థమేమిటో తెలియచెప్పి ఆపరమార్థమును సాధించుటకు సాధనములను, మార్గములను బోధిస్తుంది.

నిరంతర ఆత్మ పరిశీలన వలన చిత్తమాలిన్యముతొలగిపోయి పరిశుద్ధమైన స్ఫటికం వలె ఆత్మజ్యోతిస్సు ప్రకాశిస్తుంది. స్వార్థభావం నశించి, త్యాగభావంతో నిష్కామ కర్మచేయవలెననీ, కర్మలను కాకుండా కర్మఫలమును మాత్రమే త్యాగం చేయాలనీ నొక్కినొక్కి వక్కాణిస్తుంది. ఈశ్వరప్రీతికై నిష్కామంగా, ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే కర్మ మనలో భక్తి భావాన్ని కలిగిస్తుంది. కర్మ భక్తికి, భక్తి జ్ఞానమునకు త్రోవతీసి

యోగసిద్ధి కలుగుతుంది. నిర్వికల్పసమాధి స్థితి కలిగి బ్రహ్మానందము అనుభవమునకు వచ్చి ఆత్మ సాక్షాత్కారము కలుగుతుంది.

అశాశ్వతమైనది ఈశరీరం. ఇది కాలక్రమాన వార్ధక్యంతో కృంగిపోతుంది. రోగముల పాలవుతుంది. ఆసమయంలో ఏప్రాణికైనా బుద్ధి జాడ్యం సంభవిస్తుంది. గొంతులో శ్లేష్మం చేరుతుంది. అంతవరకూ అండగా ఉన్న శక్తులు అంతరించి ఇంద్రియపటుత్వం సడలిపోతుంది. ఆపరిస్థితికి దూరంగా ఉండటం సామాన్యులెవ్వరికీ సాధ్యం కాదు. అందుచేతనే "ఓ కలియుగ మానవులారా ! త్వరపడండి : మీ జీవిత పరమార్థాన్ని సాధించటానికై ప్రయత్నం ప్రారంభించండి !"

వృద్ధాప్యంలో జీవికి సంభవించే దుస్థితి గురించి "శ్రీకాళహస్తీశ్వర శతకం"లో ధూర్జటి మహాకవి ఈవిధంగా అభివర్ణించారు.

"దంతంబుల్పడనప్పడే తనువునందారూఢి
యున్నప్పడే, కాంతా సంఘమురోయ నప్పడె జరా
క్రాంతంబుగా నప్పడే, వింతల్మేన జరించనప్పడే
కురుల్వెల్వెల్లగా నప్పడే, చింతింపన్వలెనీ
పదాంబుజములన్ శ్రీ కాళ హస్తీశ్వరా"

"ధూర్జటి"

శ్రీ కాళహస్తీశరశతకము. 116వ పద్యము.

ఇదే స్థితి దాశరథీ శతకమునందు ఈక్రింది విధముగా వర్ణించ బడినది

ముప్పనఁ గాల కింకరులు । ముంగిట వచ్చిన వేళ, రోగముల్
గొప్పరమైనచోఁ గఫము । కుత్తుక నిండిన వేళ, బాంధవుల్
గప్పినవేళ, మీస్మరణ । గల్గునో గల్గదో నాటి కిప్పడె
తప్పక చేతు మీభజన దాశరథీ ! కరుణా పయోనిధీ !

"దాశరథీ శతకము"

అందుచేత వృద్ధాప్యములో నిస్సహాయస్థితిలో సాధనచేసి పొందగలిగినది ఏదీ లేదు. కనుక "దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి" ప్రాణదీపం శరీరమునందు వెలుగుతుండగానే, మోక్షసాధనకై

ప్రసాదించబడిన ఈశరీరం శిథిలంకాకముందే జీవితపరమార్ధమును సాధించు ప్రయత్నము ప్రతిఒక్కరు తప్పక చేయాలి.

జన్మము, వార్ధక్యము, మృత్యువు మొదలగు వాటి రూపమగు ఈసంసారము అనేక కష్టములనే మొసళ్ళు, తిమింగలములు, కామక్రోధ లోభములనే భయంకర విషసర్పములతోకూడిన సాగరం వంటిది. అయినప్పటికీ చిత్తమనే సాగరమును, వివేకమును మంధరపర్వతంగా చేసుకుని బుద్ధి, నిత్యానిత్యవివేచనమనే త్రాడు సాయంగా, సద్గుణములతో ప్రయత్నించి చిలికితే సదాశివుని అనుగ్రహం వలన ఆధ్యాత్మిక సాధనలో ఎదురయ్యే భయంకర హాలాహలం వంటి విషమపరీక్షలను, కష్టములను అధిగమించి శాశ్వత అమృతత్వమును ప్రసాదించే ఆత్మసాక్షాత్కారమును పొందవచ్చును. అట్టి అమృతత్త్వమును సాధించుకోవటంలోనే మానవజీవితపరమార్ధం ఉంది.

**అత్రాzహారార్థం కర్మకుర్యాదనిన్ద్యం**
**కుర్యాదాహారం ప్రాణ సంధారణార్థమ్**
**ప్రాణాన్ సంధార్యేత్ స్తత్త్వ జిజ్ఞాసనార్థం**
**తత్త్వం జిజ్ఞాస్యం యేన భూ యోన జన్మః**
**శ్రీ యోగవాశిష్టము**

ఈలోకంలో పుట్టిన ప్రతిప్రాణీ ఆహారం కోసమై అధర్మంకానటువంటి కర్మను చేయాలి. అట్టి ఆహారం ప్రాణం నిలుపుకోవటానికి మాత్రమే స్వీకరించాలి. (Eat to live but don't live to eat) తత్త్వజ్ఞానం కోసం ఆప్రాణాన్ని నిలుపుకోవాలి. ఏతత్త్వమును తెలుసుకొనుటవలన దుఃఖకారణమగు మరొక జన్మ మరల కలుగదో అట్టి తత్త్వమును విచారించి తెలుసుకోవాలి. అట్టి తత్వమును తెలిసికొని జన్మలేకుండా ముక్తిని పొందుటకు ప్రయత్నించుటయే మానవజీవిత పరమార్ధము.

శాస్త్రం ఏమి చెప్తున్నదంటే వివేక జ్ఞానం లేనివారికి శాస్త్రము, వైరాగ్యంలేనివారికి జ్ఞానము, శాంతిలేని వానికి మనస్సు, తత్త్వజ్ఞానం లేని వారికి శరీరం కూడా భారమేనని హెచ్చరిస్తున్నది.

"ఆధ్యాత్మిక విద్య, వేదాంతవిద్య జనాన్ని సోమరులుగా చేస్తుంది,

సన్న్యాసులుగా " చేస్తుందని కొందరి, దురభిప్రాయం. అయితే ఆ అభిప్రాయం సరైనదికాదు. సోమరులను 'సోహం' పరులుగా తయారుచేసేదే ఆత్మవిద్య. ఆధ్యాత్మవిద్య. చేయవలసిన పనులను, నిర్వహించవలసిన కర్తవ్యమును వదిలిపెట్టి 'జరిగేది జరగకమానదు' అనే మెట్టవేదాంతం చెప్పే మిథ్యా సన్న్యాసులను తట్టి లేపేదే ఆధ్యాత్మ విద్య. "ఉత్తిష్ఠత ! జాగ్రత ! ప్రాప్యవరాన్ని బోధత" అనేటువంటి ధీరవాక్యాలతో తట్టిలేపి కార్యరంగంలోనికి దూకించి, కోరికలేకుండా కర్మఫలత్యాగభావంతో నిష్కామ కర్మ చేయించేదే వేదాంత భేరీ నినాదం.

సంసార కూపంలో తాపత్రయములతో క్రుంగి, కృశించి, నశించిపోయే జీవులకు వారి అసలు నిజస్వరూపమేమిటో, స్వస్వరూపమేమిటో తెలియచెప్పి, దుఃఖాన్ని పోగొట్టి, ధైర్యాన్ని కలిగించి మానవ జీవిత పరమార్థమగు జీవన్ముక్తిని సాధించటానికి ప్రోత్సహించేది నిశ్చయముగా వేదాంతశాస్త్రమే – వేదాంత శాస్త్రము మాత్రమే.

నిన్న తిన్న ఆహారంలోని దోషాలు నేడు సేవించిన ఔషధంతో తగ్గిపోయే విధంగా, గతజన్మలో చేసిన అశుభకర్మఫలములు నేటి జన్మయందలి శుభ పురుష ప్రయత్నంచేత నిస్సందేహంగా నశించిపోతాయని శ్రీవశిష్టులవారు యోగవాశిష్ఠములో బోధించారు.

**సంసార కుహరాదస్మాన్నిర్గన్తవ్యం స్వయంబలాత్**
**పౌరుషం యత్నమాశ్రిత్యహరిణేవారి పంజరాత్**
**ముముక్షుప్రకరణము (యో. వా)**

"ఉత్తమమైనటువంటి పురుష ప్రయత్నాన్ని ఆశ్రయించి ఈ సంసారమనే గోతిలో నుండి శత్రుపంజరం నుండి సింహంలాగా స్వయంగా బయటకు రావటానికి ప్రయత్నించాలి" అని వశిష్టుల వారి ప్రబోధం. తీవ్రమైన పురుష ప్రయత్నం వలననే కదా విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కాగలిగింది ! అంకురితమైన దీక్ష వలననే కదా సిద్ధార్థుడు బుద్ధుడుగా మారింది ! మొండిపట్టుదలతోనే కదా భగీరథుడు ఆకాశంనుండి గంగను భువికి తీసుకురాగలిగింది ! "Where there is a will there is a way" మనసుంటే మార్గం అదే కనిపిస్తుంది. సాధించాలన్న పట్టుదల ఉంటేనే భగవంతుని కృప కూడా తోడవుతుంది. ముసలితనం, మృత్యువు

ముంచుకు రాకముందే బుద్ధియనే నావతో ఈ సంసారమనే సాగరమును దాటడానికి ప్రయత్నం చేయాలి. ఆత్మజ్ఞానం కోసం పట్టుదలగా ప్రయత్నిస్తే తనకు తానే బంధువు. లేకుంటే తనకు తానే శత్రువు. వివేకంతో తనను తానురక్షించుకునే ప్రయత్నంచేయాలి. ఆపైన భగవంతునికి ఫలితాన్ని వదిలిపెట్టాలి.

**ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మానమవసాదయేత్**
**ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః -**
**గీత ఆరవ అధ్యాయము. 5వ శ్లోకము.**
**(ఆత్మ సంయమ యోగము)**

**ఇహైవ నరక వ్యాధేశ్చికిత్సాం నకరోతియః**
**గత్వానిరౌషధం స్థానం సరుజః కింకరిష్యతి"**
**యోవా (నిర్వాణ ప్రకరణము.)**

శాస్త్రము, సజ్జనులతోడి సాంగత్యము అనేటటువంటి గొప్ప ఔషధములున్నటువంటి మానవజన్మయందే ఈ "భవరోగాని"కి చికిత్స చేసుకొనలేకపోతే, ఔషధాలే లేని మరో లోకాలకు వెళ్ళి నీవ్యాధిని ఎలా నయంచేసుకోగలవు ? అని వశిష్టులవారి హెచ్చరిక !

ఈసంసారసాగరమును దాటడానికి పూజలు, పురస్కారాలు, తీర్థసేవనాలు శాస్త్రాలు అక్కరకు రావు. మహాత్ములతోడి సాంగత్యమే మనకు రక్షగా ఉండి తరింపచేస్తుంది.

జీవితంలో చాల మంది శారీరకమైన సుఖాన్నే కోరుకుంటారు. సుఖపడాలన్న కోరికచేత కాయకష్టం చేసి కావలసిన ధనాన్ని సంపాదిస్తారు. ఈవిధంగా కావలసిన ధనం సంపాదించిన తరువాత కాని అతనికి కావలసింది ధనం, అధికారం కాదనీ సుఖం, శాంతీ అని తెలిసిరాదు. అప్పుడు అతడు జీవితంలో అతిముఖ్యమైనది మనశ్శాంతి అని తెలుసుకుంటాడు. ఈమనశ్శాంతిని కూడా కొంతవరకు పొందాక అక్కడితో అతను ఆగక ఈసృష్టి ఎలా కలిగింది ? తాను ఎందుకు జన్మిస్తున్నాడు ? మరణించాక ఏమవుతాడు ? అనేటువంటి జిజ్ఞాస అతనిలో

కలుగుతుంది. ఈజిజ్ఞాసే, అంటే, తెలుసుకోవాలన్న ఆసక్తే ముముక్షత్వానికి దారి తీస్తుంది. ఇదే ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగిస్తుంది. మానవుని ఈదశలనే నాలుగు వర్ణాలకు సంబంధించిన స్వభావంగా విశ్లేషించ వచ్చును.

బాల్యం గడచినప్పటినుండీ కూడా తల్లి దండ్రులను గౌరవిస్తూ, సేవిస్తూ, గురువునే దైవంగా భావిస్తూ చక్కని అలవాట్లను పెంపొందించు కొని, మామూలు విద్యాభ్యాసానికి అంతరాయం కలుగకుండా మంచి మంచి పుస్తకములను చదువుతూ , ఉత్తములైన వారితో మాత్రమే స్నేహాన్ని పెంచుకుంటూ ఉంటే క్రమంగా బుద్ధి వికసించి ఈప్రపంచంలో నిత్యమైనది ఏదో, అనిత్యమైనది ఏదో బోధపడుతుంది. నిరంతరం ఆత్మ పరిశీలన చేసుకుంటూ, మనస్సును ఎప్పుడూ పరిశుద్ధంగా ఉంచుకోవటానికి ప్రయత్నంచేయాలి. సత్కర్మలు, సత్సాంగత్యం వలన కర్మ యోగంగా మారి భక్తి బీజాలు అంకురిస్తాయి. భక్తి భావన పరాకాష్ట స్థితి పొందినప్పుడు భగవంతునితో తాదాత్మ్య భావంకలిగి తానే భగవంతుడననే జ్ఞానం కలుగుతుంది. అట్టిజ్ఞానం కలిగినప్పుడు మనస్సు నశించి పోయి సంకల్ప, వికల్పాలు అనేవి లేకుండా చిత్తము ఏకాగ్రతను పొంది యోగం సిద్ధించి, మోక్షం కలుగుతుంది.

చిన్నతనం నుండీ ఏఏ విషయాలను గురించి ఏఏ ప్రయత్నాలను చేస్తూ ఉంటామో ఫలితము కూడా ఆవిధంగానే ఉంటుంది. పురుష ప్రయత్నం ఎంతో అవసరం. పురుష ప్రయత్నం వలన ఆత్మజ్ఞానము అనేటువంటి ఫలమును పొందుటయే ఈమానవ జన్మకు సార్థకత. లేకపోతే ఈజీవితం వృధా. అనుభవసిద్ధులైన బ్రహ్మవేత్తల బోధలనేటువంటి ఔషధమే ఈసంసారమనే విషవ్యాధికి విరుగుడు.

**శాస్త్రతో గురుతశ్చైవ స్వతశ్చేతి త్రిసిద్ధయః**
**సర్వత్ర పురుషార్థస్య నదైవ స్య కదా చన**
**యోగవాశిష్ఠము**

శాస్త్ర విచారణ, గురువు యొక్క ఉపదేశము, స్వప్రయత్నము ఈమూడింటి సాయమువలననే పురుష ప్రయత్నం సిద్ధిస్తుంది. అంతేకాని

దీనికి అదృష్టముతో సంబంధములేదు.

**అశుభేషు సమావిష్టం శుభేష్వేవతారయేత్**
**ప్రయత్నాచ్చిత్తం విత్యేష స్సర్వ శాస్త్రార్థ సంగ్రహః**
**(యో. వా) 2-5-71**

శాస్త్రములన్నీ కూడా ఒకే విషయాన్ని సంగ్రహంగా సిద్ధాంతీకరించి చెప్పుతున్నది ఏమిటంటే – "చెడ్డపనిని చెయ్యటానికి ప్రోత్సహించే మనసును నిగ్రహించి మంచి పనులవైపుకు మళ్ళించండి. ఇదే సర్వశాస్త్రములయొక్క సిద్ధాంత సంగ్రహము.

మంచివారితో స్నేహం మరియు శాస్త్రాలన్నీ చక్కగా విచారించటం వలన బుద్ధి చురుకుగా మారి, అట్టి చురుకైన బుద్ధితో చేసే ప్రయత్నం వలన మనిషికి తాను కోరుకున్నది లభిస్తుంది.

**అనంతం సమతానందం పరమార్థం స్వకం విదుః**
**సయేభ్యః ప్రాప్యతే యత్నాత్ సేవ్యాస్తే శాస్త్ర సాధనః**
**(యో. వా) 2-5-80**

అనంతమైనటువంటిది, సమరూపమైనట్టిది అగు అఖండమైన ఆనందమును పొందటమే పరమపురుషార్థమని పెద్దల మాట. ఇట్టి పర మార్థమును, కలిగింపచేయునటువంటి శాస్త్రములను, సత్పురుషులను తప్పక సేవించాలి. చిన్నతనం నుండీ అలవాటు చేసుకున్న సత్సాంగత్యము, సద్గ్రంథ పఠనము వలన హితకరమైనటువంటి మోక్షం లభిస్తుంది. నిన్న చేసిన చెడ్డపని నేడు చేసిన మంచిపని వలన కొంత బాగుపడినట్లుగానే, క్రిందటి జన్మలో చేసిన చెడుకర్మలు కూడా ఈజన్మలో చేసిన సత్కర్మల వలన కొంతవరకు శుభప్రదంగా మారుతాయి.

**నచని స్పందతాలోకే దృష్టేహశవతాం వినా**
**స్పందాచ్చఫల సంప్రాప్తి స్తస్మాద్దైవం నిరర్థకమ్**
**యో. వా 2-5-83**

ఒక్క శవం తప్ప ఈప్రపంచంలో ప్రయత్నం చేయనిది ఇంకొకటి

ఏదీలేదు. అలా ప్రయత్నం చేయకుండా సోమరులుగా ఉండేవాళ్లు జీవించి ఉన్నామృతులతో సమానమే. పురుషప్రయత్నం ఉంటే దానికి ఈశ్వరకృప కూడా తోడై 'శివం' గా మారగలుగుతాము. అందువలన కర్మ ఏవిధంగా చెయ్యాలో తెలియచేస్తూ వేదాంత శాస్త్రము, కర్మమార్గం ద్వారా జీవితపరమార్థ సాధనను ప్రబోధిస్తున్నది.

# ద్వితీయ అధ్యాయము
# కర్మయోగము

**విషయము**

కర్మ, కర్మ స్వభావము, త్రిగుణముల యొక్క ప్రభావముచే కర్మలు ఎన్నిరకములు ? కర్మకు గల కారణమలు ఏవి ? కర్మలు ఎట్లు ఏర్పడుచున్నవి ? కర్మచేతనే కర్మఫలమును ఎట్లు నశింపచేయదగును ? సకామ, నిష్కామ కర్మలు, నిత్యనైమిత్తిక కర్మలు, శాంతిపౌష్టిక కర్మలు, ప్రారబ్ధ, ఆగామి, సంచిత కర్మలు, నిష్కామ కర్మచే జీవితపరమార్ధమును సాధించుట ఎట్లు ? నిష్కామకర్మ ద్వారా అనన్య భక్తి ఏర్పడుట మొదలగు అంశములు.

# కర్మయోగము

## కర్మ+భగవంతుడు = కర్మయోగము

భగవంతుని ఆధారంగా చేసుకుని చేసే ప్రతికార్యమూ కూడా యోగంగా మారుతుంది. అందుకే కర్మయోగము, భక్తియోగము, జ్ఞాన యోగము అంటారు. ప్రాపంచిక సుఖాలకోసం కాకుండా భగవంతుని దర్శనంకోసం విలపిస్తే దుఃఖంకూడా యోగముగా మారుతుంది. భగవంతునికోసం దుఃఖిస్తే 'యోగం' లౌకిక సుఖాలకోసం దుఃఖిస్తే అది "రోగం".

**నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతేహ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః**
**భ.గీత. 3వ అధ్యాయము 5వశ్లో.**

ఎవ్వనికిని ఒకప్పుడుకూడా ఏవిధమైన కర్మాచరణ లేక యుండుట శక్యముకానిది. ఏలననగా ప్రకృతి గుణములు ఉత్తమ నియమమునను సరించి ప్రతిజీవి చేత ఏదో కర్మను చేయించుచునే యుండును.

జీవులన్నియు ప్రకృతి బద్ధులే. ప్రకృతియనగా స్వభావము లేక సత్వరజస్తమో గుణములు. అనుక్షణము ప్రకృతిగుణములు తమస్వభావముననుసరించి మార్పుచెందుచునేయుండును. మరియు జీవునిచే పనిచేయించుచునే యుండును. మార్పే కర్మకావున కర్మచేయకుండా ఏప్రాణీకూడా క్షణమైనా ఉండలేదు. పుట్టినదగ్గరనుండి చనిపోయేవరకూ కూడా ఏదో ఒక కర్మ అనుక్షణం చేయకతప్పదు. కర్మేంద్రియములైనట్టి కాళ్లు, చేతులు, కళ్లు, చెవులు, నాలుక, ముక్కుతోచేసే కర్మలు కొన్ని అయితే, జ్ఞానేంద్రియములైనటువంటి మనస్సు మొదలగు వాటితో చేసే కర్మలు మరికొన్ని. ఊపిరితీసుకోవటం, మాట్లాడటం, కూర్చోవటం వంటివి కూడా కర్మలే. ఈకర్మలు ఏవీ చేయకుండా నిద్రపోతున్నప్పుడుకూడా జీర్ణక్రియ, రక్తప్రసరణ మొదలైన కర్మలు వాటంతటఅవే జరుగుతూ ఉంటాయి.

అందుచేతనే జీవికి కర్మచేయటం తప్పనిసరి. అయితే ఈకర్మ ఏవిధంగా చేయాలి ? కర్మలకు ప్రేరణ ఏది ? కర్మలు ఎన్నిరకాలు ?

వాటి ఫలితం ఏమిటి ? అనేటువంటి అనేక విషయములను గురించి వేదాంత శాస్త్రము మనకు ఎన్నో విధములుగా బోధిస్తున్నది. ఈకర్మల ద్వారా మనము జీవిత పరమార్ధమును సాధించవచ్చుననే విషయాన్ని బోధిస్తున్నది.

కర్మచేయటం తప్పనిసరి అయినప్పుడు కర్మ ఎలా చెయ్యాలో, కర్మకు ప్రేరణ ఏదో ఇప్పుడు మనం తెలుసుకోవాలి. బుద్ధి, మనస్సు, చిత్తము, అహంకారము అను నాలుగు అంతఃకరణములు. ఇవన్నీకూడా లోపల ఉండేటటువంటి అంతరింద్రియములు. కళ్ళు, కాళ్ళ, చేతులూ, చెవులూ, ముక్కు, నాలుక ఇవన్నీకూడా బాహ్యేంద్రియములు, అంతరింద్రియములద్వారా ముందుగా కర్త తన కర్తవ్యాన్ని ఊహిస్తాడు. ఉదాహరణకు "ఒకనికి ఒక పండు తినాలి" అని అనిపించింది. అప్పుడు అతను తనమనస్సు, బుద్ధిద్వారా "పండుతినాలి" అనేటువంటి సంకల్పాన్ని చేసుకుంటాడు. ఈస్పందనను 'ఇచ్ఛాశక్తి' అంటారు. అలా కేవలం సంకల్పించుకున్నంతమాత్రాన పండు కడుపులోకి వెళుతుందా? చెట్టున ఉన్న పండును కోసుకుని తెచ్చుకోవాలి. లేదా బజారుకు వెళ్లి కావలసిన పండునుకొని తెచ్చుకోవాలి. ఇది "జ్ఞానశక్తి" అనబడుతుంది. పండు తెచ్చుకోవటానికి అతడు తనకాళ్లతో బజారుకు వెళ్ళి కళ్ళతో మంచి పండును ముందుగా ఎంచుకుంటాడు. తరువాత పండును చేతిలోకి తీసుకుని నోటియందుంచుకుని, నమిలి తింటే కాని ఆపండు జీర్ణమై శరీరమునకు పుష్టినీ, మనస్సుకు తృప్తినీ కలిగించదు. దీనినే "క్రియాశక్తి" అంటారు. ఒక పండు తినటంలోనే ఎన్ని ఇంద్రియములు ఎన్ని పనులను చేయవలసి వచ్చిందో గమనించారా !

ఈవిధంగా కర్త తన అంతరింద్రియముల ద్వారా ముందుగా చేయవలసిన కర్తవ్యమును గురించి ఊహిస్తాడు. తరువాత ఆకర్తవ్యపాలన వలన అంటే ఆపనిని చేయటంవలన తనకు లాభంకాని, ఆనందంకాని కలుగుతుంది అని తలిస్తే అప్పుడు తన బుద్ధి ద్వారా తన బాహ్యేంద్రియములను ఆపనిని చేయమని ప్రోత్సహిస్తాడు. ఒకవేళ ఆపని తనకు కష్టం కలిగించేది కాని ఇష్టంలేనిది కాని అయివుంటే ఆపనిని చేయటం మానివేస్తాడు.

ఇట్లే మోక్షఫలములను పొందాలి అంటే అన్ని ఇంద్రియములను వినియోగించి లక్ష్యమును సాధించగలగాలి. ఈవిధంగా ఇంద్రియములను అన్నింటినీ కూడా ఏదైనా పనియందు నిమగ్నం చేసినప్పుడు ఆజ్ఞాతను "కర్త" అని అంటారు. ఇంద్రియములు అనే సాధనములను ఉపయోగించి కర్త ఏఏ పనులను చేస్తున్నాడో ఆ క్రియలయొక్క వ్యాప్తిని "కర్మ" అంటారు. కర్త యొక్క క్రియలచే వ్యాపించి యుండునదికర్మ. కర్త, కరణము, కార్యములు ఈ కర్మయొక్క త్రికూటములు.

అగ్నియందు పొగ, మనసునందు వాసనలు వ్యాపించియుండు రీతిగా కర్త, కర్మ, క్రియ మరియు కరణములు కర్మయొక్క జీవితమున నిండి ఉంటాయి. ఆత్మ ఈకర్మ ప్రవృత్తికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

ఈకర్త కర్మకూడా మూడు గుణములను ఆధారముగా చేసుకొని మూడువిధములుగా ఉండును. అవిసత్వము, రజస్సు, తమస్సు అని మూడు విధములు. ఈసత్త్వరజస్తమో గుణములలో రెండు గుణములు బంధాన్ని కలిగిస్తాయి. కేవల సత్వగుణము మాత్రమే జ్ఞానప్రాప్తిని కలిగించి మోక్షమును కలిగిస్తుంది. శుద్ధ జ్ఞానములభించినపుడు సమస్తమూ ఆత్మస్వరూపముగా గోచరిస్తుంది.

నిర్మలమైన జ్ఞానోదయముకాగానే జ్ఞాత, జ్ఞేయము అన్నీ బ్రహ్మములో లీనమైపోవును. ఏజ్ఞానమువలన దృశ్యము తనకన్న వేరుగా కనబడదో అట్టి జ్ఞానమే పూర్తిగా సాత్వికమగును. ఎవరైనా అద్దములో చూచుకున్నప్పుడు తనముఖమే అందులో కనిపించే విధముగా, నామరూపములు కల ప్రతి వస్తువునందును, ఆనామరూపములను ఉపేక్షించి తనను (ఆత్మను) మాత్రమే సర్వత్ర చూచునట్టి జ్ఞానము సాత్వికజ్ఞానము, ఇట్టి సత్వ గుణముతోను, సాత్త్విక జ్ఞానముతోను చేయునటువంటి కర్మలు "సాత్విక కర్మలు" అనబడును.

ఏకర్మచేసినప్పటికినీ హృదయపూర్వకంగా చేయాలి, మన శక్తినంతా వినియోగించి పనిని సక్రమంగా పూర్తిచేయాలి. కాని వాటి ఫలములవైపు మాత్రం దృష్టి ఉంచకూడదు. కర్మలన్నింటిని బ్రహ్మార్పణముగావించాలి. ఇందులో స్వార్థమునకు అణుమాత్రం కూడా తావివ్వరాదు. ఏస్త్రీ అయినప్పటికీ తన భర్త , పిల్లలు, ప్రియజనులకు

వడ్డించేటప్పుడు ఆపనివలనె తనకు కలిగే ఫలితాన్ని గురించి ఏమాత్రమూ ఆలోచించదు. ఆమెదృష్టి అంతా వారికి తృప్తిగా, కడుపునిండా పెట్టడంలోనే నిమగ్నమై ఉంటుంది. ఆవిధంగానే మంచి పనులు చేయాలి. అంటే ఇతరుల క్షేమ సౌభాగ్యములను గురించి ఆలోచించగల ఇటువంటి మనస్తత్వం కలిగి ఉండాలి. ఇటువంటి మనస్థితిలో పనిపూర్తిగా ఒకవేళ నెరవేరకపోయినప్పటికిన్నీ అది ఆవ్యక్తిని బాధించదు. లేదా ఒకవేళ పనిపూర్తిగా అయినా అతడు అతిగా ఆనందించడు కూడా. ఈవిధంగాచేసే కర్మలు సాత్త్విక కర్మలు.

జ్ఞాననిష్ఠ, భయము లేకుండుట, దానము, ఇంద్రియ నిగ్రహము, భగవంతుని పూజించుట, వేదశాస్త్రపురాణములను చదువుట, తపస్సు కపటములేకుండా ఉండుట, అహింస, సత్యము, స్వార్ధత్యాగము, శాంత స్వభావము, మనోనిగ్రహము, చిత్తశాంతి, పరులదోషాలను మాత్రమే ఎంచి దెప్పకుండా ఉండుట, భూతదయ, కోరిక లేకుండుట, మృదుస్వభావం, వినయం, తేజస్సు, ఓర్పు, ధైర్యం, నిర్మలతత్వం, ద్రోహ బుద్ధి లేకుండుట, దురహంకారమును విడిచి పెట్టుట, తృప్తికలిగిఉండుట ఇవన్నీ దైవ గుణములు. సత్వగుణమునకు సంబంధించిన ఈసుగుణములు దైవీసంపదకలవి.

అభయం సత్త్వ సంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యా యస్తప ఆర్జవమ్ ॥

భగవద్గీత 16వ అధ్యాయము దైవాసురసంప
ద్విభాగయోగము 1వ శ్లోకము

అహింసా సత్యమక్రోధ: త్యాగశ్శాంతిరపైశునమ్।
దయా భూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్

భగవద్గీత 16 అధ్యాయము 2వ శ్లోకము

తేజ: క్షమాధృతి శ్శౌచం అద్రోహోనాతిమానితా ।
భవంతి సంపదం దైవీం అభిజాతిస్య భారత॥

భగవద్గీత 16 అధ్యాయము 3వ శ్లోకము

ధంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవచ ।
అజ్ఞానం చాభి జాతస్య పార్థః సంపదమాసురీమ్ ॥
భగవద్గీత 16 అధ్యాయము 3వ శ్లోకము

అజ్ఞానము, ఆడంబరము, గర్వము, కోపము, పరుషంగా మాట్లాడటము, ఇవన్నీ అసురీ సంపద - అనగా రాక్షస గుణాలు. చెడ్డగుణాలు. ఈ విధంగా భగవానుడు గీతలో దైవీసంపద, అసురీ సంపద లక్షణములను గురించి వివరించి యున్నాడు. దైవీ సంపద మోక్షమునకు, అసురీ సంపద బంధకత్వమునకు కారణమగును.

బ్రహ్మస్వరూపమును చేర్చునట్టి శ్రుతి మాతను ఎన్నడును, ఎవ్వడును విడువకూడదు. ఏదైనా ఒక పనిని చేయ్యటమా, మానటమా అనేటువంటి సందిగ్ధస్థితి ఏర్పడి విచారణ చెయ్యవలసి వచ్చినప్పుడు శాస్త్రాన్ని ఆధారం చేసుకునే కర్తవ్యమును నిర్ణయించవలెను.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మకర్తుమిహార్హసి ॥
గీత 16వ అ. 24 శ్లో.

"ఏది చేయదగిన పని, ఏది చేయరాని పని అని నిర్ణయించవలసిన ఆవశ్యకత ఏర్పడినప్పుడు ఒక్క శాస్త్రమును మాత్రమే ప్రమాణముగా అంగీకరించవలెను."

అయితే శాస్త్ర సహాయం లేకుండా కర్మను గురించిన ప్రశ్నను నిర్ణయించనే రాదా? శాస్త్రము, అర్థము, దేశము, మరియు కాలము – వీటన్నింటినీ ఒకే కార్యమున ఉచిత యోగము కలుగునట్టి ఉపాయం ఏ విధంగా చెయ్యాలి ?

ప్రాణులంతా స్వాభావికంగా అనాదియగు మాయవలన కలుగు మూడు గుణములు కలవారే అయివుంటారు. ఈ మూడు గుణములలో రెండు గుణములు అణగి యుండి ఒక గుణము బలవత్తరంగా ఉంటుంది. మూడు పాయలతో వేసే జడలో ఒక పాయ బయటకు వచ్చి రెండు పాయలు లోపలికి ఉండే విధంగా ఈ గుణాలు ఉంటాయి.

సత్త్వగుణము బలవత్తరమైతే రజోగుణము, తమోగుణము అణిగి ఉంటాయి. రజోగుణం అధికమైతే సత్త్వమూ, తమస్సు, తమోగుణం అధికమైతే సత్త్వము, రజస్సు, అణగి ఉంటాయి. అప్పుడు ప్రాణుల యొక్క స్వభావము ఆయా ప్రాణులలో బలవత్తరంగా ఉండి, బహిర్గత మయ్యే గుణంపైన ఆధారపడి ఉంటుంది. స్వభావాన్ని అనుసరించి మనస్సు, మనస్సు ననుసరించి కర్మాచరణము ఆధారపడి ఉంటుంది.

మరణించిన తరవాత ప్రాణులు తాము చేసినట్టి ఆయా కర్మ ఫలము ననుసరించి నూతన శరీరాన్ని ధరిస్తారు. విత్తనం మార్పు చెంది నశిస్తే దాని నుండి వృక్షం ఏర్పడుతుంది. ఆ తరువాత వృక్షం మార్పు చెంది నశించి బీజంలో ఇమిడి ఉంటుంది. ఈ క్రమము కోట్ల కొలది కల్పముల వరకూ జరుగుతూ ఉంటుంది. అందుచేతనే కృష్ణపరమాత్మ "ఓ పార్థా ! సర్వభూతముల ఉత్పత్తి కి అనాదియగు బీజమునేనేనని ఎరుగుము. బుద్ధిమంతుల యందలి బుద్ధియు, తేజోవంతుల యందలి తేజమును, రాగద్వేషములకు లోబడక ధర్మమార్గమున వర్తించు బలశాలుల బలమును, ధర్మవిరుద్ధము గాక జీవునకు విధివిహితమగు కామమును నేనే" అని బోధించెను.

**"బీజం మాం సర్వ భూతానాం విద్ధి పార్థః సనాతనమ్ !**
**బుద్ధిర్బుద్ధి మతామస్మి తేజస్తే జస్వినా మహమ్ ॥**
**(గీత 7అ 10శ్లో)**

**బలం బలవతాం చాహం కామ రాగ వివర్జితమ్ ।**
**ధర్మా విరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ ॥**

**(గీత 7అ-11శ్లో)**

ఇదే విధంగా ప్రాణులను అంటిపెట్టుకుని ఉండేటువంటి "త్రిగుణత్వము" మాత్రము ఎన్నడూ వదిలి పోదు. "పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోకూడా పోదు" అంటూ ఉంటారు పెద్దలు.

మరణానంతరం కూడా వాసనా మాత్రంగా బుద్ధి అంటి పెట్టుకునే ఉంటుంది.

శుద్ధ సత్వగుణం అధికమైనప్పుడు ఆ శ్రద్ధ వలన కొంత జ్ఞానం అభిస్తుంది. అయినా కూడా ఆ సత్వ గుణాన్ని అణచి వేయగల మిగిలిన రెండు గుణాలు కూడా అక్కడే ఉంటాయి కాని నశించి పోవు. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా పొంచి ఉన్న ఈ రెండు గుణాలు కూడా బలవత్తరమయ్యే ప్రమాదం ఉండనే ఉంటుంది.

సత్త్వగుణం యొక్క సహాయం వలన శ్రద్ధ మోక్షం వైపుకు ఆసక్తి చూపుతుంది. రజోగుణం వృద్ధి పొందితే ఆ శ్రద్ధే కర్మలకు వెట్టి చాకిరీ చేసే దాసి వలె అవుతుంది. ఆ పిమ్మట తమోగుణం ప్రబలమైతే ఆ శ్రద్ధే విషయ సుఖములతో చిక్కుబడిపోతుంది. ప్రమాద, నిద్ర, ఆలస్యము, మోహము, భ్రాంతి, అజ్ఞానము తమోగుణ లక్షణాలు.

కాబట్టి త్రిగుణముల యొక్క ముద్ర పడటం వలన జీవి యొక్క శ్రద్ధ కూడా మూడు విధములుగా ఉంటున్నది. సాత్త్విక శ్రద్ధ కలవారు అన్ని విద్యలను నేర్చుకోవటం, యజ్ఞయాగాదులను చేయటం, దేవతలను పూజించటం చేస్తారు. స్వర్గ సుఖాలపట్ల ఆసక్తి కలిగి ఉంటారు. రాజసిక శ్రద్ధ కలవాళ్లు యక్షులను, రాక్షసులను పూజిస్తూ ఉంటారు. ఇక తామసిక శ్రద్ధ కలవారు భూతప్రేత పిశాచాదులను పూజిస్తూ క్షుద్రశక్తులను పొంది పరమ కఠోరంగా ఉంటారు. ఇటువంటి వారు శ్మశానాలలో, ఏవగింపుగా, జుగుప్సాకరంగా ఉండే పూజలను చేస్తూ ఉంటారు.

ఈ సాత్త్విక శ్రద్ధ ఎవరినైతే కాపాడుతూ ఉంటుందో అట్టివారికి మోక్షం లభించదేమోనన్న భయంలేదు. అటువంటి స్థితిలో ఉన్నవాళ్ళు బ్రహ్మసూత్రములు తెలియకపోయినా, శాస్త్రాలు చదవలేకపోయినా భయపడనవసరం లేదు. సదాచారము, సద్గుణ సంపద మాత్రమే చాలును. ఈశ్వరానుగ్రహమువలన వారికి ఏదో విధముగా శ్రుత్యర్థ శ్రవణము కలిగి, సకృత్ శ్రవణమాత్రము చేతనే జ్ఞానసాధకులవుతారు.

"వేదపురాణముల అర్థమే రూపుదాల్చిందా!" అన్నట్లుగా అవతారపురుషులవలె సంచరిస్తూ, సదాచారాన్ని ఆచరిస్తూ ప్రజలకు ఆదరముగా ఉండే మహానుభావుల ఆచార విధానములను అనుకరిస్తూ వారివలె ప్రవర్తించటానికి ప్రయత్నించే వాళ్ళు సాత్త్విక శ్రద్ధ కలవారే

అవుతారు. అందువల్ల శాస్త్రాలు మొదలైనవి ఏమీ చదవకపోయినా కూడా అవి చదివినంత ఫలం వాళ్ళకు సజ్జన సేవ వలన సులభంగా లభిస్తుంది.

తన బుద్ధిని అనుసరించి, శాస్త్ర మార్గాన్ని తెలుసుకొని ఆచరించే ఉత్తముని శ్రద్ధతో అనుకరించేవాడు మూర్ఖుడైనప్పటికీ కూడా తరిస్తాడు. అందువలననే అన్నింటి కంటె సజ్జనసాంగత్యమే గొప్పదని పెద్దలు నొక్కి చెపుతుంటారు. "పరిమళ వృక్షాన్ని అల్లుకొన్న లత కూడా పరి మళాలను వెదజల్లే విధంగా వారు కూడా సత్త్వగుణ సౌరభం కలిగి ఉంటారు. ఎవరివలన సత్త్వగుణానికే బలం చేకూరుతుందో అటువంటి వారి స్నేహమే చెయ్యాలి. అట్టివారినే అనుకరించాలి. అనుసరించాలి.

ఈ గుణాలపై మనం తీసుకునే ఆహార ప్రభావం కూడా చాలా ఉంటుంది. భగవదర్పణ భావంతో భగవంతునికి నివేదించి భుజించే అన్నం యజ్ఞంలో హవిస్సువలె పవిత్రకరమైనది, అమృతంతో సమానమైనదిగా ఉండి ఆయుస్సును పెంచటమే కాకుండా సాత్త్విక భావాలను పెంపొందిస్తుంది. గురువు ముఖం నుంచి వెలువడిన "మాట" ఎంత చిన్నదైనా ఎంతటి తృప్తిని కలిగిస్తుందో అదే విధంగా తీసుకునే ఆహారం కూడా మితంగాను, శరీరానికి హితవు కలిగించేదిగాను ఉండాలి. నోటికి ఎంత రుచికరంగా ఉంటుందో కడుపులో కూడా అంత సులభంగా జీర్ణమై ఆరోగ్యాన్ని కలిగించేదిగా ఉండాలి. ఇలా ఉండే ఆహారమే సాత్త్విక ఆహారము.

అతి పుల్లనివి, బాగా కారంగా ఉండేవి, మరీ వేడిగా వుండే ఆహారం రాజసిక ఆహారం. ఇది కడుపులో మంటను కలిగించటమే కాకుండా ఉద్రేకాన్ని కలిగించి శరీరానికి హాని కలుగచేస్తుంది. మన స్వభావం మనం తీసుకునే ఆహారం మీదా, మనం తీసుకునే ఆహార ప్రభావం మన స్వభావం పైనా బాగా పని చేస్తాయి.

ఇక బాగా నిలవ వున్నవీ, ఖరీదు తక్కువ కదా అని కొనే నాసిరకం పదార్థములు, పుచ్చిపోయినవి, తాజాదనం లేని ఆహారపదార్థములూ, పాసిపోయిన పదార్థములు తామసికమైనవి. ఇవి తమోగుణాన్ని వృద్ధి చేస్తాయి. గంటల తరబడి, రోజుల తరబడి 'ఫ్రిజ్'

లలో నిలవ వుంచి తినే ఆహారము తామసికమైనదే. అందువలననే ఈ కలికాలం ప్రజలలో తామసిక ప్రవృత్తి, తామసిక భావాలు బాగా ఎక్కువైపోతున్నాయి. తీరికలేకపోవటంచేత ఒకే సారి వండిపెట్టుకుని రెండు పూటలా అదే ఆహారం తీసుకోవటం ఎక్కువైంది ఈ రోజులలో. ఇటువంటి ఆహారము శరీరానికి పుష్టిని, తుష్టిని కలిగించదు.

కాబట్టి మనం తీసుకునే ఆహారం మన గుణాలపై ప్రభావం కలిగి ఉంటుందనీ, ఆ గుణాలను బట్టి వ్యక్తి స్వభావం, ఆ స్వభావాన్ని బట్టి ఆయా వ్యక్తులు పనిచేసే విధానం ఆధార పడి ఉంటుందని మనకు తెలుస్తోంది.

రజస్సు, తమస్సులు నశించినప్పుడు సత్త్వము మాత్రమే మిగిలి తనంత తానే బహిర్గతం అవుతుంది. నిర్మలమైనటువంటి సత్త్వగుణం కలిగి ఉన్నంత మాత్రాన ఆత్మస్వరూప ప్రాప్తి కలుగదు. మనకు కావలసిన శక్తులన్నీ సత్త్వగుణంలో ఉన్నాయి. అయితే కేవలం సత్త్వగుణాన్ని కలిగి ఉండటమే మోక్షం కలగటం కాదు. సత్త్వగుణ సహాయంతో మోక్షద్వారాన్ని ప్రవేశించుట కొరకు కావలసిన అర్హతను పొందవచ్చును.

**ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥**
**(గీత 17వ అధ్యాయము (శ్రద్ధాత్రయవిభాగము)**
**23వ శ్లోకము.**

పరబ్రహ్మ ఓం, తత్, సత్ అను మూడు శబ్దములచే నిర్దేశించ బడుచున్నది. సృష్టి ఆరంభమునందు ఆబ్రహ్మచేతనే బ్రాహ్మణులును, వేదములును, యజ్ఞములును సృజింపబడినవి.

ఓంకారము వ్యక్తావ్యక్త స్వరూపములుగల పరమాత్మను సూచించు శబ్దము. అదేవిధముగా తత్.సత్ శబ్దములుకూడ పరమాత్మను సూచించును. బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములుకూడ తమ పవిత్రత కొరకై ఈశబ్దములపై ఆధారపడియుండుటవలన ఈశబ్దములు లేనిచో పై మూడు (బ్రాహ్మణ, వేద, యజ్ఞములు) కూడా నిలువవు. కనుక

ఆమూటియందును ఎట్టిలోపములున్నను ఈశబ్దముల ఉచ్ఛారణ వలన అవన్నియు పరిహరింపబడును.

విశ్వానికంతటికి మూలకారణమైన అనాదిపరబ్రహ్మము ఒక్కటే నిజానికి పరబ్రహ్మమునకు ఏపేరుకాని, జాతికాని లేవు. కాని మాయవలన కలిగిన మోహమనెడి చీకటిలో పరబ్రహ్మమును గురించిన భావన కొరకు మాత్రమే ఈపేరు పెట్టబడినది.

పిల్లలు పుట్టినప్పుడు ఏపేరూ పెట్టుకుని రారు. కాని, అటుతరువాత మనం ఆబిడ్డను పేరుపెట్టి పిలుస్తూ ఉంటే క్రమంగా ఆపేరు వినగానే బిడ్డ పలుకుతూ ఉంటుంది. ఆవిధంగానే సంసారములోని బాధలను, దుఃఖములను భరించలేక జీవులు ఆర్తితో భగవంతునికి తమ కష్టములను గురించి చెప్పుకునేటప్పుడు ఏపేరుతో పిలిచినప్పుడు ఆబ్రహ్మాత్వము మారుపలికి అతనికి జవాబిస్తుందో అదే ఈ "సాంకేతికము" (ఓం తత్, సత్) అనగా గుర్తించటంకోసం ఏర్పడిన పేరు. కొందరు 'రామా' అని అనవచ్చును. మరికొందరు "కృష్ణా" అనవచ్చును. కొందరు శివుడనీ, ఇంకొందరు 'సాయి' అనీ మరికొంతమంది 'అమ్మ' అనీ పిలువ వచ్చును. క్రీస్తు, అల్లా, బుద్ధుడు, జోరాష్ట్ర, మహావీరుడు మొదలైన ఏపేరుతో ఎవరు ఎలాగయినా పిలువవచ్చును.

ఏపేరుతో పిలిచినా, ఏరూపాన్ని తలచినా పలికే "దైవం" మాత్రం ఒక్కటే.

ఓమ్, తత్, సత్, అనునది 'బ్రహ్మము' యొక్క త్రివిధనామము. ఈనామముతో ఏకరూపముచెంది సాత్త్విక కర్మాచరణము చేసినప్పుడు మాత్రమే మానవుడు కైవల్యమును పొందగలుగును.

నోటితో బ్రహ్మము యొక్క నామమును పలుకుతూ, చేతులతో సాత్త్వికకర్మలు చేస్తున్నప్పటికీ కూడా, దాని వినియోగాన్ని గురించిన జ్ఞానం లేకపోతే ఆపనులన్నీ కూడా వ్యర్థమే.

ఈనామంలోని మూడు అక్షరములను కర్మ యొక్క ఆరంభము, మధ్య మరియు అంత్యమనెడి మూడు స్థానములలో ఉపయోగించాలి. ఈవ్యవస్థవలననే బ్రహ్మవేత్తలు, బ్రహ్మస్వరూపాన్ని పొందగలిగారు. ఈనామ

సహాయంవలన లోకులు బంధకరములైనట్టి కర్మలనుండి విముక్తిని పొందుతారు. ఈవిధంగా యజ్ఞదానాది కర్మలు ఓంకారసహాయముచే హితకరములగుచున్నవి. ముముక్షువులు వివిధములైన యజ్ఞములను, తపస్సు, దానములను చేయునప్పుడు ఫలమును కోరకుండా 'తత్' అని ఉచ్ఛరించుచూ చేయుదురు. "'తత్ రూపియగు బ్రహ్మకు ఈకర్మలన్నియు ఫల సహితముగా అర్పితము అగుగాక!" అని విజ్ఞ పురుషులు తమ కర్మ ఫలమును భగవంతునికి అర్పించి కర్మచేయటంవలన ఆకర్మయొక్క ఫలము వారికి బంధం కాకుండా ఉంటుంది. 'తత్' రూపియగు బ్రహ్మకు తమసమస్త కర్మఫలములను అర్పించి 'నమమ' అంటూ సమస్త కర్మఫలముల నుండి తమను తాము వేరు చేసుకుంటారు. "నమమ" – అనగా ఈఫలము నాదికాదు."

హోమము చేయునప్పుడు దేవతల నుద్దేశించి "ఇంద్రాయ స్వాహా ! ఇంద్రాయ ఇదం నమమ..." మొదలైన మంత్రాలు చెపుతారు. అదేవిధంగా ఏదైనా దానము ఇచ్చినప్పుడు "తుభ్యం బ్రాహ్మణాయ దదామి. బ్రాహ్మణాయ ఇదం నమమ" అని చెపుతారు. అనగా దానమిచ్చిన వస్తువు దానము పుచ్చుకొన్న బ్రాహ్మణునకు చెందుగాక ! ఇక ఆవస్తువు నాకు చెందదు. 'అని మామూలుగా అర్థం చెపుతారు. కర్మయోగి దానమిచ్చిన వస్తువునే కాక ఆదానఫలమును కూడా వదులుకుంటున్నాడు. అని ఈ "నమమ" అను మాటకు అర్థము. నమమ అనగా నాదికాదు. అలాగే కర్మయోగి హోమం చేయునప్పుడు హోమ ద్రవ్యము మాత్రమే కాక తత్ఫలము కూడా తనకు అక్కరలేదని అంటారు:

ఈవిధముగా ఓంకారముచే ఆరంభించబడి బ్రహ్మార్పణ భావముతో చేయునటువంటి కర్మ బ్రహ్మరూపమును పొందుతుంది. ఇవి బయటకు కర్మలుగా కనిపించినా కూడా ఆకర్మఫలం కర్తకు అంటదు. అలాకాకుండా "ఫలము నాకు కావాలి నేనే చేస్తున్నాను" అనేటువంటి కర్తృత్వభావన కలిగియుండి పైకిమాత్రం "బ్రహ్మార్పణం" అంటూ కర్మచేస్తే అది బ్రహ్మమును పొందదు. ఆకర్మఫలం కర్తకు చెంది తీరుతుంది.

పరమేశ్వరుడు సర్వస్వతంత్రుడు, ప్రభువు. నియామకుడు. నేను నిమిత్తమాత్రుడను అనే భావముతో కర్మలు చేసి కర్మఫలమును భగవదర్పణ

చేస్తే భగవంతుడు ఆఫలమును స్వీకరించి కర్మబంధము నుండి జీవునికి విముక్తి కలిగిస్తాడు – అని భక్తులు చెపుతారు.

ఉప్పునీటిలో కరగిపోయినప్పటికీకూడా దానికి గల ఉప్పదనము మాత్రము మిగిలి ఉండే విధంగా "మనము మన కర్మలను బ్రహ్మార్పణ మొనర్చాము" అనేటువంటిద్వైతభావం కర్తలోనిలిచే ఉంటుంది. అయినప్పటికీ చిత్తశుద్ధికల్గుతుంది. రాగద్వేషాదులు లేని చిత్తము ఏర్పడుటను చిత్తశుద్ధి అంటారు. దీనివలన జ్ఞానమార్గమున ఉత్తమాధికారి అవుతాడు. బ్రహ్మవిచారమువలన జ్ఞానము కలుగుతుంది. ఈవిధంగా నేను అనేటువంటి అహంకారము, కర్తృత్వాభిమానము ఉన్నంతవరకూ సంసారభయము పోదు – అని జ్ఞానులు అంటారు.

స్వయముగా పరమేశ్వరుని ముఖమునుండి చెప్పబడిన వేదములు ఈవిషయమును గట్టిగా నొక్కి చెప్పుచున్నవి. ఈనామరూపాత్మకమైన జగత్తంతయు అనిత్యము. ఇది శాశ్వతము కాదు. అందువలన ఇది "సత్" కాదు. కేవలము ఆత్మస్వరూప ప్రాప్తి వలననే ఆ "సత్" అనెడి తత్వ జ్ఞానము కలుగును. ఈసత్ తత్వము వలననే ఇంతకు పూర్వము ప్రశస్తముగానైన కర్మలన్నీ కూడా ఐక్య జ్ఞానమువలన సమరూపమును పొందును. అంతట ఆత్మస్వరూపుడగు "బ్రహ్మము" తెలియబడును. ఇందువలన ఓంకారము మరియు ఓంకారముచేత బ్రహ్మాకారమును పొందిన కర్మలన్నియు పరిపక్వమై ఒక్కమారుగా సంపూర్ణముగా సద్రూపమును పొందును. ఏవి కర్మలు చేసినప్పటికిన్నీ సమస్తకర్మలూ బ్రహ్మార్పణమనుటచేత బ్రహ్మరూపముగానే అయిపోవును. సముద్రములో కలసిన తరువాత నదులను వేరువరచలేని విధముగా బ్రహ్మార్పణమొనర్చబడిన కర్మలలో ఎక్కువ తక్కువ భేధములు ఉండవు.

ఓం, తత్, సత్ అనే మూడు శబ్దములు ఈవిధముగా పర బ్రహ్మమును గూర్చి తెలియచేస్తున్నాయి. బ్రాహ్మణులు, వేదములు యజ్ఞములు, తమ పవిత్రతను కాపాడుకోవటానికి ఈశబ్దములనే ఉపయోగిస్తూ ఉంటారు (యి), బ్రాహ్మణులు చేసే కర్మలలో కాని, వేదములు పలికే సమయంలో కాని, యజ్ఞములు చేసేటప్పుడు కాని తెలిసో, తెలియకో ఏవైనా లోపాలు సంభవిస్తే ఆలోపాలను ఈమూడు శబ్దములు పోగొట్టి పవిత్రతను కలిగిస్తాయి.

మోక్షము కోరువారు ఫలాపేక్షలేకుండా ఈ "తత్" శబ్దమును ఉచ్చరించి యజ్ఞాలు, తపస్సులు, దానాలు చేస్తూ ఉంటారు. మంచి విషయాలలోను, ఉత్తమ కర్మలు చేసేటప్పుడూ "సత్" అనే శబ్దాన్ని వాడతారు. యజ్ఞాలలో, తపస్సులలో, దానములలో స్థిరమైన నిష్ఠనే శ్రద్ధ అంటారు. ఈశ్వరానుగ్రహం కొరకు శ్రద్ధతో చేయబడే కర్మలన్నీకూడా సత్కర్మలు. కర్మ + భగవంతుడు= కర్మయోగము. శ్రద్ధ లేకుండా చేసే కర్మలు అసత్కర్మలు. చేసేది, ఏకొంచెమైనా సరే శ్రద్ధగా చెయ్యాలి. అశ్రద్ధతో ఎంతపనిచేసినా అది వ్యర్థమే.

చేసే ప్రతిపనీ కూడా భగవంతుని ప్రీతికొరకే అని భావించి ఆపనిని చేస్తూ ఉంటే అటువంటి కర్మబంధంకాకుండా మోక్షకారణం అవుతుంది. శ్రద్ధలేకుండా చేసేటువంటి కర్మలు ఈలోకంలోను, పరలోకం లోను కూడా వ్యర్థమే అవుతాయి.

కామ్యానాం కర్మణాంన్యాసం సన్యాసం కవయోవిదుః ।
సర్వకర్మఫల త్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥
గీత 18 అ -2 శ్లో
(మోక్షసన్యాసయోగము)

"కామ్య కర్మలను వదులుటయే సన్న్యాసమని విజ్ఞుల అభిప్రాయము. అన్ని కర్మలఫలమను విడుచుటయే త్యాగమని విమర్శకుల అభిప్రాయము."

కోరికతో చేసేటువంటి కర్మలను విడిచి పెట్టడం 'సన్యాసం' అనీ, చేసిన అన్ని పనుల యొక్క ఫలాన్నీ విడిచి పెట్టడం 'త్యాగం' అనీ అంటారు. కోరికలతో కర్మచేయటం బంధకారణం కాబట్టి అటువంటి కర్మలను విడిచిపెట్టివేయాలి. కర్మచేయకుండా మనం క్షణకాలం కూడా ఉండలేము. కాబట్టి కర్మచేయటం మానివేసి సోమరులుగా జీవించటం కాకుండా కర్మ ఫలితాన్ని ఆభగవంతునికి విడిచిపెట్టి మనపని మనం శ్రద్ధతో, శక్తి వంచన లేకుండా చేస్తే అటువంటి నిష్కామకర్మబంధాన్ని కలిగించదు.

కర్మలోనే కర్మచెయ్యకుండా ఉండటం, కర్మచెయ్యకుండా

ఉండటంలోనే కర్మచేయటం అవినాభావంగా ఉంటాయి. చూసే దృక్పథంపై ఇది ఆధారపడి ఉంటుంది. అంటే కర్మలోనే కర్మ. అకర్మకూడా ఉంటాయి. కర్మ చేసేది ప్రకృతిలోని గుణాలయితే అజ్ఞానం వలననో, అహంకారం వలననో ఆపనులకు కర్తమనమే అని భావిస్తూ ఉంటాము. కర్మ అంటే ఏదో ఒక పనిచేస్తూ ఉండటమే కాదు. చెయ్యకుండా ఉండటంకూడా కర్మే. అంటే ఉదాహరణకు పగ్గాలను పట్టుకొని రథం తోలడం కర్మ అయితే అవే పగ్గాలతో రథాన్ని ఆపటం కూడా ఒక కర్మే. కదలకుండా కూర్చోవటం, నిద్రపోవటం, మౌనంగా ఉండటం కూడా కర్మలే. అందుచేత కర్మచేయకుండా ఉండటం సాధ్యంకాని విషయం.

కర్మణోహ్యపి బోద్దవ్యం బోద్ధవ్యం చవికర్మణః
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతి ॥
గీత 4 అ. 17 శ్లో (జ్ఞానయోగము)

కర్మను గూర్చి, అకర్మను గూర్చి, వికర్మను గూర్చి చక్కగా విచారించి తెలిసికొనవలెను. కర్మయొక్క గతిని అవగాహన చేసికొనుట చాలాకష్టము.

కర్మయనగా సకామకర్మయనియు, వికర్మయనగా నిషిద్ధమైన కర్మయనియు సాధారణముగా వ్యాఖ్యానింతురు. కర్మయనగా విధివిహితమైన కర్మయని కొందరి అభిప్రాయము. అకర్మయనగా ఏపనీచేయకుండా ఉండుట అని ఒక అభిప్రాయము. కర్తృత్వ, భోక్తృత్వ అభిమాన రహితమైన నిష్కామకర్మ అని మరికొందరి అభిప్రాయము. ఏపనిచేయకుండా ఉండటం దాంభికమైన అకర్మ. దీనిని "కుకర్మ" అని కూడా అనవచ్చును. వికర్మ, కుకర్మలు రెండూ పాపకర్మములే. సకామ కర్మబంధహేతువు. చిత్త శుద్ధితో చేసే విద్యుక్తధర్మమైన కర్మ మోక్షమునకు కారణమగును. ఇక నేను నాది అను అహంకారమమకారములు లేకుండా ఫలాపేక్షరహితముగా చేయు నిష్కామకర్మ నైష్కర్మ్య సిద్ధిని కలిగించును. అవతారపురుషులు చేయు కర్మలు ఇటువంటివే.

కర్మణ్య కర్మయః పశ్యేత్ అకర్మణి చకర్మయః
సబుద్ధి మాన్మ నుష్యే షుసయుక్తః కృత్స్న కర్మకృత్॥
గీత 4 అ. 18 శ్లో

కర్మలో అకర్మను, అకర్మలో కర్మను అర్థం చేసుకున్నవాడే బుద్ధిమంతుడు. కర్మయోగి. అటువంటివాడు చేసే కర్మ యొక్క ఫలితంతో అతనికి సంబంధం ఉండదు. ప్రకృతిబద్ధమగు దేహము గుణముల స్వభావము ననుసరించి కర్మలాచరించును. నిష్క్రియమైన బ్రహ్మయందే వ్యాపారములు, ఏకర్మలు లేకపోయినా మాయవలన ఉన్నట్లు కనబడుతున్నవి. దీనినే అకర్మయందు కర్మను చూచుట అంటారు. దేహమందలి ఆత్మసాక్షి మాత్రము అయినప్పటికినీ దేహము చేయు వ్యాపారములు తానే చేయుచున్నానని భ్రమించుచున్నాడు. కర్మ రహితుడగు ఆత్మను కర్తగా భావించునట్లే అకర్మయందు కర్మను చూచుట అజ్ఞాన దృష్టి. దేహము వ్యాపారము చేయుచున్నను తాను దేహము కంటె భిన్నుడుకావటం వలన తానేమియు చేయుచుండుటలేదని సాక్షిగా ఉండుట కర్మయందు అకర్మను చూచుట. ఇది విజ్ఞానదృష్టి. ఈకర్మ, అకర్మల యందలి రహస్యమును గ్రహించిన వాడే బుద్ధిమంతుడు. అట్టివాడే కర్మయోగి. శారీరకంగా ఏపనీ చేయకుండా మానసికముగా విషయ వాంఛలను కలిగియుండుట దాంభికమైన అకర్మ ఈరహస్యమును తెలిసి కొనుటయే అకర్మయందలి కర్మను గుర్తించుట. అనికూడ చెప్పవచ్చును.

అకర్మయనగా నేను చేయుచున్నాను. ఇదినాపని, ఫలితమును అనుభవించవలెను అను భావములేకుండా. నిష్కామముగా కర్మలను ఆచరించుట. శారీరకముగా ఎట్టికర్మలు చేయుచున్నను, మనస్సు కామరహితమై నిశ్చలమై ఉండును. ఇదియే కర్మయందు అకర్మ. ఈరెంటితత్త్వము తెలిసిన బుద్ధిమంతుడు. యోగియై 'అకర్మము'ను అనుష్ఠించి సర్వకర్మలు ఆచరించిన ఫలితమును పొందును. కర్తృత్వభావములేనిదగుటచే అకర్మనే "కర్మాభాసము" అని అంటారు.

నిప్పులో కాల్చిన లేదా వేయించిన విత్తనంనుండి ఇంక మొక్కలు మొలవవు. అదేవిధంగా జ్ఞానమనే అగ్నిలో దగ్ధమైన కర్మ అనే విత్తనం మరో జన్మ అనే మొక్కను మొలవనివ్వదు.

**యస్య సర్వే సమారమ్భాః కామ స్కల్ప వర్జితాః**
**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితాం బుధాః॥**
**గీత 4అ-19 శ్లో**

ఎవని కర్మలన్నియు కామవాసనారహితములై ఉండునో, ఎవని కర్మలు, జ్ఞానాగ్ని వలన దగ్ధము చేయబడినవో అట్టి వానిని విజ్ఞులు 'పండితుడు' అందురు. ఏదైనా ఒకపని చేసినప్పుడు దానికి బాహ్యము, ఆంతరంగికము అను రెండు విధములైన ఫలములు ఏర్పడును. ఈరెంటిలోకూడా తాత్కాలికము, కాలాంతరమునందు కలుగు ఫలితము అని మరల రెండు విధములు. ఉదాహరణకు బాగా ఆకలిగొన్నవానికి తృప్తిగా అన్నము పెట్టినప్పుడు వెంటనే వాని ఆకలితీరి తృప్తి చెందును. ఇది తాత్కాలికమైన బాహ్యఫలితము. ఈఅన్నము పెట్టుట అను బీజమునుండి మనకు జన్మాంతరమునందు అన్నసమృద్ధియను బాహ్యఫలితములభించును. అంతేకాక ఆకలిగొన్నవానికి అన్నము పెట్టి ఆకలితీర్చినందుకు మనమనసుకు వెంటనే ఆనందము కలుగును. ఇది తాత్కాలికమగు ఆంతరంగికఫలితము. ఇది మనసులో బీజరూపమున సూక్ష్మముగా నిలిచియుండును. దీనినే వాసనలేక 'సంస్కారము' అని అందురు. ఈవాసన నుండి కాలాంతరమున మరల అట్టి పనిచేయుటకు పరిస్థితులు అనుకూలముగానున్నచో కోరిక కలుగును. కోరిక అనగా ఇచ్ఛవలన సంకల్పములు కలుగును. కావున ఈవాసనలే కోరికలకు మూలము. దుష్టకర్మలవలన దుష్టవాసనలు, మంచి కర్మలవలన మంచి సంస్కారములు ఏర్పడి అవే మనసునందలి కోరికలకు కారణమై జీవుని జననమరణరూపమగు సంసారమునందు భ్రమింపచేయును. కర్మఫలితములు పునర్జన్మ హేతువులు. బాహ్యాభ్యంతరములగు ఈరెండు విధములగు కర్మ ఫలితములను త్యజించినచో జన్మరాహిత్యము కలుగును. జ్ఞానాగ్నితో కర్మలను దహించుట యనగా ఇదియే నిష్కామ. కర్మవలన ఎట్టి ఫలితము కలుగకపోవుటచేత అట్టికర్మ జన్మరాహిత్యమునకు దారితీయును. ఇట్లు చే'యువాడే కర్మయోగి, పండితుడు. కోరికలను వదిలివేసి, కర్మఫలత్యాగంచేసి కర్మలను చేయుటయే కర్మయోగం. అటువంటి కర్మల ఫలం కర్తకు చెందదు కాబట్టి కర్మఫలమును అనుభవించుటకు మరొక జన్మకూడా అవసరము లేదు. అదే జన్మరాహిత్యం, మోక్షం అంటే, ఇలా కర్మల పరమార్థం తెలుసుకున్నవారికి కర్మబంధంలేదు.

**నకర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।**
**నచసన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥**
**గీత 3అ. 4. శ్లో**

అనగా కర్మలను ప్రారంభింపకపోవుటవలన పురుషుడు నైష్కర్మ్యమును పొందడు. సన్యసించుటవలన మాత్రమే సిద్ధిని పొందడు.

కర్మఫలమును ఆశించనప్పుడు మరికర్మలు చేయుట అవసరము లేదను భావముతో కర్మాచరణము నుండి విరమింపరాదని భగవానుడు గీతా ముఖముగా బోధించినాడు. కర్మలను చేయకుండా ఉండటం వలన తమోగుణ ప్రధానమగు జడస్థితి ప్రాప్తించునే కాని "నైష్కర్మ్య సిద్ధి" లభింపదు. కర్మయోగమునకు పరాకాష్ఠ స్థితి నైష్కర్మ్య సిద్ధి. అనగా కర్మలను ఆచరించిననూ వాటిచే బంధింపబడకుండుట. ఈ స్థితికర్మలను ఆచరించటం మాని వేయటం చేత సిద్ధించదు అని భావము. కర్మఫలత్యాగంతో నిష్కామంగా కర్మలను చేయటంవలననే జీవిత పరమార్థమగు మోక్షము సిద్ధించును కాని, కేవల కర్మ సన్న్యాసము వలన సిద్ధించదు. జ్ఞానయోగమునకు గమ్య స్థానమగు ఆత్మానుభూతి కర్మలను సన్న్యసించటం వలన చేకూరదు.

భగవంతుని అనుగ్రహంతో లభించినదే అమృతంగా భావించి, తృప్తిపడి సుఖదుఃఖములు, శీతోష్ణములు మొదలైన ద్వంద్వములను సమభావంతో అనుభవిస్తూ, అసూయ కోరిక లేకుండా దైవమునకే తమ కర్మఫలమును సమర్పించి తమ స్వధర్మాన్ని చక్కగా నిర్వర్తించేవారు కర్మలు చేసినా చేయనట్లే. అట్టి కర్మలే భగవంతునికై మనము ఆచరించే యజ్ఞములు. అంతా బ్రహ్మస్వరూపంగా భావించగలవారికి బ్రహ్మం కంటే వేరైన పదార్థం ఏదీ లేదు కాబట్టి ప్రతి కర్మ బ్రహ్మ స్వరూపమే.

**"కర్మేదైవం", "తస్మైః కర్మబ్రహ్మ స్వరూపిణే నమః"**

పనే దైవంగా భావిస్తూ పనిని చెయ్యాలి. కాని చేయవలసిన పనిని, కర్తవ్యాన్ని విస్మరించి పూజలు చేస్తే అది మోక్షమును కలిగించదు. భగవంతుని ఎంత శ్రద్ధగా పూజిస్తామో అంత శ్రద్ధతోనూ కర్మనే దైవంగా

భావించి కర్మను చేయాలి.

**శ్రేయాన్ ద్రవ్య మయాద్య జ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరన్తప ।**
**సర్వ కర్మాఖిలం పార్థజ్ఞానే పరిసమాప్యతే ॥**

**గీత 4వ అధ్యాయము (జ్ఞానయోగము**
**33వ శ్లోకము**

ద్రవ్యమయ యజ్ఞములకంటె జ్ఞాన యజ్ఞము ప్రశస్తమైనది. అన్ని కర్మలూ జ్ఞానమునందు లీనమగుచున్నవి. యజ్ఞదృష్టితో ఆచరించబడు కర్మలన్నియు తుదకు జ్ఞానోదయము గమ్యముగా గలవి. జ్ఞానమనగా అపరోక్షజ్ఞానము లేక అనుభవజ్ఞానము. కోరికలేకుండా భగవదర్పణ భావనతో చేసే కర్మే జ్ఞానయజ్ఞం. ఇక అటువంటి వానికి కోరికలు లేకపోవటం వలన కర్మఫలముతో పనిలేదు. కర్మ సమాప్తం అంటే కర్మలు జ్ఞానము నందు లయించటం. అంతేకాని కర్మలు చేయటం మానివేయటం కాదు (జ్ఞానము కలిగితే కర్మలు చెయ్యనక్కరలేదని భావము కాదు). వ్యక్తిగత ప్రారబ్ధము లేక పోయినప్పటికీ ఈశ్వర సేవారూపము, లోక సంగ్రహార్థము అయిన కర్మ, యోగికి, ఉండవచ్చును. తమకోసం కాకపోయినప్పటికీ లోక కళ్యాణముకోసమైనను నిష్కామ కర్మ చేయటం అవసరమేనని భగవానుని బోధ. అవతారపురుషులు నిర్వర్తించే కర్మలు ఇట్టివే. వారు లోకహితమునకై కర్మలు చేయుదురే కాని వారు కర్మఫలమును ఆశించరు.

పెద్దలను, అనుభవం కల తత్వవేత్తలనూ ప్రార్థించి, వినయంతో నమస్కరించి, భక్తి విశ్వాసాలతో, తెలుసుకోవాలన్న కోరికతో అడిగి ఇట్టి జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. అజ్ఞానం తొలగిపోతే జ్ఞానం దానంతట అదే ప్రకాశిస్తుంది. అప్పుడు అన్నింటిలోను భగవంతుని దర్శించ వచ్చును. ఈ జ్ఞానము కలుగుటచే సర్వభూతములందును తన యందును కూడా వ్యాపించియున్న ఒకే ఆత్మ స్వరూపమును చూడగల్గును.

జ్ఞానం అనుభవంతో పండించుకొనవలసినదే కాని, బోధలతోను, శాస్త్రాలు చదవటంతోను లభించేది కాదు. జ్ఞానం స్వతస్సిద్ధంగా ఉన్నదే; అయితే దానికి అడ్డుగా ఉన్న అజ్ఞానమనే పొరను తొల గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు తత్వవేత్తల, సద్గురువుల

ఆశ్రయం కావాలి. వారు అజ్ఞానం తొలగిపోవటానికి సాధన మార్గములను తెలియచేస్తారు. భూమి లోపల పొరలలో నీరు ఉంటుంది. మన కంటికి ఆ నీటిని కనబడకుండా చేస్తున్న మట్టి అనే పొరను తొలగిస్తే నీరు మనకు కనిపిస్తుంది. మనం చూడనప్పుడు కూడా నీరు అక్కడే వుంది. నీరు అక్కడ క్రొత్తగా సృష్టించబడలేదు. అయితే అక్కడ అడ్డుగా ఉన్న మట్టి పొరని తొలగించటానికి మనం ప్రయత్నం చెయ్యాలి కదా! అదే పురుషప్రయత్నం! ప్రయత్నం చేస్తేనే నీరు కన బడుతుంది.

అందుచేతనే ఆత్మ జ్ఞానం అనుభవంలోనికి రావాలి అంటే భక్తి, శ్రద్ధ, వినయం, జిజ్ఞాస (తెలుసుకోవాలనే ఆసక్తి) తో గురువును ఆశ్రయించాలి. అంతేకాని గురువుగారికి ఎంత తెలుసో పరీక్షిద్దామన్న ఉద్దేశంతో ప్రశ్నించకూడదు.

**"తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా !**
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః**
**గీత 4అ. 34 శ్లో.**

ఆత్మజ్ఞానమునకు గురువు అనుగ్రహం అతిముఖ్యమైనది. 'గురువు' అనే తెప్పను ఆధారంగా చేసుకుని సంసారసాగరాన్ని దాటడానికి ప్రయత్నించాలి. ఆకాశంలో ఉన్న సూర్యుడు బయట చీకటిని మాత్రమే పోగొట్టగలడు. కాని సద్గురువనే జ్ఞానసూర్యుడు శిష్యుని హృదయగుహ లోపల ఉన్న అజ్ఞానమనే చీకటిని నాశనం చేయగలడు. అందుచేత సూర్యకాంతికంటెను గురువు అనుగ్రహకాంతి గొప్పది. జ్ఞానము అనుభవవిషయమే కాని బోధనకు విషయముకాదు. తత్త్వవేత్తలు చేయుబోధన అంతయు అజ్ఞానమును గురించి, అది జ్ఞానమును ఎట్లు ఆవరించియుండునో, ఆ ఆవరణను తొలగించుట ఎట్లో, దానిగురించియే. ఈత్త్వబోధవలన అజ్ఞాన ఆవరణతొలగగా జ్ఞానప్రకాశము అనుభూత మగును. న ఇతి ... న ఇతి.... ఇదికాదు, ఇదికాదు... అని ఆత్మవిమర్శ చేయగా జిజ్ఞాసువునకు అపరోక్షబ్రహ్మానుభూతికలుగును. ఇదంతా బ్రహ్మ స్వరూపమే (సర్వం ఖల్విదం బ్రహ్మ) అను జ్ఞానం కలుగుతుంది.

ఈ ఆత్మజ్ఞానం రాబోయే కర్మలను , క్రిందటి జన్మలో చేసిన కర్మలను, ఈజన్మలోకాలానుగుణముగా అనుభవానికి వచ్చే కర్మలను

భస్మము చేయును. కాబట్టి జ్ఞానము చేత సందేహములను పోగొట్టుకొని, కోరికలను విడిచి నిష్కామంగా, నిస్వార్థంగా కర్తవ్యాన్ని యథాశక్తి నెరవేర్చాలి. కర్మలను చేస్తూ కర్మఫలాన్ని త్యాగంచేయాలి. అంతేకాని కర్మలను చేయటం మానకూడదు.

మనం ఆచరించునటువంటివి మూడురకములైన కర్మలు - నిత్యకర్మలు, నైమిత్తికకర్మలు, కామ్య కర్మలు. ప్రతిరోజూ చేసే స్నానం, భోజనం, ప్రార్థన వంటివి అన్నీ నిత్యకర్మలు, సంధ్యావందనాదులు, గృహస్థునకు అగ్నిహోత్రము నిత్యకర్మలు. ఒక గృహస్థు ఏదైనా ప్రత్యేకమైన కోరికతోకాని అగ్నిహోత్రాదులు చేస్తే అది కామ్యకర్మ అంటారు. (కామార్థియై చేయుకర్మ). కొంతకాలముతరువాత ఏదో ఒక కారణంచేత అకామననశించినప్పుడు (విడిచిపెట్టినపుడు) ఆతరువాత కూడా చేయబడు అగ్నిహోత్రాదులు కామ్యకర్మలు కావు. వాటిని నిత్యకర్మలనే అంటారు. ఒకకారణాన్ని ఆశ్రయించి అప్పుడప్పుడు చేసే పితృసంబంధమైన శ్రాద్ధకర్మాదులు నైమిత్తిక కర్మలు. కోరికలు సిద్ధించటం కోసం చేసే పూజలు, నోములు, వ్రతాలు వంటివి కామ్య కర్మలు.

**కర్మములు మేలునిచ్చును, గర్మంబులు కీడునిచ్చు, కర్తలుదనకున్**
**గర్మములు బ్రహ్మకైనను, గర్మశుద్దై పరులదడవగా నేమిటికిన్**
**కావున పరులకు హింసలు, గావింపగవలదు తనకు గళ్యాణముగా**
**భావించి పరుల నొంచిన, బోవునె తత్ఫలము పిదప బొందక యున్నె.**

కామ్యంతో అంటే కోరికతో కర్మ చేస్తే ఆఫలితం మంచైనా, చెడ్డైనా, ఆఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మఎత్తాలి. అందువల్ల అట్టికర్మలు బంధానికి కారణమౌతాయి. అటువంటి కర్మలను విడిచి పెట్టడం సన్న్యాసం. కర్మఫలాన్ని త్యాగం చేయుటయే నిజమైన సన్న్యాసం.

విధిగా చెయ్యవలసిన కర్మలను ఎప్పుడూ విడిచిపెట్టకూడదు. మోహంతోనో, సోమరితనంతోనో విడిచి పెడితే అదితామస సన్న్యాసం కాని నిజమైనదికాదు.

సాధకులకు కర్మలు చిత్తశుద్ధిని కలిగిస్తాయి. శరీరం కష్టపడుతుందని, దుఃఖం కలుగుతుందని చెయ్యవలసిన కర్మలను

విడిచి పెట్టటం రాజససన్న్యాసం. దానివలన సుఖశాంతులు కలగవు. అలా కాకుండా శాస్త్రం విధించిన కర్మలను వర్ణాశ్రమ ధర్మములకు సంబంధించిన కర్మలను ఫలాపేక్షలేకుండా కర్తవ్య భావంతో చేయటం సాత్త్వికత్యాగం.

కోరికతో చేసే కర్మలన్నీకూడా బంధాన్నే కలుగచేస్తాయి. ఈకామ్య కర్మలు కర్మఫలమును అనుభవించితేకాని జీవుని వదిలిపెట్టవు. అప్పు ఇచ్చినవాడు తన అప్పును రాబట్టుకునే దాకా ఎలా వదిలిపెట్టడో ఈకర్మలు కూడా మంచి కాని, చెడుకాని కర్మఫలాన్ని అనుభవిస్తే కాని వదిలిపెట్టవు. తెలియకుండా వేసుకున్నప్పటికీ బెల్లం నోటికి తీపిని కలిగిస్తుంది. అలాగే తెలియక వేసుకున్నప్పటికీ నిప్పురవ్వ నోటిని కాల్చివేస్తుంది. అందువలన తెలిసిచేసినా, తెలియకచేసినా ఇట్టికర్మలఫలితం అనుభవించే తీరాలి. మోక్షం పొందగోరేవారు. వినోదంకోసం కూడా కామ్యకర్మలను చేయరాదు. కామ్య కర్మలను విషం వలె విడిచి పెట్టాలి. కామ్యకర్మములను విడిచి పెట్టటం సన్న్యాసం.

ఏదో ఒక నిమిత్తమును ఆధారముగా చేసుకుని చేసే కర్మలు నైమిత్తిక కర్మలు. పితరుల శ్రాద్ధకర్మలు, చంద్ర సూర్యగ్రహణాదుల యందు చేసే జపముల వంటివి-ఇటువంటివి నైమిత్తిక కర్మలు. ఏకర్మలయందు తనకు సహజముగా కర్తవ్యం ఉండుటం వలన వాటిని చేయనిదే మనుష్యుడు ఏవిధంగానూ ముక్తుడు కాలేడో ఆకర్మలను "నిత్యకర్మలు" అంటారు. ఈనిత్య నైమిత్తిక కర్మలను నిష్కామంగా ప్రతి ఒక్కరూ ఆచరించియే తీరాలి. భోజనము చేయటంవలన ఏవిధంగా ఆకలి తీరి సంతృప్తి కలుగుతుందో అదే విధముగా నిత్యనైమిత్తిక కర్మలవలన కూడా అన్నివైపులనుండి ఫలప్రాప్తి కలుగుతుంది. కర్మలను విధిపూర్వకంగా ఆచరించటం వలన మంచి ఫలము కలుగుతుంది. అంతేకాక దోషములన్నీ తొలగిపోతాయి. మనుష్యునికి జ్ఞానమార్గమునందు అధికారము వృద్ధి అవుతుంది. సద్గతి కలుగుతుంది.

నిత్యనైమిత్తిక కర్మలను ఆచరించటం వలన ఇంతగొప్ప ఫలములు లభించినప్పటికీ ఈకర్మలయొక్క ఫలమును కూడా విడిచి పెట్టాలి. అనగా ఫలాన్ని మాత్రమే వదిలిపెట్టాలి. కాని కర్మాచరణ వదలి

పెట్టకూడదు. ఫలితాన్ని ఆశించకుండా లక్ష్యముతో శ్రద్ధతో ఆయాకర్మలను ఆచరిస్తూ ఉండాలి. ఆకర్మలవలన కలిగే ఫలాన్ని ఈశ్వరార్పణంగా వదిలిపెట్టాలి. ఈవిధమగు కర్మఫలత్యాగాన్నే జ్ఞానులు "త్యాగము" అని అంటారు. ఈవిధమైన సన్న్యాసం వలన ఈకర్మలు బంధంకావు. ఇక చేయకూడనటువంటి నిషిద్ధకర్మలు ఎలాగైనా వదిలి పెట్టవలసిందే.

మొదలు నశిస్తే చెట్టుపూర్తిగా పడిపోయిన విధంగా ఫలత్యాగం వలన నిత్యనైమిత్తిక కర్మలన్నీ కూడా తమంతతామే నశించిపోతాయి. ఆవిధంగా కర్మలన్నియు నశించటంవలన ఆత్మజ్ఞానము తనంతతానే జీవుని వెదుక్కుంటూ వస్తుంది. త్యాగము మరియు సన్న్యాసము రెండింటినీ ఆచరించే వాళ్ళు ఆత్మజ్ఞానం పొందటానికి కావలసిన సాధనమును సంపాదించిన వాళ్ళవుతారు. వదిలిపెట్టకూడని దానిని వదిలిపెట్టకూడదు. వదిలిపెట్టవలసిన దానిని వదిలిపెట్టకుండా ఉండకూడదు. ఇటువంటి వివేకము లేకుండా చేసే త్యాగం వ్యర్థం.

**త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।**
**యజ్ఞదాన తపః కర్మనత్యాజ్యమితి చాపరే ॥**

**గీత. 18 అ. 3శ్లో**

ప్రతికర్మయందును ఏదో ఒక దోషము ఉండుటచే కర్మలు త్యజించవలెనని కొందరు అంటూ వుంటారు. మరికొందరు యజ్ఞదానతపః కర్మలు వేదవిహితములగుటచే వదిలిపెట్టరాదని అందురు.

చాలమంది కర్మఫలమునందలి ఆశను విడువలేరు. అందువల్ల వారు కర్మలన్నింటినీ బంధకరములే అంటారు. దుర్బలమైన మనస్తత్వం కలవారు కావటంచేత లోభమునకు చిక్కుబడి ఫలత్యాగాన్ని చేసే సమర్థత లేకపోవటంచేత మొత్తం కర్మలనే చెడ్డవని చెప్పి అందుచేత కర్మలనే మొత్తం విడిచిపెట్టాలి అని నిర్ణయించుకుంటారు. "విగ్రహం చెక్కలేనట్టి శిల్పి పరికరాలు సరిగాలేవు" అన్నట్లుగా ఉంటుంది. వారి నిర్ణయం.

మనసును శుద్ధిచేసుకోవాలంటే కర్మమార్గం ఉత్తమమైనది. కష్టం కలిగిస్తాయేమో నన్నకారణంగా కర్మలను వదిలిపెట్టకూడదు. ఉత్తములైన వారిని ఆశ్రయించి, వారిని అనుసరించటం వలన మాత్రమే మోక్షము లభిస్తుంది.

**యజ్ఞదాన తపః కర్మనత్యాజ్యం కార్యమేవతత్ ।**
**యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥**
**గీత 18 అ. 5 శ్లో**

కర్మత్యాగ విషయమున భగవానుడిచ్చిన నిశ్చితమైన తీర్పు – "యజ్ఞదానతపః కర్మలను సన్న్యసింపకూడదు. అవి చేసియేతీరవలెను" యజ్ఞము, దానము, తపస్సు మానవులను పావనముచేయు సాధనములు. మనముచేసే నిత్యకర్మలు కూడా యజ్ఞం వంటివే. ఆకర్మలనే యజ్ఞంగా భావించి శ్రద్ధగాచెయ్యాలి. ఏదోచేస్తే చాలునన్న ఉదాసీన భావంతో కాకుండా శ్రద్ధతో, ఉత్సాహంతో, శక్తినంతా ఉపయోగించి చేయవలసిన పనిని చక్కగా చెయ్యాలి. ఇంటిపని కాని, ఉద్యోగ నిర్వహణ కాని ఏపని అయినా ఎవరివంతు పనిని వారు బాధ్యతాయుతంగా, శ్రద్ధగా చెయ్యాలి.

కర్మలను చక్కగా ఆచరించటంవలన మానవుడు సహజంగానే నిష్కాముడవుతాడు. ఇలాచేస్తూ ఉండటంవలన రజస్సు, తమస్సు అనేటువంటి గుణములు కూడా నశిస్తాయి. పుటముపెట్టినకొద్దీ బంగారం మాలిన్యం తొలగి ఎలా ప్రకాశిస్తూ ఉంటుందో ఆవిధంగానే నిష్ఠతో కర్మములు ఆచరించిన రజస్సు, తమస్సులనే మాలిన్యమును తొలగించి సత్త్వ గుణమును ప్రకాశింపచేస్తాయి. స్నానమాత్రము వలన బాహ్యమైన మురికిమాత్రమే పోతుంది కాని, సత్కర్మలనే తీర్థాలలో మునిగినవానికి ఆంతరంగికమైన మాలిన్యముకూడా తొలగి పవిత్రతచేకూరుతుంది.

ఔషధంసేవించటం వలన "విషముచేత మరణించబోయేవాడు" కూడా బ్రతికినట్లు ఈకర్మలు ముముక్షువును బంధమునుండి విడిపిస్తాయి. కర్మలవలన కలిగే బంధం కర్మఫలత్యాగము చేతనే తొలగిపోతుంది. సకామ కర్మలవలన కలిగే బంధాన్ని విడగొట్టడానికి నిష్కామ కర్మలే సాధనం. కాబట్టి కర్మలు ఇటువంటి విచిత్రమైన లక్షణాన్ని కలిగివున్నాయి. "వజ్రాన్ని వజ్రంతో కొయ్యాలి", "విషానికి విషమే విరుగుడు" అని పెద్దలు అన్నట్లుగా కర్మబంధమును కర్మాచరణం వలననే తొలగించుకోవాలి.

**ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలానిచ ।**
**కర్తవ్యానీతిమే పార్థః నిశ్చితం మత ముత్తమమ్ ॥**
**గీత 18అ. 6శ్లో.**

యజ్ఞదాన తపాదులేకాక ఇతర కర్మలను కూడా కర్తృత్వా-భిమానమును, ఆసక్తిని వదిలి కర్తవ్య దృష్టితో చేయవలెనని భగవానుని నిశ్చితాభిప్రాయము. కర్మలను ఆచరించేటప్పుడు ఏమాత్రము కూడా కర్మకు కర్తను నేనే అనునటువంటి అహంకారము కలుగనివ్వకూడదు. తాను చేయునటువంటి కర్మలయొక్క ఫలము వైపునకు మనసును పోనివ్వకూడదు. ఆరంభముననే అన్ని కర్మలనూ ఫలాశను విడిచిపెట్టి ప్రారంభించాలి. అందుకే యజ్ఞయాగాదులు చేసేటప్పుడూ, వ్రతాలు, దానాలు మొదలైన పుణ్యకార్యములు చేసేటప్పుడూ చివర "నమమ" అని చెప్పించి చేయిస్తారు. "పని చెయ్యటమే మనవంతు. ఫలితం మనదికాదు. ఆనిర్ణయం భగవంతునికే విడిచిపెట్టాలి. ఫలాశలేకుండా కర్మలను నిర్వికారమైన మనసుతో చెయ్యాలి. అప్పుడు ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళనకాని, ఫలితం పట్ల లోభం కాని, అహంకార మమకారములు కాని ఉండవు. ఈవిధంగా ఎవరైతే కర్మలను ఆచరిస్తారో వారికి ఆత్మజ్ఞానము తప్పక కలుగుతుంది. కనుక దేహాభిమానమును విడిచి యధావిధిగా సమస్త కర్మలను ఆచరించవలెను. ఇది భగవానుడిచ్చిన సర్వోత్తమ సందేశము. మోక్షమును కోరువారు ఎన్నటికినీ ఈనియమమును ఉల్లంఘించకూడదు.

చీకటిపై అలిగి తమకళ్లను తామే పొడుచుకున్న విధంగా కర్మఫలబంధముపై కోపగించుకొని కర్మలనే ఆచరించకుండా ఉండటాన్ని "తామసత్యాగము" అంటారు. మార్గము కఠినముగా ఉన్నప్పుడు ఏదో ఒక విధంగా అడుగు ముందుకు వెయ్యటానికి ప్రయత్నించాలి కాని దారి సరిగా లేదని మన పాదములనే నరకి వేసుకొనతగునా ! భ్రమకు లోనైటువంటి తామసపురుషుడు సకామ కర్మలవలన కలిగెడి బంధమును నిష్కామకర్మలద్వారానే పోగొట్టుకొనవలెనని తెలిసికొనడు.

కర్మలలో శాంతికర్మలనీ, పౌష్టిక కర్మలనీ ఉంటాయి. పూర్వజన్మ ప్రార్థము వలన ఒకనికి ఏదైనా అనారోగ్యం కలిగితే ఆజబ్బును నయం చేయటానికి చేయవలసిన జపతపాదులు శాంతి కర్మలు, ఉద్యోగములో, వ్యాపారములో అభివృద్ధి మొదలగు వానికొరకు చేయునవి పౌష్టిక కర్మలు. ఈ శాంతి, పౌష్టిక కర్మలు రెండూ సకామ కర్మలే. ఈసకామ

కర్మలను ఆచరించుట వలన ప్రత్యక్షఫలము ఉన్నట్లు కనబడినను, అవి కర్మ బంధమును తగ్గించుకొనుటకు తోడ్పడవు. కర్మబంధమును నశింపచేయుటకు, అజ్ఞాన నివృత్తికి పనికిరావు. అయితే కాలాంతరములో సజ్జనసాంగత్యమునకు తోడ్పడి, తద్వారా మంచిమార్గమునకు దారితీయవచ్చును. పూర్వజన్మలో చేసిన సకామ కర్మవలన కలిగిన బంధము, ఈజన్మలో చేయు నిష్కామకర్మవలన పూర్తిగా తొలగిపోవును,. నిష్కామకర్మమాత్రమే కర్మబంధమును పోగొట్టుకొనుటకు సరైన మార్గము.

శారీరకమైనటువంటి కష్టములకు భయపడి కర్మలను విడిచి పెట్టువాడు రాజసత్యాగి. ఇందులోకూడా త్యాగం ఉన్నది. కాని మోక్షఫలప్రాప్తిలేదు. శరీరము ప్రయాసపడునని భావించి చెయ్యవలసిన కర్మలను విడిచిపెట్టు వానికి కర్మఫలత్యాగములభించదు.

నేను కర్తను అనెడు అభిమానము, కర్మఫలమునందలి ఆసక్తి (లోభము) కర్మలలోని బంధత్వములు. ఈరెంటినీ మనసులోనికి రానివ్వకుండా ఉంటే కర్మ, బంధాన్ని కలిగించదు. యోగ్యమైనవి, స్వాభావికమైనవి అయినట్టి కర్మలు మానవునకు ఎప్పుడూ దుఃఖాన్ని కలిగించవు. ఇట్టి త్యాగమే సాత్వికమైన త్యాగము.

కర్మఫలబంధము, రజస్తమోగుణములు నశించినపుడు ఆత్మజ్ఞానము కలుగుతుంది. అందుచేతనే ప్రారబ్ధకర్మము వలన మనుష్యునకు ప్రాప్తించునట్టి మంచి చెడ్డ కర్మలు "వాయువేగమువలన ఆకాశములోని మేఘములు చెదరిపోవునట్లు" జ్ఞానుల విషయంలో లోపించిపోతాయి.

అటువంటి జ్ఞాని సుఖదుఃఖములనెడి లంపటమునందు చిక్కుకొనడు. ఇంతేకాక అతడు కర్మములను శుభములని తలచి ఆనందముతో చేయటంకాని, దుఃఖమని ద్వేషించటంకాని చేయకుండా, కర్తవ్యములని మాత్రమే తలచును. ఇందుకు ఉదాహరణగా భాగవతమునందు చెప్పబడిన జడభరతుని కథను చెప్పుకొనవచ్చును.

"పూర్వము మనదేశమును "అజనాభము" అనేవారు. ఋషభుని కుమారుడైన భరతుడు పాలించుటచేత ఈదేశమునకు భారతదేశము అని పేరు వచ్చింది. ఆ భరతుడు చాలకాలం ఈదేశాన్ని పరిపాలించి,

వృద్ధాప్యంలో వానప్రస్థమును స్వీకరించి యోగిగా ఉంటూ, ఒకలేడి పిల్లపై మమకారం పెంచుకొని, ఆలేడిపైకల మమకారంతో చని పోయేటప్పుడు కూడా ఆ లేడి కూననే తలచుచూ మరణించటంవలన మరుజన్మలో భరతుడు లేడిగా జన్మించాడు. కాని అతడు సాధించిన యోగము కారణంగా లేడిగా జన్మించినప్పటికి పూర్వజన్మస్మృతిని కోల్పోలేదు. లేడిగా ప్రారబ్ధకర్మను అనుభవించిన తరువాత భరతునిగా పుట్టి, జడపదార్థమువలె నిర్వికారమైన మనస్తత్వమును కలిగి ఉండుటచేత జడభరతునిగా అతనిని వ్యవహరించేవారు. ద్వేషానికి లొంగక, దుఃఖానికి క్రుంగక, సుఖానికి పొంగక నిర్వికారమైన మనసుతో ప్రవర్తించేవాడు. రాజుగారికి సంతానం కలగటంకోసం అతనిని కాళికాలయంలో రాజభృత్యులు కాళికాదేవికి బలి ఇవ్వటానికి కరవాలం ఎత్తినా అతడు చలించలేదు. కాళిలోను, కరవాలంలోను, చంపవచ్చినవారిలోను అతనికి ఒకే పరమాత్మ స్వరూపంగోచరించినదని భాగవతములో పోతనగారు అతని సమాధిస్థితిని వర్ణించారు. అన్నింటిలోను దైవమునే చూడగలిగిన జడభరతుడు కాళీమాత అనుగ్రహంచేత రక్షింపబడినాడు. అయితే రక్షింపబడినందుకు ఆతడు ఆనందించలేదు. తనను చంపవచ్చిన రాజభటులను నిందించనూలేదు. అని జడభరతునికథ భాగవతమునందు చెప్పబడినది. నవీనకాలంలో అరవిందయోగి గారి జీవితములో ఇట్టి అనుభవమే కలిగింది. ఆలీపూరు బాంబుకేసులో అరవింద ఘోష్‌గారిని అరెష్టుచేసి కొంతకాలం జైలులో ఉంచి తరువాత కేసు విచారించటం జరిగింది. ఆకేసు విచారణ సమయంలో కేసువిచారించుచున్న న్యాయ వాదులు, జడ్జి, కోర్టులోని ఇతరజనము, తాను, అందరూ శ్రీకృష్ణ స్వరూపముగా అరవిందయోగికి స్పష్టముగా కళ్ళు తెరచియున్న సమయము లోనే గోచరించినదట. "వాసుదేవస్సర్వమితి సమహాత్మాసు దుర్లభః అను గీతా వాక్యములో చెప్పిన భావము అరవిందయోగికి వారి యోగానుభవములో సిద్ధించినది. ఇది వారి జీవిత చరిత్రలో వ్రాయబడి ఉన్నది. బ్రహ్మానుభవం అంటే ఇదే. అంతా బ్రహ్మ మయమే. తాను, తన ఎదుట, తనలోపల, వెలుపల చుట్టూ అంతా బ్రహ్మమయమే. "సర్వంఖల్విదంబ్రహ్మ" అన్న మహావాక్యంలోని అర్థం ఇదే. ఇది అనుభవపూర్వకంగా తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. అట్టిస్థితిని

పొందటమే జీవితపరమార్థం.

**"స్వకాలే సత్యవత్ భాతి ప్రబోధే అసత్యవత్ భవేత్"**

**ఆత్మబోధ (శ్రీశంకరులు)**

కలలో మనం అనుభవించిన కష్టాలు, సుఖాలు నిజంకావనీ, మిధ్య అనీ మెలకువరాగానే ఎలా తెలుసుకొని మరచిపోతామో అదేవిధంగా అజ్ఞానమనేటువంటి నిద్రనుండి మేల్కొని ఆత్మజ్ఞానం పొందాక ఈశరీరము, జగత్తు, ప్రాపంచిక కష్టసుఖాలు అంతా మిధ్యగా కనిపిస్తాయి. అందుకే జగద్గురువులు శ్రీశంకరులు

**బ్రహ్మసత్యం - జగన్మిధ్య**

**జీవో బ్రహ్మైవ నాపరః**

"అనగా బ్రహ్మయే సత్యము. ఈజగత్తు సత్యముకాదు. జీవుడే ఆ బ్రహ్మము కాని మరొకటి కాదు" అన్నారు.

కర్తలందరూ భగవత్స్వరూపులేనని, కర్మలన్నియు భగవంతుని యందే జరుగుచున్నవని తెలుసుకొనుట సాత్త్వికజ్ఞానము. శరీరము ధరించికూడా కర్మలు చేయకుండా జడము వలె ఉండేవారు పరమ మూర్ఖులు అని తెలుసుకోవాలి. భగవంతుడు మనకు ప్రసాదించిన శరీరం అనే ఈ అపురూపమైన వరాన్ని ధర్మమార్గంలో కర్మను ఆచరించటం ద్వారా మోక్షాన్ని పొందటానికే వినియోగించి "శివం" గా మారటానికి ప్రయత్నించాలి. అందుకే పెద్దలు "శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్" అన్నారు. (ధర్మసాధనములలో శరీరము మొదటి సాధనము). "ఆరోగ్యమే మహాభాగ్యము" అనికూడా పెద్దలు చెపుతుంటారు. జీవితపరమార్థమును సాధించటానికి ఉపయోగపడే ఈశరీరమును ఆరోగ్యంగా, శుచిగా ఉంచాలి.

**దేహో దేవాలయ ప్రోక్తో జీవోదేవస్సనాతనః**

**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోహంభావేన పూజయేత్ ॥**

దేహమే దేవాలయము. జీవుడే సనాతనుడైన దేముడు అని పెద్దలచేత బాగుగా చెప్పబడినది. నిన్నటిరోజున పూజ చేయబడి ఈరోజున వాడిపోయిన పూలను "నిర్మాల్యము" అని అంటారు. అజ్ఞానమను

నిర్మాల్యమును తొలగించవలెను. 'సోహం' భావముతో అనగా ఆపరమాత్మయే నేననుభావముతో పూజించవలయును.

కాబట్టి జీవుడనే దైవము కొలువుండే ఈశరీరమనే ఆలయాన్ని ఎల్లవేళలా శుచిగా, శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి. సాత్త్వికమైన ఆహారాన్ని మితంగా తీసుకుంటూ శరీరాన్ని రక్షించుకోవాలి. అన్ని ఇంద్రియములనూ సాత్త్వికమైన కర్మాచరణలో ప్రవేశపెట్టాలి. కళ్ళతో మంచినే చూడాలి. చెవులతో మంచి విషయములనే వినాలి. చేతులతో మంచిపనులనే చేయాలి. నాలుకతో మంచిమాటలనే మాట్లాడాలి. కాళ్ళతో మంచి ప్రదేశాలకే వెళ్ళాలి. అపవిత్రమైన స్థలాలకు వెళ్ళకూడదు. ఏదివిన్నా, ఏమిచేసినా, ఏదిచూసినా అంతా భగవదర్పణ భావముతో చేయాలి. అన్ని ఇంద్రియములనూ భగవంతుని సేవకే వినియోగించి, జీవిత పరమార్థమైన ముక్తిని సాధించటానికే వినియోగించాలి. దీనినే పోతనగారు భాగవతంలో ప్రహ్లాదునిచేత అతిమధురంగా పలికించారు.

"కమలాక్షునర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు
జిహ్వాజిహ్వ
సురరక్షకుని జూచుచూడ్కులు చూడ్కులు; శేషసాయికి మ్రొక్కు శిరము
శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు, మధువైరి దవిలిన మనము మనము
భగవంతుదలగొనుపదములు, పదములు; పురుషోత్తముని మీదిబుద్ధి
బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము, చక్రహస్తుని ప్రకటించు చదువు
చదువు
కుంభినీధవు చెప్పెడి గురుడు గురుడు దండ్రి ! హరిజేరుమనెడి తండ్రి
తండ్రి
శ్రీమద్భాగవతము ప్రహ్లాదచరిత్ర.

ఈ విధముగా భగవంతుని సేవకై వినియోగించబడని ఇంద్రియములు ఎందుకూ కొరగానివి.

నిష్కామ భావనతో చేసే సత్కర్మాచరణ తప్పక మోక్షాన్ని

కలిగిస్తుంది. కర్మలను ఆచరిస్తూ వాటి ఫలములను స్వీకరించని వారు మాత్రమే ఈసంసార చక్రమునందు చిక్కుకొనరు. ఈప్రపంచమంతా కూడా కర్మఫలమే. ఇష్టము, అయిష్టము, మిశ్రమము - ఇవి మూడూ కర్మఫలములోని రకములు.

విషయములకే బుద్ధి అంకితమై జీవులు అధర్మ ప్రవృత్తి కలిగి దుష్టకర్మలను చేసినప్పుడు ఆజీవులు క్రిమికీటకాలు, మట్టి, బండలవలె జడబుద్ధిగల నీచశరీరాన్ని పొందుతారు. ఇది "అనిష్ట కర్మఫలము". స్వధర్మమును ఆచరిస్తూ తన అధికారంపై దృష్టిని వుంచి వేద శాస్త్రానుసారంగా పుణ్యకర్మలను ఆచరించే జీవులు దేవతల యొక్క ఉత్తమ శరీరాన్ని పొందుతారు. దీనినే కర్మల యొక్క "ఇష్టఫలము" అంటారు. శుభాశుభఫలమిశ్రమము వలన కలిగెడి కర్మఫలము వలన మనుష్యదేహము ప్రాప్తించును. దీనినే కర్మల యొక్క "మిశ్రమ ఫలము' 'గా తెలుసుకొనవలెను. ఈమూడు విధములైన కర్మఫలములే ఈ ప్రపంచమునందంతటను వ్యాపించియున్నవి. జీవుడు ఒక మారు ఒక ఫలమును భోగించగనే అనేక ఇతర కర్మలను కూడా ఆచరించుచునే యుండును. ఈవిధముగా కర్మఫల అనుభవమునకు అంతమే ఉండదు. సాధ్య సాధనల నిమిత్తముచే ఫలబోగము నిరంతరము విస్తరించుచునే ఉండును. కర్మఫలమును త్యాగము చేసిన వారు మాత్రమే కర్మలను అంతమొందించుకొనగలరు. ఇట్టివారు సత్త్వశుద్ధి బలముచేత, గురుకృపా మృతముచే నిండియున్న ఆత్మ బోధచేత పరిపూర్ణులగుదురు. వారికి గల ద్వైతభావము నశించి త్రివిధ కర్మఫలములుకూడా నశించిపోవును. ఈవిధమగు జ్ఞాన ప్రధానమైన సన్న్యాసమును గైకొన్నవారు మాత్రమే నిజమునకు ఫలభోగవాసనలను అంతమొందించగలరు. ఈవిధమగు సన్న్యాసము వలన ఆత్మస్వరూపమునందు దృష్టి విస్తృతమై నప్పుడు ఇక కర్మలు బంధకారణములా కావా అనెడి ప్రశ్న ఉదయించుటకు అవకాశమే ఉండదు. మూలవస్తుస్వరూపమే నాశనమైనప్పుడు ఇక దాని ఛాయ ఎక్కడ పడుతుంది ? మూల అవిద్యా నాశనమైనప్పుడు ఇక దాని కార్యమగు కర్మఫల వ్యాపారము జరుగుటకు అవకాశము ఎక్కడిది ?

కాని, మానవుని శరీరంలో అవిద్య ఉన్నంతవరకూ, ఆత్మకర్తృత్వ

అభిమానము వలన శుభాశుభములైన అన్ని కర్మలూ వెంటాడుతూనే ఉంటాయి. జీవులలోను కర్మలలోనూ కూడా భేదము కనబడుతుంది. కాని, ఈభేదము ఎప్పుడు కనిపిస్తుంది ? ఈభిన్నత్వమును తెలుసుకోవటానికి అజ్ఞానము అవకాశమిచ్చినప్పుడు మాత్రమే ఈ భేదము కనిపిస్తుంది.

## కర్మకుగల కారణములు

ఈ సంసారమునందలి సమస్త కర్మలూ జరగటానికి గల కారణములు ఐదు.

**పంచైతాని మహాబాహో కారణాని నిబోధమే !**
**సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్॥**
**గీత 18 అ. 13 శ్లో.**

సర్వకర్మలూ సిద్ధించుటకు ఈ ఐదూ కారణములు అని పూర్వము సాంఖ్య శాస్త్రమునందు చెప్పబడినది.

**అధిష్ఠానం తథాకర్తాకరణం చపృథగ్విధమ్**
**వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్రపంచమమ్ ॥**
**(భగవద్గీత-18వ అధ్యాయం)**

1. కర్మాచరణమునకు ఆధారమైన శరీరము, 2. కర్తృత్వాభిమానము వహించి అహంకరించుజీవుడు, 3. కర్మాచరణకు ఉపయుక్తమగు వివిధములగు పరికరములు (ఇంద్రియములు ఆంతరంగిక పరికరములు; వస్తువులు బాహ్య పరికరములు) 4. వివిధములైన క్రియలు (చేష్టలు), 5. దైవము లేక విధి (పూర్వజన్మ కర్మఫలములు లేక ప్రారబ్ధము). ఈ ఐదు కూడా సమస్త కర్మలకు కారణములు. సమస్త కర్మలూ ఈ అయిదు కారణములవలననే జరుగుతాయి. కాని ఆత్మకు ఈకర్మలు వేటితోనూ సంబంధములేదు. ఆత్మ కేవలము తటస్థము. ఆత్మహేతువూకాదు. నిమిత్త కారణమూకాదు. అంతేకాక కర్మలు సిద్ధించటం కోసము ఆత్మ ఎట్టి ప్రయత్నమూ చేయదు. ఆకాశంలో రాత్రి పగలూ ఏర్పడుతూనే ఉన్న విధంగానే ఆత్మ ప్రకాశం వలన శుభాశుభకర్మలు సంభవిస్తూ

ఉంటాయి. కాని, ఆత్మకు వీటితో సంబంధములేదు. సూర్యుని కాంతిలో లోకులు పనిపాటులు చేసుకుంటూ ఉంటారు. కాని సూర్యునికి ఈపనిపాటులతో సంబంధములేదు.

పైన చెప్పబడిన ఐదు కారణములలో మొదటిది దేహము. దీనిని "అధిష్ఠాన కారణం" అని అంటారు. ఎందువలననగా ఈదేహమున భోక్త, తనభోగ్య విషయములతో కూడి నివసించును. ఇంద్రియములు రాత్రిం బవళ్ళు కష్టిస్తూ ఉంటాయి. వాటి ద్వారా ప్రకృతి బలముచేత లభించే సుఖ దుఃఖములను అనుభవించటానికి పురుషుని వద్ద ఈదేహము తప్ప మరే సాధనమూ ఉండదు. ఇందువలన ఈదేహమును "అధిష్ఠానము" అని అంటారు. కర్మకు గల రెండవ కారణము "కర్త". ఈకర్తనే చైతన్యమునకు ప్రతిబింబము లేక చిదాభాసుడు అని అంటారు. ఒక్కొక్కప్పుడు నిద్రలో రాజు తనను తాను మరచిపోవును. అప్పుడు అతడు స్వప్నములో తాను దరిద్రుడనైపోయితినని భావిస్తూ ఉంటాడు. ఇదేవిధముగా చైతన్యమునకు కూడా ఆత్మస్వరూపము మరుపునకు వచ్చి ఈదేహమే తానని భావించటం జరుగుతుంది. ఆతరువాత చైతన్యము దేహాభిమానము వలన అనేక విధములుగా అభినయిస్తూ ఉంటుంది. ఆత్మస్వరూపమును మరచిపోయి జీవుడని పిలువబడుతూ, దేహమే తానుగా భావిస్తూ భ్రమపడి ప్రకృతివలన జరుగుచున్న కర్మలన్నింటిని నేనే చేస్తున్నానని అనుకునే జీవాత్మయే కర్త.

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః**
**అహంకార విమూఢాత్మాకర్తాzహమితి మన్యతే**
**గీత 3అ. 27 శ్లో**

ప్రకృతియొక్క గుణముల చేత చేయబడుచున్న సర్వవిధములైన కర్మములకు అహంకారముచేత విమూఢుడైనవాడు నేనే కర్తను అని తలచును.

## కర్మకు గల మూడవకారణము "పృధగ్విధకరణములు"

బుద్ధికి గల జ్ఞానశక్తి ఒకే స్వరూపము కలదైనప్పటికీ బాహ్య ఇంద్రియముల ద్వారా అది వేరు వేరు రూపములుగా ప్రకటమౌతుంది.

దీనినే "పృథగ్విధకరణము" అని అంటారు. ఇది కర్మలకు గల మూడవ కారణము. ఇట్లే ప్రాణ శక్తికూడా భిన్నభిన్నమైన రీతులలో వివిధములైన క్రియలు జరగటానికి కారణమవుతుంది. ఇట్టి ప్రాణశక్తి లేక వాయుశక్తి కర్మకుగల <u>నాలుగవకారణము.</u>

వాయువునందు గల అఖండ ఏక స్వరూప క్రియాశక్తి కూడా భిన్న భిన్న స్థానము లందు ప్రాప్తించుట వలన భిన్న భిన్న స్వరూపము కలదిగా తోచును. ఆ వాయుశక్తి వాక్కులోనికి వచ్చినప్పుడు మనుష్యుడు మాటాడసాగును. చేతిలోనికి వచ్చినప్పుడు ఇచ్చుట పుచ్చుకొనుట ఇంకా ఇతర చేతి పనులు చేయును. పాదములలోనికి వచ్చినప్పుడు నడువసాగును. అపాన వాయు ధర్మము చేత మలవిమోచనాదులు జరుగును. మరల ఆ వాయువే నాభినుండి హృదయము వరకు ఓంకారమును ప్రకటమొనర్ప సాగునప్పుడు దానిని "ప్రాణవాయువు" అని అందురు. ఆ శక్తియే పైనున్న భాగమున ప్రవేశించినప్పుడు 'ఉదానవాయువు' అని అంటారు. ఆ వాయువే అధో ద్వారమున ప్రవహింపసాగినప్పుడు 'అపానవాయువు' అని అంటారు. అది శరీరము నందు అంతటను సమానముగా ప్రవహించసాగినపుడు 'వ్యానవాయువు' అని అంటారు. మనము భుజించిన అన్నరసమును ఈ వాయుశక్తియే శరీరమునందలి వివిధభాగములకు చేర్చును. ఈ విధముగా నలువైపుల తిరిగి ఆ క్రియా శక్తి అంతమున నాభియందు స్థిరపడును. దానిని 'సమాన వాయువు అని అంటారు.

ఆవులింత, తుమ్ము, త్రేనుపు, మొదలగు రూపములలో పని చేయు క్రియలు నాగము, కూర్మము మరియు కృకరము మొదలగు నవైయున్నవి. మరణించిన పిదప కూడా శరీరమనందు కొంత కాలమువరకు ప్రసరించు వాయువును 'ధనంజయ వాయువు' అని అంటారు.

అంతఃకరణములోని సమస్త వృత్తులందునూ ఒక్క బుద్ధియే శ్రేష్ఠమైనది. ఇంద్రియముల ఆకాశముచే అది ఇంకను బాగుగా ప్రకాశించుచుండును. ఆ ఇంద్రియాకాశమునందు వాటి అధిదేవతా మండలము ఇంకను అత్యధిక శోభాయమాన మగును. నేత్ర, రసేంద్రియ

రూపములకు వాటి వెనుక వాటికి తమ కృపచే బలమును ప్రసాదించెడి సూర్యుడు మొదలుగా గల దేవతా మండలము ఉండును. ఈ దేవతా మండలమే కర్మలు జరుగుటకు గల ఐదవ కారణము. అనగా ఒక్కొక్క ఇంద్రియమునకు ఒక్కొక్క దేవత అధిపతిగా ఉండును. ఈ దేవతలే ఆ ఇంద్రియములు చేయు పనులకు గల ఐదవ కారణము. నేత్రములు - సూర్యుడు, మనసు - చంద్రుడు, బాహువులకు అశ్వినీ దేవతలు, చెవులకు దిక్కులు అధిదేవతలు. వాక్కునకు బృహస్పతి చరణములకు ప్రజాపతి - ఈవిధముగా ఒక్కొక్క ఇంద్రియమునకు ఒక్కొక్క దేవత అధిపతిగా ఉండును.

ఈ ఐదు మూలకారణములే విస్తరింపబడి కర్మలు అపారముగా వృద్ధిపొందుటకు అవకాశమిచ్చును. ఇట్లే మనస్సుకూడా కర్మలను సంకల్పించుటకు హేతువైయున్నది. ఈసంకల్పముల వల్లనే కర్త కర్మలను చేయుటకు ప్రయత్నించును. ఈ ప్రయత్నములోనే శరీరము మొదలైనవి ఇతర శరీరాదులు జన్మించుటకు కారణమగును.

మనస్సు వాక్కు, శరీరము (త్రికరణములు) ద్వారా ఏఏ కర్మలు ఆచరించబడునో ఆకర్మలే మనవాక్కు మరియు శరీరములకు హేతువులుగా అగును.

సూర్యప్రకాశమునకు హేతువు సూర్యుడే. కరణమూ సూర్యుడే. వాగ్దేవతను స్తుతించవలెనన్నచో ఆవాక్కునే ఉపయోగించవలెను. ఇట్లే శరీరాదులే పూర్వకర్మలకు కార్యములని, భవిష్యత్కర్మలకు కారణములని నిస్సందేహముగా తెలిసినప్పటికిని ఆశరీరాదులే ఆకర్మలకు ఉపకరణములు (Instruments) అనుటలో ఏమాత్రము అసత్యములేదు.

కర్మలు శాస్త్రోక్తమార్గమున ఆచరించబడినపుడు అవి న్యాయ సమ్మతములగును. శాస్త్రసమ్మతిలేకుండా చేయబడెడి కర్మలు నిష్ఫలములు మంత్రరహస్యము బోధపడనంతవరకూ, కేవలము అక్షరములను వల్లించినంతమాత్రమున మంత్రోచ్చారణ ఫలములభించని రీతిగా కరణము,హేతువుల సంయోగములవలన జనించెడి కర్మలు శాస్త్ర సమ్మతములు కానంతవరకూ నిష్ఫలములు అగును.

ఆత్మ కర్మలకు కర్త కాకున్నప్పటికీ ఆత్మ సాన్నిధ్యములోనే

కర్మలు జరుగుచున్నవి. కాని దేహాభిమానమనెడి భ్రమలో పడి యున్నందువలన ఎల్లప్పుడును ఏమానవుని బుద్ధి దేహమునందే చిక్కుపడియుండునో అతనికి ఆత్మజ్ఞానము గురించి ఏమియు తెలియదు. కర్మలనొనరించు ఈశరీరమే 'నేను' అని అతడు తలంచును. "నేను ఆత్మను నేనుకేవలము సమస్తకర్మలకు సాక్షీభూతుడనగు తటస్థుడను" అన్న విషయమును వారు గ్రహించలేరు. అట్టివారు అపారమైన, అనంతమైన ఆత్మతత్వమును స్వల్పమైన దేహముతో కొలుచుటకు ప్రయత్నింతురు.

కేవలము మూర్ఖత్వముతో తనజీవితమును గడుపు మనుష్యుడు తన ఆత్మపై శరీరమనెడి వలను వేసి, కర్మలనెడి గట్టి ముడితో ఈశరీర మనెడి చెరసాలలో గట్టిగా బంధింపబడియుండును. నిర్మలమగు ఆత్మ స్వరూపముపై మాయవలన జరుగుచున్న కర్మలను ఆరోపించు మానవునకు బంధవిముక్తిలేదు.

నీటితో కలియుటచేత ఉప్పుకూడా నీటిరూపమునే పొందువిధముగా మహాత్ముల విషయములను గూర్చి యోచన చేయుచుండగా, చేయుచుండగా మనకు కూడా మనము మరచిపోయిన ఆత్మస్వరూపము మరలగుర్తుకు వచ్చును. కావున ఎల్లప్పుడు మహాత్ముల విషయములను వర్ణించుట, వినుట చేయుచుండవలయును.

అజ్ఞానమనెడి నిద్రలో పడివుండి, అనంతకాలము వరకు అనేక జన్మములనెత్తి నానావిధ దేహములందు జన్మించి, సంసార బంధమునందు చిక్కుకొని యున్న మానవుడు "తత్త్వమసి" యనెడి మహాసిద్ధాంత వాక్యము చెవిన పడినంతనే, గురువు యొక్క కృపయనెడి హస్తము శిరముపై ఉంచినంతనే ఈజగత్తు అనెడి కలనుండి మేల్కొని, ఒక్కమారుగా అభేదానందము పొందును. ఇట్టి జీవునియందు అహంభావము నామమాత్రముగా కూడా ఉండదు.

అగ్ని ఏ వస్తువును తాకినా అది అగ్ని రూపమునే పొందును. ఆకాశము ఎచ్చటకు పోయిన అచ్చటనే పూర్తిగా నిండియుండును. అదే విధముగా కర్తృత్వాభిమానము లేకుండా కర్మఫలత్యాగము చేత ఆత్మస్వరూప ప్రాప్తి పొందిన జీవుడు ఏది చేసినప్పటికిని అది అంతయూ

స్వయముగా అతని ఆత్మస్వరూపమే అగును. అట్టి స్థితిలో అతడు కర్మతో లిప్తుడు కాలేడు. ఇట్టి జీవునకు ఏ కర్మా ఉండదు.

ఈవిధమగు ఆత్మ బోధవలన ఎవరి అహంభావము పూర్తిగా కాలి భస్మమైపోవునో అతని కర్మలు శరీరము వున్నంత వరకు మాత్రమే ఉండును. దేహాభిమానము నశించిన తరువాత కూడా దేహము ఏ స్వభావముతో జన్మించి యుండెనో ఆ స్వభావమే దేహముతో కర్మలను చేయించుచునే వుండును.

## సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు

**జ్ఞానోదయాత్పురా రబ్ధం - కర్మజ్ఞానాన్ననశ్యతి**
**అదత్వాస్వఫలం లక్ష్యముద్దిశ్యోత్సృష్ట బాణవత్ ॥**
**వివేక చూడామణి (454).**

జ్ఞానము ఉదయించుటకు పూర్వము ఆరంభమైన కర్మతన ఫలమును ఇవ్వకుండా నశించదు. లక్ష్యమును గురి చూసి వదిలిపెట్టిన బాణము తన ఫలమును ఇవ్వకుండా నశించదు. లక్ష్యమును గురి చూసి వదిలి పెట్టిన బాణము తన లక్ష్యమును చేరునే కాని మధ్యలో ఆగదు కదా !

కర్మ మూడు విధములు (1) సంచితము (2) ప్రార్భము (3) ఆగామి. బహు జన్మలలో గావించబడి ఎప్పటికైనను తప్పక అనుభవించవలసిన పుణ్యపాప మిశ్రకర్మ రాశి 'సంచిత'మనబడును. అందు ఫలోన్ముఖమై ప్రస్తుత శరీరముతో అనుభవించుటకు ఏర్పడిన కర్మ ప్రారబ్ధము. ప్రారబ్ధకర్మ యందు ఇప్పటి వరకూ కొంత అనుభవించిన తరువాత ఇంకనూ మిగిలి యున్న కర్మ ఆగామి. ఆత్మ జ్ఞానము కలిగిన తరువాత జ్ఞానులు చేయు కర్మలకు ఇదియే కారణము.

ఈ మూడు రకములైన కర్మలలో సంచితము మాత్రమే నిష్క్రియాత్మ తత్త్వ జ్ఞానము వలన నశించును. ఆత్మ జ్ఞానము కలిగినప్పుడు సంచిత కర్మ నశించి పోతుంది. కాని ప్రారబ్ధము మాత్రము అనుభవింపనిదే నశింపదు. ఎందువలననగా అది జ్ఞానోదయము కాకముందే ఫలము ననుభవింపచేయుటకు బయలుదేరినది. జీవునిచే సుఖముకాని, దుఃఖము

కాని, రెండింటి మిశ్రమము కాని ఆఫలమును అనుభవింప చేసిన తరువాతనే ప్రారబ్ధము నశిస్తుంది. అంతేకాని ఆఫలమును జీవుడు అనుభవించకుండా ఈ ప్రారబ్ధము నశించదు.

ఏదైనా లక్ష్యముకేసి గురి చూసి వదిలిన బాణము లక్ష్యమును ఛేదించి కాని పడిపోదు కదా ! ఆ విధముగానే ఆత్మ జ్ఞానము కలుగక ముందు చేసినటువంటి కర్మ ఫలం ఏదైతే ఉందో అది అనుభవిస్తేనే కాని నశింపదు. అందుకే మన వాళ్ళు తరచు అంటూ ఉంటారు "ఏం చేస్తాం ! ప్రారబ్ధ కర్మ .... అనుభవించక తప్పదు" అని.

**"అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్".**

ప్రారబ్ధ కర్మ ఫలమును అనుబవించక తప్పదు అనే విషయాన్ని శంకరాచార్యులు ఇలా వివరించారు.

**వ్యాఘ్రబుద్ధ్యా వినిర్ముక్తో -బాణః పశ్చాత్తుగౌమ తౌ,**
**నతిష్ఠ తిచ్ఛిన త్త్వేవ - లక్ష్యం వేగేన నిర్భరమ్ ॥**
**(వివేక చూడామణి 455)**

ఒక వేటకాడు పెద్ద పులి అనుకుని బాణం ఎక్కుపెట్టి వదిలాడు. కాని, బాణం విడిచి పెట్టిన తరువాత అతనికి అది పులికాదు, ఆవు అని తెలిసింది. అప్పుడు ఎంత బాధపడినా కాని ఎక్కుపెట్టిన బాణం వెనుకకు తిరిగి రాదు కదా ! ఎక్కుపెట్టబడిన బాణము తన లక్ష్యమును ఛేదించకమానదు. అదే విధముగా ఫలదానమునకై ప్రవృత్త మైన ప్రారబ్ధకర్మ కూడా బ్రహ్మజ్ఞానము కలిగిన వెంటనే నశించదు తన ఫలాన్ని అనుభవింపచేసి మాత్రమే నశిస్తుంది. శరీరము ప్రారబ్ధకర్మ యొక్క ప్రత్యక్షరూపము. జ్ఞానము కలిగిన వెంటనే శరీరము నశించదు కదా ! ప్రారబ్ధకర్మను పూర్తిగా అనుభవించిన తరువాతనే శరీరము పతనమవుతుంది.

ఆత్మ ఏ పనినీ చేయకపోయినప్పటికిన్నీ దేహములోని ఐదు కారణములవలనా కర్మలు తమంతతామే జరుగుతుంటాయి.

పూర్వ కర్మల సంస్కారముల ననుసరించి ఈ ఐదు కారణములూ అనేకవిధములైన కర్మలను చేయిస్తూ ఉంటాయి. పూర్ణత్వమును పొంది ద్వైత భావము నశించినవానికి తనకంటె భిన్నమైనది వేరొకటి ఏదీ ఉండదు. అతని బుద్ధిలో పాపపుణ్యములు ఉండవు. ఎన్ని నదులు, ఎటువంటి నీరు వచ్చి గంగానదిలో కలిసినప్పటికీ ఆ నీటి వలన గంగా నది ఎన్నటికినీ మురికి కాదు.

కార్యము, కర్త మరియు కర్మలనెడి త్రిపుటిని, ఆత్మ స్వరూపమును గాంచు వానికి శరీరము మొదలైన వాటిచే జరుగు కర్మలు ఎన్నటికినీ ప్రతిబంధకములు కావు. కర్మప్రవృత్తికి సంబంధించిన క్లేశములు ఆత్మను ఎన్నడూ స్పృశించవు. కాని ప్రపంచములో కర్మకు లోబడని జీవి ఏదీ ఉండదు. ప్రతి జీవీ కర్మ కారణంగానే జన్మించటం, వృద్ధి పొందటం, నశించటం జరుగుతూ ఉంటుంది. ఆయా ప్రాణులు అనుభవించే కష్ట సుఖాలూ, ఆనంద విషాదాలు అన్నీ కూడా కర్మాధీనములే.

కర్మాతీతుడైనవాడు ఈశ్వరుడొక్కడే. ఆయనే కర్మ ఫలప్రదాత. ఆయనకూడా కర్మలను ఆచరించిన వారికే ఫలాన్ని ఇస్తాడు. అందుకనే ఏ కర్మనూ ఆచరించకుండా ఉండేవారికి ఆ పరమేశ్వరుడు కూడా సహాయం చెయ్యడు. సమస్త జీవులూ కర్మానుసారంగానే వ్యవహరిస్తూ ఉంటాయి. పూర్వ కర్మల వలన కలిగే ఫలాన్ని ప్రతిజీవీ అనుభవించే తీరాలి. దాన్ని తప్పించే శక్తి ఈశ్వరునికి తప్ప మరెవ్వరికీ లేదు. కర్తుం (ఒక పనిని చేయుటకు), అకర్తుం (చేయకుండా ఉండుటకు), అన్యథాకర్తుం (మరొక విధముగా చేయుటకు) ఒక్క ఈశ్వరునికి మాత్రమే స్వాతంత్ర్యము కలదు.

కర్మవాసనావివశుడైన జీవి వివిధ దేహాలను ధరిస్తూ ఉంటాడు. విసర్జిస్తూ ఉంటాడు. అతడు కర్మకు మాత్రమే కట్టుబడి వ్యవహరిస్తూ ఉండటం జరుగుతుంది. అందుచేత కర్మ అందరికీ ప్రధానమైనదిగా ఉంటుంది. అందుకనే ఏ పని చేసినా ఎవరి పనులను వారు భక్తి పూర్వకంగా ఆచరించే తీరాలి. అప్పుడే వారికి మేలు కలుగుతుంది. తమకు నిర్దేశించిన కర్మను వదిలి వేసి వేరొక కర్మను గ్రహించటమనేది సమంజసమైనదికాని, శ్రేయస్కరమైనది కాని కాదు.

శ్రేయా స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వభావని యతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥
గీత 18 అ. 47 శ్లో.

కష్టమైనదైనా మన స్వధర్మమును ఆచరించటమే మనకు మేలు చేస్తుంది. గుణ రహితమైనప్పటికిన్నీ స్వధర్మము శ్రేయస్కరమైనది. చక్కగా అనుష్ఠింపబడిన పరధర్మము కంటె దోషసహితమైనప్పటికి స్వధర్మమును ఆచరించుటే మంచిది. తన స్వభావముచే నియమింప బడిన కర్మను చేయుటవలన పాపము సంభవించదు. "కుక్క, గాడిద కథలో దొంగల్ని చూచి కుక్కకు బదులుగా అరచిన గాడిదకు, యజమాని చేత దెబ్బలే మిగిలినట్లుగా" ఇతరుల ధర్మాన్ని ఆచరించటం అనర్థమునే కలుగ చేస్తుంది.

ఉత్పత్తి, స్థితి, లయము – ఈ మూడింటికి సత్వరజస్తమో గుణాత్మకమైన ప్రకృతి కారణం. యజ్ఞయాగాదులు రజోగుణాత్మకమైన కర్మలు. అవే మేఘములు వర్షించటానికి మూలకారణం. మేఘాలు అన్ని చోట్లా సమంగా వర్షించి ప్రజానీకానికి సస్యసమృద్ధిని కలుగచేస్తాయి. అన్నదానం చేసేటప్పుడు వీరు వారు అనే భేదాన్ని పాటించటం పాపానికే కారణం అవుతుంది. అన్నదానం చేసేటప్పుడు కులమత వర్గ విభేదాలు పాటించకుండా అందరినీ సమభావంతో తృప్తిపరచాలి. అలా సమచిత్తంతో, సర్వభూతతృప్తిని కలిగించటమే ఉత్తమోత్తమమైన యాగం అనిపించుకుంటుంది.

ఈ విధంగా నిష్కామబుద్ధితో, కర్మఫలత్యాగంతో చేయు కర్మ భగవంతుని పొందేలా చేస్తుంది. కోరికతో ఫలాన్ని ఆశించి చేసే కామ్య కర్మలూ, చేయకూడని కర్మలను (అనగా నిషిద్ధ కర్మలను) చేయటం వలన మనుషులకు దేహాభిమానం అనే బంధము కలుగుతుంది. కాబట్టి అహంకార మమకారములను విడిచి మానవుడు ఎల్లప్పుడూ నిత్యనైమిత్తిక కర్మలను శ్రద్ధతో నిష్కామబుద్ధితో చేయటమే మోక్షాన్ని పొందటానికి సాధన అన్న విషయాన్ని కర్మయోగం (కర్మమార్గం) ద్వారా వేదాంత శాస్త్రం చక్కగా బోధిస్తున్నది.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మ ఫల హేతుర్భూః మాతే సంగోస్త్వ కర్మణి ॥**
**గీత 2-47 శ్లో.**

"పార్థా! కర్మలాచరించుటకు మాత్రమే నీకు స్వాతంత్ర్యము కలదు. ఫలముల యందు నీకేమియును జోక్యము లేదు. కావున కర్మఫలములను ఆపేక్షించకుము. అట్లని నీ వ్యాపారములను మానకుము. కర్మఫలములు ఈశ్వరాధీనములు. ప్రకృతి నియమముల ననుసరించి ప్రతి కర్మకును ఎప్పుడు ఎంత ఫలితము లభించవలెనో లభించియే తీరును. మన బాధ్యత పనిచేయుటవరకే. ఫలితము దైవాధీనము. కర్మఫలమును ఆశించకుండా పనిచేసినచో ఆ ఫలితమును గూర్చిన ఆందోళన లేకుండా మనశ్శాంతి కలుగును. కాని ఆ కర్మఫలము లభించి మనము దానిని అనుభవించువరకు ఈ దేహము నిలువనిచో ఆ ఫలమును అనుభవించుటకు అనుకూలమగు వేరొక దేహమును ధరింపవలసి యుండును. ఇదియే పునర్జన్మకు బీజము. అందుచే జన్మ రాహిత్యము కోరువారు కర్మఫలములందలి ఆపేక్ష వదిలి నిష్కాములై కర్తవ్యమును ఆచరించవలెను. ఫలమును ఆశించనప్పుడు కర్మచేయుట ఎందులకు అనరాదు? కర్మ చేయకుండ ఉండుట శక్యము కాదు. కర్మ చేయకుండుట తమోలక్షణము. అందుచే భగవానుడు కర్మఫలమును ఆశించకుండా కర్మలు చేసియే తీరవలెనని బోధించియున్నాడు. అహంకార, మమకారములు లేకుండా చేసే నిష్కామ కర్మ బంధాన్ని కలిగించదు.

"ఈ నిత్య నైమిత్తికాది కర్మాచరణ, బంధాన్ని ఎలా తెంచివేస్తుంది?' అనేటువంటి జిజ్ఞాస కలిగినప్పుడు, ఆలోచన కలిగినప్పుడు, మానవుడు ముముక్షువుగా మారును. అలా మోక్షాన్ని గురించిన జిజ్ఞాస కలిగిన ముముక్షువు తన కర్మాచరణము నంతటినీ బ్రహ్మార్పణముగా చేయవలెనని భగవానుడు గీతాముఖంగా ఆదేశించెను.

శారీరకంగా, వాక్కు ద్వారా, మనస్సు ద్వారా ఏఏ కర్మలను మనం చేస్తుంటామో అవన్నీకూడా ఆరూపంగానే ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి.

సమస్త కర్మలను ఫలాన్ని ఆశించకుండా నిష్కామంగా చేస్తూ ఉంటే ఇటువంటి కర్మాచరణ మనిషి మనసులోని మాలిన్యములను

పోగొట్టి మనసును పవిత్రం చేసి భక్తి మార్గంలోకి మళ్ళిస్తుంది. పరమార్థ సాధనలో అందరూ కర్మాచరణ తప్పని సరిగా చేయాలి. ఏ కర్మా చేయకుండా ఉండటం అసాధ్యం కాబట్టి చేసే ప్రతి కర్మ కూడా ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి.

"కుర్వన్నేవే హకర్మాణి జి జీవిషేత్ శతగ్ం సమాః
ఏవంత్వయి నాన్యథేతోz స్థిన కర్మ లిప్యతే నరే"

ఈశావ్యాసోపనిషత్తు. 2వ మంత్రం.

"కర్మలు యథావిధిగా ఆచరిస్తూ నూరు సంవత్సరములు జీవించ వలెనని కోరుకొనుము," ప్రార్థించుము" అని ఈశావ్యాసోపనిషత్తు బోధిస్తున్నది.

కర్మణైవ హి సంసిద్ధిం అస్థితా జనకాదయః ।
లోక సంగ్రహ మేవాఽపి సంపశ్యన్ కర్తు మర్హసి॥

గీత 3అ ॥ 20 శ్లో.

జనకుడు మొదలగు రాజఋషులు నిష్కామకర్మను చేసి జీవన్ముక్తులైరి. లోకమునకు సహాయము చేయవలెనను తలంపుతోనైనను కర్మలను చేయవలెను.

సర్వద్వైత బుద్ధి పరిత్యాగమే సర్వకర్మ సన్న్యాసము. కోరికలేకుండా చేసేటువంటి కర్మవలన ఎటువంటి దోషమూ కలగదు. అటువంటి కర్మాచరణ మోక్షమునకు కారణమై స్వయముగా నశించును. చిల్లగింజ నీటిలోని మట్టిని పోగొట్టి దానితో పాటు తాను కూడా అడుగునకు పోవునట్లు "నిష్కామకర్మ" మోక్షమునకు కారణమై చివరకు తాను కూడా జ్ఞానము నందు లీనమగును.

ఫలమును ఆశించకుండా చేయు కర్మల వలన ధనము నందలి, జీవితము నందలి కోరిక నశించి మోక్ష సాధనమగు చిత్త శుద్ధి కలుగును. అట్లు నిర్మలమైన చిత్తము మోక్షమునకు పరంపరయా కారణమగును.

కర్మలను చివరివరకూ పూర్తిగా ఆచరించక పోయిననూ, చేయవలసిన విధముగా కర్మలను చేయకపోయిననూ దోషము కలుగును.

**అవిద్యాయాం బహుధా వర్తమా నా వయం కృతార్థా**
**ఇత్యభిమన్యన్తి బాలాః యత్కర్మిణో నప్రవేదయన్తి**
**రాగాత్తే నాతురాః క్షీణ లోకాశ్చ్యవన్తే**

**ముండకోపనిషత్తు ద్వితీయఖండము**

**8వ మంత్రము.**

"పరిణామము చెందిన యుక్తమనస్కులు కానివారు (బాలాః) అవిద్యచే జనన మరణ రూపమగు సంసారము నందు తిరుగుతూ" "మేము కృతార్థులము" అని తెలియక అనుకొనుచున్నారు."

అవిద్య కారణంగా అజ్ఞానులు కేవలం కర్మపరులయి కర్మ ఫలము నందలి గాఢానురాగముచేత తత్త్వమును తెలుసుకొనలేరు. అందుచేత వారు స్వర్గ ఫలములను అనుభవించిన తరువాత ఆలోకముల నుండి తిరిగి అధో లోకమునకు జారిపడి జనన మరణ పరిభ్రమణంలో పడి పోతుంటారు.

అగ్నిహోత్రము, తపస్సు, సత్యము, వేదాధ్యయనము, అతిథి పూజనము, వైశ్వ దేవము మొదలగు శ్రౌతకర్మలు "ఇష్టకర్మలు' (Worshipping Karma) అని చెప్పబడును. యజ్‌పూజనే అను ధాతువు మీద ఇష్ట అనగా పూజా సంబంధమైన అనుపదము ఏర్పడుతుంది. వాపీ, కూప, తటాక, దేవాలయ, సత్ర నిర్మాణాది స్మార్తకర్మలు "పూర్తములు" అని చెప్పబడును. స్వర్గాది ఉత్తమ లోక ప్రాప్యమగు ఉత్తమ కర్మ ఫలము కూడా అనిత్యమగుట వలన దాని అనుభవానంతరము మిగిలియున్న శేష కర్మను అనుభవించుటకు అందుకు తగిన శరీరమును ధరించవలసి వచ్చును. సకామ కర్మ జన్మ పరంపరకు కారణము. నిష్కామ కర్మ మనసులోని మాలిన్యమును పోగొట్టి పుటము పెట్టిన బంగారు వలె ప్రకాశింపచేసి భక్తి భావాన్ని మేల్కొలుపుతుంది. క్రమంగా మోక్షానికి కారణం అవుతుంది.

లోకములోని స్త్రీ పురుషులందరికీ అనేక జన్మ జన్మములుగా చేయుచు వచ్చెడి సత్కర్మానుష్ఠాన పుణ్య విశేషము వలన ఈశ్వర భక్తి కలుగును. ఆ ఈశ్వర భక్తి వలన తదేకధ్యాన నిష్ఠాపరత్వము కలుగును.

ఆ యోగము వలన మోక్షము ప్రాప్తించును.

అన్నదానాది అనేక దానములు చేసి, సత్రములు, గుడిగోపురములు, చలివేంద్రములు మున్నగు వాటిని ఏర్పాటు చేసి అవన్నీ తానే చేసినట్లు తలచిన యెడల తాను చేసిన పుణ్య కార్యములకు గాను ఇక ముందు తాను ఎత్తబోవు జన్మము నందు ఇప్పుడు వున్న ధనము కంటె మరింత ధనము కలిగి ఆ జన్మము నందును మరల పుణ్య కార్యములనే చేస్తూ ఉంటారు. దీనిని "కామ్య పుణ్యము" అని చెప్పవచ్చును. ఇట్టి కామ్యపుణ్యము జన్మమెత్తుకొలదీ ధనము నిచ్చుచూ పోవునే గాని ఈశ్వరభక్తిలోనికి కొనిపోజాలదు. తాను చేసెడి పుణ్య కార్యము వలన తనకు ఎటువంటి సంబంధము లేదని తలచి అన్ని కార్యములనూ ఈశ్వరార్పణ బుద్ధితో చేసిన యెడల అది నిష్కామ్య పుణ్యమని చెప్పబడును. ఇట్టి నిష్కామ్య పుణ్యము అనేక జన్మలలో చేయుచున్నచో పోను పోను ప్రతి జన్మము నందును భక్తి అభివృద్ధి చెంది భక్తి నుండి జ్ఞాన నిష్ఠ కలిగించును. మోక్షము సిద్ధించును. యోగము సిద్ధించి, మోక్షమును పొందు సమయమున ఆ యోగికి కర్మ శేషము ఏదైనా మిగిలియున్నచో ఆ కర్మ ఫలమును అనుభవించుటకు గాను మరియొక జన్మమును ఎత్తవలసి యుండును. కాని చేసిన ప్రయత్నము మాత్రము వృధాకాదు. అది మరు జన్మము నందు అనుభవించక తప్పదు.

**ప్రారబ్ధ కర్మ భోగేన జీవన్ముక్తో యధాభవేత్**
**కిఞ్చిత్కాల మనారబ్ధ కర్మబన్ధ స్యసంక్షయే**
**నిరస్తోతిశయా నందం వైష్ణవం పరమం పదమ్**
**పునరావృత్తి రహితం కైవల్యం ప్రతి పాద్యతే**

**వివేక చూడామణి**

జీవన్ముక్తునకుగల కర్మలో అనారబ్ధరూపమైన సంచిత కర్మ జ్ఞానము వలన పూర్తిగా నశించును. ప్రారబ్ధ కర్మ మాత్రము భోగము వలననే నశించును. కనుక కొంచెము కాలమువరకు మిగిలిన ప్రారబ్ధ కర్మను అనుభవించిన తరువాత జీవన్ముక్తునకు పూర్తిగా కర్మక్షయమగును. అప్పుడు, అవ్యయమైన అతిశయ ఆనందరూపమగు వైష్ణవ పరమ పదమును, మరల వెనుకకు తిరిగి రాకుండా ఉండే కైవల్య పదమును

యోగిపొందును.

ఈశ్వరార్పణ బుద్ధితో చేసిన కర్మము తాపత్రయమును మాన్పు ఔషధము వంటిది. దేనివలన రోగం కలుగుతుందో దాని వలన రోగం నశించదు. ఇతరమైన ఔషధాన్ని సేవించటం వలననే రోగం నశిస్తుంది. కర్మలు సంసారమునకు కారణమైనప్పటికీ ఈశ్వరార్పణ బుద్ధితో చేయబడు నిష్కామకర్మవలన కర్మలు తమ్ము తామే నశింప చేసుకోగలుగుతాయి.

భగవదర్పణముగా చేయబడుకర్మలు ఈశ్వరుని మెప్పించి భక్తి యోగమును కలుగచేయును. అట్టి నిష్కామ కర్మ చేయువారు భగవంతుని గుణనామవర్ణనము, స్మరణము చేస్తూ ఉంటారు. ప్రణవపూర్వకముగా భగవంతుని నామాలను ఉచ్చరిస్తూ, మంత్రమూర్తియూ, ఉపాధి శూన్యుడునైన యజ్ఞపురుషుని సేవించేవాడు సమ్యగ్దర్శనుడగును.

ఈ విధముగా కర్మ మార్గము ద్వారా "జీవితపరమార్థమును" పొందు విధానమును వేదాంత శాస్త్రము బోధించుచున్నది.

# తృతీయ అధ్యాయము
# భక్తి మార్గము

**విషయము** : నిష్కామ కర్మ ద్వారా చిత్తశుద్ధి, నిర్మల చిత్తమునందు ఏర్పడు భక్తి భావము, భక్తి స్వభావము, భక్తి లక్షణములు, భక్తుల లక్షణములు, భక్తిదశలు సగుణ భక్తి, నిర్గుణ భక్తి, నవవిధ భక్తి మార్గములు (ఉదా॥ భాగవతమునందు రమణీయముగా ఉదహరింపబడిన భక్తుల చరిత్రలో సంక్షిప్తంగా చెప్పబడినవి), భగవద్గీత యందు ప్రస్తావించబడిన ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని, అద్వైత సిద్ధాంతము దృష్ట్యా భక్తి యోగము, నవవిధ భక్తి మార్గములతో పాటు వైర, శాంత, వాత్సల్యాది భక్తులు, గురుభక్తి, సత్సాంగత్యము, సద్గురుసేవ, సద్గ్రంథ పఠనము, వివిధములైన భక్తి నిర్వచనములను గురించి ఆయా ఆచార్యుల వివరణలు, జీవిత పరమార్థ సాధనలో భక్తి మార్గము యొక్క విశిష్టత మొదలైనవి.

# భక్తి మార్గము

జీవిత పరమార్ధమైన జన్మరాహిత్యమును, స్వస్వరూపజ్ఞానమును నిష్కామ కర్మాచరణము ద్వారా ఏ విధముగా సాధించవచ్చునో బోధించిన పిదప శ్రుతి మాత కర్మాచరణ ద్వారా భక్తి మార్గం చేరుకుని భక్తి ద్వారా జీవిత పరమార్ధమును ఏ విధముగా పొందవచ్చునో ముముక్షువునకు బోధిస్తున్నది.

మానవులు అంతా కూడా సుఖాన్ని పొందటానికి, దుఃఖాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఎల్లప్పుడూ సుఖాన్ని, ఆనందాన్ని మాత్రమే పొందటానికి ఎందుకు ప్రయత్నిస్తారు ? అంటే సుఖము, ఆనందమే జీవుని అసలు స్వభావం కనుక! ఆ విధంగా సుఖాన్ని పొందాలని ప్రయత్నించే జీవులకు వేదము అలౌకిక సుఖాన్ని పొందే మార్గాన్ని , సాధనాలను ఉపదేశిస్తుంది. అట్టి పరమాత్మను తెలుసుకొనుట వలననే "జన్మరాహిత్యము" కలుగుతుంది.

— శ్రుతి

ఇంద్రియముల ద్వారా పొందే సుఖాలు, అనుభవించే భోగాలు దుఃఖానికే కారణం కాని సుఖానికి కాదు. అవి పరిమితమైనవి. తాత్కాలికమైనవి. నేటి సుఖం రేపు దుఃఖానికి కారణం కావచ్చును. కనుక అశాశ్వతమైన ఈ సుఖాలను పొందాలని విద్వాంసులు ప్రయత్నించరు.

—భగవద్గీత

అయితే ఈ అలౌకికమైన ఆనందం ఎలా లభిస్తుంది ? "ఆనందో బ్రహ్మ" అని కదా ఉపనిషత్తులు బోధిస్తున్నాయి ? అటువంటి శాశ్వతమైన బ్రహ్మానందానుభవం కలగాలంటే ఏమి చెయ్యాలి ? అట్టి బ్రహ్మానుభవం భక్తి పారవశ్యంలో లభిస్తుంది అని వేదాంత శాస్త్రం బోధిస్తున్నది.

"సర్వవిధములైన పరిగ్రహరహితుడును, ఇంద్రియములను జయించిన వాడును, శాంత స్వభావియును, సమదర్శియును, నన్ను

(అనగా భగవంతుని) పొందుట వలన సంపూర్ణానందమును అనుభవించు భక్తునకు అన్ని దిశల యందును ఆనందము నిండుగా లభిస్తుంది" అని భగవానుడు అభయం ఇచ్చాడు భగవద్గీత ద్వారా.

వాగ్గద్గదాద్రవతే యస్య చిత్తం
రుదత్య భిక్షం హసతి క్వచిచ్ఛ
విలజ్జ ఉద్గాయతి నృత్య తేచ
మద్భక్తి యుక్తో భువనం పునాతి

భాగవతం II - 14.24
(ఏకాదశ స్కంధం)

ఓ ఉద్ధవుడా ! నా యందే భక్తి కలిగి యున్న భక్తుడు గద్గదమైన వాక్కుతో, భక్తిచే హృదయం ద్రవించిన వాడై ఎల్లప్పుడు నన్నే ధ్యానించుచు, నా కొరకై అనుక్షణమూ విలపించుచూ, ఒక్కొక్కసారి నవ్వుతూ, సిగ్గులేకుండా పెద్దగా పాడుతూ, మరొక సమయమునందు నృత్యము చేయుచుండును. అట్టి భక్తి యుక్తుడు తననే కాక లోకము నంతటిని పవిత్రము చేయును. ద్వాపర యుగంలో గోపికలు, కలి యుగములో ఆండాళ్ (విష్ణుచిత్తుని కుమార్తె అగు గోదాదేవి), చైతన్య మహాప్రభు, శ్రీ రామకృష్ణ పరమహంస మొదలైనవారు ఇట్టివారు.

భగవంతుడు భక్తుని హృదయంలో బంధీగా ఉంటాడు. భక్తుని హృదయమే భగవంతుని చిరునామా. భక్తికి భగవంతుడు సులభంగా లొంగిపోతాడు. కనుకనే భగవంతుడు "భక్త సులభుడు" అంటారు. అట్టి భగవంతుని పొందటానికి భక్తి మార్గం అతి సులభమైన మార్గం. సర్వశః శరణాగతి", "ఆత్మనివేదన" – భక్తికి పరాకాష్ఠ.

సర్వధర్మాన్ పరిత్యజ్యమామే కం శరణం వ్రజ
గీత

"స్వామీ! నువ్వే శరణు! అన్యధా శరణం నాస్తి" అని భారమంతా భగవంతుని పై వేసి తనస్వధర్మాన్ని తాను సక్రమంగా నెరవేర్చే భక్తుని రక్షణ భాద్యత అంతా భగవంతునిదేనని భగవానుని ప్రతిజ్ఞ. దీనికి భాగవతంలోని గజేంద్ర మోక్షఘట్టం రమణీయమైన ఉదాహరణ.

"లావొక్కింతయు లేదు" అంటూ "నీవే తప్ప వేరే దిక్కులేదని' ఆర్తితో వేడిన గజేంద్రుని ఆపన్నశరణార్థియైన ఆ శ్రీమన్నారాయణుడు ఏ విధంగా కాపాడినదీ మనకు తెలిసిన విషయమే కదా ! భక్తుడు భగవంతునికి పసిబిడ్డ. బిడ్డ ఆలనా పాలనా అంతా తల్లి బాధ్యతే. అటువంటి పసి మనసుతో భగవంతుని అర్థిస్తే, బిడ్డను వెతుక్కుంటూ వచ్చే తల్లి వలె ఆయన భక్తుని సంరక్షిస్తాడు.

పరమేశ్వర సాక్షాత్కారానికి ప్రాణి పొందే ఆరాటమే "పరమభక్తి" అనిపించుకుంటుంది. ఆ భక్తికి ప్రతిఫలాపేక్ష అనేది ఉండదు. భక్తిని ఆశ్రయించిన వారికి ప్రాపంచిక విషయాలపై ఆసక్తి ఉండదు. ప్రపంచాధిపత్యమే వరించి వచ్చినా, అంతకు మించిన మహేంద్రాది పదవులు తమకు తామే లభించినా భక్తులు లక్ష్యం చెయ్యరు. వారికది తృణప్రాయమే.

ప్రాపంచిక వాసనలు పూర్తిగా వదిలినవారు, వాటికి అధికమైన ప్రాధాన్యత నివ్వని వారూ భక్తి యోగాభ్యాసానికి అర్హులవుతారు. ఆ విధమైన అర్హతను పొందటానికి వయసు కాని, కులంగాని, స్థితికాని అడ్డురావు. పరిపూర్ణమైన భక్తి కలవారు ప్రాపంచిక విషయముల మధ్య ఉంటూ కూడా సర్వ వేళలా సర్వాంతర్యామిని స్మరించుకుంటూ ఉంటారు. అలా తనను స్మరించుకొనే వారికి ఆ పరమేశ్వరుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడు.

"భజసేవాయాం" అనుధాతువుననుసరించి "భక్తి" యనగా సేవించుట అని అర్థము. కాని లౌకిక ప్రయోజనాలకై చేస్తున్న సేవ 'భక్తి' అనిపించుకోదు. ప్రతిఫలంకోరకుండా సర్వకాల సర్వావస్థలయందును మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధితో భగవంతుని మనస్సునందు నిలుపుకొని సర్వదా సంస్మరించుటయే భక్తి.

భక్తికి కులమతవర్గ విభేదాలు లేవు. వయసుతో నిమిత్తం లేదు. భక్తిలేని వారి జీవితము గ్రుడ్డివానికి వెన్నెలలాగా, చెవిటి వానికి శంఖంలాగా, బూడిదలో పోసిన పన్నీరులాగా వ్యర్థం. అల్ప మనస్కులు, దుర్బల శరీరులు అయిన కలియుగ మానవులకు జీవిత పరమార్థమును సాధించుటకు భక్తి కంటె శ్రేష్ఠమైన, సులభమైన మార్గం మరొకటి లేదు.

ధ్యాయన్‌కృతే యజన్ యజ్ఞైః త్రేతాయాం
ద్వాపరేzర్చయన్ ః యదాప్నోతి తదాప్నోతి
కలౌకేశవ కీర్తనాత్

విష్ణుపురాణం.

కృతయుగంలో తపస్సు వల్లా, త్రేతాయుగంలో యజ్ఞయాగాదుల వలనా, ద్వాపరయుగంలో పూజా పురస్కారాదులవలన కలిగే ఫలం కలియుగంలో భగవన్నామసంకీర్తనం వలన లభిస్తుంది. పాపభూయిష్టమైన ఈ కలియుగంలో పరమోత్కృష్టమైనటువంటి విషయం ఇదే.

కలియుగంలో మానవులు అతిదుర్బలురుగా ఉంటారు. యుగాలు నాల్గింటిలోనూ అతి విచిత్రమైనదీ కలియుగం. ఈకలియుగంలో ధర్మం ఒక్కపాలు మాత్రమే మిగిలి ఉంటున్నది. సత్యం, శౌచం, క్షమ దయ, బలం స్మృతి అనేవి మానవులలో కేవలం మచ్చుకు మాత్రమే మిగిలి ఉంటున్నాయి. ఈకాలంలో ధనవంతుడైనవాడే ధర్మజ్ఞుడు. బలవంతుడైనవాడే ప్రభువు. వాచాలురు పండితులుగానూ, ఉదర పోషణమే పరమపురుషార్థంగా భావించబడుతున్నది.

వేదమార్గం పోయి వర్ణాశ్రమధర్మములు అడుగంటిపోయాయి. పాలకులు పరమదుర్మార్గులై ఉంటున్నారు. ప్రపంచమంతటా కూడా అధర్మం తాండవం చేస్తున్నది. ఇట్టి కలికాలంలో మానవులు ధర్మాన్ని మరచిపోయి, వర్ణాశ్రమ ధర్మాలవీ పాటించకుండా, ఎప్పుడూ అబద్ధాలాడుతూ, మాయతో మోసంతో, మనిషిరూపంలో మృగాలవలె సంచరిస్తున్నారు. అందుచేత "సత్యంవధ ధర్మంచెర" గా మారిన ఈకలియుగంలో దారిద్ర్యం ప్రబలిపోయి కరువుకాటకాలు అమితమౌతున్నాయి. ప్రజల ఆయస్సు తగ్గిపోతున్నది. వైద్యశాస్త్రంలో గణనీయమైన అభివృద్ధిని సాధించి ప్రజల ప్రాణాలను రోగాలబారినుండి కాపాడటానికి వైద్యులు శతవిధాల ప్రయత్నిస్తున్నా నిష్కారణంగా ప్రమాదాలలో, ప్రకృతి వైపరీత్యము వలన, ఉపద్రవముల వలన, హత్యలు, హింసాకాండవలన వేలూ లక్షలుగా జనం మూక ఉమ్మడిగా చనిపోతూ ఉండటం మనం ప్రత్యక్షంగా చూస్తున్నదే – వింటున్నదే.

అయితే ఇటువంటి ఉపద్రవాలన్నీతొలగిపోవటానికి, మిగతా

యుగములన్నింటికంటె అతిసులభంగా మోక్షాన్ని పొందటానికి ఈకలియుగంలో గల విశిష్టమైన సాధన భగవన్నామసంకీర్తనే. కేవలం నామాన్ని ఉచ్ఛరించటం మాత్రమే కాకుండా మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా భగవన్నామస్మరణ చేయటం ద్వారా మోక్షాన్ని పొందగల అవకాశం ఈకలియుగ మానవులకు మాత్రమే సాధ్యం. ఇక్కడ మరో ముఖ్యమైన విశేషం ఏమిటంటే ఈకాలగమనంలో కలియుగం తరువాత వచ్చేది కృతయుగమే. అనగా ధర్మం మరల ప్రతిష్ఠింపబడుతుంది.

**మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ.**
**కలౌతు కేవలా భక్తిః బ్రహ్మ సాయుజ్య కారిణీ**
**వివేకచూడామణి.**

మోక్షమును సాధించటంలో కర్మ, భక్తి, జ్ఞానము మొదలగు అనేక సాధనలున్నప్పటికీ వీటన్నింటిలోనూ భక్తియే గొప్పది. ముఖ్యముగా కలియుగంలో మాత్రము అన్యమైన భక్తి బ్రహ్మసాయుజ్యమును కలిగించునని ఆదిశంకరుల అభిభాషణ.

లౌకిక విషయములలో కలిగేటటువంటి ప్రీతి, ఆసక్తి, రతి అనబడేచిత్తవృత్తిని భగవంతుని వైపు మళ్ళించి, అతనియందే నెలకొనచేసినచో అది భక్తిగా పరిణమించును. ఈభక్తి ఎడతెగని తైలధారవలె ఉండాలి.

**తైలధారావద వచ్ఛిన్న సంస్మరణ రూపా చిత్తవృత్తిః భక్తిః**
**(నారద భక్తి సూత్రములు)**

భగవంతుని లీలలను స్మరించుట, ఆయన కళ్యాణ గుణములను కీర్తించుట మొదలగునవి భక్తితో చేసే పనులు.

**ఆత్మావా అరే ద్రష్టవ్యో శ్రోతవ్యో మంత్రవ్యోనిధి ధ్యాసితవ్యః**
**"బృహదారణ్యకము"**

"ఆత్మను దర్శనము చేయవలెను. ఆత్మను గురించి వినవలెను. ఆలోచించవలెను. తీవ్రముగా ధ్యానము చేయవలెను."

అను బృహదారణ్యక వాక్యము ఈభక్తులు చేసే పనులను

తెలియచేయుచున్నవి. భక్తియోగ ప్రాశస్త్యమును శ్రీమద్భాగవతము ఇలా ప్రకటించింది.

**మత్కర్మ భిర్యత్త పసా జ్ఞాన వైరాగ్యతశ్చయత్**
**యోగేన దాన ధర్మేణ శ్రేయోభిః ఇతరైరపి**
**సర్వం మద్భక్తి యోగేన మద్భక్తోలభతాంజనాః**
**శ్రీమద్భాగవతము**

"నా సంబంధమైన కర్మలచేత తపస్సుచేత, జ్ఞానము చేత, వైరాగ్యముచేత, యోగముచేత, దానధర్మముచేత సాధింపబడునది. అంతయును మద్భక్తునకు భక్తియోగముచేత సులభముగా లభించును."

కర్మ, జ్ఞానము మొదలగు అనేక సాధనములతో కష్టపడి సాధించేది అంతాకూడా భక్తిమార్గంలో అనాయాసంగా, శీఘ్రంగా లభిస్తుంది. సర్వపాపములను పటాపంచలు చేసి సాధకుని ఉద్ధరించగల మహిమ భక్తియోగమునకే కలదని వ్యాసోక్తి.

**యథాగ్ని సుసమృద్ధార్చి : కరోత్యేథాంసి భస్మసాత్**
**తథా మద్విషయాభక్తి రుద్ధవైనాంసికృత్స్నశ :**
**(భాగవతము)**

"ఓ ఉద్ధవా :

కట్టెలచేత బాగుగా మండుచున్న అగ్ని ఏవిధముగా కట్టెలను భస్మము చేయునో అదేవిధముగా నాయందలి భక్తి పాపములను సంపూర్ణముగా భస్మము చేయును. కర్మచే ఎట్టి పాపినైనను, జాతిచే ఎంత నికృష్టునైనను దృఢమైన భగవద్భక్తి పవిత్రుని చేసి ఉద్ధరించును. నన్ను తృప్తిపరచుటకు అట్టి భక్తి ఒక్కటే చాలును. ఉద్ధవా ! నేను అట్టి భక్తికే కట్టుబడిపోతాను." అని శ్రీ కృష్ణ భగవానుడు ఉద్ధవునితో చెప్పాడు.

**భక్త్యా హమేకయా గ్రాహ్యః శ్రద్ధయాత్మాప్రియం సతామ్**
**భక్తిః పునాతి మన్నిష్ఠా శ్వపాకాదపి సంభవాత్.**

"భక్తి ఒక్కదాని చేత మాత్రమే నేను గ్రహింపబడతాను. సత్పురుషుల యందుగల శ్రద్ధచేత పరమాత్మ ప్రియమగును. నాయందు

నిష్ఠగలిగిన భక్తి భావము కుక్క మాంసము తినువానిని కూడా జన్మపరంపరనుండి పవిత్రము చేయును ... రక్షించును."

తైత్తిరీయారణ్యకములో ....

ఆరుణి "ఆత్మోద్ధరణకు సాధనము లెవ్వి?" అని తండ్రియైన ప్రజాపతిని అడిగినప్పుడు ఆ బ్రహ్మవేత్త "సత్యము, తపము, దమము, శమము, దానము, ధర్మము, ప్రజోత్పత్తి, అగ్నిపూజ, అగ్నిహోత్రము, యజ్ఞము, మానసోపాసనము, న్యాసము - అనునవి ఆత్మోద్ధరణకు సాధనములని" చెప్పెను. అప్పుడు "ఈ పన్నెండింటిలోను శ్రేష్ఠతమమైనది ఏది ? అని అడుగగా ప్రజాపతి తన కుమారునితో ఇట్లు చెప్పెను.

**తానివా ఏతాన్యవరాణి పరాంసి న్యాస**
**ఏ హిత్య రే చరేత్**

**(తైత్తిరీయము 18.78)**

"నాయనా ! పైన చెప్పినటువంటి సత్యము మొదలు మానసోపాసనము వరకు గల పదునొకండు సాధనములూ సహకారి కారణములే. "న్యాసము" అనెడి భగవచ్ఛరణాగతి యే మోక్షమునకు ఉపాయము" అని వివరించెను.

"ఓం" అను ప్రణవమును భావించి తనను పరమాత్మకు సమర్పించుకొనవలెను. ఇదియే సర్వోపనిషత్తుల సారము.ఇది దేవతలకు కూడా రహస్యమైనది. ఈ న్యాసవిద్యను ఎరిగిన సాధకుడు ముక్తిని పొందును. "న్యాసము" అనగా భగవంతునియందు మనసును ఉంచుట. "సన్న్యాసము" అనగా సమ్యక్ న్యాసము – అనగా భగవంతునియందు పూర్తిగా మనసును ఉంచుట. అందువలన మోక్షమును పొందుటకు చెప్పబడిన సాధనములలో భక్తిమార్గము సులభమైనది. అతి త్వరితముగా ఫలితమును ఇచ్చేది.

భగవత్సాక్షాత్కారమునకు భక్తి సాక్షాత్సాధనము. కాబట్టి భక్తి మిక్కిలి శ్రేష్ఠమైనది. తక్కిన సాధనములన్నియు పరంపరా సాధనములే. భక్తియనగా స్వస్వరూపాను సంధానము.

"స - ఆత్మా తత్త్వమసి"

ఛాందోగ్య ఉపనిషత్తు, షష్ఠ ప్రపాఠకము
8వ ఖండము 7వ మంత్రము

"ముందు చెప్పబడిన సచ్చిదానందలక్షణములుకల ఆబ్రహ్మాయే ఆత్మ, అది నీవే అగుదువు" అని సారాంశము.

ఉద్దాలక మహర్షి తన పుత్రుడైన శ్వేతకేతువును ఉద్దేశించి మాటిమాటికి "స ఆత్మా, తత్త్వమసి" అది నీవే అయి వున్నావు అని ఉపదేశించినట్లు సామవేదీయమగు ఛాందోగ్య ఉపనిషత్తునందు 8వ ఖండము నుండి 16వ ఖండము వరకు (షష్ట ప్రపాఠకము నందు) పదే పదే చెప్పబడియున్నది.

శ్రుతులు, ఆచార్యుడు బోధించినటువంటి తన అద్వితీయ బ్రహ్మస్వరూపమును ఇతర మనోవృత్తులచే విచ్ఛిన్నము కాకుండా నిరంతరము భావించుటయే స్వస్వరూపానుసంధానము అని గ్రహింపదగును. తీవ్రమైన ఇట్టిభక్తినే నిధి ధ్యాసనము అని అందురు. ఈభక్తిప్రాబల్యము వలన ఆత్మయొక్క అపరోక్ష సాక్షాత్కారము కలుగుతుంది. వాస్తవికమైన తన నిత్యముక్త స్వరూపము అభివ్యక్తం అవుతుంది.

"స్వాత్మ తత్త్వాను సంధానం - భక్తిరిత్యపరేజగు :"
"వివేకచూడామణి."

శంకర భగవత్పాదులు శ్రీవివేకచూడామణి యందు "భక్తి" యను పదమునకు రెండు నిర్వచనములను ప్రతిపాదించారు. అందు మొదటిది "స్వస్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే". అనగా తనయొక్క స్వరరూపమును ఉపనిషత్తులలోను, బ్రహ్మసూత్రములలోను, భగవద్గీతలోను ప్రతిపాదించిన విధముగా ఎల్లప్పుడు అనుసంధానము చేయుట లేక ధ్యానించుట "భక్తి" యని చెప్పబడుచున్నది.

"స్వాత్మ తత్వాను సంధానం భక్తి : ఇతి అపరేజగుః" అనునది రెండవనిర్వచనము. అద్వైతులలోనే ఇతర ఋషులచే ఈనిర్వచనము చెప్పబడినది (అపరే జగుః) తనయొక్క స్వాత్మతత్వానుసంధానము

అనగా తనయొక్క ఆత్మ యొక్క యధార్థ స్వరూపమును అనుసంధానము చేయుట లేక ఆత్మవిచారణ చేయుట. ఈరెండు నిర్వచనములు దాదాపుగా సమానార్థకములేను. "స్వస్వరూపము" అన్నా స్వాత్మతత్వము" అన్నా ఒక్కటే. అయినప్పటికీ స్వ అనుమాటలో ఆత్మకు సంబంధించిన లేక తనకు సంబంధించిన అను అర్థం ఉన్నది.

స్వస్యరూపం → స్వస్వరూపం → ఆత్మనః స్వరూపమిత్యర్థం. అందుచే "స్వ+ఆత్మా" = తన ఆత్మ అను రెండు మాటలూ ఒకేచోటవాడుట చేత కించిత్ పునరుక్తిగా భావించవచ్చును అని శంకరులు తలచి మొదటి నిర్వచనమైన "స్వస్వరూపాను సంధానం" అను దానిని గ్రహించారు. అయితే స్వాత్మతత్వానుసంధానం అనగా ఆత్మతత్వాను సంధానం కూడా సమానార్థకమైన వాక్యమే అగుటచే "ఇతర ఋషులు ఇట్లు చెప్పిరి" అని నహినిందాన్యాయముచే గ్రహించినారు. అనగా రెండవ నిర్వచనము అయినా తమకు అభ్యంతరమ లేదు కాని మొదటి నిర్వచనము మిక్కిలి ఇష్టము అని భావము.

మరికొంతమంది అన్నమయాది పంచకోశములను ఆత్మకాదని నిషేధించి వీటికంటె విలక్షణమైన సచ్చిదానంద స్వరూపమును తానుగా చింతించుట భక్తి అని అంటారు.

**శ్రద్ధాభక్తి ధ్యాన యోగాన్ ముముక్షో**
**ర్ముక్తే ర్హేతూన్వక్తి సాక్షాచ్ఛ్రుతేర్గీః**
**యోవా ఏతేష్వేవ తిష్ఠత్యముష్య**
**మోక్షోzవిద్యా కల్పితా ద్దేహ బంధాత్**

**వివేక చూడామణి. 48**

సాక్షాత్తుగా వేదవాక్యము మోక్షముకోరువానికి మోక్షము కలుగుటకు శ్రద్ధ, భక్తి, ధ్యానయోగములను చెప్పుచున్నది. ఎవడైతే ఈశ్రద్ధాదులయందు స్థిరముగా నుండునో వానికి అవిద్యాకల్పితములగు దేహ బంధమునుండి (అనగా కర్మబంధమునుండి) మోక్షము కలుగును. ముముక్షువునకు తనలక్ష్యమైన మోక్షాన్ని సాధించటానికి శ్రద్ధ, భక్తి, ధ్యానము, యోగము ముఖ్య సాధనములని వేదము ముక్తకంఠంతో బోధిస్తున్నది. అవి

పాటించిన వానికి మాత్రమే అజ్ఞానము వలన కల్పించబడిన దేహము నుండి అహంకారము వరకు గల అనాత్మ వస్తువులతోడి బంధమునుండి విముక్తి సిద్ధించును. "శ్రద్ధ" అనగా గురువేదాంత వాక్యములందు సత్యత్వ నిశ్చయము (అచంచలమైన విశ్వాసము). భక్తి యనగా స్వస్వరూపాను సంధానము. దీనినే నిధి ధ్యాసనం అంటారు. ధ్యానమనగా శుద్ధమగు పరబ్రహ్మమునందు బుద్ధిని నిశ్చలముగా నిలుపుట (తదేక పరత్వము). శమాదిషట్కములో కడపటిది యగు సమాధానమునే ధ్యానము అని అంటారు.

(శ్రీశంకరులు - వివేకచూడామణి.)

యోగమనగా చిత్తమును బాహ్య విషయములందు మరలకుండా నిరోధించుట (చిత్తమును వృత్తి రహితముచేయుట. ఇందులో శ్రద్ధతక్కిన మూడింటికి సాధనము అనియు, యోగము ధ్యానమునకు, ధ్యానముభక్తికిని కారణమని తెలుసుకోవాలి.

ప్రాజ్ఞుడగు వాడు తన వాస్తవిక స్వరూపమును స్పష్టముగా తెలుసుకొని వివేకమను ఖడ్గముచేత ఆబంధములను త్రెంచుకొని తనకు తానే ఎప్పటికయినా బయట పడగలగాలి. అదే మానవ జీవిత పరమలక్ష్యము.

**నయోగేన నసాంఖ్యేన - కర్మణానో నవిద్యయా**
**బ్రహ్మాత్మైకత్వ బోధేన - మోక్షంసిద్ధ్యతినాన్యథా**

**వివేకచూడామణి - 58వ శ్లోకము**

యోగముచేకాని, సాంఖ్యముచేకాని, కర్మచే కాని, ఉపాసనచే కాని మోక్షము సిద్ధింపదు. బ్రహ్మాత్మైక్య బోధచేత మాత్రమే మోక్షము సిద్ధించును. ఇచ్చట బోధయనగా జ్ఞానము (తెలుసుకొనుట). అనగా యోగము. సాంఖ్యము, కర్మలు, ఉపాసనలు వ్యర్థములు అని భావము కాదు. బోధలేక జ్ఞానము సాక్షాత్తూ కారణమగునని మిగిలినవి పారంపర్యముగా కారణములగునని అర్థము. కర్మాదుల వలన చిత్తశుద్ధికలిగి, చిత్తము జ్ఞానసాధనకు యోగ్యమగును.

మోక్షము పొందిన జీవుడు అద్వయ పూర్ణ బ్రహ్మస్వరూపము నందుండును. మోక్షము "ము క్ష్" అను ధాతువు నుండి వచ్చినది. ముక్ష్ అనగా విడిచి పెట్టుట" అని అర్థము. పక్షిని పంజరము నుండి విడిచిపెట్టినట్లు స్థూల, సూక్ష్మ, కారణ దేహములనుండి జీవుని విడిచిపెట్టుట మోక్షము అని అర్థము. ఇదియే కైవల్యము. బ్రహ్మము, ఆత్మ ఒక్కటేనని తెలుసుకొన్నప్పుడు మాత్రమే ఈ మోక్షము అభివ్యక్తమవుతుంది. మరిక ఏవిధముగా కూడా ఇది లభించదు. బ్రహ్మాత్మైక్య బోధ అంటే "జీవాత్మ పరమాత్మ ఒక్కటే" అనీ, రెండు వస్తువులు లేవనీ శ్రవణ మననములచే దృఢముగా నిశ్చయించుకొని ఏకైక మగు ఆచైతన్యమును నిరంతరము ధ్యానింపగా కలుగు పూర్ణ బ్రహ్మము యొక్క "అపరోక్ష సాక్షాత్కారము."

నిర్మలమైన మనస్సుతో ఎల్లప్పుడూ భగవంతునే స్మరిస్తూ ఉండే అనన్యమైన భక్తి కలవారు మాత్రమే భగవత్స్వరూపాన్ని చూడగలుగుతారు. భగవంతుని తత్వం తెలుసుకోవటానికి, ఆయన రూపం చూడటానికి, అయనలో ప్రవేశించి ఆయనలో ఐక్యం కావటానికి అనన్యమైన భక్తి ఒకటే సాధనం "అనన్యభక్తి" అనగా పరమాత్మ తనలోనే ఉన్నాడని తనకన్న వేరు కాదని తెలుసుకోవటం.

నిష్కామకర్మ వలన, అనన్య భక్తి వలన, స్వస్వరూప జ్ఞానం వలన భగవంతుని యందు ఐక్యమవుతారు. పనులుచేయటం కర్మ. సంస్మరించటం భక్తి, ద్వేషం లేకుండా అందరినీ సమానంగా చూడటం జ్ఞానం. ఈమూడింటి బలం వలననూ వీటి అభ్యాసం చేతనూ, కర్మద్వారా భక్తి, భక్తిద్వారా జ్ఞానం, జ్ఞానం వలన భగవంతునిలో లీనమయ్యే మోక్షం కలుగుతుందని గీతలో భగవానుడు బోధించియున్నాడు.

ఎవని వాక్కు ప్రేమభక్తిచే గద్గదికమగుచున్నదో, ఎవని చిత్తము కరగి నీటివలె ప్రవహించుచున్నదో, రోదనము క్షణకాలమైనను ఆగ కుండునో, ఒక్కొక్కప్పుడు విలక్షణముగ పకపక నవ్వుచూ, సిగ్గు, లజ్జ విడిచి బిగ్గరగా గానము చేయుచుండునో, ఒక్కొక్కప్పుడు ఆనందముతో నాట్యము చేయచుండునో అటువంటి భక్తుడు తననే కాక లోకములను అన్నింటిని పవిత్రము చేయుచుండునని భగవానుడు ఉద్ధవునకు వివరించెను.

భక్తి భావముచే కోరికలు నశించిన వారు సర్వత్రా ఆత్మభావన కలవారగుదురు. కావున చిన్నదైనను పెద్దదైనను ఏప్రాణినీ ఏవిధముగానూ బాధపెట్టరు.

సాధ్వీమణి అయిన పతివ్రత తన అనురాగంతో భర్తను ఎలా స్వాధీనం చేసుకుంటుందో అదేవిధంగా భక్తులు, బ్రహవేత్తలు, భగవంతుని భక్తియనే త్రాడుతో తమ హృదయాలలో బంధించి ఉంచుకుంటారు. భగవంతుడు భక్తికి బద్ధుడై ఉంటాడు.

జీవులకు మనుష్యశరీరము లభించుటే పరమ దుర్లభము. దైవానుగ్రహం ఉంటే కాని లభించదు. అదిప్రాప్తించినప్పటికీ నీటిబుడగవలె జీవితము క్షణభంగురము. దానికి "నిత్యం సన్నిహితోమృత్యుః". ప్రతిక్షణమూ మృత్యుదేవత సన్నిహితంగా తాండవం చేస్తూ ఉంటుంది. ఏక్షణంలో మరణం ముంచుకు వస్తుందో తెలియదు. ఇట్టి అనిశ్చితమైన మనుష్య జన్మమునందు భగవంతుని ప్రేమించి, అతనిచే ప్రేమించబడు భక్తుల దర్శనము మరింత దుర్లభము.

జగత్తులో అనేక రకములైన ఆసక్తులూ, మమతలూ, మమకారాలూ ఉంటాయి. అవే మనిషికి బంధాన్ని కలిగిస్తాయి. వీటన్నింటినీ కూడా నశింప చేసి ముక్తిని కలిగించేది సత్సాంగత్యమే.

సూర్యోదయము కాగానే చీకటి పటాపంచలై పోవునట్లు, హృదయమును సంపూర్ణముగా భగవంతునికి అంకితం కావించిన సాధువుల దర్శన మాత్రముననే బంధములు తొలగిపోతాయి.

భగవంతుని అర్చామూర్తులను మాత్రమే శ్రద్ధగా పూజిస్తూ, భగవద్భక్తులను జ్ఞానులను సేవించి శుశ్రూష చేయనివాడు ప్రాకృత భక్తుడు. అనగా చాలా తక్కువ శ్రేణికిచెందిన భక్తుడు. నిస్సంగత్వమే మోక్షము. సత్సాంగత్యము వలన నిస్సంగత్వము, నిస్సంగత్వము వలన నిశ్చలతత్వము, నిశ్చలతత్త్వము వలన జీవన్ముక్తి లభిస్తాయి. ఏపురుషుని కర్మవలన ధర్మసంపదకాని, వైరాగ్యోత్పత్తి కాని, భగవంతుని సేవారూపమైన భక్తి గాని కలుగదో, అటువంటి పురుషుని జీవితము వ్యర్థము.

నిష్కామ కర్మాచరణచేయువానికన్న, సమస్తకర్మములు వాటి

ఫలములు, తన చిత్తము నాకే అర్పించి భేదభావములేని వాడై భగవంతుని ఉపాసించువాడు శ్రేష్ఠుడు. ఈవిధముగా చిత్తము, కర్మలు సమర్పించి అకర్తయై సమదర్శియైన పురుషునికంటె శ్రేష్ఠుడులేడు.

**విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని**
**శునిచైవశ్వపాకే చపండితాః సమదర్శినః**
**గీత 5 అ 18వ శ్లో**

"విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందు, గోవునందు, ఏనుగు నందు కుక్కయందు, కుక్క మాంసమును తిను చండాలుని యందు సమముగా వ్యాపించియున్న బ్రహ్మను చూచువారు పండితులు అని చెప్పబడుదురు." సమస్త వస్తువులయందు బ్రహ్మ, సమానముగా వ్యాపించియున్నను నామరూపగుణక్రియాదులచే ఉపాధిభేదము కలుగుచున్నది. ఈనామ రూపములను ఉపేక్షించి పరబ్రహ్మమును మాత్రమే దర్శించువారు పండితులు.

వేయించిన లేక ఉడికించిన విత్తనములు మొలకెత్తటానికి ఏవిధముగా పనికిరావో, ఆవిధముగా ఎవరైతే తమ మనోప్రాణములు భగవంతునియందు అర్పించి యున్నారో వారికోరికలు, కామనలు సంసారము వైపునకు ఈడ్చుకొనిపోవు.

**నహ్యబ్మయానితీర్థాని న దేవా మృచ్ఛిలామయాః**
**తేపు నం త్యురు కాలేన దర్శనాదేవ సాధవః**
**భాగవతము.**

కేవలము జలమయ తీర్థములే తీర్థములు కావు. మృత్తికతో, రాతితో, లోహముతో తయారైన మూర్తులే దేవతలు కారు. వాస్తవమునకు సత్పురుషులే తీర్థములు దేవతా స్వరూపములు. ఎందుచేతనంటే తీర్థములు, దేవతామూర్తులూ ఎంతోకాలం సేవిస్తే కాని పవిత్రం చేయలేవు. కాని, సాధువులు, సత్పురుషులు, బ్రహ్మవేత్తలు దర్శనమాత్రము చేతనే పవిత్రము చేయగలరు.

మానవజాతి అంతా కూడా తప్పక ఆచరించవలసినట్టి ధర్మములు కొన్ని ఉన్నాయి. ఎల్లప్పుడూ సత్యమునే పలకటం, అందరిపట్లా సమదృష్టి

కలిగి యుండటం, అహింసనే పాటించటం, కామక్రోధాది అరిషడ్వర్గములనుయుండటం, అహింసనే పాటించటం, కామక్రోధాది అరిషడ్వర్గములను జయించటం, వివేకముతో వ్యవహరించటం, ఇతర ప్రాణుల పట్ల దయతో మెలగటం, దానధర్మాలు చేయటం, గురువుల పట్ల భక్తి గౌరవాలను చూపటం, సమానబుద్ధిని పెంపొందిప చేసుకోవటం, సంతుష్టితో జీవించటం, సర్వేశ్వరుని ఆరాధించటం మొదలైనవి సర్వ సాధారణమైన నియమాలు. వాటిని అనుష్ఠించటం ద్వారా ఇహపరాలు రెండింటినీ సాధించటం జరుగుతుంది.

అశాశ్వతమైన ఐహిక భోగాలమీద ఆసక్తిని దూరంచేసుకొని అంతర్దృష్టితో వ్యవహరించేవారికి పరమశాంతి లభించి తీరుతుంది. అలాకాక క్షణికములైన విషయసుఖాలపట్ల ఆసక్తి చూపేవారు శాశ్వతమైన దుఃఖాన్ని సంపాదించుకున్నవారవుతారు.

అసంతుష్టి అనేది అశాంతికి మూలం. సంతుష్టిలేని జీవితం దుఃఖ భాజనం కాకతప్పదు. ఆప్రాణి కష్టించి పొందిన విద్య, కీర్తి అన్నీ వ్యర్థమే అవుతాయి. అందువలన వివేకులైనవారు దుఃఖమూలమైన అసంతుష్టిని ముందుగా త్యజిస్తారు. అసంతుష్టిని త్యజించటం వలన ఏవిధమైన దురాశా కలగటానికి అవకాశం ఉండదు. అందుచేత వారికి క్రోధం కలగదు. క్రోధాన్ని జయించినవారు నిర్భయులై చరించగలుగుతారు.

ధ్యాననిష్ఠను అవలంబించే వారు మనస్సును, వాక్కును నియమించుకోవటం (Control) అవసరం. అలా మనసునూ, వాక్కును నియమించుకున్నవారికి వేరే ఆలోచన అంటూ ఏదీ ఉండదు. అది ఆధారంగా వారు భగవంతుని యందే జీవించటం సంభవిస్తుంది. గృహస్థజీవితాన్ని గడుపుతూ కూడా భగవంతుని యందు బ్రతకటం సంభవమే. ఎప్పుడు ఏకర్మను ఆచరించినా దానిని దైవకార్యంగా భావించటం, ఎప్పటికి ఏది లభిస్తే అది దైవదత్తమనుకొని సంతుష్టితో అనుభవించటం, అవకాశం ఉన్నంతవరకూ గురువులనూ, అతిథులనూ అర్చించటం, విరామసమయములలో భగవంతుని లీలా శ్రవణం. భగవన్నామచింతనం చేయటం, భాగవతుల గోష్ఠిని ఆశించటం, వారిని గౌరవించటం, వారి అనుభూతులు గ్రహించటం మొదలైన కార్యాలు

గృహస్థులందరకూ ఆచరణీయమైనవే. వాటిని ఆచరించటం ద్వారా ఒక విధమైన శాంతి లభిస్తుంది. ఆవిధమైన శాంతి ఆత్మజ్ఞానోపార్జనకు అనువైన వాతావరణాన్ని మానసికంగా ఏర్పరుస్తుంది. అది పొందిన వారు కాలక్రమాన సక్రమమైన మార్గం ద్వారా ముక్తిని సాధించటం జరుగుతుంది.

సంతుష్ఠ హృదయుల తేజం అంతకంతకూ వృద్ధి అవుతుంది. అసంతుష్టుల తేజం క్షణం క్షణం క్షీణించిపోతుంది. నిత్యసంతోషి మూడు లోకాలలోను పూజ్యుడవుతాడు. ధనముచే మదించి గ్రుడ్డివారి వలె ప్రవర్తించువారు లోకాలను, భగవంతునీ అవమానిస్తూ ఉంటారు. అందుకనే భగవంతుడు తాను అనుగ్రహించదలచిన వారిని అహంకార, మమకార రహితులుగా చేస్తాడు.

"బ్రహ్మన్ యమను గృహ్ణామిత ద్విశో విధనోమ్యహమ్"

సంస్కృత భాగవతం 8వ స్కంధం
22వ అధ్యాయం 24వ శ్లోకము
(వామన చరిత్ర లోనిది)

"ఎవ్వని గరుణింప నిచ్చయించితి వాని యఖిల విత్తంబునే నపహరింతు సంసార గురు మదస్తబ్ధుడై యెవ్వడు దెగడి లోకము నన్ను ధిక్కరించు, నతఁడెల్ల కాలంబు నఖిల యోనులయందు బుట్టుచు దుర్గతిఁబొందు బిదప విత్తవయో రూప విద్యాబలైశ్వర్య కర్మ జన్మంబుల గర్వముడిగి

యేక విధమున విమలుడై ఎవ్వడుండు
వాడునా కూర్చి రక్షింపవలయువాడు
స్తంభలోభాభిమాన సంసార విభవ
మత్తుడై చెడనొల్లడు మత్పరుండు.

భాగవతము అష్టమ స్కంధం
22వ అధ్యాయం 658 పద్యం.

జన్మలన్నింటిలోనూ ఉత్తమమైనది మానవజన్మ. సామాన్యంగా జనులు తమకు ప్రాప్తించిన వయసు. సౌందర్యము, విద్య, బలము, శౌర్యము మొదలైన వాటివల్లా, జన్మకర్మల వల్లా గర్వించి ఉంటారు.

ఆకారణంగా వారు జనన మరణ రూపమైన సంసారంలో చిక్కి దుఃఖాన్ని అనుభవిస్తూ ఉండటం జరుగుతుంది. ఎప్పుడైతే ఆగర్వం అణగి పోతుందో అప్పుడు వారు గర్వం, అహంకారం నశించి నిర్మలులౌతారు. అలా నిర్మలులైనవారు ఈశ్వరునిచే సంరక్షింపబడతారు.

యధార్ధమునకు జన్మించిన ప్రతి ప్రాణీ మరణించటం సహజం, "జాతస్యహిధృవోమృత్యుః" ఆమరణమన్నది ఎప్పుడు ఎలా సంభవించేదీ మనకెవరికీ తెలియదు. అది దేహిని పుట్టుకనుండీ వెంటాడుతూనే ఉంటుంది. ఈరోజునకాకపోయినా ఎప్పటికయినా అది దాని పని పూర్తి చేసే తీరుతుంది. కాని, అందులో మనం గ్రహించవలసిన విషయం ఒకటి ఉంది. దేహితన పూర్వకర్మలననుసరించి కష్టసుఖాలను కాని, ఆనంద విషాదాలను కాని అనుభవించటం జరుగుతుంది. కాలక్రమాన పంచత్వం పొందేది దేహమే కాని దేహికాడు.

అది గ్రహించలేక ప్రతిప్రాణీ తనకు అనుభవమయ్యే ప్రతి విషయానికీ ఇతరులు కారణమని అనుకోవటం జరుగుతుంది. దానికీ అజ్ఞానమే మూలకారణం. ఆఅజ్ఞానం మాయవలన జన్మిస్తుంది. మాయను జయించటం మానవులందరికీ సాధ్యమయ్యే పనికాదు.

ధర్మమే భగవంతుని దేహం అన్నమాట యధార్థం. వేదాలు, గోవులు, విప్రులూ పూజింపబడేచోట, తపోధ్యాన యజ్ఞాదులు జరిగేచోటా, దయా సత్యశౌచాలు పాటింపబడేచోట, సహనం ఉన్న చోట భగవద్విభూతి తప్పక ప్రకటింపబడుతుంది.

భగవంతుని అనన్యభావంతో సేవించేవారికి ఆయనను ప్రసన్నుని చేసుకునే మార్గాలు అనేకం వున్నాయి. వాటిన్నింటికీ కూడా అనవరత స్మరణ ప్రధానం. "కతౌ స్మరణాన్ముక్తిః" అనగా ఎల్లప్పడూ భగవంతుని స్మరిస్తూ ఉండటం. పనులు మానకుండా ఏపనిని చేస్తున్నా మనసు భగవంతుని యందు లగ్నమై ఉండటం ప్రధానం. స్మరణకు మూలము దైన్యము కావచ్చును. ఆర్తికావచ్చును. ఆనందంకావచ్చును. బాంధవ్యం కావచ్చును. దంభ, వైర, ద్వేషాదులతో కూడిన స్మరణ కూడా ఒక విధమైన భక్తియే అని చెప్పబడినది. అయిననూ వైర, ద్వేషాదులతో కూడిన భక్తిమార్గము అంతసులభమైనది కాదు. కాని, చివరకు మోక్షము కలుగుట

గ్రాత్రము ఈ వివిధ మార్గములలో సాధనచేయు వారందరికీ సమానమే.

అవధిలేని పరమానందానుభవమే భక్తికి పరమలక్ష్యం కావాలి. పరమానందానుభూతిని కాంక్షించే వారు ప్రప్రథమంగా ఐహిక భోగాల ట్ల అభిరుచి త్యజించాలి. సిరిసంపదలమీదా, పేరు ప్రతిష్టల మీదా నకున్న వ్యామోహాన్ని విసర్జించాలి. ప్రాపంచిక విషయవాసనా గారులుకావాలి.

పరమాత్ముని ప్రేమించి, సేవించి, ఆయనదైన వాత్సల్యామృతాన్ని స్వాదించినవారికి ప్రపంచంతో ఏవిధమైన సంబంధమూ ఉండదు. 'రు ప్రపంచానికి దూరంగా ఉంటారు. ప్రపంచం కూడా వారికి దూరంగా ండటానికి ప్రయత్నిస్తుంది. వారిని ఉన్మాదులుగా చూస్తుంది. శ్రీరామకృష్ణ రమహంస, చైతన్య మహాప్రభు మొ॥ వారిని పిచ్చివారిగా భావించి పాగల్" అని అనేవారు. భగవత్ప్రేమను మించిన మత్తు పదార్థం మరొకటి దు. భగవంతుని ప్రేమించిన వారికి ఆయన వినా మరేదీ కనిపించదు. గవంతుని సగుణంగా ఉపాసించటం ముఖ్యమైన మార్గం. ఇది భక్తికి ధాన లక్షణం.

భగవన్నామము వినినంతనే ఆనందాశ్రువులు స్రవించకుండునంత రకే భక్తి సాధనలు ఆవశ్యకము. భగవన్నామము విన్నంతమాత్రమున నంద భాష్పములు కురుస్తూ ఎవని హృదయం ఉప్పొంగుతుందో 'నికిక ఇతర సాధనలు అనావశ్యకము.

పండితులైనా, పామరులైనా తనను తెలుసుకొనుటకు పరితపించు నభక్తులందరి హృదయములందును భగవంతుడు సమానముగా ్రమానురాగములను చూపును. భక్తుల అభీష్టము ననుసరించి ఒకే గవానుడు వేరు వేరు రూపములతో సాక్షాత్కరించుచుండును. భక్తుడు న అంతఃకరణము యొక్క శక్తి సామర్థ్యము ననుసరించి భగవదను వమును పొందుచుండును. పరమాత్ముని సమీపించినకొలదీ అపూర్వమగు తని విభూతులను, అనంత కళ్యాణగుణములను కాంచుచుండును.

భగవంతుని వెదకుచు, ఎవ్వడు పరితపించునో, విలపించునో ట్టివాడు నిశ్చయముగా భగవంతునిగాంచును. కాని, ఆవిధముగా గవంతుని కొరకై ఆర్తితో పరితపించి, విలపించేవారు ఎందరు ఉంటారు?

అందుకే భగవద్గీతయందు శ్రీకృష్ణపరమాత్మ

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాంవేత్తి తత్త్వతః"
గీత. 7అ. 3శ్లో.

"అనేక వేలమంది మనుష్యులలో ఒకానొకడు మాత్రమే మోక్షసిద్ధి కొరకు ప్రయత్నించుచున్నాడు. ఇట్లు ప్రయత్నించు ముముక్షువులయందు ఒకానొకడు మాత్రమే నన్ను యథా అర్థముగా తెలుసుకొనుచున్నాడు." అన్నాడు కృష్ణభగవానుడు.

"నీటమునిగిపోవువాడు ఊపిరాడక పరితపించునట్లు" భగవంతుని కొరకూ ప్రయత్నించవలెను ప్రాపంచిక విషయాలకొరకై కాక భగవత్సాక్షాత్కారమునకై పరితపించవలెను. అప్పుడే భగవంతుని సాక్షాత్కారమగును.

భగవానుని దివ్యనామము అనంతశక్తిమంతము. సందేహము లేదు. కాని భక్తిలేని నామస్మరణ వ్యర్థము. కామినీ కాంచనములపై, ప్రాపంచిక సౌఖ్యములపై మోహము, మమకారము పెట్టుకొని భగవన్నామ స్మరణము చేసినందు వలన భక్తిలాభములేదు. భక్తిలాభము కలుగచేయుమని, పేరుప్రతిష్టలు, శరీర సుఖములు మొదలగు తుచ్ఛమైన, క్షణిక విషయములందలి మోహమును క్షీణింపచేయమని భగవంతుని వేడుకొనుచు సదా భగవన్నామస్మరణము చేయుచుండవలయును.

"హరేర్నామహరేర్నామ హరేర్నామైవకేవలం
కలౌనాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యే వగతిరన్యథా"
"విష్ణుసహస్రనామ శంకరభాష్యము నుండి గ్రహింపబడినది".

కలియుగములో హరినామసంకీర్తనము కంటె తరుణోపాయము వేరొకటి ముమ్మాటికిని లేదు. లౌకిక బుద్ధికలవారి భక్తి సాధనలు కేవలము అప్పటికప్పుడు ఉండునవి. వాటివలన స్థిరమైన సంస్కారము కలుగదు. కాని భగవద్భక్తి పరాయణులైన వారు ప్రతిశ్వాస తోడను భగవన్నామమును ఉచ్ఛరిస్తూ ఉంటారు.

ఎరిగికాని, ఎరుగకకాని, ఏస్థితిలోనైనను భగవన్నామమును ఉచ్ఛరించిన యెడల దానివలన తప్పక సత్ఫలము కలుగును. తెలియక

చేస్తేనే నామస్మరణవలన ఎంతో ఫలితం కలుగుతుంటే మరి తెలిసిచేస్తే ఇంకెంత ఫలితం కలుగుతుందో వేరే చెప్పనక్కరలేదు కదా ! అందుకే గానబ్రహ్మ త్యాగరాజు "తెలిసి రామచింతన సేయవే ఓ మనసా !!" అని కీర్తించాడు.

భక్తిమార్గంలో ఇంద్రియనిగ్రహం సులభంగా కలుగుతుంది. మనసులో భగవద్భక్తి వృద్ధిపొందిన కొలదీ విషయభోగాలు రసహీనంగా కనిపిస్తాయి. నిరంతర భగవన్నామస్మరణ వలన సమస్త పాపములు, కామక్రోధములు నిర్మూలమై, వాంఛలన్నీ అదృశ్యమైపోతాయి. అది ఏనామమైనా సరే. కాని భగవన్నామము నందు అనుభూతి, భక్తి కలిగి స్మరణచేయాలి. భక్తులు "నారద పాంచరాత్రాది" గ్రంధములయందు చెప్పబడిన విధంగా బిగ్గరగా భగవన్నామ సంకీర్తనము చేయుటయే ఉత్తమసాధనము.

భగవన్నామము చెవినబడినంతనే ఎవ్వనికి పులకాంకురమై రోమాంచమగునో, ఎవని కన్నులనుండి ఆనందభాష్పములు ప్రవహించునో. అట్టివానికి అదియే తుదిజన్మము. అందుచేతనే త్యాగరాజు "బంటురీతి కొలువీయవయ్యా రామా ! అన్న కీర్తనలో రోమాంచమనే ఘనకంచుకమూ, రామభక్తియనే ముద్రబిళ్లయునూ, రామనామమనే వరఖడ్గమునూ ఇవ్వమని ఆశ్రీరామచంద్రుని ప్రార్థించాడు.

కొలిమిలో కాలుచున్నంతసేపూ ఇనుము ఎఱ్ఱగా వుండి చంద్రనిప్పువలె ప్రకాశిస్తుంది. కాని కొలిమినుండి బయటకు తీయగానే చల్లబడి, నల్లబడిపోతుంది. ఆవిధంగానే లౌకికులు దేవాలయంలోకాని, సాధు సాంగత్యంలో కాని ఉన్నంతసేపూ భక్తి పరవశులుగానే కనిపిస్తారు. కాని, ఆసాంగత్యము తొలగగానే ఆభక్తి పారవశ్యము అడుగంటి పోతుంది.

భక్తి మార్గమున భగవానుని మన తండ్రిగాకాని, తల్లిగాకాని, మిత్రునిగా కాని, పుత్రునిగా కాని, ప్రాణేశ్వరునిగాకాని, సన్నిహితమైన మరే ఇతర సంబంధముతో కాని భావించవచ్చును. భక్తుని మనోభావము ననుసరించి భగవానుడు వివిధ దివ్య రూపములతో సాక్షాత్కరించు చుండును.

శ్రద్ధాభక్తులతో భగవంతుని ప్రార్థించుటయే కర్మయోగముకంటెను, జ్ఞానయోగము కంటెను భగవదనుసంధానమునకు ఎక్కువ తగియున్నది.

ఈకలియుగంలో నారదుడు బోధించిన శ్రద్ధ భక్తి, ఆత్మార్పణము – వీటి అనుష్ఠానపూర్వకమైన భగవదనుసంధానమార్గమే తగియున్నది. హృదయమున భగవదకథ వెల్లివిరియగనే కర్మత్యాగము దానంతట అదియే సిద్ధించును.

భక్తి ప్రభావం అంతా ఇంతా అని చెప్పటానికి వీలులేదు. భక్తుడైనవాడు భగవన్నామం చెవిన పడగానే పులకిస్తాడు. హర్షాశ్రువులు రాలుస్తాడు. గద్గదస్వరంతో నామస్మరణ చేస్తూ ఉంటాడు. ఆదేవదేవుని లీలా విశేషములను కీర్తిస్తూ ఉంటాడు. చింతనం చేస్తూ ఉంటాడు. తనలో తాను ఏదేదో మాటాడుకుంటూ దేవతలు ఆవేశించిన మాదిరిగా మెలగుతూ ఉంటాడు. ఆవిధంగా వర్తిస్తూ ఉండటం వలన అతని అజ్ఞానం తొలగిపోవటం, భవబంధాలు తెగిపోవటం జరుగుతుంది. భగవంతుని మెప్పించగలిగింది అనన్యమైన భక్తి ఒక్కటే.

**చాలదు భూదేవత్వము**
**చాలదు దేవత్వమధికశాంతత్వంబుం**
**జాలదు హరిమెప్పింపవి**
**శాలోద్యములార భక్తి చాలిన భంగి**

**(భాగవతము)**

భక్తివలన భగవంతుని మెప్పించినట్లుగా భూదేవత్వము వలన కాని, శాంతత్వంవలన కాని మెప్పించటం అసంభవం. అట్టి భగవంతుడు ఎటువంటి వాడంటే ....

**చిక్కడు వ్రతముల గ్రతువులఁ**
**జిక్కడు దానముల శౌచశీల తపములం**
**జిక్కడు యుక్తిని భక్తిని**
**జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుమ్మీ**

ఆయన భక్తినే మెచ్చుతాడు. భక్తికే చిక్కుతాడు. అంతేకాని వ్రతములు చేయటంవలన కాని, యాగములు చేయటం వలన కాని, దానముల వలనకాని, శౌచశీలతపాదులచేతకాని ఆయన చిక్కడు. భక్తితో ప్రార్థించిన వారి హృదయాలలో బందీ అయివుంటాడు ఆభక్త సులభుడు.

భగవన్నామోచ్చారణంలో గల మహాత్మ్యాన్ని అందరూ గ్రహించలేరు. భగవంతుని నామాన్ని ఉచ్చరించటం ద్వారా ఆయన కళ్యాణ గుణములను సంకీర్తనం చేయటంద్వారా భగవద్భక్తిని అలవరచుకోవటమే మానవుల పరమ ధర్మం. ఆధర్మాన్ని పాటించిన వారే పరమ భాగవతులని అనిపించుకుంటారు.

**పద్మనయను మీది భక్తి యోగం బెల్ల**
**ముక్తియోగమనుచు మొదలె ఱుంగు**
**వారి, వారివారి, వారి చేరిన వారి**
**త్రోవ దలపవలదు దూతలారా !**

భగవంతుని యందు భక్తి యోగమే ముక్తియోగమనే సత్యాన్ని తెలుసుకొన్న వారిని, వారివారిని, వారిని చేరినవారిని చేరటానికి యమదూతలకు సాధ్యముకాదు. వ్రతాదులవలన కలుగని చిత్తశుద్ధి హరిచరిత్రలు వినటం వలనా, హరిస్మరణం వలనా, హరి నామోచ్ఛరణ వలనా కలుగుతుంది.

పాపాలను క్షయం చేసుకోవటానికి వ్రతాదులు ఇంకా ఎన్నో ఇతర మార్గాలు ఉన్నాయి. కాని, ఆమార్గాలను అనుసరించటం వలన అప్పటి వరకూ తాను ఆచరించిన పాపములను క్షయింపచేసుకోవటం మాత్రమే అవుతుంది. తిరిగివారు పాపాలు చేయకుండా ఉండటానికి ఆమార్గాలు అడ్డురావు. కాని భగవంతుని పాదపద్మములను ఒక్కసారి ఆశ్రయించినవారు వాటిని వదలటమంటూ జరగదు. దానిమూలంగా వారు అంతకు పూర్వం త్యజించిన పాపకర్మలను తిరిగిచేయటం అనేది వుండదు. పరమ పాపియైన అజామీళుడు అంత్యకాలంలో కుమారుని పిలుస్తూ హరినామాన్నే ఉచ్ఛరించటంచేత అతని పాపాలన్నీ పటా పంచలైపోయినాయని భాగవతము నందు అజామీళోపాఖ్యానములో చెప్పబడింది. జన్మపొడుగునా అతడు ఆచరించిన పాపాలన్నీ తుది ఘడియలలో భగవంతుని స్మరించటం వలన నిర్మూలమైపోవటమే కాకుండా భగవన్నామస్మరణం వలన అజామీళుడు పరమపవిత్రుడై భగవద్భక్తులలో ఒకనిగా పరిగణింపబడినాడు.

పాప నివృత్తికి భగవన్నామాన్ని ఉచ్ఛరించటంకంటె మించిన ప్రాయశ్చిత్తం లేదు. ఏపరిస్థితిలో ఎలా భగవంతుని ధ్యానించినా పాపం

నశించి తీరుతుంది.

బాంధవముననైనఁబగనైన వగనైన
బ్రీతినైన బ్రాణభీతినైన
భక్తినైన హరికిఁబరతంత్రులైయుండు
జనులు మోక్షమునకు జనుదురధిప !

భగవంతుడు భక్తసులభుడు. ఆయన పాదాలను ఆశ్రయించినవారికి స్వర్గాదిభోగముల పట్లకూడా ఆసక్తి ఉండదు. భగవద్భక్తులకు తొలుతగా బాహ్య విషయేచ్ఛ తొలగిపోతుంది. అంతశ్శుద్ధి ఏర్పడుతుంది. పరిశుద్ధమైన శీలం అలవడుతుంది. ఆకారణంగా వారికి ఈశ్వర తత్వం గ్రాహ్యమౌతుంది.

అఖిల శక్తి సంపన్నుడూ, ఆనందమయుడూ అయిన భగవంతుని పట్ల దృఢమైన భక్తి కలిగినప్పుడు నేను, నాది అనే భావం తొలగిపోతుంది. బ్రహ్మ జ్ఞాన సిద్ధి పొందే విషయంలో భక్తి యోగానికి మించిన మార్గం మరొకటిలేదు. భక్తియోగంలో పరిణతి పొందినవారు భగవత్సేవకే తమ జీవితాన్ని అంకితం చేసుకుంటారు. విషయవాసనలను దూరంచేసుకొని మాధవుని మీద మనసు నిలుపుకోవటమే భక్తి అనిపించుకుంటుంది. అది తామస, రాజసిక, సాత్త్వికములను మూడురకములుగా ఉంటుంది.

హింసా ప్రవృత్తితోను, దంభప్రక్రియతోను, మాత్సర్య పూరితంగాను చేసే భక్తి తామసభక్తి. విషయభోగాలను కానీ, మహదైశ్వర్యమును కాని, సద్యశమును కాని, వాంఛించి చేసే భక్తిరాజసభక్తి. పూర్వంచేసిన పాపాలను నిర్మూలించుకునే ఉద్దేశంతోనూ, పరమేశ్వరుని ప్రసన్నుని చేసుకునే అభిప్రాయంతోనూ, శాస్త్రచోదిత మార్గాన్ని అనుసరించాలనే మనసుతోనూ చేసే భక్తి సాత్త్విక భక్తి అని పిలవబడుతుంది.

భగవంతుడు సర్వభూతమయుడు. అదిగ్రహించలేనివారే పరులను ద్వేషిస్తారు. ఆవిధమైన ద్వేష బుద్ధికలవారికి మనశ్శాంతి అనేది లభించదు. సర్వభూతాలను సమబుద్ధితో చూడటం భక్తులయిన వారి పరమ ధర్మం. అభేద దర్శనము (భేదభావము లేకుండా సమదృష్టితో చూడటం) పరమేశ్వరోపాసకుల ప్రథమ కర్తవ్యం. సర్వకర్మలను వాటి ఫలములను పరమాత్మునికే అర్పించిన వారు పరమేశ్వరుని ప్రీతికి పాత్రులవుతారు.

కర్తృత్వాభిమానం లేకుండా సమదర్శనులై చరించేవారు భగవద్భక్తులలో శ్రేష్ఠతములు అనిపించుకుంటారు. భగవద్భక్తులు అయినవారు ఇతరులు తమకు చేసిన అపకారానికి ప్రతీకారం చెయ్యరు.

భగవద్భక్తి జనించగానే మితభాషిత్వం, వినయం., శ్రద్ధ, ఇంద్రియ నిగ్రహం అలవడతాయి. వాటిద్వారా పాపాలు క్షీణించిపోతాయి. భగవంతుని సేవించేవారికి భక్తి పరిపక్వంచెందకముందే మరణం సంభవించినా మరుసటి జన్మలో అయినా అది వానికి సిద్ధిస్తుంది. భక్తి అమృతం వంటిది. ఒకసారి రుచి చూసినవారు వదులుకోలేరు. దానిని త్రాగిన కొద్ది త్రాగాలనే అనిపిస్తూ ఉంటుంది. తనివి చెందటమనేది భక్తి విషయంలో లేనేలేదు.

భగవత్కాధామృతాన్ని సేవించటం వలన భక్తి పెరుగుతుంది. భక్తి పెరగటం ద్వారా అంతఃకరణశుద్ధి ఏర్పడుతుంది. అంతఃకరణ శుద్ధి ఏర్పడగానే వైరాగ్యంతో కూడుకున్న జ్ఞానం అలవడుతుంది. ఆ జ్ఞానం ద్వారా విష్ణుపదం లభిస్తుంది. విరక్తినీ, జ్ఞానాన్నీ పొందటానికి అనన్యమైన భగవద్భక్తి అవసరం. భగవద్భక్తి అనేది భగవద్గుణ వర్ణనశ్రవణాదుల ద్వారా లభిస్తుంది. భగంతుడు కరుణామయుడు ఆయనను ఏవిధంగా ఆరాధించినా ఆయన ఆనందిస్తాడు. ఆయనను ఆనందపరచటమే జీవిత పరమార్థం.

దీనినే "తత్సుఖ సుఖిత్వం" అంటారు. అనగా పరమేశ్వరుడు సంతోషించినందువలన మనము సంతోషించుట.

మానవజీవితం అత్యల్పమైనది. మానవులు తమ వయసులో పెరిగిన ప్రతిక్షణాన్నీ తమ జీవితకాలంలో తరిగిన క్షణంగా భావించాలి. అలా భావించగలిగినవారు భౌతిక సుఖాలను వాంఛించరు. వారు సర్వ శరణ్యుడైన అపరాత్మరునే ఆశ్రయిస్తారు. ఆయననే భక్తితో ఆరాధిస్తారు. అందువలన అంతవరకు వారిని ఆవరించియున్న అవిద్య తొలగిపోతుంది.

**సాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా"**

**నారద భక్తి సూత్రములు.**

భగవంతుని యందలి పరమప్రేమయే భక్తి, భగవంతునిగూర్చి

నిజమైన, నిష్కళంకమైన అన్వేషణయే భక్తియోగము. ఇది ప్రేమలో జనించి, ప్రేమలో వికసించి, ప్రేమయందే లయిస్తుంది. ఉత్కృష్టమైనటు వంటి భగవత్ప్రేమోన్మాదము క్షణకాలము లభించినా అది మనకు శాశ్వతమోక్షాన్ని కలిగిస్తుంది. అటువంటి భక్తిలభించిన మానవుడు సిద్ధుడు, మృత్యురహితుడు, తృప్తుడు అవుతాడు. ఇక అతడు కొంచెము కూడా దేనినీ కోరడు; విచారమునకు లోబడడు; ఎవరినీ ద్వేషించడు; దేని యందునూ; రమించడు. సుఖమునకు పొంగడు. దుఃఖమునకు కృంగిపోడు.

**యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధోభవత్యమృతో భవతి తృప్తో భవతి**
**యత్ప్రాప్యన కించి ద్వాం ఛతి, నశోచతి, నద్వేష్టి నరమతే**
**నోత్సాహీ భవతి**

**(నారద భక్తి సూత్రములు)**

ఇటువంటి దివ్యమైన ప్రేమకు ఏ ఐహిక లాభము కూడా సరిపోదు. లౌకిక వాంఛలు ఉన్నంతవరకూ భగవత్రేమ ఎన్నటికీ జనించదు. కర్మము కంటె, జ్ఞానము కంటె, యోగము కంటె భక్తి అధిక తరము. ఎందువలననగా ఇవన్నియు ఏదో ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించినట్టివి. కాని భక్తి మాత్రము దానికదియే ప్రతిఫలము, సాధన మరియు సాధ్యము కూడా ("స్వయం ఫలరూపః ఇతిబ్రహ్మకుమారః) నా. భ. సూ.

**"ఈభక్తి అనేక సాధనల యొక్క పరమ ఫల స్వరూపమైనది"**
**అన్నారు బ్రహ్మకుమారుడైన నాదరమహర్షి**

అంతేకాక భక్తి మార్గములో కల గొప్పలాభమూ, ప్రయోజనము ఏమనగా అవి జీవిత పరమావధిని పొందుటకు అత్యంత సహజము, సులభము అయిన మార్గము.

**"అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ"**
**నా. భ. సూ.**

"ఇతర సాధనలను అనుసరించువారికన్న భక్తులకు ఎక్కువ సౌలభ్యము కలదు."

భక్తి పరిపక్వమై పరాభక్తిగా పరిణమించగానే ఘోరమైన మత ద్వేషాదులకు అవకాశంకాని, వాటివలన భయం కాని కలగదు. నిజమైన

భక్తుడు అన్ని మతాల సారం ఒక్కటేనని తద్వారా బోధింపబడే దైవం ఒక్కటేననీ అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతాడు. అన్ని మతాలలో చెప్పబడిన మార్గాల ద్వారా సాధనచేసి అనుభూతి పొందిన శ్రీరామకృష్ణపరమహంస అందరికీ ఆదర్శమూర్తి.

ఉత్కృష్టమైన ఈపరాభక్తి రసాస్వాదనలో తన్మయుడగు భక్తుడు, ప్రేమమూర్తి యగు భగవంతునకు అత్యంత సన్నిహితుడు. భక్తిరసపూరితమగు ఆతని హృదయమున ద్వేషమునకు తావుండదు.

"ఆవృత్తిః అసకృత్ ఉపదేశాత్"

చతుర్థధ్యాయము 1వ సూత్రము ప్రధమపాదము.

శంకర భగవత్పాదులు 'ఆవృత్తిః అసకృదుపదేశాత్" అను సూత్రమును వివరిస్తూ ఈవిధంగా చెప్పారు – "ఎట్లన జనులిట్లు పల్కుదురు. అతడు గురువును ఉపాసించుచున్నాడు. అతడు రాజును ఉపాసించుచున్నాడు. అట్లు ఉపాసించుటయే తమ పరమలక్ష్యంగా భావించి వారలను అనువర్తించుచున్నాడు. ఇట్లే వారిట్లు పల్కుదురు – ప్రియురాలగు భార్య తన ప్రాణేశ్వరుని గురించి ధ్యానించును. "ఇచటకూడా ఉత్కంఠతో కూడిన నిరంతర స్మరణ అనియే తాత్పర్యము. శంకరులవారిని అనుసరించి ఇదియే భక్తి.

"ధ్యానంచ తైల ధారావదవిఛ్ఛిన్న స్మృతి సంతానరూపమ్
ధృవాస్మృతిః - స్మృతిలబ్ధే సర్వ గ్రన్థీనాం విప్రమోక్ష ః ॥

ఒక పాత్రనుండి మరియొక పాత్రలోనికి ఎడతెగని ధారగా పోయబడిన చమురు వలె ధ్యేయమును గూర్చి చేయబడు నిరంతరమైన స్మరణమే ధ్యానము. భగవంతుని గురించి ఇట్టి నిరంతర స్మరణ లభించినంతనే భవబంధములన్నియు పటాపంచలగును. నిరంతర స్మరణ మోక్షోపాయమని స్మృతులచే చెప్పబడినది. మరియు ఈస్మరణము తత్వదర్శనముతో సమరూపమైనది. ఎట్లనగా ....

భిద్యతే హృదయగ్రంథిశ్చి ద్యన్తే సర్వ సంశయాః
క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే

ముండకోపనిషత్తు 2-2-8.

"పరమాత్మ సర్వకారణాత్మ అగుటచే" పరుడనియు, జగత్కార్యము అతని స్వరూపమే అగుటచే "అవరుడ"నియు చెప్పబడుచున్నాడు. అట్టి పరావరుడగు పరమాత్మను నేనే అని సాక్షాత్కారము చేసుకొనుచుండగా సర్వహృదయ గ్రంధులు నశించి సంసారము నశించును. బుద్ధినాశ్రయించి పీటముడివలె గట్టిపడిన అవిద్యావాసనా జాలము వీడిపోవును. నదీప్రవాహము వలె అవిచ్ఛిన్నముగా ప్రవహించుచున్న సర్వసంశయములు విడిపోవును. సంశయములు పోయిన వెంటనే అవిద్యయు నశించును. ప్రాక్తన జన్మసంబంధమగు సంచిత కర్మంతయూ నశించగా పునర్జన్మ లేకుండును. సంసారకారణము లేకుండుటచే జీవన్ముక్తి లభించును."

దూరస్థమయ్యును, సన్నిహితమగు పరతత్త్వమును దర్శించినంతనే అజ్ఞానపాశములు విచ్ఛిన్నమగును. సమస్త సంశయములు సమసిపోవును. అశేషకర్మచయమగును.

దగ్గరగా ఉన్నవానిని దర్శించవచ్చును. దూరముగా ఉన్న వానిని స్మరించవచ్చును. సన్నిహితుడగు వానిని మాత్రమే కాక దూరస్థుడగు వానిని కూడ దర్శించవలయును. "ఆత్మావా అరే ద్రష్టవ్యః" అని శృతి చెప్పుచున్నది. అరే = (సంబోధన) ఓ మైత్రేయీ, ఆత్మద్రష్టవ్యము. అనగా ఓ మైత్రేయీ ఆత్మను చూడుము అని అర్థము. ఆత్మను అనగా తనను తాను వేరుగా చూచుట అసంభవము కావున ఈ పైన చెప్పబడిన స్మరణము దర్శనముతో సమానమగునని సూచించబడుచున్నది. ఈ స్మరణము అభివృద్ధినొందినప్పుడు దర్శనముతో సమరూపమును పొందును. నిరంతర స్మరణమే ఉపాసనమని శ్రుతి ప్రామాణ్యము. మరియు అనవరతోపాసనమే భక్తి. ఈభక్తి నిరంతర స్మరణ రూపమని వర్ణింపబడినది. ఇట్లు సాక్షాత్కార తుల్యమగు ఉత్తమ స్మరణము శ్రుతిచే మోక్షోపాయము అని చెప్పబడినది.

**నాయమాత్మా ప్రవచనేన లభ్యానమేధయా న బహునాశృతేన**
**యమే వైషవృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా**
**వివృణుతే తనూగ్ంస్వామ్॥**
**"కఠోపనిషత్తు"**

ఈ ఆత్మను శాస్త్రప్రవచనములచే కాని, ధీశక్తిచేకాని, విశేషమగు వేదపఠనముచేకాని, పొందజాలము. ఈఆత్మ ఎవ్వని వరించునో వానికే

లభించును. వానికే సాక్షాత్కరించును. ఇచట కేవల శ్రవణ మనన నిధిధ్యాసనములు ఆత్మ ప్రాప్తికి ఉపాయములు కావని చెప్పిన పిమ్మట' ' ఎవ్వని నీఆత్మ వరించునో వానికే ఈ ఆత్మ లభించును." అని చెప్పబడినది. ఎవ్వనికి ఈ ఆత్మ ప్రియతమమో వాడే ఆత్మకును ప్రియతముడగును. కావున ఇట్టి ప్రియతమ వస్తువును పొందుటకు స్వయముగా భగవానుడే మనకు తోడ్పడును.

**తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్**
**దదామి బుద్ధి యోగం తం యేనమా ముపయాన్తితే ॥**
**గీత ॥ విభూతియోగము - 10 అ - 10శ్లో.**

"సదా నాయందు ఆసక్తులు. ప్రీతి పూర్వకముగా నన్ను భజించువారలు అగువారికి మత్ప్రాప్తి హేతువగు బుద్ధియోగమునొసగెదను. ఆబుద్ధియోగముచే వారు నన్ను పొందగలరు" అని భగవానుడు వచించియున్నాడు. కావున స్మరణ రూపక సాక్షాత్కారలక్ష్యమగు పరమాత్మకు ప్రియమగుటచే సాక్షాత్కారరూపమగు ఈస్మరణము ఎవ్వనికి ప్రియతమమో వానినే పరమాత్మ వరించును. వానికే పరమాత్మ లాభము కలుగును. ఇట్టి నిరంతర స్మృతియే "భక్తి" అనబడును".

"ఈశ్వర ప్రణిధానాద్వా" అను పతంజలియోగ సూత్రమునకు వ్యాఖ్యానము చేయుచు – విషయసుఖాదిక ఫలాపేక్షను విడిచి సమస్త కర్మలను పరమగురువగు ఈశ్వరునకు అర్పించుటయే భక్తి విశేషమగు ప్రణిధానము" అని భోజదేవుడు వచించియున్నాడు.

"దేనిచే యోగికి పరమేశ్వరానుగ్రహము లభ్యమై అతని కోరికలు ఈడేరునో అట్టి భక్తివిశేషమే ప్రణిధానము" – అని వ్యాసభగవానుని నిర్వచనము.

"సా పరానురక్తిః ఈశ్వరే"

"సాపరానురక్తి రీశ్వరే"..... ఈశ్వరునియందుగల ఉత్కృష్టమైన అనురక్తియే భక్తియని శాండిల్య నిర్వచనము.

క్షణికములైనటు వంటి విషయసుఖములందు అవివేకులకు ఎట్టి ప్రీతి యుండునో – నిన్ను ధ్యానించునపుడు నీయందు అట్టిగాఢమైన ప్రీతి

నాహృదయమునుండి తొలగిపోకుండునుగాక!" అని భక్తాగ్రేసరుడగు ప్రహ్లాదుడు భక్తికి ఉత్తమమైన నిర్వచనమును చెప్పాడు. ఇతర విషయములందు ఎంతటి ప్రీతియున్నను అది భక్తియనిపించుకొనజాలదు. పరమేశ్వరుని యందలి ప్రీతిమాత్రమే "భక్తి" అని అర్థము.

ప్రపంచమున బ్రహ్మ మొదలు గడ్డిపోచవరకును సమస్త ప్రాణులును కర్మజనిత సంసారబద్ధులు. అందుచేత అవి ధ్యానమునకు లక్ష్యభూతములు కానేరవు. ధ్యానమునకు ఉపకరింపజాలవు. సామాన్యమైన ఆరాధనతో మొదలిడి భగవానుని యందు గాఢానురక్తుడై రమించు దివ్యానుభూతిని పొందుటకై చేయు సాధనక్రమమే "భక్తి" యని స్పష్టమగుచున్నది. ఈవిధంగా మనం ప్రేమించే భగవంతుడు ఎవరు ?

**నిత్యశుద్ధ బుద్ధస్వభావ స్వరూపః సర్వజ్ఞః కారణః పరః**

**బ్రహ్మసూత్రశంకరభాష్యము**

"జన్మాద్యస్యయతః–" ఈ జగమునకు సృష్టిస్థితి లయము ఎవ్వని మూలమున కలుగుచున్నవో అతడే ఈశ్వరుడు. అతడు నిత్యుడు, శుద్ధుడు, ముక్తుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, దయామయుడు, గురువులకే గురువు.

"సఈశ్వరః అనిర్వచనీయ ప్రేమ స్వరూపః"– ఆఈశ్వరుడు అనిర్వచనీయ ప్రేమస్వరూపుడు. ఇవన్నియు సగుణబ్రహ్మ నిర్వచనములు. న ఇతి, న ఇతి ... ఇది కాదు ... ఇదికాదు అని వేదాంతి చెప్పు సచ్చిదానంద మయ బ్రహ్మము, భక్తుడు చెప్పు అనిర్వచనీయ ప్రేమ స్వరూపుడు అగు భగవానుడు వేరువేరుకాదు. రెండునూ ఒక్కటే. ప్రేమ స్వరూపుడగు భగవానుడే సచ్చిదానంద మయుడగు బ్రహ్మము. సగుణ నిర్గుణ బ్రహ్మము ఒక్కటే.

భక్తులు ఉపాసించు సగుణుడు. సాకారుడునగు భగవానుడు బ్రహ్మము కంటె వేరు కాదని సదా మనము గుర్తించవలెను. సమస్తము అద్వితీయమగు బ్రహ్మమే. అయినను ఏకము, నిర్గుణమునగు బ్రహ్మము అత్యంత సూక్ష్మము, అతీంద్రియము, మనస్సునకు అవిషయమునగుటచే అట్టి బ్రహ్మమును ప్రేమించి ఉపాసింపజాలము. కావున భక్తుడు భగవానుని సగుణావస్థను అనగా సాకారుడగు ఈశ్వరుని గైకొని ఉపాసించును.

అనంతమగు వివిధ వస్తువుల నిర్మాణమునకు కారణభూతమైన మృత్తిక వంటిది బ్రహ్మము అని చెప్పవచ్చును. మట్టితో చేయబడిన వస్తువులన్నియు ఒక్కటే అయినను ఆకృతి అంటే వివిధమైన ఆకారమును కలిగియుండుట వానిని వేరుపరచుచున్నది. వాటిలో ప్రతిఒక్కటియు ఆకారమును దిద్దుకొనకముందు మట్టిలో గర్భితముగా నున్నవి. వస్తుతః అవి అన్నియు ఒక్కటే. కాని, ఆకృతిని పొందిన వెనుక అది నిలిచియున్నంతవరకు అవి భిన్నములు. మట్టి ఎలుక ఎన్నడును మట్టి ఏనుగు కాజాలదు. ఎందునలననగా రూపొందుటకు ముందు మృత్తికారూపమున ఒక్కటే అయి వున్నను వ్యక్తీకరణముచే భిన్నమగుచున్నవి.

సత్ + త → సత్తా. అనగా సత్ లక్షణము యొక్క భావము. లేక సత్ పదార్థము యొక్క భావము. సత్తా అనగా సత్‌రూపమై ఉండుట అని చెప్పుకొనవచ్చును. "పారమార్థిక సత్తా" అనగా పారమార్థిక సత్యస్వరూపమై ఉండుట.

పారమార్థిక సత్తా యొక్క మహోన్నత వ్యక్తీకరణమే ఈశ్వరుడు. సృష్టి అనాది. నిత్యము. ఈశ్వరుడును అట్టివాడే.

"జగద్వ్యాపార వర్జమ్ ప్రకరణాద సన్నిహితత్వాచ్చ" అను బ్రహ్మసూత్రమున వ్యాసభగవానుడు ముక్తునకు ఇంచుమించుగా అనంత శక్తియు, అనంత జ్ఞానమును కలుగునని వచించి పిమ్మట జగత్తుయొక్క సృష్టి స్థితి లయ శక్తులు మాత్రము పరమేశ్వరునివే అనియు, ఇతరులెవ్వరు దానిని పొందజాలరనియు ప్రవచించియున్నాడు.

పరమేశ్వరుని యథార్థస్వభావమును గ్రహించు ముక్తులు నిర్వ్యాజమగు బ్రహ్మాత్మానుభవమును పొందుదురే కాని జగన్నియమన శక్తిని పొందలేరు. శృతి వాక్యములను అనుసరించి "మనోయుక్తులై ఎవ్వరు సగుణ బ్రహ్మోపాసన మొనరించి ఈశ్వరసామ్రాజ్యమును పొందుదురో వారల ఐశ్వర్యమునకు అవధిలేదు. వారు స్వరాజ్యమును పొందెదరు. దేవతలందరు వానిని పూజింతురు. సమస్తలోకములందును వారలకోర్కెలు నెరవేరును. ఇట్లు "జగన్నియమనశక్తి" వినా అనగా వ్యాసుడు చెప్పిన ప్రకారము జగన్నియమాదిశక్తులు తప్ప మిగిలిన అణిమాది సిద్ధులన్నియు

ముక్తులకు కలుగును. పరమేశ్వరుడు ఒక్కడు మాత్రమే జగన్నియామకుడు. అణిమాది సిద్ధులు ఈశ్వరాన్వేషణము చేయువారికి, ఈశ్వర ఆరాధనము చేయువారికి లభించుచునని శ్రుతులు చెప్పుచున్నవి. కాని, జగన్నియమనమున ముక్తులకు అధికారము లేదు. ముక్తుల సంకల్పములు పరమేశ్వర సంకల్పములపై ఆధారపడి యుండుననుట సిద్ధాంతము.

ఈకారణము చేత సగుణ బ్రహ్మాభావముననే భక్తిని ప్రసరింప చేయదగును. నిర్గుణబ్రహ్మమునందు ఆసక్తి చిత్తముగలవారలకు దేహాభిమానము ఉన్నంత వరకు మార్గము కష్టతరము. దేహాభిమానము నశించినపుడు నిర్గుణధ్యానము సులభమగును.

బ్రహ్మమును గురించి భావించునప్పుడు మానవరూపముతో, మానవ స్వభావముతోకూడిన వాడని భావించుటను "Anothropomorphic conception of God" అని అంటారు. సగుణభక్తులు సాధారణముగా భగవంతుని మానవ ఆకారముగల వానినిగా భావించి ధ్యానిస్తారు. కొంతమంది (బ్రహ్మసమాజ మతస్థులు) నిరాకారుడు, సగుణుడు అను బ్రహ్మమును అనగా సృష్టిస్థితి లయాదులు చేయగల శక్తి సంపన్నునిగా భావించి ధ్యానిస్తారు. అద్వైతులు నిరాకారము, నిర్గుణము అగు బ్రహ్మమును ఆత్మస్వరూపముగా ధ్యానించి లేదా విమర్శించి తెలుసుకుంటారు.

**క్లేశోఽధిక తరస్తే షాం అవ్యక్తాసక్త చేతసామ్ ।**
**అవ్యక్తాహి గతిర్దుఃఖం దేహవద్భిర వాప్యతే ॥**
**గీత 12 అ - 5 శ్లో.**

అవ్యక్త పరమాత్మయందు మనస్సులగ్నము చేయు వారికి కష్టము ఎక్కువ. దేహధారులగువారికి (దేహాభిమానము కలవారికి) నిర్గుణ పరబ్రహ్మ (అవ్యక్త పరమాత్మ) చాలకష్టపడిననే కాని పొందబడుడుకదా! నిర్గుణోపాసన అనగా మనస్సు సంకల్పరహితమై ఆత్మయందు విలీనమగుట. కాని, ఇది సామాన్య జనులకు కష్టసాధ్యమైన విషయము. కఠినమైనమార్గము. బాలురకు జ్ఞాన బోధచేయుటకు చిత్ర ప్రతిమలు ఆధారమగునట్లు మనస్సు యొక్క సహజ ధర్మముననుసరించి సగుణమును, సాకారమును అగు బాహ్యలక్ష్యము అత్యంత అవసరము. ఇట్టి లక్ష్యమునాశ్రయించి స్థిరమై, ఏకాగ్రమైన మనస్సు అంతర్ముఖమై ఆత్మయందు లీనమగును.

అట్టిస్థిరచిత్తము లేదా ఏకాగ్రచిత్తము లభించువరకు ఏదో ఒక బాహ్య చిత్రమో ప్రతిమయో లేక మానసిక ప్రతీకయో అవసరము. ఇట్టి చిత్రములు, ప్రతిమలు మనస్సునకు లక్ష్యముగా నుండుట మాత్రమే కాక వాటి వలన స్థిరత్వము, అభిమానరాహిత్యము, ఏకాగ్రత కలుగును. కావున సగుణబ్రహ్మభావమున భక్తి సాధన సులభ సాధ్యమగును. బ్రహ్మమును గురించిన భావన మనయొక్క స్వభావమునకు అనుగుణముగా ఉన్నచో భక్తి అవిచ్ఛిన్నముగా కలుగును.

బాహ్యాంతరములలో మనము ఊహచేకాని, ప్రత్యక్షదర్శనముచే కాని గ్రహించునట్టి సమస్త వస్తుజాతము యొక్క నిర్మాణమునకును మానవుని ఎరుక అనునది ప్రధాన తత్వమని కపిలభగవానుడు అనేక వేల సంవత్సరములకు ముందే నిర్వచించి యున్నాడు. ఈజ్ఞానమే (ఎరుకయే) బాహ్య అంతరపదార్థములుగా భాసించుచున్నది.

కేవలము దృఢమైన విశ్వాసము, భక్తి కలుగుటకే సాధనములు అవసరము. భగవదనుగ్రహమువలన నిస్సారమగు తర్కవాదమును అతిక్రమించిన పిదప అతడు స్వయముగా తత్వమును దర్శించగలుగును. ఈబ్రహ్మానుభవమునకు, బ్రహ్మానందమునకును మించినది ఏదియును లేదు. అందువలననే సాక్షాత్తు ముక్తిని పొందుటకంటె భక్తియే అధికతరమని కొందరి అభిప్రాయము.

శారీరక సుఖములకు అనుకూలముగా నుండునవి మాత్రమే ఉపయోగకరమనీ, ప్రయోజనకరమనీ నమ్మేవారు, కోరికల సుడిగుండములో చిక్కుకొన్నవారు, లౌకిక ఇంద్రియ సుఖములందు మాత్రమే ఆసక్తికలిగినవారు ఈ ప్రపంచమునందు అధికసంఖ్యలో ఉంటారు. అట్టివారు అంతకంటె ఉన్నతమైన విషయముల యొక్క ఆవశ్యకతను గుర్తించుటకు, కనీసము గుర్తింప నేర్చుకొనుటకు అనేక జన్మలనెత్తుచూ వేచి యుండవలసినదే. జీవితమునందు అధికప్రయోజనకరమైనది, అత్యుత్తమమైనదీ భగవద్భక్తి యని గ్రహించినవారు క్షణికమైన విషయానందములను సులభముగా త్యజించగలిగెదరు.

ఈ ప్రపంచమునందలి ప్రతి వస్తువూ, ప్రతిజీవికూడా పరమాత్మ స్వరూపం కావటం వలననే ఒకరిపై ఒకరికి ప్రేమాభిమానములు

కలుగుచున్నవి. లేనిచో ఎవ్వరూ దేనినీ ప్రేమించలేరు. భార్య భర్తను, భర్త భార్యను, తల్లిదండ్రులు బిడ్డలను, బిడ్డలు తల్లిదండ్రులను – ఇలా ఒకరిని ఒకరు ప్రేమించుటకు కారణము సర్వత్ర వ్యాపించి యున్న పరమాత్మయే. అయస్కాంతము ఇనుమును ఆకర్షించునట్లు సమస్త జీవకోటి పరమాత్మయనెడి గొప్ప అయస్కాంతముచే ఆకర్షింపబడుచున్నది.

"ఇనుమయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశు సన్నిధి నావిధమునఁ
గరఁగుచున్నది దైవ యోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంతమగుచు"

ప్రహ్లాద చరిత్ర 7వ స్కంధము 49 వ పద్యము

"దైవ యోగమువలన" ఇనుము అయస్కాంతముచేత ఆకర్షింప బడుచున్న" విధముగా నాచిత్తము శ్రీహరి సన్నిధిని ఆకర్షింప బడుచున్నది" అన్నాడు పరమభాగవతోత్తముడైన ప్రహ్లాదుడు.

తెలిసో, తెలియకో మనమందరము కూడా ఆభగవంతుని చేరుకొనుటకై ప్రయత్నించుచున్నాము. అట్లు భగవంతుని వైపుకు మనలను మరల్చుమార్గమే సరియైన మార్గము. తక్కిన వన్నియు పెడదారులే. పతనమునకు దారితీయునవే.

ధార్మిక జీవనమునకు వ్యతిరేకముకాని కామాది భావములు భక్తి మార్గమున అంగీకరించబడుతున్నవి. సమస్తమును ముందుగా భగవదర్పణము గావించి తరువాత తాను అనుభవించుట భక్తునకు ముఖ్య ఉపాయము. సుఖదుఃఖములను కూడా ఈశ్వర ప్రసాదముగా భావించి సమభావముతో అనుభవించవలెను. దుఃఖమును, వేదనను కూడా సత్క్రమ మార్గములో ప్రవేశపెడితే అది కూడా మోక్షమునకు కారణమవుతుంది. సాధన దశయందలి గౌణభక్తి, సిద్ధావస్థయందలి 'పరాభక్తి' యని భక్తి యోగము రెండు విధములుగా విభజింపబడియున్నది.

పరమేశ్వరుని గుణసంబంధమైన భక్తి 'గౌణభక్తి'. ఇచ్చట గుణమనగా నామరూపములు, పరమేశ్వరుని యొక్క లేదా అవతార పురుషుని యొక్క నామమును స్మరించుట, రూపమును ధ్యానించుట, పురాణములలో

చెప్పబడిన ఆయన చరిత్రలు స్మరించి మననము చేయుట, పరమేశ్వరుని సృష్టిస్థితిలయ శక్తి సామర్థ్యమును అనుసంధానము చేయుట, ఆయన దయాపరత్వమును, ఆశ్రిత వాత్సల్యము మొదలగు గుణములను భావన చేయుచుండుట గౌణభక్తికి అంగములు.

"పరాభక్తి" అనగా గుణాతీతుడైన పరమేశ్వరుని అనగా నిర్గుణ పరబ్రహ్మమును ఆత్మ స్వరూపముగా ధ్యానించుట, మరియు తెలుసుకొనుట. పంచకోశవిచారము. అవస్థాత్రయ విచారము. అహంగ్రహోపాసన, నేను అనగా ఎవరు ? అని విచారించుట, మహా వాక్యముల యొక్క అర్థ విచారణ, సాక్షి భావము – ఇవన్నియు పరాభక్తిని పొందుటకు మార్గములు. గౌణభక్తి మార్గమున సాధన చేసిన వానికి భగవంతుని అనుగ్రహముచే గౌణభక్తికి ఫలముగా సత్త్వశుద్ధి కలిగి, బ్రహ్మవిచారముచే త్వరలో పరాభక్తి కూడా కలుగునని అద్వైతుల మతము.

ఏదైనా లౌకిక విషయం గురించి ఎవరైనా బాధపడితే దానివలన ప్రయోజనం లేదు. అది అక్రమమార్గం. అలాకాక భగవంతుని పొందాలని పరితపించటం, పరమార్థమును పొందటంకోసం వేదన చెందటం వలన ఆదుఃఖం, వేదన మోక్షమునకు కారణమవుతాయి. భగవంతుని భక్తితో పూజించే భాగ్యం అందరికీ కలగదు. భగవద్భక్తులైన వారి చిత్తము ఎల్లప్పుడూ భగవంతునియందే లగ్నమై ఉంటుంది. వారు ఈబాహ్యప్రపంచంతో సంబంధం కల్పించుకోరు. ఈభక్తిలో అనేక మార్గాలున్నాయి. భగవంతుని సగుణంగా భజించేవారు కొందరైతే నిర్గుణంగా ఉపాసించేవారు మరికొందరు ఉంటారు. విగ్రహారాధనవలన మనసును ఒకమూర్తిపై లగ్నంచేసి క్రమముగా మనో నిశ్చలత్వాన్ని పొందటానికి వీలవుతుంది. ఇది సాధకులకు చాలా సులభమైన మార్గం.

శ్రీరామకృష్ణ పరమహంస అభిప్రాయము ప్రకారం విగ్రహములు పరబ్రహ్మస్వరూపములే అవి చిద్రూపములే. భౌతిక పదార్థముగా కనిపించుచున్న ఈజడజగత్తు యదార్థముగా మహాచైతన్యము యొక్క విభూతియే. అందుచేత మంత్రార్థమును తెలుసుకొని, పూర్ణమైన మనసుతో విగ్రహారాధన చేయువారికి భక్తి జ్ఞానములు కలిగి ఈజన్మమునందే మోక్షము కలుగును. "విగ్రహారాధన" అనగా విగ్రహరూపుడగు పరబ్రహ్మము యొక్క

ఆరాధన అని గుర్తించవలెను. విగ్రహారాధనను ఖండించువారు జగత్తు భగవద్రూపముకాదని చెప్పుచున్నారని అర్థము.

మొట్టమొదట విగ్రహములను పూజిస్తే తరువాత క్రమంగా ధ్యాన నిష్ఠ కలుగుతుంది. జ్ఞానమును పొందినవాడు తనలో ఉండే ఆత్మారామునే పూజిస్తాడు. అతను బాహ్యపూజమాననక్కరలేదు. బాహ్యపూజచేసినా అతడు ఆత్మదృష్టితోనే చేస్తాడు. జ్ఞాన అష్టాంగయోగములతో అతడు భగవంతుని తనలోనే ఆరాధించగలుగుతాడు. జ్ఞానికి తనలోపల, బయట అనే భేదము ఉండదు.

ఏకులంలో జన్మించిన వారైనా భగవద్భక్తులైనవారు సద్గతిని పొందుతారు. భగవద్భక్తి హీనులు, దేహాభిమానులూ అయినవారు అధోగతిని పొందుతారు. ఏకులమైనా, ఏజాతైనా భక్తికి అడ్డురావు. నిమ్నకులాలలో పుట్టికూడా భగవత్సాయుజ్యాన్ని పొందిన మహాభక్తులెందరి కథలో మనకు తెలినవే. భక్తనందనార్, గుహుడు, భక్తకన్నప్ప, శబరి మొదలగు వారంతాకూడా భగవదనుగ్రహం పొందినవారే, భక్తుని హృదయంలో భగవంతుడే ఉన్నప్పుడు ఇక కులమేది ? మతమేది ? ఏమతమైనా బోధించేది ధర్మాన్నే ! ఎవరు పూజించినా, ఎలా పూజించినా చెందేది ఒకే దైవానికే, భక్తికి కులమత జాతివర్గ విభేదాలు లేవు. ఆచారములతో అంత పట్టింపులేదు. బాహ్యములగు నియమనిష్ఠలు అక్కరలేదు. అనన్యమైన భక్తి, భగవంతుని పట్ల ఆర్తి, ప్రేమ, పరితాపమే నిజమైన భక్తి.

**"వ్యాధస్యా చరణం ధృవస్యచవయః**
**విద్యాగజేన్ద్రస్యకో, కాజాతిర్విదురస్య**
**కుబ్జాయాః కింరూపమధికం కింతత్ సుదా మ్నోధనం**
**భక్త్యా తుష్యతి కేవలం భక్తి ప్రియో మాధవః"**

భక్తికి ఆచారంతో నిమిత్తం లేదనడానికి బోయవాడైన తిన్నని వృత్తాంతమే చక్కని ఉదాహరణ. ఏఆచారవ్యవహారాలు తెలియని బోయడు తిన్నడు. అతడు పరమేశ్వరునకు "మాంసము" ను నైవేద్యముగా పెట్టిపుక్కిటి నీటితో అభిషేకంచేసినా భగవంతుడు అతని భక్తినే గుర్తించి సాయుజ్యాన్ని ప్రసాదించాడు. కాని ఆచరణకు ప్రాముఖ్యతను

ఇవ్వలేదు. కన్నుకు కన్ను పెరికి పెట్టడానికి సిద్ధపడ్డ అతడి అనన్య ప్రేమకు మురిసాడే కాని అతడి ఆచారాన్ని లెక్కచేయలేదు. అలాగే ఆర్తుడై, దీనావస్థలో దిక్కుతోచక పరితపించిన గజేంద్రుడు కాపాడమని వేడగానే ఆత్రుతతో వచ్చి రక్షించాడే కాని అతని విద్యార్హతలను గమనించలేదు. కుబ్జ నిర్మల హృదయాన్నే మెచ్చాడు కాని ఆమె అనాకారితనాన్ని చూడలేదు. ఆంతరంగిక సౌందర్యమే ఆహరిని మెప్పించింది.

కేవలం అటుకులే కానుకగా తెచ్చిన కుచేలుని చినిగిన అంగవస్త్రం మూటవిప్పి మురిసిపోతూ ఆరగించాడే కాని ఆతడు పేదవాడని భేదం చూపి దూరం చేయలేదు. ప్రేమతో చిన్నవాటి స్నేహాన్ని గుర్తు చేసుకుని, అష్టపత్నులతో కూడి సపర్యలు చేసి, అడగకుండానే ఆ కుచేలునికి అక్షయమైన వరాలను ప్రసాదించి, అనుగ్రహించాడు ఆ కృష్ణపరమాత్మ.

అందుచేత ఆచారము, విద్య, రూపము, ధనము, కులము – వీటితో భగవంతునకు నిమిత్తం లేదు. ఆయన కోరేదీ, మననుండి ఆశించేదీ అనన్యమైన భక్తిని, అచంచలమైన విశ్వాసాన్ని మాత్రమే. భక్తి మాత్రమే ఆయనకు అంతులేని ప్రియాన్ని కలిగిస్తుంది.

భక్తిని గురించి శంకరాచార్యుల వారు శివానందలహరితో ఇలా చెప్పారు.

**"అంకోలం నిజ బీజ సంతతిః అయస్కాంతోపలం సూచికా**
**సాధ్వీనైజవిభుంలతాక్షితిరుహం సింధు స్సరిద్వల్లభమ్**
**ప్రాప్నోతీహయధాతథా పశుపతేః పాదారవిందద్వయమ్**
**చేతోవృత్తి రుపేత్య తిష్ఠతిసదా సాభక్తిరిత్యుచ్యతే.**

ఊడుగు చెట్టు యొక్క పండ్లు చెట్టు నించి క్రిందికి రాలునప్పుడు గింజల చుట్టూ ఉన్న గుజ్జు వలన పండ్లు మానునకు కరుచుకొంటాయి. (చెట్టుకు దూరంగా రాలే పళ్ళు దూరంగా నేలపై పడతాయి. చెట్టు దగ్గరగా పడేవి చెట్టు కాండానికి అతుక్కుపోతాయి.) ఇనుప సూదిని అయస్కాంతం ఆకర్షించుకుంటుంది. పతివ్రత ఏ పనిని చేస్తున్నా తన భర్తనే స్మరిస్తూ ఉంటుంది. తీగ వృక్షాన్ని ఆశ్రయించుకుని ఉంటుంది. అదే విధంగా సముద్రాన్ని చేరుకోవటానికి నది తహతహలాడునట్లుగా ఎవరి యొక్క

మనోవృత్తి పరమాత్మను సమీపించి ఆయన సన్నిధి యందే ఎల్లప్పుడు ఉండునట్టిస్థితియే భక్తియని శంకర భగవత్పాదుల వివరణ.

**అద్వేష్టాసర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖఃక్షమీ ॥**

**భగవద్గీత 12 అ. 13 శ్లో.**

సమస్త ప్రాణుల యందు ద్వేషము లేకుండా ఉండటం, ద్వేషం లేకపోవటమే కాకుండా అందరిపట్ల స్నేహభావాన్ని కలిగి ఉండటం, జాలిగుండె, అపకారికి కూడా ఉపకారము చేయవలెనని పరితపించే మృదు స్వభావము, నేను-నాది అనేటువంటి అహంకార మమకారములు లేకుండా ఉండటం, సుఖానికి పొంగిపోక, దుఃఖానికి కృంగిపోకుండా ఉండే స్థిరస్వభావము – ఇటువంటి గుణములు కలవాడు మాత్రమే అసలైన భక్తుడు అని గీతాశాస్త్రంలో చెప్పబడి ఉంది.

**"సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా"**

"పరమాత్మయందు గల పరమ ప్రేమ రూపమైనది ఆ భక్తి" అని నారద భక్తి సూత్రములందు చెప్పబడినది. భగవంతుని పట్ల పర మోత్కృష్టమైన ప్రేమయే భక్తి స్వభావము. భగవంతుని పై గల అత్యంత దివ్యానురాగమే భగవద్భక్తి. ఇది అమృతత్వ స్వభావము కలది. అది త్యాగ స్వభావము కలది. కావున అందు కోరికలకు అవకాశము లేదు.

**"తస్యాః సాధనాని గాయంత్యాచార్యః"**

**నా.భ.సూ.**

"మానవ హృదయంలో అట్టి పరమ భక్తి నెలకొనుటకు ఆచార్యులు అనేకమైన మార్గములను చెప్పుచున్నారు". నిరంతర ప్రేమ పూరితమైన మనస్సుతో భగవంతుని సేవించుట వలననే అనన్య భక్తి ప్రాప్తించును. అయితే ఈ అనన్య భక్తి ప్రాప్తించుటకు భగవంతుని అనుగ్రహము వలనా, మహాత్ముల కృప వలన మాత్రమే సాధ్యము. ఆధ్యాత్మిక సాధనలో గురువు పాత్ర ప్రముఖమైనది. అత్యంత ఆవశ్యకమైనది గురుకృప. దైవానుగ్రహవ.

"దైవీ హ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తితే"
"గీత 7అ. 14 వ శ్లోకము.

"బ్రహ్మ సంబంధమైనదియు, త్రిగుణాత్మకమైనది యునగు నా యొక్క మాయ దాటుటకు కష్టసాధ్యమైనది. నన్నే ఎవరు శరణు పొందుచున్నారో వారు ఈ మాయను దాటగలుగుచున్నారు".

మాయ దాటితే కాని మోహం తొలగదు. మాయ తొలగాలి అంటే ఆ పరమేశ్వరుని అనుగ్రహం ఉండాలి. మాయాస్వరూపిణియగు ఆ జగజ్జనని కృప కలిగితే కాని మానవుడు మాయను దాటలేడు. భక్తునకు, భగవంతునికి మధ్య అడ్డుగా వున్న మాయ తొలిగితే కాని సాక్షాత్కారం లభించదు.

విషయ వస్తువులపైన మోహాన్ని విడిచి పెట్టిన వారూ, మహాత్ములను, భక్తులనూ సేవించేవారూ, నేను-నాది అనెడి అహంకార మమకారములను వదిలిపెట్టినవారు, ఏకాంత స్థలము నందు ప్రశాంతముగా ఉండేవారూ, త్రిగుణములను దాటినవారు, ప్రాపంచిక బంధములను పూర్తిగా వదులుకోగలిగినవారు, సంపద, ఆర్జన వంటి వాటినుండి విముక్తి చెందినవారు, సమస్త కర్మ ఫలములను త్యజించినవారు, అహంకార పూరిత కర్మలను వదిలినవారు, ద్వంద్వములకు అతీతంగా ఉండేవారు - ఇట్టి లక్షణములన్నీ కలిగి ఉండే వారు మాత్రమే మాయను జయించగలుగుతారు.

అవిచ్ఛిన్నమైన ప్రేమపూరితమైన భక్తిని కలిగియున్న వారే మాయను దాటగలరు.

"సతరతి, సతరతి సలోకాన్ తారయతి"
నా. భ. సూ.

"వారు తరిస్తారు. సమస్త లోకములందు నివసించే వారి నందరినీ తరింపచేస్తారు". ఈప్రేమ అనిర్వచనీయమైనది. అనుభవంతో మాత్రమే తెలుసుకోదగినది. ఎవనియందో, ఎప్పుడో, ఎక్కడో అర్హత కలవానియందు అటువంటి నిర్మలమైన ప్రేమ ప్రకాశిస్తుంది. అటువంటి మహాభక్తిని

పొందిన భక్తుడు ముక్తిని పొందుతాడు. భక్తులభక్తికి ఫలము భక్తియే.

"భక్త్వా ఏకాంతినో ముఖ్యాః

నా. భ. సూ.

"భక్తిచేత ఏకాంతమైన చిత్తము కలవారు శ్రేష్ఠులు" భగవంతుడు కీర్తింపబడినప్పుడు భక్తునకు భగవంతుడు తన పరిపూర్ణ స్వరూపస్థితిని తెలియచేయును.

"త్రిసత్యస్య భక్తిః సైవగరీయసీ భక్తి రేవగరీయసీ"

నా.భ.సూ.

"మూడు సత్యములలో అనగా కర్మ, భక్తి, జ్ఞాన మార్గములలోకాని, వర్తమాన, భూత, భవిష్యత్కాలములోకాని, జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలలోకాని భక్తిమార్గమే గొప్పది. శ్రేష్ఠతమమైనది."

భక్తి .... భగవద్భక్తి ఒక్కటి మాత్రమే సర్వోత్తమము. భగవంతుని యందు భక్తి కలగటంకోసం తీవ్రమైన సాధన చెయ్యాలి. అఖండమైన ఆవేదనతో భగవంతునికొరకై విలపించవలయును. విషయసుఖములనుండి మనస్సును మరల్చి భగవంతుని యందే లగ్నం చెయ్యాలి. భగవంతుడు ఎక్కడో మనకు దూరంగా ఏలోకాలలోనో లేడు. వేదాలలో లేడు. వేదాంతములో కానరాడు. వేదనతో పరితపించి మాత్రమే ఆయనను పొందగలము. అంతేకాని శాస్త్ర పరిజ్ఞానము వలన, ఆచరణ శూన్యమైన శుష్క పాండిత్యమువలన ఆభగవంతుడు లభించబోడు. హృదయంలో తీవ్రమైన భగవత్పరితాపం కలగాలి. గాఢమైన భక్తితో దేముని ప్రార్థిస్తూ సాధనచేస్తూ ఉండాలి. మనసాధన విధానాన్ని బట్టి, స్థాయిని బట్టి భగవంతుని సాక్షాత్కారం లభిస్తుంది. అందరూ దైవసాక్షాత్కారాన్ని తప్పక పొందుతారు. అయితే కొందరికి ఈజన్మలోనే సాక్షాత్కారం కలిగితే మరికొందరికి మరికొన్ని జన్మలకు కలుగుతుంది. కాని దైవ (ఆత్మ) సాక్షాత్కారం ప్రతిజీవికి ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక జన్మలో లభించే తీరుతుంది.

దైవభక్తి లోపించటం వలన మానవులకు అంతులేని కష్టాలు కలుగుతూ ఉంటాయి. అయితే భక్తులు మాత్రం కష్టాలు భరించటం

లేదా? ... అంటే కష్టములు భరిస్తున్నారు భక్తులుకూడా. అయితే ఆకష్టాలు భగవంతుడు వారిని తన దగ్గరకు చేర్చుకోవటం కోసం పెట్టిన పరీక్షలు. ఆయా భక్తుల ద్వారా తన విభూతిని ప్రకటించే లీలలు. అంతేకాని అవి నిజమైన కష్టాలు కావు.

సాధక స్థితిలో ఉన్న భక్తుడు పూర్వజన్మ కర్మఫలమును అనుభవిస్తూ అనిష్టరూపమైన ఫలితాలను ఒకప్పుడు చవిచూస్తాడు. భక్తిచేత భగవంతుడు సాధకునికి సన్నిహితుడై ఆయా కష్టములను అనుభవించే కాలములో తోడునీడయై ఉంటాడు.

1ఎ. భగవద్భక్తి వలన చాల వరకు పాపకర్మ నశిస్తుంది. భక్తి ఎక్కువగా ఉంటే పాపకర్మ పూర్తిగా నశిస్తుంది. భక్తి పరిపూర్ణంగా లేకపోతే కర్మశేషం అనుభవించవలసి వస్తుంది.

1బి. ఈ కర్మశేషమును అనుభవిస్తున్నప్పుడు భగవంతుడు అనేకరకములుగా భక్తునికి సహాయం చేస్తాడు. అప్పుడప్పుడు స్వప్నాదులలో దర్శనమిచ్చి ధైర్యమును కలిగించి సహాయ పడతాడు. ప్రారబ్ధములోని దుష్ఫలితములను ఒకేసారి అనుభవించకుండా కొద్ది కొద్దిగా అనుభవింపచేస్తాడు. ఉదాహరణకు ఒకపాప కర్మవలన నెలరోజులు అనారోగ్యం కలగవలసి వస్తే ఆనెలరోజులూ ఒకేసారి వరుసగా అను భవించకుండా అప్పుడప్పుడు కొద్దికొద్దిగా అనుభవించేలా చేస్తాడు.

1 సి. కొన్ని అనుభవాలు స్థూలలోకంలో జరగకుండా సూక్ష్మలోకాలలోకాని, స్వప్నాదులలోకాని కలుగచేసి భగవంతుడు ప్రారబ్ధక్షయమును చేయును.

1 డి భగవద్భక్తుల యొక్క రోగాదులను గురువులు, సిద్ధపురుషులు తీసుకుని అనుభవించి భక్తులకు ఆరోగ్యము కూర్చుట కూడా కలదు. అయితే ఇవన్నీ సాధక భక్తులకు సంబంధించిన విషయములు.

సిద్ధపురుషులు, గురువులు, అవతారపురుషులు మొదలగువారు (జీసస్, శ్రీకృష్ణుడు, రాముడు మొదలగువారు) అనుభవించు కష్టములు లోక కల్యాణము కొరకు జరుగునవి. సృష్టికి మేలు చేయుటకు, దేవాసురులను రక్షించుటకు, పరమేశ్వరుడు హాలాహలమును స్వీకరించెను. అలాగే క్రైస్తు

శిలువపై శిక్షింపబడుటకూడా లోకమును కాపాడుట కొరకే. అవతార పురుషుడైన రాముని వనవాసము, సీతాపహరణము మొదలగు కష్టము లన్నియు లోక కళ్యాణము కొరకు, భక్త సంరక్షణము కొరకు సీతారాములు చేసిన తపస్సులే.

మానవుడు మరణంపొందే సమయంలో భగవంతుని స్మరించుకోగలిగే విధంగా ముందునుంచే సాధనచేయాలి. ప్రతిక్షణం భగవంతుని ధ్యానించగలిగితే అంత్య సమయమున భగవంతుని తప్పక స్మరించే అవకాశం కలుగుతుంది. ఎప్పుడో ఇంకా చాలా సమయం ఉంది కదా ః అని వాయిదా వేస్తే అది మూర్ఖత్వమే అవుతుంది. అందుచేత ఎల్లవేళలా ఏపనిచేస్తున్నా మనసును భగవంతునియందు లగ్నంచేసే ఉంచాలి. అదే భక్తి సాధన. జీవితకాలంలో అటువంటి సాధనచేస్తే అవసానకాలమున భగవంతుడు తప్పక తలపుకు వస్తాడు. మరణించే సమయంలో మానవుడు దేనిని గురించి తలుస్తాడో దానిని అనుసరించే మరుజన్మ కలుగుతుంది. ఇందుకు పెద్దలు ఎన్నో ఉదాహరణలను చెప్పి వున్నారు. లేడిగా పుట్టిన జడభరతుడు, అంత్యకాలంలో తన కుమారుని పేరునే అయినా నారాయణనామస్మరణచేయటంచేత ముక్తిని పొందిన అజామీళుని కథ, మొదలైనవెన్ని ఉదాహరణలో మనకు తెలియనివికాదు.

కాబట్టి భక్తి సాధనలు అత్యంత ఆవశ్యకమైనవి. నిరంతర సాధనవలన సాంసారికచింతలు పూర్తిగా తొలగిపోయి భగవచ్చింతన మనసును ఆక్రమిస్తుంది. అప్పుడు మరణకాలము నందు సైతము అది మనను విడువదు. అంతేకాని చనిపోయేటప్పుడు ఒక్కసారిగా మనిషి మనసులో భక్తిభావం కలగటం సాధ్యమైనవిషయంకాదు. అందుచేత ముందునుండే మానవుడు తగిన సాధన చెయ్యాలి.

భగవంతుడు సర్వవ్యాపకుడు. ఈసృష్టి అంతయూ సాక్షాత్తూ ఆభగవంతుని వ్యక్తస్వరూపమే. మరిసృష్టి అంతా భగవంతుడు వ్యాపించి ఉంటే మనకు ఎందుకు కనిపించటంలేదు ? కన్నులకు మాయపొరలు కప్పియున్నంతకాలం భగవంతుని దర్శించలేము. మనకళ్ళకున్న మాయ పొరలు కరగి తొలగిపోవాలి. అప్పుడు మాత్రమే సర్వవ్యాపకుడైన భగవంతుని దర్శనం లభిస్తుంది.

"ఇందుగలడందు లేడని
సందేహంబు వలదు చక్రి సర్వోపగతు
డెందెందు వెదకి చూచిన
అందందే గలడు దానవాగ్రణి వింటే"

అన్నాడు పరమ భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుడు, విష్ణు ద్వేషిమైన తండ్రి హిరణ్య కశిపునితో. ఎక్కడ పడితే అక్కడ భగవంతుడున్నమాట వాస్తవమైతే ఈ రాతిస్తంభము నందు నీహరిని చూపించగలవా ?" అని హిరణ్యకశిపుడు అన్నప్పుడు ఆభగవంతుడు నరహరి రూపుడై స్తంభము నుండి వెడలి దుష్టశిక్షణ - శిష్టరక్షణ చేయలేదా !

భగవంతుని శరణుపొంది మాయను దాటగలిగినప్పుడు భగవత్సా క్షాత్కారము కలుగుతుంది. అప్పుడు భగవంతుడు సర్వత్ర, సర్వము నందును గోచరించును. ఏఇతర వస్తువు లేదా జీవులకంటెనూ కూడా మానవుని యందు మనోమయకోశం బాగుగా వికసించుటచేత భగవంతుడు విశేషంగా ప్రకాశిస్తూ ఉంటాడు. అన్నింటికంటె ఎక్కువగా సత్త్వగుణప్రపూర్ణులగు భక్తులయందు, కామక్రోధమోహాదులు లేశ మాత్రమైనను లేని మహానుభావులయందు భగవంతుని ప్రకాశము దేదీప్యమానముగా ఉంటుంది.

భగవత్సాక్షాత్కారమును పొందిన పిమ్మట ఈజగత్తు జడముగా కనిపించదు. న ... ఇతి; న ... ఇతి (ఇది కాదు ... ఇదికాదు) అంటూ ఒక్కొక్క దానిని బ్రహ్మముకాదని నిరూపిస్తూ వేదాంత శాస్త్రకోవిదులు బ్రహ్మము తానుకాని అన్నింటికంటె భిన్నమైనదని చెపుతారు. కాని భక్తులకు ఇదంతా బ్రహ్మమయమే, బ్రహ్మస్వరూపమేనని అనిపిస్తుంది. అట్టివారు తమ బిడ్డలను పోషిస్తూ బాలకృష్ణుని పోషిస్తున్నట్లు భావిస్తారు. గురువులను, తల్లిదండ్రులను సాక్షాత్తూ భగవత్స్వరూపులుగా భావించి సేవిస్తూ ఉంటారు. సర్వభూతములయందును భగవంతునే చూస్తూ "మానవసేవయే మాధవసేవ" అని భావిస్తూ అందరికీ సాధ్యమైనంత సేవ నిస్వార్థంగా చేస్తుంటారు. అన్నింటియందును భగవంతునే చూస్తూ భగవంతునిగా భావించి పూజిస్తారు.

సూర్యుడు ఉదయించబోతున్నందుకు సూచనగా ఆకాశమంతటా

ఎర్రని కాంతులు అలముకొను విధముగా నిస్వార్థము, నిర్మలమైన మనస్సు మంచినడవడి, మొదలగు పవిత్రమైన లక్షణములు భగవత్ప్రాప్తిని ముందుగా తెలియచేస్తాయి.

జ్ఞానప్రాప్తియైన పిదప భక్తునకు భగవంతుడు దూరముగా ఎక్కడో కైలాసములోనో, వైకుంఠంలోనో ఉన్నట్లు అనిపించడు. ఇక్కడ ఈలోకంలోనే తనయందే ఉన్నాడన్న సత్యం బోధపడుతుంది. అప్పుడు భగవంతుడు "అతడు" అనికాక "ఇతడు - ఇది - అంతరాత్మ " అని గోచరిస్తుంది. భగవంతుడు సర్వాంతర్యామి. తనకై పరితపించే భక్తులకు ఆయన తప్పక సాక్షాత్కరిస్తాడు.

భక్తిమార్గంలో సాధకుడు ఒకానొక దశలో భగవంతుని సాకారునిగా భావించి సంతుష్టిని పొందుతాడు. అతడే మరియొక దశలో భగవంతుని నిరాకారునిగా భావించుటచే సంతుష్టుడవుతాడు. భక్తునకు భగవంతుడు వివిధరూపాలలో సాక్షాత్కరిస్తాడు. శ్రీరామకృష్ణ పరమహంసకు కాళికాదేవి అష్టభుజగాను, దశభుజగాను, అష్టాదశభుజగాను అనేక రూపములలో సాక్షాత్కరించింది. కాని, అత్యుత్తమ జ్ఞానాన్ని పొందిన వానికి ఆభగవంతుడే సమాధిస్థితియందు అఖండ నిరాకార బ్రహ్మముయొక్క అపరోక్ష అనుభూతి కలిగిస్తాడు. ఇక్కడ భక్తి, జ్ఞానములకు సామరస్యం కలుగుతుంది.

జలముచేత ఏర్పడ్డ మంచుగడ్డ జలమున నిలిచియుండి పిమ్మట ఆనీటిలోనే కరగిపోయేలాగా నిర్గుణ బ్రహ్మాంతర్భూతమైన సాకారదైవము బ్రహ్మమునుండే వెలువడి, అందే నెలకొనియుండి, మరల అందే లీనమై అదృశ్యమగును. "తజ్జలం"

**"తత్ జనిత్వా తల్లయం ప్రాప్నోతి"**
**"దానియందే పుట్టి దానియందే లయమగును."**
**"తజ్జలమితి శాంత ఉపాసీతా"**

**ఛాందోగ్య ఉపనిషత్తు.**

భగవంతుడు నిరామయము, నిత్యమునగు బ్రహ్మము. కాని, సముద్రము యొక్క లోతుపాతులు అంతుబట్టటం ఎంత కష్టమో, నిరాకార బ్రహ్మమును ఉపాసించుటకూడా సామాన్య సాధకునికి అంతే కష్టము.

కాని సాకారబ్రహ్మమును ఉపాసించేవాడు. ఓడలో సముద్రమును దాటువానివలె సులభముగా ఒడ్డును చేరుకోగలుగుతాడు.

క్లేశోధిక తరస్తే షామ వ్యక్తా సక్తచేతసాం
అవ్యక్తా హిగతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.
గీత. 12 అ - 5శ్లో.

"అవ్యక్తమైన నిర్గుణ పరబ్రహ్మమునందు ఆసక్తమైన చిత్తము గలవారికి శ్రమ అధికం. ఎందుచేతననగా శరీరమునందు అభిమానము గలవారికి పరబ్రహ్మనిష్ట కష్టసాధ్యము."

యే యథామాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్
మమ వర్త్మాను వర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః
గీత 4అ - 11శ్లో.

(ఎవరెవరు ఏఏ విధములుగా నన్ను ధ్యానముచేసి సేవించు చున్నారో వారిని అదే విధముగా అనుగ్రహించున్నాను మనుష్యులందరు అన్నివిధములుగా నామార్గమునే అనుసరించుచున్నారు.)

భక్తుడు ఏవిధంగా భావిస్తే భగవంతుడు ఆవిధంగానే అనుగ్రహిస్తాడు. భగవంతుడు ఈరూపమున ప్రత్యక్షం అవుతాడు. ఈరూపమున ప్రత్యక్షంకాడు అని ఎవ్వరూ నిర్ణయించలేరు. అతడు సాకారనిరాకారములు రెంటికీ అతీతుడు. ఆత్మస్వరూపుడు.

"నిష్క్రియమగు బ్రహ్మము, క్రియాయుక్తమగు ప్రకృతి ఒక్కటే, ఎవడు సచ్చిదానందమయుడో అతడే చిచ్ఛక్తియు, సర్వజ్ఞయు, ఆనందమయియునగు జగజ్జనని కూడా "

శ్రీరామకృష్ణ పరమహంస

రత్నమునకు దాని ప్రకాశమునకు అవినాభావసంబంధం ఉన్నట్లే పరమాత్మకు, పరాశక్తికి అవినాభావ సంబంధమున్నదని "పరమహంస బోధ". ఇవి రెండు పరస్పర సంబద్ధములు కాబట్టి ఒకదానిని విడిచిపెట్టి మరొక దానిని భావించుట సాధ్యము కాని విషయము.

"ఈ సమస్త ప్రపంచమునేనే (ఆత్మస్వరూపమే),

ఈ సమస్త ప్రపంచమునీవే (బ్రహ్మమే);

"నీవు ప్రభుడవు (భగవంతుడు) నేను సేవకుడను" – అను ఈ మూడు మనోభావములందును ఏ ఒక్క దానియందైనను చక్కగా నెలకొని ఉన్నవాడు మాత్రమే భగవత్సాక్షాత్కారమును పొందగలుగును"

(శ్రీరామ కృష్ణబోధామృతము)

జ్ఞానికి ఈప్రపంచము ఒక మిధ్యగా, కలగా తోచును. అతడు ఎల్లప్పుడు ఆత్మయందే నెలకొనియుండును. అతని హృదయమున 'ప్రజ్ఞానగంగ" ఎల్లప్పుడు ఒకేదిశగా ప్రవహించుచుండును. కాని భక్తుని హృదయమునందలి భావము ఎప్పుడూ ఒకే స్థితి యందుండదు. భక్తుడు ఒకప్పుడు నవ్వును. ఒకప్పుడు ఏడ్చును. ఒకప్పుడు ఆడును. మరి యొకసారి పాడును. అట్టి భక్తుడు తననే కాక లోకమునెల్లను పునీతము చేయునని భగవానుని ఉవాచ ("మద్భక్తి యుక్తో భువనం పునాతి") (భాగవతం 11-14-24) భక్తుడు ఎల్లప్పుడు భగవంతుని సాన్నిధ్యముచే కలుగు ఆనందమును అనభవించగోరును.

నేను అను అహంభావము ఉన్నంతవరకూ అనుభవము అంతయూ ద్రష్ట, దృశ్యము అను ద్వైతవిశిష్ఠముగా గోచరించును. 'నేను' అను అహంభావము లయము చెందినప్పుడు సర్వద్వైతభావములు లయించును. ఘటము వంటి ఈదేహమునందు మనస్సు, బుద్ధి, అహంకారములే జలము. బ్రహ్మము సూర్యుని వంటిది. సూర్యుడు నీటిలో ప్రతిబింబించు విధముగా బ్రహ్మము అంతఃకరణమనెడి జలమునందు ప్రతిఫలించుటచే భక్తుడు భగవంతుని వివిధ దివ్య రూపములలో దర్శించుచుండును. కాని వేదాంతికి బ్రహ్మమొక్కటే సత్యము. తక్కినదంతయు స్వప్నమువలె మిధ్య. అహంభావములయము చెందునప్పుడు సమస్తద్వైత భావములుకూడా లయమొందును.

భగవద్భక్తి చాలదుర్లభమైన విషయము. పరిశుద్ధమగు భక్తి అలవడుట మరింత దుర్లభము. పరిశుద్ధమైన భక్తి అలవడినప్పుడు అంతఃకరణము భగవంతునియందులయమొందును. అట్టి ఉత్తమ భక్తిచేత కలుగు తన్మయత్వముచే "భావము' అను ఉత్తమస్థితి కలుగును. ఏకాగ్రచిత్తముతో

లక్ష్యమును భేదించు విలుకానికి ఎట్లు శ్వాస కట్టుపడునో అట్లు "భావము" నందు వాగ్బంధనమగును. కుంభకము దానంతట అదే సిద్ధించును " తచ్చిన్తా విపులాహ్లా దక్షీణ పుణ్యచయాతథా .. ముక్తింగతాన్యా గోపకన్యకా..." భాగవతమునందు చెప్పబడిన ఈశ్లోకమునందు జగత్సృష్టికారకుడైన వాడు, పరబ్రహ్మయునైన శ్రీకృష్ణుని స్మరించుటచే ఉచ్ఛ్వాస నిశ్వాసములు స్తంభించి ఒకగోపకన్యక ముక్తినొందినది అని చెప్పబడినది. అట్టిస్థితి ఈ "భావము" నకు ఉదాహరణగా చెప్పవచ్చును. అనగా ప్రాణాయామము భక్తిచే సహజముగా సిద్ధిస్తుంది.

విషయసుఖములందు వ్యామోహము తగ్గినకొలదీ భగవద్భక్తి వృద్ధియగుచుండును. జ్ఞానయోగమునందు ఇద్రియనిగ్రహము కలిగిననే కాని బ్రహ్మసాక్షాత్కారము కాదు. కాని భక్తి యోగమునందు భక్తి పూరితహృదయులైన వారికి ఇంద్రియనిగ్రహము స్వతస్సిద్ధముగనే లభించును. భగవంతుని ప్రేమ యందు తన్మయుడై ఆనందము పొందువాడు విషయ సుఖానందమును వాంఛించడు. సఖ్యభావమునో, దాస్యభావమునో, వాత్సల్యభావమునో ఏదో ఒక భావమును స్థిరముగా అవలంబించి భగవంతుని స్వంతము చేసుకోవటానికి ప్రయత్నించాలి.

నిత్యజీవితంలో తల్లిదండ్రులను, భర్త (లేక భార్యను), అన్నదమ్ములను, అక్కచెల్లెళ్ళను, బిడ్డలను, మిత్రులను, బంధువులను, గురువును భగవద్రూపులుగా భావించి ధర్మయుక్తముగా సేవించుట మోక్షమునకు ముఖ్యమైన మార్గము. శిష్యుడు గురువును బ్రహ్మ స్వరూపముగా భావించినట్లు గురువు శిష్యునికూడా నారాయణ స్వరూపునిగా భావించి ప్రేమించుచుండును. శ్రీరామకృష్ణపరమహంస వివేకానంద స్వామి యెడల ప్రకటించిన నిరుపమానమైన ప్రేమయే ఇందుకు నిదర్శనము. తనకు ప్రియమైన దానినే ఇష్టదైవముగా భావించగలిగినచో మనస్సు సులభముగా భగవంతునివైపు మరలును. ఈవిషయమునకు శ్రీరామకృష్ణపరమహంస ఒకచక్కని ఉదాహరణమును చెప్పెను.

"ఒకానొక వృద్ధురాలు సంసారమును విడిచి తన అంత్యదశను ప్రశాంతముగా బృందావనమున గడుపుట మంచిదని భావించి, తన అభిప్రాయమును శ్రీరామకృష్ణునకు తెలిపెను. కాని శ్రీగురుదేవులు ఆమె

పరిస్థితులను బాగుగా తెలిసిన వారగుటచేత అందులకు ఆమోదించక, ఇట్లు సమాధానమొసగెను. "నీ మనుమరాలు అనిన నీకు పంచప్రాణములు కదా ! నీవెచ్చటికి పోయినను అబిడ్డతలపునకు వచ్చి నిన్ను ఆందోళనపరచును. నీకిష్టమైన పక్షమున బృందావనములో ఉండవచ్చును. కాని, నీమనస్సు సదా నీఇంటిమీదనే ఉండును. ఇందుకు బదులు నీమనుమరాలే సాక్షాత్తూ శ్రీరాధిక అని భావనచేసి ఆమెపై ప్రేమానురాగములు చూపుదు వేని బృందావనమున నివసించు పుణ్యము నీకు స్వయముగా లభించును. నీకు ఆమెపై ఎంత గారాబము కలదో అంతగారాబమును చూపుము. నీమనసారా ఆమెను పోషింపుము. సింగారింపుము. కాని, ఆపనులన్నింటి మూలమునను నీవు ఆబృందావన గోపాలునే ఆరాధించుచున్నావని మాత్రము అంతరంగమున భావించు చుండుము"

(శ్రీరామ కృష్ణబోధామృతము)

తంత్రములలో చెప్పబడిన భావములకు ఇదే మూలసిద్ధాంతము. కావున భక్తి సిద్ధాంతమునే తాంత్రికులు విస్తృతపరచి జీవితమునందు అన్వయించిరని గ్రహించవలెను.

## భక్తి లక్షణములు

**"సమ్మాన బహుమాన ప్రీతి విరహేతరవి చికిత్సా**
**మహిమాఖ్యాతి తదర్థప్రాణస్థాన తదీయతాసర్వతద్భావా**
**పాత్రికూల్యా దీని చ స్మరణే భ్యో బాహుల్యాత్."**

**శాండిల్య సూత్రములు.**

సమ్మానము, బహుమానము, ప్రీతి, విరహము, ఇతరవిచికిత్స, మహిమ, తదర్థప్రాణస్థానము , తదీయత, అప్రాతికూల్యము మొదలగునవి భక్తి లక్షణములని శాండిల్య సూత్రములందు చెప్పబడినది. ఇందు మొదటిది సమ్మానము అనగా "గౌరవము" భగవంతుని పట్ల ప్రేమ కలుగుటచే ఏర్పడు భావము గౌరవము అని చెప్పబడినది. గురుశబ్దమునకు సంబంధార్థ తద్ధితరూపము గౌరవము. గురువు అనగా గొప్పవాడు, పెద్దవాడు, ముఖ్యమైనవాడు, అనంతుడు, పూజార్హుడు, తనకన్న ముందు పుట్టినది

లేక పుట్టినవాడు, తనకు జ్ఞానోపదేశము/ధర్మోపదేశము చేసినవాడు మొదలగు అర్థములు కలవు. అందుచే గౌరవము అనగా భగవంతుని గొప్పతనమును కొంతవరకు బుద్ధిచే గ్రహించుట ప్రారంభమగు దశ. భక్తునికి భగవంతుని మహాత్మ్యము యొక్క జ్ఞానము కలుగుట ఈదశలో ప్రారంభమగును. అట్లే తన అల్పత్వమును కూడా గ్రహించనారంభించును.

తరువాతది భగవత్ప్రీతి. అజ్ఞానులకు విషయసుఖముల పట్ల ఎంత వ్యామోహము, ప్రీతి ఉంటుందో అంతటి ప్రీతిని, ప్రేమను భగవంతుని వైపు మరల్చుట భక్తుడు చేయవలసిన పని, ("యాప్రీతి రవివేకినాం విషయేషు" ప్రహ్లాదచరిత్ర). అట్టి ప్రేమ కలిగిన పిదప కొంత ఆధ్యాత్మిక అనుభూతి కలిగిన తరువాత కలిగేది విరహవేదన. భగవంతుని పొందలేకపోతిమేనన్న ఆరాటముతో భక్తుడు పడే తీవ్రమైన ఆవేదనను. విరహవేదన అంటారు. ఇది వేదనలన్నింటి కంటె మించినది. భగవంతుని పొందలేకపోతినికదా అని దుఃఖముచే ఇంచుమించు పిచ్చివారై పోవు మనఃస్థితియే విరహము. "తద్విస్మరణే పరమవ్యాకులతా .... "అనగా భగవదనుభవమును మరచుటచే (విస్మృతి) మనసులో తీవ్రమైన వ్యాకులతను పొందుటకూడా ఈ విరహలక్షణము. తనకు ప్రీతిపాత్రమైన భగవంతుని విషయములు తప్ప, తక్కిన విషయములు భక్తుని చిత్తమును వ్యాకులపరచును. చీకాకు కలిగించును. ఈస్థితిని "ఇతర విచికిత్స" అని చెప్పబడును. లౌకిక ప్రేమయందు ఈవిరహము తరచుగా కలుగుచుండుట తెలిసిన విషయమే కదా !

స్త్రీ పురుషులు ఒకరినొకరు గాఢముగా ప్రేమించునపుడు వారికి ఇతర విషయముల పట్ల ఒకవిధమైన విముఖత కలుగును. భక్తవివశులగు వారికి కూడా భగవదేతర విషయములపట్ల ఇటువంటి అసహ్యాభావమే కలుగును. భగవదితర విషయప్రసక్తే వారికి నచ్చదు.

**"తమేవైకం జానథ ఆత్మాన మన్యోవాచోవిముఞ్చథ**
**(ముండకోపనిషత్తు2-2-5)**

"అతనిని గూర్చియే, ఆపరమాత్మను గూర్చియే చింతింపుము. ఆత్మేతర ప్రసంగములను విసర్జించుము."

భగవద్విషయములను గురించి చర్చించువారు మాత్రమే తనకు మిత్రులనీ, ఇతర విషయములను గురించి మాటాడువారు తనకు శత్రువులనీ భక్తునకు తోచుచుండును.

ఇంతకంటెను ఉన్నతమైన స్థితి "తదర్థప్రాణస్థానము". ప్రేమ స్వరూపుడగు భగవానుని కొరకే ప్రాణము నిలుపుకొనుచున్నానని, అట్టిప్రేమ చేతనే జీవితము ధన్యమగుచున్నదని భావించు భక్తుడు పొందు ఉత్తమ స్థితిని 'తదర్థ ప్రాణస్థానము" అంటారు. భగవంతునియందు తన ప్రాణములను ఉంచుట అనగా భగవంతుని కొరకు తనప్రాణ వ్యాపారములను సమర్పించుట. ఇక్కడ ప్రాణవ్యాపారములనగా ఇంద్రియ వ్యాపారములని అర్థము. అనగా సమస్త ఇంద్రియవ్యాపారములను భగవత్పరముగా చేయుట. గాలిపీల్చుతూ, వదులుతున్నప్పుడు మంత్రమును జపించుట కూడా ఈసాధనలో ఒక భాగమే. దీనినే "శ్వాసజపము" అని అంటారు.

భక్తి యోగమునననుసరించి మానవుడు ఎప్పుడు భగవంతుని పొందునో అప్పుడు <u>తదీయత</u> అను స్థితి కలుగుచున్నది. తదీయత అనగా ఆయనకు (భగవంతునికి) సంబంధించినవారై ఉండుట. అను స్థితి కలుగుచున్నది. జీవిత పరమార్థము పొందగలిగిన ఇట్టి భక్తులు కేవలము భగవదారాధనము కొరకే తమ ప్రాణమును నిలుపుకొందురు. ఆపరమానందమును జారవిడుచుకొనుటకు భక్తులు ఇష్టపడరు.

సంసార బంధములనుండి విడివడినవారు, ఆప్తకాములు అయిన మహనీయులు కూడా భక్తి రసాస్వాదనము కొరకే భగవంతుని భజించెదరు. దేవతలు, ముముక్షువులు, బ్రహ్మజ్ఞానులుకూడ అర్చించునట్టివాడు భగవానుడు. భగవద్భక్తి మహత్తరమైనది. తనను తాను మరచి తనదంటూ ఏదీ లేదని భావించునట్టి భక్తునకు "తదీయత" కలుగుచున్నది.

సమష్టిరూపమగు భగవంతుని తెలుసుకొనినగాని వ్యష్టిరూపమగు మానవుని పూర్తిగా తెలుసుకొనుట సాధ్యము కాదు. సృష్టి అంతటా సమముగా వ్యాపించిన భగవంతుని గురించి తెలుసుకోగలిగినప్పుడు తప్ప దేశకాలగుణకర్మవిశిష్టుడగు మానవుని సేవింపజాలము. భగవంతుడు సమష్టిరూపము. మానవుడు వ్యష్టిరూపము. ఈదృశ్య ప్రపంచము

సమష్టియగు భగవానుని స్వరూపమే కాని వేరొకటి కాదు. ప్రేమరూపా, ప్రియంకరీ" అని లలితా సహస్రనామములందు చెప్పబడిన విధముగా ఆపరమేశ్వరుడు పుణ్యపాపములు, ఉచ్ఛనీచములను భేదములేకుండా సర్వజీవులను ఎల్లప్పుడూ ప్రేమిస్తూ వారి ఆత్మోద్ధరణకు సాయపడుతుంటాడు. అట్టి భగవానుని ప్రేమించుటచే మనము కూడా విశ్వప్రేమను పొందిన వారమగుదుము. విశ్వరూపుడగు పరమాత్మను ప్రేమించనిదే విశ్వమును (అనగా సర్వజీవులను) ప్రేమించుట, లోక కళ్యాణార్థమై పాటుపడుట సాధ్యము కాదు. జగద్ధితము అనగా జగత్తుయొక్క హితమును కోరుట జగద్ధితముకై పాటుపడుట. మానవసేవయే మాధవసేవ అను సాధన పూర్ణసత్యము. మాధవసేవయే మానవసేవయనునది అర్థ సత్యము.

"ఈచరాచర జగత్తు అంతయూ భగవంతుని వ్యక్త స్వరూపమే. అతడే నాకు ప్రియతముడు. ఆతనినే నేను ప్రేమింతును" అని భావించు భక్తునకు ఈవిశ్వమంతయు ప్రేమయమగును. అతనికి అందరూ భగవత్స్వరూపులుగా గోచరింతురు. అంతటా వ్యాపించియున్న పరమాత్మను గాంచుచున్నభక్తుడు ఇంక ఎవ్వరికినీ ఎటువంటి కీడును తలపోయలేడు. ఎవ్వరినీ ప్రేమించకుండుట కూడా అతనికి సాధ్యము కాదు. విశ్వరూపుడగు పరమాత్మయందలి ప్రేమవలన విశ్వమానవ ప్రేమ కలుగును. ఈసత్యము బోధపడినచో సమస్తము పరమేశ్వరుని యందే సంస్థితమై యున్నదని గ్రహించగలిగెదము. ఇట్టి పరాభక్తి లభించినప్పుడు సర్వభూతములందును పరమాత్మను దర్శించుట సాధ్యమగును. ఇట్టి పరమ ప్రేమ వృద్ధి చెందినకొలదీ బేధభావమునశించి, అప్పుడు మానవుడు మానవుడుగాకాక సాక్షాత్తూ భగవత్స్వరూపముగా కనిపించును. ఈపరమభక్త్యవస్థలో భక్తుడు సృష్టిలోని ప్రతిజీవిని, వస్తువును, భగవంతుని రూపముగా భావించి ఆరాధించును.

హరి సర్వభూతమయుడని గ్రహించి సర్వభూతములందును నిశ్చలమగు భక్తిని చూపుటయే పండితుల కర్తవ్యము.

హరి సర్వమయుడు. సర్వము హరిమయము. ఇట్లు విశ్వవ్యాప్తమైన నిశ్చలప్రేమవలన సంపూర్ణమగు 'ఆత్మనివేదన' భావము కలుగును

మనకు అనుకూలముగనే అన్నియు సిద్ధించును. ప్రతికూలముగా ఏదియు సంభవింపదను దృఢమైన విశ్వాసము కలుగును. దేనితోను, ఎవ్వరితోను మనకు ప్రతికూలభావన లేకపోవుటను "అప్రాతికూల్యము" అంటారు. ఇట్టి పరిపూర్ణ స్థితినొందిన మానవుడు కష్టసుఖములను ఈశ్వర సంకల్పముగా, ఈశ్వర ప్రసాదముగా భావించి సమభావముతో, సమచిత్తముతో, అనుభవించగలుగును.

భగవంతుని పట్ల గల గాఢమైన ప్రేమ, సర్వభూతములు ఆభగవంతుని స్వరూపమే అని భావించుటచే కలిగిన విశ్వప్రేమచేత ఇట్టి ఆత్మార్పణ బుద్ధికలిగిన భక్తుడు కష్టములకు కృంగిపోడు. సుఖము లభించినదని పొంగిపోడు. అంతా ఈశ్వరేచ్ఛగా భావించును.

అవసరమైనచో భగవంతునికై తన సర్వస్వమును అర్పించగల త్యాగబుద్ధిలేనిదే మానవుడు పరిపూర్ణమైన భక్తుడు కాలేడు. అశాశ్వతమైన ఈశరీరమును లోకకళ్యాణార్థమై వినియోగించవలెను. అప్పుడే మానవజీవితమునకు సార్థకత కలుగును. దేవతలకు విజయము లభించుటకొరకు కావలసిన ఆయుధములను తయారుచేసుకొనుటకై శరీరమునే త్యజించి తన వెన్నెముకను దేవతలకు ప్రసాదించిన ధన్యుడు ధధీచి మహర్షి.

"దేహోనాహం" అనగా నేను ఈదేహమునుకాను, "నారాయణాయ ఇదం, నమమ" అనుభావముతో దధీచి మహర్షి తీవ్రమైన తపస్సు చేయటం వలన ఆయన శరీరము దేవకార్యసాధనకు ఆయుధముగా ఉపయోగపడినది. ఇచ్చట ఆయుధము అనగా ఉపకరణము (Instrument) అని అర్థము. కుండలినీ సంచారమునకు దారి యిచ్చుశరీర భాగము వెన్నెముక. ఈవెన్నెముకను ఉపకరణముగా చేసుకుని దేవాసుర సంగ్రామమునందు ఇంద్రుడు వృతాసురుని సంహరించెను." అని కథలో చెప్పబడినది. అనగా భక్తులు తన శరీరము. ప్రాణము, వాక్కు, మనోబుద్ధులను పరమేశ్వరార్పణ చేయవలెనని తాత్పర్యము.

అందువలన తమ సిరిసంపదలను, తమ ప్రాణములను సైతము లోక కళ్యాణార్థమై వినియోగించుటకు మహాత్ములైన వారు సర్వసంసిద్ధులై ఉంటారు. "జాతస్యమరణమ్ ధృవమ్" పుట్టిన వెల్ల గిట్టక తప్పదు

కావున నశించక తప్పని ఈశరీరమును సత్కార్యముల యందు, లోక క్షేమముకొరకు వినియోగించుటయే శ్రేయస్కరము.

నిజమునకు జీవితమునకు సార్ధకత కలిగించునది లోకసేవయే , అనగా సమస్త ప్రాణులకు సాధ్యమైనంత సేవచేయుట మాత్రమే. దేహాభిమానము స్వార్ధమును పెంచుతుంది. ఈశరీరము నాదికాదు. నేను శరీరము కంటె భిన్నుడను. ఈసమస్త ప్రపంచము భగవంతుని స్వరూపము అని గ్రహించగలిగినప్పుడు సమస్త భేదభావములు, జాతీయత కుల విద్వేషములు నశించును. ఉత్తమమైన భక్తి, భేదభావములను నశింపచేసి విశ్వమానవ సౌభ్రాతృత్వమును పెంపొందింపచేయును.

## భక్తి దశలు

1. "తస్యైవాహమ్" – "నేను ఆపరమాత్మకు సంబంధించిన వాడను" అని గుర్తించుట భక్తి యొక్క ప్రాధమిక దశ. ఇక్కడ పరమాత్మ యొక్క పరోక్షత్వము (Indirect) మాత్రమే గుర్తించబడుచున్నది. అనగా భగవంతుడు తనకంటె భిన్నుడనీ ఎక్కడో కైలాసంలోనో వైకుంఠంలోనో, దేవాలయాలలోనో ఉండేవాడనీ భక్తుడు అనుకుంటూ ఉంటాడు.

2. తవైవాహమ్ – నేను నీవాడను. ఇది భక్తియొక్క ద్వితీయదశ, ఈదశలోని వారికి భగవంతుడు అత్యంతసమీపముగా ఉన్నాడు; ముఖాముఖీగా ఉన్నాడని తెలియును (గ్రహించగల్గును). ఇక్కడ తెర ఇంకా సూక్ష్మీకరించబడినది. ఈదశయందు భక్తుడు భగవంతుడు తనకంటె భిన్నుడైనప్పటికినీ తనకూ భగవంతునికీ విడిచిపెట్టుటకు వీలులేని నిత్య సన్నిహిత సంబంధం కలదని గ్రహించును. తాను భగవంతుని యందలి అంశమునని గుర్తించి నియామ్యనియామకభావము, సేవ్యసేవకభావము, పతి పత్నీభావము మొదలగు ధారణలతో భగవదనుసంధానము గావించుచుండును.

3. త్వమే వాహమ్ – నీవే నేను. ఇది భక్తి యొక్క తృతీయ దశ. ఈదశలోని వారికి బ్రహ్మాకారవృత్తి సంప్రాప్తించినది. భేదము, పటాపంచలైపోయినది. ఆస్థితినిర్బీజ సమాధి కాని, సహజావస్థ కాని కావచ్చును. ఈస్థితిని మనస్సుతో, వాక్కుతో వివరించుట కష్టము. ఇది

మహానిర్వాణ స్థితి. అక్కడ వాక్కులేదు. శబ్దములేదు. అట్టిస్థితిని వాక్కు, మనసు నిర్వచించలేవు. అట్టి స్థితియందు, నిజమైన భక్తిలో దూరమూ, భేదమూ లేదు. ఇక భక్తునకు భగవంతునికి మధ్య తెరకు తావెక్కడ ?

మనస్సు యొక్క పరిణతిననుసరించి మానవుడు ఆయాభక్తి స్థితిని ఆశ్రయిస్తాడు. ఏదశలో ఉన్నా, ఎటువంటి భక్తిమార్గమును అనుసరించినవాడైనా హృదయపూర్వకమైన భగవత్ప్రేమ చేత, తీవ్రశ్రద్ధా పరాయణత్వము చేత పరాభక్తి శిఖరాన్ని అందుకోగలుగుతాడు. ఆయా భక్తిదశలలోని, సత్య శ్రద్ధాన్వితులగు భక్తుల జీవితములలో, ఈలక్ష్యసిద్ధి గోచరిస్తుంది.

సుఖదుఃఖాదుల పట్ల రాగద్వేషములు లేకుండా, ఏది ప్రాప్తించిననూ భగవంతుని ప్రసాదముగా భావించి సమచిత్తముతో అనుభవించుచుండును. కాని మనలోని లోపములు, దోషములు, విషయవాంఛలు కూడా భగవత్సంకల్పమే అని భావించరాదు. స్వార్థపూరితమగు ప్రయత్నము వలనకూడా ఒక్కొక్కప్పుడు మేలుకలగవచ్చును. కాని స్వ ప్రయోజనమును ఆశించుట కాని, అందులకై ప్రయత్నము చేయుటకాని నిజమైన, పరిపూర్ణమైన భక్తి లక్ష్యముకాదు.

నిస్వార్థము, నిర్మలము అయిన ఆత్మనివేదనచే కలుగు ప్రశాంతస్థితి భావాతీతము. ఇట్టి ప్రశాంతస్థితియే "అప్రాతికూల్యము" అనుభక్తి దశ. ఇట్టిస్థితిని పొందిన భక్తునకు ఎటువంటి స్వార్థచింతనా ఉండదు. అంతయూ అతనికి అనుకూలముగనే అనిపించును సృష్టిస్థితి లయకారకుడగు భగవంతునియందు తప్ప ఇతర విషయములందు ఆసక్తి పూర్తిగా నశించును. భగవత్ప్రేమ రూపమగు ఈఅనురాగము బంధహేతువుకాక, సమస్త బంధములను విచ్ఛిన్నము చేయును.

**"ద్వేవిద్యే వేదితవ్యః ఇతిహస్మయద్బ్రహ్మవిదో**
**వదన్తి పరా చైవా పరాచ"**

**(ముండకోపనిషత్తు I-I-3)**

"పర విద్య అనియు, అపరవిద్య అనియు తెలియదగిన విద్య రెండే విధములని బ్రహ్మవేత్తలు వక్కాణిస్తారు. వేదములు, శిక్ష, కల్పము,

వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిష్యము – వీనితో కూడినది అపరవిద్య. దేనివలన అక్షరపరబ్రహ్మజ్ఞానము కలుగునో. అదియే పరవిద్య. అవిచ్ఛిన్నముగా పడు తైలధారవలె పరమేశ్వరుని పట్ల ఎడతెగని భక్తి ఏర్పడినప్పుడు, పరాభక్తి సిద్ధించుచున్నది.

నిశ్చలమైనది, సతతము అవిచ్ఛిన్నముగా ఉండునది, అనురాగముతో కూడినది అగు భగవచ్చింతనమే, భగవంతునిపట్ల మనకుగల ప్రేమను తెలియచేయును. ఇతరమగు భక్తిరూపములన్నియు ఇట్టిపరాభక్తిని పడయుటకు సాధనములు. ఇట్టి దివ్యప్రేమ భక్తుని హృదయమునందు జనించగనే భగవంతుని చింతన తప్ప ఇతర చింతనములకు అందు అవకాశము ఉండదు. అప్పుడు భక్తుని మనసు అత్యంత పవిత్రమగుట వలన సమస్తమైన ఇతర బంధములు నశించును. అతడు నిశ్చలప్రశాంత స్థితిని పొందగలుగును. తనహృదయసింహాసనమున భగవంతుని ఆరాధించుటకు అట్టి భక్తుడొక్కడే అర్హుడు. పూజావిధులు, పుస్తక పఠనాదులు, సిద్ధాంతములు, వాదోపవాదములు అతనికి అనవసరము. నిష్ప్రయోజనము. పారమార్థికమగు ఇట్టి ప్రేమయే పరాభక్తికి సాధనము.

ఫలాపేక్షలేకుండుట, నిర్భయత్వము, తాను ప్రేమించినదే మహోత్తమమని భావించుట అను మూడు లక్షణములు లేని చోట నిజమైన ప్రేమ ఉండదు. ఫలాపేక్షతో కూడిన ప్రేమ కేవలము వర్తకము వంటిది. కాని నిజమైన భక్తుడు "భగవంతుడు ప్రేమపాత్రుడు" అను కారణముచేతనే ప్రేమించును. అట్టి భక్తుడు చూపు ప్రేమకు కారణము ఏదీ ఉండదు. మరొక ఉద్దేశము ఏదీ ఉండదు. "అహైతుకీ" అని భాగవతములో చెప్పబడినది ఇట్టి నిర్హేతుక ప్రేమయే". ఫలమును ఆశించి ప్రేమించుట ప్రేమలక్షణముకాదు. సాక్షాత్తూ ముక్తి కొరకే అయిననూ, మరి ఏ ఇతర కోరిక చేతైననూ భగవంతుని ఉపాసించుట కూడా దోషమే ఫలాపేక్షయున్నచో అది అసలైన ప్రేమ కాదు. నిష్కారణమూ, నిస్వార్థమూ అయినదే అసలైన ప్రేమ ప్రేమించకుండా ఉండటం తన స్వభావమునకు విరుద్ధం కాబట్టి భక్తుడు ప్రేమిస్తాడు. ప్రేమించుటయే ప్రేమకు సహజ లక్షణము. ప్రతిఫలాపేక్షరహితమగు ప్రేమను భగవంతునికి అర్పించవలెను. భగవంతుని నుండి కూడా ఎట్టి ప్రతిఫలమునూ ఆశించరాదు..

నిర్భయత్వము ప్రేమకు రెండవలక్షణము. "Fear of god is the begining of Religion" అంటారు. భయము చేత భగవంతుని ప్రేమించువారు ప్రారంభసాధకులు. భగవంతుడు తమను శిక్షించునేమోనన్న భయముతోవారు భగవంతుని ఉపాసింతురు. మనసునందు భయము ఉన్నంతవరకూ ప్రేమకు అందు తావు లేదు. ప్రేమ భయమును పోగొడుతుంది. మనుష్యులలోని స్వార్థచింతనయే భయమునకు కారణము. అల్పత్వమూ, స్వార్థచింతనమూ మనలో పెరిగిన కొద్దీ భయము కూడా అధికమగును. "నేను అల్పుడను" అన్న భావన తగ్గిన కొలదీ భయముకూడా తగ్గుచుండును. ప్రేమ ఉన్నచోట భయమునకు తావు ఉండదు. భగవంతుని నిస్వార్థముగా ప్రేమించువారు భగవంతుడంటే భయపడరు.

ఏవిధముగా స్మరించినప్పటికీ భగవంతుని ఏదో ఒక విధముగ స్మరించుట శ్రేయస్కరము.

"బిడ్డ పేరుబెట్టి పిలుచుట విశ్రామ
కేళినైన మిగుల గేలినైన
పద్యగద్య గీత భావార్థములనైన
గమలనయనుదలుప గలుష హరము"

"భాగవతము"

బిడ్డపేరు పెట్టి పిలిచి, తద్వారా భగవన్నామమును స్మరించుటచే ముక్తినొందాడు అజామీళుడు అని "అజామీళోపాఖ్యానము" నందు '(భాగవతము) చెప్పబడినది. వేళాకోళమునకై పిలిచినప్పటికీ కూడా భగవన్నామస్మరణము శ్రేయోదాయకమే అగును.

భగవంతుడు ప్రేమస్వరూపుడగుటచేత, భగవంతునియందు గల ప్రేమచే భక్తుడు భగవంతుని ప్రేమించును. ఉత్తమమైన ఆదర్శమును లక్ష్యముగా చేసుకున్నప్పుడు, ఆధారముగా చేసుకున్నప్పుడు మాత్రమే సహజముగా ప్రేమ వృద్ధి అవుతుంది. అవతార పురుషులైన రాముడు, కృష్ణుడు మొదలగు వారి జీవిత విధానము మానవులకు ఆదర్శప్రాయము కావలయును. ఈఆదర్శమును మానవులు అనుసరించు రీతులలో మత ధర్మములు ఏర్పడుచున్నవి.

భక్తునకు భగవంతుడు కేవలము ప్రేమమయుడు. సమస్త.జగత్తు

న్ందు వ్యాపించియన్న ఆత్మ స్వరూపము నేనే అని భావించునపుడు మనయందు స్వార్థపరత్వముండుటకు అవకాశము లేదు. కాని నేను పరిచ్ఛిన్నుడను (conditioned) అని భ్రమించునపుడు ప్రేమ సంకుచితమై ప్రత్యేకించబడుచున్నది. మానవుడు స్వార్థపూరితమైన, సంకుచితమైన ప్రేమను విడిచి విశాల భావములను, త్యాగభావమును పెంపొందింప చేసుకుని పరమాత్మస్వరూపమగు విశ్వప్రేమను పొందవలెను. ఈప్రపంచమంతయు ఆసృష్టికర్తయగు పరమాత్మ స్వరూపమే యగుటచేత మనము కూడా ఆపరమాత్మ అంశయే అగుటచేత మనకు ఈప్రపంచమంతయు ప్రేమ పాత్రమగుచున్నది. హృదయము నిర్మలమై, దివ్యప్రేమ భరితమగునప్పుడు భక్తి పరిపూర్ణమై పరాభక్తిగా పరిణమించును. భగవంతుడు సర్వాంతర్యామి అని గ్రహించగలిగిన భక్తుడు అన్నింటిలోను భగవంతుని దర్శించగలుగును కాబట్టి దైవ సందర్శనార్థమై ప్రత్యేకించి అతనికి ఆలయాదులకు వెళ్ళవలెనని అనిపించదు.

"ఇందుగలడందు లేడని సందేహము వలదు, చక్రి
సర్వోపగతుడు" అని భాగవతమునందు భాగవతాగ్రేసరుడగు ప్రహ్లాదుడు

చెప్పిన విధముగా భగవంతుడు, అట్టి పరమభక్తిని పొందిన భక్తులకు సర్వాంతర్యామియై గోచరించును. అట్టి భక్తునకు భగవంతుడు లేని తావే లేదు. దేవాలయమునందును, దేవాలయము వెలుపలకూడా అతడు భగవంతుని చూడగల్గును. మంచి వారియందు, చెడ్డవారియందు కూడా వ్యాపించియున్న పరమాత్మను దర్శించగల్గును. సమస్త ప్రకృతి ఆతనికి భగవత్స్వరూపముగా గోచరించును. అందరియందు, అన్నింటియందు, తనయందు పరమాత్మను దర్శించగల్గును. సమస్త ప్రకృతి ఆతనికి భగవత్స్వరూపముగా గోచరించును. అందరియందు, అన్నింటయందు, తనయందు పరమాత్మను దర్శించగల భక్తునియందు స్వార్థము, ద్వేషము ఉండుటకు అవకాశములేదు. అతడు లోకకల్యాణార్థమై సేవాభావముతో నిష్కామ కర్మచేయుచుండును.

మోక్షప్రాప్తి సాధనములుగా పెద్దలు నిర్దేశించిన కర్మ, భక్తి, జ్ఞానమార్గములలో, జ్ఞానమార్గము ఎంతో పరిణతి చెందిన మహాయోగులకు తప్ప సామాన్యులకు సాధ్యముకాదు. కర్మ మార్గము కూడా నియమ

నిబంధనలతో కూడి "కత్తి అంచున ఉన్న తేనెను గ్రహించుట" వలె అందరికీ సులభ సాధ్యమైనది కాదు. వైదిక కర్మాచరణకు లింగ, వర్ణ, ఆశ్రమ వయోభేదములనుబట్టి కొన్ని నియమములు, పద్ధతులు నిర్దేశించబడినవి. కాబట్టి వైదిక కర్మమార్గం కూడా అందరికీ అంత సాధ్యమయ్యేది కాదు. సర్వకర్మఫలత్యాగరూపమైన లౌకిక కర్మానుష్ఠానమును ఈశ్వరార్పణబుద్ధితో అందరూ చేయవచ్చును. ఇట్టి నిష్కామకర్మ యోగము భక్తి యోగము నందలి భాగమే అవుతుంది.

పండితులు, పామరులు, స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు, ఏకులమువారైనా కాని, ఏఆశ్రమంవారైనా కాని ఆచరించుటకు వీలయినదీ, సులభమైనదీ ఎవరైనా అనుసరించదగినదీ, అనసరించవలసినదీ భక్తిమార్గం ఒక్కటే. దీనికి పేదా, గొప్పా అనే భేదంలేదు. ధనికులైనా, నిరుపేదలైనా ఫలితం సమానంగానే ఉంటుంది.

భాగవతమునందు వర్ణించబడిన భక్తుల చరిత్రలు అన్నింటిలోనూ భక్తికే ప్రాధాన్యత ఇవ్వబడింది. అందుచేతనే భాగవత ఆరంభమునందే నారదుడు వ్యాసునితో, అతని వేదనకు కారణం చెపుతూ

**"అంచితమైన ధర్మచయమంతయు చెప్పితి వందులోననిం**
**చుకగాని విష్ణుకథలేర్పడ జెప్పవు ధర్మముల్ ప్రవ**
**చించిన మెచ్చునే గుణవిశేషము లెన్ననగాక నీకునీ**
**కొంచెము వచ్చుటెల్ల హరిగోరినుతింపమి నార్యపూజితా"**

అంటూ విష్ణు కథా మహిమను గురించి వివరించాడు. అంతేకాక "యమనియమాది యోగముల నాత్మ నియంత్రితమయ్యును కామరోషముల ప్రచోదితంబు యగు, శాంతి వహింపదు విష్ణుసేవచే గ్రమమును శాంతి గైకొనినకైవడి" అంటూ విష్ణుసేవా మహిమను గూర్చి తెలిపెను.

మోక్షమును పొందటానికి ఎన్నోమార్గములున్నప్పటికీ భక్తిమార్గం కంటె ఆచరణ సాధ్యమైనదీ, సులభమైనదీ మరొకటి లేదని శ్రీశుకుడు పరీక్షిత్తునకు బోధించాడు.

"పరానురక్తిరీశ్వరే" సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా" అనునవి భక్తికి ఇవ్వబడిన నిర్వచనములు. భక్తులకు భగవంతుని పట్ల కలిగిన

ప్రేమానురాగాది భావముల అతిశయమే భక్తి. ఇది భక్తునకు భగవంతునకు గల సన్నిహిత సంబంధమునకు మారుపేరు. భగవద్విషయకమగు ఈభక్తి "భావము" మాత్రమే నని కొందరు, అలాకాక భక్తికి ప్రత్యేకముగా రసత్వమే" కలదని మరికొందరి అభిప్రాయము.

ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహిక తాంగతా
సర్వేశే మనసోవృత్తిర్భక్తి రిత్య భిధీయతే

భక్తి రసాయనము (మధుసూదన సరస్వతి)

"చిత్తము అనునది లక్కవలె కఠినమైన స్వభావం కలది. నిప్పుసెగచేత లక్క కరగినట్లు కామక్రోధాది విషయముల యొక్క వేడిచే అది కరుగుతుంది." అని మధుసూదన సరస్వతిగారి వివరణ.

భగవంతుని గుణరూపాది వర్ణనములను వినుటచేత భక్తులచిత్తము ద్రవీభవిస్తుంది. ద్రవీభవించిన చిత్తము భగవదాకారము అనెడు మూసలోనికి ప్రవహించి తదాకారాకారితమై అనగా భగవద్రూపము ధరించి నిలుస్తుంది. అట్లు నిలుచుటనే "స్థాయీ భావము" అని అంటారు. (స్థాయి అనగా to stop నిలిచిపోవటం అని అర్థం). ఈస్థాయీభావము విభవానుభవాది చిత్తవృత్తులచే పరిపోషణమును పొంది బ్రహ్మానందాత్మకమైన "రసమై" సహృదయులగు భక్తులకు పారవశ్యాన్ని కలిగిస్తుంది. అని "భక్తి రసాయనము" నందు ప్రతిపాదించబడినది. భగవంతుని పట్లగల భక్తి వివిధభావములందు వ్యక్తముచేయబడుతూ ఉంటుంది.

భగవంతుని సేవించటానికి, భగవంతుని ప్రేమకు పాత్రులవడానికి మూలమైన ఈభక్తియందు అనేక మార్గములు చెప్పబడినవి.

రెండు ఘడియలకాలంలో మృత్యువుపాలవుతానని తెలుసుకున్న "ఖట్వాంగుడు" అను మహారాజు తనసమస్తాన్నీ, సర్వసంపదలనూ, భార్యాపుత్రులనూ, బంధుమిత్రులనూ త్యజించి, భగవంతుని ఆశ్రయించి, గోవిందనామ సంకీర్తనం చేసుకుంటూ, రెండు ఘడియలకాలంలోనే కైవల్యం పొందగలిగాడు.

శాపగ్రస్తుడై ఏడుదినములలో మరణించనున్న పరీక్షిన్మహారాజు

శుకుని ద్వారా భాగవతశ్రవణం చేసి, కైవల్యాన్ని పొందిన భాగవతోత్తముడు. ఈభక్తి ముఖ్యంగా తొమ్మిది విధాలుగా చెప్పబడింది. వీటినే నవ విధ భక్తిమార్గము" లని అంటారు. ఈనవవిధ భక్తి మార్గములనూ అవలంబించి, తరించిన భక్తుల గురించి, భాగవతంలో చక్కగా వివరించబడింది.

ఈనవవిధ భక్తిమార్గములలో ఏఒక్క మార్గాన్ని అవలంబించినా కూడా మనంతరించవచ్చును. శ్రవణము, కీర్తనము, స్మరణము, భజనము, పూజనము, అభివందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము – అనునవి ఈతొమ్మిది విధములైన భక్తిమార్గములు.

**శ్రీవిష్ణోః శ్రవణే పరీక్షదభవత్ వైయ్యాసకిః కీర్తనే**
**ప్రహ్లాదః స్మరణేత తదంఘ్రి భజనే లక్ష్మి పృథుః పూజనే**
**అక్రూరస్తు అభివందనే కపిపతిర్దాస్యే సఖ్యే అర్జునః**
**సర్వస్య ఆత్మనివేదనే బలిరభూత్ కైవల్యం ఏషాంఫలమ్**
**పద్యావళి 63వ శ్లోకం**

భగవత్కథాశ్రవణం చేస్తూ, అనగా నిరంతరం భగవంతుని దివ్య చరిత్రలను వింటూ ఉండటం "శ్రవణ భక్తి", కేవలం ఏడురోజులలో మరణిస్తానని ఎరిగికూడా, విచారంతో ఉన్న సమయాన్ని వ్యర్థం చేసుకోకుండా, మహాత్ముడైన శుకమహాముని ముఖతః భాగవతకథా శ్రవణం చేసి కైవల్యాన్ని పొందిన ఉత్తమ భక్తుడు పరీక్షిన్మహారాజు.

**"ఏను మృతుండనౌదునని యింతభయంబు మనంబు లోపలన్**
**మానుము సంభవంబుగల మానవకోట్లకు జావునిక్కమౌ**
**గానహరి దలంపుమిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై**
**మానవనాధ పొందెదవు మాధవలోక నివాసముల్."**

"ఓరాజా ! జీవకోటికంతటికినీ మృత్యువు జయింపరానిది. పుట్టిన ప్రతిప్రాణీ గిట్టక తప్పదు. అందువలన హరిని స్మరించినచో మరి ఇక జన్మ లేకుండా వైకుంఠప్రాప్తి నొందగలవు. అందువలన శాపగ్రస్తుడవై మరణించబోతున్నందుకు భయపడవలదు ..... విచారించవలదు" అని బోధించాడు శ్రీశుకుడు పరీక్షిన్మహారాజునకు.

బృహదారణ్యక ఉపనిషత్తులో "ఆత్మావా అరే ద్రష్టవ్యో శ్రోతవ్యో

మన్తవ్యో నిధి ధ్యాసితవ్యః" అని చెప్పబడినది. అనగా ఆత్మశ్రోతవ్యము, మన్తవ్యము, నిధి ధ్యాసితవ్యము. ఇక్కడ "తవ్య" ప్రత్యయము చేత చెప్పుటచే శ్రవణము, మననము, నిధి ధ్యాసనము అనునవి సాధనకు విధింపబడిన యోగాంగములు అని గ్రహింపవలెను. కాబట్టి శ్రోతవ్యః అని బృహదారణ్యక శ్రుతియందు చెప్పబడినది ఈశ్రవణభక్తియే.

2. <u>కీర్తన</u> : – సతతం హరినామ సంకీర్తనం చేస్తూ తరించిన భాగవతోత్తముడు శ్రీశుకుడు. ఇతడు శ్రీవేదవ్యాసుని పుత్రుడు. శాపగ్రస్తుడైన పరీక్షిత్తునకు వారమురోజులపాటు భాగవతమును వినిపించి మోక్షాన్ని పొందింపజేసి కీర్తనద్వారా తరించిన భక్తుడు శ్రీశుకుడు.

**"నిగమకల్పతరోర్గళితం ఫలం । శుకముఖా దమృతద్రవసంయుతమ్**
**పిబత భాగవతం రసమాలయం । ముహురహోరసికాభువిభావుకాః"**

"వేదమనెడి కల్పవృక్షమునుండి అవిచ్ఛిన్న బ్రహ్మవిద్యాసంప్రదాయ ప్రవర్తకులైన గురుపరంపర ద్వారా క్రమముగాపొందబడినది, శుకుని నోటిచే ఉచ్చరించబడుటచే అమృతరస సంయుక్తమైనది (చిలక కొట్టిన పండుకు తీపి ఎక్కువ అని లోక ప్రసిద్ధి) అయిన ఈభాగవత ఫలమును భావుకులైన ఓ భక్తులారా ! మోక్ష సిద్ధియగునంత వరకు ఈభాగవత రసమును మరల మరల గ్రోలుచుందురుగాక !".

శుకునిచే చెప్పబడుటచే భాగవతఫలము మాధుర్యాతిశయము పొందినట్లు ప్రతిపాదించబడినది. అందుచే కీర్తన భక్తికి శుకుడు ప్రప్రథమాచార్యుడు అని చెప్పవచ్చును.

3. <u>స్మరణం</u>: నిరంతరము భగవంతుని స్మరించటం స్మరణ భక్తి. బృహదారణ్యక శృతియందు 'మన్తవ్యః' అని చెప్పినప్పుడు ఈ స్మరణభక్తిని ఉద్దేశించియే చెప్పబడినది. మాతృగర్భంలో ఉండగానే నారదమహాముని ద్వారా ఉపదేశం పొంది, బాల్యం నుండీకూడా హరినామస్మరణతో తరించిన భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు.

**విషయాసక్తులైన విభుదాహితులతోడి**
**మనికి వలదు ముక్తి మార్గవాంఛ**
**నాది దేవు విష్ణు నాశ్రయింపుడు ముక్త**
**సంగ జనుల గూడి శైశమున .....**

అని చిన్నతనంలోనే తనతోటి వారిని కూడా భక్తి మార్గంవైపు మళ్ళించగలిగాడు బాలప్రహ్లాదుడు. అతడు తనయందు, అఖిల ప్రాణికోటి యందును కూడా సమభావాన్ని కలిగి ఉండేవాడు. పెద్దలను గౌరవించేవాడు. కంటికి పరకాంతలు ఎదురైనచో మాతృభావముతో మన్నించే వాడు. దీనులపట్ల కరుణ కలిగి ఉండేవాడు. తనతోటివారిని సోదరభావముతో ప్రేమించేవాడు. గురువులను దైవ సమానులుగా భావించేవాడు. ఎగతాళికైనా అసత్యం పలికేవాడుకాడు. అటువంటి సద్గుణ సంపన్నుడు ప్రహ్లాదుడు. "చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ" యని తండ్రితో "విష్ణుభక్తికి మించిన విద్యలేదని, ఆతనిని భజించని కరములు కరము లేకావనీ, అతని నామమును ఉచ్చరించని నాలుక నాలుకయే కాదనీ, ఆపరమాత్మను దర్శించలేని కన్నులు నిష్ఫలములనీ" నిర్భయముగా చెప్పినాడు. అంతేకాక అట్టిహరి ఎక్కడున్నాడని తండ్రి గద్దించి అడుగగా

"ఇందుగలడందు లేడని సందేంబు వలదు
చక్రి సరోప గతుండెందెందు వెదకి చూచిన
అందందే గలడు దాన వాగ్రణి వింటే .... అంటూ

చక్రి సర్వవ్యాపకత్వమును గురించి పరిపూర్ణవిశ్వాసంతో తండ్రికి చెప్పాడు. అంతట తండ్రి ఆగ్రహించి ...

"డింభక సర్వస్థలముల
నంభోరుహ నేత్రుడుండుననుచు మిగుల సం
రంభమున బలికెదవీ
స్తంభంబున జూపగలవె చక్రిన్ గిక్రిన్."

"అయినచో నీవు సర్వాత్మకుడని, సర్వవ్యాపకుడని చెప్పుచున్న ఆ హరిని ఈ స్తంభమునందు చూపగలవా ?" అంటూ హిరణ్యకశిపుడు క్రోధముతో సభలోని ఒక స్థంభమును తనగదతో కొట్టగనే ...

ఎక్కడ వెదకి చూస్తే అక్కడే భగవంతుడు ప్రత్యక్షమవుతాడని నిర్భయంగా, దృఢవిశ్వాసంతో, ధైర్యంగా పలికిన ఆబాలభక్తుని పలుకులను నిజంచేస్తూ 'శత్రు' భీకరమగు నరహరి రూపములో ప్రత్యక్షమై భగవంతుడు రాక్షస సంహారం చేసి, భక్తుని రక్షించిన కథ అందరికీ తెలిసిదేకదా !

అతిమధురంగా వర్ణించబడిన ఈప్రహ్లాదుని చరిత్రయందు భక్తి లక్షణములు, భక్తుని లక్షణములు స్పష్టంగా చెప్పబడినాయి. ఈనాటి అధునిక వైజ్ఞానికులు కూడా పరిశోధనలు చేసి ఋజువు చేసిన సత్యం "గర్భస్థ శిశువులకు గ్రహణశక్తి ఉంటుందన్న విషయం". ఆపురాతనకాలంలోనే లీలావతి గర్భస్థ శిశువై ఉండగానే నారదమహాముని ద్వారా ప్రహ్లాదుడు హరిభక్తిని ఆకళించుకున్నాడని చెప్పబడింది. అలాగే భారతంలో కూడా అభిమన్యుడు సుభద్రా గర్భస్థుడై ఉన్నప్పుడు తన తండ్రియైన అర్జునుని వద్దనుండి పద్మవ్యూహరచనావిధానం గురించి తెలుసుకున్నాడని చెప్పబడింది. అనగా స్త్రీలు గర్భవతులై ఉన్నప్పుడే వారు మంచి పుస్తకములను చదవటం, మంచి విషయాలను వినటం, మంచి దృశ్యాలను చూడటం వంటివి అభ్యాసం చేస్తే పుట్టబోయే శిశువునందు పసితనంనుండే ధార్మిక లక్షణాలు అలవడతాయని మనం నేర్చుకోవలసిన మొదటిపాఠం. క్రూరత్వం, హింస నిండి పాపం ప్రబలుతున్న ఈకలియుగంలో ఇటువంటి సాధనకూడా ఎంతో అవసరం కాదా !

భక్తికి వయస్సుతో నిమిత్తం లేదనటానికి ఉదాహరణగా పసితనం నుండే తాను భక్తిమార్గంలో ప్రవర్తించటమే కాకుండా తోటి బాలురను, చదువుచెప్పే గురువులను కూడా భగవంతుని భజించేలా చేశాడు. బాలప్రహ్లాదుడు. చిన్నతనంనుండే అనేక సద్గుణములను, సత్ప్రవర్తనను అలవరచుకొని హరి భక్తికి మించిన విద్యలేదని. భగవంతుని సేవించుట యందు ఉపయోగపడని ఇంద్రియములు వ్యర్థములని, భగవంతుని ప్రేమించలేని ఈశరీరము జడముతో సమానమని తెలుసుకున్నాడు. భగవంతుడు సర్వవ్యాపకుడన్న దృఢమైన నిశ్చయంతో, సర్వాంతర్యామియైన ఆహరి తనయందు సర్వులయందు ఉన్నాడన్న భావంతో అందరిపట్ల సమానమైన ప్రేమను ప్రదర్శించాడు. రాకుమారుడుగా పుట్టి సుకుమారంగా పెరిగినా హరిభక్తి మానటంకోసం తండ్రి పెట్టించిన చిత్రహింసలన్నింటిని "ఈశరీరము నాదికాదు. ఆభగవంతునిదే. రక్షించే బాధ్యత ఆశ్రీహరిదే అని నమ్మి" నమ్మకంతో సహించాడు, కష్టం కలుగగానే భగవంతుని "పసివాడే" అయినా విస్మరించలేదు. తాను నమ్మిన సత్యాన్ని నిర్భయంగా తండ్రికి, తద్వారాలోకానికి చాటిచెప్పాడు. ఆతడి దృఢవిశ్వాసమునకు మెచ్చిన భగవంతుడు తన సర్వవ్యాపకత్వమును, భక్తరక్షణాప్రతిజ్ఞను

నిరూపిస్తూ నరహరి రూపుడై రక్షించి దుష్టరాక్షసుని సంహారం చేశాడు. అటువంటి అనన్యమైన భక్తిని స్మరణమార్గం ద్వారా పొంది భగవత్సాక్షాత్కారాన్ని పొందగలిగిన పరమభాగవతోత్తముడు, భక్తాగ్రేసరుడూ అయిన ప్రహ్లాదుని చరిత్ర భక్తులకు ఆదర్శప్రాయమైనదికదా! ఇది స్మరణ భక్తికి భాగవతంలో రమణీయంగా వర్ణించబడిన ఉదాహరణ.

4. భజన – నిరంతరం హరి పాదాలను సేవిస్తూ భగవంతుని సేవించటం ద్వారా విష్ణువు హృదయంలో శాశ్వతనివాసం ఏర్పరుచుకోగలిగిన శ్రీమహాలక్ష్మిభక్తులకు ఆదర్శము. 'భజసేవాయాం" అనుధాతువు ననుసరించి భజించుట అనగా సేవించుట అని అర్థము. శ్రీమహావిష్ణువును "అనపాయిని" యై అనగా ఎన్నడూ విడిచి వుండనిదై ఎల్లప్పుడూ సేవిస్తూ ఉంటుంది లక్ష్మీదేవి." తదంఘ్రిభజనే" అనగా ఆయన పాదములను సేవించుట అని అర్థము. భగవంతుని పాదములను ఆశ్రయించినవారికి ముక్తి లభ్యమవుతుంది. ఆయన హృదయంలో స్థిరనివాసం లభిస్తుందనటానికి సాక్షాత్తూ ఆశ్రీమహాలక్ష్మియే ఉదాహరణ.

5. పూజ. - భగవంతునే మెప్పించి భూమిని గోమాతగా చేసి సమస్త భూతజాలమునకు ఆహారమును, దివ్యమైన ఔషధములను సంపాదించి ఇచ్చిన పృథు మహారాజు "పూజ" ద్వారా ముక్తిని పొందగలిగాడు. ఆతడి వలననే భూమికి "పృథ్వి" అన్న పేరు సార్థకమైనది.

6. అభివందన : అభివందన అనగా నమస్కరించుట అని అర్థము. దుష్టుడైన కంసమహారాజు కొలువునందున్నా, కృష్ణుని యందే భక్తిని కలిగి ఉన్నవాడు అక్రూరుడు. మేనల్లుళ్ళైన బలరామ, కృష్ణులను మధురకు తీసుకుని రమ్మని కంసుడు పురమాయించగనే ఆతడు తన అదృష్టమును మనసులోనే అభినందించుకున్నాడు. ఎంత చెడ్డవాడైనా కంసమహారాజుతో స్నేహం వలననే కదా నాకు ఇంతటి భాగ్యం కలిగిందని మురిసిపోయాడు.

**ఎట్టితపంబు సేయబడెనెట్టి చరిత్రము లబ్దమయ్యెనో**
**ఎట్టి ధనంబు లర్థులకు నీబడెనో తొలిబామునందు నా**
**యట్టి వివేకహీనునకు నాది మునీంద్రులు యోగదృష్టులం**
**బట్టగ లేని ఈశ్వరుని బ్రహ్మమయున్ హరిజూడ గల్గెడిన్.**

వైరభావంతోనైనా బలరామకృష్ణులను పిలవడానికి పంపి కంసుడు నాకు మహోపకారం చేశాడని పొంగిపోయాడు అక్రూరుడు. వెళ్ళేది కంసుని కుటిల సందేశాన్ని అందచేయటానికే అయినా అంతరంగికంగా తనకు అటువంటి దురుద్దేశం లేదు కనుక, భక్తవత్సలుడైన శ్రీ కృష్ణుడు తనకు తప్పక అభయం ఇచ్చి తీరుతాడన్న విశ్వాసంతో బృందావనమునకు చేరుకున్నాడు.

బృందావనం సమీపించగానే అక్రూరుని యందు ఒక విధమైన అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. అక్కడ ఉన్న చెట్లూ, పుట్టలూ, గుట్టలూ, నదీ నదాలు అన్నీ కూడా ఎప్పుడో ఒకప్పుడు శ్రీ కృష్ణ సాన్నిధ్యాన్ని పొంది పవిత్రమైనవేననీ, బృందావనంలోని జీవరాశి అంతా ఆ లీలా మానుష విగ్రహుని వీక్షణములచే ధన్యమైనవేననీ భావించాడు. తనకు లేని అదృష్టం వాటికి ఉన్నదని నిర్ణయించుకుని, వాటితో పోల్చుకొని తన అల్పజ్ఞతను గుర్తించుకున్నాడు. వెంటనే రథం దిగి క్రిందికి వచ్చాడు. అలా రథం నుండి దిగిన అక్రూరునకు, శ్రీ కృష్ణుని చరణకమలములను శిరమన ధరించి తరించిన పచ్చిక బీళ్ళు కనిపించాయి. వాటిని చూడగనే ఆయన ఒళ్ళు పులకరించింది. కళ్ళ వెంట ఆనందాశ్రువులు రాలినాయి. వెంటనే అక్రూరుడు కృష్ణపాదస్పర్శతో పునీతమైన ఆ నేలపై పడి పొర్లినాడు. నేలతల్లిని పదేపదే ముద్దాడాడు. ఆవిధంగా కృష్ణ ప్రేమను అనుభవించాడు.

అక్రూరుడు బలరామకృష్ణులను సందర్శించి వారిచే స్వాగత సత్కారములను పొందాడు. వారికి కంసుని ఆహ్వానాన్ని అందజేసి వారిద్దరినీ నందాదుల అనుమతితో మధురకు తీసుకువెళ్ళటానికి రథంలో ప్రయాణమైనాడు. త్రోవలో సంధ్యావందనం చేసుకోవటానికి రథం దిగి వెళ్ళిన అక్రూరునికి కాళిందీ నది గర్భంలో బలరామకృష్ణులు దర్శనమిచ్చారు. రథంలో కూర్చుని ఉన్నవారు నది గర్భంలో ఎలా కనిపించారన్న ఆశ్చర్యంతో తిరిగి నది ఒడ్డునకు వెళ్ళి చూస్తే బలరామకృష్ణులు ఆ రథంలోనే ఆసీనులై ఉండటం కనిపించింది. మళ్ళీ కాళిందీ నది ఒడ్డునకు చేరుకున్న అక్రూరునికి వేయి పడగలతో వెలుగులు విరజిమ్ముచున్న ఆదిశేషుడు అతనిని తల్పంగా చేసుకొని

శయనించి ఉన్న శ్రీ మహావిష్ణువూ గోచరించి, శ్రీ కృష్ణుడే సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువన్న సత్యం బోధపడి పులకిస్తున్న శరీరంతో, కళ్ళవెంట ఆనందాశ్రువులు రాలుస్తూ, గద్గద స్వరంతో శ్రీమన్నారాయణుని స్తుతించాడు.

**"కలలంబోలెడి పుత్రమిత్ర వనితా గారాది సంయోగముల్**
**జలవాంఛా రతి నెండమావులకు నాసల్ సేయు చందంబు నం**
**దలతున్ సత్యములంచు మూఢుడ వృథా తత్త్వజ్ఞుడన్ నాకు నీ**
**విలసత్పాదయుగంబు సూపి కరుణన్ వీక్షింపులక్ష్మీపతీ !"**

అని వేడుకున్న అక్రూరునకు శ్రీమహావిష్ణువు అభయ ప్రదానం చేశాడు.

విరోధి పక్షాన ఉండి కూడా మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధితో శ్రీ కృష్ణునే పూజించిన అక్రూరుడు "అభివందన" భక్తి మార్గం ధ్వారా అభయమును పొందగలిగాడు.

7. <u>దాస్యభక్తి</u>: సాధారణంగా ఈ లోకంలో సేవకుడు ప్రభువును సేవించి ఆ ప్రభువువలన ఫలమును పొందటం జరుగుతూ ఉంటుంది. అలా ప్రతిఫలాపేక్షతో దాసుడు చేయు సేవ "ధాస్యము' మాత్రమే అవుతుంది. కాని 'దాస్యభక్తి' అనిపించుకోదు. అలా కాకుండా దాసుడైన తాను భగవంతుని సేవించుటయే పరమ లక్ష్యముగా భావించి, ఆ భగవంతుని నుండి ఏఫలమును ఆశించకుండా ఉండటమే 'దాస్యభక్తి' భగవంతుడు అందరికీ ప్రభువు. అతనిని సేవించుట మన కర్తవ్యము. ఈ కర్తవ్యపరాయణత యందు ఏమరుపాటు, స్వార్థము ఉండకూడదు. తన సేవచే భగవంతుడు సంతోషించవలయునన్న కోరికయే కాని, యే ఇతరమైన ఫలాపేక్ష ఈ దాస్యభక్తునకు ఉండదు. శ్రద్ధాయుక్తుడగు సేవకునకు తన యజమాని యందుండు అనురాగము దాస్యభక్తునకు ఆదర్శము.

ఆంజనేయుడు దాస్యభక్తికి ఉదాత్తమైన ఉదాహరణ. శ్రీరామ పాద సన్నిధి యందు నిరంతరము గడుపుట తప్ప, స్వామి సేవ తప్ప ఆయనకు మరొక కోరిక లేదు. స్వామి కార్యమును ఎంతటి కష్టనష్టములకైనను ఓర్చి సాధించవలెనన్న పట్టుదల తప్ప అందు తన స్వార్థము ఏదియులేదు. శ్రీ

రామదూతయై వారధి దాటి సీతామహాసాధ్వి జాడ తెలుసుకున్నాడు. మార్గమధ్యమున ఎటువంటి ప్రలోభమునకు గాని లొంగలేదు. మైనాకుని ఆతిథ్యమును తృణీకరించి స్వామి కార్యము సాధించువరకు విశ్రాంతి వలదని వారించాడు. దేవతలు ఆంజనేయుని శక్తిని పరీక్షించుటకై పెట్టిన పరీక్షలలో సులభముగా విజయము సాధించాడు. సింహిక వంటి రాక్షసిని చంపి, లంఖిణీని జయించి, లంకలో ప్రవేశించి, సీతామహాసాధ్వి జాడకై పలు తావుల వెతుకుచూ, వివేకమును వీడక తుదకు అశోకవనమునందు శోకతప్తయగు సీతమ్మజాడ కనుగొని, బుద్ధి కుశలతతో ఆమెకు శ్రీరాముని క్షేమ సమాచారములను తెలిపి, ఆమె మన్ననలొందెను. అశోక వన విధ్వంసముగావించి, తనకై తాను ఇంద్రజిత్తునకు పట్టుబడి రావణ సభను ప్రవేశించి ఆ దశకంఠునకు హిత బోధ చేసి రామకార్యమును చక్కగా నిర్వహించి తన బలపరాక్రమమును శత్రు పక్షమునకు తెలియ చేయుటయేకాక, శత్రుబలమును కూడా అంచనా వేయగలిగెను. "చూచి రమ్మన్న కాల్చివచ్చెనను" లోక ప్రఖ్యాతి గాంచిన హనుమంతుడు సీతాదేవి కుశలమగా ఉన్నదన్న వార్తను శ్రీరామచంద్రునకు తెలియచేసి తన ప్రభుడైన శ్రీ రాముని మెప్పు పొందెను. యుద్ధ సమయమునందు మూర్ఛనొందిన లక్ష్మణ స్వామిని బ్రతికించుటకై సంజీవనీ పర్వతమునే తెచ్చి శ్రీరామ పాదారవిందముల చెంత చేర్చి, తీవ్రమైన పరితాపమునొందుచున్న శ్రీరామునికి ఓదార్పు కలిగించెను. లక్ష్మణస్వామిని సంజీవినీ ఓషధముచే సజీవుని గావించి, స్వామికి ఆనందమును కలిగించెను. దుర్లభమైన కార్యములను అవలీలగా సాధించిన మారుతి దాస్యభక్తికి మెచ్చి "ఏమి కావలెనన్ననూ ఇచ్చెదను కోరుకొనుమని" ఆప్యాయంగా శ్రీరాముడు అడిగినప్పుడు "నీవు తప్ప మరేది నాకు వలదన్న" నిస్వార్థ స్వామి భక్తిని ప్రకటించుకొన్నాడు హనుమంతుడు. అంతట శ్రీరామ చంద్రప్రభువు ఆంజనేయస్వామిని ప్రేమపూర్వకముగా, కృతజ్ఞతాపూర్వకముగా కౌగలించుకొనెనని రామాయణ మహాకావ్యము యుద్ధకాండమునందు చెప్పబడినది.

**"ఏష సర్వస్వభూతస్తు పరిష్వంగో హ నూమతః**
**మయాకాలమిమం ప్రాప్య దత్తః తస్య మహాత్మనః"**

"ఆమహాత్ముడైన హనుమంతునకు" మయాదత్తః" నాచే ఇవ్వబడిన ఈ పరిష్వంగమే సర్వస్యభూతమగు గాక", "ఇమంకాలం ప్రాప్య" – ఈవిధముగా ప్రత్యుపకారముచేసి హనుమంతునకు నాకృతజ్ఞతను తెలియపరచుకొనుకాలము ఇప్పటికి లభించినది" అన్నాడు శ్రీరాముడు "సర్వస్యభూతము" అనగా రాముని యొక్క సర్వస్వము హనుమంతునకు ఇవ్వబడినది అని చెప్పబడినది. అనగా శ్రీరాముడు తన సమస్తమును ఆంజనేయునికి ఇచ్చి తినని చెప్పుట వలన జ్ఞానవైరాగ్య ఐశ్వర్యాదులలోను, తపస్సులోను ఆంజనేయుడు శ్రీరామునితో సమానుడైనాడని అర్థము. కాబట్టి ప్రతిఫలాపేక్ష లేకుండా చేయబడిన దాస్యభక్తికి భగవంతుడే భక్తునకు ఋణపడి ఉంటాడని తెలియుచున్నది. కాబట్టి దాస్యభక్తి భగవంతునే భక్తునికి ఋణపడి ఉండునట్లు చేయునంత గొప్ప భక్తి మార్గము.

భాగవతమునందు ఉదహరింపబడిన మరొక భక్తుడు సుదాముడను మాలాకారుడు. మధురానగరిలో ప్రవేశించిన శ్రీకృష్ణునకు తనంతట తానుగా పుష్పహారములను సమర్పించి నమస్కరించెను. అప్పుడు అతని నిస్వార్థమైన భక్తికి మెచ్చి శ్రీకృష్ణుడు "సుదామా ! అడుగకయే హారము సమర్పించిన నీ సేవా భక్తికి సంతసించితిని. ఏమి కావలయునో కోరుకొనుము" అని ప్రేమతో పలికెను. భగవంతుని సేవించుటయే పరమావధిగా భావించిన ఆభక్తుడు

**"నీ పాదకమల సేవయు**
**నీపాదార్చకుల తోడినెయ్యము నితాంతాపార**
**భూతదయయున్ తాపస**
**మందార నాకు దయసేయగదే :**

అని శ్రీకృష్ణుని పాదకమల సేవాభాగ్యమునే మనసారా కోరుకున్నాడు.. దాసునకు భగవంతుని సేవయే పరమ లక్ష్యము. భాగవతములో చెప్పబడిన జిజ్ఞాసాభక్తుడైన ఉద్ధవుడుకూడా ఈదాస్యభక్తికి చెందినవాడే. త్యాగయ్య, పోతన్న, గోపన్న-వీరు ముగ్గురూ రామదాసులై రామభక్తి యనెడు అమృతధారను భారతావని యందు రసగంగ గా ప్రవహింపజేసారు. సాక్షాత్తూ భగవంతుని సాక్షాత్కారభాగ్యమును పొంది కూడా తమయందు

దాస్యభావమే సర్వదా నిలిచి యుండునట్లు భగవంతుని ప్రార్థించిన, భక్తశిఖామణులు వీరు.

8. <u>సఖ్యభక్తి</u> – "నీవేనా ప్రియసఖుడవు" అనుభావముతో కూడిన భక్తి 'సఖ్యభక్తి' యనబడును. భగవంతుని స్నేహితునిగా భావించి ఆటలలో, పాటలలో, ఆహారవిహారాదులయందు అనుసరిస్తూ, అనునయిస్తూ ఆమిత్రునికై అనుక్షణము తనువు, మనసులను సమర్పణ చేయు సాత్త్వికభావమే సఖ్యభావము. ఈస్నేహములో సుఖదుఃఖములు, లాభనష్టములు, హెచ్చుతగ్గులు కనబడవు. అన్ని సమయములందును తనకు అండగా మిత్రుని భావిస్తూ, మిత్రుడు దూరముగా ఉన్నా, దగ్గరగా ఉన్నా అతని సంస్మరణ మరువకుండా మైత్రిని పెంపుదల చేయు స్థితి సఖ్యభక్తి. స్నేహితునికి తన మనసులోని విషయములన్నింటిని దాపరికము లేకుండా ఎలా మనసువిప్పి చెప్పుకుంటాడో, సఖ్యభావమున భక్తుడు అదే విధముగా తన ఆంతరింగిక విషయములను స్వేచ్ఛగా 'భగవంతునికి చెప్పుకుంటాడు. కష్టసుఖములందు సమానముగా సహకరించి, సహాయముచేయు వాడే నిజమైన మిత్రుడు. మిత్రులమధ్య సమభావము ఎలా ఏర్పడుతుందో అదేవిధముగా భగవంతునికి, భక్తునకు మధ్య సమ మైత్రీభావము ఏర్పడును. భక్తుడు భగవంతుని తన చెలికానిగా, తనతోసమునిగా భావించి నిర్భయముగా మెలగును.

ఉదాహరణకు అర్జునుడు, కుచేలుడు శ్రీకృష్ణుని పట్ల సఖ్యభక్తిని కలిగియున్నవారే.

కృష్ణార్జునుల శరీరములు వేరు వేరుకాని, మనసులు ఒక్కటిగా ప్రవర్తించు స్నేహితులు. కృష్ణుడు స్వయముగా అర్జునుడు తన సఖుడని "భక్తోసిమే సఖాచ" అని గీతయందు ప్రకటించెను. ఇక అర్జునునకు శ్రీకృష్ణుడు గురువు, బంధువు, దైవము. అయినప్పటికీ కృష్ణుని పట్ల అర్జునునకు మిత్రభావమే ఎక్కువగా ఉండెడిది. పార్థునకు శ్రీకృష్ణుడు స్వయముగా సారథియగుట ఈమిత్రభావము వలననే కదా! భక్తులు సఖ్య భక్తి భావమును కలిగియున్నప్పుడు భగవానుడు హృదయసారథియై నిత్యజీవిత కురుక్షేత్ర సంగ్రామమునందు గీతారహస్యములను వెల్లడించి ప్రతి సమస్యకు, సందేహమునకు బదులు ఇచ్చి ధర్మమార్గమున ప్రవర్తింప

చేయు మార్గదర్శియగుననుటలో ఎంతమాత్రము అసత్యము లేదు. ఇది భక్తులకు అనుభవైక వేద్యము.

సంపదలందు గౌరవముగా చూచుచు, కష్టములు కలిగినప్పుడు చీదరించుకొనుట సఖ్యభావముకాదు. పాండవులు హస్తినాపురమునందు రాజభోగములు అనుభవించునప్పుడు, అరణ్యవాసమునందు కష్టములు అనుభవించినప్పుడు కూడా శ్రీకృష్ణుడు నిజమైన మిత్రుని వలె వారికి తన సహాయసహకారములను అందచేసెను. యుద్ధరంగమున 'పార్థసారథియై' గీతామృతమును అందించి ధర్మమునకే విజయము లభించునట్లు అర్జునునకు కర్తవ్యబోధగావించెను.

ఇక కుచేలుడు శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు, చిన్నతనంలో ఇరువురూ సాందీపుని ఆశ్రమమున విద్యాభ్యాసము చేశారు. అరమరికలు లేని ఆబాల్యస్నేహము అనన్యసామాన్యము. సాక్షాత్తూ భగవత్స్వరూపుడగు శ్రీకృష్ణునితో కలసి విద్యాభ్యాసము చేసిన కుచేలుడు ధన్యాత్ముడు అందుచేతనే తనవద్దకు వచ్చిన నిరుపేదకుచేలుని గాఢమైన మైత్రితో ఆలింగనము చేసుకుని, అష్టపత్నులతో కూడి అర్ఘ్యపాద్యములతో ఘనమైన ఆతిథ్యము నిచ్చి, ఆతడు ప్రేమతో తెచ్చినవి కాసిని అటుకులే అయినా వాటినే అత్యంత ప్రేమతో ఆరగించి, అడగకపోయినను అఖండమైన ఐశ్వర్యమును ప్రసాదించెను.

శ్రీకృష్ణపరమాత్మచే అంతటి ఘనతరమైన ఆతిథ్యమును పొందగలిగిన ఆనిరుపేద కుచేలుని చూచి అక్కడి అంతఃపురస్త్రీలు

**"కిమనేన కృతం పుణ్యం**
**అవభూతేన భిక్షుణా**
**శ్రియాహీనేన లోకేస్మిన్**
**గర్హితేన అధమేనచ**

**భాగవతము దశమస్కంధం, 80వ అధ్యాయం**
**25వ శ్లోకము.**

"భిక్షువైనవాడు, లోకంలో అందరిచేత అవమానించబడిన వాడు, నిరుపేద అయినవాడు, ఇతరులచేత నిందింపబడినవాడు, సంఘములో

అతి తక్కువస్థితియందు ఉన్నవాడు అయిన అకుచేలునిచేత ఆహా ! ఎంత గొప్పపుణ్యము చేయబడినదో కదా !" అని వారంతా కుచేలుని భాగ్యమును కొనియాడారు.

"యోऽసౌ త్రి లోక గురుణా శ్రీనివాసేన
సంభృతః పర్యంక స్థాం శ్రియం హిత్వా
పరిష్వక్తో ऽగ్రజో యథా".

"త్రిలోకాధిపతియైన శ్రీనివాసుడు తన పర్యం కస్థయగు లక్ష్మీదేవిని విడిచిపెట్టి, తన అన్నయగు బలరాముని గౌరవముతో కౌగలించుకున్నట్లు, ఈ కుచేలుని కౌగలించుకొనుచున్నాడు" అని తమలో తాము అంతఃపుర స్త్రీలు ముచ్చటించుకున్నారు.

అనగా శ్రీకృష్ణుడు తన అన్న అగు బలరామునకిచ్చినంతటి గౌరవము ఇచ్చి కుచేలుని ఆదరించినాడని భావము.

భగవంతునే స్వయముగా స్నేహితునిగా భావించునట్లు చేయుచున్న ఈసఖ్యభక్తియందు ఒకచిన్న ప్రమాదం కూడా ఉంది. సఖునిగా భావించుచున్న భగవంతుని యొక్క మహాత్మ్యమును కొందరు. భక్తులు గుర్తించగలిగినా మరికొందరు భక్తులు గుర్తింపలేకపోవచ్చును. కుచేలుడు శ్రీకృష్ణుని భగవంతునిగా గుర్తించగలిగాడు. భార్యసలహా ప్రకారము దారిద్ర్యమునుండి విముక్తి పొందుటకై కృష్ణుని ఆశ్రయించదలచి ద్వారకకు వెళ్ళాడు కుచేలుడు. అక్కడ కృష్ణసందర్శనముచే, ఆతిధ్యముచే తన్మయుడైన కుచేలుడు శ్రీకృష్ణుని ఏసంపదలనూ కోరలేదు. కృష్ణుడుకూడా కుచేలుని ఆప్యాయముగా కౌగలించుకొని, గౌరవించి, ఘనమైన ఆతిధ్యమునిచ్చి పంపాడు కాని, ఆతనికి ధనమును వెంటిచ్చి పంపలేదు. కృష్ణుని వద్దనుండి తిరిగి ఇంటికి వెళుతున్న కుచేలుడు స్వామి తనకు సంపదలిచ్చి పంపలేదని చింతించలేదు.

"శ్రీనిధి యిట్లు నన్నుఁబచరించి ఘనంబుగ విత్తమేవియు
న్నీని తెఱంగుగానఁ బడె నెన్న దరిద్రుఁడు సంపదంధుడై
కానక తన్నుఁజేరడని కాక శ్రితార్తిహరుండు సత్కృపాం
బోనిధి సర్వవస్తు పరిపూర్ణునిఁగా నను । జేయకుండునే".

10-80-1015

"అధనోऽయం ధనం ప్రాప్యమాద్యన్ను చ్చైర్నమాంస్మరేత్
ఇతి కారుణి కోనూనం ధనం మేऽభూరి నాదదత్".

(సంస్కృత భాగవతము)

"ధనహీనుడైన నేను, ధనమును పొందినచో గొప్పగా మదించి, తనను స్మరింపనని తలచి, పరమకారుణ్యమూర్తియైన శ్రీకృష్ణుడు నిశ్చయముగా నాకు ఎక్కువ ధనమును ఇవ్వలేదు" అని భావించి కృష్ణుని ప్రేమకు సంతోషించాడే కాని, సంపదలనిచ్చి పంపలేదని నిందించలేదు. కాని, కుచేలుడు తన ఇంటికి వెళ్ళేసరికి సమస్త సంపదలూ కృష్ణునిచే అనుగ్రహింపబడినాయి. శ్రీకృష్ణుని కృప వలన సమస్తసంపదలూ లభ్యమైనప్పటికి అతను కృష్ణభక్తియందే పరవశుడై ఉండేవాడు.

కాని, అర్జునుడు మాత్రము కృష్ణుని సఖ్యభావముతో ప్రేమించాడే కాని పరమాత్మయని ముందు గ్రహించలేకపోయెను. కురుక్షేత్ర సంగ్రామ సమయమునందు విశ్వరూపసందర్శన భాగ్యము సంప్రాప్తించిన తరువాత మాత్రమే శ్రీకృష్ణుడు స్వయముగా భగవానుడే అని గ్రహించగలిగెను.

"సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి
అజానతా మహిమానంతవేదం
మయా ప్రమాదాత్ప్రణయేనవాపి"

గీత 11-41.

"హే కృష్ణా ! నీయందుగల చనువు చేత నీవు స్నేహితుడవని తలచి తొందరపాటు తనముచే నీమహిమను తెలియనివాడనై, చిన్నతనంలో నిన్ను. హే కృష్ణా ! హే యాదవా ! హే సఖా ! అని ప్రేమతో పిలిచి నప్పటికి నీవు భగవంతుడవని తెలియక ప్రమాదము వలన (పొరపాటుచే) అట్లు పిలచెడివాడను"

విహార సమయమునందు. ఒకే శయ్యపైన, ఆసనమునందు కూర్చుండునప్పుడును, భోజనకాలమునందును, ఒంటరిగా ఉన్నప్పుడు. హాస్యము కొరకును నేను పలికిన మాటల వలన, తెలియక నిన్ను అగౌరవపరచితిని. ప్రమేయుడవైన నీవు అట్టి నా తొందరపాటు చర్యలను

క్షమించవలయును" అని అర్జునుడు విశ్వరూపసందర్శనానంతరము కృష్ణభగవానునితో పలికెను.

దీనివలన సఖ్యభక్తి యందు భగవంతుని చెలికానిగా, సమునిగా, స్నేహితునిగా భావించుటవలన ఒక దశయందు భగవంతుని మహాత్మ్యమును గుర్తించకపోవుటచేత సేవాపరాధములు జరుగవచ్చునని, అయినప్పటికినీ కాలాంతరమున సత్యదర్శనము చేయుటచే తరింతురని తెలియుచున్నది.

అర్జుననకు స్వయముగా సారథియై రథము నడిపించుట, నిరుపేద కుచేలుని ఆత్మీయముగా ఆదరించుట అను విషయములను బట్టి సఖ్యభావమునందు తరతమభేదములుండవని తెలియుచున్నది. భగవానునికి మనము స్నేహితులమని భావించుట ఎంతటి ఆనందమును కలుగచేయునో, అది అనుభవించగలవారికే బోధపడును.

9. <u>ఆత్మ నివేదన</u> - ఇది సమస్త విధములైన భక్తిమార్గములలోను ఉత్తమమైనది. ఉత్కృష్టమైనది. సర్వస్య శరణాగతిని వేడి భగవంతునికి ఆత్మనివేదన చేసుకోవటం భక్తికి పరాకాష్ఠ స్థితి. ఇందుకు చక్కని ఉదాహరణ బలిచక్రవర్తి.

బలిచక్రవర్తి రాక్షస వంశానికి చెందిన వాడైనా, గొప్ప దాతగా ప్రసిద్ధిగాంచెను. జగత్పతికే దానముచేయగలిగిన మహాదాత బలిచక్రవర్తి.

**"ఆదిన్ శ్రీ సతి కొప్పుపై దనువు పై నంసోత్తరీయంబుపై**
**బాదాబ్జంబులపై గపోలతటిపై బాలిండ్లపై నూత్నమ**
**ర్యాదంజెందు కరంబు క్రిందగుట మీదైనా కరంబుంటమే**
**ల్గాదే రాజ్యముగీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే.**

అంటూ అశాశ్వతమైన రాజ్యం సంపదలను త్రోసిపుచ్చి, శ్రీమహావిష్ణువనకే మూడు అడుగుల భూమిని దానంచేసి, చరిత్రప్రసిద్ధిగాంచిన భక్తుడు బలి. కపటవటు వేషధారియై "శంభుడో హరియో పయోజ భవుడో....!" అన్న విధంగా ప్రకాశిస్తూ, వేదములను వల్లిస్తూ యాగశాలకు వచ్చి ఏమికావాలో కోరుకొమ్మన్న బలిచక్రవర్తిని, 'మూడడుగులనేలను' దానము చేయమని అర్థించాడు లోకకళ్యాణార్థమై జగన్నాటక సూత్రధారియైన

శ్రీమహా విష్ణువు. ఈక్రింద ఉదహరించబడిన పద్యంలో భగవంతుని గురించి అతి రమణీయంగా వర్ణించాడు సహజకవి భక్తపోతనామాత్యుడు.

ఇది నాకు నెలవని ఏ రీతి బలుకుదు
నొక చోటనక యెందునుండనేర్తు,
నెవ్వాని వాడనంచేమని నుడువుదు
నాయంతవాడనై నడవనేర్తు,
నీనడవడియని యెట్లు వక్కాణింతు
బూని మెప్పోవకల బోవనేర్తు,
నది నేర్తునిది నేర్తునని యేల చెప్పంగ
నేరుపులన్నియు నేననేర్తు,

నొరులు గారు నాకు నొరులకు నేనౌదు
నొంటి వాడ జుట్టమొకడు లేడు
సిరియు దొల్లిగలదు చెప్పెద నాటెంకి
సుజనులందు దఱచు సొచ్చియుందు.

("ఇది నానివాసము అని ఏమని చెప్పను ఇక్కడ అక్కడ అన్ని చోట్లు, అన్ని ప్రదేశములూ నావే. ఎక్కడైనా ఉండగలను. ఎవడివాడవు అంటే ఏమని చెప్పను నాయంతవాడను నేనే, ఈవిద్య ఆవిద్య అని ఏమని చెప్పను అన్ని విద్యలు, నేర్పులు నేర్చినవాడను నేను. నాకెవ్వరూ లేరు. కాని నేను అందరివాడను. చుట్టపక్కాలు నాకు లేరు. తొలుత శ్రీ కలవాడను తరచుగా సుజనులైన భక్తహృదయములందు ప్రవేశించి ఉంటాను" అని వామన వేషధారియగు విష్ణుమూర్తి తన తత్త్వమును ఎరుక పరచెను).

ఆవిధముగా కపటవటువు బలిచక్రవర్తికి చెప్పినప్పుడు రాక్షస కుల గురువైన శుక్రాచార్యుడు, వచ్చినవాడు సామాన్య వటువుకాడని, ఏదో దేవకార్య నిమిత్తమై శ్రీమహావిష్ణువే ఆరూపంలో వచ్చి ఉంటాడనీ గ్రహించి ఆకపట వటువునకు దానము ఇవ్వవద్దని బలిని, వారించాడు. కులసంరక్షణం కోసం, ప్రాణరక్షణకోసం అబదంధం చెప్పినా దోషంలేదు అని బోధించాడు.

వారిజాక్షులందు వైవాహికములందు
బ్రాణ విత్తమానభంగమందు
జకిత గోకులాగ్రజన్మరక్షణ మందు
బొంకవచ్చు దాన బొంద దఘము.

అని ఆచార్యుడే స్వయముగా నచ్చచెప్పినా కూడా, స్వార్థచింతనతో అన్నృతదోషానికి పాల్పడటానికి బలి అంగీకరించలేకపోయాడు. శుక్రాచార్యుడు భావించినట్లుగా, తన సమక్షమున వామనరూపంలో ఉన్నది శ్రీమహావిష్ణువే అయిన పక్షంలో తాను చేయబోయే దానం చరితార్థత నొందుతుందనీ, తద్వారా తనకు అమరత్వం సిద్ధించి తీరుతుందనీ అతడు భావించాడు. అంతకుమించిన మహద్భాగ్యం మరొకటి ఏదీ తనకు లభ్యంకాదని భావించి గురువుతో ఇలా అన్నాడు.

"రాజ్యమే పోయినా, కులనాశనమే అయినా, మరణమే సంభవించినా వచ్చినవాడు హరియైనా, శివుడైనా, బ్రహ్మయే అయినా ఏది ఏమైనా కాని ఆడినమాటను తప్పలేను" అన్నాడు బలి మహాచక్రవర్తి.

"కారే రాజులు రాజ్యముల్ గలుగ వేగర్వోన్నతింబొందరే
వారేరీ సిరిమూటగట్టుకొని పోవం జాలిరే భూమిపై
బేరైనం గలదే శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశః కాములై
యీరే కోర్కులు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవాః !"

"ఎంతమంది రాజాధిరాజులు ఈభూమిపై పుట్టి ఎంతో వైభవంగా బ్రతికి, ఎంతగా సామ్రాజాన్ని పెంచుకున్నా చివరికి వారు ఏమి మూట గట్టుకొని పోగలిగారు ? వారిపేరు కూడా చివరకు భూమిపైన మిగలలేదు. కాని శిబిచక్రవర్తి వంటి మహాదాతలు చిరస్థాయిగా చరిత్రలో మిగిలిపోయారు. అంతటి కీర్తి ప్రఖ్యాతులను కలిగించే విశిష్టమైన దానాన్ని చేయకుండా వెనుకకు మరలను" అని ధృఢ నిశ్చయంతో ఆచార్యునకు చెప్పి బలిచక్రవర్తి మహాదాతగా ప్రసిద్ధిగాంచెను.

ఉడుగని క్రతువుల దపముల
బొడగన జననట్టి పొడవు పొడవున గుఱిచై
యడిగెడి నట నను బోటికి
నిడరాదె మహానుభావ యిష్టార్థంబుల్ !

ఆవిధంగా తన సత్యసంధత్వాన్ని, దాన పరాక్రమాన్ని, కీర్తి కాముకత్వాన్ని, అర్థిజన వాత్సల్యాన్ని స్పష్టీకరించుకొని బలిచక్రవర్తి వామన వేషధారియైన శ్రీమన్నారాయణుని శ్రీచరణములను కడిగి మూడడుగుల భూమిని దానం చేయగనే ..... అందరూ ఆశ్చర్య చకితులై చూచుచుండగా .....

"ఇంతింతై వటుడింతై మఱియు దానిం తైనభోవీథిపై
నంతై తోయద మండలా గ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధృవునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్థియై".

ఒక పాదంతో భూమిని, మరొక పాదంతో ఆకాశాన్ని ఆక్రమించి మూడవ అడుగుకు చోటెక్కడ ? అని బలిని ప్రశ్నించాడా కపట వటువు.

సూనృతంబు గాని నుడియదు నాజిహ్వ
బొంకజాల నాకు బొంకులేదు
నీతృతీయ పదము నిజము నాశిరమున
నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ !

సత్యము తప్ప తననాలుక అసత్యము పలుకదని చెప్పి, మూడవ పాదమును తన తలపై ఉంచమన్న సత్య సంధుడు బలిచక్రవర్తి. సత్యవాక్పరిపాలనచే భగవంతుని మెప్పించి, సుతలమునకు చక్రవర్తియై, సాక్షాత్తూ ఆశ్రీమన్నారాయణుడే గదాధారియై సదా రక్షిస్తూ ఉండే విధంగా, వరమును పొందిన మహా భక్తాగ్రేసరుడు బలిచక్రవర్తి. ఈవిధంగా బలిచక్రవర్తి అసురవంశంలో పుట్టినప్పటికీ భగవంతునికి ఆత్మనివేదనం చేసుకుని కైవల్యమును పొందాడు. శ్రవణ స్మరణాది నవవిధ భక్తులేకాక భగవంతుని పొందటానికి మరికొన్ని ఇతర విధమైన భక్తిమార్గాలుకూడా ఉన్నాయి.

గురువును సాక్షాత్తూ భగవత్స్వరూపునిగా భావించి, సేవించు గురుభక్తి కూడా ఒక ముఖ్యమైన భక్తిమార్గము.

"వీతరాగ విషయం వాచిత్తం" అనే సాంఖ్య దర్శన సూత్రమును అనుసరించి కామక్రోధాదులు, విషయవాసనలు లేని చిత్తముగల గురువును

ధ్యానము చేసినందువలన, చిత్తశాంతి కలిగి సమాధి సిద్ధిస్తుంది. పతంజలి యోగ సూత్రములలో "సర్వేషాం అపి గురుః కాలేన అనవచ్ఛేదాత్" అని చెప్పారు. ఇక్కడ పరమ గురువు లేక ఆద్యుడైన గురువు రూపంలో కాలాతీతుడైన ఈశ్వరుని భావించారు. గురుధ్యానము, గురుభక్తి అనునది సిక్కుమతమునకు పునాది. "శిక్" అనగా శిష్యుడు. సూఫీ సాంప్రదాయంలో కూడా గురుభక్తి ప్రధానపాత్ర వహిస్తుంది. ఇస్లాం మతంలో సనాతనులైన ముస్లింలు అల్లాను మాత్రమే ధ్యానంచేస్తారు. మహమ్మదు గారిని ప్రవక్తగా మాత్రమే భావిస్తారు. అనగా మహ్మమద్‌గారు దేవుని వచనములైన "ఖురాన్"ను లోకమునకు తెలుపుటకు ఒక మాధ్యమము (Medium) అన్నమాట. కాని సూఫీలు మహమ్మదుగారిని "Universal Man" అనగా విశ్వమానవునిగా (విశ్వవ్యాప్తమైన శరీరము కల సిద్ధపురుషునిగా) ఆదిగురువుగా భావించి ధ్యానం చేస్తారు. సూఫీ సాంప్రదాయములను 'తరీఖాలు' అని అంటారు. ఈతరీఖాలన్నింటిలోను సాధారణంగా గురు పరంపర చెప్పబడుతుంది. ఈగురుపరంపరలన్నింటిలోనూ మహమ్మదుగారి నుండి, వారి రక్తసంబంధము కలవారినుండి జన్మించి నట్లు గురు పరం పరను తరతరాలుగా పేర్లు చెపుతారు. ఉదాహరణకు ఫలానా గురువుగారు, మహమ్మదుగారికి 40వతరము, 41వతరము అలా చెపుతుంటారు.

అందుచేత సూఫీలు తమగురువును ధ్యానం చేయుట మాత్రమే కాక గురుపరంపరకు ఆద్యుడైన మహమ్మదు గారినికూడా ధ్యానం చేస్తారు. అయితే ఇక్కడ ఒక భేదం ఉన్నది. ఇస్లాంనందు అల్లాకు తప్ప మరొకరిని ప్రార్థన చేయుట నిషేధము. "భగవద్భక్తులైన గురువులు అల్లాకు దగ్గరవారు. సమీపస్థులు. వారు ప్రార్థిస్తే అల్లా సులభంగా వింటాడు. అందుచే సామాన్యులమైన మనము ఈమహాభక్తులైన గురువులను ప్రార్థించినపుడు ఆగురువులు మనతరపున అల్లాను మరల ప్రార్థిస్తారని వారి నమ్మకము" అప్పుడు భగవదనుగ్రహం సులభంగా లభిస్తుందని వారి విశ్వాసము. అందుచే సూఫీమతంలో "దర్గా"లకు వెళ్ళి గురువును ప్రార్థించటం ఉన్నా, సిద్ధాంతము ప్రకారము గురువునే అల్లాగా భావించి ప్రార్థించటమంటూ లేదు. ఇస్లాం మతమునందు రూపధ్యానములేకపోవుటచేత, విగ్రహారాధన నిషేధింపబడుటచేత గురువును కాని, ప్రవక్తను గాని వారి నామమును ఉచ్ఛరించుట ద్వారా మాత్రమే ప్రార్థిస్తారు. రూపమును ధ్యానించుట, చిత్ర

పటమును పూజించుట "ఇస్లాం" నందు నిషేధము.

కాని హిందూమతమునందు గురువును సాక్షాత్తూ భగవంతునిగా భావిస్తారు.

**గురుర్బ్రహ్మాగురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః"**

లోకమునందు సుప్రసిద్ధమైన ఈశ్లోకము "గురుగీత" లోనిది. ఈ శ్లోకము దత్తాత్రేయుని యందు సార్థకము. దత్తాత్రేయుడు లోకమునకు గురువగుటయేకాక బ్రహ్మ విష్ణుమహేశ్వరులను మూడు శిరస్సులు కలవానిగా భక్తులు ధ్యానిస్తారు. అంతకు పూర్వము బ్రహ్మ విషు మహేశ్వరులు వేరు వేరని భావించేవారు. ఆముగ్గురూ వేరు కాదనీ ఒక్కరే ననీ కనుగొన్నవాడు అత్రిమహాముని (అత్రి అనగా మూడుకాదు అని అర్థము). ఈ అత్రి మహాముని, అనసూయాదంపతులకు దత్తాత్రేయుడు జన్మించెనని ఐతిహ్యము.

కుండలినీ యోగ సంప్రదాయములన్నింటిలోనూ గురువును భగ వంతునిగా భావించి ధ్యానించుట ప్రధాన మార్గము. ఈగురు శిష్య సంబంధము జన్మ జన్మాంతరములకు కూడా కొనసాగునని అంటారు.

(నేటి కాల విపరీత పరిస్థితులను బట్టి గురుభక్తి అనేది వివాదాలకు కూడా కారణమవుతున్నది. ఎందుకంటే కపటగురువులు, కపట శిష్యులు ఎక్కువగా బయలుదేరి అసలైన సద్గురువులు ఎవరో, సరైన శిష్యులు ఎవరో తెలియటం కష్టంగా ఉంది కనక.)

గురుభక్తిలోని విశేషం ఏమిటంటే అది బాంధవ్యాన్ని ఆధారంగా చేసుకొన్న భక్తికాదు. పతి పత్నీభావముకాదు. గురువును నరునిగా భావించక, విజ్ఞానమాత్ర తనువు కలవానిగా తెలుసుకొనుటవలన ఏర్పడిన సహజమైన వినయముచే, గురువును సాక్షాత్తు పరబ్రహ్మాగా భావించుట వలన భగవత్సాక్షాత్కార అనుభవమును పొందవచ్చును.

భగవంతుని పొందటానికి పైన చెప్పబడిన మార్గములే కాక ఇంకా ఇతరమైన మార్గాలు కూడా ఉన్నాయి.

"అలుకనైన జెలిమినైన గ్రామంబున
నైన బాంధవమునసైన భీతి
నైన దగిలి తలప నఖిలాత్ముడగు హరి,
జేరవచ్చు వేఱుసేయడతడు".

"వైరానుబంధనంబున, జేరిన చందమున విష్ణు జిరతర భక్తిం
జేరగరాదని తోచును, నారాయణ భక్తియుక్తి నాచిత్తమునన్."

"కామోత్కంఠిత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్
బ్రేమన్ మీరలు భక్తి నేమునిదె చక్రిం గంటి మెట్లైనను
ద్దామ ధ్యాన గరిష్ఠుఁడైన హరి జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!"

శత్రుత్వము చేతగాని, స్నేహముతోకాని, కోరికతో కాని, బంధుత్వము చేతగాని భగవంతుని చేరుకోవచ్చును. భ్రమరము చుట్టూ భయముతో తిరిగే కీటకం కొంతకాలానికి తాను కూడా స్వయముగా భ్రమరమై పోవు విధముగా నిరంతరం ఏదో ఒక భావంతోనైనా సరే భగవంతుని తలచుకుంటూ ఉంటే భగవంతుని వలె మారిపోయే అవకాశం ఉంటుంది. ఈవిధంగా భయముతో ముక్తిని పొందవచ్చుననటానికి భాగవతంలో వర్ణించ బడిన కంసుని ఉదంతము చక్కని ఉదాహరణ.

కంసమహారాజు శ్రీకృష్ణునికి స్వయముగా మేనమామ. తన చెల్లెలైన దేవకీదేవి అష్టమగర్భమునందు జన్మించబోవు పుత్రుని వలన తనకు మరణం సంభవిస్తుందన్న విషయం తెలిసి, చెల్లెలని కూడా ఆలోచించకుండా శత్రుత్వము పూని బావగారిని, చెల్లెలిని చెరసాల పాలుచేసి, సోదరి అష్టమగర్భమును నాశనం చేయటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. దేవకీ వసుదేవులకు వరుసగా కలిగిన ఆరుగురు శిశువులను నిర్దాక్షిణ్యంగా తన కత్తికి బలిచేసి దారుణంగా చంపాడు. అయినా పరమాత్మయగు శ్రీకృష్ణుడు దేవకీదేవి అష్టమ గర్భమునందు జన్మించటం, నందయశోదలవద్ద గోకులంలో పెరగటం కూడా జరిగింది. కృష్ణుని ఎలాగైనా మట్టుబెట్టాలని కంసుడు శతవిధాల ప్రయత్నించినా అతని ప్రయత్నం సఫలం కాలేదు.

కృష్ణుని వలన తనకు మృత్యువు తప్పదనే భయంతో కంసుడు

రాత్రింబవళ్ళు శ్రీకృష్ణునే చింతిస్తూ ఉండేవాడు. ఆహారమును భుజిస్తూ, పానీయములు త్రావుతూ, విహరిస్తూ కూడా అతడు శ్రీకృష్ణుని పట్ల కల భయంతో శ్రీకృష్ణునే స్మరించేవాడు. తాను కృష్ణునిచేత సంహరింపబడటం తథ్యమని తెలుసుకుని అన్నివేళలా ఉద్విగ్నచిత్తంతో ఆయననే తలచుకుంటూ ఉండేవాడు. ప్రతిపదార్థంలోను కృష్ణునే దర్శించేవాడు.

**తిరుగుచు గుడుచుచు ద్రావుచు**
**నరుగుచు గూర్చుండి లేచు నవతరంబున్**
**హరిదలచి తలచి జగమూ**
**హరి మయమని చూచె గంసుడారని యలుకన్.**

విష్ణుభక్తిచే నిరంతరము ఎడతెగని తైలధారవలె అవిచ్ఛిన్నమైన స్మరణభక్తితో అనుక్షణము స్మరించి ప్రహ్లాదుడు తింటూ, త్రాగుతూ అన్నివేళలా విష్ణువును ధ్యానించి తరించాడు. అయితే ఇక్కడ కంసుడు కృష్ణుని పట్ల ఆరని పగతో కృద్ధుడై ఉండటంచేత ప్రతిక్షణం ఆకృష్ణుని పైనే ధ్యాసగా, ప్రతివస్తువూ హరి స్వరూపంగా జగమంతా హరిమయంగా కంసునికి అనిపించేది. ఆవిధంగా పగతో, భయంతో ఉన్న కంసుడు ప్రపంచము నంతా భగవత్స్వరూపంగా దర్శించసాగాడు.

చెవులకు ఏదైనా శబ్దం వినిపిస్తే అది హరిపలుకేనేమోననవి ఆలకించేవాడు. కంటికి కనపడే ప్రతివస్తువూ కృష్ణుని రూపమేనని భావించేవాడు. శరీరమునకు గడ్డిపోచ తగిలినాకూడా అది హరికరస్పర్శే అనుకునేవాడు. గంధపు వాసన ముక్కుపుటాలకు సోకితే అది హరిగళమందు ధరించబడిన పూలమాలల సుగంధమేమోననవి భ్రమసేవాడు. ఎవరు పిలిచినా, పలికినా హరియే అనుకునేవాడు. ఏ ఆలోచన కలిగినా అది హరిని గురించేనని కృద్ధుడైపోయేవాడు.

ఈవిధముగా పగచేత కంసుడు ఈప్రపంచమంతా కూడా హరి మయంగా భావిస్తూ ప్రతిక్షణం గడపటం చేత, కృష్ణునిచేతిలో మరణించగానే కంసునిలోనుండి ఒక తేజం వచ్చి కృష్ణునిలో కలసిపోయింది. భయంతో, పగతో అనుక్షణం శ్రీకృష్ణునే స్మరించిన కంసునికి ఈవిధంగా కైవల్యం లభించింది. ఈవిధంగానే వైరంతో శిశుపాలుడు, దంత వక్త్రుడు మొదలైన వారు నిరంతరం హరిని స్మరించి మరణానంతరం కైవల్యాన్ని

పొందగలిగిన విషయం భాగవతమునందు చెప్పబడింది.

ఇక బంధుత్వము వలన తరించినవారు వృష్ణులు (యాదవులు). కృష్ణుడు యదువంశమునందు జన్మించాడు. కనుక కృష్ణునికి బంధువులై యాదవులు హరిని బంధుత్వంతో తమ హృదయాలలో బంధించుకోగలిగారు. యాదవులంతా కృష్ణునితో కలసి మెలసి గడిపే భాగ్యమునకు నోచుకొని పునీతులైనారు. గుజరాత్‌లోని ద్వారకవద్దనున్న వృష్ణివంశస్థులైన యాదవులంతా కృష్ణునికి బంధువులు. అట్లే కృష్ణుడు బృందావనములోని మధురలో యశోదానందుల ఇంట పెరుగుట చేత అక్కడి గోపగోపీజనం శ్రీకృష్ణుని తమ బంధువుగానే ప్రేమించారు.

అఖిల లోకములకు ఆశ్రయుడైనటువంటి ఆశ్రిత వత్సలుడు ఆ శ్రీహరితో ఆటపాటలతో కాలం గడపగలిగిన ఆయాదవులు ఎంతటి ధన్యులు !

గోపవరులు మఱియు గొందరు ప్రియమున
మాధవునకు బెక్కు మార్గములను
బనులుసేసి రెల్ల భవముల జేసిన
పాపసంచయములు భస్మముగాగ !

ఆలీలా వినోదుడు ఆటపాటలందు కాస్త అలసినట్లు కనిపిస్తే గోపకులు కొందరు ఆశ్రీకృష్ణుని తమవీపులపై ఎక్కించుకునేవారు. కాస్త సొలసినట్లు కనిపిస్తే తమ ఊరువులనే తలగడ దిండ్లు చేసి తమ ఒడిలో పడుకోబెట్టుకునేవారు. శరీరమున చిరుచెమటలు అలముకుంటే చిగురుటాకులతో వింజామరవీచి సేదదీర్చేవారు. మరికొందరు ఆహరి పాదములను ఒత్తి శ్రమ తీర్చేవారు. ఇలా ఎంతో ప్రేమతో వారు మాధవునకు చేసిన ఉపచారములతో వారు గత జన్మలలో చేసిన పాపమంతాకూడా భస్మమైపోయిందని భాగవతము నందు వర్ణించబడినది.

"ఎన్నడునైన యోగివిభులెవ్వని పాద పరాగమింతయున్
గన్నులగానరానట్టి హరి కౌగిట చేర్చుచు జెట్ట బట్టుచున్
దున్నుచు గ్రుద్దుచున్నగుచు దద్దయులై పడి కూడియాడుచున్
మన్నన సేయు వల్లవ కుమారుల భాగ్యములింత యొప్పునే".

వీనులకును బ్రహ్మసుఖానందంబై, భక్తగణమునకు
దైవతమై నందుని బాలుడగు హరి, పొందుగనిరి
గొల్ల లిట్టి పుణ్యులు గలరే !

మహామహా యోగులకైనా హరిపాదధూళియైనా దొరకటం దుర్లభం అని అంటారు. మరి అటువంటి శ్రీకృష్ణుని కౌగిలించుకుంటూ, చెట్టాపట్టాలు వేసుకుని ఆయనతో ఆడుతూ, పాడుతూ ఆయన స్పర్శను పొందటానికి, ఆయనతో సంభాషించటానికి నోచుకున్న ఆయాదవుల యొక్క భాగ్యం ఇంత అని చెప్పటం సాధ్యమా ! అటువంటి హరి పొందు లభించిన గొల్లలకంటె పుణ్యులు ఇంకెవరున్నారు ?

ఈవిధముగా సమస్త ఇంద్రియములనూ కృష్ణునియందే కేంద్రీకరించి కృష్ణునితో గడప గలిగిన గోపగోపికా జనం యొక్క విశేష భాగ్యసంపదను కొనియాడగలగటం ఎవ్వరికీ అలవికాని పని !

బాంధవముననైన బగనైన వగనైన
బ్రీతినైన బ్రాణభీతినైన
భక్తినైన హరికి బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకు జనుదు రధిప !

ఈవిధంగా బంధుత్వంతోకాని, పగతోకాని, వగతోకాని, ప్రీతితోకాని, ప్రాణభీతితోకాని, భక్తితోకాని, ఏవిధంగానైనా సరే నిరంతరము భగవంతునే స్మరించేవారు మోక్షాన్ని తప్పకుండా పొందుతారు.

అంతేకాకుండా ధ్యానంచేత కాని, గానంచేతకాని, దర్శనంచేతకాని, ఎలాగయినా భగవంతుని తలుచుకుంటే జన్మచరితార్ధమవుతుంది. అందు వల్లనే "సుదాముడు" అనే మాలాకారుడు "నీపాదకమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యము, నితాంతాపారభూతదయయును దయ చేయమని అంతకుమించి తనకు ఏకోరికలు లేవని ఆకృష్ణభగవానుని వేడుకొన్నాడు. వ్రేపల్లెలో పుట్టిన గోప గోపీజనం అంతా కృష్ణుని ఆటపాటలను బాలకృష్ణుని ముద్దుమురిపాలను చూచి అతి పిన్నవయసులోనే కృష్ణుడు ప్రదర్శించిన లీలలను చూచి తరించగలిగారు. అలా మనంకూడా వ్రేపల్లెలోనో, బృందావనంలోనో పుట్టి ఉంటే మనకి కూడా అంతటి భాగ్యం

కలిగి ఉండేదికదా అని నొచ్చుకున్నారు మధురానగర వాసులు.

"వనంలో వెదురుగా పుడితే నల్లనయ్య పెదవుల నంటి వుండే వేణువులుగా మలచి తన వేణుగానంతో ఆయన, ఆదరించి ఉండేవాడు. నెమలి పింఛములమైతే శ్రీకృష్ణుడు ప్రేమతో తన తలపై కొప్పులో అలంకరించుకొని ఉండేవాడు. పట్టు పీతాంబరములమై వుంటే ఆకృష్ణయ్య శరీరాన్ని అంటిపెట్టుకుని వుండే మహాభాగ్యం కలిగి వుండేది. బృందా వనంలోని చెట్లమై పుట్టి వుంటే కృష్ణుడు మనతో ఆనందంగా ఆట లాడుకునేవాడు – అంతటి మహాభాగ్యమును పొందగలిగే విధంగా ముందు జన్మలో నోములు నోచి వుండకపోతిమే ! "యని వాపోయారు మధురానగర ప్రజానీకమంతా. అంతేకాకుండా తమను వ్రేపల్లెలోని గోపికలుగా, గోపాలురుగా సృష్టించని బ్రహ్మను వారంతా ఆడిపోసుకున్నారు కూడా.

**"పాపపు బ్రహ్మ !గోపికల పల్లెలలోన సృజించరాదేము**
**న్నీపురి లోపలన్ మనల నేల సృజించెనట్టెననిచ్చలున్**
**జేపడుగాదె ఈసుభగు జెందెడి భాగ్యము సంతసంబు నీ**
**గోపకుమారు లొందమును గోపకుమారిక లేమి నోచిరో !"**

అంటూ వ్రేపల్లెవాడలో పుట్టలేకపోయినందుకు తమ దుర దృష్టమునకు ని..ంచుకుంటూ, అట్టి అదృష్టాన్ని పొందిన గోప గోపీజనుల సౌభాగ్యమును కొనియాడారు మధురాపురి ప్రజలు.

యాదవుల సంక్షేమంకోసమై నిర్మించిన ద్వారకానగరంలో నివసిస్తూ ఆద్వారకాపురవాసులైన యాదవులు ఎప్పుడూ శ్రీకృష్ణనామచింతనయందే కాలం గడుపుతూ తమ జీవితములను ధన్యం చేసుకున్నారు. "ఆసక్తి కృష్ణముఖావలోకమందు హరిపాదసేవన మందచింత వెఱపు నారాయణ కార్యములందు పారవశ్యము విష్ణుభక్తియంద బాష్పనిర్గతి చక్రిపద్య సంస్తుతులంద పక్షపాతము శార్ఙిభక్తులందలేమి గోవిందాన్య లీలా చరణమంద శ్రమము గోవిందపూజనములంద

**బంధమచ్యుతేతర దుష్టపథములంద**
**జ్వరము మాధవవిరహిత క్షణములంద**

**మత్సరము లీశుకైంకర్యమతములంద**
**నరవరోత్తమ : వినుము తన్నాగరకులకు.**

ఈవిధంగా ప్రేమతో కాని, భయంతోకాని, వైరంతోకాని, స్నేహంతో కాని, బంధుత్వంతోకాని, సేవతోకాని, ప్రాణభీతితోకాని, భక్తితో కాని ఏవిధంగానైనాసరే సదా భగవంతుని ధ్యానించే వారికి ముక్తి తప్పక లభిస్తుందనటానికి ఈపైన చెప్పబడిన ఉదాహరణలే ప్రబల నిదర్శనాలు. ఇందుకు పరమ ప్రామాణికమైనది భాగవతగ్రంథం.

ఈమార్గాలేకాకుండా భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు, ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అనే మరో నాలుగు విధములైన భక్తులను గురించి చెప్పటం జరిగింది. ఈనాలుగు విధములైన భక్తులు కూడా భాగవతంలో గోచరిస్తారు.

ఆర్తుడు– ఆర్తుడు అంటే ఏదైనా ఆపద సంభవించినప్పుడు కాని, తీవ్రమైన వేదన కలిగినప్పుడు కాని .... "భగవంతుడా ! నీవు తప్ప నాకు మరొక దిక్కులేదు" అని ఆర్తితో భగవంతునికై పరితపించేవాడు. ఇందుకు చక్కని ఉదాహరణ భాగవతములోని గజేంద్రమోక్ష ఘట్టం.

"మొసలిచే పట్టుకోబడిన గజరాజు మొసలిబారినుండి విడిపించు కోవటానికి శాయశక్తులా కృషిచేసి, ఇక తన శక్తంతా నశించిపోగా" లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబుల్ ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె, దనువున్ డస్సెన్, శ్రమంబయ్యోడిన్, నీవే తప్ప నితఃపరంబెఱుంగ, మన్నింప దగున్, దీనునిన్, రావే ఈశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా ! ... అంటూ భగవంతుని కొరకై దీనాతి దీనంగా ప్రార్థించగానే "కలడందురు దీనులయెడ, గలడందురు పరమయోగి గణముల పాలంగల డందురన్ని దిశలను గలడనెడి వాడు గలడో ! లేడో అని ఆర్తితో మొరపెట్టుకోగానె...

అలవైకుంఠపురములో, నగరిలో, ఆమూలనున్న సౌధములోపల మందారవనములో రమాదేవితో వినోదిస్తున్న ఆపన్నప్రపన్నుడైన శ్రీహరి, విహ్వలుడైన గజేంద్రుడు చేస్తున్న "పాహి ... పాహి" యను దీనాలాపమును ఆలకించగానే, సిరికైనా చెప్పకుండా , శంఖు చక్రాది ఆయుధములైనా

ధరించకుండా, రమాదేవితో లీలావినోదంగా విహరిస్తూ పట్టుకున్న ఆమె చీర చెరగును కూడా విడిచి పెట్టడం మరచిపోయి, అలాగే ఆకొంగును చేత బట్టుకుని మిక్కిలి సంరంభంతో "అమ్మా" అన్న కన్నబిడ్డ ఆర్తనాదం వినబడగానే పరుగునవచ్చి బిడ్డను లాలించే కన్నతల్లి వలె" ఆ శ్రీహరి గజేంద్రుని రక్షించటానికై పరుగునవచ్చి, తన భక్తుని మొసలి బారినుండి కాపాడి, రక్షించిన ఘట్టం పోతనగారు భాగవతంలో అతిరమణీయంగా వర్ణించిన వైనం మనకందరికీ తెలిసినదేకదా !

భక్తుని హృదయంలోనుంచి వెలికి వచ్చే ఆర్తి భగవంతునికోసమై పరితాపం కావాలి. భగవంతునికోసం పరితపిస్తే సంతాపాలన్నీ తొలగి పోతాయి. భౌతికసుఖాలకోసం ప్రాకులాడి పరితపిస్తే కష్టాలే చుట్టు ముడతాయి.

కష్టాలలో భగవంతుడు గుర్తువచ్చినట్లు సుఖాలలో గుర్తురాడు. అందుకే కుంతీదేవి కృష్ణభగవానుని నిరంతరమూ తలుచుకోవటంకోసం తనకు కష్టములే కలగాలని ఆకృష్ణుని వేడుకుంది. ఏదైనా ఆపద సంభవించినప్పుడు, భరించలేని వేదన కలిగినప్పుడు మన ఆర్తిని, వేదనను తీర్చగల ఆభగవంతునే శరణు వేడుకోవాలి. కష్టములు కలిగి నప్పుడు ఇరుగుపొరుగు వాళ్ళకు చెప్పుకుంటే చులకన కావటంతప్ప కష్టాలు తీరవు. ఆపరమాత్మను శరణువేడుకుంటే మనబాధలను తొలగించగల సమర్థుడు. ఆయనె కనక తగిన విధంగా కాపాడతాడు. అసలైన ఆర్తితో, పరితాపంతో శరణు వేడితే భగవంతుడు తప్పక కరుణిస్తాడు.

**దీనులకుయ్యాలింపను, దీనుల రక్షింపమేలు దీవపబొందన్**
**దీనావన ! నీకొప్పును దీనపరాధీన దేవదేవ మహేశా !**

<u>జిజ్ఞాసువు</u> – ఆర్తితో భగవంతుని కోసం పరితపించి తరించేవారు కొందరైతే మరి కొందరు భగవంతుని గురించి జిజ్ఞాసతో తెలుసుకోవటానికి ప్రయత్నించి ముక్తిని పొందుతారు. అట్టి జిజ్ఞాసువులలో ఉద్ధవుడు ముఖ్యమైనవాడు. అవతారం చాలించబోయే ముందు శ్రీకృష్ణుడు "ఉద్ధవా! ఇంతకాలం నన్ను పరమ భక్తితో సేవించావు కదా ! ఏంకావాలో కోరుకోమని అన్నప్పుడు ఉద్ధవుడు "స్వామీ ! నాకు ఏకోరికాలేదు. నీయందు భక్తి కలిగే విధమును గురించి వివరించు ! నీమాయను తరించగల మార్గాన్ని

ఉపదేశించ" మని ప్రార్థించి తరించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు తనయందు అనన్యమైన భక్తిని కలిగే మార్గాన్ని ఉపదేశించి అతనికి కైవల్యాన్ని ప్రసాదించాడు.

"ఓ ఉద్ధవా: దేహము నిత్యము కాదని గ్రహించి, మోహమును త్యజించి, పవిత్ర వర్తనుడైయుండువాడు ముక్తి సంపదను పొందగలుగుతాడు.

"సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ" అను ఉపనిషత్తుల్యమైన గీతావచనం ప్రకారము ఎవరైనా కాని నాయందే ధ్యానమును ఉంచి ప్రవర్తించే వాడు నన్నే పొందుతాడు. నిజమునకు నాకు నాభక్తునకు భేదం లేదు" అని బోధించాడు శ్రీకృష్ణుడు.

"అంతేకాకుండా జన్మలన్నింటిలోకి మానవజన్మ ఉత్తమమమైనది నిత్యానిత్య విషయగ్రహణశక్తి కేవలము మానవులకు మాత్రమే ఉంది. శాశ్వతుడైన భగవంతుని ఆశ్రయించి ఆయన్ని సేవించి తరించే అవకాశం కూడా వారికే ఉంది.

మానవులై పుట్టినవారు భగవంతుని పట్ల పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండటం, భగవంతుని ఆరాధించే క్రమాన్ని తెలుసుకోవటం, భాగవత ధర్మములను అనుష్ఠించటం అవసరం. భాగవతధర్మమును అనుసరించేవారు సమస్త పాపాలు తొలగిపోయి పవిత్రులు కాగలుగుతారు. ఎవరు ఏకులంలో జన్మించినా వారు పరమేశ్వరుడైన భగవంతుని భజించిన పక్షంలో ఉత్తమగతిని పొందుతారు. భగవద్భక్తి లేనివారు, దేహాభిమానం కలవారు అయితే అధోగతిని పొందుతారు. ఇది ముమ్మాటికీ తిరుగులేని సత్యం.

ధర్మానికి ఫలం ధర్మమే. ధర్మానువర్తనులైన వారికి శాంతి లభిస్తుంది. దాని ద్వారా జ్ఞానం అభివృద్ధి అవుతుంది. అధర్మపరులకు అశాంతి కలుగుతుంది. అట్టి వారు అజ్ఞానాన్ని జ్ఞానంగా భావిస్తుంటారు. అందువలన వారు తలపెట్టే కార్యములు విఫలమైపోతుంటాయి. ఆవిధంగా అనుకున్న పని నెరవేరక పోవటం వలన వాళ్లు కష్టాల పాలవుతారు. అనిత్యమైన సంబంధములను పెంచుకొని తమో మయము, దుఃఖభాజనము అయిన

జీవితాన్ని గడుపుతూ అమూల్యమైన తమ జీవితకాలాన్ని వ్యర్థంచేసుకుంటారు.

మనసా వాచా ఇంద్రియములతో ఎప్పుడు ఏపనిని చేసినా ఆపని యొక్క ఫలమును పరమాత్మకు సమర్పించటము భాగవతధర్మము. ఆ భాగవతధర్మమును అనుసరించదలచినవారు ముందుగా సంకల్ప వికల్పాత్మకమైన మనస్సును నిరోధించుకోవాలి. భగవవంతుని లీలావతార విశేషములను వింటూ ఉండాలి. ఎల్లవేళలా, ఏపనిని చేస్తున్నా నిరంతరం భగవంతుని నామాన్ని ఎడతెగని తైలధారవలె అవిచ్ఛిన్నంగా జపిస్తూ ఉండాలి అన్నాడు కృష్ణపరమాత్మ.

ఈకాలంలో కలియుగ మానవులకు ప్రతిపనినీ అతివేగంగా పూర్తిచేసుకొని స్త్రీ పురుషులు ఇరువురూ కూడా ఉద్యోగ నిర్వహణ, ఇంటి బాధ్యత, పిల్లల సంరక్షణ, వారి ఛదువు భాద్యత, ఇంకా అనేకమైన పనులను నిర్వహించుకోవలసి వస్తున్నది. అందువలన ఈకాలంలో గంటల తరబడి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి, విడిగా పూజామందిరములలో పూజాదికములను చేసే తీరుబడి, అవకాశం చాలా తక్కువగా లభిస్తున్నది. యుగాన్నిబట్టి ధర్మం మారక తప్పదు. అది అనివార్యము. కృత త్రేతాయుగములో మానవులు తపస్సును, యజ్ఞములను చేసేవారు. ద్వాపరయుగంలో క్రతువులు, వ్రతాలు మొదలైనవి చేసేవారు. ఈనాటి కలియుగమానవులకు ఏవి చేయాలన్నా లభించే వ్యవధి తక్కువ. ఎప్పుడో ఏదో ఒక రోజు ఇంట్లోనో, ఏదైనా గుడికి వెళ్ళో అభిషేకాలు, అర్చనలు చేయించటమో, ఏదైనా ఒక వ్రతం చేసుకోవటమో కూడా అతికష్టంమీద సాధ్యపడుతున్నది. మరి అటువంటప్పుడు మోక్షమును ఆశించేవారికి ఈకలియుగంలో తరుణోపాయం ఏమీ లేదా ? ..... ఉంది ..... తప్పక ఉంది. ఈవిషయమును గురించి ధ్యానించిన వేదవ్యాసులవారు ఏనాడో అతిసులభమైన ఉపాయాన్ని సెలవిచ్చారు. "కలియుగమానవులు నామస్మరణ ద్వారా ముక్తిని" తప్పక పొందగలరు" అన్నారు వేదవ్యాసమహర్షి. క్షణం తీరుబడిలేని ఈకాలంలో నామస్మరణ ఏవిధంగా చెయ్యాలి ? భగవంతుని నామాన్ని మనసారా తలచుకోవటానికి ఏనియమనిష్టలూ అవసరంలేదు. 'అమ్మా' అని పిలిచే బిడ్డకు నియమాలు అవసరం లేని

విధంగా జగన్మాతను, ఆజగత్పితను తలచుకోవటానికి ప్రత్యేక నియమాలు నిష్ఠలు అవసరంలేదు. ప్రేమ, ఆర్తిచాలు. ఏపనిచేస్తున్నా కూడా మనసులో సదా భగవన్నామాన్ని స్మరిస్తూనే ఉండవచ్చును. మనలో శ్వాస ప్రక్రియ జరుగుతున్నంత సహజంగా నామస్మరణ జరిగేలా సాధన చేయగలగాలి.

అందరికీ అనుభవంలో ఉండే విషయమే. ఈనాటి ప్రజలకు ఉదయంలేచిన దగ్గరనుంచి ఊపిరి సలపకుండా అనేక భాద్యతలు ఉంటున్నాయి. (అది వరకు కాలంలో భాద్యతలు లేవని భావం కాదు) ఇలా ఒక నిర్ణీత సమయంలో పిల్లలను తయారుచేసి బడులకు పంపటం, ఇంటి పనులు, భాద్యతలు, పాలకార్డులు, రేషన్‌కార్డులు, బిల్లులు కట్టడానికి గంటలతరబడి "క్యూ"లో నించోవటం, చాల దూరం బస్సులలో ప్రయణం చేసి ఉద్యోగాలకు వెళ్ళటం వంటి కార్యక్రమాలలో మగ్నమైయున్నప్పుడు కూడా (ఉదా॥బస్సులో వెళ్తున్నాము అనుకోండి. ఆసమయం అంతా నామం స్మరించవచ్చు కదా ! అలాగే మిగతాపనులు చేస్తున్నప్పుడు కూడా మనసులో నామం స్మరించుకుంటూనే ఉండవచ్చు) భగవంతుని నామమును విడువకుండా స్మరిస్తూ ఉంటే, క్రమంగా ఏకాగ్రత చేకూరి శ్వాస ప్రక్రియ, రక్తప్రసరణ జరుగుతున్నంత సాధారణంగా నామస్మరణకూడా జరిగే అభ్యాసం అవుతుంది. ఈవిధంగా ఏపనిచేస్తున్నా కూడా మనసులో సదా నామాన్ని స్మరిస్తూనే ఉండవచ్చు.

ఎవరికి ఇష్టమైన నామాన్ని వారు గ్రహించి, పదే పదే స్మరణ చేస్తూ ఉంటే అత్యంత సహజంగా, ఎడతెగని తైలధారవలె నామజపం జరుగుతూ ఉంటుంది. నామస్మరణకు నియమ నిష్టలకంటె ప్రధానమైనది. ముఖ్యమైనది చిత్తశుద్ధిమాత్రమే. స్వార్థం, పాపకర్మలతో నిండిన ఈకలి కాలంలో తిరిగి ధర్మం నాలగు పాదాలా సంచరించాలి అంటే మనుషులలో హృదయపరివర్తన రావాలి. నిష్కామకర్మాచరణ చేత, భగవన్నామస్మరణంచేత చిత్తశుద్ధి కలిగి పవిత్రమైన ధర్మవర్తనం అలవాటు అవుతుంది. ఆవిధంగా ప్రతివ్యక్తిలోనూ మార్పు తెచ్చుకోగలిగితే హింస నిండిన ఈకలుషవాతావరణం పరిశుభ్రమై తిరిగి ధర్మసంస్థాపన జరుగుతుంది. పూర్వకాలంలో గడిచిన యుగాలలో ఏకొద్ది మందో దుష్ట రాక్షసులు జన్మించటం, భగవంతుడు అట్టి రాక్షసులను శిక్షించే నిమిత్తమై అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ

చేయటం జరుగుతూ ఉండేది. కాని, ఈనాటి మానవులలో ప్రతి ఒక్కరిలోను కొంత దైవత్వం మరికొంత రాక్షసత్వం ఉంటున్నది. అందుచేత మానవులలోని దుష్టస్వభావాన్ని నిర్మూలించి ప్రతిఒక్కరిలోను పరివర్తన తేవలసిన ఆవశ్యకత ఉంది. దుష్టులను సంహరించటం ద్వారా ధర్మాన్ని స్థాపించటం ఈయుగంలో సాధ్యపడదు. కేవలము దుష్టత్వమును నిర్మూలించటం, దుష్ట స్వభావము పోయి పవిత్రభావములు కలిగేలా చేయటం ఈయుగ అవతార లక్ష్యం. కర్తవ్యం. ఆధ్యాత్మిక విప్లవం చెలరేగి ప్రజలంతా దుష్ట స్వభావమును పోగొట్టుకొని పరిశుద్ధ వర్తనులు కావాలి. హృదయపరివర్తనరావాలి. మనసులోని మాలిన్యం తొలగాలి. అందుకు భగవన్నామస్మరణయే శరణ్యం. మనసులను పవిత్రం చేసుకుని చిత్తశుద్ధితో భగవంతుని స్మరిస్తూ, నిస్వార్ధంగా కర్మలను చేస్తుంటే క్రమంగా ఆశించిన మార్పు కలిగి జీవిత సార్థక్యం కలుగుతుంది.

నామం జపించటానికి దేశకాలములతో నిమిత్తంలేదు. పవిత్రమైన సంకల్పం, మనసు మాత్రమే కావాలి. నాలుకతో నామాన్ని ఉచ్చరిస్తూ, చేతులతో చెడ్డ పనులు చేస్తే ప్రయోజనం లేదు. చేతనైనంత సేవచేస్తూ, సాధ్యమైనంతగా స్వార్థాన్ని తగ్గించుకోగలిగినప్పుడు జీవితం చరితార్థమవుతుంది. వేదాలలో బోధించబడిన, మనపూర్వీకులైన మహాను భావులు ఆచరించి, చూపించిన "త్యాగం" ఈనాటి వారిలో కరువౌతున్నది.

భగవంతుని స్మరించగా, స్మరించగా చిత్తములోని మాలిన్యములన్నీ కరగిపోతాయి. నిర్మలమైన మనసులో ఆత్మజ్ఞానం ప్రకాశిస్తుంది. అందుచేత ఇంతకు ముందు చెప్పబడినట్లుగా నిత్యకృత్యములు చేసుకుంటూ ఉన్నా, ఉద్యోగ భాద్యతలను నిర్వహిస్తూ ఉన్నా, వంటపని మొదలైన ఇంటిపనులు చేసుకుంటూ ఉన్నప్పుడు, విరామసమయంలోనైనా, ప్రయాణం చేస్తున్నప్పుడైనా, ఏపనిచేస్తున్నప్పటికి మనశరీరంలో శ్వాసక్రియ, రక్తప్రసరణ ఎంతసహజంగా, నిర్విరామంగా జరుగుతూ ఉంటాయో, అంత సహజంగానూ భగవంతుని నామస్మరణ ఎడతెగని తైలధారవలె అవిచ్ఛిన్నంగా జరిగే సాధన ప్రతిఒక్కరూ చెయ్యాలి. అందుకే సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నారు పెద్దలు. పట్టుదలతో సాధిస్తే సాధించలేనిది ఏదీలేదు.

భక్తి ఎలా కలుగుతుంది ? అని ఉద్ధవునకు కలిగిన భక్తి జిజ్ఞాస ననుసరించి ఇంకా ఇలా చెప్పబడింది. "అధాతో[బ్రహ్మజిజ్ఞాసా" అనునది మొదటి బ్రహ్మసూత్రము. "అటు తరువాత బ్రహ్మమును గూర్చి జిజ్ఞాస చేయవలెను" అని ఈసూత్రమునకు అర్థము.

"జ్ఞాతుం ఇచ్ఛా జిజ్ఞాస" అను వ్యుత్పత్తి వలన ఒక విషయమును గురించి మాటిమాటికి తెలుసుకొనగోరుట లేక అత్యధికముగా తెలుసుకోగోరుట అను అర్థములో జిజ్ఞాసాపదమును వాడతారు. అధికముగా లేక మాటిమాటికి తెలుసుకొనగోరువాడు అనగా విచారణ చేయువాడు జిజ్ఞాసువు అవుతాడు. అందుచేతనే శాస్త్ర సహాయంతో, గురుసహాయంతో బ్రహ్మ విచారణను లేక ఆత్మవిచారణను చేయు వానిని "జిజ్ఞాసువు" (జిజ్ఞాసాభక్తుడు) అని అంటారు. ఈఅర్థంలోనే

1. "స్వ స్వరూపాను సంధానం భక్తిరిత్యభిదీయతే"

2. స్వాత్మ తత్త్వానుసంధానం భక్తి రిత్యపరే జగుః" అని శ్రీశంకరులు నిర్వచించారు.

బ్రహ్మ సూత్రవ్యాఖ్యానపఠనం. ఉపనిషదర్థ విచారణ, గీతా భాష్య శ్రవణము-ఇవన్నీ కూడా జిజ్ఞాసా భక్తికి అంగములు. ప్రస్థాన త్రయ భాష్యములు ఈ జిజ్ఞాసువునకు ప్రధాన సాధనములు. వీటి సహాయముతో" నేను ఎవరను" అను విచారణ చేయవచ్చును. గురు, శాస్త్ర సహాయములేకుండా చేసిన ఆత్మవిచారణ లక్ష్యసిద్ధికి తోడ్పడకపోవచ్చును. మార్గము దుర్గమముకాని, ఆలస్యముకాని కావచ్చును.

శ్రుతిమతమైన తర్కమును అంగీకరించమని శంకరుల బోధ. స్వప్రతిభతో తెలుసుకొనుటకు ప్రారంభించి కుతర్కమును అవలంబించినచో కాలం వృధా అవుతుంది.

జిజ్ఞాసాభక్తుడైన ఉద్ధవునకు శ్రీకృష్ణభగవానుడు ఇంకా ఇలా చెప్పాడు. "కోరికలు లేకుండా, కర్మఫలమునందు ఆసక్తి లేకుండా సంగరహితులై మానవులు భగవన్నామస్మరణం చేసుకుంటూ జీవించాలి. అంతేకాకుండా పంచభూతాలూ, దిక్కులు, నదులు, సముద్రాలు, పర్వతాలు ఈసమస్త ప్రకృతి అంతా భగవంతుని స్వరూపంగానే భావించి వాటిని

ఆరాధించాలి. అలా భగవంతుని ఆరాధించేవారికి విషయాసక్తి దానంతట అదే నశించి దృఢమైన విశ్వాసం కలుగుతుంది. ఆవెంటనే వారికి భగవత్ప్రబోధం కలుగుతుంది. అనతికాలంలోనే వారికి భగత్సాక్షాత్కారం కలిగి కైవల్యం లభిస్తుంది.

సర్వభూతములలోను భగవద్భావం కలిగి ప్రవర్తించేవారు; తమలోనే సర్వభూతాలు ఉన్నాయని తెలుసుకోగలిగినవారు, ద్వేషమోహములు లేనివారు, జగమంతా హరిమయమని విశ్వసించేవారు. జన్మకర్మ వర్ణాశ్రమాదుల వలన కలిగే ఉచ్చ నీచతలను పాటించని వారు, దేహాభిమానము లేనివారు, సర్వభూతసములైనవారు, శాంతచిత్తులు – ఇటువంటి వారు భాగవతోత్తములనిపించుకుంటారు.

భాగవతులలో మధ్యమదశకు చెందిన భక్తులు పరమేశ్వరుని ప్రేమిస్తారు. భగవద్భక్తులతో మైత్రిని ఏర్పరచుకుంటారు. అజ్ఞానుల పట్ల కృప కలిగి వ్యవహరిస్తారు. ప్రాకృతభాగవతులుగా, (ప్రథమదశయందున్న భక్తులుగా) వ్యవహరింపబడేవారు, ప్రతిమలలో, విగ్రహములలో మాత్రమే భగవంతుడన్నాడనే భావం కలిగించుకుని, వాటిని శ్రద్ధగా పూజిస్తూ, ఇతర భూతములయందు అట్టి భగద్భావన లేకుండా చరిస్తూఉంటారు.

పరమభక్తులైనవారు అనన్యమైన భావంతో హరిని ఆరాధిస్తూ ఉంటారు. అటువంటివారిని సర్వదా ఆభగవంతుడు రక్షిస్తూ ఉంటాడు భగవంతుని మూర్తులను ఆరాధించటం, భగవద్భక్తులను ఆశ్రయించి వారిని అర్చించటం, హరికథలను శ్రద్ధాభక్తులతో వినటం, నిరంతరం భగవంతుని ధ్యానిస్తూ ఉండటం, తమ సర్వస్వాన్ని ఆయనకే సమర్పించుకోవటం, భగవంతునికి సంబంధించిన వ్రతములను ఉత్సవములను ఆమోదించటం, పుణ్యక్షేత్రములను దర్శించటం, ఆలయాలను, ఆరామాలను నిర్మించటం, దేవాలయములను దాసులవలె అలంకరించటం అనునవి భగవద్భక్తుల లక్షణాలు.

భగవద్భక్తులయిన వారి జీవితం సుఖమయంగా ఉంటుంది. వారికి మానావమానాలు రెండూ ఒకటే. ఎల్లప్పుడు ప్రశాంతమైన చిత్తంకలిగి ప్రసన్నులుగా ఉంటారు. వారికి భక్తి వినా మరొకటి రుచించదు. బ్రహ్మలోకవాసంగాని, మహేంద్రపదవిగాని, సార్వభౌమత్వంకాని,

యోగసిద్ధులుకాని వారిని మోహింపచేయజాలవు. భక్తిమూలంగానే వారు తమ పాపాలను భస్మం చేసుకుంటారు. ధర్మం, సాంఖ్యం, యోగం, స్వాధ్యాయం, త్యాగం, తపస్సు అనేవి ఏవీ సులభంగా సాధించలేని ఉత్తమస్థితిని వారు పరమభక్తిద్వారా సాధించుకుంటారు. వారికే భగవంతుడు తెలియబడతాడు. అట్టివారు ఏకులమునకు చెందిన వారైనా పరమ పవిత్రులుగానే భావింపబడతారు.

పరమభక్తులైనవారికి తంత్రాదికములు అక్కరలేదు. వారికి యధోచితమైన అనుష్టానం చాలు. మనోభావమూలంగానే వారు మహాపూజచేసినవారవుతారు. శ్రద్ధతోవారు అర్పించిన జలమైనా శ్రేష్టమైనదిగా భావింపబడుతుంది. భావం ప్రధానం కాని పూజా విధానం ప్రధానంకాదు. అందువలననే శంకరాచార్యులు .... ఓపరమేశ్వరా నేను నడిచే ఈనడకంతా నీకు చేసేప్రదక్షిణ అని, నేను ఆడే ప్రతిమాటా ఒకమంత్రమనీ, గిరిజార్పితమైన నాబుద్ధి నీకు మంత్రపుష్పమనీ, నిర్మలమైన నాహృదయ కమలమే నీకు పూజాప్రసూనమని భావించమనిప్రార్ధనచేసేవారు. ఈవిధంగా జిజ్ఞాసాభక్తి ద్వారా తరించినవాడు ఉద్ధవుడు.

అర్థార్థి : ప్రాపంచిక విషయ సంబంధమగు ఐశ్వర్యము, అధికారము, కీర్తి మొదలగునవి వాంఛించువారు అర్థార్థులు. భాగవతమునందు వివరించబడిన ధృవుని చరిత్ర ఇందుకు ఉదాహరణగా చెప్పుకొనవచ్చును."

"స్వాయంభువ మనువు యొక్క ద్వితీయ పుత్రుడైన ఉత్తానపాదుని మొదటి భార్యయగు, సునీతి యొక్క కుమారుడు ధృవుడు. ఐదేండ్ల చిరుతప్రాయంలో ఒక రోజు ఆటలాడుకొనుచు అంతఃపురములో తన తండ్రియగు ఉత్తానపాదుడు, సిహాసనమునందు, రెండవ భార్యయగు సురుచి యొక్క కుమారుని ఒడిలో కూర్చుండబెట్టుకొని ముద్దులాడటం చూచాడు. తాను కూడా అలాగే తండ్రి ఒడిలో కూర్చొనవలెనని ఆశతో తండ్రి వద్దకు చేరాడు. మనసులో ధృవునిపై ప్రేమ ఉన్నప్పటికీ చిన్నరాణి కాదనుట వలన ఆమె యందలి మమతచే రాజు ధృవుని ఒడిలో కూర్చుండ బెట్టుకొనలేదు. ఆ పసివానిని తండ్రి తిరస్కరించెను. సవతి తల్లి సురుచి కూడా నానా విధములైన పరుషవాక్యములను పలికి "నీవు చక్రవర్తి ఒడిలో కూర్చుండవలెనన్న మహా తపమొనర్చి నాకడుపున

బుట్టినగాని నీ కంతటి మహాభాగ్యము కలుగదని" నిష్ఠూరముగా పలికి, ఆ లేత పసిహృదయమును తీవ్రముగా గాయపరచినది.

వికలమనస్కుడై తీవ్రముగా దుఃఖించుచున్న ధృవుని ఓదార్చుచు ఆతని తల్లి సునీతి "నాయనా ! నీవు కూడా "ఉత్తముని" వలె (సురుచి కుమారుడు) రాజసింపసనమున కూర్చుండ గోరితివేని శ్రీహరి చరణములను చింతించుము. ఆతనిని ఆరాధించుటవలన జీవుడు దేనినైనను పొందగల్గును. ఈ రాజ్య సింహాసనము కంటెను ఉత్తమమైన పదవిని నీవు పొందగలిగెదవు ! " అని పలికినది.

తల్లి మాటలు ఆ పసి హృదయమున గాఢముగా నాటబడుటచేత, అతడు ఎట్లైనను శ్రీహరిని గురించి తీవ్రమైన తపస్సు చేసి, అత్యంత ఉన్నతమైన పదవిని, కీర్తిని, తన తండ్రి తాతలు కూడా పొందనట్టి పదవిని, కల్పాంతమున కూడా నాశనము కానట్టి శ్రేష్ఠమైన పదవిని పొందవలెనన్న పట్టుదలతో, దీక్షతో తపస్సు చేయుటకై అడవులకు బయలుదేరెను.

వయసులో ఎంతో చిన్న వాడైనప్పటికీ దృఢమైన పట్టుదలతో, దీక్షతో ధృవుడు వనములకు బయలుదేరగనే కరుణామయుడైన నారదమహర్షి అతని పట్టుదలను పరీక్షించి అతనికి ఉపదేశము చేయుటకై ధృవుని వద్దకు వచ్చెను. గురుతత్త్వము సర్వ వ్యాపకమైనటు వంటిది. భగవత్ప్రాప్తిని కలిగించువాడే గురువు. గురువు భగవంతుని స్వరూపుడే. గురువునకు భగవంతునకు భేదము లేదని శాస్త్రము ఘోషించుచున్నది.

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్పరబ్రహ్మా తస్మైశ్రీ గురువే నమః**
**గురుగీత**

శిష్యుడు తనకు గురువు లభించవలెనని ఆశించును. మనము దీక్షకు అధికారులమైనప్పుడు, సాధనయెడల మన హృదయము దృఢమైనప్పుడు, గురువును వెదకవలసిన పనిలేదు. గురువు తనంతట తానే వచ్చి, వానిని ప్రేమించి, ముక్తి మార్గమును చేర్చి భగవత్సాక్షాత్కారమును కావింపచేయును. భగవంతుని వైపుకు బోవునంత

వరకు మానవుడు కృపణుడు (నిర్భాగ్యుడు) గా ఉండును. మనము ఒక అడుగు భగవంతుని వైపు వేసిన ఆయన పది అడుగులు మనవైపుకు వేయును.

ఆ విధముగనే బాలుడైన ధృవునికి నారదుడు ఉపదేశము చేసి మధువనమునకు పోయి తపస్సు చేయమని పంపెను. అక్కడ ధృవుడు చేసిన తీవ్రమైన, కఠోరమైన తపస్సునకు లోకములు కంపించినవి. ఐదేండ్ల ప్రాయపు పసివాడైన ధృవుడు కనబరచిన నిశ్చల దీక్షకు, కఠినమైన తపస్సునకు, ఆతని తపోనిష్ఠకు సంతసించి శ్రీహరి ప్రత్యక్షమై అతని మనోరథమును గుర్తించినవాడై, అతడు మాటలలో ఏమీ చెప్పలేక పోయినప్పటికి, కరుణతో అనుగ్రహించి, దుర్లభమైన ధృవపదవిని వరముగా ప్రసాదించెను. ధృవుడు తపస్సు ప్రారంభించుటకు ముందు కోరుకున్న విధంగా, అతని తాత తండ్రులు కూడా పొందనట్టి మహోన్నతమైన పదవిని ఇచ్చి, ఆ లోకము అతని పేరుననే ధృవలోకమని ప్రసిద్ధి చెందునని, ధృవుడు సమస్త దేవతాగ్రహనక్షత్ర మండలములకు పైన ధృవతారయై వెలుగునని వరమిచ్చెను.

ఈ విధముగా అర్థార్థియై గాఢతపస్సు చేసిన ధృవునకు పరలోక గతుడైన పిదప విష్ణుపదమగు ధృవలోకమును పొందు వరమిచ్చుటతోపాటు, ఇహలోక వరములను కూడా ప్రసాదించి, నానా విధములగు సాంసారిక భోగములన్నింటిని అనుభవించిన పిమ్మట, భగవంతుని స్మరించుచు పరమపదమగు ధృవలోకమునకు చేరి పూజితుడు కాగలడని అనుగ్రహించెను. "ధృవ మండలము సప్తర్షి మండలమునకు పైన విరాజిల్లునని, అందరూ ఆ ధృవమండలమునకు నమస్కరించెదరని, అచటకు పోయినవారు మరల తిరిగి రారని" శ్రీహరి సెలవిచ్చెను.

అభీష్టవరములను పొందినప్పటికీ ధృవుని మనస్సు సంతుష్టిని పొందలేదు. ఆరు నెలలు తపస్సు చేసి భగవత్సాక్షాత్కారమును పొంది కూడా, సాంసారిక సంబంధమైన కోరికలను కోరితినన్న భావము ధృవునకు తీవ్రమైన విచారమును కలిగించినది. ధృవుడు భగవంతుని దర్శించిన పిదప, భగవత్సాక్షాత్కారము పొందిన అతనికి, ధృవపదము కూడా తుచ్ఛముగా తోచినది. త్రిలోకములందును సర్వోన్నతమైన పదవిని,

చక్రవర్తి పదవిని పొందుట అనునది. సామాన్యమైన విషయము కాదు. అన్నింటికంటె విశేషము అతనికి భగవంతుని సాక్షాత్కారము లభించినది. అట్టి భగవద్దర్శనము వలన బంధము ఉండదు. మనసులో అంతకు ముందు కోరికలు ఉన్నచో భగవద్దర్శనము పొందిన తరువాత ఆ కోరికలు నెరవేరిన పిదప వారికి ముక్తి కలుగును. నిష్కాములైన వారికి ముక్తి వెంటనే కలుగును. భగవద్దర్శన ఫలము ముక్తిని పొందుటయే.

ఈ విధముగా ఏదైనా ప్రాపంచిక విషయములను, భోగములను, కీర్తిని ఆశించి భగవంతుని ధ్యానించినప్పటికీ భగవంతుడు ముందు ఆ కోరికలను తీర్చి పిదప ముక్తిని ప్రసాదించును.

జ్ఞాని: - ప్రహ్లాదుడు, నారదుడు, విభీషణుడు, వ్యాసుడు, శుకుడు, భీష్ముడు మొదలైనవారు జ్ఞాని భక్తులు. సాధన పూర్తయి అపరోక్ష అనుభూతి కల జీవన్ముక్తులు జ్ఞాని భక్తులు. భక్తులందరిలోను జ్ఞాని భక్తుడు పరమశ్రేష్ఠుడు. అతడు ఏ విధమైన కోరికలూ లేనటువంటి వాడు. ఏకాగ్రమైన మనసుతో భగవంతుని యందు అనన్యమైన భక్తిని కలిగియుండును. జ్ఞానికి భగవంతుని యందు పరమప్రీతి. అట్లే భగవంతునికి కూడా వారి యందు అత్యంత ప్రేమ యుండునని భగవద్గీత యందు శ్రీకృష్ణుడు చెప్పెను. అనన్యత, నిష్కామత అను రెండు లక్షణముల వలన జ్ఞానుల భక్తి ఉత్తమోత్తమమని చెప్పబడినది.

సర్వోత్కృష్టమైన ఆత్మ జ్ఞానమును పొందిన జ్ఞానికి తనయందు, భగవంతునియందు భేదము లేదని గోచరించును. అప్పుడు అతనికి చరాచరమగు ఈ జగత్తంతయు భగవంతుని విరాట్స్వరూపముగా గోచరించి అంతటా, అందరియందును ఆ భగవంతునే దర్శించగలుగును.

ఈ విధంగా శ్రవణస్మరణాది నవవిధభక్తి మార్గములలో కనీసం ఏ ఒక్క మార్గం ద్వారానైనా కాని, ఏదైనా ఆపదలు సంభవించినప్పుడు ఆర్తితో కాని, లేక ప్రాపంచిక భోగాలు, కీర్తి ప్రతిష్ఠలు కాంక్షించి అర్థార్థులైగాని, భగవంతుని గురించి తెలుసుకొనవలెనను జిజ్ఞాసతో కాని, అనన్యమైన, నిష్కామమైన జ్ఞానమువలన కాని ఏ విధంగానైనా సరే భగవంతుని ధ్యానించి పొందుటయే జీవిత పరమార్థము అని వేదాంతశాస్త్రము బోధించుచున్నది.

అంతే కాకుండా భగవంతుని తమ సఖునిగా భావించి సఖ్య..... భక్తితోను, భగవంతుని యజమానిగా భావించి దాసునివలె సేవించు దాస్య భక్తి తోను కూడా భగవంతుని పొందవచ్చును.

భగవంతుని యజమానిగా, మిత్రునిగా, తండ్రిగా, తల్లిగా (మాతృభావము), మన బిడ్డగా కూడా భావించి ప్రేమించవచ్చును. భగవంతుని యందు పుత్ర వాత్సల్యమును కలిగి ప్రేమించుటను "వాత్సల్యభక్తి" అంటారు. భగవంతుని పుత్రునిగా భావించి ప్రేమించటం వలన భగవంతుని పట్ల భయము తొలగిపోవును. ప్రేమలో భయమునకు తావుండదు. పుత్రవాత్సల్యమున తల్లిదండ్రులకు బిడ్డలపట్ల ప్రేమయే కాని, భయము ఉండదుకదా ?

వాత్సల్యముతో కూడిన భక్తి భగవంతుని పట్ల భయమును, మూఢవిశ్వాసములను తొలగించి ప్రేమను పెంపొందింపచేయును. వత్సః అనగా పిల్లవాడు. వత్సా అనగా ఆడు బిడ్డ. వత్స అనగా దూడ అని కూడా అర్థము. వత్సయందు (బిడ్డలయందు) ఉండెడి ప్రేమను వాత్సల్యము అని అంటారు. ఇట్టి వాత్సల్యముతో కూడిన భక్తికి భాగవతము నందు మనోహరముగా వర్ణింపబడిన యశోదవాత్సల్యము చక్కని ఉదాహరణము.

భగవంతుని బిడ్డగా భావించి ఆ బిడ్డకై అనుక్షణము ఆలోచించుచు, అతని పోషణలో తన జీవితమును గడుపుచు, ఒక్క క్షణము అయినా ఆ బిడ్డ కనబడకపోయినచో తల్లడిల్లిపోవు ప్రేమపూర్వకమైన వాత్సల్యమును "వాత్సల్యభక్తి" అంటారు. అవసరమైనచో ఆ బిడ్డకై తన ప్రాణము లర్పించుటకు కూడా అట్టి ప్రేమ సిద్ధమగును.

కన్నతల్లి దేవకీదేవి అయినా యశోదా నందుల వద్ద పెరిగాడు శ్రీ కృష్ణుడు వ్రేపల్లెలో. పసిబాలుడుగా పాలుతాగుతూ, పారాడుతూ ఉండే వయసులోనే చిన్ని కృష్ణుడు పూతన, శకట, తృణావర్తాది రాక్షసులను సంహరించినప్పుడు యశోద మాతృహృదయము భయముతో తల్లడిల్లెను. దుష్టగ్రహములేవో తనబిడ్డపై ఆవేశించినట్లు తలచి తద్దోష పరిహారమునకై రక్షరేకలు కట్టించి, విభూతి పెట్టించి, దిగదుడుపులు తీయించి తన మాతృవాత్సల్యమును చాటుకున్నది. గోపగోపకుల ఇళ్ళలో దూరి వెన్న,

మీగడలు దొంగలించి తినుచున్నాడని ఇరుగుపొరుగు గోపెమ్మలు ఫిర్యాదులు చేసినప్పుడు బిడ్డను మంచి దారిలో పెట్టవలెనన్న మాతృ సహజమగు ఆందోళనతో మందలించి యశోద చిన్ని కృష్ణుని రోటికి కట్టివేసినది. మన్ను తిన్నందుకు కన్నయ్యను మందలించి "ఏదీ ! నీ నోరుచూపుమనగానే "పదునాల్గు లోకములను తన నోటిలో చూపగానే కలయో ! వైష్ణవమాయయో అని విభ్రాంతి చెందినది. మళ్ళీ వెంటనే చిన్ని కృష్ణుని తన మురిపాల శిశువుగానే భావించి మురిసిపోయింది.

కాళీయ మర్దన ఘట్టమునందు శ్రీ కృష్ణుని చుట్టియున్న ఆ భయంకర విషసర్పమగు కాళీయుని చూచి యశోద దుఃఖముతో తల్లడిల్లుచూ "అయ్యో ! కృష్ణా ! ఈ కాలకూట విషసర్పము నన్ను కరవక నిన్నేల కరచినదయ్యా ! నీవు బ్రతికి యున్నచో మేమంతా బ్రతికి వున్నవారమగుదుము. నీవే లేకున్నచో మేమందరమూ చనిపోయిన వారితో సమానమే"నని ఆక్రోశించినది. బిడ్డకు కలిగిన ఆపద తనకు వచ్చి తన బిడ్డ కలకాలం సుఖంగా వర్ధిల్లాలని తపించే మాతృహృదయ భావనయే వాత్సల్యము.

పసిబిడ్డలనే భగవంతుని స్వరూపములుగా భావించి ప్రేమించ వలయును. ఈవిధంగా భగవంతుని బిడ్డగా భావించి ప్రేమించే భక్తుడు భగవంతుని కన్నబిడ్డవలె లాలించి, ముద్దులాడి మురిసిపోవుచుండును. చిన్న కష్టము వచ్చినచో తల్లడిల్లిపోవును. తప్పు చేసినచో నిర్భయముగా మందలించును. అంతే కాని వాత్సల్యభక్తియందు భయము, వెరపు ఉండవు. ఇది భక్తుని భగవంతునికి మిక్కిలి ఆత్మీయునిగా చేయును.

భగవంతుని ప్రియునిగా భావించి ఆరాధించే మరొక భక్తి మార్గము మధురభక్తి. గోపికా భక్తి మధుర భావమునకు మహోన్నతమైన ఉదాహరణ.

<u>మధురభావమునకు అధికార విచారణ</u> - దేహాత్మ భావము పోవుట కుండలినీ జాగరణ మార్గములో బ్రహ్మగ్రంధి భేదనమని చెపుతారు. నేను మనస్సును అను భావము పోవుట కుండలినీ విద్యలో విష్ణుగ్రంధి భేదనము అంటారు. నేను జీవుడను, కర్తను, భోక్తను అను భావములు పోవుటను రుద్ర గ్రంధి భేదనము అని అంటారు. కుండలినీ జాగరణము జరిగి దేహాత్మ భావము పోయినవారు. స్థూల దేహ తాదాత్మ్యమును విడిచి

పెట్టిన వారు మాత్రమే మధుర భావమునకు అర్హు లు.

వాత్సల్య, సఖ్యాది ఇతర భావములలో దేహాత్మ భావము పోనివారు కూడా సాధన చేయవచ్చును. కాని మధుర భావములో మాత్రము అట్లు కాదు. దేహాత్మ భావము ప్రబలముగా ఉన్నవారికి మధుర భావ సాధన దుర్గమము. అట్టి వారికి ఇంద్రియ లౌల్యభావము ఏర్పడి, ఇంద్రియ లోలత్వమే భక్తి అని భ్రమపడు పొరపాటుకు అవకాశము కలుగును. కుండలినీ జాగరణమువలన కొంత స్థాయి పెరిగిన వారికి మధుర భావము వలన వీర్య లాభము, మనోబలము, జ్ఞానము, ఆనందసిద్ధి కలుగును.

అష్టవిధస్థాయీ భావములతో కూడినట్టి మహాభావము అను స్థితి రాధికా దేవికి కలిగిందని, తరువాత చైతన్య మహాప్రభువుకు, ఆ తరువాత రామక్రిష్ణ పరమహంస యందు ఈ మహాభావము వ్యక్తమైనదని భైరవీబ్రాహ్మణి పండితుల సభలో నిరూపించెను.

భగవంతుని పట్ల ప్రేమ కలిగి, అతని లీలావతారముల ద్వారా చేయబడిన దివ్యలీలలను స్మరించుచూ అతని పాదపద్మముల యందు అనన్యమైన ప్రీతి కలిగిన భక్తునకు విభిన్నమైన బాహ్యాదశలు కలుగును. భగవంతుని నిరుపమ సౌందర్య మాధుర్యాతిశయమును, ఆనందనిమగ్నుడై మాటిమాటికి పులకితుడగుచుండు భక్తునకు క్షణక్షణము రోమాంచితమై స్వరము గద్గదికమై మాటలు తడబడుచుండును. హృదయమునందు భగవంతుడనిన అనన్యమైన భక్తి, ప్రీతి కలిగిన భక్తుని స్థితి అలౌకికముగను, వర్ణించసాధ్యము కానిదిగను ఉండును.

భగవత్పాదపద్మములందు ప్రీతి కలుగుటయే వాస్తవికమైన భక్తి లాభము. భగవంతునితో బంధము ఏర్పడి సంసారబంధము శాశ్వతముగా విలీనము కావలెను. మనస్సునందు వాసనలున్నంతవరకు అది మరల మరల మొలకెత్తుచునే ఉండును. భక్తిరూపమగు అగ్ని చేత వాసనా బీజము దగ్ధమైనప్పుడు అది మరి మొలకెత్తదు. ఇదే విధముగా శరీరముతో సహా చిత్తము భగవద్భావపూరితమైనప్పుడు భక్తుడు భగవంతునకు అనురూపుడగును.

భ్రమరము చుట్టూ తిరుగు కీటకము తాను కూడా భ్రమరమై పోవునట్లు భగవంతుని సర్వదా స్మరించు భక్తుడు తాను కూడా భగవంతుడే అగును. అహైతుక భగవత్ప్రీతియే భక్తునకు అభీష్టము. సముద్రములో కలియుటకై తహతహలాడుచు ప్రవహించు నది యందలి పోటు (వేగము) వంటిది భక్తుని ప్రేమ. భక్తుడు ప్రేమ ప్రవాహమునకు ఎదురీదును. ఇట్టి ప్రేమను ఉదహరిస్తూ శ్రీ రామకృష్ణ పరమహంస ఇట్లు చెప్పెను, 'మిత్రులారా ! ఈ ప్రపంచమంతయు ఒక ఉన్మత్త శరణాలయము. ఇందు భార్యా పుత్రులకై కొందరికి, పేరు ప్రతిష్ఠలకై కొందరికి, స్వర్గసుఖములకై కొందరికి పిచ్చి ఎత్తినది. ఈ పెద్ద ఉన్మత్త శరణాలయములో నేనును ఒక పిచ్చివాడనే. భగవంతుని పొందవలయునని నా పిచ్చి. డబ్బు కొరకు మీకు మతి పోయిన యెడల భగవంతుని కొరకు నాకు మతి పోయినది. మీరును పిచ్చివారలే. నేనును పిచ్చివాడనే. అయినను నా పిచ్చిని అన్నింటిలో ఉత్తమముగా ఎంచెదను'

శ్రీ రామకృష్ణ పరమహంస

భగవంతునికై పిచ్చిపట్టటంలో కల మధురానందం అనుభవించే ఆ భక్తునికి మాత్రమే తెలియటం సాధ్యం తప్ప ఇతరులకు అది అర్థం కాదు. అట్టి భక్తునకు ఈ ప్రపంచమంతయు ప్రేమనిలయమై, ప్రేమ స్వరూపమై తోచును. భగవంతునికి సన్నిహితుడై భక్తుడు ఇంతకు మునుపు తనకు ఉన్న వ్యర్థమైన వాంఛలన్నింటిని త్యజించును.

భక్తి సాధనను ముందు ద్వైతభావముతో ఆరంభించవలెను. అపుడు భగవంతుడువేరని, మనము ప్రత్యేక వ్యక్తులమని తోచి అంతట మానవునకు భగవానునిపై ప్రేమ ఉప్పొంగును. అప్పుడు భగవంతుడు తనకు అత్యంతసన్నిహితుడని ..నిపించును. తల్లితండ్రి భార్యపుత్రులు మిత్రులు మొదలగు అన్ని బంధములందును భగవత్ప్రేమ కలిగి ఈ రూపములన్నింటియందును భక్తుడు భగవంతుని దర్శించగలుగును. తుదకు తాను ప్రేమించు భగవంతుడు, తాను వేరు కాదన్న సత్యము గ్రహించి అనన్య భక్తిని పొందును.

నారదభక్తి సూత్రములననుసరించి భక్తి యొక్క పదకొండు భూమికలు ఈ విధముగా చెప్పబడినవి.

**ప్రథమం మహతాం సేవా తద్దయా పాత్రతా తతః**
**శ్రద్ధాచతేషాం దర్మేషు తతో హరి గుణ శృతిః**
**తతో రత్యం కురోత్పత్తిః స్వరూపాధిగతిస్తతః**
**ప్రేమ వృద్ధిః పరానందే తస్యా ధ స్ఫురణం తతః**
**భగవద్ధర్మ నిష్ఠాzతః స్వస్మింస్తద్గుణ శాలితాః**
**ప్రేమ్ణోzధ పరాకాష్ఠేత్యుదితా భక్తి భూమికా**

ఈ పదునొకండింటికి శాస్త్రీయో పాయములని పేరు. ఇవి క్రమంగా ఒకదాని తరువాత ఒకటి అలవడవలెను. ఇందులో చిట్ట చివరిది భగవత్ప్రేమ పరాకాష్ఠ. ఈ స్థితిలో భక్తుడు భగవద్విరహం. ఒక్క క్షణకాలం కూడా భరించలేడు. భగవంతుని దర్శనం లభించాక ఆ విరహాన్ని భరించటం దుస్సాధ్యం అనటంలో ఆశ్యర్యం లేదు. అప్పుడు కలిగే వియోగం ద్వారా భక్త్యాత్మకమైన ప్రేమ పరాకాష్ఠను పొంది ప్రకాశిస్తుంది.

మధురభక్తికి ప్రతీకలైన గోపికలు ఈ పదకొండు దశలను క్రమంగా పొంది చివరకు ప్రేమ పరాకాష్ఠతో కూడిన ఉత్తమ స్థితిని పొందగలిగారు. అందుచేతనే వారు భగవంతుడైన కృష్ణుని విరహాన్ని క్షణకాలం కూడా సహించలేకపోయేవారు. కృష్ణ దర్శనం లేని క్షణమైనా వారికొక యుగంలా ఉండేది.

ఈ విధముగా భగవంతుని తండ్రిగా, తల్లిగా, బిడ్డగా మిత్రునిగా, ప్రియునిగా, బాంధవునిగా ఏ విధంగానైనా కాని భావించి సేవించటం, ప్రేమించటం, ధ్యానించటం ద్వారా కాని, పగతో వైరంతో శతృభావంతో స్మరించటం చేతనైనాగాని ముక్తిని పొందవచ్చునని వేదాంతశాస్త్రము భక్తి మార్గమును గురించి ప్రభోదించి జీవిత పరమార్ధమైన ముక్తిని సాధించుటకు భక్తిమార్గమును ఆచరించుట ఎంత సులభమైనదో తెలియజేయుచున్నది.

**హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు**
**సంశయింపను బని లేదు**
**హరియముగాని ద్రవ్యము, పరమాణువు లేదు**
**వంశ పావన, వింటే.**

గురుశుశ్రూషయు, సర్వకర్మఫలసమర్పణము, సాధుజన సాంగత్యము ఈశ్వర ప్రతిమలను ఆరాధించుట, హరికథలను శ్రవణము చేయుట, భగవంతుని యందలి అహేతుకమైన ప్రేమ, నారాయణ గుణకర్మనామ సంకీర్తనము మొదలగు భాగవతధర్మములందు ఆసక్తి కలిగి, సర్వభూతము లందును పరమాత్మయే కలడని భావించి, కామక్రోధలోభ మోహమదమత్సరములను గెలిచి, ఇంద్రియవర్గమును బంధించి భక్తి చేయుచుండుట వలన భగవంతుని పొందగలరు.

"జ్ఞానులచే మౌనుల చే దాసులచే యోగ సంవిధానుల చేతన్
బూని నిబద్ధుండగు నే శ్రీనాధుడు భక్తియుతుల చేతంబోలెన్"

భక్తి మార్గమునకు కట్టుబడిన విధంగా భగవంతుడు మరే ఇతర మార్గము వలననూ అంత సులభముగా కట్టుబడడు.

చంచలమగు మనస్సు స్థిరమగుటకు సాధన అవసరము. ధ్యానయోగాభ్యాసమువలన మనసు చాంచల్యమును వీడి ఈశ్వరుని యందు స్థిరమగును.

"ఈ విధముగా భగవంతుని యందు మనసు లగ్నం చేయటం కుదరకపోతే ప్రతిరోజూ నన్నే స్మరిస్తూ, నా రూపాన్నే ధ్యానం చెయ్యి. ఈ ధ్యానాభ్యాసం కూడా సాధ్యం కాకపోతే నీవు చేసే పనులన్నీ నాకే అర్పించు. నాకోసం చేసే పనుల వలన నీ మనసుకు నాపై నిలిచే అభ్యాసం కుదురుతుంది. నా కోసం అలా పనులు చేయటం కూడా నీకు సాధ్యం కాకపోతే నీకోసం నీవు చేసే దినకృత్యాలన్నీ నాకు అర్పించు. ఈ రకమైన అలవాటుద్వారా క్రమక్రమంగా నాపై నీకుమనసు నిలుస్తుంది" అని శ్రీ కృష్ణ భగవానుడు అర్జునునకు బోధించాడు. ఆ విధంగా సకల మానవాళికీ కూడా చిత్తైకాగ్రత కోసం అతిసులభమైన ఉపాయాన్ని బోధించాడు శ్రీ కృష్ణపరమాత్మ.

భగవంతునికై చేసే సాధనలో కర్మఫలత్యాగం అవసరమనీ, తాను చేస్తున్నాననే కర్తృత్వాభిమానం విడిచిపెట్టాలనీ, అలా చేయటం వలన చిత్తశుద్ధి కలుగుతుందనీ పరమాత్మ ప్రబోధం.

నిష్కామ కర్మ భగవంతుని తెలుసుకోవటానికీ, భక్తి ఆయనను

దర్శించటానికి, జ్ఞానం ఆయనలో ఐక్యం కావటానికీ ఉపయోగిస్తాయని కర్మ, భక్తి, జ్ఞానముల ప్రయోజనములను గురించి వివరించాడు భగవానుడు.

"అర్జునా! నాయందే మనసు నిలిపి నాకొరకే కర్మలు చేస్తూ ఉండు. ప్రపంచ విషయములతో సంబంధం లేకుండా నన్నే స్మరిస్తూ ఉండు. సమస్త ప్రాణులయందు ద్వేషభావం లేకుండా ఆదరభావంతో ఉండు. అప్పుడు నన్నే పొందగలుగుతావు" అన్నాడు భగవానుడు.

"పనులు చేయటం కర్మ, సంస్మరించడం భక్తి, ద్వేషం లేకుండా అందరినీ సమానంగా చూడటం జ్ఞానం. ఈ మూడింటి బలం చేతనూ, వీటి అభ్యాసం వల్లనూ నిష్కామ కర్మ ద్వారా భక్తి, భక్తి ద్వారా జ్ఞానం, జ్ఞానం వలన భగవంతునిలో లీనమయ్యే మోక్షస్థితి కలుగుతుందని భగవానుడు అర్జునుని నిమిత్తముగా చేసుకుని సమస్త జనులకూ బోధించాడు' '. కర్మ, భక్తి, జ్ఞాన సమన్వయసారమే" గీతాసందేశము.

భగవంతుని చేరటానికి సగుణారాధన, నిర్గుణ ధ్యానం అను రెండు మార్గాలున్నాయి. నామరూపాలతో కూడిన ఒక స్వరూపాన్ని - రామ, కృష్ణ, శివ, శక్తి మొదలైన అనంత రూపాలలో ఏదో ఒక రూపాన్ని ఆరాధించటం సగుణారాధన. అన్ని రూపాలు, అన్ని నామాలు, అన్ని మతాలు ఒకే భగవంతుని ఉద్దేశించి ఏర్పడినవే అని భావించి గుణరహితము, నిరాకారము, నామరూపాతీతము అయిన పరమాత్మను ధ్యానించుట నిర్గుణ ధ్యానం. వీటినే సగుణోపాసన, నిర్గుణోపాసన అని అంటారు.

భక్తి, జ్ఞానము ఈ రెండూ ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. భక్తిలేని జ్ఞానం కాని, జ్ఞానంలేని భక్తి కాని భగవదనుగ్రహానికి పనికిరావు. భక్తి మొదటిదశలో నీవు వేరు, నేను వేరు అనే భావంతో ప్రారంభమై చివరకు అంతటా భగవంతుడు ఉన్నాడు, అన్నింటిలోను ఉన్నాడు కదా ! నాలోనూ ఆ భగవంతుడే ఉన్నాడు అన్న భావంతో సమదృష్టి కలిగి అంతా భగవంతుని రూపమేనన్న జ్ఞానం కలుగుతుంది. అంటే భక్తి యొక్క పూర్ణదశ జ్ఞానం అన్నమాట.

సమస్త భక్తి మార్గములు తుదకు పరాభక్తి యందు పర్యవసిస్తాయి. పరాభక్తి అన్నా, జ్ఞానము అన్నా వేరు కాదు. భక్తి మార్గములో జ్ఞానమార్గము అంతర్గతమనుకున్నా లేక జ్ఞానమార్గములో భక్తి అంతర్లీనమని అనుకున్నా

నిర్వచన భేదమే కాని అర్థం ఒకటే.

"మనస్సు నాయందే నిలిపి ఎల్లప్పుడూ నన్నే స్మరించే శ్రద్ధకల వారు భక్తులలో గొప్పవారు. ఇంద్రియములను నిగ్రహించి, ప్రపంచ విషయములయందు ఆసక్తిని విడిచి అంతటా అన్నింటిలోను శాశ్వతంగా ఉన్ననన్నే ఉపాసించు వారు కూడా నన్నే చేరతారు. కాని, ఈ రెండు పద్ధతులలోనూ మానవులకు 'నిర్గుణోపాసన' చాలా కష్టం. కనపడని భగవంతుని యందు మనసును ఏకాగ్రతతో నిలిపి ధ్యానం చేయటంలో ఎక్కువ శ్రమ ఉంది. శరీరాన్ని ఎక్కువ కష్టపెట్టవలసి వస్తుంది. దేహాత్మ భావమును విడిచిపెడితే కాని నిర్గుణోపాసన సిద్ధించదు. మనసులో ఏ విధమైన సంకల్పములు లేకుండా ఆత్మయందే మనసును లగ్నం చేస్తే కాని ధ్యానం కుదరదు. ఇది సామాన్యులకు కష్టసాధ్యము. అంతకంటె భక్తి మార్గం అందరికీ సులభమైనది" -- భగవద్గీత

చంచలమైన మనసుకు ఒక ఆధారం కావాలి. ఏదోఒక రూపాన్ని ఎదుటపెట్టుకుని ఆ రూపం వంకే చూస్తూ, ఆ రూపాన్నే భావిస్తూ దానినే మనసులో నిలుపుకోవటానికి ప్రయత్నిస్తే మనసు నిలకడగా నిలిచే అలవాటులోనికి వస్తుంది. "విగ్రహం నిగ్రహం కొరకే" కాబట్టి ఇది మానవులకు సులభమైన పద్ధతి. దీనిని "సాకారోపాసన" అంటారు. ఇదే భక్తి మార్గంలో "గౌణభక్తి" యనబడు స్థితి.

సాకారోపాసన చేయువారు విగ్రహారాధనతో పాటు "నామస్మరణము' ' కాని, మంత్ర జపమునుకాని చేస్తారు. విగ్రహారాధన రూపధ్యానమునకు, చిత్తైకాగ్రతకు ఆలంబనగా నిలుస్తుంది. నిరంతర నామస్మరణవలన భగవంతుడు, భక్తుడు స్మరించు నామావతారమును దాల్చి ప్రత్యక్షము అవుతాడు. అప్పటి నుండి నామస్మరణవలన ఐహిక ఆధ్యాత్మిక లాభము కలుగుతుంది. ఈ నామస్మరణ కన్న మరికొంత శ్రేష్ఠమైనది మంత్ర జపము. యదార్థమునకు మంత్రము నామము వంటిదే. రెంటకీ పెద్ద భేదము లేదు.

మంత్రమనునది గురూపదిష్టము, పరంపరా ప్రాప్తము, శాస్త్రచోదితము. అంతేకాక మంత్ర శాస్త్రములో ప్రతి మంత్రమునకూ ధ్యాన శ్లోకము, అంగన్యాస కరన్యాసములు, విశేష న్యాసములు, కవచము,

హృదయము, పూర్వాంగ ఉత్తరాంగములుగా ఉంటాయి. యధావిధిగా చేసినప్పుడు మంత్ర జపము తప్పక ఫలితము నిచ్చును. నారద పూర్వ జన్మవృత్తాంతము నందు ....

**"ఇతి మూర్త్యభిధానేన మంత్రమూర్తి మమూర్తికమ్**
**యజతేయజ్ఞ పురుషం ససమ్యగ్దర్శనః పుమాన్"**
**సంస్కృత భాగవతము (ప్రధమ స్కంధము 6-38)**

"మంత్ర మూర్తిం అమూర్తికమ్" అనగా మూర్తిరహితుడు (రూపరహితుడు) అయిన శ్రీమన్నారాయణుడు మంత్రమూర్తియై నారదునకు ప్రత్యక్షమైనాడు" అని చెప్పబడినది. మంత్ర జపము చేయునప్పుడు ఆ మంత్రార్ధమును తప్పక తెలుసుకొనవలెను. భక్తి శాస్త్రములో అన్ని మంత్రములకు రెండు విధములైన అర్ధమును మాత్రమే చెప్పుకుంటారు. మొదటిది "మంత్ర అధిష్ఠాన దేవత ఈశ్వరుడే. ఆయనకు నాకు గల సంబంధము నియమ్య.. నియామక భావము లేక సఖ్యావాత్సల్యాది భక్తి భావము. ఆ ఈశ్వరునే శరణు పొందుచున్నాను.'

రెండవ అర్ధము: ఆ మంత్రాధిష్ఠాన దేవత పరబ్రహ్మయే. ఆయన్న నా ఆత్మస్వరూపుడైయున్నాడు. నేను స్థూల, సూక్ష్మ, కారణ దేహధారినికాను. పరమాత్మాభిన్నుడను." ఈ రెండు అర్ధములలో ఏదో ఒక దానిని సకల మంత్రముకు తాత్పర్యముగా గ్రహించి మంత్రజపము చేస్తే అది భక్తిగా, జ్ఞానంగా పరిఢవిల్లుతుంది. (పరిణమిస్తుంది.... ప్రకాశిస్తుంది.)

అన్ని కర్మలూ నాకే అర్పించి, భక్తి శ్రద్ధలతో నన్నే సేవించువారిని ఈ సంసార సముద్రం నుండి ఆవలకు చేరుస్తానని, అభయమిస్తున్నాడు భగవంతుడు. మనస్సు, బుద్ధి భగవంతుని యందే నిలిపి, భగవదర్పణం గావిస్తే క్రమక్రమంగా భగవంతునితో సంబంధము స్థిరపడుతుంది. పంచదారను లేక ఉప్పును నీటిలో వేస్తే అది నీటి ఆకారాన్ని పొందుతుంది. అట్లే జీవుడు దేవుని యందు చేరితే దేముని ప్రశాంత స్థితే జీవునకు కూడా కలుగుతుంది.

"దేనియందు కోరిక లేనివాడు, పవిత్రభావములు కలవాడు, కష్టనష్టములతో దుఃఖమును పొందనివాడు, స్వార్ధము కొరకు ఏపనిని

ఆరంభింపని వాడు భగవంతునికి ప్రియమైన భక్తుడు. అంతేకాక రాగద్వేషములకు లొంగక, సుఖదుఃఖములకు క్రుంగక అనగా తనకు సుఖం కలగాలని తపించటం, తనకు దుఃఖం కలగకూడదని కోరుకోవటం వంటివి చెయ్యకుండా, స్వార్ధముకొరకు పుణ్యకర్మను, పాపకర్మను చేయుటవిడిచి పెట్టిన వాడు, శత్రువును మిత్రుని సమదృష్టితో చూచేవాడు, అవమానాన్ని, గౌరవాన్ని ఒకే విధంగా, ఆనందంగా స్వీకరించేవాడు, చలిని వేడిని సమంగా సహించేవాడు, దేనితోను సంబంధము పెట్టుకోక భగవంతుని మాత్రమే ధ్యానించేవాడు, నిందాస్తుతులను లెక్క చేయనివాడు, ప్రపంచ వ్యవహారాదులలో మౌనంగా ఉండేవాడు; దొరికిన దానితో, ఉన్న దానితో తృప్తి చెందేవాడు, ఈ ఇల్లు నాది, వీళ్ళు నావాళ్లు, ఇది నాది అనే మోహము, మమకారము లేకుండా ఎక్కడనైనా ప్రశాంతంగా ఉండగలవాడు నాకు చాలా ఇష్టమైన భక్తుడు" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

సంపూర్ణమైన భక్తి, విశ్వాసము, శ్రద్ధతో పరమాత్మయందే మనసును లగ్నం చేసి పైన చెప్పిన లక్షణములను అలవరచుకొని సంచరించే వారే భగవంతునికి మిక్కిలి ప్రియమైనవారు. వారే అసలైన భక్తులు. ఈ లక్షణములను అభ్యాసంతో ఆచరించేవాడు శాశ్వతమైన, అమృతమైన శాంతిని పొందగలడు. భగవంతుని అనుగ్రహమును పొందటానికి చెప్పబడిన ఈ భక్తి మార్గములలో ఏ ఒక్కదానిని అయినా పట్టుదలతో ఆచరించగలిగితే భగవంతుని దయ తప్పక పొందుతారు. కలియుగ మానవులకు జీవితపరమార్ధమైన మోక్షమును సాధించుటకు సులభమైనది ఈ "భక్తి మార్గం" అని వేదాంత శాస్త్రము బోధించుచున్నది.

ఎన్ని సుగుణములున్నా భగవత్ భజన లేకపోతే అవి విషపూరిత ఫలములవలె వెగటునే కలిగిస్తాయి. సంప్రీతిని కలిగించవు. భగవత్తత్వ శ్రవణం చేత ఆనందాశ్రువులు రాల్చలేని కన్నులు నిష్ఫలములు. ప్రహ్లాద చరిత్రయందు ప్రహ్లాదుడు చెప్పిన విధముగా ఆ భగవంతుని భజనయందు, సేవయందు వినియోగించబడని ఇంద్రియములు, ఈ దేహము, నిశ్చయముగా నిరుపయోగము. ఇంద్రియములు అన్నీ భగవన్నామంతో సంచలితం కావాలి. కేవలం నాలుక మాత్రమే కాదు. శరీరంలోని అణువణువూ బ్రహ్మానంద పారవశ్యమును పొందాలి. ఈ విధంగా చేయనప్పుడు, కళ్ళు మూసుకుని ధ్యానం చేసినా, ముక్కు మూసుకుని

జపం చేసినా ఏమి చేసినా అట్టి ఉపాసన నిర్జీవ చిత్రం వంటిదే. ఎంత అందంగా ఉన్నప్పటికీ జడ చిత్రం వలన లాభం ఏమి చేకూరుతుంది ?

ముక్తిని, శాంతిని, సౌఖ్యాన్ని పొందాలనుకుంటే భేదభావములను నిర్మూలించి సర్వత్ర బ్రహ్మ దృష్టిని కలిగి ఉండాలి. దీనికిదే ఏకైక సాధనం. సర్వమును ఆత్మ స్వరూపంగా చూచేవాడు మృత్యువునకు భయపడడు. దుఃఖము, రోగములు, అతనిని బాధించవు. ఇటువంటి వాడే సర్వజ్ఞుడు. సమస్త ప్రపంచము భగవంతుని స్వరూపమే నన్న ఆత్మ జ్ఞానము కలుగగనే ఇక తెలియవలసినది, తెలియనది ఏమున్నది ? సర్వత్ర సమబుద్ధి కలగనంత వరకు 'సమాధి' ఏ విధంగా సిద్ధిస్తుంది ? ద్వేషదృష్టిని విడువనంతవరకూ, క్షమాభావము అలవడనంతవరకూ సమాధి సంప్రాప్తి విషయం అటుంచి, ధ్యాన ధారణ కలుగటయే అసంభవం.

త్యాగపూర్ణమైన ఆత్మ సమర్పణమే, ఆత్మ నివేదనమే ఉపాసనకు ప్రాణం. ఇదిలేని ఉపాసన నిర్జీవము, నిష్ఫలము, మనము చేసే శారీరక క్రియలన్నీ కూడా ఉపాసనా రూపములు కావాలి. పైకి కనిపించాలని చేసే డాంబికరూపమైన ఉపాసన నిష్ప్రయోజనమైనది.

సర్వం బ్రహ్మమయంగా ఉన్న దృష్టిలో పోవటానికి వేరే స్థానమే లేనప్పుడు, మనస్సు ఇంకెక్కడికీ పోలేదు. అదే సహజ సమాధి స్థితి. స్వార్థరహితమై, సత్యమై, పరిశుద్ధము, అత్యుత్తమము అయినదైతే, మన ప్రార్థనను భగవంతుడు తప్పక వింటాడు. సర్వశక్తి సంపన్నుడైన పరమాత్మయందు దృఢమైన విశ్వాసం కల వాళ్ళు ధన్యులు. వారికి ఏది కావలసి వచ్చినా దైవమునుండి సాధించుకుంటారు.

"భక్త్యాత్వ నన్యయా శక్య అహమేవం విధోఽర్జున
జ్ఞాతుం ద్రష్టుంచ తత్వేన ప్రవేష్టుంచ పరన్తప"
గీత ||వ అ|| 54 శ్లో

"ఓ అర్జునా ! భగవంతునికన్న నేను ఎంత మాత్రము వేరు కాను అను దృఢమైన భావముతో కూడిన అనన్య భక్తి వలన, ఇటువంటి విశ్వ రూపము కల నన్ను తెలుసుకొనుటకు సాధ్యము అగును. తెలుసుకొనిన పిదప సాక్షాత్కారము పొందుటకు "తత్త్వతః "నా యందు ప్రవేశించి మోక్షము పొందుటకు సాధ్యమగును.

కావున నిష్కామ కర్మ ద్వారా పవిత్రమైన చిత్తమునందు ఏర్పడిన భక్తి అనన్య భక్తియై తాను, భగవంతుడు వేరు కాదను దృఢనిశ్చయము కలుగుట ద్వారా భక్తులు సులభముగా జీవిత పరమార్థమగు మోక్షమును పొంద గలుగుచున్నారు. భక్తి మార్గము సాధకులకు సులభమైనది.

మధుసూదన సరస్వతీ స్వామి అద్వైత సాంప్రదాయమునందు సన్న్యసించిన మహానుభావుడు. అయినా ఆయన కూడా భక్తి మార్గమే తనకు వరణీయమని చాటి చెప్పెను.

"ధ్యానాభ్యాస వశీకృతేన మనసా తన్నిర్గుణం నిష్క్రియం
జ్యోతిః కిఞ్చన యోగినో యది పరం పశ్యన్తి పశ్యన్తుతే
అస్మాకంతు తదేవ లోచన చమత్కారాయ భూ యాచ్చిరం
కాళిన్దీ పులినేషు యత్కిమపి తన్నీలం మహోధావతి."
"శ్రీమధుసూదన సరస్వతి"

"ధ్యానాభ్యాసము చేత వశీకృతమైన మనస్సుకల యోగీశ్వరులు సుప్రసిద్ధమైన ఆ నిర్గుణము, నిష్క్రియము అగు జ్యోతిని (పరబ్రహ్మను) చూచుచున్నారు. వారు అట్లే చూచుచుందురు గాక ! కాళిందీ నదీ తీరము నందలి ఇసుక తిన్నెల మీద ఒకానొక నీలవర్ణమైన తేజస్సు బాలకృష్ణుని రూపములో పరుగెత్తుచున్నది. మా నేత్రములకు మాత్రం ఈ బాలకృష్ణుని తేజస్సు ఎల్లప్పుడు విస్మయమును, ఉల్లాసమును కలిగించుగాక !

# చతుర్ధ అధ్యాయము
# జ్ఞాన మార్గము

## విషయము

నిష్కామ కర్మ → నిర్మల బుద్ధి → నిశ్చల భక్తి – భక్తిపరాకాష్ట స్థితి → జ్ఞానము స్వస్వరూప జ్ఞానమే ఆత్మజ్ఞానము. అనగా తనను తాను తెలుసుకొనుట. దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము – వీటన్నింటికంటె విలక్షణమైన ఆత్మకలదని, అదినిత్యము. సత్యము, నిర్వాకారము, వినాశరహితమ అని తెలుసుకొని, అట్టి ఆత్మ సర్వజీవులలో, సర్వవస్తువులలో, సర్వత్రా వ్యాపించి యున్నదను దృఢమైన భావమును కలిగియుండుట జ్ఞానము. అట్టి స్వస్వరూపమైన జ్ఞానమును పొందుటయే జన్మరాహిత్యము. అహంకారమమకారములు, రాగద్వేషములు మొదలైనవి అజ్ఞానలక్షణములు. సర్వత్రా, సర్వావస్థలయందు ఆత్మభావమును కలిగియుండుట ఆత్మజ్ఞానము.

జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానమనబడు త్రిపుటి; మనోబుద్ధిచిత్త అహంకారములనబడు అంతఃకరణ చతుష్టయము, వాటిని అధిగమించుటకు చేయవలసిన సాధన, సప్తజ్ఞానభూమికలు, సాధన చతుష్టయసంపత్తి, సగుణ, నిర్గుణ బ్రహ్మాజ్ఞానము, సృష్టిక్రమము, పంచీ కరణము, ఆత్మ విచారణ, గురువుయొక్క ఆవశ్యకత, జన్మకర్మసిద్ధాంతము, జ్ఞాని లక్షణములు, కోహం విచారణ మొదలగునవి.

# జ్ఞానమార్గము

నిష్కామకర్మ, భక్తిమార్గముల ద్వారా జీవిత పరమార్థమైన జన్మరాహిత్యమును పొందుట అనగా ముక్తిని పొందుట గురించి బోదించిన పిమ్మట జ్ఞానమార్గము ద్వారా ముక్తిని పొందుట గురించి వేదాంత శాస్త్రమునందు బోధింపబడిన విషయములను గురించి ఇక పరిశీలిద్దాం.

నిష్కామ కర్మద్వారా కలిగిన చిత్తశుద్ధి, దానివలన భక్తి, భక్తి యొక్క పరాకాష్ట వలన జ్ఞానము కలుగుతుంది.

**కర్మణా జాయతే భక్తిః భక్త్యా జ్ఞానమ్ ప్రజాయతే**
**జ్ఞానాదేవతు కైవల్యమ్ ఇతి వేదాన్త డిణ్డిమః**
**శ్రీశంకరాచార్య**

దేహము, ఇంద్రియములు, మనస్సు. బుద్ధి వీటన్నింటికంటె విలక్షణమైన ఆత్మ ఒక్కటి కలదని, అది నిత్యము - సత్యము - నిర్వి కారము – వినాశరహితము అని తెలిసికోని అట్టి ఆత్మ సర్వ జీవులలో, సర్వవస్తువులలో సర్వత్రా వ్యాపించి యున్నదను దృఢమైన జ్ఞానమే జ్ఞానము.

జ్ఞానము రెండు విధములు. ఒకటి వస్తుజ్ఞానము 2. రెండవది యధార్థజ్ఞానము. కనిపించే ఆకారమును గుర్తించుట వస్తుజ్ఞానము కనిపించే ఆకారములో కనిపించని నిర్వికారమైన, నిరాకారమైన మూలతత్త్వమును గుర్తించుట యథార్థజ్ఞానము. అనగా వస్తువులయందు వస్తుదృష్టితో కాకుండా బ్రహ్మదృష్టి కలిగి ఉండుట. ఇట్టి యధార్ధ జ్ఞానమే పరాకాష్ఠ భక్తి. "కన్న విన్న వస్తువులందు వస్తుదృష్టిచేసి వాంఛ ఇడడు" అని భాగవతములో చెప్పబడిన ప్రహ్లాదుని పరాభక్తి ఇట్టి యదార్ధజ్ఞానమే. ఇట్టి జ్ఞానమును సంపాదించుటయే జీవిత పరమార్థము. ఒక ఆభరణమునందు నామరూపవిశిష్టమైనది ఆభరణ జ్ఞానము, ఆవస్తువును చూచుట వలన కలుగును. ఆ ఆభరణము బంగారముతో చేయబడినదను జ్ఞానము యధార్థజ్ఞానము. యధార్థ జ్ఞానము బుద్ధిచే గ్రహించబడునది. వస్తుజ్ఞానము చక్షువులచే గ్రహించబడునది. జగద్గురువులు ఆది శంకరాచార్యుని శిష్యులైన

శ్రీసురేశ్వరాచార్యులు వ్రాసిన "నైష్కర్మ్య సిద్ధి" అనే గ్రంథంలో ఇలా వ్రాశారు.

"ఈ సృష్టిలోని ప్రతిజీవీకూడా ఏదో ఒక విధమైన దుఃఖమును అను భవించుటం మనం చూస్తూనే ఉన్నాము. ఏదో ఒక లోటు, బాధతో ఏదో ఒక కారణంగా జీవుడు దుఃఖిస్తూ ఉండటం జరుగుతోంది. ఈదుఃఖానికి కారణం ఏమిటి ?

"దుఃఖస్య కారణమ్ కిమ్ ?"

దుఃఖానికి కారణం ఏమిటని విచారిస్తే దుఃఖమునకు కారణం జన్మ అని తెలుస్తున్నది. జన్మే లేకుంటే జీవికి దుఃఖమే ఉండదుకదా ః మరి ఈజన్మ ఎందుకు కలుగుతున్నది ? దుఃఖ కారణమైన జన్మకి కారణం కర్మ. జీవి కర్మలను చేయటానికి కారణం సంకల్పం. మంచి సంకల్పంతో చేస్తే అది మంచిపని (సత్కర్మ), దురుద్దేశంతో చేస్తే అది చెడ్డపని (పాపకర్మ) ఈమంచి చెడు కర్మలవలన పుణ్యము, పాపము అనే ఫలం జీవుడు అనుభవించవలసివస్తున్నది. అయితే కర్మ చేయాలనే సంకల్పం జీవునకు ఎందుకు కలుగుతోంది ? ఏదైనా విషయం పట్ల కలరాగమో, ద్వేషమో, సంకల్పానికి కారణం అవుతోంది. ఇష్టమైనది, ఏదైనా లాభం కలిగించే పని అయితే, ఆపని పట్ల రాగం, అలా కాక కష్టమూ నష్టమూ కలిగించేపని అయితే ద్వేషమూ కలుగుతున్నది. మనసులోని అనుకూల ప్రతికూల భావాలే ఈరాగద్వేషములు కలగటానికి కారణం.

కొన్ని విషయముల పట్ల రాగము, మరికొన్ని విషయముల పట్ల ద్వేషము కలగటానికి మన అజ్ఞానమే కారణం. అజ్ఞానమునకు కల లక్షణములు రెండు. 1. ఆత్మ యొక్క యదార్థస్వరూపము తెలియకపోవుట. దీనిని ఆవరణశక్తి అంటారు. 2. తాను కాని వాటి యందు ఆత్మ అనుభావము. తనవికాని వాటియందు మమకారము ఉండుట-దీనిని విక్షేపశక్తి అంటారు. ఈఆవరణ విక్షేపశక్తులను "అజ్ఞానము" లేక అవిద్య అంటారు. అసలు విషయములోని యధార్ధ జ్ఞానమును కలిగి ఉండకపోవటంచేత జీవునకు ఆయా విషయములపట్ల "ఇది నాకు అనుకూలమైనది" అన్నభావంతో అనురాగమూ, ఇది నాకు ప్రతికూలము

అనే భావంచేత ద్వేషమూ కలగటం జరుగుతున్నది. ఉన్నదానిని ఉన్నట్లుగా తెలుసుకోలేకపోవటమే అజ్ఞానం. ఈఅజ్ఞానమనే వేరు దుఃఖమనే ఫలమును కలుగజేస్తున్నది. అందువలన అజ్ఞానమనే వేరును నరికివేస్తే సంసారమనే వృక్షమూ పెరగదు. దుఃఖమనే ఫలమూ ఉండదు. అజ్ఞానమును సమూలంగా పెరికి వేయటమే దుఃఖమునకు నివారణ. జ్ఞానము అనేది మనకు సహజంగా ఉన్నసంపద. మనలో నిరంతరం జ్ఞానజ్యోతి వెలుగుతూనే ఉంటుంది. కాని, లాంతరు చిమ్నీ మసిబారి పోవటంవలన దీపం వెలుగు కనిపించనట్లుగానే అజ్ఞానమనే చీకటి ఆవరించి ఉండటంచేత మనం మనలో వెలిగే ఈజ్ఞానజ్యోతి ప్రకాశాన్ని తెలుసుకొనలేకపోతున్నాము.

అజ్ఞానపు ఆవరణను తొలగించివేస్తే జ్ఞానజ్యోతి ప్రకాశం దేదీప్యమానమవుతుంది. ఈజ్ఞానము అనేది సాధ్యము నిత్యము. సత్యము. దీనిని తెలుసుకొనటానికి చేసే సాధన ధర్మ్యము. క్రొత్తగా సంపాదించుకునే ప్రతి వస్తువూ నశించిపోయేదే. కాని స్వతఃసిద్ధంగా ఉన్న ఈజ్ఞానాన్ని తెలుసుకుంటే, అది శాశ్వతమైన ముక్తిని ప్రసాదిస్తుంది. ఆవిధంగా మరొకజన్మలేకుండా ముక్తిని పొందుటయే మానవజీవిత పరమార్థము.

భక్తి పరాకాష్ఠస్థితికి చేరుకున్నప్పుడు ఈకనబడే చరాచర విశ్వమంతా భగవత్స్వరూపంగా గోచరిస్తుంది. అంతేకాక ఆపరమాత్మ ఎవరో కాదు ... అది నీవే (తత్త్వమసి) అన్న తత్త్వం బోధపడి జ్ఞానజ్యోతి ప్రకాశిస్తుంది. "నేనే బ్రహ్మము (అహంబ్రహ్మాస్మి)" అనే భావం దృఢమైనప్పుడు ఇక రెండవది ఏదీ ఉండదు. ప్రజ్ఞానమే బ్రహ్మస్వరూపంగా భాసిస్తుంది. (ప్రజ్ఞానం బ్రహ్మ) హృదయాకాశంలో స్ఫురించే ఈ ఆత్మయే భగవంతుడు 'అయమాత్మాబ్రహ్మ' అని తెలుస్తుంది. అప్పుడు సర్వం – అనగా ఈ ప్రపంచమంతా బ్రహ్మమయంగా గోచరిస్తుంది.

**"సర్వంఖల్విదంబ్రహ్మ"**

జ్ఞాన మూలంగా భగవంతునితో అనుసంధానం చెందుటయే జ్ఞానయోగము. బ్రహ్మసాక్షాత్కారమే జ్ఞానయోగి ఆశయం.

**"అథాZత ఆదేశో నేతి నేతి అథవా సఏష నేతినేత్యాత్మా"**

**"బృహదారణ్యకము"**

నేతి ... నేతి, ఇదికాదు .. ఇది కాదు అంటూ ఒకదాని వెంట ఒకటిగా అసత్యమైన విషయములను విడిచివేయవలెను. అప్పుడు సదసద్విచారము నిలిచి పోవు స్థితిని పొందును. అంతట సమాధిస్థితిలో వానికి బ్రహ్మసాక్షాత్కారం (ఆత్మసాక్షాత్కారం) లభిస్తుంది. ఇదికాదు ... ఇది కాదు అన్నదంతా కూడా అధిష్ఠాన రూపంలో బ్రహ్మస్వరూపంగానే భాసిస్తుంది.

అనుభవముచే తెలుసుకున్నప్పుడు ధ్యానముచే కలుగు జ్ఞానము ఒక విధమైనదని, వివేచనముచే కలుగు జ్ఞానము మరొక విధమైనదని, సాక్షాత్కారసంజనితమైన జ్ఞానము వేరు అనీ శ్రీరామకృష్ణ పరమహంస గ్రహించిన విషయం.

ఈశాస్త్ర జన్యమైన విషయమును, వివేచన చేత దృఢపరుచు కున్నప్పుడు ఏర్పడు జ్ఞానమును సూక్ష్మజ్ఞానము అని అంటారు. బ్రహ్మను గురించి మహావాక్యముల సహాయముతో ధ్యానముచేసినప్పుడు ఏర్పడు జ్ఞానమునే బ్రహ్మాకారవృత్తి అంటారు. పరోక్ష జ్ఞానమూ వృత్తి సహిత జ్ఞానమే. ధ్యానమువలన ఆవిర్భవించిన జ్ఞానమూ వృత్తి సహిత జ్ఞానమే. అయినప్పటికీ రెంటికీ భేదం వున్నది. పరోక్షజ్ఞానములో శాస్త్రజన్యములైన భావములు ఉన్నప్పటికీ వాసనాక్షయము కాకపోవుటవలన దేహాత్మవాసనా సహితమైన మనస్సు ఉండును. ధ్యానజ్ఞానమునందు బ్రహ్మాకారవృత్తి ఏర్పడుటవలన, మనస్సు బ్రహ్మాకారమును లేక పూర్ణస్వరూపమును పొందియుండును. అయినప్పటికీ ఇట్టి స్థితి శాశ్వతముగా ఉండక, రాకపోకలు కలిగినదై ఉండును. అనగా లోకవాసన ఉదయించి మరల పరిచ్ఛిన్నమైన మనస్సు అప్పుడప్పుడు కనబడుతూ ఉంటుంది.

అపరోక్షజ్ఞానము కలిగినప్పుడు బుద్ధియొక్క మాధ్యమము (medium) లేకుండా పరబ్రహ్మను సాక్షాత్తుగ (directly) జ్ఞాని తెలుసుకుంటాడు. అనగా అంతవరకూ బుద్ధి ద్వారా గ్రహించుచున్న విషయమును బుద్ధిసహాయములేకుండా ఆత్మచైతన్యము స్వతంత్రముగా తెలుసు కుంటుంది. ఇట్టివానికి ఇక 'చ్యుతి' ఉండదు కనుక 'అచ్యుతుడు' అని అంటారు. "నసః పునరావర్తతే" అనుశ్రుతి ఇట్టి అపరోక్షజ్ఞానిని గురించియే చెప్పుచున్నది. జ్ఞానమును గురించి చెపుతూ శ్రీరామకృష్ణ పరమహంస

ఇంకా ఇలా అన్నారు.

"తారతమ్యము చేతకాని, స్వభావముచేతకాని, జ్ఞానము అనేక విధములు, ఇందు మొదటిది సామాన్యులగు లౌకికుల జ్ఞానము. ఇది అంతనిశితమైనదికాదు. పటువైనదికాదు. ఇది గదిలోనున్న దీపము వంటిది. దాని ప్రకాశము గదిలో మాత్రమే ఉండును. భక్తుని జ్ఞానము ఇంతకంటె ప్రకాశవంతమైనది. ఇది వెన్నెల వంటిది. వెన్నెల చే గది లోపలి వస్తువులును, వెలుపలి వస్తువులు కూడా కనిపించును. కాని, అవతారపురుషుని జ్ఞానమో, సూర్యతేజమువలె అఖండ ప్రకాశ మానము. అతడు కేవలము జ్ఞానభాస్కరుడు వాని జ్ఞాన తేజము యగయుగముల నుండియు జనులను ఆవరించియున్న అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయును."

భగవంతుడు మనకు బాహ్యమున దూరముగా ఉన్నట్లు తోచునంతవరకు ఉండునది అజ్ఞానవే. అంతరంగమున భగవత్సాక్షాత్కారమును పొందునపుడు ఉండునది నిజమైన జ్ఞానము. హృదయములో భగవంతుని గాంచినవానికి బాహ్యప్రపంచమునందంతటను భగవంతుడు గోచరించును. హృదయంలో భగవంతుని దర్శించలేనివాడు బాహ్యమున ఎన్నటికీ చూడలేడు.

"హృద్యన్తర్జ్యోతిః" – శ్రుతి. మానవుడు బాహ్యమున అన్వేషించు దైవము హృదయమునందే కలదు. కాని, అంతరాత్మను తెలుసుకోలేక జీవుడు అందుకొరకై ఎందెందో వెతుకుచూ, తిరుగుతూ ఉంటాడు. "ఉయ్యాలలో బిడ్డను పెట్టుకుని ఊరంతా వెతకటం" అంటే ఇట్టిదే. తనలోని అంతరాత్మరూపుడగు పరమాత్మను గుర్తించలేక, జీవుడు బయట ప్రపంచంలో ఆ భగవంతునికై వెతుకుతూ ఉంటాడు.

జ్ఞానము ఏకత్వమునకు, అజ్ఞానము భిన్నత్వమునకు దారితీయును. భిన్నత్వములో ఏకత్వమును దర్శించుటయే జ్ఞానము.

"One in All and All in One".

జ్ఞానమును గురించిన విచారము రెండు విధములు. ఆరోహణము అవరోహణము. ఆరోహణ విచారము చేత జిజ్ఞాసువు సృష్టిని ఆధారముగా

చేసుకుని సృష్టికర్తను అనగా కార్యమునుండి కారణమును ఊహించును. అప్పుడు అవరోహణ విచారము ప్రారంభమగును. ముందు బ్రహ్మమును పొంది విశ్వమునందలి ప్రతికార్యమునందును, ప్రతి అంశమునందును వాని వ్యక్తీకరణమును, రూపమును చూచుట నేర్చుకొనును. ఆరోహణ విచారముచేత బ్రహ్మను తెలుసుకొనువాడు ఒక్కొక్క మెట్టును ఎక్కి మేడపైకి వెళ్ళు వానితో పోల్చినారు శ్రీరాకృష్ణ పరమహంస.

సాధకుడు నేను దేహమునుకాను, నేను ప్రాణమును కాను, మనస్సును కాను, బుద్ధినికాను అనుచు విచారించుట చేత ఆత్మదర్శనము అపరోక్షముగా పొందును. ఇట్టివానినే జ్ఞాని అని అంటారు. మరలపైనుంచి బుద్ధి బ్రహ్మస్వరూపమే, మనసు బ్రహ్మస్వరూపమే, ప్రాణము, దేహము, జగత్తు అంతా బ్రహ్మస్వరూపమే అని తెలుసుకొనుటను మేడనుండి క్రిందికి ఒక్కొక్క మెట్టుతో దిగివచ్చుటతో పోల్చినారు. ఈవిధముగా జగత్తు నంతటినీ బ్రహ్మముగా తెలుసుకొనువానిని విజ్ఞాని అంటారు. అయితే ముందు ఆరోహణమార్గముచే పైకి వెళ్ళినవాడు మాత్రమే అవరోహణమార్గముచే తెలుసుకొనుటకు అర్హు డు. "అహంబ్రహ్మాస్మి" అని ఆత్మ సాక్షాత్కారము పొందిన వాడు మాత్రమే "సర్వంఖల్విదంబ్రహ్మ" అను సాక్షాత్కారమునకు అర్హు డు. అట్టి జ్ఞాని ప్రపంచములోని ప్రతివస్తువు, ప్రతిజీవి భగవంతుని స్వరూపునిగను, ప్రతిపనీకూడా దైవకార్యముగను భావించును.

"శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రన్థకోటిభిః
బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః"
శ్రీశంకరాచార్య.

"ఆత్మావా అరే ద్రష్టవ్యఃశ్రోతవ్యో మన్తవ్యో నిధి ధ్యాసితవ్యః"
బృహదారణ్యక శ్రుతి.

బ్రహ్మమే సత్యము. ప్రపంచము అసత్యము, మిధ్య అను ఉపనిషద్వాక్యముల అర్థమును ముందుగా వినవలయును. అది శ్రవణము. విన్నదానిని గూర్చి తరువాత మననము చేయవలయును. మననము చేసినదానిని ఏకాగ్రతతో ధ్యానము చేయువలయును. మనస్సును అసత్యమగు ప్రపంచమునుండి మరల్చి సత్యమగు బ్రహ్మముపై నిలుపవలెను. ఇదే వేదాంత విచారక్రమము. కేవలము తత్త్వమును విని,

బుద్ధిశక్తిచే గ్రహించి అసత్తగు ప్రపంచమును విడుచుటకు ప్రయత్నించనిచో అట్టి జ్ఞానమువలన ఏవిధమైన లాభమూ ఉండదు. అది లౌకికుల ధోరణి. తత్త్వమును తెలుసుకొనుటకు ఇది సహాయపడదు. దృఢ నిశ్చయము, వైరాగ్యము, త్యాగము – ఇవియే కావలసినవి. ఇట్టివి లేనిదే తత్త్వమును దర్శించలేము. అలాకాకుండా ఊరికే "బ్రహ్మము సత్యము – జగత్తు మిధ్య అని చెప్పటం కేవలం చిలకపలుకులు పలకటం వంటిదే.

కలియుగమున ఈజ్ఞానయోగము ఎంతో దుర్లభము. కలియుగ మానవులు దుర్బలురు. అల్పాయుష్కులు, అన్నగతప్రాణులు. జ్ఞానయోగ సాధనకు ఇది చాలదు. అంతేకాక మనలను ఆవేశించియున్న దేహాత్మ భావమును వదుల్చుకొనుట ఇంచుమించు అసాధ్యము.

"నేను ఈదేహమును కాను. అఖండ బ్రహ్మమును, సచ్చిదానందమయ పరమాత్మను. దేహమును నేను కాకుండుటచే క్షుత్పిపాసలు జనన మరణములు మొదలగు శరీరధర్మములు ఏవియు నావి కావు " అని జ్ఞానయోగికి నిశ్చితమైన అభిప్రాయము కలుగవలెను. జ్ఞానాగ్నిచే దేహాత్మ భావమునశించవలెను.

ఏ కొద్దిమందో జ్ఞాన ప్రాప్తికి అర్హులై ఉంటారు. 'వేలకొలది జనులలో ఒకానొకడు నన్ను పొందుటకు ప్రయత్నించును. అట్టివారిలో ఒకానొకడు మాత్రమే నిజముగా నన్ను తెలుసుకొనగలుగుచున్నాడు." అని భగవానుడు గీతలో తెలిపియున్నాడు.

**"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః"**
**భగవద్గీత 7అ. 3వశ్లో.**

సంసారము పట్ల, విషయ భోగములపట్ల ఆసక్తి, వ్యామోహము తగ్గినకొలదియు మానవుని జ్ఞానము వికసించుచుండును. నిజమైన జ్ఞానమునందు అహంకారము కొంచెము కూడా ఉండదు. సమాధి స్థితి లభించనిదే తత్త్వజ్ఞానము కలుగదు.

అనేకత్వము యొక్క స్ఫురణయే అజ్ఞానము. భగవంతుడు సర్వాంతర్యామి అను దృఢమైన జ్ఞానము, నిశ్చయము, అనేకత్వమునందు

ఏకత్వము కలదను వాస్తవిక దృష్టి 'ఐక్య జ్ఞానము' అనబడును. భగవంతుని చక్కగా తెలుసుకొనుటయే విజ్ఞానము.

"సర్వభూతేషుయేనైకం భావమవ్యయ మీక్షతే
అవిభక్తం విభక్తేషుతద్ జ్ఞానం విద్ధిసాత్త్వికమ్"
గీత 18 అ 20 శ్లో

"ఏ జ్ఞానముచేత నరుడు భిన్నములైన సర్వభూతములందును అఖండమైనదియు, నాశరహితమైనదియు, ఏకమైనదియును అగు పరమాత్మ స్వరూపమును కనుగొనునో అట్టి జ్ఞానమును "సాత్త్వికజ్ఞానము' ' అందురు." ఇట్టి జ్ఞానమును పొందుటకు పుస్తకపాండిత్యము మాత్రమే చాలదు. అనుభవము ప్రధానము. భావము ప్రధానము.

ఏ వేదంబు పఠించె లూత ? భుజంగంబే శాస్త్రముల్చూచె ? దా
నే విద్యాభ్యాసనం బొనర్చెగరి ? చెంచే మంత్రంబూహించె ? బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా కావు ! నీపాదసం
సేవాసక్తియే కాక జంతు సంతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా
ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర శతకము

ఏ విద్యాభ్యాసము, శాస్త్ర పాండిత్యమ లేని సాలెపురుగు, పాము, ఏనుగు, బోయవాడు పరమేశ్వరుని తమ భక్తిచే సేవించి మోక్షమును పొందలేదా ! భగవంతుని పాదములయందు అనన్యమైన భక్తి తప్ప చదువు, శుష్క పాండిత్యము పనికిరావు. అనన్యమైన భక్తి వలన మాత్రమే బ్రహ్మ జ్ఞానము కలుగును.

సత్యము, అనంతము, ఆనందమయమునగు బ్రహ్మ జ్ఞానానుభూతియే జ్ఞానము ఆత్మవిజ్ఞానము స్వయంసిద్ధము. అందుచేత స్వప్రయత్నమే దానికి మూలాధారము. వేరొక మార్గము లేదు. జ్ఞానమునకు దృఢమైన వైరాగ్యము ముఖ్యము. వైరాగ్యము అనగా కేవలము భోగములపట్ల ఆసక్తిపోవుట మాత్రమేకాదు. జ్ఞానాన్వేషణతో కలిగిన వైరాగ్యమే అసలైన వైరాగ్యము. మిగతా వైరాగ్యములలోని వైరాగ్యము తాత్కాలికమైనది ... నేతి బీరకాయలో నేతి వంటిది.

జన్మించిన ప్రతిప్రాణీ జన్మహక్కు ఆత్మ స్వాతంత్ర్యము అందునా

కర్మభూమి యగు భారతదేశమున పుట్టికూడా మోక్షమును పొందుటకు ప్రయత్నించని వారి జన్మవ్యర్థము.

భారతదేశము కర్మభూమి, అనేక విధములైన మతములు, భిన్న సాంప్రదాయములు కల ఈదేశమునందు ఆధ్యాత్మికపురోగతికి అనేక మార్గములను వివరించు గ్రంధములు అనేకములున్నవి. ఆయాధ్యాన మార్గములను అవలంబించు సాంప్రదాయములు నేటికినీ నిలిచియున్నవి. అందుచేతనే ఆధ్యాత్మిక సాధన దృష్టిలో భారతదేశమునందు జన్మించుట ఆధ్యాత్మిక పురోగతికి చక్కని అవకాశము. ఈదేశమునందు జన్మించి కూడా మన సంస్కృతికి దూరమై తత్త్వాన్వేషణ చేయలేకపోయినచో ఇక భోగభూములైన ఇతర దేశములలో పుట్టినవారు ఆత్మాన్వేషణ ఎట్లు చేయగలుగుదురు ?

ఈశరీరము పతనము చెందకముందే ఆత్మజ్ఞానమును పొందుట మంచిది లేకున్నచో జీవుడు సృష్టిలో నానాలోకములందు, నానా ఉపాధులందు జన్మమెత్తవలసి వచ్చును.

మనస్సునందలి కోరికలే వాని ఫలములనొసగుచుండును. కావున మనసు నందెప్పుడును మంచికోరికలనే కోరవలెను. అంతేకాని చెడ్డకోరికలను కోరరాదు. దుష్టసంకల్పములు చేయరాదు. ఆకోరికయే జ్ఞానాగ్ని అయితే దారువులోపుట్టిన అగ్ని దారువును దహింప చేయునట్లు మనలోని పాపములను దహింపచేయుటయే కాకుండా పునర్జన్మ లేకుండా చేసుకొనవచ్చును.

సర్వకర్మలు జ్ఞానాగ్నిలో భస్మమగును.

**"జ్ఞానాగ్ని సర్వ కర్మాణి భస్మసాత్కురుతే తథా"**
**గీత 4-37**

**"గచ్ఛన్త్య పునరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః**
**గీత 5-17**

**సర్వకర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే**
**గీత 4అ 33 శ్లో**

జ్ఞానముచేత సకల పాపములను నశింపచేసుకున్నవారు పునరావృత్తి రహితమైన మోక్షపదమును పొందుచున్నారు. తిరిగివారు. జననమరణ పరిభ్రమణము నందు చిక్కుకొనరు. అట్లు మరల జన్మను పొంద కుండుటయే ముక్తిని పొందుట. అదియే జీవిత పరమార్ధము.

**"భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిద్యన్తే సర్వ సంశయాః**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"**
**ముండకోపనిషత్తు.**

"హృదయగ్రన్థి భేదింపబడుచున్నది. సమస్త సంశయములు ఛేదింపబడుచన్నవి., కర్మలు నశించుచున్నవి.

బ్రహ్మ సాక్షాత్కార రూపమగు జ్ఞానాగ్నిచే దగ్ధమైనందువలన పూర్వోత్తర పాపములు జ్ఞానికి లేవు. తరువాత చేయబడు పుణ్యముతో సంబంధము కలుగదు. ఇది పరమ సత్యము. జ్ఞానికాగోరువాడు నిరంతరము వేదాంత శాస్త్ర విచారణము చేయవలెను. గురువును, ఈశ్వరుని జ్ఞాని మనో వాక్కాయ కర్మలచే సేవించుచునే యుండును. ఈక్రింది విషయమును జాగ్రత్తతో గుర్తుంచుకొనవలయును.

**"భావాద్వైతం సదాకుర్యా త్క్రియాద్వైతం నకర్హిచిత్**
**అద్వైతం త్రిషులోకేషునాద్వైతం గురుణాసహా"**

"భావాద్వైతమునే ఎల్లప్పుడు చేయవలయును. అనగా మనసునందు అద్వైతము మననము చేయవలెను. కాని, క్రియాద్వైతమును చేయకూడదు.. మూడులోకములందున్న వారితోను అద్వైతమును భావింపవలయును. కాని, గురువుతో అద్వైతమును భావింపరాదు. అనగా గురువు యెడల శుశ్రూషాభావము, భక్తిభావము మాత్రమే కలిగి యుండవలెను. లేనిచో సాధన యందు పురోభివృద్ధి కలుగదు.

పరిపూర్ణమైన విజ్ఞానము కలిగిన యోగి జ్ఞాన నేత్రమున తనయందే సర్వజగత్తును, సర్వమును ఆత్మరూపముగా వీక్షించును. జ్ఞానము అనగా కేవల పుస్తక పఠనము కాదు. మంచి నడవడి లేనిదే జ్ఞానబీజము నాటబడదు. ఇది వేదశాసనము.

**"నా విరతో దుశ్చరి తాత్ నాశాన్తో నాసమాహితః**
**నా శాన్తమనసో వాపి ప్రజ్ఞానే నైన మాప్నుయాత్**
**కఠోపనిషత్తు I-2-24.**

"ప్రకృష్టమైన జ్ఞానముచేత మాత్రమే పొందదగిన ఈఆత్మను – పాప కర్మలనాచరించుట మాననివాడు, అట్టి పాపకర్మల వలన శాంతుడు కానివాడు, చిత్తైకాగ్ర్యము లేకపోవుటచే సమాహిత చిత్తము లేనివాడు, శాన్తమనస్కుడు కానివాడు – ఇటువంటి వారు, ఎన్నడూ తెలుసుకొనలేరు.' ' అందుచేత ఆత్మయొక్క తత్త్వము జ్ఞాని నుండి ప్రయత్న పూర్వకముగా తెలియదగినదే కాని ఇతరత్రా లభించునది కాదు. జ్ఞాని వద్దమాత్రమే సందేహ నివృత్తి పూర్తిగా కలుగుతుంది. అంతేకాని కేవలము పుస్తకములు చదివి ఆత్మజ్ఞానమును గురించి మాట్లాడుట అనగా నీటి ఒడ్డున కూర్చుని ఈతగురించి మాటాడుట వంటిదే.

శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మొదలగు ఉపాధులు లేనిదియును, సర్వదా చైతన్య రూపమును అగు పరబ్రహ్మమే నేను అని గ్రహించిన వ్యక్తి తనను ఒకానొక వర్ణమునకు గాని, ఆశ్రమమునకు గాని సంబంధించినట్లు ఎట్లు చెప్పుకొనగలడు ? – "బ్రహ్మేనుచిన్తనమ్"

విశుద్ధమైన అంతరాత్మను గాలియందు ధూళివలె సత్త్వరజస్తమో గణములు ఆవరించును. ఎంత శాంతచిత్తులకైనను దేహాభిమానమును త్యజించుట కష్టము.

**"సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి**
**ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కింకరిష్యతి"**
**భగవద్గీత 3అ -33శ్లో.**

ఇంద్రియములు వాటికి అనురూపమైనట్టి చేష్టలను, వాటి వాటి స్వకీయ ప్రకృతిననుసరించి చేయుచుండును. జ్ఞానవంతునకైనను, మూర్ఖునకైనను ఇంద్రియములు వాటి స్వభావమును అనుసరించియే ఉండును. బలవంతముగా వాటిని నిషేధించి నిగ్రహించుటవలన ఏమిప్రయోజనము కలుగును ?

అనగా ఇంద్రియ నిగ్రహము వద్దని చెప్పుట లేదు. ఒక సాధకునికి ఏదైనా ఒక పండును తినవలెనని కోరిక కలిగెననుకొందము. అతడు ఇప్పుడు రెండు మార్గములను అనుసరించవచ్చును. ఆపండును తిని అందువలన ఆకోరిక తీరినదని భావించుట ఒక మార్గము. ఇది అనుభవ విరుద్ధము. ఎందువల్లననగా పండును తినుట వలన తాత్కాలికముగా కోరిక ఉపశమించినను తరువాత మరల ఇంకొక పండును తినవలెనను కోరిక కలుగును. దీనినే "పూర్వ వాసనచే కోరికలు ఉదయించుట" అందురు. నేతిని అగ్నిహోత్రములో పోయుటచే అగ్ని మరింత మండునే కాని ఎన్నటికిని చల్లారదు. అట్లే విషయోపభోగములచేత కోరికలు నశింపవు. సాంసారికమైన కోరికలు శరీరపరిణామముచే వృద్ధాప్యము నందు ఉదయింపక పోవచ్చును. ఉదాహరణకు బాల్యావస్థయందు ఆటలపట్ల ఆసక్తి ఉంటుంది. వయసు పెరిగిన తర్వాత వృద్ధాప్యంలో ఆటలపట్ల ఆసక్తి తగ్గవచ్చు లేక పూర్తిగా పోవచ్చును. కాని, అంతమాత్రము చేత బుద్ధియందు ఆ వాసన పోయినట్లు లెక్కకాదు. ఈవాసనలు అచేతనమైన బుద్ధి '(Unconscious mind) అర్ధచేతనమైన బుద్ధి (sub conscious Mind) లో భాగంగా మారిపోయి, మరల జన్మఎత్తినపుడు అనుకూలమైన దేహ పరిస్థితులు, అనుకూలమైన పర్యావరణము ఉన్నపుడు మరల బలమైన కోరికలుగా విజృంభిస్తాయి. కాబట్టి విషయములను అనుభవించుటవలన కోరికలు తీరవు.

రెండవమార్గము ఏమనగా ఇంద్రియనిగ్రహము, హఠయోగము నందు, పతంజలి యోగసూత్రములందు యోగమనగా చిత్త వృత్తి నిరోధమని చెప్పబడినది. అందుచేత మనసులోని కోరికలను బలముగా అణచుకొనుట. ఇంద్రియ మనోవృత్తులను దృఢమైన బద్ధి సహాయముతో నిగ్రహించుట వలన ఇట్టి ఇంద్రియ నిగ్రహము కలుగును. చిత్తవృత్తి నిరోధమన్నా, చిత్తవృత్తి నిగ్రహమన్నా ఒకటే అర్ధము. దీనినే ఆంగ్ల భాషలో "Repression" అంటారు. ఈమార్గమున సాధకుని చేతనలో అంతర్యుద్ధము ఆరంభమగును.

ఇంద్రియములు, మనస్సు ఒకవైపున ఉంటాయి. ఆమార్గమే మంచిదన్న ఆకర్షణకు లోనైన బుద్ధికూడా ఆవైపునే ఉంటుంది. కోరికలను

నిగ్రహించాలన్న బుద్ధి వ్యతిరేకముగా నిలిచిపోరాడుతుంది.

అంతర్యుద్ధములో జయాపజయములు అనిశ్చితములేకాక తాత్కాలికములు మాత్రమే. ఎంతోకాలం నిగ్రహించుకోగలిగిన వాడుకూడా ఏదో ఒక రోజున ఓడిపోవచ్చును.

మూడవమార్గమేదనగా ఈ అంతర్యుద్ధమునందు జయాపజయములు దైవాధీనములని గుర్తించుట. ఏదో ఒక మంత్ర జపము చేస్తూ భక్తి మార్గంలో ఉండి భగవంతుని శరణు పొందితే నిశ్చయముగా జయము లభిస్తుందని భక్తి మార్గమునందు చెప్పబడినది.

**"యమనియమాది యోగముల నాత్మ నియంత్రిత మయ్యు గామరో**
**షములబ్రచోదితం బయగు శాంతి వహింపదు విష్ణు సేవ చేఁ**
**గ్రమమున శాంతి గైకొనిన కైవడి నాదు శరీర జన్మక**
**ర్మముల రహస్యమెల్ల ముని మండన చెప్పితి నీవు కోరినన్"**

**భాగవతము 1 వ స్కంధము - 13వ పద్యము.**

ఇక నాలుగవ మార్గము జ్ఞానమార్గము. ఇది సులభమైన, సరైన మార్గము. దృష్టిని నిరాకారము,నిర్గుణమునగు ఆత్మయందుంచుట, దేహాత్మ భావమును విడనాడుట ఇందు ముఖ్యము. ఈ మార్గములో విషయాకర్షణలను అనుమతించుట, నిగ్రహించుట రెండూ చేయకుండా ఉపేక్షిస్తారు. ఇట్లు ఉపేక్షాభావము వహించుటచేత నిగ్రహము వలన కలుగు (బలవంతముగా ఇంద్రియ నిగ్రహము చేయుట) దుష్ఫలితములు ఉండవు. ఎండుటాకు గాలిలో ఎగిరి పోయినట్లు మనస్సు పరిణామం చెందటంలో ఒక దశలో కలిగిన విపరీత ధోరణులు మనసు పరిణీతి చెందగనే వాటంతట అవే నశిస్తాయి. పునర్జన్మ యందు కూడా ఇక ఆవాసనలు మరల మొలకెత్తవు.

ఇది బుద్ధునిచే చెప్పబడిన "మధ్యేమార్గము" కాదు. అనగా విషయములను పూర్తిగా అనుభవించుట, పూర్తిగా నిరోధించుట కాక "ధర్మ విరుద్ధము కాని కామములను అనుభవించ వచ్చును" అను గృహస్థ ధర్మము ననుసరించి కొంతవరకు అనుభవించుట. మరియు "అతి సర్వత్ర వర్జయేత్" – అనగా మిక్కిలి లాలసత్వమును నిగ్రహించుట –

ఇది బుద్ధుడు బోధించిన మధ్యే మార్గము.

కాని జ్ఞాని మార్గము ఇది కాదు. బుద్ధుని మధ్యే మార్గములో ఆత్మ దృష్టి ప్రధానము కాదు. జ్ఞాన మార్గములో దేహాత్మ భావనిరసనము, జీవబ్రహ్మైక్యధారణ. ఆత్మనిర్గుణము నిరుపాధికము అను దృఢమైన బుద్ధి– ముఖ్యములు. వీటితోకూడా ఇంద్రియార్థములందు ఉపేక్షాభావదృష్టి కలసి ఉంటుంది. అనగా ఇంద్రియార్థములను మనసునకు పట్టించుకొనక పోవుట ఉపేక్ష. ఇదే సరైన మార్గము. దగ్ధబీజముల మరల మొలకెత్తనట్లు బ్రహ్మాత్మైక్య జ్ఞానముచేత క్షీణములైన వాసనలు మరల పెరగజాలవు.

కాబట్టి ముఖ్యముగా దేహాభిమానము తొలగు మార్గమును ఆశ్రయించవలెను. స్మృతి, ప్రసన్నత మొదగునవి సత్త్వమునకు సంబంధించిన గుణములు. రాగలోభాది గుణములు రాజసములు. మోహశోకాదులు తామసజన్యములు. జ్ఞానప్రాప్తికి రజో, తమోగుణములు అడ్డంకులు కావున వానిని జయించవలయును. సత్త్వగుణము సాధనము. "సత్త్వాసంజాయతే జ్ఞానం" (గీత) జ్ఞానమును ఇంధనముగా చేసుకొని విజ్ఞానాగ్నిని ప్రజ్వరిల్ల చేసినచో జరామరణ దుఃఖములు నశించి అక్షర పరబ్రహ్మము తోచును.

అవిద్య కోరికను కలిగించును. దానిచే కర్మ చేయవలెనను ఆసక్తి కలుగును. లోభమోహములను, ప్రియాప్రియములను ఆత్మయందు చేర్చి శాంతిని పొందుట మోక్షహేతువు. పాము కుబసమును విడిచినట్లు కర్మబంధమును త్యజించవలయును.

**విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణేగవిహాస్తిని**
**శుని చైవశ్వపాకే చ పండితా స్సమదర్శినః**

"విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుని యందు, గోవునందు, ఏనుగునందు కుక్కయందు, కుక్కమాంసము తినువాని యందు ఉచ్ఛ నీచభావమును ఉపేక్షించి, అంతటా సమముగా వ్యాపించియున్న ఆత్మను మాత్రమే పండితులు చూచుచుందురు.

"సర్వ భూతములందును, తనయందును ఉన్న ఆత్మఒక్కటే" అని దర్శించగలుగుటయే అత్యుత్తమమైన ధర్మమని మహాభారతము

శాంతిపర్వమునందు చెప్పబడినది.

ఆత్మ సర్వత్రా వ్యాపించి యుండునన్న విషయం తెలుసుకున్న జ్ఞానికి ఈసమస్త ప్రపంచము లోను ఆత్మస్వరూపమే గోచరిస్తుంది. సర్వ సంకల్పములను విడిచిపెట్టి చిత్తమునందు పరమశాంతిని కుదుర్చుకున్నవాడు ఇంధనము లేకుండా వెలిగే అగ్నివలె ప్రజ్వరిల్లును. నిత్య సౌఖ్యమును పొందును.

తాబేలు తన అంగములను ఏవిధముగా లోపలికి ముడుచుకొని ఉంటుందో అలా ఇంద్రియార్ధములనుండి ఇంద్రియములను ఉపసంహరించుకుంటాడు విద్వాంసుడు. ఆవిధంగా కోరికలను నిగ్రహించుకొన్నవాడు ముక్తిమార్గాన్ని పొందుతాడు. ఇంద్రియములను వశంచేసుకోవటము అనే ఉపాయమును ఇంధనముగా చేసుకొని ఆత్మ అగ్నివలె ప్రకాశిస్తుంది. సర్వప్రాణులను తనలో చూడగలిగితే సూక్ష్మమైన పరతత్వం కనబడుతుంది. ఇతరుల మనసును తన మనసునందే ఇముడ్చుకొని, ఇతరుల ఆత్మను తన ఆత్మయందే చూచువాడు సర్వజ్ఞుడు. సర్వభూతములయందును తననే నిర్వికల్పంగా అతను చూడగలుగుతాడు.

ఆత్మతత్వం ఒక్కటే. ఒకదీపం అనేక దీపాలను వెలిగించినట్లు అది రూపాంతరం చెందుతుంది. ఈరహస్యం తెలుసుకున్నవాడు భ్రమల పాలుగాకుండా ఉంటాడు. పగలూ రాత్రీ ఒకదాని వెంట ఒకటి వరుసగా వస్తూనే ఉంటాయి అలాగే సుఖదుఃఖాలు మనుషులకు కలుగుతూ ఉంటాయి. అందుచేత సుఖం కలిగితే సంతోషించడమూ, దుఃఖం కలిగితేబాధపడటమూ మంచిదికాదు. పుట్టిన ప్రాణులు నశించటం దగ్గరయినవారు ఏదో కారణాలవల్ల దూరమై ఎడబాటు సంభవించటం, కొంత సుఖము, కొంతదుఃఖము ఇవన్నీ జీవితంలో సహజంగా జరుగుతూ ఉంటాయి. జన్మించిన ప్రతిజీవి కొంతకాలానికి నశిస్తుంది. అన్నింటిలోకి మేలైనది జ్ఞానము. దానికి నాశనంలేదు. అట్టి జ్ఞానమువలన అభిమానం, అహంకారం, మమకారం తొలగిపోతాయి, దానివల్ల మనిషి నిర్మలుడై మోక్షమార్గాన్ని దర్శిస్తాడు.

“అహింసాపరమోధర్మః” అన్ని ధర్మములలోనూ మేలైన ధర్మం అహింస. అహింసా పరుడైన వానికి ఉత్తమమైన జ్ఞానం లభిస్తుంది.

అటువంటి జ్ఞానం మోక్షాన్ని ప్రసాదిస్తుంది. కోరికలతో కర్మలు చేసేవాడు చావుపుట్టుకలు అనుభవిస్తూనే ఉంటాడు. ఫలాపేక్షరహితులై , దోషములు లేకుండా మంచి పనులు చేసేవాడు ముక్తిని పొందుతాడు.

జ్ఞానము వెలువడునెప్పుడు
జ్ఞాని ముఖమ్మునననుభవసార ప్రకటితమై
జ్ఞానము సత్యమనంతము
జ్ఞాని పథమ్ము జనత కనుశాసనమెందున్.

సత్యము అనంతము జ్ఞానము – ఇదే బ్రహ్మము. ఈబ్రహ్మానుభూతిని అపరోక్షంగా పొందగలిగినవాడు. "జ్ఞాని". జ్ఞానులను జ్ఞానులే బాగా అర్థం చేసుకోగలరు. జ్ఞానుల పలుకు మౌనం. అందుచేత జ్ఞానులు అనుసరించే మార్గమే జ్ఞానానికి త్రోవ. వేదమునకు అర్థమే జ్ఞానం జ్ఞానులను గుర్తించటానికి జ్ఞానం అవసరం. జ్ఞానులసిద్ధాంతం "సర్వమూ బ్రహ్మమే", కోటిగ్రంథాలు చదివినా చివరికి వాటి సారాంశం "సర్వమూ బ్రహ్మమే".

జ్ఞానమనేది ఒకఅనుభూతి, అనుభూతిని అనుభూతి ద్వారానే తెలుసుకోవాలి. సిద్ధాంతప్రాతిపదికల చివరిమెట్టు అనుభూతి ప్రారంభము. బ్రహ్మము సత్యము, జ్ఞానము, అనంతమైయున్నది. ఈసత్యము, జ్ఞానము, అనంతము వేరు వేరుకాదు.

జ్ఞానమనునది ఒకానొక అనిర్వచనీయమైన అనుభూతి. తనంతట తానుగా పొందవలసిన అనుభూతి. ఏఇతర వస్తుసముదాయమూ చేతకాని, ఇతరులచేతకాని అది లభించేదికాదు. కర్మ జన్యముకాదు. జ్ఞాని అనగా బ్రహ్మానుభూతిని అపరోక్షముగా పొందినవాడు,. జ్ఞానులు వైరాగ్యశక్తి సంపన్నులు. జ్ఞానం ఉపాధియొక్క నిజతత్వాన్ని తెలియచేస్తుంది.

**సత్కర్మఫలము - (నిష్కామకర్మఫలము) - "భక్తి".**
**సద్భక్తికి ఫలము 'జ్ఞానము"**

ఆత్మజ్యోతిని దర్శించగలవా
అన్నదానం వలన శరీరం పోషింప
కలుగుతోంది. అయితే ఈ

అదికేవలము ఒక స్వానుభవము. త్యాగమువలననే లభ్యమవుతుంది.

**నకర్మణా నప్రజయా నధనేన త్యాగే నేకే అమృతత్వమానశుః**

**శ్రుతి**

కర్మచేకాని, సంతానముచేకాని, ధనముచేకాని, అమృతత్వము పొందబడుటలేదు. కేవలము త్యాగముచేతనే అది పొందబడుతుంది. గర్వము, అహంకారము పూర్తిగా నశించిన పిమ్మటనే ఆత్మజ్ఞానవిద్య లభిస్తుంది. జ్ఞానులు అనుసరించిన మార్గమొక్కటే జ్ఞానానికి త్రోవ.

**"సత్యాన్న ప్రమదితవ్యమ్"**

**తైత్తిరీయోపనిషత్తు**

ఆత్మజ్ఞాని కాకోరువాడు క్షణకాలమైనా సత్యమునుండి ప్రమాదమును పొందకూడదు. ఇది అనుశాసనము (Standing instructions) సత్యాన్వేషణ ప్రారంభదశలో దుఃఖానుభవము తప్పనిసరి అయినా చివరకు ప్రాప్తించేది బ్రహ్మానందము. ఇది నిత్యము, సత్యము, శాశ్వతము. జీవితాంతము సత్యమునే అన్వేషించిన ఒకవ్యక్తి విధివశాత్తూ వైరాగ్యం కలిగి (దృఢమైన వైరాగ్యం) గురుసాన్నిధ్యం పొందితే "త్వం సత్యం అసి" అన్న గురువుగారి మహావాక్యం విన్నంతనే మెరపు మెరసినట్లు అతనిలో సత్యస్వరూపము దృగ్గోచరము అవుతుంది. అతని నరనరములలో సత్యతత్త్వము జీర్ణించుకొని ఉండుటయే ఇందుకు కారణము.

సద్భావములు కేవలము పరిశుద్ధమైన మనసునందు మాత్రమే కలుగుతాయి. కావున మనుష్యులకు చిత్తశుద్ధిఅత్యంత ఆవశ్యకమైనది. పాపములకు ప్రాయశ్చిత్తం కేవలము పశ్చాత్తాపపడటం మాత్రమేనని అనుకుంటే అదిపొరపాటు. పశ్చాత్తాపము తిరిగి ఆపాపములు చేయకుండా ఉండటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కాని చేసిన పాపకర్మల ఫలితాన్ని అనుభవించకుండా చేయలేదు.

**"నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటిశతైరపి"**

చేసిన కర్మలయొక్క ఫలమును శతకోటి కల్పములకైనా అనుభవించనిదే ఆకర్మ నశించదు ! అనగా చేసిన కర్మ యొక్క ఫలితమును

అవశ్యము అనుభవించి తీరవలెను. ఆకర్మానుసారము ఈజన్మయందు మానవుడై పుట్టినను తదుపరి జన్మయందు జంతు జన్మను పొందవచ్చునని వేదములు ఘోషించుచున్నవి.

**"రమణీయ చరణాం రమణీయాం యోని మాప్రపద్యన్తే."**
**కపూయ చరణాం కపూయాం యోని మా పద్యన్తే."**
**"ఛాందోగ్యము."**

మంచి కర్మచేయువారు మంచి జన్మలను, పాపకర్మలను చేయువారు పాపపు జన్మలను పొందుతారు. అనగా నీచ జన్మను పొందుతారు.

**"సతిమూలే తద్విపాకో జాత్యా యుర్భోగాః"**
**పతంజలి యోగదర్శనము సాధనపాదము 13వ సూత్రము.**

అవిద్యాది క్లేశములు ఎవరికి కలుగుచున్నవో వారికి ఆ క్లేశముల యొక్క ఫలముగా జాతి, ఆయువు, భోగము కలుగుచున్నవి.

అవిద్యాది క్లేశములు బీజములు. వానినుండి జాతి, ఆయువు, భోగములను వృక్షములు పెరుగుచున్నవి. అవిద్యాది క్లేశముల వలన కర్మలుచేయబడి ఆసంస్కారములు బీజరూపంలో ఉంటాయి. ఆబీజముల వలన మరల జన్మములు, భోగములు కలుగుతాయి.

**సర్వకర్మలు ఒక్క జ్ఞానాగ్నిలోనే దహింపబడును.**
**"జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా"**
**భగవద్గీత 4-37**

**"యదజ్ఞాన ప్రభావేన దృశ్యతే సకలం జగత్**
**యద్జ్ఞానాల్లయ మాప్నోతి తస్మైజ్ఞానాత్మనేనమః**

"దేనిని తెలిసికొనకపోవుటచే ఈసకల జగము చూడబడుచున్నదో, దేని జ్ఞానము వలన లయమును పొందుచున్నదో అట్టిజ్ఞాన స్వరూపుడగు పరమాత్మకు నమస్కారము".

సర్వ శాస్త్ర సారమైనది ఆత్మస్వరూపం. సర్వశాస్త్రములందు చెప్పబడిన ధర్మసారమే జ్ఞానసాధన. ఈజన్మలోనే "తాను ఎవరు ?" అని తనను తాను తెలియుటయే వివేకము. జ్ఞానముచేత పరబ్రహ్మమును

తెలుసుకొనవలెను. హంసకు పాలను, నీటిని విడదీసే వివేకమున్నది. కాని, కొంగకు అట్టి వివేకము లేదు. అలాగే "పరమహంస" లైనవారు అనాత్మవస్తువుల నుండి ఆత్మను వేరుచేసి తెలుసుకొనగలుగుతారు.

**"దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవ స్సనాతనః**
**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోహంభావేన పూజయేత్."**

"దేహమే దేవాలయం. దేహమందున్న ఆత్మజ్యోతియే దేవుడు. నిన్నటి దినమున పూజచేసిన పూలను నిర్మాల్యం అంటారు. అజ్ఞానమే ఆదేవునికి నిర్మాల్యము. దానిని త్యజించి నేనే ఆదేవుడననే భావముతో పూజింపుము."

దేహమనే ఘటమునందు దేవుడున్నాడు, కనుక ఈదేహమనే ఘటములోని నిర్మలమైన సత్వగుణమనేపాలను, సద్గురు వాక్యమనే వివేక జ్ఞానమనెడి కవ్వముతో తరచగా, "ఆత్మతత్వ"మను నవనీతము శేషించును.

బ్రహ్మార్పణము అను పదమునకు అర్థమేమనగా లోకదృష్టిని అర్పణముగా ఊహింపబడిన పదార్థము బ్రహ్మవేత్తకు బ్రహ్మమే అగుచున్నది. ఆవస్తువును బ్రహ్మము అని గుర్తించుటయే బ్రహ్మార్పణము చేయుట. జ్ఞాన నిష్ఠకలవానిచేత పొంధబడదగిన ఫలము కూడా బ్రహ్మమే.

బ్రహ్మ ఎక్కడో పరోక్షంగా ఉంటే ఒక వస్తువును బ్రహ్మ ఉన్న స్థానమునకు పంపించుట సాధ్యమవుతుంది. కాని, సర్వత్ర సర్వ స్వరూపముగా ఉన్న బ్రహ్మను ఎక్కడో బ్రహ్మ లోకములో ఉన్నట్లుగా తలచుటకు వీలులేదు. కర్మలను , వస్తువులను కూడా బ్రహ్మ స్వరూపమని తెలుసుకొనుటయే ఇచ్చట ఉద్దేశించబడినది. ఇట్లే రామార్పణము, కృష్ణార్పణము, శివార్పణము ... అని అన్నప్పుడు ఆదేవుడు ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో ఉన్నాడని, ఈవస్తువును లేదా ఈకర్మఫలమును ఆయనకు సమర్పించామని అనుకొనుట ప్రారంభదశ మాత్రమే. జ్ఞానదశయందు సర్వము ఆత్మ స్వరూపంగా జ్ఞాని గుర్తిస్తాడు. రాముడు, కృష్ణుడు శివుడు ... కూడా ఆత్మ స్వరూపాలే.

కర్మ, కర్మఫలము, వస్తువు, వస్తువులను స్వీకరించువాడు కూడ రామ, కృష్ణ. శివాది శబ్దములచేత చెప్పబడుచున్న బ్రహ్మయే. అందుచే

కృష్ణార్పణం అంటే ఇది కృష్ణుని స్వరూపమే అని అర్థం. అంతేకాని కృష్ణుని కన్న వేరైనది కృష్ణునికి అర్పిస్తున్నామని భావముకాదు.

అప్రయత్నముగా లభ్యమైన దానితో తృప్తి చెందినవాడును, శీతోష్ణాది ద్వంద్వములను అతిక్రమించినవాడును, దేనియందును వైరబుద్ధి లేనివాడును, అప్రయత్నముగా అన్నము మొదలైనవి లభించినను, లభించకపోయినను సమబుద్ధి కలవాడును అగు ముముక్షువు కర్మలయందు అకర్మను చూచువాడై యుండును. సర్వముబ్రహ్మమను జ్ఞానము కలుగగనే కర్మకు కారణమగు అవివేకము నశించును. భగవత్ప్రీతికై ఆచరించుచున్న కర్మము మాత్రము జ్ఞానము కోరుచున్న వాని జ్ఞానమార్గసాధనకు ప్రతిబంధకము కాదా ? అని శంకింపరాదు. భగవత్ప్రీతికొరకు చేయుచున్న యజ్ఞాదికర్మము , ఫలముతో కూడా ఈశ్వరునిలో కలసిపోయి జ్ఞానము మాత్రమ మిగులుచున్నదని తెలుసు కొనవలెను.

"యజ్ఞదానతపః క్రియాదులు జ్ఞానులకుకూడా త్యాజ్యములు కావు' ' అని శ్రీకృష్ణునిబోధ. యజ్ఞదానతపాదుల కర్మఫలము జ్ఞానికి అంటదు అని భావము, అజ్ఞానహేతుకము, బంధహేతుకము అయిన కర్మము జ్ఞానాగ్నియందు దగ్ధమగుటచేత జ్ఞాని అట్టి కర్మఫలముచే బద్ధుడుకాడు. "నేను పంచభూతములకు అతీతుడను. అవాఙ్మనసగోచరుడను, జ్ఞానస్వరూపుడను, సర్వసాక్షి స్వరూపుడను" అని తెలియవలెను. నేను నిర్మలమైన మనసు కలవాడను" అని తలచి ధర్మాధర్మములను, సుఖదుఃఖములను, కర్తృత్వ భోక్తృత్వములు మొదలైన ద్వంద్వములను పొందక సదా మనసు నందు ముముక్షుత్వము పొందియుండవలెను."

పంచకర్మేంద్రియములకు, శబ్ద స్పర్శరూపరస గంధాదులనబడు పంచతన్మాత్రలకును, ప్రాణాది పంచవాయువులకును, అంతరింద్రియములకును, ప్రత్యగాత్మ మొదలగు వాటి అన్నింటికంటె ఎక్కువైన, ద్రష్టు స్వరూపుడవైన సర్వసాక్షిరూపమే "నేను" అని తెలియవలెను.

తాడు పామువలె ఎట్టు కనిపించునో అట్లే పరిపూర్ణ స్వరూపుడవగు నీయందు ప్రపంచము తోచుచుండును. కావున నీస్వరూపమే కేవలానందమై, సర్వము నిండి ప్రకాశించుచున్నదని తెలిసి శాశ్వతానందమును పొందుము. ఎట్టిపరిస్థితులలోనూ నేను, నేననెడి అహంభావమును పొందని

పరమ పురుషుడే ముక్తుడగును. (ఇచ్చట అహంభావము అనగా కర్తృత్వభోక్తృత్వ భావము అని అర్థము) అహంకారపరుడగు మానవుడు సదా బంధమునందే తగులుకొని యుండును. సాక్షిభావము ముక్తి సంధాయకము. ఎవరికైనను 'యద్భావంతద్భవతి" అను వాక్యానుసారముగా తనమనసులో ఏది తలంచుచున్నాడో అదియే ప్రాప్తమగును.

భ్రాంతిరూపకమైన బాహ్యదృష్టిని విడిచి అంతర్దృష్టిని పొంది నిన్ను నీవు గాంచిన నీవే పరిపూర్ణబ్రహ్మమువై నిండియున్నావని తెలియుచున్నది. నీవలననే నిన్ను నీవు తెలియబడెదవు.

పుత్రమిత్ర కళత్ర ధన ధాన్యాది సమస్తములందును తనదనెడు అభిమానరహితబుద్ధిగలవాడు, అంతఃకరణ నిగ్రహము కలవాడు, తనదేహమునందును, పుత్రాదులయందును జీవితమనందును, భోగములయందును ఆశలేనివాడు, ఎల్లప్పుడును స్వానుభవమనెడు జ్ఞాన నిష్ఠయందే మనస్సునుంచుకొనును. అతడు స్వస్వరూపానుభవము అగు బ్రహ్మజ్ఞానమును పొంది అవిద్యాభివృద్ధికి సాధనమగు సమస్తకర్మలను, కర్మఫలమును విడుచుటచే "నైష్కర్మ్యసిద్ధి" పొందుచున్నాడు.

అద్వైత సిద్ధాంతమునందు బ్రహ్మజ్ఞానము సగుణబ్రహ్మ జ్ఞానమనియు, నిర్గుణబ్రహ్మజ్ఞానమనియు రెండు విధములుగా చెప్పబడియున్నది. వ్యవహారదశయందు ఉపాసకుల అనుగ్రహార్థమై శుద్ధతత్త్వ మాయయందు ప్రతిఫలించిన బ్రహ్మచైతన్యమే బ్రహ్మవిష్ణు రుద్ర రూపములుగా వ్యవవహరింపబడుచున్నది. దీనినే సగుణబ్రహ్మ అనీ, ఈశ్వరుడనీ అంటారు. ఈశ్వరునకు నామము, రూపము, గుణము, క్రియ, కర్మములను ఆరోపించి రామాయణ భాగవత, పురాణాదులు వర్ణించుచున్నవి. కేవల విషయ జ్ఞానముకంటె భక్తిహేతువైనదగు ఇట్టి సగుణ బ్రహ్మ యొక్క మహాత్మ్య జ్ఞానము గొప్పది.

అవిద్య యందు ప్రతిఫలించిన బ్రహ్మచైతన్యమే జీవులైనది. ఇట్టి జీవులు త్రిమూర్తులను ఉపాసించి, వారి అనుగ్రహమువలన చిత్తశుద్ధిని పొంది పిమ్మట నిర్గుణ బ్రహ్మ జ్ఞానమును పొందవలెను. ఇష్టదైవమును ఎన్నుకొని వారిని గురించిన స్మృతి మహాత్మ్య చరిత్రాదుల జ్ఞానమే సగుణబ్రహ్మ. జ్ఞానము అట్లు తెలుసుకొన్న సగుణ బ్రహ్మమును భక్తి

విశ్వాసములతో ఎడతెగక చింతించుటయే సగుణధ్యానమనబడును. సకల ప్రపంచమునకు **అతీతమయ్యు**ను ప్రపంచమునందు కనబడునట్టివియును, తోచునట్టివియును అగు సమస్త వస్తువులను నేతి .... నేతి, ఇదికాదు ... ఇదికాదు అని నిషేధింపగా మిగిలినదియు, రెండవది మరేదియును లేక తానొక్కటే అయినదియును, త్రికాలములందును ఒకే విధముగా ఉండునదియు, అవాఙ్మనసగోచరము అయినదియును, సకలమును ప్రకాశింపచేయనదియును, సచ్చిదానంద ఘనమైనదియును, జ్ఞానమే స్వరూపముగాగలదియును అగు బ్రహ్మమును అపరోక్షముగా తెలుసు కొనుటయే నిర్గుణబ్రహ్మ జ్ఞానము. ఎల్లప్పుడును అట్టి జ్ఞానముతో నుండుటయే నిష్ఠ. ఇట్టి నిర్గుణ బ్రహ్మనిష్ఠకలవాడెవడో అట్టివాడే జీవన్ముక్తుడు. అనగా బ్రతికియుండగనే మోక్షమును పొందినవాడు. అతనికి ఇక పునర్జన్మలేదు. దేహముక్తుడై స్థూలసూక్ష్మదేహాభిమానరహితుడు కావున బ్రహ్మమునందు ఐక్యమగును. ఇట్టి జ్ఞానమును పొంది శాశ్వతముక్తిని పొందుటయే జీవితపరమార్థము.

సాకార స్వరూపమగు శరీరము సత్యముకాదనియు, నిరాకారుడగు ఆత్మస్వరూపుడే సత్యమనియు మనసున నిశ్చయము కలవాడు, అట్టి ఆత్మతత్త్వమును స్వయముగా తెలుసుకొనిన పిమ్మట మరల జన్మమును గురించి విచారించడు. కుండయొక్క వెలుపల, లోపలకూడా ఆకాశము ఎట్లు నిండి ఉన్నదో అట్లే పరమేశ్వరుడు సర్వభూతాంతరాత్మయై ఉన్నాడు.

"అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణస్థితః"

శరీరములనెడు ఉపాధుల లోపల నిండియున్న పరమేశ్వరుడు ఇంద్రియ సాంగత్యము నొందక తాను వేరుగా సాక్షీభూతుడుగా నుండును. సద్గురుకటాక్షముచేత సంసారమనగా మానసిక ప్రపంచమేనని ఇదియే సకల సుఖదుఃఖానుభవములకు కారణమని గుర్తించి ఈమనోవృత్తులకు తాను సాక్షినని తెలుసుకొనవలెను. "తనకన్న వేరైన మరొక సాక్షి లేదా తనను తెలుసుకొను సాక్షి వేరే మరియొకడు లేడు" అని బృహదారణ్యశృతి చెప్పుచున్నది.

"నాన్యో Zతో Z స్తిద్రష్టా"

(బృహదారణ్యకము)

అతః – ఇందువలన ఈయన కన్న ద్రష్ట అయినవాడు, న అన్యః - వేరొకడు లేడు. ఈమానసిక ప్రపంచమునకు తాను ద్రష్టయై నిలిచియుండుట జ్ఞానసాధనము. ఇట్టి జ్ఞానికి "జీవునకు నిద్రానుభవము కలిగినట్లు" సమాధి అనుభవము కలుగును. మానసిక వృత్తులు లేకపోయినప్పటికీ అజ్ఞాన ఆవరణ ఉండుటచేత నిద్రసమాధికన్న భిన్నము. సాక్షిభావముతో ఉన్న జ్ఞాన సాధకునికి మానసిక వృత్తులు లయమై సమాధి స్థితి ఆవిర్భవించినపుడు స్వస్వరూప ఆత్మజ్ఞానము కలుగును. సమాధియందు అవిద్యావరణలేదు. ఈసమాధిస్థితినే "తురీయావస్థ" అని కూడా అంటారు. ఆసమాధియందు తానే బ్రహ్మమను అపరోక్ష జ్ఞానము కలుగును. నిద్రనుండి కొంత సేపటి తరువాత మేల్కొనిన జీవునకు "నేను సుఖముగా నిద్రించితిని. అప్పుడు నాకు ఏమియు తెలియలేదు" అను స్మృతి యుక్తమగు అనుభవము ఉండును. అట్లే సమాధినుండి కొంతకాలమైన తరువాత సాధకుడు మరల జాగ్రదవస్థకు వచ్చును. ఇక్కడ జాగ్రదవస్థకు రావటం అంటే లయమైన మనస్సంకల్పములు మరల ఉదయించటం అని అర్థము. సమాధినుండి జాగ్రదవస్థకు వచ్చిన సాధకునకు సమాధియందు నిరతిశయ సుఖానుభవమున్నది. బ్రహ్మాత్మైక్య జ్ఞానము కలుగుచున్నది.

అక్కడ సంకల్పములు లేవు అనుస్మృతి యుక్తమగు అనుభవము ఉండును. సమాధియందు సాక్ష్యీమనోవృత్తులు లేకపోవటంచే సాక్షి భావనకూడా ఉండదు. జాగ్రదవస్థయందు మనోవృత్తులకు తాను సాక్షిని అని తెలియుచుండును. అయితే ఈమనోవృత్తులు ఎక్కడివి ? ఎక్కడినుంచి వస్తున్నాయి. ఎక్కడికిపోతున్నాయి ? ..... అని జ్ఞాని విచారిస్తాడు. సమాధి అనుభవము కలిగిన తరువాత ఈమనస్సుకూడా తానేనని, తనలోనుంచే మనోవృత్తులు ఆవిర్భవించి తనలోనే లయము చెందుతున్నవని జ్ఞాని జాగ్రదవస్థలో గుర్తిస్తాడు. మహాసముద్రము ఒకప్పుడు ప్రశాంతంగా ఉంటుంది. మరొకప్పుడు తుఫాను తాకిడిచే అలజడిగా ఉంటుంది. ప్రశాంతంగా ఎక్కువ ఉధృతమైన అలలు లేకుండా ఉన్నప్పుడూ అదే సముద్రం. అలలతో అలజడిగా ఉన్నప్పుడూ అదే సముద్రం. అలాగే సమాధి స్థితిలో ఏబ్రహ్మానుభవము కలుగుతున్నదో జాగ్రదవస్తలోకూడా అదే బ్రహ్మానుభవము ఎక్కువ తక్కువలు లేకుండా కలుగుతున్నదని

జ్ఞాని గుర్తిస్తాడు. అట్టి స్థితికి చేరినప్పుడు అతని సాధన పరిపూర్ణమౌతుంది. అతనిని జీవన్ముక్తుడని అంటారు. అట్టి స్థితిలో ఉన్న జ్ఞానికి హేయోపాదేయములు లేవు. అట్టి జ్ఞానికి సమాధి, జాగ్రదవస్థల భేదము లేదు. శ్రీకృష్ణునివంటి అవతారపురుషులు ఇట్టి స్థితిలో ఉన్నవారు.

ఈశ్వరుడొక్కడే. తక్కిన జీవులు మూడు రకాలుగా ఉంటారు.

<u>ఒకటి జీవన్ముక్తులు</u>

జీవన్ముక్తులు శరీరమును ధరించి ఉన్నా ఎల్లప్పుడూ సమాధి అనుభవంతోనే ఉంటారు. వీరు ఈశ్వరునితో సమానమైనవారు. "జగద్వ్యాపారవర్జ్యమ్" అను బ్రహ్మసూత్రము చేత ఈశ్వరుడొక్కడే సృష్టి స్థితిలయములు చేయునని, ఇతరులెవ్వరు జగద్వ్యాపారమునందు ఈశ్వరునితో పోటీ పడరని చెప్పుచున్నది. ఇట్టి జీవన్ముక్తులు ఈశ్వర సంకల్పాధీనమైన జీవితం గడుపుతూ ఉంటారు. వారు అనుభవింపవలసిన ప్రారబ్ధకర్మము అయిపోగానే వారు అవ్యక్త పరబ్రహ్మమునందు కలిసిపోతారు. లేక ఈశ్వర సంకల్పానుసారము వారు అధికారిక పురుషులుగా మారతారు (అనగా దిక్పాలకులు, వసువులు, రుద్రులుగా మారతారు) లేదా గురులోకమునకు వెళ్ళి మరలమరల భూలోకమునందు గురువులుగా జన్మించి సకల జీవులను ఉద్ధరిస్తూ ఈశ్వరుని సేవిస్తారు.

2. జీవన్ముక్తులు కాని వారు సమాధి అనుభవము పొందినతరువాత జాగ్రత్స్వప్న సుషుప్తి, సమాధియను నాలుగు అవస్థలను అనుభవించి వాటి భేదమును గుర్తిస్తారు. సమాధియందలి తీవ్రమైన ఆకర్షణ చేతనూ, జాగ్రత్స్వప్న సుషుప్తులు మిథ్యామాత్రములనెడి జ్ఞానము చేతను మరల మరల సమాధి స్థితియందే ఉండాలని కోరుకుంటారు. ఇట్టివారి మనోవృత్తులు, ప్రారబ్ధము జ్ఞానాగ్ని యందు దగ్ధమై, అనుభవించవలసిన ప్రారబ్ధము లేనప్పుడు అట్టివారు సమాధియందు ఉండియే శరీరమును విడిచిపెడతారు.

ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ ! నైనాం ప్రాప్యవిముహ్యతే
స్థిత్వా ऽస్యాం అంతకాలేపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి.
గీత 2అ. 72 శ్లో.

"ఓ అర్జునా ! దీనినే బ్రాహ్మీస్థితి (సమాధిస్థితి) (తురీయావస్థ) అంటారు. దీనిని పొందిన వాడు మరల వ్యామోహమును పొందడు. అంత్య కాలమునందైనను (మరణకాలము నందైనను) ఈయోగమును పొందిన వాడు బ్రహ్మ నిర్వాణమును పొందును.

3. మూడవరకం సాధకులలో ఈసాక్షిస్థితియందుండి సమాధిస్థితి అనుభవము కలిగిన తరువాత ఒక విచిత్రమైన అనూహ్యమైన మార్పువస్తుంది. నిర్గుణధ్యానమునుండి వారు "సగుణభక్తి" లోనికి మారిపోతారు. దీనికి కారణము వారు అంతకు పూర్వజన్మలలో చేసిన ఉత్కృష్టమైన, ఉజ్జ్వలమైన యజ్ఞదానతపోమంత్రానుష్ఠానభక్తి భావరూపమైన పుణ్యప్రారబ్ధము. లోకస్థితిహేతువైన ఈపుణ్య, ప్రారబ్ధమును రక్షించి లోకానుగ్రహమునకై వినియోగించుట ఈశ్వరసంకల్పము కావచ్చును. అందుచే నిర్గుణ బ్రహ్మజ్ఞానముచే సమాధి అనుభవము వచ్చిన కొందరు భక్తులు సగుణసాకార భక్తి మార్గములోకి మారి పరాభక్తి పరులుగా మారిపోతారు. ఇట్టివారికి ముఖ్యమైన ఉదాహరణ గోపికలు.

'యధావ్రజగోపికానాం" అని నారదభక్తి సూత్రములలో చెప్పబడినది. గోపికలు నిర్గుణ బ్రహ్మజ్ఞానము తెలియని వారుకారు గోపికలకు ఆత్మజ్ఞానమును ఉపదేశించుటకు కృష్ణుడు పంపగా ఉద్ధవుడు గోపికలవద్దకు వెళ్ళి నిర్గుణ ఆత్మజ్ఞానమును చెప్పుటకు ప్రయత్నించెను. గోపికలు ఈ నిర్గుణయోగమును ఉపాలంభనము (హాస్యము) చేసినట్లు భాగవతము నందలి భ్రమర గీతలయందు చెప్పబడినది.

భక్తి మార్గమునందు కలిగే మొదటి దశలను 'గౌణభక్తి' అనగా గుణసంబంధమైన భక్తి అనిఅంటారు. బ్రహ్మ జ్ఞానము కలిగిన తరువాత వచ్చేభక్తిని పరాభక్తి అంటారు. అందుచేత గోపికల యొక్క భక్తిభావము నిర్గుణ ఆత్మజ్ఞానము కన్నగొప్పది. అయితే అది ఈశ్వరానుగ్రహముచేత కలుగునదే కాని భావధారణవలన కలిగేది కాదు. ఈవిషయంచెప్పటానికే గోపికా భక్తులలో సర్వోత్కృష్టురాలు శ్రీరాధికాదేవి యని, తక్కిన గోపికలు కూడా శ్రీరాధికాదేవికి సఖులు మాత్రమేనని భక్తి శాస్త్రమునందు చెపుతారు.

నిర్గుణ బ్రహ్మ నిష్ఠద్వారముననే ఈశ్వరానుగ్రహముచేత పరాభక్తి ఏర్పడుతుంది. కేవలభావసాధన వలన కలుగదని అద్వైతులు అంటారు.

"Divine experience is not an emotional experience" అన్నారు జిడ్డుకృష్ణమూర్తిగారు. "God is not a product of Imagination" అంటారు అద్వైతులు.

ధ్యానమయలోకములు, పుణ్యలోకములు అనేవి కేవలం ఊహాజన్యములుకావు. ఆత్మవిచారణ వలన వచ్చేమహత్తర పుణ్యము వలన అట్టి లోకములందు ప్రవేశించుట, అందు సంచరించుట సంభవించును. గోలోకప్రాప్తికూడా ఇట్టిదే. ఆత్మజ్ఞానములేకుండా చేసిన యజ్ఞయాగాది తపస్సులు అర్ధఫలమును మాత్రమే ఇస్తాయి. ఆత్మజ్ఞాని చేయు యాగాదులు అనంత ఫలాన్ని ఇస్తాయి.

సద్గురు కటాక్షముచేత స్వస్వరూపమును తెలుసుకొని ఏ సంశయమును పొందక ఎల్లవేళలా ఒకే విధమైన శాశ్వత సుఖానంద మగ్నులు కావటమే మోక్షం.

మనోవృత్తి సంబంధమగు జ్ఞానము, జ్ఞేయమగు నామరూపాత్మకమగు ఈప్రపంచము. తెలుసుకొనునట్టి జ్ఞాతయగు జీవుడును – ఈ మూడు కూడా తాడునందు పాము వలె భ్రాంతిగా తోచు మిధ్యా మాత్రములు. యధార్ధసత్యములు కావు, మిధ్యా అనగా సత్యమునందు ఆరోపింపబడు భ్రాంతి. ఇది మార్పుచెందునట్టిది. యధార్ధ సత్యమనగా త్రికాలములందును మార్పులేకుండా నిలిచియుండునది. ఈశ్వరుడు, జీవుడు వేరువేరు అను ద్వైతబుద్ధియే, బేధ బుద్ధియే, అజ్ఞానము. ఇదియే జన్మమునకు కారణము.

**"ద్వితీయా ద్వై భయం భవతి"**

**శ్రుతి.**

ఇక్కడ భయము అనగా జనన మరణరూపమగు సంసారము, తజ్జనితమైన సుఖదుఃఖానుభవము. కావున ద్వైతబుద్ధివలన సంసారము కలుగుచున్నదని అద్వైత అపరోక్షానుభవమువలన సంసార ఉపశమనము కలుగుచున్నదని అద్వైత సిద్ధాంతము చాటుచున్నది.

నిత్యానిత్య వస్తువివేకము కలవాడు అనిత్యమగు ప్రాపంచిక వస్తువులందు ఇచ్ఛను విడిచి నిత్యమగు ఆత్మతత్త్వమునందు ఆసక్తుడై ఉంటాడు. ప్రపంచములోని చిత్రవిచిత్రములైన విషయసుఖములందు

మనస్సులగ్నమైనవానికి బంధముకలుగును. నామరూపాత్మకమగు ఈప్రపంచ విచిత్రరూపములందు మనస్సులగ్నము కాని వానికి మోక్షము సంభవించును.

"మనయేవ కారణం మనుష్యాణాం బంధ మోక్షయోః
"మనస్సే బంధ మోక్షములకు కారణము"
యో. వా.

స్వస్వరూపము తెలియుటకంటె మరియొక శ్రేష్ఠమైన జ్ఞానములేదు. కాబట్టి సాత్వికబుద్ధితో కూడిన అంతఃకరణముచేత తనను తాను తెలుసు కొనలేకపోయినట్లైనచో ఇక ఆపరమాత్మ ఎట్లు తెలుసుకొనబడును ? శ్రవణమనన నిధి ద్యాసనాదులచేత తనను తాను తెలుసుకొనవచ్చును. జడరూపకములగు ఉపాధులను త్రోసిపుచ్చి అనగా స్థూలసూక్ష్మకారణ ఆవరణములను తొలగించు కొననిచో పరమాత్మ తెలియబడదు.

దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకొనవలయును. ఈశరీరములో ప్రాణదీపమున్నంతలోపలే జన్మరాహిత్యమునకు మార్గమును వెదికి తెలుసుకొనవలయును. మోక్షసాధనచేయవలెను. లేకున్నచో

"పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరేశయనం"

అన్నట్లుగా మరల మరల చావు పుట్టుకలు తప్పవు !

ఆత్మ 'సత్' అని తెలుసుకొనుటవలన ఆత్మ 'అసత్' అను భావము నశించును. ఆత్మ "చిత్" అని తెలుసుకొనుటవలన ఆత్మ జడము అను భావము, ఆత్మ 'ఆనందము' అని తెలుసుకొనుటవలన తాను దుఃఖితుడను అనుభావము నశించును. ఆత్మ "సచ్చిదానందము" (సత్, చిత్, ఆనందము) అని తెలుసుకొనుటవలన తనయందు తనకుగల "అనృత జడ దుఃఖాత్మకత్వము" అనే అనుభవము పోతుంది. అప్పుడు తాను "సచ్చిదానందాత్మకుడను" అను అనుభవము మిగులుతుంది. ఈవిధముగా తనను తాను తెలుసుకున్న వాడే బ్రహ్మవేత్తయగును. మృత్యువు లేనివాడగును. జనన మరణ భ్రాంతి రహితుడగును.

ఆత్మ స్త్రీకాదు; పురుషుడూకాదు; నపుంసకము కూడా కాదు

"స్త్రీ నపుంసక  పురుషమూర్తియునుగాక
తిర్యగమరనరాదిమూర్తియును గాక
కర్మ గుణ భేద సద సత్ప్రకాశిగాక
వెనుకనన్నియుఁ దానగు విభుఁదలతు"

ఆంధ్రభాగవతము. గజేంద్రమోక్షము
(అష్టమస్కంధము)

"సవైన దేవాసుర మర్త్య తిర్యఙ్
నస్త్రీ నషండో నపుమాన్నజంతుః
నాయంగుణః కర్మన సన్న చాసన్
నిషేధశేషో జయతా దశేషః"

సంస్కృతభాగవతము
8వ స్కంధము - 3అధ్యాయము-24 శ్లోకం

నేతి... నేతి; ఇది కాదు ... ఇదికాదు అని బ్రహ్మ విచారణా రూపమైన నిషేధ ప్రత్యయములకు అవధియగుటచే పరబ్రహ్మ 'నిషేధ శేషః' అని సంస్కృతభాగవతమునందు చెప్పబడినది. అనగా ఇదికాదు.... ఇదికాదు... అని విచారించి బ్రహ్మము కాని వస్తువులు అన్నింటిని నిషేధిస్తూ పోగా చివరకు మిగులునది "నిషేధశేషము". "వెనుకనన్నియు తానగు విభుదలతు" .... అనగా ఈ పరబ్రహ్మయందు సమస్త జగములు అధ్యారోపితములై రజ్జువునందు సర్పమువలె ఉండి నానా వస్తుభావమున ఇంద్రియములచే గ్రహించబడుచున్నవి అని అర్థము. అట్టి ఆత్మ పుట్టదు. మరణించదు.

నజాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితావాన భూయః
అజో నిత్య శ్శాశ్వతో యం పురాణో
నహన్యతే హన్యమానే శరీరే

గీత 2అ - 20 శ్లో

"ఆత్మ పుట్టుట లేదు. చనిపోవుట లేదు. ఒకప్పుడు ఉండ కుండా అయి మరొకప్పుడు ఉండునది కాదు. అనగా ఒకప్పుడు "సత్" గాను, మరొకప్పుడు "అసత్"గాను ఈ ఆత్మ ఉండదు. ఈ ఆత్మ నిత్యము. శాశ్వతము. పురాతన కాలము నుండి అనాదిగా ఉన్నది. చనిపోవుచున్న శరీరముతో పాటు ఆత్మ చనిపోవుట లేదు."

"నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనం క్లే దయంత్యా ప్యోనశోషయతి మారుతః"
గీత ౨౮ - ౨౩ శ్లో

ఈ ఆత్మను శస్త్రములు ముక్కలు ముక్కలుగా ఛేదించలేవు. (ఆత్మ అవిభాజ్యము). అగ్నిచే దహింపబడదు. (అవినాశి). స్థూలమైన అగ్నిచే దేహము భస్మీభూతమగును. జఠరాగ్నిచే ఆహారము పచనమౌతుంది. చిదగ్నిచే మనోబుద్ధి వృత్తులు నశిస్తాయి. కాని ఆత్మచిదగ్నిచే కూడా నశించదు." ఆత్మ లేదు" అని తెలుసుకొను శూన్యజ్ఞానము ఆత్మజ్ఞానము కాదు. ఆత్మ జ్ఞాని ఎప్పుడూ ఆత్మను సద్రూపమనే తెలుసుకుంటాడు.

"సంతమేనం తతోవిదురితి"
తైత్తిరీయోపనిషత్తు.

"తతః అందువలన ఆత్మను ఉన్నదానినిగా, సద్రూపముగనే తెలుసుకొనుచున్నారు."

ఆత్మ నీటిచే తడుపబడదు. గాలిచే శుష్కింపబడదు. అనగా పంచభూతముల వలన ఆత్మయందు ఎట్టి వికారములు కలగవు. అధిష్ఠానరూపమైన ఆత్మ సాన్నిధ్యంలో పంచభూతముల యందు పరిణామ వికారాదులు కలుగుతూ ఉంటాయి. కాని, పంచభూతముల యొక్క సాన్నిధ్యము వలన ఆత్మలో ఎట్టి వికారము కలుగదు.

తాడు అను అధిష్ఠానము ఉండుటవలన అందు భ్రాంతిగా సర్పము కనబడుట, ఆ సర్పము కదలినట్లుండుట మొదలగు అనుభవములు కలుగుతూ ఉంటాయి. తాడే లేకపోతే సర్పము ఉండదు. చలనమూ ఉండదు. కాని సర్పము, చలనము అను అనుభవము మనకు కలిగినందు వలన తాడు యందు ఎట్టి మార్పూ ఉండదు.

కావున స్వస్వరూప జ్ఞానమే ముక్తి. అదియే జీవిత పరమావధి. జీవ బ్రహ్మైక్య జ్ఞానమే ఆనందము.

కోరికతో చేసెడి సకామభజన వలన ఫలము దొరుకును. నిష్కామ భజన వలన భగవంతుడు దొరుకును. మానవునకు కావలసినది బాహ్యాడంబరము కాదు. ఆత్మనిష్ఠ కావలయును. ఆత్మ – జీవుడు – మాయ వీటన్నింటిని విమర్శించి, శోధింపనేర్చినవాడును, తనను తాను తెలుసుకోదగిన వాడును జ్ఞానియనదగినవాడు. జ్ఞాని యొక్క వృత్తి ఏక రూపముగా నుండును.

ఆత్మజ్ఞానమును అభ్యసించుట వలన సకలకర్మములును నశించును. ఇది కేవలము ప్రత్యక్షానుభవమగు అంశము. జ్ఞానము కలుగనిదే కర్మలెన్నటికిని నశించవు. అట్లే సద్గురుడు లేనిదే జ్ఞాన మెన్నటికీ కలుగనేరదు. కావున సద్గురువు యొక్క అనుగ్రహమును పొందవలయును. సజ్జనుల తోడి సాంగత్యము చేయవలెను. అంతః కరణమునందు తత్వజ్ఞానమును మననము చేయవలెను. తత్త్వములో త్వమ్ వెడలిపోయిన పిమ్మట వాస్తవములో స్వయముగా "తత్" అను నదియే మిగులును. అనగా మిధ్యారూపకమైన జీవత్వ భ్రాంతిపోతే సద్రూపమగు బ్రహ్మ ప్రకాశించును.

ఇట్టి ఆత్మ జ్ఞానమును బోధించు సద్గురువును గురించి ఇక్కడ కొంచెము విపులముగా తెలుసుకొందము.

ఈ మోక్ష సాధన విషయంలో జ్ఞానులు అత్యంత విశాలమైన దృక్పధమును అవలంబిస్తారు. రమణ మహర్షి "ఆత్మావై గురుః" అన్నారు. అనగా తన ఆత్మయే తనకు గురువు అను భావముతో శాస్త్రీయమైన విధానముతో ధ్యానము ప్రారంభిస్తే ఉత్తమాధికారులకు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. లేదా ఇట్టి సాధకునకు పరమాత్మ అనుగ్రహం వలన ఆత్మ జ్ఞానియైన గురువు లభించి ఆయన ద్వారా మోక్ష ప్రాప్తి కలుగుతుంది. శిష్యుడు గురువు కొరకు వెతుక్కుంటునట్లే గురువు కూడా తగిన శిష్యుని కొరకు వెతుకుతూ ఉంటాడు. అయితే ఇందులో ఒక భేదం ఉన్నది. శిష్యుడు సాధకుడు కాబట్టి గురువు కొరకు అతడుచేయు అన్వేషణ భ్రమ, ప్రమాదాలతో కూడి ఉంటుంది. అంటే

సద్గురువని తలచి ఆత్మ జ్ఞాని కాని వానిని గురువుగా వరించుట, అట్టి గురుశిష్య సంబంధము వలన కొంత క్లేశము కలుగుట, తరువాత అట్టి గురువుని విడిచి మరియొక గురువును ఆశ్రయించుట మొదలైన తాపములుకొందరికి కలుగవచ్చును. (అందరికీ ఇలాగే జరుగుతుందని భావము కాదు).

కాని, సద్గురువు ఆత్మజ్ఞాని కాబట్టి ఆయన సంకల్పము అమోఘము కావటం చేత అట్టి గురువు శిష్యుని కొరకు చేయు అన్వేషణ "అప్రతిద్వంద్వమై" నిశ్చయముగా ఫలప్రదమవుతుంది. ఈ విషయమునే వాల్మీకి మహర్షి సుందరకాండలో ఆంజనేయస్వామి సీతాన్వేషణ కొరకై సముద్రమును లంఘించునపుడు

**"దుష్కరం నిష్ప్రతి ద్వంద్వం చి కీర్షన్ కర్మ వానరః"**

అని వర్ణించారు.

మొదటిది దుష్కరమైన కర్మ. అనగా ఇతరులచే చేయవీలుకాని కర్మ (దుష్కరం). ఎందువల్లననగా పూర్వజన్మ సంస్కారం వలన ఏ జీవునకు, ఏ సద్గురువుతో సంబంధం ఉన్నదో ఆ సద్గురువు మాత్రమే ఆ శిష్యుని వెదికి పట్టుకోగలుగును. ఇది ఇతరులకు అసాధ్యము. ఉదాహరణకు శ్రీరామకృష్ణపరమహంసగారిని భైరవీబ్రాహ్మణి వెతుక్కుంటూ వచ్చింది. శ్రీరామకృష్ణపరమహంసగారు వివేకానందులను కలుసుకొనుట కూడా సద్గురువు యొక్క సచ్ఛిష్యాన్వేషణా ఫలితమే. లోకదృష్టిలో మాత్రము వివేకానందుడే గురువును వెతుకుతూ వచ్చినట్లు కనబడుతుంది.

ఇక నిష్ప్రతి ద్వంద్వము అనగా సద్గురువు ఇట్టి అన్వేషణకు ప్రారంభించినపుడు దానికి ప్రతిక్రియ లేక వ్యతిరేక కర్మ లేక విఘ్నము అనేది సృష్టియందు ఉండదు. అన్వేషణ అమోఘముగా పరిణామం చెంది ఆ సద్గురువు శిష్యుని కలుసుకొనియే తీరును (సీతాదేవిని ఆంజనేయస్వామి కలుసుకున్నట్లు). ఇక్కడ ఆంజనేయస్వామిని కలుసుకొనుటకు సీతాదేవి చేసిన ప్రయత్నం ఏమిటంటే నిరంతరం రాముని ధ్యానించుటయే.

నిరంతరము భగవంతుని ధ్యానిస్తే, ఆర్తి కలిగి ఉంటే భగవంతుడే

సద్గురురూపంలో వచ్చి మోక్షమార్గమును చక్కబెట్టును. భక్తి మార్గమున భగవధ్యానము చేయుట కాని లేక జ్ఞానమార్గముచే ఆత్మ విచారణ చేయుట మాత్రమే ఉత్తమ శిష్యుని కర్తవ్యము. అప్పుడు సద్గురువే శిష్యుని వెతుక్కుంటూ వస్తాడు. ఇందుకు భిన్నముగా భక్తి జ్ఞాన సాధనలు చెయ్యకుండా గురువులను అన్వేషిస్తూ తీర్థయాత్రాదులు చెయ్యటం, గుహలలో వెతకటం వ్యర్థమే. మన ప్రారబ్ధము బాగాలేని కాలమైతే గుహలలో జంతువులు ప్రత్యక్షమవుతాయి.

సరైన ఆలోచన లేకుండా, విచక్షణ లేకుండా చేయున దంతయూ వ్యర్థము. అనన్య భావము కలిగిన పిమ్మట సార్థకత్వము సులభముగా సిద్ధించును. సరైన ఆలోచన చేయువాడే ఉత్తమ సాధకుడు.

అనేక జన్మములెత్తిన పిమ్మటనే మనుష్యజన్మము లభించును. కావున మనిషి జన్మ ఎత్తినందుకు నీతిని, న్యాయమును వీడక సత్యముగా ప్రవర్తించుట, జీవించుటయే సార్థకత్వము. సాంసారిక కార్యములను నియమ పూర్వకముగా ఆచరించవలెను. ఇందు వలన ఇహపరములు రెంటియందునూ సౌఖ్యము కలుగును.

మానవుని ఆయువునకు నియతి నూరు సంవత్సరములు. అందు బాల్యావస్థ అజ్ఞానములో, యౌవనము సంపూర్ణ విషయ సుఖములతోను గడచి పోవుచున్నది. వృద్ధాప్యము నందు నానావిధ రోగములను, కర్మ భోగములను అనుభవింపవలసి యున్నది. ఇక భగవంతుని భజనమెప్పుడు? రాజకీయములు, దైవికోద్వేగములు అగు చింతల యందో,, అన్న వస్త్ర శరీర రక్షణల యందో ఇట్టివే ఇంకనూ ఇతర బంధములందు తగులుకొని యున్న సమయము నందు ఆకస్మికముగా మృత్యువు ఏతెంచును. జనులు మరణింతురు. పుణ్యమార్గమంతయు వ్యర్థమై, పాప కర్మానుభవము మితిమీరును. కావున అజ్ఞానముతో ప్రవర్తించకూడదు.

ఇహపరములు రెంటిని సాధించు ప్రయత్నము చేయవలెను. అలసత, సోమరితనము వలన ఉదాసీనత్వము, దారిద్ర్యము కలుగును. ప్రయత్నము నిష్ఫలమగును. కాబట్టి సోమరితనము లేకుండుట వలననే కార్యము సిద్ధించును. ఇందుకు పెద్దలు మనము నిత్యమూ ఆచరించ వలసిన కొన్ని విధులను గురించి చెప్పిరి. . . ఉషః కాలము నందే లేచి

కొన్ని ఉత్తమ వచనములను మననము చేయవలెను. యథాశక్తిగా, యథావకాశముగా పరమాత్మను స్మరింపవలయును. సంధ్యా వందనాది యథోచిత కార్యములను, గృహ కార్యములను ధర్మబద్ధముగా నిర్వర్తింపవలయును. మధుర భాషణములతో ఎల్లరను తమకు ఇష్టులుగా చేసుకొనవలెను. "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్". ఎల్లప్పుడు సత్యమును, ప్రియమును అగు సంభాషణ చేయవలెను.

మనస్సును సావధానముగను, ఏకాగ్రముగను ఉంచవలెను. భోజనానంతరము ఏవైనా ఉత్తమ గ్రంథములను చదువవలెను, చర్చించవలయును. లేదా ఏకాంతమున నుండి నానావిధ గ్రంథములను మననము చేయవలెను. ఇట్లు చేయుట వలన మానవులు నేర్పరులగుదురు.

పుణ్యాత్ములైన వారు తమ జీవిత కాలము నందు ఒక్క క్షణమైనను వ్యర్థము చేయక గృహ వ్యాపారములను ధర్మ బద్ధముగా నేర్పుతో నిర్వర్తించుచు, సత్కార్యములు చేయుచుందురు. (లోకహితమును కోరి). కొంతధర్మ చర్చ, పురాణము, హరికథాశ్రవణము, ఆధ్యాత్మ నిరూపణము మొదలగు సత్కాలక్షేపము చేయుచు ఇహపర సాధన చేస్తుంటారు. ఈ విధముగా సావధానులై ప్రవర్తించు వారికి దుఃఖం ఎలా కలుగుతుంది? అట్టి వారి అభిమానము, అహంకారము వివేకము వలన నశించును. ఈ జగత్తంతయూ ఈశ్వర స్వరూపమేనని, అంతయూ ఈశ్వర సంకల్పాను సారముగా జరుగుచుండునని తెలుసుకొని ప్రవర్తించవలయును. ఇందువలన ఉద్వేగము నశించును. ఈ ప్రపంచము నందు ధనము ఎలా అవసరమో, పరమార్థచింతన కూడా అట్లే అవసరము.

మహా వాక్యార్థ విచారణము చేత మోక్షము నందు ఆసక్తి కలిగి మోక్ష సాధన సులభమగును. కర్మము, భక్తి జ్ఞానము వలన చిత్త సమాధానము కలుగును. కాబట్టి పరమార్థ సాధనములను శ్రవణముగావింపవలెను.

బ్రహ్మము నిరాకారము. నిర్వికారము. దానియందు వికారము లేదు. అది నిశ్చలము. మనసు చంచలమైనది. సర్వమునకు ఆత్మసాక్షివలెనున్నది. ఆత్మ లేని పదార్థము జడము. అది లేని దేహము మృతము. కర్మ మార్గము, ఉపాసనా మార్గము, జ్ఞానమార్గము, సిద్ధాంత

మార్గము, ప్రవృత్తి నివృత్తి మార్గములను ఈశ్వరుడే నడుపుచున్నాడు.

జగత్తు, ఈశ్వరుడు, అంతర్యామి, జీవుడు, అంతఃకరణము అను ఐదు పదములను, వాటి అర్థమును గురించి విచారించెదము.

(1) <u>జగత్తు</u>: - జగత్తు అనగా గతిశీలమైనది. ఇంద్రియగ్రాహ్యము అయిన బాహ్య ప్రపంచము. దీనినే ప్రకృతి అనీ, Nature అనీ, World అనీ వ్యవహరిస్తారు.

(2) <u>ఈశ్వరుడు</u>: - అనగా సృష్టిస్థితి ఉపసంహారము చేయు సగుణ పరబ్రహ్మ. ఈయన విష్ణువు అని చెప్పునప్పుడు ఆయన ఉండే లోకాన్ని "వైకుంఠం" అంటారు. శివుడని చెప్పునప్పుడు ఆయన నివాస స్థానము "కైలాసం" అని అంటారు. చతుర్ముఖబ్రహ్మ అన్నప్పుడు ఆయన నివాసం "సత్యలోకం". సృష్టి, స్థితి, లయములు చేయు ఈశ్వరుడు ఒక్కడే కావున బ్రహ్మ విష్ణుమహేశ్వరులు ఒక్కటే. వారు చేయు పనులను బట్టి వేరు వేరు నామములు.

(3) <u>అంతర్యామి</u>: - జడచేతనాత్మకమైన సమస్త భూతములందు (లోపల) చరించుచు ఆయా భూతములను, జీవులను తన ఇచ్ఛ ప్రకారము నియమించువాడు అంతర్యామి. ఈశ్వరుడే అంతర్యామి అవుతాడు. ప్రతి జీవియందును, ప్రతి దేహము నందును విభక్తముగా అంతర్యామి ఉన్నాడని అనిపించినప్పటికీ అందరిలోనూ ఉన్న అంతర్యామి ఒక్కడే. (యమ యతి ఇతి – యామి ... అంటే నియమించువాడు)

(4) <u>జీవుడు</u>: - సుఖదుఃఖములను అనుభవిస్తూ జన్మ పరంపరలను పొందుచున్న వాడు జీవుడు. కారణ శరీరాభిమానిని జీవుడే అని అంటాము. కారణ శరీరము అనగా అవిద్యా ఉపాధి కలిగి యుండుట. అనగా "నేను బ్రహ్మమును" అని తెలియక పోవుటయే ఉపాధిగా ఉండుట. సామాన్య జనులు కారణ శరీరము, సూక్ష్మ శరీరము అను భేదమును గుర్తించలేరు.

అందుచేత చనిపోవునప్పుడు శరీరమును విడిచి అన్య శరీరమును ధరించుచున్న సూక్ష్మశరీరమును, దాని అభిమానిని కలిపి జీవుడు అని అంటూ ఉంటారు.

(5) <u>అంతఃకరణము:</u> - అనగా లోపలి సాధనము. పంచజ్ఞానేంద్రియములు త్వక్చక్షుశ్రోత్రజిహ్వాఘ్రాణములు. ఈ జ్ఞానేంద్రియములు స్వయముగా దేనిని తెలుసుకొనలేవు. మనస్సు సహాయముతో మాత్రమే జ్ఞానేంద్రియములు విషయములను గ్రహించగలవు. ఈ మనస్సు మనో బుద్ధిచిత్త అహంకారములని నాలుగు విధములుగా ఉంటుంది. మనస్సనగా సంకల్ప ప్రవాహము. ఈ సంకల్ప ప్రవాహమును మనోవృత్తులు అంటారు. వర్తమాన కాల సంకల్ప వికల్పములను మనస్సు అంటారు. అనుభూత విషయ వృత్తిరూపమైనటువంటిది, స్మృతియోగ్యమైన దానిని చిత్తము అని అంటారు. విస్మృతి చెందినట్టి చిత్తమును "అచేతనాచిత్తము" (unconscious mind) అని ఆధునిక తత్వశాస్త్ర వేత్తలు అంటున్నారు. విస్మృతి పొందినప్పటికి ప్రయత్నము చేత తిరిగి జ్ఞాపకమునకు తీసుకుని రాదగిన చిత్తభావమును "అర్ధచేతనాచిత్తము" (Subconscious mind అంటారు. నిశ్చయాత్మకమైన మనోవృత్తులను "బుద్ధి" లేక "విజ్ఞానము" అని అంటారు. ధర్మాధర్మములు, విలువలు, మనము యదార్థములని భావించే దృఢ అభిప్రాయములన్నీ బుద్ధిలో భాగములే. ఇవి కాక ప్రియము, మోదము, ప్రమోదము, ఆనందము అను వృత్తులను పూర్వకాలములో "ఆనందమయకోశము" అని వర్ణించేవారు. మనస్సుకు సంబంధించినంత వరకు ఈ ఆనందమయకోశ భాగములను కూడా నేటి శాస్త్రవేత్తలు బుద్ధిలో భాగమే అంటున్నారు. అందుచేత భక్తి యొక్క స్థాయీ భావములన్నీ బుద్ధిలో భాగము క్రిందే లెక్క. జ్ఞానము, భక్తి, సాధనలకు కూడా విజ్ఞానమయకోశమని చెప్పబడు బుద్ధియే ఆధారము.

దేవతలు అని చెప్పబడువారు ఈశ్వర నిర్మితమైన సమష్టి విజ్ఞానమయ కోశంలో ఉండే దివ్యశక్తులు. దేవతలను మంత్రపూర్వకముగా ప్రార్థించినందువలన బుద్ధి యందు భక్తి సంబంధమైన లేదా జ్ఞాన సంబంధమైన వృత్తులు ఏర్పడుతాయి. "ధీయోయోనః ప్రచోదయాత్" అను గాయత్రీ మంత్రమునకు ఇదియే అర్థము.

ఈ విజ్ఞానమయ కోశమునే అరవిందఘోష్‌గారు "Over Mind అనేవారు. "Over Mind" కు సంబంధించిన లోకములలో దేవతాశక్తుల ఉండునని అరవిందఘోష్‌గారు చెప్పారు.

<u>అహంకారము:</u> - అహంకారము అనగా నేను అను కర్తృత్వ, భోక్తృత్వ అభిమానము. అహంకారము అంటే గర్వము అని అర్థం కాదు వేదాంత పరిభాషలో. నేను చూచుచున్నాను అన్నప్పుడు "నేను" అను కర్తృవాచక పదము "చూచుట" అను క్రియా వాచకపదముతో సంబంధించి కర్తృత్వ అభిమానమును తెలుపుచున్నది. పసితనము నుండి అనేక కర్మములు చేస్తున్నప్పుడు నేను, నేను అను బుద్ధివృత్తి ఏర్పడుతుంది. అట్లే సుఖదుఃఖాది అనుభవము కలిగినప్పుడు "నేను సుఖంగా ఉన్నాను, నేను దుఃఖంగా ఉన్నాను" అను భోక్తృత్వ అభిమానము వలన నేను అను బుద్ధి వృత్తి ఏర్పడుతుంది. చిన్న చిన్న గడ్డి పరకలు పెనవేసుకుని బలమైన త్రాడుగా ఏర్పడినట్లు ఈ నేను, నేను అను చిన్న చిన్న బుద్ధి వృత్తులు అనేక జన్మలందు బలపడి "నేను" అనే గొప్ప అహంకార రూపమగు బంధంగా ఏర్పడుతుంది. నేను అనునది వస్తువు కాదు. పదార్థము కాదు. బుద్ధివృత్తి మాత్రమే. ఈ అహంకారము ప్రబల బంధముగా పెనవేసుకుపోయి జీవత్వ భ్రాంతికి కారణము అవుతున్నది... ఆధారము అవుతున్నది. "నేను జీవుడు కాదు. 'నేన'నే జీవుడు లేడు" అని అద్వైత సిద్ధాంతము చెప్పుచున్నది.

జగత్తు, ఈశ్వరుడు, గురువు, అంతర్యామి, అంతఃకరణము, జీవుడు ... మొదలైనవన్నియు అదిష్ఠాన రూపమగు నిర్గుణ పరబ్రహ్మ యందు అధ్యాసవలన రజ్జువునందు సర్పమువలె అధ్యారోపము వలన ఏర్పడుచున్నవి. ఇవన్నియు వ్యావహారిక సత్యములని లేదా ప్రాతిభాసిక సత్యములనీ, పరబ్రహ్మ మాత్రమే పారమార్థిక సత్యమనీ శాంకరీయ వేదాంత శాస్త్రము ఉద్ఘోషించుచున్నది.

"మమవర్త్మాను వర్తంతే మనుష్యా పార్థ సర్వశః
గీత

"ఓ పార్థా ! నన్ను పొందే మార్గమునే మనుష్యులు అన్ని విధములా అనుసరించుచున్నారు" అన్నాడు కృష్ణపరమాత్మ.

"భగవత్సాన్నిధ్యమును పొందాలి" అంటే విషయవ్యామోహములను విడిచి పెట్టాలి. ఈ సంసారము అనిత్యమైనది. నిస్సారమైనది. సంసారమునందు వ్యామోహము నశించనిదే భగవంతుడు లభించడు.

మనుష్యత్వం, ముముక్షత్వం మహా పురుషులతోడి సాంగత్యం మూడూ దుర్లభములు. కేవలము దైవానుగ్రహము వలననే లభించును. ఇవన్నీ లభించగల అవకాశమున్న మానవజన్మ మోక్ష సాధనకు అనువైనది.

వ్యక్తి స్వభావ సాధనా భేదములను బట్టి భగవత్సాక్షాత్కారమును పొందు మార్గములు భిన్నములు కావచ్చును. మోక్షమును పొందవలెననెడి కోరికే (ముముక్షత్వము) లేనిచో భగవంతుని సాక్షాత్కారము అసాధ్యము. మోక్షమును పొందవలెనను దృఢమైన దీక్ష, సుఖదుఃఖములకు అతీతముగా ఉండగల స్వభావము. ప్రపంచము పట్ల ఉదాసీన భావము, భగవంతుని పొందవలెననెడి తీవ్రమైన ఆకాంక్ష ఎప్పుడు కలుగుతుందో అప్పుడు మాత్రమే భగవత్సాక్షాత్కారమునకు అర్హులు కాగలరు.

మహాపురుషులతోటి సాంగత్యముకూడా అత్యంత ఆవశ్యకమైనదే. తమ లక్ష్యసిద్ధిని పొందిన మహాపురుషుల జీవితములను బట్టి మన జీవితములను కూడా చక్కదిద్దుకొనవచ్చును. ప్రపంచము పట్ల వైరాగ్య భావము, మోక్షమును పొందవలెనన్న ఆసక్తి ఉన్నంత మాత్రముననే సరిపోదు. గురూపదేశము కూడా అవసరము. సద్గురువు యొక్క ఉపదేశము వలన ఒక గురువు నుండి మరియొక గురువునకు పారం పర్యముగా సంక్రమించుచు వచ్చిన ఒక గొప్ప శక్తితో సంబంధమేర్పడును. ఆధ్యాత్మ పథమునందు ముందుకు పోవుటకు గురువు అత్యంత ఆవశ్యకము. దోషరహితుడు, నిష్కాముడు, బ్రహ్మజ్ఞాన సంపన్నుడు మాత్రమే గురువుగా ఉండదగినవాడు.

'తద్విజ్ఞానార్థం సగురుం ఏవ అధిగచ్ఛేత్
సమిత్పాణిం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"
ముండకోపనిషత్తు.

"ఆ బ్రహ్మను గురించి తెలుసుకొనుటకు శిష్యుడు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అగు గురువు వద్దకు వెళ్ళవలెను అట్లు గురువు వద్దకు వెళ్ళునప్పుడు గురువు గారి అగ్నిహోత్రాదులకు ఉపయోగపడు సమిధలు మొదలగు వాటిని శుశ్రూషా పరాయణుడై తీసుకొని వెళ్ళవలెను."

శ్రోత్రియుడు, బ్రహ్మ జ్ఞాని అయిన సద్గురువుతో సంబంధము

ఏర్పడినప్పుడు ఆత్మజ్ఞానము సులభ సాధ్యమగును. ఆత్మ మరియొక ఆత్మ వలన మాత్రమే ప్రేరణము పొందగలుగును. కేవలము గ్రంథ పఠనమువలన ఇట్టి ఆత్మవికాసము కలుగదు. ఆత్మజ్యోతి ప్రకాశించుటకు కావలయు ప్రేరణ శక్తి మరియొక ఆత్మనుండియే ప్రసరించవలయును. అట్టి ప్రేరణ ఎవరినుండి లభించునో అతడే గురువు. ఆ ప్రేరణా శక్తిని గ్రహించు వాడు శిష్యుడు. సద్గురువు ఆత్మజ్ఞాని అయి ఉండవలెను. గురువునుండి ప్రేరణ గ్రహించు అర్హత శిష్యునికి ఉండవలెను. తాత్కాలిక భావావేశమే పారమార్థిక జిజ్ఞాస యని శిష్యుడు భ్రమించరాదు. ఆచార్యులు కూడా శిష్యుని పెడత్రోవ పట్టించువారు కాకూడదు. గురుశిష్యులు ఇరువురు కూడా పవిత్రహృదయులై యుండవలెను. చిత్తశుద్ధిలేనిదే పారమార్థిక చింతన కలుగదు. గ్రంథపఠనము, ఉపన్యాసశ్రవణములవలన కలుగునది తాత్కాలిక ఆవేశము మాత్రమే అయినచో అందువలన ప్రయోజనము లేదు. జీవితపరమార్థమగు మోక్షమును సాధించుటకు చిత్తశుద్ధి, నిష్కామ కర్మాచరణ, ఆర్తితోకూడిన పారమార్థిక చింతన, దృఢమైన నమ్మకము, అచంచలమైన విశ్వాసము. మొదలైన లక్షణములు కలిగిన శిష్యులు మాత్రమే గురూపదేశమును పొందుటకు అర్హులవుతారు. మనలో అసలైన ఆర్తి కలిగినపుడు, జీవితపరమార్థమును పొందవలెనని పరితపించునపుడు భగవంతుడే సద్గురు రూపమున మనచెంత చేరి తత్త్వోపదేశము చేయును. ఇది సత్యము.

శాస్త్రజ్ఞానము, శబ్దవ్యాఖ్యానములు, వాక్పటిమ, ఉపన్యాస పాండిత్యము మాత్రమే సద్గురువులక్షణము కాదు. ఇవి పాండిత్య ప్రదర్శనకే గాని పారమార్థిక సాధనకు ఉపకరించవు. తాను స్వయముగా ఆత్మదర్శనము చేయగలిగిన సద్గురువు మాత్రమే శిష్యుని యందు అసలైన ఆధ్యాత్మిక ప్రేరణను కలిగించగలుగును.

శుష్కమైన తర్కజ్ఞానము, వితండవాదములవలన ఆత్మజ్ఞానము లభింపదు. భగవద్గీత గురించి చర్చలు జరుపువారికంటె అందులో ఏఒక్కమార్గమునైనను ఆచరించు వారుమాత్రమే పరమార్థమును సాధించగలరు.

"మామిడి తోటకు వెళ్ళి చెట్ల ఆకులు, కాయరంగును, ఆ తోట

విశేషములను గురించి శుష్కముగా చర్చించువారికంటె ఇటువంటి చర్చలలో పాల్గొనకుండా ఒక పండుకోసుకుని హాయిగా తినువాడు ఆపండురుచిని అనుభవించగలడు. అట్టివాడే బుద్ధిమంతుడు. అతనికి అనుభవ పూర్వకంగా పండురుచి తెలుస్తుంది. మిగిలిన వారికి వ్యర్థప్రసంగము చర్చమాత్రమే మిగులుతుంది" అంటూ శ్రీరామకృష్ణ పరమహంస గారు చెప్పేవారు. కావున అనుభవజ్ఞానము శాస్త్రపాండిత్యము కంటే ఎంతోగొప్పది.

జిజ్ఞాసువునకు జ్ఞానదృష్టిని కలిగించి అంతటా వ్యాపించిన పరమాత్మ స్వరూపమును దర్శింపచేయగలవాడే సద్గురువు. అట్టి గురువు సాక్షాత్తూ దైవస్వరూపుడే. అట్టి గురువుయెడల శ్రద్ధ, వినయము, విధేయత కలిగియుండి శిష్యుడు మిక్కిలి బుద్ధికుశలతతో ఆత్మ జ్ఞానమును గ్రహించవలెను. ఆత్మజ్ఞానము ధనముచే, గ్రంథములచే లభించునట్టిది కాదు. పరిపక్వహృదయముతో సద్గురు ఉపదేశము పొందుట వలన త్రికరణశుద్ధితో గురువాజ్ఞను పాలించుటవలన మాత్రమే ఆత్మ జ్ఞానము కలుగును.

**ఆచార్యం మాం విజానీయాన్నావమన్యేతకర్హిచిత్**
**నమర్త్య బుద్ధ్యాసూయేత సర్వదేవమయోగురుః**
**భాగవతము (II-17-27)**

"నన్ను ఆచార్యునిగా తెలుసుకొనవలెను. ఎప్పుడూ నన్ను అవమానించకూడదు. మానవుడను బుద్ధితో భావించి, నన్నుచూసి అసూయ పడకూడదు. గురువు సర్వదేవమయుడు. అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. "కృష్ణం వందే జగద్గురుం". పరమాత్మయగు ఆశ్రీకృష్ణుడు ఈజగత్తునకు గురువుగా తెలుసుకొనవలెను. మూఢమైన బుద్ధికలవారు కృష్ణుడు కేవలము నరుడని భావించెదరు. సాక్షాత్తూ భగవదవతారమూర్తులైన, మహనీయులైన ఉత్తమశ్రేణికి చెందిన ఆచార్యులు సంకల్పమాత్రముచేత, స్పర్శాదీక్షచేత, శక్తి పాతముచేత, అర్హులైన శిష్యులయందు ఆత్మజ్ఞానమును ప్రకాశింపచేయగలుగుతారు. అట్టి ఉత్తములైన సద్గురువును ఆశ్రయించి, సేవించి ఆత్మజ్ఞానమును పొందవలయును.

"లోకమునందు ధర్మమునకు 'గ్లాని' సంభవించినపుడుతానే స్వయముగా అవతరించి ధర్మసంస్థాపనము చేయుదునని కృష్ణ భగవానుని ప్రతిజ్ఞ.

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతః
అభ్యుద్ధానమధర్మస్య తదాత్మానం సృజాంమ్యహమ్"
భగవద్గీత 4అ. 7శ్లో

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం
ధర్మసంస్థాపనార్ధాయ సంభవామి యుగేయుగే
భగవద్గీత 4అ 8శ్లో.

కరుణామయుడగు భగవానుడు లోకకళ్యాణమునకై, ధర్మమును పునరుద్ధరించుటకై అవతరించి ప్రతియుగమునందును తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుచున్నాడు.

జగద్గురు ఆదిశంకరులు, శ్రీరామకృష్ణ పరమహంసగారు, శ్రీషిరిడీ సాయిబాబాగారు, శ్రీసత్యసాయిబాబాగారు ఇంకనూ మరెందరో మహనీయులైన వారు ఈలోకమునందు ఆధ్యాత్మిక ప్రబోధమునకై కృషిచేసిన, చేయుచున్నవారే. వీరందరూ భగవదవతారములే. కావున గురువునుండి ఉపదేశమును పొందినతరువాత సాధకుడు తన లక్ష్యమునందే ధ్యానము కేంద్రీకరించి నిర్ణీత మార్గమున ఆత్మజ్ఞానమును అనుభవమునకు తెచ్చుకొనుటకు అభ్యాసము చేయవలెను. భగవంతుని సాన్నిధ్యమును పొందవలెనని కోరిక ఉన్ననూ, గురువు లభించి ఉపదేశము పొందినప్పటికీ కూడా అభ్యాసము లేనిదే, తెలుసుకున్నదానిని ఆచరణలోపెట్టుటకు ప్రయత్నించనిదే ఆత్మసాక్షాత్కారము కలుగదు. తీవ్రమైన శ్రద్ధ ఉన్నప్పుడే గమ్యమును చేరగలుగుదురు.

మానవ జన్మయొక్క ఉన్నతలక్ష్యము సంసారబంధముల పట్ల నిర్లిప్తముగా నుండుట, ఐహిక ఆముష్మికముల యెడ వైరాగ్య భావము కలిగియుండుట, గుణదోషములకు అతీతముగా ఉండుట. ఇట్లుండుట వలన తుదకు సచ్చిదానంద బ్రహ్మానుభవమును పొందగలరు.

సద్వస్తువు అనగా ఎల్లప్పుడు ఉండునది. అసద్వస్తువు అనగా

ఎల్లప్పుడు ఉండనిది. భగవంతుడు ఎల్లప్పుడు ఉండువాడు కాబట్టి సత్కర్మ అనుమాటకు భగవంతుని పొందుటకు చేయబడు కర్మలేక పుణ్యకర్మ అను అర్థము వచ్చినది. అసత్ అనగా ఎల్లప్పుడూ లేనిది, ఉన్నట్లుగా కనబడునది. దీనినే అవిద్య లేక మాయ అంటారు. అందువలన అసత్కర్మ అంటే అజ్ఞానముతో చేసే కర్మ లేక పాపకర్మ అని అర్థము వచ్చినది. ఈదృష్టితోటే సత్పురుషుడు అనగా పుణ్యాత్ముడనీ, అసత్పురుషుడు అంటే పాపాత్ముడనీ లోకవ్యవహారము. అనగా అజ్ఞానమే సకల పాపములకు మూలమని, జ్ఞానమే సకల పుణ్యములకు ఆధారమని పూర్వులు గుర్తించారు.

సత్,అసత్ లను వివేకముచేత తెలుసుకొని సద్రూపమైన పరబ్రహ్మమగు ఆత్మయే తానని ఎరిగి అపరోక్ష జ్ఞానము పొందుట వలన దేహాది సకల ప్రపంచములో కల ద్వైతభావము నశించును. అజ్ఞానదృష్టిలో జగత్తు బ్రహ్మమునకు భిన్నంగా నుండును. జ్ఞానానుభవ దృష్టిలో అభిన్నముగా ఉండును. బ్రహ్మము సద్రూపముగా ఉండుట వలనను బ్రహ్మము మాయకు ఆధారముగా ఉన్నదని సామాన్యముగా భావించినను, మాయ అనగా సత్ అనిగాని, అసత్ అనిగాని చెప్పలేమని, అది బ్రహ్మనుండి భిన్నమనికాని, అభిన్నమని కాని చెప్పలేమని, మాయసాంగమనిగాని, అనంగమనికాని చెప్పలేమని, మాయ అనిర్వచనీయమని శంకరులు వివేకచూడామణియందు చెప్పినారు. ఇవి గహనమైన తర్క శాస్త్రమునకు సంబంధించిన వాక్యములు.

పరబ్రహ్మమును తెలియక. అజ్ఞానముతో కూడియుండుటయే బంధము. ఆత్మ స్వరూపుడనగు నేను తప్ప వేరొక బ్రహ్మములేదని తెలియుట మోక్షము. విశ్వరూపుడగు ఈశ్వరాంశయే జీవుడు. ఈజీవుడు జ్ఞానము పొందినప్పుడు అట్టి జ్ఞానియొకడు భుజించిన యెడల విశ్వరూపుడగు ఈశ్వరుడు తృప్తి నొందుచున్నాడు. అందువలన జగత్తు అంతయు తృప్తినొందును.

సర్వమూ బ్రహ్మమేననియు, ఆయా ఇంద్రియములు చేయు, ఆయా కర్మలన్నియు తమకు సంబంధము లేవని కర్తృత్వాభిమానము లేక నిశ్చలముగా ఉండుట వలన వారికి ఆకర్మఫలములు చెందజాలవు.

"ముక్త సంగో అనహంవాదీ" (సంగములేనివాడు నేను కర్తను కాను అని తెలుసుకున్నవాడు).

కర్మ, ప్రాణాయామము, యోగము, తపస్సులచేత మనసును స్థిరముగా చేసి ఈశ్వరానుగ్రహమును పొంది, ఆత్మజ్ఞాన సిద్ధిని పొందవలెను. కోరికలతో చేసే యోగము, తపస్సు ఈరెండునూ కామ్యములగుట వలన నిష్కామియగు బ్రహ్మజ్ఞానిగా నుండువారు అట్టి సకామములగు వాటిని కోరరు.

తపస్సు రెండు రకములుగా నుండును. లోకములో అణిమాది సిద్ధులకొరకు, భూతభవిష్యద్వర్తమానలోకవార్తాశ్రవణాదులకొరకు చేయు తపస్సు ఒకరకము. బ్రహ్మజ్ఞానము కొరకు చేయు తపస్సు మరొకరకము. ఈరెండు విధములైన తపస్సులు వేరు వేరని విద్యారణ్యస్వామి వారు చెప్పారు. అందువలన కేవలము మంత్రయంత్రాది సాధనములవలన బ్రహ్మజ్ఞానము కలుగుతుంది అని అనుకొనకూడదు. బ్రహ్మజ్ఞానము కొరకు చేయు బ్రహ్మ విచారణారూపమైన తపస్సు వలన మాత్రమే బ్రహ్మజ్ఞానము కలుగుతుంది. అందుచే "తపసా బ్రహ్మవిజిజ్ఞాసస్వ" అని తైత్తిరీయ శృతిలో "తపస్సుచే బ్రహ్మము తెలుసుకొనగోరుము" అన్నప్పుడు తపస్సు అనగా బ్రహ్మవిచారణ అనే అర్థము. దీనినే రమణ మహర్షి "నేను ఎవరు?" అని అన్వేషించుట అని చెప్పారు.

వేదాంత శాస్త్రములను విచారణ చేయుటవలనను, తనను తాను ఎరుగుటవలనను, ఆత్మస్వరూపుడగు పరబ్రహ్మలక్షణము బాగుగా తెలిసినందువలనను తనకంటె వేరు పదార్థములేదని ఆనందించుచు జ్ఞాని ముక్తుడగుచున్నాడు. కనుక జ్ఞానము వలననే మోక్షము కలుగును.

ఈశ్వర ఉవాచః

"ఏ ప్రదేశమునందు జ్ఞాని నిత్యము నివసించి యుండునో అచ్చటనే నేను సర్వదా నివసించి యుందును. జ్ఞానియైన పురుషుడు నిమేష మాత్రముగాని, అందు సగము కాలము గాని ఎచ్చట నిలుచునో అచ్చట అన్ని తీర్థములు వచ్చి వాసముచేయును. నాకును బ్రహ్మ విదునకు భేదము లేదు. విశేష ప్రయత్నము చేసియైనను బ్రహ్మవేత్తల

దర్శనార్థము పోవలయును". (సూతసంహిత సప్తయోధ్యాయము)

మానవులందరూ సుఖమును పొందడం కోసం, దుఃఖమును పోగొట్టుకోవటం కోసం ప్రయత్నిస్తుంటారు. ఎందువలన సుఖపడాలని కోరుకుంటారు? సుఖము జీవుని స్వరూపము కనుక. అటువంటి వారికి వేదము అలౌకిక సుఖసాధనమును ఉపదేశిస్తుంది. ఆ పరమాత్మను తెలుసుకొనుటచేత జీవుడు మృత్యువును అతిక్రమించు చున్నాడు.

**"అతి మృత్యుం ఏతి" -- శ్రుతి.**

"నిస్సంగత్వముమోక్షమును కలుగ చేస్తుంది. నిష్కామ ధర్మాచరణ చేయు వానికన్న, చిత్తమును, సమస్త కర్మలను, వాటి ఫలములను ఈశ్వరార్పణగావించి, భేదభావములేని వాడైన ఆ పరమాత్మను ఉపాసించు వాడు శ్రేష్ఠుడు. ఈ విధముగాచిత్తము, సమస్త కర్మలను సమర్పించి, అకర్తయై సమదర్శియైన పురుషుని కంటె శ్రేష్ఠుడు లేడు. అతడే అందరికంటెను ఉత్తముడు, శ్రేష్ఠుడు.

ఎవరైతే తమ మనఃప్రాణములు భగవంతుని యందు అర్పించి యున్నారో వారి కోరికలు, కామనలు సంసారమువైపునకు ఈడ్చుకొని పోవు. వేయించిన లేక ఉడకబెట్టిన విత్తనములు తిరిగి మొలకెత్తవు.

దేనియందును అపేక్షలేని వాడును, ప్రాపంచిక చింతనలను విడిచి భగవచ్చింతనమునందే సదా లీనమైయుండు వాడును, శాంత స్వభావుడును, ఎవ్వరితోను వైరభావములేని వాడును, రాగద్వేషరహితుడై సర్వత్ర సమదర్శనము కలవాడును, అనగా బ్రహ్మజ్ఞానియైన మహాను భావునికీ భగవంతునికీ భేదము లేదు.

నిష్కామ కర్మవలన భక్తి, భక్తి యోగము ద్వారా విషయవాసనలకు దూరం కావటం, ఐహికా ముష్మిక భోగముల పట్ల విరక్తి కలగటం జరుగుతుంది. అలా దృఢమైన వైరాగ్యము వలన కలిగే జ్ఞానముచే పరమేశ్వరుని అనుగ్రహము వలన పరమపదం లభిస్తుంది.

విజ్ఞులైన వారు సుఖాలకు పొంగరు. దుఃఖము కలిగిందని క్రుంగిపోరు. వారు సర్వభూతములలోను ఆ పరమాత్మనే దర్శిస్తారు. సర్వభూత హితులైన వారు మాత్రమే భగవంతుని సర్వత్రా దర్శించ గలుగుతారు.

జన్మించినవారు మరణించటం, మరణించినవారు తిరిగి జన్మించటం తప్పదు. అవి ధమైన జీవితం దుఃఖమయమైనది. జీవుడు పూర్వజన్మకర్మ ఫలాన్ని అనుభవించక తప్పదు. మమకారంతో, స్వార్థంతో చేసే కర్మలకు అజ్ఞానమే మూలం. ఆత్మజ్ఞానం లభించనంతవరకూ జీవి అజ్ఞానంతోనే ఉంటాడు. ఆత్మ జ్ఞానాన్ని పొందినవారికే శాశ్వతమైన పరమానందానుభూతి సిద్ధిస్తుంది. విరక్తినీ, జ్ఞానాన్నీ పొందటానికి అనన్యమైన భగవద్భక్తి అవసరం.

పవిత్రమైన కర్మాచరణ పరమోత్కృష్టమైన భావాలను కలిగిస్తుంది. అట్టి పరమోత్కృష్ట భావాలకు పరమావధి పరమాత్మ సాక్షాత్కారం. దాన్ని పొందటానికే ప్రతి జీవి ప్రయత్నించాలి. అదే జీవిత పరమార్థం. అలా జీవిత పరమార్థమును పొందుటకై సోదర ప్రాణులను కూడా ప్రోత్సహించాలి. మృత్యురూపమైన సంసారంలో చిక్కుకొని బాధలు పడేవారికి భక్తి మార్గాన్ని చూపటం జ్ఞానులైన వారి ధర్మం. జ్ఞానులై కూడా అధర్మాచరణకు పాల్పడితే వారు అజ్ఞానులుగనే పరిగణింపబడతారు. ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవటమే విద్యాసముపార్జనకు అర్థం. కాని అశాశ్వతమైన ఈ ప్రపంచంలో సౌఖ్యం పొందాలని ప్రయత్నిస్తూ ఉన్నంతవరకూ ఆత్మజ్ఞానం అలవడదు.

నిర్మలము, శ్రేష్ఠము అయిన జ్ఞానాన్ని గురించి విని, బుద్ధి చేత దానిని తెలుసుకొనవలెను. ఎందువల్లనంటే జ్ఞానమనేది స్థూల నేత్రములకు కనిపించే విషయం కాదు. బుద్ధిద్వారా ఒక పర్యాయం దానిని తెలుసు కొనుటవలన అది తన శక్తిని ఈ శరీరంపై ప్రసరింప చేస్తుంది.

నిజమునకు ధర్మము, అధర్మము, సుఖము, దుఃఖము, లాభము, నష్టము, రాజకీయసిద్ధాంతాలు, గణిత శాస్త్రసిద్ధాంతములు ఇత్యాది అనేకవేల విషయములు స్థూల నేత్రములకు ఎప్పుడూ కనపడేవి కావు. అవన్నీ బుద్ధికి మాత్రమే గోచరిస్తాయి. అందుచేత భగవత్తత్వము కూడా బుద్ధి గోచరమైనదే.

భగవద్దర్శనము అంటే సమ్యక్ జ్ఞానము కలిగియుండటమే అని శ్రీమద్భాగవతము నందు చెప్పబడినది. లోకమును చూసినట్లు స్థూల

నేత్రములతో భగవంతుని చూచుట ప్రధాన విషయము కాదు. దుర్యోధనాదులు కూడా శ్రీ కృష్ణుని చూచినవారే. అయినా వారి ప్రవృత్తులలో ఎట్టి మార్పు కలుగలేదు. అంతర్దృష్టిచే భగవత్తత్వమును గుర్తించుటయే ముఖ్యము. ముక్తికి కారణము.

జ్ఞానయోగ సాధకుడు అనుసరించవలసిన ముఖ్యమైన లక్షణము లను భగవద్గీతలోని ఐదు శ్లోకములలో కృష్ణపరమాత్మ పేర్కొన్నారు. (13వ అధ్యాయము 8నుండి 12వరకు గల ఐదు శ్లోకములు)

**అమానిత్వ మదమ్భిత్వ మహింసాక్షాన్తి రార్జవమ్**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః (13-8)**

**ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకారేవచ**
**జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్ (13-9)**

**అసక్తిరనభిష్వఙ్గః పుత్రదారా గృహాదిషు**
**నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టో పపత్తిషు (13-10)**

**మయిచానన్యయోగేన భక్తిర వ్యభిచారిణీ**
**వివిక్తదేశసేవిత్వమరతిర్జన సంసది(13-11)**

**అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం తత్త్వ జ్ఞానార్థదర్శనమ్**
**ఏతజ్ఞాన మితి ప్రోక్తమజ్ఞానం యదతోఽన్యథా. (13-12)**

దంభము, అభిమానము లేకుండుట, అహింసా స్వభావము, ఓర్పు, ఋజువర్తనము, గురుసేవ, శుచిత్వము, చిత్తస్థైర్యము, ఇంద్రియ నిగ్రహము, విషయవాంఛల యందు విరక్తి, అహంకార రాహిత్యము, జన్మ మృత్యువుల యందును, జరావ్యాధుల యందును దుఃఖమును దోషమును గ్రహించుట, పుత్ర కళత్ర గృహాదుల యందు ప్రీతియును సంగములును లేకుండుట ఇష్టానిష్టములు సంప్రాప్తమైనపుడు సమభావమును కలిగియుండుట, నాయందు అనన్యమైన నిశ్చల భక్తి, ఏకాంతవాసము, జనసమూహమునందు అప్రియత్వము, ఆత్మజ్ఞాన నిశ్చయము, తత్త్వజ్ఞానానుభవము అనునిదియంతయును జ్ఞానము అనబడుచున్నది. దీనికి భిన్నమైనది అజ్ఞానము.

మనోవాక్కాయ కర్మలచే హింసను త్యజించిన పురుషుడు జ్ఞానియని తెలియవలెను. నిజమైన జ్ఞానముకల పురుషుని యందు క్షమనిండి యుండును. ప్రతిదానిని ఆత్మస్వరూపముగా భావించి అతడు సహించును. అతనికి తన సహనశీలతను గురించి అభిమానము పొందవలసిన కారణమేదియును ఉండదు. అట్టి పురుషుని మూలమున జ్ఞానమహిమ వృద్ధియగును.

ఆర్జవము అనగా ఋజుత్వము. సరళరేఖవలె తిన్ననైన ప్రవర్తన కల్గియుండుట. వక్రరేఖవలె వంకరటింకరగా ఆలోచించుట కుటిలత్వము. కుటిలత్వము లేకపోవుటే ఆర్జవము. ప్రాణికోటి పట్ల ప్రాణతత్వము ఏ రీతిగా ఒకే విధమైన సౌజన్యమును చూపునో "ఆర్జవము" కూడా అందరియెడను భేదభావ రహితముగా వ్యవహరింప చేయును. "ఆర్జవము" గల వాని మనస్సు భిన్నభిన్న మానవులతో భిన్నభిన్న రీతిని వ్యవహరించక అందరితోనూ ఒకే రీతిగా వ్యవహరించును. 'జగత్తుతో నాకు గల ఆత్మైక్యము అతి ప్రాచీనమైనది. మరియు అతి దగ్గర సంబంధము కలది" అనెడి జ్ఞానము పరిపూర్ణముగా ఉండును. అందువలన నాది – ఇతరులది అనెడి భావమే అతనికి కలుగదు. అతడు అందరితో కలసిమెలసి యుండి కపటములేకుండా నిస్సంశయముగా తన భావమును తెలియజేయును. అతడు బాహ్య, అభ్యంతర శుచిని కలిగి ఉంటాడు. ఇట్టి లక్షణములన్నియు ఎవని యందు వికసించి యుండునో అతడే జ్ఞాని.

జ్ఞానమువలన నిష్కళంకమైన అంతరంగముకల వానికి స్వపర భేదమేమియు ఉండదు. ఎవని చిత్తము చైతన్యముతో ఏకరూపమును పొందునో అతడు తన అంతఃకరణమును పూర్తిగా నిగ్రహించగలడని తెలుసుకొనవలెను. మనస్సునందు విషయములపట్ల పూర్తి విరక్తి కలిగియుండు వాడే జ్ఞాని.

అభిమాన రహితుడై సమస్త ఆచారవ్యవహారముల నొనర్చువాడు, అహంభావరహితుడై నిత్యకర్మలను ఆచరించువాడు, మనోవాక్కాయ కర్మలందు అహంకారము పూర్తిగా నశించినవాడు - అట్టివాడు మాత్రమే జ్ఞానియని వేదము బోధించుచున్నది.

వార్ధక్యమునందు ఈ శరీరము రోగగ్రస్తమై, ఇంద్రియపటుత్వము తగ్గి, శరీరమంతయు వ్యర్థమైపోవును. కావున నేటినుండియే ఈ శరీరముపట్ల నిర్లిప్తభావము కలిగి యుండవలెను. బుద్ధిమంతుడైన వాడు విషాహారమును త్యజించురీతిని జ్ఞానికూడా దుఃఖము, కష్టములు మొదలైనవానిని వృద్ధిపొందించు ఐహికమమకారములన్నింటిని త్యజించి ఆత్మ సుఖము కలిగి నిస్పృహుడైయుండును. అతడుయమ నియమముల సహాయముచే బంధమును కలుగచేయునట్టి దోషకర్మములను త్యజించును.

జ్ఞానియగువాడు బుద్ధికుశలతతో సావధానుడై సమస్తకర్మలను ఒనర్చును. అతడు ఇష్టాఇష్టములు ఎన్ని ప్రాప్తించినప్పటికిని సదా నిర్వికారుడైయుండును. సుఖదుఃఖములచేత అతడు బంధింపబడడు. నొప్పియనునది భౌతికము. బాధఅనునది మానసికము. జ్ఞానికి దేహసంబంధమైన నొప్పి తెలియదని భావము కాదు. మానసికమైన బాధను పొందడని భావము.

జ్ఞానికి ఏకాంతవాసము ప్రియముగా ఉండును. "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అని చెప్పబడిన పరమాత్మ అనుభవమునకు వచ్చునట్లు చేయగలదియే నిజమైన జ్ఞానము. బ్రహ్మాకారవృత్తియందు స్థిరపడిన బుద్ధికలవాడైనప్పుడు తనను తాను జ్ఞానస్వరూపుడనని తెలుసుకొనవలెను. జ్ఞానప్రకాశమువలన పరమాత్మ తత్త్వము తెలియబడకున్నచో అట్టి జ్ఞానము వ్యర్థము. జ్ఞానస్వరూపము చక్కగా బోధపడిన పిమ్మట జ్ఞానము కానిది అజ్ఞానమని తెలియును. అజ్ఞానమనగా తెలియకపోవుట. అందుచే అజ్ఞానమును ప్రత్యక్షముగా తెలుసుకొనుట ఎవరికీ సాధ్యముకాదు. వెలుతురును మనము చూడగలము. వెలుతురు లేకపోవుట చీకటి యని గ్రహించగలమే కాని చీకటిని సాక్షాత్తూ చూచుట సాధ్యము కాదు.

జ్ఞానలక్షణములకు విరుద్ధమైనవన్నియు అజ్ఞాన లక్షణములని భగవానుడు గీతద్వారా బోధించెను. ఇక్కడ జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అన్న పదములను వివరముగా తెలుసుకుందాం.

జ్ఞాత: జ్ఞాత అనగా తెలుసుకొనువాడు ( Knower). జ్ఞేయము

అనగా తెలుసుకొనబడునది. అనగా లోకములోని వస్తువులు విషయములు (Objects). జ్ఞానము అనగా ఈ వస్తువులు లేదా విషయములకు సంబంధించిన అవగాహన ( Knowledge).

జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము –– ఈ మూడింటినీ త్రిపుటి అని అంటారు. ఇదిలోకములో అన్ని వస్తువుల విషయమున వర్తిస్తుంది. ఉదాహరణకు ఒకడు ఒక గోవునో, ఆభరణమునో చూచాడు అనుకుందాం. ఆ గోవు లేక ఆభరణము జ్ఞేయము (చూడబడుచున్నది). చూచువాడు జ్ఞాత (Knower). గోవునకు లేక ఆభరణమునకు సంబంధించిన విశేషములు జ్ఞానము ( Knowledge). అయితే ఈ గోవును, లేక ఆభరణమును మనము చూచుటకు సూర్యకాంతి, చంద్రకాంతి లేక దీపపు కాంతి ఏదో ఒక వెలుతురు ఉండాలి. వెలుతురు లేకుంటే జ్ఞానము "ఉపలభ్యము" కాదు. పరబ్రహ్మ విషయమందు పరబ్రహ్మ జ్ఞేయము, జీవుడు జ్ఞాత అనుకున్నచో పరబ్రహ్మ లక్షణములన్నియు జ్ఞానము అగును. మరి ఈ పరబ్రహ్మమును చూపించు వెలుతురు ఏది? సూర్యకాంతి, చంద్రకాంతి, నక్షత్రకాంతి, దీపకాంతి కాదు.

**"నతత్ర సూర్యోభాతి నచంద్ర తారకాః**
**నేమా విద్యుతో భాంతి కుతోయమగ్నిః**
**తమేవభాన్తం అనుభాతి సర్వమ్**
**తస్యభాసా సర్వమిదం విభాతి."**

**కఠోపనిషత్తు 5-15**

"అక్కడ అనగా ఆపరబ్రహ్మ సాన్నిధ్యమునందు సూర్యుడు ప్రకాశించుట లేదు. చంద్ర, తారకలు ప్రకాశించుట లేదు. విద్యుత్తు దీపములు ప్రకాశించుట లేదు. మరి ఈ అగ్ని ఎక్కడ నుండి ప్రకాశించుచున్నది ? ఈ భౌతిక తేజస్సులు పరబ్రహ్మను సమీపించలేవు. ఆ పరబ్రహ్మ ప్రకాశించుచుండగా సర్వము ఆయనను అనుసరించి ప్రకాశించును. ఆ పరబ్రహ్మ ప్రకాశము వలననే 'ఇదం' శబ్దముచే చెప్పబడుచున్న ఈ లోకమంతయు ప్రకాశించుచున్నది."

ఇక్కడ ప్రకాశము అనగా తెలియుట లేక తెలివి. భౌతికమైన తేజస్సులు పరబ్రహ్మమును తెలుసుకొనుటకు ఉపయోగించవని అర్థము.

ఆ పరబ్రహ్మయొక్క తెలివి వలననే లోకములో అన్ని భూతములు తెలివిగలవి అగుచున్నవి. అందుచేత జీవునకు గల తెలుసుకొను శక్తి పరబ్రహ్మవలననే కలుగుచున్నది. కాబట్టి పరబ్రహ్మను తెలుసుకొనుటకు ఏ ఇతర తేజస్సులేదు. కావున వెలుతురు తరువాత ఇంక మిగిలినవి జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానమను త్రిపుటి. అనగా జీవుడు, పరబ్రహ్మ, పరబ్రహ్మ యొక్క గుణవిశేషములు.

పరబ్రహ్మ నిర్గుణుడు, నిర్విశేషుడు, నామరూపగుణ క్రియారహితుడు. అందుచేత ఆయనను లోకములో వస్తువులను తెలుసుకొన్నట్లు తెలియుటకు వీలు లేదు. లోకములో వస్తువులను నామరూపగుణ క్రియాదులవలన, సకారాత్మకధర్మముల ( Positive qualities) వలన తెలుసుకొనుచున్నారు. పరబ్రహ్మను నేతి .... నేతియని నిషేధ ప్రత్యయములవలన మాత్రమే తెలుసుకొనగలము. అందుచేత పరబ్రహ్మమును నకారాత్మక విశేషణములు ( Negative assertions) వలన తెలుసుకోవాలి (అనగా నిర్గుణము, నిష్కళము, అరూపము, నిరాకారము, నామరహితము మొదలైన విశేషణములు - నకారాత్మక విశేషణములు) బ్రహ్మ జ్ఞానములోక జ్ఞానము వంటిది కాదు కనుక జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను త్రిపుటిలో జ్ఞానమును తీసి వేయ వచ్చును.

జ్ఞాత అయిన జీవుడు ఎవరు? అని విచారించగా జ్ఞాత ధర్మములని చెప్పబడుచున్నవన్నీ మనోబుద్ధి వృత్తులని తెలుస్తుంది. యధార్థమునకు జ్ఞాత ఈ మనోబుద్ధులకు సాక్షి. జ్ఞాతయగు జీవుని గురించి మనస్సు, బుద్ధి ఏమీ చెప్పలేవు. సూక్ష్మవస్తువులు స్థూలమును గుర్తించగలవు కాని స్థూల వస్తువు సూక్ష్మమును గుర్తించలేదు.

**"మనసస్తు పరాబుద్ధిః యో బుద్ధేః పరతస్తుసః"**
**గీత 3-42**

"పరము అనగా ప్రకృష్టము (శ్రేష్ఠము) అని అర్థము. శరీర భాష్యమునందు "స్థూలం బాహ్య పరిచ్ఛిన్నం చాపేక్ష్య సౌక్ష్మ్యం తరస్థ వ్యాపిత్వాద్యపేక్ష్య పరాణి ప్రకృష్టాని" అని చెప్పబడినది. అనగా ఇంద్రియార్థముల కన్నా ఇంద్రియములు; ఇంద్రియముల కన్నా మనస్సు, మనస్సుకన్నా బుద్ధి ... వీనిని ఒకదానితో ఒకటి పోల్చిచూసినప్పుడు

పూర్వము చెప్పబడినవి స్థూలములు తరువాత చెప్పబడినవి సూక్ష్మములు; పూర్వము చెప్పబడినవి బాహ్యములు తరువాత చెప్పబడినవి అంతరస్థములు; పూర్వము చెప్పబడినవి పరిచ్ఛిన్నములు తరువాత చెప్పబడినవి అపరిచ్ఛిన్నములు (అనగా వ్యాపిత్వము కలవి వ్యాపకత్వము చెందునవి అని అర్థము). అందుచేత తరువాత చెప్పబడినవి పరములు అనగా ప్రకృష్టములు, శ్రేష్ఠములు అన్నారు. శంకరానందీయ భాష్యములో కూడా పరమనగా సూక్ష్మమనియే చెప్పబడినది.

సః అంటే తత్ శబ్దము యొక్క ప్రధమా విభక్తి ఏకవచనము. అనగా సుప్రసిద్ధమై, తత్త్వమస్యాది మహావాక్యములలో "తత్" శబ్దముచే ప్రతిపాదించబడిన బ్రహ్మమే ఇక్కడ 'సః' అని చెప్పబడినది. అట్టి బ్రహ్మ బుద్ధి కన్నా పరమైనది. అనగా బుద్ధి పరబ్రహ్మ కన్నా స్థూలము, పరిచ్ఛిన్నము, బాహ్యము. పరబ్రహ్మ బుద్ధికన్నా సూక్ష్మము, అంతరస్థము, వ్యాపిత్వము కలది. కావున బుద్ధి తనకన్నా సూక్ష్మమైన బ్రహ్మను తెలుసుకొనలేదు. బ్రహ్మబుద్ధికి విషయముకాదు. బుద్ధిచే గ్రహించువాడు బ్రహ్మ. అంతేకాని బుద్ధిచే గ్రహింపబడునది బ్రహ్మకాదు.

కాబట్టి మనసుకు పరమైనది బుద్ధి-బుద్ధికి పరమైనవాడు ఆత్మ "నేను ఎవరను?" అని విచారించినపుడు మనోబుద్ధివృత్తులులయము చెంది ఆత్మ స్వయముగా ప్రకాశించును.

"స్వయం ప్రకాశతే హ్యాత్మా మేఘాపాయే అంశుమాన్ ఇవ"

శంకరుల "ఆత్మబోధ"

మేఘములు తొలగినప్పుడు సూర్యుడు ప్రకాశించునట్లు ఆత్మ స్వయముగా ప్రకాశించును (అజ్ఞానము తొలగినప్పుడు). అప్పుడు ఆత్మ యొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అప్పుడు తానే బ్రహ్మమునని తెలియును. "నేను జీవుడను" అను బుద్ధి వృత్తి సాంసారిక జీవులలో మాత్రమే ఉండి సమాధి స్థితి కలుగగనే నశించుచున్నది కావున జీవత్వము మిథ్య అంటున్నారు. జీవుడు యదార్థ వస్తువు కాదు. అందుచే జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను త్రిపుటిలో జ్ఞాతయగు జీవుడు కూడా తొలగిపోవుచున్నాడు.

అప్పుడు మిగిలిన అనుభవము శూన్యానుభవము కాదు. ఆ అనుభవము శూన్యమే అయితే దానిని తెలుసుకొనే మరియొక జ్ఞానవస్తువు శూన్యమునకు సాక్షిగా ఉండాలి. లేకపోతే ఆ శూన్యానుభవము 'అజ్ఞానము' అనగా తెలియనిదైపోతుంది. ఇట్లు "నేనెవరను?" అని విచారించినపుడు బుద్ధివృత్తులు, జీవుడు కూడా లయము చెందగా సాక్ష్యవస్తువే లేకపోవుటచే సాక్షిత్వముకూడా లేని శుద్ధమైన పరబ్రహ్మ నిలుస్తుంది. దీనినే అపరోక్ష ఆత్మానుభవము అని అంటారు. ఈ విషయమును శాస్త్రములలో చదువుకున్నప్పుడు, విన్నప్పుడు కలుగు అనుభవమును పరోక్షజ్ఞానము అని మాత్రము అంటారు.

"జ్ఞానమ్" అను నపుంసక లింగ శబ్దమును ' Knoledge' అను లౌకికార్థములో కాక Knower అను అర్థములో కూడా బ్రహ్మపరముగా వాడతారు. బ్రహ్మను గూర్చి చెప్పినప్పుడు 'జ్ఞానమ్' అంటే జ్ఞానవస్తువు లేక జ్ఞాన పదార్థం, చిత్ వస్తువు, చిత్పదార్థము అనుకొనవలెను.

పరబ్రహ్మము సర్వవ్యాపకమైనది. నదిలో ఒక కుండను ముంచినపుడు నదీజలము కుండలోపల బయట కూడా వ్యాపించి యున్నట్లు పరబ్రహ్మ సకల ఉపాధులకు లోపల బయట వ్యాపించి యున్నది. ఇక్కడ ఈ దృష్టాంతములో మరి యొక విశేషమును ఊహించవచ్చును. నీటిలో ముంచే కుండ మట్టితో చేసినది కాక మంచుతో చేయబడిన కుండ అయినచో 0° C ఉష్ణోగ్రత 76 Cm పాదరస పీడనము వద్ద కుండలోపల, వెలుపల నీరు మధ్యకుండ రూపంలో కూడా ఘనపదార్థమైన మంచు రూపంలో నీరు ఉంటుంది. అదే విధముగా సకల ఉపాధులకు లోపల బయట బ్రహ్మ వ్యాపించి ఉండటమే కాక ఉపాధి కూడా బ్రహ్మస్వరూపమే అగును. అనగా పరబ్రహ్మ యందు సజాతీయ భేదము, విజాతీయ భేదము ఎంతమాత్రము లేదు. స్వగత భేదము మాత్రము వ్యవహారదశయందు వ్యావహారిక సత్యరూపంలో కనబడుతూ ఉంటుంది. పారమార్థిక సత్యము విచారిస్తే స్వగతభేదము కూడా లేదు అని తెలుస్తుంది. వ్యవహారమునకు ఇది మంచు కుండ, ఇది నీరు అను భేదము కనిపించినప్పటికీ పరమార్థమునకు రెండునూ జలాణువుల చేత ఏర్పడినవే.

భిన్నభిన్నములుగా ఉన్న ఉపాధులందన్నిటియందును ఏది వ్యాపించి యున్నదో, ఈ విశ్వములోని సకల కార్యమునకు ఏది మూలకారణమో, ఆధారమో అది బ్రహ్మయే. బ్రహ్మమునందు ఎన్నడును, ఏ విధమైన మార్పు కూడా ఉండదు, రాదు.

జీవకోటి విభిన్నమైన రూపములందుండినను పరమాత్మ ఏకరూపుడే. అన్నింటియందును ఆ పరమాత్మ సమాన రూపమున ఉండును. వివిధ నామరూపములుగా కనిపించు ఈ లోకము నశ్వరమైనప్పటికిని వాటన్నింటియందును నివసించు ఆత్మ మాత్రము శాశ్వతమైనదే. ఆత్మతత్త్వము జీవధర్మముతో అలిప్తమై ఉంటుంది. జీవుని యొక్క పారమార్థిక స్వరూపమే ఆత్మతత్త్వము. ఇట్టి ఆత్మదర్శనము చేసినవాడు వాస్తవ దృష్టికలవాడు ( One who has seen Reality) అన్ని ఉపాధులందును సమానముగా వ్యాపించియున్న పరమాత్మను గుర్తించగలవాడు, ఈ విధమగు సమత్వమును తమ జీవితకాలమునందే అనుభవించునట్టివారు జననమరణబంధమును పొందరు. వారి దృష్టి సదా సమభావమునందే లగ్నమైయుండును. లోకములోని వస్తువులను తెలుపు వస్తుజ్ఞానము కంటే ఆత్మదర్శనము చేయించు ఆత్మ జ్ఞానము గొప్పది.

దీపము వెలిగించి చూచినపుడు అంధకారము కనిపించని రీతిని ఆత్మ విచారణ స్ఫురించగనే అజ్ఞానము తొలగిపోవును. సత్యాజ్ఞానము మరియు విరుద్ధజ్ఞానములందుండెడి సందేహావస్థలు కూడా అజ్ఞానములో భాగములే. ఈ అజ్ఞానము నందు చిక్కుకునియున్న ఆత్మ తత్త్వమునే క్షేత్రజ్ఞుడందురు. దేహములోని జీవుడే ఈ క్షేత్రజ్ఞుడు.

పగటికి కారకుడు సూర్యుడైన విధముగా జ్ఞానమునకు కారణము సత్త్వగుణమైయున్నది. ఇదే విధముగా ఆత్మస్వరూపమును మరచి పోవుటచే ద్వైతము జనించు విధముగా రజోగుణముచే కామక్రోధాదులు పెరుగును. మోహము, ప్రమాదము, ఆలస్యము, నిద్ర మొదలుగాగల పెక్కుదోషములు తమోగుణము వలన కలుగును. రజస్సును మరియు తమస్సులను కేవలము సత్వగుణమే అణచగలదు. సత్త్వము తప్ప మరే గుణమూ జీవాత్మను జ్ఞానము వైపునకు మరల్పలేదు.

"నాన్యంగుణేభ్యః కర్తారం యదాద్రష్టాను పశ్యతి
గుణేభ్యశ్చపరం వేత్తి మద్భావం సో ధి గచ్ఛతి"
గీత 14 అ-19 శ్లో

"ఎప్పుడు వివేకవంతుడు సత్త్వాది గుణముల కంటె ఇతరమును, అనగా ప్రకృతి కంటె వేరైన దానిని కర్తగా తలచడో మరియు తనను త్రిగుణములకంటె వేరని తెలుసుకొనుచున్నాడో అప్పుడు అతడు నా భావమును అనగా మోక్షమును పొందుచున్నాడు". అనగా ఆత్మను అకర్తగా తెలుసుకొనవలెను.

సకల కర్మలకు కర్తృత్వ భోక్తృత్వములు త్రిగుణాత్మికమైన ప్రకృతియందే కలవు. ఆత్మ యందులేవు. ఉదాహరణకు గాలి పీల్చుట, వదులుట - ఇత్యాదులు దేహ ధర్మములు. ఈ పనికి కర్త, భోక్త దేహమే. ఆత్మయందు ఉచ్ఛ్వాస నిశ్వాసములు లేవు. ఆత్మ దీనికి కర్త కాదు. శరీర సాన్నిధ్యములో ఆత్మకు కర్తృత్వ భోక్తృత్వములు వచ్చుట లేదు. కాని ఆత్మ సాన్నిధ్యములో దేహమునకు ఈ కర్తృత్వాదులు వచ్చుచున్నవి.

ఒక్క బ్రహ్మము తప్ప వేరైనది ఏదియు లేదని ఖచ్చితముగా తెలుసుకొనవలెను. ఈ సత్త్వ రజస్తమోగుణములు అంతఃకరణముతో కూడి ఈ శరీర రూపమును ధరించి ఈ దేహమునే నిమిత్తముగా చేసుకొని తమ సామర్థ్యమును చూపించును. అందుచేత ఈ త్రిగుణములు బంధమునకు కారణమగుచున్నవి. ఈ త్రిగుణములతో శరీరమునకు కల సంబంధము చేత జీవాత్మకు గల సహజ స్వతంత్రము నందు ఏ మాత్రము లోపము ఉండదు. గుణముల మధ్య నున్నప్పటికిని చైతన్యతత్త్వము ఎన్నడూ గుణముచేత బద్ధము కాదు. జీవునకు ఆత్మ బోధ కలిగినప్పుడు ఈ విషయమును తెలుసుకొనగలుగును. మేల్కొనిన పిమ్మట స్వప్నము మిథ్య అని తోచు విధముగా జీవాత్మ కూడా తనను తాను ఈ త్రిగుణములకు దూరముగా ఉండి చూచుకొనుట ఉచిత ధర్మమైయున్నది.

వేరు వేరు ఋతువులు వస్తూ పోతున్నప్పటికిని ఆకాశము యొక్క స్వరూపము నందు ఎన్నడు భిన్నత్వము రాని విధముగా ఈ

త్రిగుణముల యందు ఉండి కూడా ఆత్మ తత్త్వము స్వయం సిద్ధమై "అహంబ్రహ్మాస్మి"యనెడి దృఢ నిశ్చయమును కలిగియుండును.

ఆత్మ సకల విషయములను, సకల లోకములనూ ఇతర మాధ్యమములు (Media) లేకుండా సాక్షాత్తూ (directly) చూడగలదు.

"నేను కేవలము సాక్షిని. నేను ఏదియును చేయను. ఈ గుణములే కర్మవ్యూహమును రచించుచుండును. ఆ కర్మలను కేవలము చూచుచున్నాను. తెలుసుకొనుచున్నాను." అనునదియే ఆత్మతత్వము.

"సాక్షాత్ పశ్యతి ఇతి సాక్షి" (To know directly) అట్లే ఆత్మ జ్ఞాని కూడా సమస్త లోకములను సాక్షాత్తుగా చూడగలడు.

**"యం యం లోకం మనసా సంవిభాతి**
**విశుద్ధ సత్త్వః కామయతే యంశ్చకామాన్**
**తంతం లోకం జయతే తాంశ్చ కామాంస్తస్మా**
**దాత్మ జ్ఞం హ్యర్చయే ద్భూతి కామః"**
**ముండకోపనిషత్తు 2-10వ మంత్రము.**
**ద్వితీయ ముండకము.**

ఈ మంత్రము జ్ఞానయోగ సాధకుని గురించి చెప్పినది కాదు. ఆత్మయోగనిష్ఠాగరిష్ఠుడు, బ్రహ్మ విద్వరిష్ఠుడు అయిన సిద్ధ పురుషుని గురించి చెప్పబడినది. విశుద్ధ సత్త్వము గలవాడు అనగా మాయా ఆవరణములేని విశుద్ధమైన అంతఃకరణము కలవాడు అయినటువంటి బ్రహ్మజ్ఞాని, మనసుతో ఏఏ లోకములను భావించునో ఆలోకములను జయించును. మరియు ఏ ఏ కోరికలను కోరునో ఆ కోరికలు సిద్ధించును. అందుచే లోకములో ఐశ్వర్య కాముకులైన వారు ఆత్మ జ్ఞానిని అర్చించెదరు – అని అర్థము.

"సత్వము, రజస్సు, తమస్సులకు గల భిన్న భిన్న లక్షణముల వలన కర్మవ్యాపకత్వము వృద్ధి పొందుచుండును. ఈ కర్మకాండ అంతయూ ఈ గుణముల యొక్క వికారమే.

సూర్యోదయముతో పాటుగా జరిగెడి కార్యములన్నియు సూర్యునికి సంబంధము లేనట్లుగా నేను కూడా నా సామర్థ్యము వలన సమస్త

విధములగు కర్మలకు కారకుడనైనప్పటికిని ఎల్లప్పుడు అకర్తగనే ఉందును.

"సూర్యోయథా సర్వలోకస్య చక్షుః
నలిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా
నలిప్యతే లోకదుఃఖేన బాహ్యాహః"

కఠోపనిషత్తు - పంచమీ వల్లి II.

సూర్యుడు లోకమునకంతటికిని కన్ను వంటి వాడు. కన్ను సహాయముతో ఒక వ్యక్తి ప్రపంచమును చూచునట్లు లోకమునందలి సమస్త జనులు సూర్యుని సహాయముతో చూచుచున్నారు. చూచువాని కన్నులోని దోషములు సూర్యునికి ఏమాత్రము అంటవు. అట్లే సర్వభూతాంత రాత్మయైన పరమాత్మ యొక్క సాన్నిధ్యముచే లోకములో జనులందరు సుఖదుఃఖములను తెలుసుకొనుచున్నారు. లోకములోని సుఖదుఃఖములు పరమాత్మ కన్నా ఎంతో బాహ్యము, దూరస్థము అగుట చేత ఈ లోక సుఖదుఃఖములు పరమాత్మను అంటవు. ఈ మంత్రమునకు ఇంకను విశదముగా అర్థము చెప్పుకొనవలెనన్న.....

"లోకములోని మంచిచెడులు, సుగంధదుర్గంధములు, కురూప సురూపములు, సూర్యభగవానునికి అంటనట్లు అంతరాత్మకు సుఖదుఃఖములు కాని పుణ్యపాపములు కాని ఎంత మాత్రము అంటవు.

ఈ త్రిగుణములను అతిక్రమించినవానిపై జ్ఞానముద్ర చక్కగా పడును. నది సముద్రముతో కలిసి దానితో ఏకత్వము చెందురీతిగా ఇటువంటి జ్ఞాని కూడా పరబ్రహ్మతో ఏకమై సారూప్యమును పొందును. అంతవరకు అజ్ఞానముతో ఉన్న జీవుడు ఆత్మ స్వరూపబోధ ప్రాప్తి నొంది మేల్కొని స్వస్వరూప జ్ఞానమును పొందును. జ్ఞానియగు జీవుడు మాయ నుండి ముక్తిని పొంది "అహంబ్రహ్మాస్మి" అనెడి బ్రహ్మచైతన్య స్థితిని పొందును. జీవాత్మ బ్రహ్మాత్మయందు లీనమై తద్రూపుడగును.

ఈ విధముగా బ్రహ్మభావము ప్రాప్తించిన తరువాత అతడు దేహాంతము వరకు ఈ శరీరము నందే ఉన్నప్పటికిని శరీరము

నందుండి జనించెడి గుణములనెడి చిక్కులలో అతడు ఎన్నడును పడడు. గుణ సంచారము వలన ఆత్మతత్వము మలినపడదు. ఆకాశము నందలి చంద్రుడు జలము నందు ప్రతిబింబించినప్పటికిని జలముతో లిప్తుడు కాని విధముగా అతడు దేహమునందు ఉన్నట్లు కనిపించవచ్చును. కాని, అతనికి దేహధర్మములంటవు.

ఈ త్రిగుణములు శరీరమనెడి ఉపాధి కలిపించి తద్వారా కర్మ బంధమును కలిగించును. కాని జ్ఞానియగు పురుషుడు త్రిగుణములకన్న తాను వేరు అని తెలుసుకొని తన 'అహంబ్రహ్మాస్మి' భావమును క్షణకాలము కూడా వీడడు. అతని అంతః కరణమున ఆత్మ స్వరూపమును గురించి గల దృఢ నిశ్చయము వలన "మనము ఈ శరీరము నందుండి ఈ పనులు చేయుచున్నాము, ఈ పనులు చేయుటలేదు" అనెడి భావమే కలుగదు.

జరుగుతున్న కర్మలకు, జరగని కర్మలకు తాను కేవలము సాక్షిగా ఉన్నాడు - అనగా అస్తి, నాస్తి అను బుద్ధి వృత్తులకు ఆత్మ సాక్షి అని తెలియుచుండును. జాగ్రదవస్థలో బాహ్యోన్ముఖములైన బుద్ధి వృత్తులకు తాను సాక్షి. అట్లే నిద్రావస్థ యందు (సుషుప్తి) "ఏమీ తెలియలేదు" అను అజ్ఞాన రూపమైన బుద్ధివృత్తికి తాను సాక్షి. అపరోక్షానుభవము కలిగిన జ్ఞానికి, కేవలము శాస్త్రార్థమును పరోక్షముగా మాత్రమే తెలుసుకున్న విద్వాంసునికి ముఖ్యమైన బేదము ఆనందాను భవములో ఉంటుంది. విద్వాంసునికి తాను జీవుడను అనే భావం నశించక పోవటం వలన బ్రహ్మానంద సిద్ధి ఉండదు. అపరోక్షజ్ఞానికి పూర్ణఆనంద అనుభవము నిత్యముగా, అఖండముగా ఉంటుంది.

**"సత్యాత్మ ప్రాణారామం మన ఆనందమ్**
**శాంతి సమృద్ధ మమృతమ్"**

**తైత్తరీయ ఉపనిషత్తు - 6వ అనువాకము.**

"ఈ పరబ్రహ్మతత్వము సత్యస్వరూపము; ఆత్మకు, ప్రాణమునకు నిలయము; అమృత స్వరూపము, సర్వతాపత్రయోన్మూలనరూపమైన పరమశాంతి స్వరూపము; సకల మంగళకరసమృద్ధము- అని ఉపాసన చేయుము" అని తైత్తిరీయోపనిషత్తు షష్ఠానువాకమునందు "ప్రాచీన

యోగ్యుడను" ఋషికి ఉపదేశించబడినది.

పైన చెప్పబడిన ఆనందము, శాంతి మొదలగు లక్షణములు అన్నియు బ్రహ్మజ్ఞానికి అనుభవములోనికి వచ్చును.

యాత్రికుడు ప్రయాణకాలమునందు ఏదైనా సత్రమునందు కొద్దిసేపు బసచేయురీతిగా జ్ఞానికూడా శరీరమును ఆశ్రయించి ఉండి శరీరము పట్ల ఉదాసీన భావమును కలిగియుండును. పూర్వకృత ప్రారబ్ధముచే శరీరము ఏర్పడినదని, కర్మక్షయానంతరము దేహవిముక్తి కలుగునని గ్రహించి ఉదాసీనుడైయుండును. అయితే ఇంద్రాదులు, దిక్పాలకులు, సద్గురువు మొదలగు ఆధికారిక పురుషులు వారి శరీరధారణ ఈశ్వరేచ్ఛవలన, ఈశ్వర సేవానిమిత్తమై ఏర్పడినదని తెలుసుకొని, బ్రహ్మానుభూతి కలవారైనను, లోక కళ్యాణము కొరకు నిష్కామ సేవచేస్తూ ఉంటారు. ఆదేహ నిర్మాణమునకు సంబంధించిన సంస్కారములను సమష్టి సంస్కారముఅంటారు. వ్యష్టియగుజీవుని సంస్కారములకంటె అవి భిన్నములైనవి.

మేల్కొని యున్న మనుష్యులను స్వప్నము మోసగించలేదు. ఇదే విధముగా జ్ఞానియగు పురుషుడు కూడా గుణములచేత బంధింపబడడు.

సత్త్వము ఎల్లప్పుడు దేవపూజా, లోకసేవాది శుద్ధకర్మములను; రజస్సు విషయభోగసంబంధమగు కర్మలను, తమస్సు, మోహము మరియు అజ్ఞానాదులను, హింసాదులను కలిగించును. వీనినే సాత్త్వికకర్మలు, రాజసిక కర్మలు, తామసిక కర్మలు అనవచ్చును.

జ్ఞానియగు పురుషుడు స్థావరజంగమాత్మకమగు ఈసమస్త ప్రపంచము ఆత్మతత్త్వమే తప్ప వేరుకాదని తలంచును. ఉపనిషత్తులలో కొన్ని వాక్యములలో ప్రకృతి పరబ్రహ్మకు శరీరము అని చెప్పబడినది.

**"ఆకాశ శరీరం బ్రహ్మ"**

**(తైత్తిరీయోపనిషత్తుఆరవ అనువాకము)**

అను వాక్యము నందు ఆకాశము బ్రహ్మకు శరీరమని చెప్పబడినది. ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్నివలన జలము,

జలముచేత పృధ్వీతత్వము పరిణామ క్రమరూపముగా ఏర్పడుచున్నవని కూడా శ్రుతి చెప్పుచున్నది.

జగత్తులోని సమస్త వస్తువులు పంచభూతాత్మకములే. అందుచే ఆకాశము పరబ్రహ్మకు శరీరము అను శ్రుతికి పంచభూతాత్మకమైన సమస్త ప్రపంచము పరబ్రహ్మకు శరీరమని చెప్పుకోవాలి. ఇక్కడ ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము అను మూడు మతములు ఏర్పడుచున్నవి.

జగత్తు వేరు బ్రహ్మమువేరు అని తలచువారు ద్వైతులు. వీరు ఐదురకములైన భేదములను గుర్తిస్తారు.

1. జడ జడ భేదము ... అనగా ఒక జడవస్తువునకు మరొక జడవస్తువునకు భేదము సిద్ధము.

2. జీవజీవభేదము ... అనగా ఒక జీవునికి మరొక జీవునికి సృష్ట్యాది నుండి వారు చేసిన కర్మవలన భేదం కలుగుతున్నది అని అంటారు. అట్లే

3. జడ ఈశ్వరభేదము. 4. జీవ ఈశ్వర భేదము 5. జడ జీవ భేదము సిద్ధములు.

ఇది ద్వైతమతము. ద్వైతులు పరబ్రహ్మ సగుణుడు అనే అంటారు.

విశిష్టాద్వైతులు కూడా పరబ్రహ్మసగుణుడని; చిత్, అచిత్ విశిష్టమైన జగత్తును శరీరముగా ధరించుచున్నాడని చెపుతారు. విశిష్టాద్వైతులు చిద్వస్తువులో భేదమును అంగీకరిస్తారు. పరమాత్మ అఖండ చైతన్యస్వరూపుడు. జీవాత్మలు కించిత్ చైతన్యమాత్రులు. ఈచిద్రూపులైన జీవులను జడరూపమైన పర్వత శిలాదులను వీటన్నిం-టిని పరమాత్మ శరీరముగా ధరించుచున్నాడు. జీవాత్మ తన శరీరములో జడ సమానములైన కేశనఖాదులను, కించిత్ చైతన్య మాత్రములైన నేత్రాది అవయవములను ఏవిధముగా ధరించుచున్నాడో ... (అనగా జీవుని శరీరము కూడా చిత్, అచిత్ విశిష్టము.) ... అట్లే పరమాత్మ కూడా ఆకాశాది భూపర్యంతమైన అచిత్ పదార్థములను, జీవులను, చిత్ పదార్థమునకు, అచిత్ పదార్థమునకు మధ్యగల పరిణామ రూపములైన మనస్సు, ప్రాణము, బుద్ధి మొదలగు వాటిని వీటితో

కూడిన సమస్తలోకములను శరీరముగా ధరించుచున్నాడు. విశిష్టాద్వైతమతము.

ఇక అద్వైతమతమున సత్యమును పారమార్థికము, వ్యావహా౽ి అని రెండుగా నిర్వచిస్తారు. వ్యవహారక్షమమగుచున్న ఈజగత్తు వ్యావః సత్యముకాని, పారమార్థికసత్యము కాదు, సృష్టిని గురించి తెలుపుః శ్రుతులు, మరియు

పరబ్రహ్మను సగుణునిగా వర్ణించుచున్న శ్రుతులు వ్యావః సత్యమును మాత్రమే చెప్పుచున్నవి. నిర్గుణ పరబ్రహ్మ గురించి చెప్పుః శ్రుతులు పారమార్థిక సత్యమును గురించి తెలుపుచున్నవి.

వ్యావహారిక సత్యమును తెలుపు శ్రుతుల లక్ష్యము చో లక్షణాత్మకమైగాని, ఉపాసనాలక్షణాత్మకమైగాని ఉంటుంది. చ లక్షణాత్మకములైన శ్రుతులు విధినిషేధాత్మకములై చేయవలసిన కర్మ గురించి, మానవలసిన కర్మలను గురించి చెపుతాయి. ఉపా లక్షణాత్మకములైన శ్రుతులు పురుషసూక్తము, నమకము మొదలై పరమేశ్వరుని ఉపాసనను గురించి చెపుతాయి.

నిర్గుణ పరబ్రహ్మమును ఉపదేశించు నిర్గుణశ్రుత మహావాక్యములు అని చెప్పబడు 'అహంబ్రహ్మాస్మి", "తత్త్వమసి' ప్రజ్ఞ బ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ అను శ్రుతి వాక్యములు పారమార్థిక సత్యమః జీవబ్రహ్మైక్యమును ప్రతిపాదించుచున్నవి. అద్వైతములో కంచి కామః పీఠాధిపతుల మతము ప్రకారము "సర్వంఖల్విదం బ్రహ్మ" అను ఐదవ మహావాక్యము. ఇదికూడా జీవబ్రహ్మైక్యమనే బోధించుచున ఐదు పదముతో సూచింపదగు సర్వమూ, ఈజగత్తుంతా నిశ్చయమః బ్రహ్మమే అని ఈవాక్యము నకర్థము. అంతయు బ్రహ్మమైతే న మాత్రము బ్రహ్మము కాకపోతుందా! కాబట్టి ఆకాశం శరీరం బ్రహ్మ ఆ శ్రుతి వాక్యమునకు అర్థము చెప్పునప్పుడు "అధ్యాస" వలన 'శ యందు (ముత్యపు చిప్ప యందు) రజిత భ్రాంతి (వెండిగా తోచునట కలిగినట్లు, నిర్గుణ పరబ్రహ్మయందు ఆయన పంచభూతాత్మకః అను (తోపకము" (తోచుట, అనిపించుట) కలుగుచున్నదని అద్వైతుః అంటారు. ఈ "తోపకము" పారమార్థిక సత్యము కాదు.

"నేహ నానాస్తి కించన" అను శ్రుతి వాక్యము, ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అను శ్రుతి వాక్యములు అద్వైత పరబ్రహ్మను గురించి "పారమార్థిక సత్యమును చాటి చెప్పుచున్నవి. అనగా వేదములోని చోదనా లక్షణాత్మకములైన వాక్యములను పారమార్థిక సత్యములుగా అద్వైతులు గ్రహింపరు.

సుఖదుఃఖములయందు సమభావమును కలిగియుండుట వలన జ్ఞాని ఎల్లప్పుడూ ఆత్మ స్వరూపమున నిమగ్నమై యుండును.అట్లు ఆత్మస్వరూపమున రమించునప్పుడు అతనికి సుఖదుఃఖములనునవి తోచవు. ఇటువంటి జ్ఞాని దృష్టిలో బంగారము-పేడ, వజ్రము- రాయి, వీటి భేదమేమియు ఉండదు. స్వర్గసుఖములు ప్రాప్తించినను, అమితమైన కష్టము సంభవించినను అతని బ్రహ్మైక్య అనుభవమునందు లేశమాత్రమైనను భేదము కలుగదు.

**"సమదుఃఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః"**
**(గీత 14-24)**

వేయించిన గింజలు మరల మొలకెత్తని విధముగా అతని ప్రాచీన సంస్కారములు మరల కర్మలుగా ఉద్భవింపవు. ప్రియాప్రియములు, మానావమానములు అతనికి సమానము. ఎవరైనా అతనిని పొగిడినను, లేక నిందించినను అతనికి సమానమే. ఆనిందాస్తుతులు అతనిని ఎంత మాత్రము బాధింపవు.

**"తుల్యప్రియా ప్రియోధీరస్తుల్య నిందాత్మ సంస్తుతిః"**
**గీత 14-24**

సూర్య తేజమునకురాత్రియని కాని, ప్రాతఃకాలమని కాని ఉండని విధముగా అతని మనస్సు ఈవిషమత్వము వలన ఎన్నడూ మలిన పడదు. తానొక పనిని ఆశతో చేయుచున్నాననను భావమే అతనిలో కనిపించదు. చిత్తవృత్తులన్నింటిని తొలగించి, సంస్కారములను అతడు సమూలముగా పెకిలించివేయును. జ్ఞానాగ్నివలన అతని కర్మఫల మంతయు దగ్ధమగును.

ప్రకృతేః క్రియా మాణానిగుణైః కర్మాణి సర్వశః
అహంకార విమూఢాత్మా కర్తాహ మితిమన్యతే ॥
గీత 3అ-27 శ్లో.

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః
గుణాగుణేషు వర్తన్త ఇతిమత్వా నసజ్జతే॥
గీత 3అ-28శ్లో.

అహంకారముచేత మూఢత్వము పొందిన బుద్ధికలవాడు ప్రకృతిలోని గుణములచే చేయబడుచున్న నానావిధములైన కర్మలకు నేనే కర్తను అని తలచును. తత్త్వజ్ఞానియైనవాడు గుణముల యొక్క, కర్మలయొక్క విభాగమును తెలుసుకొనుటచే ఇంద్రియములు వాని విషయములు-రెండునూ ప్రకృతి సంభవములేనని, ప్రకృతి యొక్క గుణములు తమయందే తాము పనిచేయుచున్నవని తెలుసుకొనుట చేత సంగమును పొందడు. ఇట్టి విషయమును బోధించుటకు పౌరాణికులు ఒక కథను ఉదాహరణగా చెప్పుతుంటారు.

"ముగ్గురు సత్పురుషులు వారి పుణ్యఫలము వలన విమానము ఎక్కి ఊర్ధ్వగాములై స్వర్గమునకు పోవుచున్నారట. విమానములోనుండి క్రిందికి చూసినప్పుడు భూమిపై ఒక ప్రదేశంలో ఒక పాము ఒకకప్పను ఆహారంగా మ్రింగుతున్న దృశ్యము వారికి కనబడింది. ఆముగ్గురిలో సాత్వికుడైన ఒక మహానుభావుడు "అయ్యోయ్యో ! పాపము ! కప్ప అన్యాయముగా పాముచే మ్రింగబడి చనిపోవుచున్నది. దుర్బుద్ధికల ఆపామును నిగ్రహించగలవారు ఎవరూ లేరే అక్కడ !" అని అన్నాడట. ఈ భావము వలన అతని ఊర్ధ్వ గమనము ఆగిపోయి విమానము నుండి క్రిందికి పడిపోయినాడు.

రెండవ మహానుభావుడు సాత్వికుడే కాక తాత్త్వికుడు కూడా ! "పాముకు కప్ప ఆహారము. దానిని తినుటలో తప్పేమీ లేదు. కప్పను చూచి మనము జాలి పడటంకన్న పాముకు తగిన ఆహారం లభించినందుకు సంతోషించటం మంచిది." అన్నాడట. అతను కూడా క్రిందకి పడిపోయినాడు. ఇక మూడవ మహానుభావుడు సాత్త్వికుడే కాక

ఉదాసీనుడు కూడా. అందుచేత "హింసాహింసాత్మకములగు ఈకర్మలకు నేను కర్తను కాను. న్యాయాన్యాయనిర్ణేతను అసలేకాను. ఈకర్మలు వారివారి పూర్వ సంస్కారఫలములుగా ఈశ్వరనిర్దేశమువలన ప్రకృతిలో జరుగుచున్నవి. నేను సాక్షిని మాత్రమే" అని ఉదాసీనుడై ఉండెనట. అట్టి జ్ఞానయోగిఅవరోధము లేకుండా ఊర్ధ్వమార్గమున వెళ్ళెను" అని ఒకకథను చెప్పుతుంటారు.

అందుచేత అహంకారము అనగా కర్తృత్వభావము, భోక్తృత్వభావము (నేను చేయుచున్నాను లేక నేను అనుభవించుచున్నాను) అనునది ఏమాత్రము అయినా ఉన్నట్లయితే బుద్ధిమూఢమవుతుంది. అందుచేతనే గీతలో "అహంకార విమూఢాత్మా" అని చెప్పబడినది. అహంకారము తమోగుణము యొక్క ప్రారంభదశ. దీనివలననే ప్రప్రథమ ద్వైతభావము ఏర్పడుతుంది. అహంకారము ఉన్నవారికి బ్రహ్మాకారవృత్తి కలుగదు-మోక్షము రాదు. జ్ఞానియగువాడు తాను కర్తను కాను, భోక్తను కాను అని నిరహంకార భావముతో ఉన్నంతమాత్రమున శరీరవాఙ్మనఃక్రియలు ఆగిపోవు.

ఉదాహరణకు జ్ఞానికూడా గాలిపీలుస్తూనే ఉంటాడు. పైగా ఉచ్ఛ్వాసనిశ్వాసలు జరుగుతున్నట్లు తెలుస్తూనే ఉంటుంది. "జ్ఞానికి ఏమీ తెలియదు. ఒళ్ళు తెలియదు. శీతోష్ణ భేదభావములేదు; ఆకలిదప్పులు లేవు అనుట" సరికాదు. ఏమి తెలియని వాడు జడుడు. కాని జ్ఞాని జడుడుకాడు:

ధ్యానమునకు కూర్చుని ఉన్నప్పుడు పద్మాసనం వేసుకుని కనులు మూసుకుని కదలకుండా ఉన్నప్పుడు కూడా ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతూనే ఉంటాయి. జ్ఞానికి ఎల్లప్పుడు తెలివి (Awareness) ఉంటుంది. అందుచే ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతున్నట్లుగా గుర్తిస్తూనే ఉంటాడు. అయితే నేను దేహము అనే భావములేదు కాబట్టి ఈగాలినేను పీలుస్తున్నాను, నేను వదులుతున్నాను అని భావించడు. అలాగని ఉచ్ఛ్వాస నిశ్వాసలు నిరోధించుటకు ప్రయత్నించడు. అలా నిరోధిస్తే అందులో మరల కర్తృత్వభావము, కర్మ, కర్మఫలము ఏర్పడుతుంది. జ్ఞాని ఈప్రాణవ్యాపారమునకు తాను సాక్షిని అని మాత్రమే

తెలునుకుంటాడు. ఎదురుగా ఉన్న మరొకవ్యక్తి యొక్క ప్రాణవ్యాపారమునకు తాను ఎంత మాత్రము కర్తకాడో, సాక్షిమాత్రమే అవుతాడో అట్లే తన శరీర వ్యాపారమునకు కూడా సాక్షి మాత్రమే అవుతాడు. శరీరములోని ఊపిరితిత్తులు ఇంద్రియములు. ఇవి ప్రకృతి సంభవములు, బయట ఉన్నగాలి, లోపలున్నగాలి రెండూ ప్రకృతిలోని భాగమే. అందుచే ఈ శ్వాస వ్యాపారము ప్రకృతి వలన ప్రకృతిలో జరుగుచున్నది. ఇట్లే సమస్త ఇంద్రియవ్యాపారములను, సాంఘిక రాజకీయ కర్మలు అన్నింటిని త్రిగుణాత్మకమైన ప్రకృతిలో జరిగే చలనము (Motion) గా జ్ఞాని తెలుసుకుంటాడు. తాను ప్రకృతిలోని చలనములకు సాక్షిమాత్రమే అయివుంటాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసములను ఎలా నిరోధించుటం లేదో అట్లే ఇతర ఇంద్రియ వ్యాపారములను కూడా నిరోధింపనవసరము లేదు. అంతేకాదు. నిరోధించుటవలన అహంకారము, సంకల్పము ఏర్పడుతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తోంది ! సకల దుశ్చర్యలను చేస్తూ, భోగలాలసులై ఉంటూ, హింసాత్మకపాప కర్మలను చేస్తూ "నేను కర్తను కాను, నేను భోక్తను కాను, నేను ఏమీ చేయటంలేదు. అన్నీ ప్రకృతిలోనే జరుగుతున్నవి. ఇంద్రియములు వాటి విషయములందు స్వేచ్ఛగా పనిచేస్తున్నవి, నాకు పుణ్యపాప ఫలములు లేవు" అని ధర్మోపన్యాసము చెప్పవచ్చును. కదా ?" అని ఎవరైనా ప్రశ్నించవచ్చును. ఈప్రశ్నకు సమాధానము .....

"సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్" అని భగవద్గీత చెప్పుచున్నది. సత్త్వగుణము వలననే జ్ఞానము పుట్టును. అనగా రజోగుణ, తమోగుణములవలన జ్ఞానోదయము కాదు. ప్రమాదము, నిద్ర, ఆలస్యము, మోహము, మూఢత్వము, పొరపాటు పడటము - ఇవి తమోగుణ లక్షణములు.

రాగద్వేషములు, కర్మచేయాలనే ప్రవృత్తి, దంభ అహంకారములు, కర్మఫలమునందు ఆకాంక్ష, కీర్తి కాముకత్వము ఇవన్నీ రజోగుణ లక్షణములు. ఈరెండు గుణములూ (రజస్తమో గుణములు) ఉన్నవారికి అసలు జ్ఞానం కలుగదు. స్థూల జగత్తువైపు, విషయవాసనల వైపు

ఆకర్షింపబడుట రసజ్తమోగుణముల లక్షణము. విషయవైరాగ్యము కలిగి భక్తి భావము, సాక్షిభావమువైపు మరలుట సత్వగుణలక్షణము.

సత్వగుణ లక్షణములైన ఆచార్యోపాసనము, ఇంద్రియనిగ్రహము మొదలగు వాటిని గురించి భగవద్గీతలో వివరించబడినది. సత్వ గుణమువలన జ్ఞానము కలుగును అని చెప్పినపుడు ఈజ్ఞానమునకు నిరహంకారత్వము, సాక్షిభావము, ఈశ్వర ప్రణిధానము అను ఈ మూడును ముఖ్యలక్షణములు అని తెలియవలెను. ఇట్లు జ్ఞానము ఎవరిలో ఉద్భవిస్తుందో అతడు స్వేచ్ఛాచారి, భోగలాలసుడు, హింసాపరుడు ఎన్నటికీ కాజాలడు. పాపకర్మలు చేయుచూ "నేను కర్తను గాను సాక్షిని అనుకొనుట అసాధ్యము. అట్లే బ్రహ్మజ్ఞాని పాపకర్మలు చేయుటకూడా అసంభవమే.

పతంజలి యోగదర్శనములో బ్రహ్మాత్మైక్యజ్ఞానమును కలిగించు నిర్బీజసమాధి ధర్మమేఘము అని వర్ణించబడినది. ఒకమేఘము వర్షమును ఎలా ప్రసాదిస్తుందో అట్లే ఈసమాధికూడా సకలధర్మములను వర్షిస్తుందని అర్థము. ఇట్టి సమాధి సిద్ధి కలిగిన వారు అధర్మమును ఆచరించుట అనునది అసంభవము.

""ఋతంభరా తత్రప్రజ్ఞా" అనే సూత్రంలో పతంజలి మహర్షి నిర్బీజసమాధి యందు కలుగు ప్రజ్ఞ "ఋతంభర" అని వర్ణించారు. అనగా ఋతముచే నిండినది అని అర్థము. ఋతము అనగా విశ్వజనీనమైన ధర్మమే (Universal law)

మరి ఇటువంటి జ్ఞానిని గుర్తించుట ఎట్లు ?

ఎవరినైనా సరిగా అర్థము చేసుకోవాలంటే వారి స్వభావమును, ప్రవర్తనను కొద్దిగా పరిశీలించి చూడవలెను. తాత్కాలికముగా స్వల్పకాలము చూసినట్లైతే ఒకప్పుడు యధార్థము గోచరించక పొరపాటు పడవచ్చును. లోకములో సాధారణ జనుల విషయంలో కూడా ఇదే జరుగుతూ ఉంటుంది. జ్ఞానులను పరిశీలించినచో వారి స్వభావమునందుముఖ్యముగా మూడులక్షణములు కనబడతాయి.

ఒకటిః- "సర్వభూతహితే రతా"ః అన్నట్లు వారు సమస్త జీవుల

మంచిని కోరతారు. అందరూ బాగుపడాలని ఆశిస్తారు. వారుచేసే పనులు అందరికీ హితకరముగా పరిణమిస్తాయి.

రెండు : వారి సాన్నిధ్యంలో అనగా ఆత్మజ్ఞాని సాన్నిధ్యంలో ఇతరులకు కూడా శాంతి కలుగుతుంది. అంటే రాగద్వేషాలు, కామక్రోధాదులు తగ్గి, విచక్షణాజ్ఞానము, సాత్త్వికగుణము వారి సన్నిధియందు ఉన్నవారిలో పెంపొందుతాయి. జ్ఞానుల వద్దకు వెళ్ళినప్పుడు అలా వెళ్ళటంవలన "మనకు ఏమైనా ధనం కలసి వచ్చిందా?" అన్నది, భౌతికమైన విషయములు కలసివచ్చినవా? అనునది ప్రధానంకాదు. మన మనసులో కలిగే మార్పే ముఖ్యమైన అనుభూతి. ఏజ్ఞానుల సాన్నిధ్యమువలన మనకు ఇటువంటి చిత్తశాంతి, చిత్తశుద్ధి కలుగుతుందో, అట్టిజ్ఞానులు స్వయంగా ఉత్కృష్టులై, సంసారమునకు అతీతులైయుందురనుట పరమసత్యము.

పతంజలి మహర్షి సమాధిపాదము 35వ సూత్రములో "అహింసా ప్రతిష్ఠితాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" అని ప్రవచించారు. అహింస యందు ప్రతిష్ఠితులైయున్నవారి సాన్నిధ్యమునందు, సకల విధములైన వైరభావములు తొలగిపోవునని అర్థము.

జంతువులలో పిల్లి ఎలుకల వలె పుట్టుకతో వచ్చు సహజ వైర భావములు, జాతి శతృత్వము కూడా బ్రహ్మజ్ఞానుల సమక్షములో తొలగిపోవునని చెప్పెదరు. (పూర్వము ఋష్యాశ్రమములందు క్రూరమృగములు, సాధు జంతువులు కూడా తమ సహజ వైర భావము మరచి కలసిమెలసియుండెడివని పురాణ ప్రసిద్ధము).

మానవులలో ఉండే జాతిమత శతృత్వభావములు బ్రహ్మజ్ఞానుల సమక్షంలో తొలగిపోతాయి. బ్రహ్మజ్ఞానిమాత్రమే ఆవిధముగా పూర్ణమైన అహింసా ప్రతిష్ఠితుడు కాగలుగుతాడు.

మూడు : - ఇట్టి జ్ఞానులు ఎప్పుడూ పరమేశ్వర భక్తులయ్యే ఉంటారు. వారి సమక్షములో మనకు కూడా ఈశ్వరునియందు భక్తి భావము దృఢమవుతుంది. అంతేకాని నాస్తిక భావములు, కుతర్కములు, కువిమర్శలు ఉత్పన్నముకావు. 'విప్లవాత్మకమైన భావములు' అని

సాధారణంగా చెప్పుకునే విషయాలు జ్ఞానుల సమక్షంలో ఉదయించవు. మన ఆలోచనా విధానము సరళము, ప్రేమ పూర్వకము, భక్తి భావ సమన్వితము అవుతుంది.

**"యోమాంపశ్యతి సర్వత్ర సర్వంచమయి పశ్యతి**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే నప్రణశ్యతి"॥**
**గీత 6 అధ్యాయం 30వ శ్లోకము.**

"ఎవరైతే నన్ను సర్వత్ర చూచుచున్నారో, సమస్త ప్రపంచమును నాయందు చూచుచున్నారో అట్టి జ్ఞానిని ..... నేను నశింపచేయను. అజ్ఞాని నన్ను నశింపచేయడు".

అనగా జ్ఞాని ఈశ్వర ఆస్తిక్యమును నిరాకరింపడు. (He never denies the existene of God), జ్ఞాని ఎప్పుడూ "దేవుడులేడు" అని చెప్పడు. అదే విధముగా భగవంతుడు బ్రహ్మాత్మైక్యరూపమగు జ్ఞాన స్థితిని సమర్థించి దానిని సర్వజీవుల లక్ష్యముగా వివరించును. భగవంతుడు కాని, భగవంతుని ఆజ్ఞారూపములైన వేదశాస్త్రములు కాని, ఆయన ఆజ్ఞానువర్తులగు సద్గురువులు కాని..... వీరందరు ఎల్లప్పుడు సర్వాత్మజ్ఞానమే జీవిత పరమార్థమని బోధిస్తుంటారు..

భగవంతుడు ఎప్పుడు బ్రహ్మాత్మైక్యజ్ఞానమును నిరాకరింపడు, జీవునకు భగవంతుడు పరోక్షభూతుడు కాడు.

జ్ఞాని మనసునందు ఏవిధమగు ఐహికమునకుగాని, పార లౌకికమునకు గాని సంబంధించిన చింతయే ఉండదు. వాంఛ కలుగదు. అన్నివిధములగు సంకల్పవికల్పములను విడిచివైచి యుండునట్టి జ్ఞానియగు పురుషుడే గుణాతీతుడు.

ఈ విశ్వమంతయు పరబ్రహ్మస్వరూపమే. ఇట్టి జ్ఞానమును ఎల్లప్పుడు కలిగియుండుటే అవ్యభిచార భక్తి. సమస్త భేదభావములను విడనాడి సంపూర్ణమైన ఏకాగ్రచిత్తముతో తనలో పరమాత్మను ఎరుగవలెను.

అల ఎంత చిన్నదైనను సముద్రమునకు భిన్నము కానట్లే "నేను" (ఆత్మ) కూడా ఈశ్వరునకు భిన్నమైనది కాదు. ఈవిధమగు

ఏకత్వభావనతో కూడి యున్న దృష్టి యొక్క ఆనంద పూర్ణవృత్తినే భక్తి అనవలెను.

ఒక బంగారపు వస్తువును, మరొక బంగారపు వస్తువుతో పోల్చి ఆరెండు ఒకటేనని చెప్పినపుడు ఏఅర్థములో ఆరెండు సమానము అనుచున్నామో విచారించవలెను. రెండింటిలోను బంగారమే ఉండుట వలన ఆరెండూ గుణాత్మకముగా సమానమే అనుచున్నాము. అయితే అందులో ఒకటి కంకణము. ఒకటి హారము అనుకుంటే ఆరెండింటికి నామరూపములు వేరువేరు కదా ! అట్లే వాటి గుణములు, అందము, ప్రయోజనము వేరువేరు. అదేవిధముగా భగవంతునికీ, జీవునికీ నామరూపములు, గుణములు, ప్రయోజనము, ప్రవృత్తి అన్నియు భేదముగా ఉన్నప్పటికీ సచ్చిదానంద లక్షణములు ఇద్దరియందూ సమానముగా ఉండుటచే ఆసచ్చిదానందలక్షణముల దృష్ట్యా జీవుడే పరబ్రహ్మము, జీవుడే భగవంతుడు అనుచున్నాము.

అయితే మహాభక్తునకు కూడా "అహం బ్రహ్మాస్మి", దేహోనాహం, సచ్చిదానందోహం అనుజ్ఞానము ధారణాత్మకముగా కలిగిన తరువాత కూడా చాలకాలము వరకు భగవంతుడు సర్వశక్తివంతుడు-జీవుడు అల్పశక్తివంతుడు; భగవంతుడు నియామకుడు-జీవుడు పాలితుడు; భగవంతుడు సర్వజ్ఞుడు జీవుడు కించిజ్ఞుడు అనే భావము వదిలిపెట్టక వెంట వనన్తానే ఉంటుంది. అందుచేతనే జగద్గురువులైన ఆదిశంకరాచార్యులవారు తమషట్పదీస్తోత్రములో భక్తి భావమును ఇలా వర్ణించారు.

**సత్యపిభేదాపగమే నాథ తవాహం నమామకీనస్త్వం**
**సాముద్రోహితరంగః క్వచనసముద్రోనతారంగః**

**౩శ్లో.**

"హే ప్రభో ! భేదాపగయేసతి అపి = భేదము తొలగిపోవుట కలిగినప్పటికీ

తవాహం = నేను నీవాడను మాత్రమే అగుదును.

త్వం = నీవు

మామకీనః = నావాడవు

న = కావు.

తరంః = తరంగము, సాముద్రః+హి= సముద్రమునకు సంబంధించనది.

క్వచన = ఒకప్పుడుకూడా, సముద్రః = సముద్రము, తారంగః+న=తరంగ సంబంధమైనది కాదు.

"హే ప్రభో ! నీకు నాకుగల భేదభావము నశించినట్లు అనుభవములో తెలిసెననుట నిజమే. అయినను ఎప్పటికైనను నేను నీవాడనే అగుదును. కాని నీవు నావాడవు కావు. ఎట్లనగా" తరంగము సముద్రమునకు సంబంధించినది" అని చెపుతారు కాని ఎవరైనా ఎప్పుడైనా "సముద్రమే తరంగమునకు సంబంధించినది" అని చెపుతారా? ఎప్పుడైనా అలా జరుగుతుందా ! (జరగదని భావము) దీనివలన భగవంతుడు అనంతుడనే భావం, జీవుడు కించిజ్ఞుడనే భావం పోవటం చాలా కష్టము అని తెలుస్తోంది. ఇట్టి భావముకల వారు భక్తులు. అయితే ఈసర్వజ్ఞత్వ, కించిజ్ఞత్వాదులు ఉపాధి ధర్మములని జ్ఞాని త్వరలోనే గుర్తిస్తాడు. ఉపాధి మాయాకార్యమగుటచే పారమార్థిక సత్యముకాదు.

పరమాత్మ సగుణుడని భావించినపుడే అనగా ఆయన ఉపాధిసహితుడని భావించినప్పుడు మాత్రమే ఈ భేదము ఉంటుంది. ఉపాధి మాయాకల్పితమనీ, మాయప్రత్యేకవస్తువుకాదనీ పరబ్రహ్మము ఒక్కటే పారమార్థిక సత్యముకాని, ఉపాధి పారమార్థికసత్యముకాదని గుర్తించినపుడు ఆత్మ, పరబ్రహ్మ కూడా నిర్గుణములేనని తెలియును. రెండు నిర్గుణ వస్తువులకు సజాతీయభేదముకాని, విజాతీయ భేదముకాని, స్వగతభేదముకాని, అల్పత్వ, అధికత్వ భేదముకాని, నామరూప గుణ భేదముకాని ఎంతమాత్రమూ ఉండదు. కావున జీవబ్రహ్మైక్యము సిద్ధించుచున్నది.

మరొక విధముగా చెప్పాలంటే సచ్చిదానంద స్వరూపుడగు

పరబ్రహ్మకు, జీవునకు గల ఐక్యము వస్తుగతము యథార్థము, నిత్యము. ఈజీవబ్రహ్మలకు గల భేదము జీవుడు మరియు బ్రహ్మకాని మరొక స్థానానంతరమందునిలిచి బాహ్యదృష్టితో చూసినపుడు మాత్రమే అనగా మనోబుద్ధి వృత్తులతో చూచినపుడు మాత్రమే గోచరిస్తుంది.

"The unity of self and God is inherent while the difference between self and God is apparent. The difference is seen grown on enternal stand point only; which the unity is experienced in the inherent nature of self and God.

బాగుగా వికసించిన ఈదృష్టియే సమస్త జ్ఞానసారమును, యోగసర్వస్వమును అయివున్నది. జ్ఞానియగునట్టి పురుషుడు ఏవిధమైన అతుకూ లేకుండా ఆపరమపురుషునితో కలసియుండును. జీవుడు, బ్రహ్మ వేరు వేరు వస్తువులైతే ఆరెండింటినీ కలుపుటకు గాని, అతుకుటకు గాని ఒకవేళ సాధ్యమైనప్పటికీ కాలాంతరములో అవి రెండూ మరల విడిపోతాయి. జీవుడు బ్రహ్మ అనునవి ఒకే వస్తువనీ, అజ్ఞానముచేత దానిని వేరువేరుగా నానాత్వము కలదానిగా తెలుసుకుంటున్నానని గుర్తిస్తే అజ్ఞాననివృత్తి కలిగి జీవబ్రహ్మైక్యము శాశ్వతముగా సిద్ధిస్తుంది.

ఈ "సోహం" వృత్తి ఒక్కమారు ఏర్పడినప్పుడు మానవుడు ఆవృత్తి సహితముగా తనంతతానే పరమాత్మ తత్వమున విలీనమైపోవును. ఒక పర్యాయము జ్ఞానమువలన భేదబుద్ధి నశించినపుడు ఇక అజ్ఞానముకూడా మిగిలియుండదు. జ్ఞాని దృష్టిలో మూల అజ్ఞానము లేదు. తాత్కాలిక అజ్ఞానము లేదు అజ్ఞాన నివృత్తిలేదు. జ్ఞానము ఒక్కటే ఉన్నది. ఈస్థితినే "బ్రహ్మీస్థితి" అని అంటారు.

**"ఏషా బ్రాహ్మీ స్థితి పార్థః"**
**గీత 2.72**

**న నిరోధోన చోత్పత్తిః**
**నబద్ధ నచసాధకః**

నము ముక్షుఃనవైముక్తః
ఇత్యేషా పరమార్థతా.

గౌడపాదీయమాండుకోపనిషత్కారిక.
వైతధ్య ప్రకరణము. 32 వశ్లోము.

పారమార్థిక దృష్టితో చూచినచో మనో బుద్ధివృత్తులు నిరోధించుట అనునది లేదు. బుద్ధివృత్తులు ఉదయించుట అనునది లేదు. జీవుడు బద్ధుడై ఉండుటలేదు, సాధకుడుగా ఉండుటలేదు. మోక్షమును కోరుటలేదు. మక్తుడగుట లేదు. ఈవిధమై ఉన్నది పరమార్థము. అనగా బుద్ధివృత్తులు ఉదయించుట, దానివలన కలుగు బద్ధత్వము, చిత్తవృత్తి నిరోధరూపమైన యోగము, సాధకత్వము, ముముక్షుత్వము, ముక్తిని పొందుట ఇవన్నీ వ్యావహారిక సత్యములే. దీనికి స్వప్న దృష్టాంతమునిచ్చుచున్నారు. "మహారాజు నిద్రలో తాను శత్రురాజులచే బద్ధుడైయున్నట్లు ముఖ్యమంత్రి సలహా వలన ఎంతో ప్రయత్నము చేసి బంధవిముక్తిని పొందినట్లు" కలగన్నాడు. కలలో ఆబంధవిముక్తి కలగగానే అతనికి మెలకువ వచ్చింది. రాజుగారు తన అంతఃపురములో హంస తూలికాతల్పముపై శయనించి ఉన్నానని తనను తాను తెలుసుకుంటాడు. కలలో తాను బంధింపబడుట, ముఖ్యమంత్రి ముక్తిమార్గమును ఉపదేశించుట, తాను ప్రయత్నించుట, బంధము తొలగుట అంతా స్వప్నగతములు మాత్రమేనని తెలియును.

బ్రహ్మాస్తితిని పొందుటయే సాయుజ్యమని, చతుర్థ పురుషార్థమగు మోక్షమని కూడా అంటారు. పరమాత్మను సేవించుటే బ్రహ్మత్వమును పొందదగు సాధనమని తెలుసుకొనవలెను. పరమాత్మ స్వరూపము శాశ్వతము, అచలము, స్పష్టము, ధర్మస్వరూపము, ఆనందమయము, అపారము మరియు "ఏకమే వాద్వితీయమ్". ఇదియే జ్ఞానమునకు పరాకాష్టస్థితి.

ఆత్మజ్ఞానము కలిగినపుడు మానవునకు అతనికర్మలు కూడా నశించును. జ్ఞానియగు పురుషుడు చేయవలసిన కర్మ ఏదీ మిగిలియుండదు.

**'తత్త్వమాధ్యాత్మికం దృష్ట్వా**
**తత్త్వం దృష్ట్వాతు బాహ్యతః**
**తత్త్వీభూతః తదారామః**
**తత్త్వాత్ అప్రచ్యుతో భవేత్."**

**గౌడపాదయ మాండూక్యోపనిషత్కారికా 2-38.**

ఆధ్యాత్మికమైన తత్త్వమును తనలో చూచి, బాహ్యాజగత్తులో కూడా అదే తత్వమును చూసి తత్వభూతుడై దానియందే రమించుచు ఆతత్వమునుండి కొంచెముకూడాచ్యుతిని పొందనివాడుగా ఉండవలెను. "తత్వము" అనగా యథార్థముగా ఉన్న వస్తువు. ఆధ్యాత్మికతత్వము అనగా ఆత్మ యొక్క యధార్ధ తత్త్వమును తెలుసుకొనుట. అనగా తన స్వరూపమును తెలుసుకొనుట. తత్త్వమును బాహ్యముగా చూచుట యనగా బాహ్య జగత్తు తమకన్న వేరైన వసుధాది బుద్ధి పర్యంతమైన విశ్వము ఆత్మస్వరూపమేనని తెలియుట. తత్త్వీభూతుడు అనగా తనయందు ఆత్మేతరవస్తువు ఏమాత్రమూ లేదని, ఆత్మభిన్న పదార్థముల మిశ్రమము కాదని తెలుసుకొని ఆతత్వమే తానని తెలుసుకొనుట. ఇట్లు తత్వజ్ఞానము కలిగి యుండుట యందు రమించుట అనగా ఆనందించుట.

శ్రీమహావిష్ణువునకు అచ్యుతుడు అను పేరుకలదు. అనగా ఆత్మ జ్ఞాన స్థితి నుండి ఎంత మాత్రము చ్యుతిని పొందనివాడు అని అర్థము తత్త్వజ్ఞాని కూడా తత్వమునుండి అప్రచ్యుతుడై అనగా ఈషణ్మాత్రము కూడా చ్యుతిని పొందనివాడై యుండవలెను.

**జ్ఞాన సాధన**

**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధాకర్మచోదనా**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః**
**గీత 18-18.**

జ్ఞానము, జ్ఞాత మరియు జ్ఞేయములనెడి త్రిపుటి ఈజగత్తునకు బీజమై యున్నది. ఈమూడు కర్మప్రవృత్తికి చెందిన త్రికూటములు, కర్త, కరణము మరియు కార్యములు ఈకర్మయొక్క త్రికూటములు.

ఈజ్ఞానము త్రిగుణముల వలన మూడు విధములుగా ఉండును.

ఈ త్రిగుణములలో రాజసిక, తామసిక గుణములు రెండూ బంధమును కలిగిస్తాయి. మూడవదైన సాత్త్వికగుణము మాత్రమే మోక్షమును ప్రసాదించగలదు.

**సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే**
**అవిభక్తం విభక్తేషు తత్ జ్ఞానం విద్ధిసాత్త్వికమ్.**
**గీత 18-20**

వేరు వేరుగా ఉన్న సకల భూతముల యందు అవిభక్తముగా ఉన్న అద్వయమైన పరమాత్మను ఏజ్ఞానముచే చూచుచున్నాడో అట్టి జ్ఞానమును సాత్త్వికము అని తెలుసుకొనవలెను.

నిర్మలమైన సాత్త్విక జ్ఞానము ఉదయించగానే జ్ఞాత మరియు జ్ఞేయములు బ్రహ్మైక్యమున విలీనమైపోవును.

**పృథక్త్వేన తుయద్ జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్**
**వేత్తి సర్వేషు భూతేషు తద్ జ్ఞానం విద్ధి రాజసమ్.**
**గీత 18-21**

సకల భూతముల యందు నానాభావములతోను, నానా రూపములతోను కనబడుచున్న వానివలన అవి వేరువేరుగా ఉన్న వనెడు జ్ఞానము "రాజసజ్ఞానము" అని తెలుసుకొనవలెను.

**యత్తుకృత్స్నవదే కస్మిన్కార్యే సక్తమహైతుకమ్**
**అతత్త్వార్థ వదల్పంచ తత్తామసముదాహృతమ్.**
**గీత 18-22.**

హేతుయుక్తము కానిదియును, పరమార్థముగానిదియును, అల్పమైనదియును అయి ఒకే విషయమునందే సకల జ్ఞానము ఉన్నట్లు తలచెడి జ్ఞానము తామస జ్ఞానముగ తెలుపబడినది.

ఈతామసిక జ్ఞానము శాస్త్రవిధులను లక్ష్యపెట్టదు. ఏపదార్థమునూ నిషిద్ధముగా దలచదు. అనగా ఫలానా వస్తువులేక విషయము యోగ్యమైనది కావున స్వీకరించవలెనని కాని, నిషిద్ధమైనది కావున నిషేధించవలెనని కాని ఈతామసిక జ్ఞానము యోచించదు. తనకు అందుబాటులో ఉన్న

పదార్థములన్నింటినీ అనుభవించవలెనని తలచు జ్ఞానమే తామసిక జ్ఞానము. ఇట్టి జ్ఞానము జీవనోపాధి సంపాదనకు తప్ప మరెందుకూ పనికిరాదు. అట్టి జ్ఞానమునకు స్వర్గ నరకములు కనిపించవు. శరీరమే ఆత్మయనీ, దేవుడనగా కేవలము రాతివిగ్రహమనీ ఈ జ్ఞానము తెలుపును. శరీరము నశించగనే కర్మలతోపాటు ఆత్మకూడా నశించుననీ, అప్పుడు మరల అనుభవించుటకు ఏకర్మలూ మిగిలియుండవనీ బోధించును. ఈశ్వరుడు ఉన్నాడని ఒకవేళ అంగీకరించిననూ అతడు కేవలము రాతి విగ్రహమేనననును.

ఆత్మయనగా శరీరమేననియు, పాపపుణ్యాది ఇతర విషయములు పూర్తిగా సత్యములనియూ తలచి ఎల్లప్పుడూ విషయములందే, విషయ భోగములందే నిమగ్నుడైయుండి అరణ్యము నందలి అగ్నివలె సమస్తమునూ భక్షించుచూ పోవుటే సమంజసమని నిశ్చయించు కొనునటువంటి జ్ఞానమే "తామసికజ్ఞానము". ఇది వ్యర్థమైనది. నిస్తేజమైనది. అదికేవలము తెరచియున్న కనులకు కల చీకటియే.

ఇట్టి త్రివిధమైన జ్ఞాన ప్రకాశము వలన కర్తచేసెడి పనులన్నియూ జరుగుచున్నట్లుగా కనిపించును. కర్మలుకూడా త్రివిధజ్ఞానములనెడి త్రివిధమార్గముల గుండా పోవుచుండును.

శాస్త్రానుసారము కర్మలనాచరించి ఈశ్వరప్రాప్తినొందుట ఆవశ్యకము. అంతేకాక "ఈశ్వరప్రాప్తి" ఈవిధముగా మనకు తప్పక లభించునను సత్యమును చక్కగా తెలుసుకొనుటయే "జ్ఞానము". మనుష్యుడు శుద్ధసత్త్వము కలవాడై శాస్త్ర జ్ఞానసహాయము వలన లేదా తన ధ్యాన బలము వలన కాని ఈశ్వరతత్వముతో, నిస్సందేహబుద్ధితో సమరసత్వమును పొందుట "విజ్ఞానము".

అద్దము ప్రక్కకు తొలగించినపుడు దానితోపాటు కనబడుచున్న ప్రతిబింబము కూడా అదృశ్యమైపోవునట్లు అజ్ఞానము నాశనమొంది దానితోపాటుగా జ్ఞాతృత్వము కూడా లోపించిపోయినప్పుడు కేవలము చైతన్యము మాత్రమే మిగిలియుండును ఈచైతన్యమునందు కర్తృత్వ భావములు ఉదయించవు.

లోకమునందుకాని, దేహమునందుకాని జరిగే కర్మములు, క్రియలు అవరోధములను చెందవు. చైతన్యమునందు కర్మలు లేవు. కర్మఫలములూ లేవు. కాని మాయా కల్పితమైన జగత్తునందు కర్మలు, కర్మఫలములు ఉన్నవి. కర్మలుచేస్తూ వాటి ఫలమును తాను పొందకుండా ఉండు మార్గమునే "కుశలము" అంటారు. దీనినే "యోగః కర్మసు కౌశలమ్" అని భగవద్గీత చెప్పుచున్నది. యోగమనగా కర్మయందలి కుశలత్వము.

కర్మయోగి, భక్తియోగి, జ్ఞానయోగి ముగ్గురూ ఈ కౌశలమును సంపాదించుచున్నవారే. ఇట్టి యోగులు కర్మచేసినా ఆకర్మలయొక్క ఫలములు వ్యక్తిగతముగా తాము పొందరు కనుక కర్మచేయని వారితో సమానము. శ్రీకృష్ణుడు "తస్యకర్తారం అపి విద్ధిమాం అకర్తారం అవ్యయమ్" అన్నారు. ఆకర్మలను చేసిన వాడను అయినప్పటికీ నన్ను అవ్యయునిగా కర్మలను చేయనివానిగా తెలుసుకొనుము" అని చెప్పెను. దీనినే నిజమైన 'నైష్కర్మ్యసిద్ధి' అని అంటారు. నైష్కర్మ్యము అంటే పనులను చేయుటను మానుటకాదు. కర్మఫలమును పొందరు అంటే కర్మలు నిష్ఫలములు అనికాదు. ఒక యోగి మామిడి చెట్టును నాటి దానిని చక్కగా పెంచి వదలివేయును. ఆచెట్టుకు పండ్లు కలిగినా వాటిని యోగితాను అనుభవించక ఈశ్వరార్పణముగా వదిలివేయును. అందుచే కర్మఫలము ఆయనకు అంటదు. చెట్టుకు పండ్లు కాయువని అర్థముకాదు. ఆపండ్లు లోకసంగ్రహార్థము పక్షులకు, మనుషులకు అందరికీ ఉపయోగపడును అట్లే బ్రహ్మజ్ఞాని చేసిన సత్కర్మ లోకరక్షణకు ఉపయోగపడును.

కర్మయోగి కర్మఫలమును తాను స్వీకరించకుండా ఈశ్వరార్పణ చేయును. భక్తి యోగి తాను నిమిత్తమాత్రుడనని, ఈశ్వర సేవకుడనని తెలుసుకొని ఈశ్వరాజ్ఞచే కర్మలు నిర్వహింపబడుచున్నవి, అని భావించును. అందుచే ఈకర్మఫలము కూడా ఈశ్వరునికే చెందును.

జ్ఞానయోగి తాను కర్తను కానని, భోక్తను కానని, నిమిత్తమాత్రుడనుకూడా కానని తెలుసుకొనును. నిర్గుణ పరబ్రహ్మయందు కార్యకారణ భేదము, గుణకర్మలు ఏవియులేవు. వ్యావహారికసత్యమైన లోకమునందు ఈశ్వరాజ్ఞచే ప్రకృతినియమమునకు లోబడి కర్మలు

జరుగుచున్నవి. ఆకర్మలకు జ్ఞానయోగి సాక్షియే కాని కర్తకాదు. అందుచే కర్మఫలములు ఆయనకు అంటవు. ఈవిధముగా కర్మ, భక్తి జ్ఞాన మార్గములను అనుసరించు ముగ్గురూ కర్మబంధము నుండి తప్పించు కొనుచున్నారు.

'గురుకృప' లభించిన పిమ్మట ఇట్టి ఆత్మ జ్ఞానము ప్రాప్తించును. గురువు సాన్నిధ్యములో ఉన్న విశేష వాతావరణము వలన శిష్యునికి ఒక గంభీరమైన, విశాలమైన ఆధ్యాత్మిక శాంతి లభిస్తుంది. ఇట్టి శాంతివలననే శిష్యుడు తన గురువును గుర్తించగలుగుతాడు. గురువు తన అనంత పుణ్యబలముచే తాత్కాలిముగా శిష్యునియొక్క ప్రారబ్ధ అనుభవమును ఒక ప్రక్కకునెట్టి శిష్యుడు తురీయావస్థలో ఒక క్షణకాలము లేక కొన్ని క్షణముల కాలము ప్రవేశించునట్లు చేయును. అటుతరువాత శిష్యునికి జాగ్రత్ ప్రపంచములోనికి వచ్చినా అతని బుద్ధిమీద తురీయానుభవము యొక్క చెరగని ముద్ర ఉంటుంది. ఇట్టి తురీయానుభవమును శిష్యునికి కలుగచేయాటనే "శక్తిపాతము" అనీ, కుండలినీ జాగరణ అని తంత్రగ్రంథములందు వర్ణించినారు. నిద్రనుండి లేచిన వానికి హాయిగా నిద్రించితిని అను స్మృతి ఎట్లుండునో అట్లే తురీయావస్థనుండి జాగ్రదవస్థలోనికి వచ్చినవానికి బ్రహ్మానంద స్మృతి ఉండుటయేకాక ఆపరబ్రహ్మ ప్రేమాస్పదుడు అనే ఆకర్షణ కూడా ఉండును. ఆతురీయావస్థను మరల మరల పొందవలయును అనే అన్వేషణయే భక్తియని అద్వైతులు అంటారు. గురువు ఉపదేశించునప్పుడు ఈతురీయావస్థ జాగ్రత్స్వప్న సుషుప్తులకన్న భిన్నమైనదైనప్పటికీ జాగ్రత్స్వప్న సుషుప్తులలో అనుస్యూతమై పూలదండలో దారమువలె ఉన్నదని, ఆతురీయావస్థయే ఆత్మయొక్క నిజస్వరూపమని శిష్యుడు గ్రహిస్తాడు. అప్పుడు స్వస్వరూప అనుసంధానము వలన, ఆత్మతత్వాను సంధానమువలన తురీయావస్థను మరల మరల పొందుటకు ప్రయత్నించును. మొదటిసారి గురుకృపచే కలిగిన తురీయానుభూతి తరువాత తపోబలముచే కర్మక్షయమై స్వయముగా సిద్ధించును.

"బ్రహ్మభూతః ప్రసన్నాత్మానశోచతినకాంక్షతి
సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతేపరామ్"

గీత 18-54

బ్రహ్మభూతుడు ఆత్మసాక్షాత్కారమును పొందినవాడై శోకము, ఆశలేకుండా సమస్తభూతములందు సముడై, ఉత్తమమైన నాభక్తిని పొందుచున్నాడు.

**భక్త్యా మామభిజానాతి యవాన్యశ్చాస్మితత్త్వతః**
**తతోమాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్**
**గీత 18-55**

భక్తిచేత నేను ఎటువంటి వాడనో, ఎవడనో యధార్థముగా తెలుసు కొనుచు తదనంతరము నాయందే ప్రవేశించుచున్నాడు. ఈశ్లోకములలో మొదటచెప్పిన "బ్రహ్మభూతుడు" అన్నమాటకు- గురుముఖముగా శాస్త్రార్థము ఉపదేశింపబడి తాను బ్రహ్మము అనుపరోక్షజ్ఞానము పొందిన సాధకుడగు తపస్వి" అని అర్థము. ఇట్టి పరోక్షజ్ఞాని తపస్సు వలన భక్తుడుగా మారును. ఆభక్తివలన పరమేశ్వరుని యధార్థ స్వరూపము తెలుసుకొని బ్రహ్మపదార్థమున తన్మయుడై, తద్రూపుడై ప్రవేశించి, అపరోక్షజ్ఞానమును పొందును.

**ఇతితే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా**
**విమృశ్యైత తదశేషేణ యదేచ్ఛసితథా కురు.**
**గీత 18-63**

"ఓ అర్జునా ! జ్ఞానములయందెల్ల రహస్యమైన జ్ఞానమును నీకు చెప్పితిని. దీనినంతయును బాగుగా విమర్శించి నీవు కోరుకున్న విధముగా చేయుము."

ఈశ్లోకములో భగవంతుడు మానవుని యొక్క మానసిక స్వేచ్ఛా స్వాతంత్ర్యములను పూర్తిగా సమర్థిస్తున్నాడు. నేను చెప్పిన ఉపదేశమును విమర్శించుకొని, బాగుగా ఆలోచించుకొని నీఇచ్ఛ వచ్చినట్లు చేయుమని చెప్పుచున్నాడే కాని నేను చెప్పినట్లు వినకపోతే శాశ్వత నరకమునకు పోయెదవని భయపెట్టుటలేదు.

ఆధ్యాత్మికమార్గములో పురోభివృద్ధికి మానసిక శాంతి ఎట్లు ప్రధానమైన లక్షణమో అట్లే మానసిక స్వేచ్ఛకూడా ముఖ్యమైన అవసరము. స్వేచ్ఛలేకపోవటమే బంధమని అంటారు కదా ! మరి బంధవిముక్తి

కోసమే కదా ఈ సాధనలన్నీ ? వ్యక్తి స్వేచ్ఛను నిరసించే మతములు ఆధ్యాత్మికమార్గమునకు అడ్డుగోడలను మాత్రమే కట్టుచున్నవి.

"మన్మనాభవమద్భక్తో మద్యాజీమాంనమస్కురు
మామే వైష్యసి సత్యంతే ప్రతిజానే ప్రియోఽసిమే
గీత 18-65.

"ఓఅర్జునా ! నీవు నాయందు మనస్సు కలవాడవు కమ్ము, నాసంబంధమైన పూజలను, పనులను చేయుచుండుము. నన్నే నమస్కరింపుము. ఇట్లు చేయుట వలన నన్నే పొందగలవని నాకు ఇష్టుడవు కనుక నీకొరకు ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను."

"నాకు నమస్కరింపుము, నన్ను పూజింపుము" అని శ్రీకృష్ణుడు తన నామరూపములను మాత్రమే పూజింపుము అని ఆజ్ఞాపించెనని" అర్థము చెప్పుకుంటే అది సంకుచితార్థము మాత్రమే అవుతుంది. నారాయణనామరూపములను కాని, వాసుదేవనామరూపములను కాని ప్రత్యేకముగా లక్షించి శ్రీకృష్ణుడు ఈమాటలు చెప్పలేదు.

అయితే భగవంతుని ఏవో ఒక నామరూపములను అనగా రామ, కృష్ణ, శివ, గణపతి, దేవి మొదలైన నామరూపములలో ఏదో ఒక దానిని కాని, ఏవో కొన్ని నామరూపములను కాని ధ్యానించవలెనని కొందరు చెపుతారు. శ్రీకృష్ణనామరూపములను మాత్రమే ధ్యానించవలెనని అర్థము చెప్పువారికన్న వీరు విశాల హృదయులే, అయితే పైశ్లోములో ఈఅర్థము ఎక్కడ ఉన్నది ? ఏమాటనుండి మనము ఈఅర్థమును అనుమానముగా గ్రహించవచ్చును ?

అద్వైతమతము ప్రకారము శ్రీకృష్ణుడు "అస్మద్" శబ్దమును ప్రయోగించినపుడు అనగా అహం, మే. మమ. మహ్యాం, మాం-ఇత్యాది పదములను ప్రయోగించినపుడు వాటికి ఆత్మ పదములుగా మాత్రమే అర్థము చెప్పుకొనవలెను. భగవద్గీతయందు సుమారు డెబ్భయికన్న (70) ఎక్కువ పర్యాయములు శ్రీకృష్ణుని మాటలలో ఇట్టి "అస్మద్" శబ్దవాక్యములు ప్రయోగించబడినవి. అందుచే "మన్మనాభవ" అనగా ఆత్మను గురించిన మనస్సుకలవాడవుకమ్ము" "మద్యాజీ" - ప్రత్యగాత్మనే

పూజించుము "మాంనమస్కురు"- పరమాత్మకే నమస్కరింపుము. ఇట్లు చేయుటవలన మాం, ఏవ, ఏష్యసి - ఆత్మనే పొందగలవు - అనగా అపరోక్ష ఆత్మసాక్షాత్కారము పొందగలవు" అని అద్వైతులు అంటారు.

"సర్వవ్యాపకుడనగు నన్నే నీ అంతరింగిక మరియు బాహ్యములగు అన్నివిధములగు వ్యవహారములకును సంబంధించిన విషయముగా చేసుకొనుము. ఆకాశమునందు వాయువు అంతటా నిరవరోధముగా వ్యాపించియుండురీతిగా నీవు నాతో కలసియుండుము'.

ఈ విధముగా సమస్త వస్తుకోటి యందును పరమాత్మ స్వరూపము గోచరించినప్పుడు అన్ని విషయములందును ఆత్మబుద్ధి జనించును. దేహాభిమానము పూర్తిగా నశించును. అట్టి జ్ఞాని కూడా భగవత్స్వరూపమే అగును.

ఈవిధముగా నిష్కామ కర్మవలన చిత్తమాలిన్యము తొలగిభక్తి, భక్తి పరాకాష్ఠ చెందుటవలన భక్తునకు భగవంతునకు భేదములేదు అనేడి జ్ఞానము కలుగును. అట్టి జ్ఞానము కలిగినచో సమస్తచరాచర ప్రపంచము భగవత్స్వరూపముగా గోచరించును. ఆత్మసాక్షాత్కారము కలుగును. అట్టి జ్ఞానము ద్వారా మనుష్యుడు పరమాత్మతో కలసి ఏక రూపుడై జన్మరాహిత్యమును పొందును. అట్లు మరొక జన్మలేకుండా ప్రయత్నించుటయే <u>మానవ జీవిత పరమార్థము.</u>

అట్టి జ్ఞానమును సంపాదించుటకు సద్గురువును ఎట్లు చేరవలెనో ప్రభోదించు ఈగీతాశ్లోకమునకు శ్రీసాయినాథుని వివరణ ఇక్కడ పరిశీలించెదము.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః**
**గీత 4-34**

పూర్వుల అభిప్రాయముప్రకారము, తత్ = అజ్ఞానమును, ప్రణిపాతేన = సాష్టాంగ నమస్కారముచేత, పరిప్రశ్నేన = వినయముతో మరల మరల ప్రశ్నించుటచేతను, సేవయా = సేవచేతను, విద్ధి = తెలిసి కొనుము అని చెప్పబడినది. తత్వదర్శినః = బ్రహ్మానుభవము

కలిగిన, జ్ఞానినః = జ్ఞానులు, తే = నీకు, జ్ఞానం - జ్ఞానమును, ఉపదేక్ష్యంతి = ఉపదేశించగలరు. అనగా నీవు బ్రహ్మజ్ఞులగు పెద్దలకు సేవచేసి, వారినుండి ఈజ్ఞానమును తెలుసుకొనుము. వారు నీకు జ్ఞానమును ఉపదేశించగలరు."అని ఈశ్లోకమునకు పూర్వుల వ్యాఖ్యానము.

అయితే షిరిడీ సాయిబాబా ఈశ్లోకమునందు

"తేజ్ఞానమ్" అని ఉన్నచోట" తే + అజ్ఞానమ్" అని విడదీసినారు. సంధివలన తే + అజ్ఞానమ్ - తేజ్ఞానమ్ అవుతుంది. జ్ఞానవస్తువు అవాఙ్మనసగోచరము. అందుచే జ్ఞానవస్తువు ఒకరిచే ఉపదేశింపబడునది కాదు. గురువుచేయునది అజ్ఞాన నివృత్తి మాత్రమే. ఏది అజ్ఞానమో గురువు తెలియచేయును. పంచకోశములయందు కల అహంకార మమకారములు అజ్ఞానజనితములని గురువు ఉపదేశముచే తెలుసుకొని, ఇది ఆత్మకాదు.... ఇది ఆత్మకాదు. (నేతి.....నేతి) అని పంచకోశములను, తత్సంబంధిత సంకల్పములను త్రోసివేయగా, చివరకు తానే జ్ఞానవస్తువై నిలుచును. అందుచే "బ్రహ్మవేత్తలు నీకు జ్ఞానమును ఉపదేశింతురు." అని పూర్వులు అర్థము చెప్పగాసాయిబాబా "బ్రహ్మవేత్తలు నీకు అజ్ఞానమును గురించి తెలియచేయుదురు ! అని ప్రతిపాదించి, ప్రశస్తార్థము వచ్చునట్లు యుక్తియుక్తముగా నిరూపించెను.

సహజముగా ప్రతిజీవియు ఆత్మస్వరూపమే. జ్ఞానస్వరూపమే, కావున క్రొత్తగా జ్ఞానమును ఇచ్చు అవసరము లేదు. అజ్ఞానము అను పొరను మాత్రము తొలగించివేయవలసియున్నది. కాని, అది తృటికాలములో జరుగునది కాదు. ఎందుచేతననగా పూర్వజన్మ కర్మఫలము అనుభవించక తప్పదు. అజ్ఞానముచే ఆవరించబడియున్న జ్ఞానికి అజ్ఞానమనెడు పొరను తొలగించవలసియున్నది. నిర్మలమగు జలముపై నాచు చేరి యున్నప్పుడు, నాచును తొలగించినంతనే నీరు సహజముగా శుభ్రమగు రీతిని, అజ్ఞానపు పొర తొలగింపబడినచో, జ్ఞానము స్వతఃసిద్ధముగా ప్రకాశించును. కన్నులపైపొరలు కమ్మినపుడు దృష్టిమందగించుచున్నది. ఆపొరలను తొలగించినచో తిరిగి మనము చక్కగా చూడగలము. కనులకు కమ్మిన పొరలు తొలగించబడుచున్నవే కాని క్రొత్త కన్నులు కాని, క్రొత్తదృష్టికాని ఇవ్వబడుటలేదుకదా !

నీవు వేరు, భగవంతుడు వేరు అనుభావమే ఈఅజ్ఞానమునకు మూలకారణము అజ్ఞానముచేతనే వాస్తవమునకు అజ్ఞానము తొలగించబడుచున్నది. "జ్ఞానము" ఎవరికి వారు తెలుసుకొనవలసినదే కాని మరొకరు ఉపదేశించునది కాదు. నమస్కారము, ప్రశ్న, సేవ - ఇవి అన్నియు గురు కటాక్షమును పొందుటకు సాధనములు, గురు కృపవలన అజ్ఞానమనెడి తెర తీయబడును. అంతేకాని, గురువు ప్రత్యేకించి జ్ఞానము నివ్వడు.

జ్ఞానము జీవులకు సహజమైన స్థితి సద్గురువు వలెనే శిష్యుడును జ్ఞానస్వరూపమే ! కాని సద్గురువు సత్+చిత్+ ఆనందస్వరూపుడు. ఇతరుల అజ్ఞానమును తొలగించి ఉన్నత స్థితిని చూపుటకు శరీరధారణము చేయును. అంతమాత్రమున సద్గురువు యొక్క నిర్గుణత్వమునకు భంగము కలుగుటలేదు. శిష్యుడు కూడా వాస్తవమునకు అట్టి స్వరూపమే. కాని, జన్మ జన్మాంతరమగు కర్మబంధముచే ఆవరించబడి, తాను శుద్ధ చైతన్యమునన్న విషయమును మరచుచున్నాడు.

**అజ్ఞానేనావృతంజ్ఞానం; తేన ముహ్యంతి జంతవః**
**గీత 5-15.**

"జ్ఞానము అజ్ఞానముచే ఆవరించబడి యున్నది. అందుచేత ప్రాణులు మోహమును చెందుచున్నారు."

తాను దేహధారినని, శరీరమే తానని, పరమాత్మ వేరుగా ఎక్కడో ఉన్నదని, తాను కొరగాని జీవినను భ్రమవలన జన్మ జన్మలుగా పొరపడి సంపాదించిన అజ్ఞానమే శిష్యుని అణచి పెట్టుచుండును.

నాకు ఈభ్రాంతి ఎట్లు కలిగినది ? నేను ఎందులకు ఈ పెడత్రోవ పట్టితిని ? నిజమునకు నాకును పరమాత్మకునూ భేదమున్నదా ? అను విచారము కలగవలసియున్నది. ఇట్టిభ్రాంతిని తొలగించి, శిష్యుని పొరపాటును తెలియచేసి క్రమమార్గమును చూపుటయే గురువు యొక్క ఉపదేశము.

జ్ఞానోదయమునకు పూర్వముకూడా జీవుడు బ్రహ్మము కంటె వేరు కాదు. కాని అవిద్యచేత ఆవరించబడియున్న జీవుడు తానే బ్రహ్మమునని

గ్రహించలేక పోవుచున్నాడు. అనాత్మ భూతములగు భార్యా పుత్రాదులు, అన్నమయాది పంచకోశములు, ఆత్మ అను అజ్ఞానముచేత కలిగిన భ్రమను తొలగించుటకై ఇవన్నియు ఆత్మకాదని త్రోసిపుచ్చి, బుద్ధిగుహయందు ప్రత్యగాత్మను అపరోక్షముగా తెలుసుకొనుటకు తగిన జ్ఞానోపదేశమును శ్రుతిమాత అనుగ్రహించినది. కావున అట్టి విద్యచేత అవిద్య నశించును. అవిద్యానాశనమునకు విద్య తప్ప వేరొక మార్గము లేదు.

"నేను బ్రహ్మమును కాను" అనెడి అజ్ఞానమునశించగనే జీవుడు, బ్రహ్మము వేరు వేరుకావని, ఒక్కటేనని జ్ఞానముకలుగును. ఆవరణము తొలగిన వెంటనే దీపదర్శనమగును. అప్పుడు దీపమును చూచుటకు నేత్రము మాత్రమే ఆవశ్యకమగును. మరియొక సాధనము అవసరములేదు. బ్రహ్మమును తెలుసుకొనుటకు అజ్ఞాననాశనము ఒక్కటే ఆవశ్యకము. వేరే సాధనము అవసరములేదు.

సర్వప్రపంచమునకు బ్రహ్మమే ఆధారము. అది సర్వవ్యాపి అగుటవలన దానికి ఆధారములేదు. ఇట్టి పరబ్రహ్మము ద్వైతరహితము.

రెండవవాడున్నచో భయమునకు కారణమగును. రెండవదే లేని, అనగా ద్వైతరహితమగు పరబ్రహ్మము అభయకారణము అగుచున్నది.

అవిద్య వలన విషయభోగములందు ఆసక్తి కలుగుచున్నది. విద్యవలన అవిద్యానిమిత్తమగు ఈవిషయ సుఖములయందలి ఆసక్తి సంపూర్ణముగా నశించును. విషయభోగములందు ఆసక్తి నశించిన కొలది అందుకు ఫలితముగా కలుగు ఆనందము, ముందు పొందిన విషయా నందము కంటె అనేక వందలరెట్లు అధికమైనదిగా ఉండును. అట్టి ఉత్తమమైన ఆనందము క్రమక్రమముగా కలుగును. కోరికలు పూర్తిగా నశించినప్పుడు కేవలబ్రహ్మానందానుభవము ప్రాప్తమగును. ఈబ్రహ్మా నందము మనస్సునకు, వాక్కునకు అందనిది. ఇతరములైన ఆనందము లన్నియు బ్రహ్మానంద సాగరము యొక్క బిందువులతో సమానము. బ్రహ్మేతరానందములు అన్నియు కర్మసాధ్యములు. కర్మాచరణము వలన పొందు ఆయా ఆనందములు అనిత్యమైనవి. నిత్యమైనట్టి శాశ్వత బ్రహ్మానందము పొందుటకు ప్రయత్నము చేయవలెను..

**నాహం మన్యే సువేదేతి, నో, నవేదేతి వేదచ**
**యోనస్తద్వేద, తద్వేద, నోనవేదేతి, వేదచ ॥**
**కేనోపనిషత్తు 2-10**

"1. నేను బ్రహ్మమును చక్కగా తెలుసుకొంటినని తలంచను.

2. నేను తెలుసుకొనలేదని గాని, తెలిసికొంటినని గాని తలంచను.

3. తాను బ్రహ్మమును గురించి తెలుసుకొనలేదనిగాని, తెలుసు కొంటినని గాని తలంచనను విషయము తెలుసుకొనినవాడు బ్రహ్మమును తెలుసుకొనినవాడగును."

బ్రహ్మము బుద్ధికి విషయముకాదు. తెలియును అనిచెప్పేవాడికి అబ్రహ్మను గురించి ఏమీ తెలియదు. తెలుసుకొనేవాని ఆత్మ రూపములో చిద్రూపమైన బ్రహ్మ ఉన్నది. అందుచేత "నాకు తెలియదు" అను వానికి సహితము యథార్థమునకు బ్రహ్మ తెలిసియే ఉన్నది.

నేను బ్రహ్మమును తెలుసుకొంటినని తెలుసుకొన్నవాడు బ్రహ్మవేత్త కాడు. నేను బ్రహ్మమునే అయితిని అని తెలుసుకున్నవాడు మాత్రమే బ్రహ్మవేత్త. శాస్త్రములను శ్రవణముచేసినంతమాత్రమున బ్రహ్మవేత్తలు కాలేరు. శ్రవణముచేసిన దానిని విచారణము చేసి, సాక్షాత్కారమును పొందినవాడే బ్రహ్మవేత్త.

జ్ఞానమునకు అవశ్యపూర్వాంగమగు చిత్తైకాగ్రత ఉపాసనచే కలుగును. జ్ఞానము జీవన్ముక్తి హేతువు. ఉపాసనము క్రమముక్తికి కారణము. పరిపూర్ణమగు తన సచ్చిదానంద స్వరూపమును జ్ఞాని స్వానుభవముచే తెలుసుకొని, సమాధి సిద్ధిని పొంది, స్వాత్మయందు అద్వితీయ స్వరూపముతో పరమానందముగా ఉండవలెను.

అన్ని ఉపనిషత్తులు ఒకే కంఠముగా నిర్ణయించి బోధించెడి సారాంశము ఇది - "బ్రహ్మ ద్వితీయ వస్తురహితము. జీవుడు బ్రహ్మయే కాని వేరు కాదు. సమస్త ప్రపంచము బ్రహ్మయే. పరిపూర్ణ బ్రహ్మ స్వరూపమునందుండుటయే మోక్షము."

దీనికి శ్రుతులు, అవిచ్ఛిన్న గురుపరంపరాప్రాప్తమైన ఉపదేశము, నేటికాలములో ఉన్న బ్రహ్మజ్ఞానుల అనుభవము ప్రమాణములు.

ప్రతికాలములోను ఈ పరిపూర్ణ బ్రహ్మజ్ఞానులు కొందరైనా ఉంటారు. అట్లే విచారణచే అపరోక్షజ్ఞానమును పొందగోరు జిజ్ఞాసువులు కూడా ప్రతికాలంలోనూ ఉంటారు. నేటి కాలములో కూడా జిజ్ఞాసువులకు కలుగుచున్న బ్రహ్మానుభవము కూడా అద్వైత సత్యమును ఋజువు చేయుచున్నది. మరొక ముఖ్యవిషయము ఏమనగా ఈబ్రహ్మజ్ఞానము శ్రుతి సమ్మతము అగుటయేకాక యుక్తి అనుభవ సమ్మతము. బ్రహ్మజ్ఞానము తార్కికయుక్తికి వ్యతిరేకము కాదు. యుక్తి సమ్మతము అయినదే. అయితే బ్రహ్మము తర్కసిద్ధము అని చెప్పుటకు వీలులేదు. శ్రుతిపైన ఆధారపడకుండా, అద్వైతమును తర్కముతో, ప్రత్యక్ష అనుమానాది ప్రమాణములచే మాత్రమే నిరాక్షేపముగా సాధించుటకు వీలులేదు అందువలననే శంకరాచార్యులవారు 'సాధనపంచకము' అను స్తోత్రములో

**"వాక్యార్థశ్చ విచార్యతాం శ్రుతి శిరఃపక్ష సమాశ్రీయతా**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శ్రుతి మతస్తర్కోను సన్ధీయ తామ్"**

"ఉపనిషద్వాక్యార్థములను విచారించుము. ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతములను, అభిప్రాయములను ఆశ్రయించుము. వితండవాదములను, జల్పవాదములను, దుస్తర్కములను పూర్తిగా విరమించవలెను. శ్రుతి మతమును అనుసరించు తర్కమును మాత్రమే అనుసంధానము చేయవలెను."

ఇక్కడ ఈమాటలలో మోక్షమార్గమున తర్కము స్వతంత్ర తంత్రము కాదని స్పష్టముగా చెప్పబడినది. అసలు తర్కము ఏకముఖముకాదు. నవీనగణితశాస్త్రమున "Modern Algebrae" అను రకరకములైన బీజగణితములు ఉన్నట్లు బహువిధములైన తర్కవిధానములు కూడా ఉంటాయి. ఏవిధానమునకు అదే సమ్మతముగా తోస్తుంది.

తర్కములో మూడు అంగములుంటాయి. ఒకటి దత్తాంశము. రెండు తార్కిక పద్ధతి. మూడవది దత్తాంశముపై ఈ తార్కిక పద్ధతిని ప్రయోగించుటచే కలుగు ఫలితము (Premise, logical method & Result). ఈతర్కము దత్తాంశమును ప్రశ్నించి అది సత్యమా ! కాదా !

అని తెలుసుకొనలేదు (Logic can not question the truth or otherwise of the premise).

అయితే విజ్ఞాన శాస్త్రంలో ఏదో ఒక దత్తాంశము మీద తర్కమును ఉపయోగించుటచే వచ్చిన ఫలితములు, ప్రయోగశాలలో చేయబడిన ప్రయోగము యొక్క ఫలితములకు సరిపోతే ఆదత్తాంశము 'సత్యము' అనుకుంటారు. సరిపోకపోతే ఆదత్తాంశమును మార్చుకుంటారు. ఈపద్ధతి భగవంతుని తెలుసుకొనుటకు ఉపయోగపడదు. అందుచే

"నైషాతర్కేణ మతిరాపనేయా"

కఠ 2-9.

"ఈబ్రహ్మజ్ఞానమును తర్కముచే త్రోసిపుచ్చవద్దు", అన్నారు.

ఉపనిషద్వాక్యములలో ప్రతిపాదించబడిన విషయములు యుక్తిచే విచారించినపుడు కలుగు ఫలితములు. లోకములో చూడబడుతున్న సత్యములకు వ్యతిరేకములు కావు. అందుచే శ్రుతిమతమైన తర్కమును అనుసంధానము చేయుమని శంకరులు చెప్పిరి.

"నిర్గుణం నిష్కలం సూక్ష్మం - నిర్వికల్పం నిరంజనమ్
ఏకమేవా ద్వితీయం బ్రహ్మ - నేహ నానాస్తికించన"

వివేక చూడామణి 471.

తేజస్సుచేత చీకటి నశించునట్లు బ్రహ్మజ్ఞానముచే సృష్టికంతకు ఉపాదానకారణమైన మూల అజ్ఞానము నశించును. అజ్ఞానకార్యములగు జ్ఞానుల శరీములు మాత్రము ప్రారబ్ధకర్మానుభవము పూర్తియగు వరకు ఉండి, అది నశించినంతనే నశించిపోవును.

బ్రహ్మమొక్కటే సత్యము. తక్కిన దంతయు మిధ్యయే ఇటువంటి బ్రహ్మతత్వమును అందరూ తెలుసుకోవటం కష్టం. రాగద్వేషములు కొంచెముగా కూడా లేనివారు, విషయానుభవమును వదిలిపెట్టినవారు, బాహ్య, అంతర ఇంద్రియములను పూర్తిగా నిగ్రహించినవారు, నిరంతర సమాధి నిష్ఠులు అయిన మహనీయులు మాత్రమే ఈపరబ్రహ్మతత్వమును బాగుగా తెలుసుకొనగలరు. పరిపూర్ణమైనది, తనకంటె వేరుగా మరేమియు లేనిదియును అయినటువంటి బ్రహ్మాత్మైక్య సాక్షాత్కారముచే

నిత్యనిరతిశయ ఆనంద రూపమైన ముక్తిని పొందెదరు.

అజ్ఞానమును తొలగించుకొని, భగవంతుని అనుగ్రహముచే సద్గురువు యొక్క ఉపదేశమును పొందిన పిమ్మట, స్వస్వరూపమును తెలుసుకొని ఆత్మజ్ఞానమును పొందుటయే ఈభయంకరము, దుఃఖపూరితము అగు సంసారసాగరమును దాటితరించుటకు తగిన ఉపాయము. అప్పుడు దుఃఖసంపర్కమే లేని నిరతిశయ బ్రహ్మానందము లభించును. జనన మరణములు లేని కైవల్యమును పొందుటయే మానవ జీవిత పరమార్ధము.

**నిర్వాణం నామపరమం సుఖం యేన పునర్జనః**
**నజాయతే నమ్రియతే తత్ జ్ఞానాదేవ లభ్యతే.**
**యోగవాశిష్ఠము.**

దేని చేత జీవుడు మరల ఈసంసారమున జన్మింపడో, మరణింపడో, అట్టి పరమసుఖమే నిర్వాణము. అది కేవలము జ్ఞానముచేతనే లభించును. జీవుడు సంసారమును తరించుటకు జ్ఞానమే ఉపాయము. దాటుటకు కష్టసాధ్యమైనట్టి ఈసంసార సముద్రమును వివేకవంతులగు జనులు జ్ఞానయుక్తియను నౌకచే సులభముగా దాటగలరు.

ఉత్తమమైన జ్ఞానయుక్తి లేనిచో ఇంద్రియములయొక్క ప్రలోభము వలన కలుగు ప్రాపంచిక సంబంధములైన దుఃఖములు, కష్టములను గూర్చిన భయములు హృదయమును దహించి వైచును స్వవివేకము చేత ఈ జగత్తునంతను మరల మరల విచారించి ఈసమస్త బాహ్యదృశ్యమును, అభ్యంతర దేహ, ఇంద్రియ, మనో బుద్ధ్యాదులను ఇంద్రజాలమువలె మిధ్యగా తెలుసుకొని త్యజించివేయవలెను. వాటి నుండి మనసును ఉపసంహరించుకొనవలెను. బలాత్కారముగా చేసిన బాహ్యేంద్రియ నిగ్రహము లేక బాహ్య సన్న్యాసగ్రహణము వలన వాసనలు పోవు.

ఉత్తమమైన పుణ్యకర్మలచేతను, ఇంద్రియముల నియమము చేతను, దానముచేతను, తీర్ధయాత్రలచేతను, వివేకము చేతను, పాపము క్షయించినప్పుడు మానవునియొక్క బుద్ధిపరమార్ధవిచారణయందు ప్రవర్తించును. అటువంటి విచారణ కలిగేవరకూ ప్రజలు రాగద్వేషములచే

ఆవరించబడినవారై. భోగాసక్తి కలవారై. ఈసంసారమున తిరుగాడు చుందురు.

వర్షపు నీటి వలన తడిసిన అరణ్యమును అగ్ని దహించలేదు. కదా ! అట్లే ఆత్మనెరిగినవాడును, సమ్యగ్దర్శనము కలవాడును అగు ప్రాజ్ఞుని మానసిక పీడలేవియుదహించజాలవు.

శాస్త్రములను అభ్యసించుటవలన, సజ్జన సాంగత్యము వలన, సద్గురు ఉపదేశమువలన, వివేకము వలన కలిగిన వైరాగ్యముచేత జ్ఞానమును పొందిన వాని మనస్సు ప్రశాంత నిశ్చల స్థితిని పొందును. చిత్తము నిర్మలమగుట చేత అజ్ఞానమనెడి అంధకారము నశించును.

స్వాత్మదర్శనముచే అంతటను, ఎల్లకాలములందును సర్వ రూపమగు ఆత్మయే తెలియుచుండును. అన్ని వస్తువులు స్వకీయములు (తనదిగానే)గా అనిపించును ఏవిషయము పరకీయముగా అనిపించదు. ఇదియే పరమార్థ స్థితి. స్వస్వరూపమగు ఆత్మయందు స్థితికలిగియుండుటయే ముక్తి. ఆత్మస్వరూపము నుండి జారిపోవుట చేత అహంకారము మొదలైనవి కలుగును.

సమస్త సంకల్పములు పూర్తిగా శమించినట్టియు, జడత్వ నిద్రారహితమైనదియును, శిలయందు వలె నిశ్చలమై చిద్ఘనమైనట్టి స్థితియే "స్వస్వరూప స్థితి" అనబడును. అంతరంగమున అహంభావము బాహ్యమున భేదభావమునశించినప్పుడు, స్వప్రకాశమగు ఏచైతన్యము తనయందు స్ఫురించునో, అదియే స్వస్వరూపమైయున్నది. సత్యమగు పరమాత్మయొక్క బోధ, మోక్షము ఈరెండును పర్యాయపదములు. ఏజీవునకు అట్టి సత్యాత్మను గూర్చిన జ్ఞానము కలుగునో, అతడు మరల ఈసంసారమున జన్మింపడు. ఇట్టి జ్ఞానము యొక్క అనుభవమునందు సప్త భూమికలు ఉన్నవి. వీటినే జ్ఞానభూమికలు అని అందురు.

సప్తజ్ఞాన భూమికలలో మొదటిది "శుభేచ్ఛ", రెండవది "విచారణ", మూడవది "తనుమానస", నాల్గవది 'సత్త్వాపత్తి', ఐదవది 'అసంసక్తి'. ఆరవది 'పదార్థాభావని'. ఏడవది 'తుర్యగ'.

శుభేచ్ఛ – విచారణ – తనుమానస – సత్త్వాపత్తి – అసంసక్తి – పదార్థాభావని – తుర్యగ. ఈవిధముగా సప్తజ్ఞానభూమికలు పేర్కొనబడినవి. ఈసప్తభూమికలను దాటినవారు మోక్షమును పొందెదరు. ఆమోక్షమును పొందినచో జీవుడు ఇక దుఃఖమును పొందడు.

1. శుభేచ్ఛ : "సచ్ఛాస్త్రములను పఠించవలెను. సద్గురు మహాత్ములను దర్శించవలెను" – అనునటువంటి కోరిక జీవుని యందు కలుగుటను "శుభేచ్ఛ" అందురు.

2. విచారణః – శాస్త్రములను పరిశీలనము చేయుట, సజ్జనులతోడి సాంగత్యము, వైరాగ్యభావమును కలిగియుండుట, శ్రవణము, మననము మొదలైన సదాచారప్రవృత్తినే 'విచారణ' అని అందురు.

3. తనుమానస : శుభేచ్ఛ, విచారణముల వలన శ్రవణ, మనన, నిధి ధ్యాసనముల వలన ఇంద్రియార్థములయందు ఉండు రాగ ద్వేషములు తగ్గిపోవుటయే 'తనుమానస' అనబడును. తనూకరణము అనగా తగ్గిపోవుట. మానసిక ఆసక్తి తగ్గిపోవుటను తను మానస అంటారు. తను మానస అనగా మనసు తగ్గిపోవుట. కృశించుట. ఇక్కడ కృశించుట అనగా దుఃఖించుట, విచారించుట కాదు. ఇంద్రియార్థములందు ఆసక్తి సన్నగిల్లుట మాత్రమే.

4. సత్త్వాపత్తి : – పై మూడు భూమికలయొక్క అభ్యాసముచే చిత్తమునందు బాహ్యపదార్థముల యెడల దృఢమైన విరక్తి కలుగును. అట్టి విరక్తియొక్క స్థిరత్వముచేత శుద్ధసర్వాధిష్ఠాన సన్మాత్ర రూపమగు ఆత్మను పొందు స్థితియే "సత్త్వాపత్తి" భూమిక అని చెప్పబడును. "ఆపత్తి" అనగా పొందుట. సత్త్వాపత్తి అనగా సత్త్వమును పొందుట. సత్+త్వమ్ = సత్త్వము అనగా బ్రహ్మత్వము. అందుచేత సత్త్వాపత్తి యనగా బ్రహ్మభావమును పొందుట. ఈభూమిక యందున్నవాడు "బ్రహ్మవిత్" అని చెప్పబడును.

5. అసంసక్తి : – 'సంసక్తి' లేకపోవుటయే అసంసక్తి సంసక్తి అనగా ఆసక్తి మరియు సంగము. అనగా అనాత్మ విషయములతో ఏమాత్రము సంగము లేకుండా ఉండుట. పైనాలుగు భూమికల

యొక్క అభ్యాసము చేతను, బాహ్య అభ్యంతర విషయ సంస్కారముల యొక్క స్పర్శ లేకుండుట "అసంసక్తి", అసంగత్వము చేత రూఢి పడినట్టి నిరతిశయానంద ఆత్మసాక్షాత్కార స్థితియే అసంసక్తియనబడును. ఈభూమిక యందున్నవాడు "బ్రహ్మవిద్వరుడు" అని చెప్పబడును.

6. పదార్థాభావని :– పై అయిదు భూమికల యొక్క అభ్యాసము చేత దృఢమగు స్వాత్మారామత్వము లభింపగా, బాహ్య అభ్యంతర పదార్థములయొక్క భావన లేకపోవుట "పదార్థాభావని". భావము అనగా ఉండుట. భావన అనగా తెలుసుకొనుట లేక ఆలోచించుట. అభావము అనగా లేకపోవుట. అభావన అనగా తెలుసుకొనకపోవుట లేక ఆలోచింపక పోవుట. అందుచే పదార్థాభావని అనగా ఆత్మేతరములగు బాహ్య, అభ్యంతర విషయములను గురించి ఎంతమాత్రము ఆలోచింపకపోవుట అని అర్థము. దేహయాత్ర కొరకు మాత్రము పరుల చిరకాల ప్రయత్నము చేత సమాధి నుండి మేల్కొలుపబడి పదార్థములను ఒకింత గ్రహించు స్థితిని 'పదార్థాభావని' అంటారు. ఈభూమిక యందుండు జ్ఞానిని 'బ్రహ్మ విద్వరీయుడు' అని అంటారు.

7. తుర్యగ :– పై ఆరు భూమికల చిరకాల అభ్యాసము వలన. భేదభావన సంపూర్ణముగా నశింపగా కేవలము ఆత్మస్వభావము నందే నిష్ఠకలిగియుండునట్టి స్థితిని 'తుర్యగ' అని అందురు. ఈభూమిక యందున్న జ్ఞానిని "బ్రహ్మవిద్వరిష్ఠుడు" అని అంటారు. ఇట్టి తురీయావస్థయే జీవన్ముక్తులందు ఉండును. విదేహ ముక్తికి సంబంధించినదగు తురీయాతీతస్థితి దీనికి పరమై ఉండును. నమశ్శివాయచ, శివతరాయుచ అన్నప్పుడు శివునికి నమస్కారము. శివుని కన్న మిక్కిలి శుభప్రదుడైన శివతరునికి నమస్కారము అని వేదము చెప్పినప్పుడు శివుడు, శివతరుడు ఒకరేకాని, ఒకరికన్న మరొకరు భిన్నులు కారు. శివునియందు కల భక్తిచే ఆయననే శివుడని, శివతరుడని చెప్పి నమస్కరిస్తాము. అట్లే తురీయా తీత స్థితి, తురీయస్థితికన్న వేరు కాదని ఆస్థితినే తురీయము అనీ, తురీయాతీతము అని కూడా అంటారని రమణమహర్షివంటి కొందరి బ్రహ్మవేత్తల అభిప్రాయము.

ఏమహానుభావులు ఈ ఏడవ భూమికను పొందెదరో అట్టి

మహాత్ములు బ్రహ్మపదమును పొందిన వారగుదురు. జీవన్ముక్తులగువారు సుఖదుఃఖస్థితులందు ఆసక్తిని, కర్తృత్వాభిమానమును కలిగి ఉండరు. అజ్ఞానరూపమైన గ్రంధులను విచ్ఛేదనము చేయుటయే జ్ఞానము. అట్టి జ్ఞానము కలిగినచో ముక్తి సిద్ధించును. జ్ఞానికి సాంసారిక దృశ్య పదార్థములందలి సత్యత్వబుద్ధి, రాగద్వేషములు, హేయోపాదేయత్వము, అహంకారమమకారములు నశించును.

## ఈసప్తజ్ఞానభూమికలను పొందిపరమార్ధమును సాధించు విధానము.

సమస్త జీవరాసులలోను ఉత్తమమైనట్టి, దుర్లభమైనట్టి మానవజన్మలభించినందువలన, అట్టి అపురూపమైన అవకాశమును వృధాకావించుకోకుండా, తన జీవిత పరమార్థమగు మోక్షమును పొందుటకు మానవుడు ప్రయత్నించవలెను. స్వస్వరూపజ్ఞానమే ముక్తి. జన్మరాహిత్యమే మానవుడు పొందవలసిన ముక్తి. అట్టి పరమార్ధమును సాధించుటకై మానవ జన్మను పొందినపిదప, కొంత బుద్ధి వికసించిన మీదటముందుగా మానవుడు సత్సాంగత్యమును అలవరచుకొనవలెను. శాస్త్రముల తోడి పరిచయము, సజ్జనులతోడి సాంగత్యము వలన అవిద్యను దాటవచ్చును. సజ్జనులతోడి సాంగత్యమే సత్సాంగత్యము. ఇది అన్నిదేశకాలములలోను అభిలషణీయమే. అయినప్పటికీ ఒకప్పుడు సాధ్యము కాకపోవచ్చును. అట్టిసమయమునందు సద్గ్రంధపఠనము, సత్సాంగత్యముతో సమానమైనదిగా భావించవచ్చును. అట్టి శాస్త్ర, సజ్జన సాంగత్యముచే, సద్గ్రంధపఠనముచే కలిగినవివేకము ద్వారా మనుజునకు ఏది త్యజించదగినది ? ఏది గ్రహించదగినది ? అను విచారణ జనించును. అప్పుడు అతడు "శుభేచ్ఛ" అను మొదటి జ్ఞాన భూమికను పొందును ఆపిమ్మట వివేకము చేత క్రమముగా విచారణ యను రెండవభూమికను ప్రవేశించును. అప్పుడు ఉత్తమ జ్ఞానభూమికచేత నీచమగు విషయవాసనను త్యజించును. జ్ఞానభూమికలు మిక్కిలి ఉన్నతమైనవి. కావున వీటితో పోల్చినప్పుడు విషయవాసనలు చాలాతక్కువ స్థాయికి చెందినవి. కావున సంస్కృతభాషలో ఇట్టి విషయవాసనలు నీచములు అని చెప్పబడుచున్నవి. అంతేకాని నీచము అనగా అవినీతికరము అను అర్థము కాదు.

జగత్తు బ్రహ్మాయందు ప్రతిష్ఠ కలిగియున్నదని విచారించుచు రాగా, అధిష్ఠానమైన బ్రహ్మను ధ్యానము చేయుటచే మనస్సు సూక్ష్మత్వమును పొందును. మనస్సు యొక్క సూక్ష్మత్వము చేత జీవుడు "తనుమానస" మనెడి మూడవ జ్ఞానభూమికను ప్రవేశించును. యథార్థజ్ఞానమును పొందిన యోగి సత్త్వాపత్తి యనెడి నాల్గవ భూమికను పొందును. అట్టి జ్ఞానము ద్వారా విషయవాసనలు సన్నగిల్లినపుడు మానవుడు రాగద్వేషరహితుడై అసంసక్తి యనెడి ఐదవ భూమికను ప్రవేశించును. అప్పుడు అతడు కర్మఫలము చేత బంధింపబడడు.

ఆ తరువాత క్రమముగా వాసనలు నశించుటచేతను సదా అంతర్ముఖుడై అహంబ్రహ్మాస్మి" యని భావన (నేనే బ్రహ్మనని భావించుట) చేయుట చేత, క్రమముగా అసత్యములగు బాహ్యపదార్థముల యొక్క విస్మరణను అభ్యసించును. దీనినే పదార్థాభావని అంటారు. బ్రహ్మోహం భావన యొక్క అభ్యాసముచే సమాధినిష్ఠలోనున్నవారు జీవన్ముక్తులు. అట్టి జీవన్ముక్తులు లోక సంగ్రహారాధ్యమై, ఈశ్వరసేవా రూపమైన కర్మను చేయుచునే ఉంటారు.

ఇట్లు జ్ఞాని 'సూక్ష్మతమమగు బ్రహ్మముతోడ ఏకీభావమును పొందు చిత్తము కలవాడై పదార్థాభావనియను "ఆరవభూమికను పొందును. ఈప్రకారము మనుజుడు బ్రహ్మమునందు లీనమైనట్టి చిత్తము కలవాడై, చాలకాలము అట్లు అభ్యసించి, పదార్థముల భావనను పూర్తిగా వదిలిపెట్టును. అప్పుడు అతడు స్వయముగా "తుర్యాత్ముడు" అగును. అనగా తుర్యగా అను సప్తమ జ్ఞానభూమికను ప్రవేశించును.

ఇట్టి తుర్యగ భూమికను పొందినవాడు తనకు ప్రాప్తించిన దానిని గురించి సంతోషించడు. ప్రాప్తించని దానిని గురించి విచారించడు.

**న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య నో ద్విజేత్ప్రా ప్య చాప్రియమ్**
**స్థిర బుద్ధిరసమ్మూఢో బ్రహ్మ విద్బ్రహ్మణి స్థితః**
**గీత 5అ - 20 శ్లో.**

స్థిరమగు బుద్ధిగలవాడును, మోహరహితుడును, బ్రహ్మమునందు నిలకడ గలవాడును అగు బ్రహ్మ జ్ఞాని, ఇష్టమైన దానిని పొందినప్పుడు సంతోషమును కాని, అనిష్టమైన దానిని పొందినప్పుడు దుఃఖమును

గాని పొందకుండును.

సుఖము, దుఃఖము, జననము, మరణము మొదలైన భ్రాంతులనన్నింటిని సమూలంగా నశింపచేయునది ఆత్మజ్ఞానమొక్కటే. దృశ్యము పూర్తిగా ఆత్మయందు లయమైనప్పుడు కేవలము పరమాత్మయే మిగులును. ఇతర పదార్థములేనందున జీవుడు ఆపరమాత్మయందే లీనమగును. భోగములను అనుభవించవలెనను కోరికయే బంధము. భోగములందలి కోరికను త్యజించుటయే మోక్షమార్గము. బంధము, మోక్షము వంటి ఆలోచనను కూడా వదలిపెట్టి, సమస్తమైన బాహ్య, అభ్యంతర దృశ్యమును వదిలి ఎప్పుడు ఆత్మయందు లీనమై యుండునో అప్పుడు పరమాత్మ పదమును పొందును. ఆత్మదృష్టిచేత సమస్త జీవరాశుల యందును సమభావమును కలిగి యుండునట్టి స్థితియే అన్నింటి కంటె ఉత్తమ స్థితి. అట్టిస్థితిని పొందిన చిత్తము మరల ఎన్నటికిని జన్మను పొందనేరదు.

ఉత్తములైన సాధువులు, సజ్జనులతోడి సహవాసముచేసి, సేవాదులచే గురువును ప్రసన్నునిగా చేసుకొని, వినయపూర్వకమైన ప్రశ్నలను అడిగి, గురువునుండి సమాధానము తెలుసుకొని బాగుగా విచారణ చేయవలెను. కర్మఫలములయందు, కర్మలయందు ఆసక్తిని వదిలిపెట్టవలెను. శ్రుతి వ్యతిరేకార్థము ప్రచారము చేయు వారితో, నాస్తికులతో సాంగత్యము చేయరాదు. దీపము చిన్నదిగా ఉన్నప్పుడు దానిని రక్షించవలెను. గాలివీస్తే దీపం ఆరిపోతుంది. అదే పెద్దమంటగా ఉన్నప్పుడు గాలివలన అదివృద్ధి పొందుతుంది. ఎంత ప్రియమైనదైనా చివరకు అది అశాశ్వతమైనదేనని, వియోగము తప్పదని తెలుసుకొనవలెను. సాధువులనే అనుసరించుచు, సజ్జన సాంగత్యమునే కలిగియుండవలెను.

సుఖదుఃఖములు కేవలము దేహమునకు కావు. ఆత్మకునూకావు. మనసునకే సుఖదుఃఖములు కలుగుచున్నవి. ఆత్మ అన్నింటికి అతీతము అయినట్టిది. సుఖదుఃఖములు అజ్ఞానము వలన కలుగుచున్నవి. అజ్ఞానము నశించినప్పుడు అవి ఇంక ఎవ్వరికినీ చెందవు. ఈసమస్త జగత్తు ప్రశాంతము, అనంతము అయినట్టి ఆత్మచే పరిపూర్ణమైయున్నట్లు తెలుసుకొనవలెను. ఈసమస్త జగత్తు బ్రహ్మయే అయివున్నది. కావున

నేను వేరు, ఈజగత్తు వేరు, అనెడు భ్రాంతిని విడనాడవలయును.

జీవులకు రెండు మార్గములు మోక్షమును కలుగచేయు సామర్థ్యమును కలిగియున్నవి. అందు ఒకటి గురువుచే ఉపదేశించబడిన అనుష్ఠానమును మెల్లమెల్లగా సాధించుచు రాగా ఈజన్మయందు కాని, కొన్ని జన్మల తరువాత కాని మోక్షమును కలుగచేయును.

ఒకింత పరిపక్వమైన చిత్తముకలవానికి, తాను కావించు తత్వవిచారణచే శీఘ్రముగా జ్ఞానము సంప్రాప్తించుట రెండవ మార్గము.

మోక్షమనగా ఎక్కడో ఏలోకములోనో లేదు. స్వస్వరూప జ్ఞానమును పొందుటయే మోక్షము. కోరికలన్నియు నశించినప్పుడు ఆత్మలాభము ఉదయించును. అదియే మోక్షస్థితి. తత్వవిచారణాదులవలన కొంతైనను మనసు నిగ్రహింపబడినచో మానవుడు జన్మసాఫల్యమును పొందినట్లే.

అనేక జన్మలందలి కోరికలు, అలవాట్లు, అభ్యాసములు, సంస్కారములు ఒకదానితో ఒకటి చేరి, బాగుగా దృఢపడి వాసనలుగా ఏర్పడును. అట్టి వాసనా ప్రభావము చేత జీవుడు వివశుడై, ముందు వెనుకలు ఆలోచించక, తాను తలచిన విషయమునే సత్యముగా నమ్మి అందు ఆసక్తిని కలిగియుండును.

వాసనారాహిత్యమే మోక్షమనియూ, వాసనాదృఢత్వమే బంధమనియు పెద్దలు తెలిపిరి (యోగవాశిష్ఠము). ఎన్నిశాస్త్రములు చదివినను, ఎంతగొప్ప పండితులతో చర్చించినను, ఎంతవిచారించినను, కోరికలను సంపూర్ణముగా విడిచిపెట్టి మౌనముగా ఉండుటకంటె ఉత్తమమైన పదవి మరొకటి లేదు. "శీర్యతే ఇతి శరీరం" అను వ్యుత్పత్తి ననుసరించి శరీరము ఎప్పటికైనను నశించిపోవునదే అను జ్ఞానము కలిగినచో వాసన కలుగకుండును. వాసననశించినచో చిత్తము నశించి మోక్షము కలుగును.

జ్ఞానమును అభ్యసించుటయను పురుషప్రయత్నము చేత జీవుని యొక్క అజ్ఞానమనెడు మాలిన్యము తొలగిపోవును. కాబట్టి అజ్ఞానమును పోగొట్టుకొనుటకై ప్రయత్నము చేయవలెను. బ్రహ్మచర్యము, ధైర్యము, తీవ్రవైరాగ్యము, జ్ఞానయుక్తి లేనివారు పరమాత్మ పదమును పొందలేరు.

తాత్కాలిక ఆనందము కలిగించు లౌకికమైన వస్తువులను పొందుటకు ఎంతో కొంతధనము తప్పనిసరిగా ఖర్చుచేయవలెను కదా ! మరి నిరతిశయము, శాశ్వతము అయిన ఆత్మలాభమును పొందుటకై కొంతైనను శ్రమపడవలెను కదా ! ఆత్మప్రాప్తికై త్యాగము అతిముఖ్యమైనది.

"త్యాగేనైకే అమృతత్వమానశుః"

అల్పమును, తుచ్ఛమును అగు ఇంద్రియసుఖమును త్యజించినచో అనంతమగు ఆత్మసుఖము లభించును. అజ్ఞానమును త్యజించనిదే ఆత్మ సుఖము లభించదు.

ఏ పనిని చేసినప్పటికిని నేనే చేయుచున్నాను. అనుకర్తృత్వ భావమును వదిలిపెట్టి, నిమిత్త మాత్రముగ ఉండవలెను. ఆత్మజ్ఞానము కలవాడు సంగరహితమగు మనస్సుచే కార్యములను చేయుచున్నను తామరాకుపై నీటి బొట్టువలె సుఖదుఃఖములచే అంటబడకయే ఉండును ఆత్మ విచారణముచేత నిర్మలమైన ఆత్మపదమును పొందినచో జన్మరాహిత్యము లభించును.

బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత అను మూడును "ప్రస్థానత్రయము" అను పేర ప్రఖ్యాతి చెందినవి. బ్రహ్మతత్వము ఈ గ్రంథములయందు ప్రకృష్టముగా చర్చించబడి, నిర్ణయింపబడినదగుటచే వీనిని "ప్రస్థానత్రయము" అన్నారు. బ్రహ్మసూత్రములు వేద వ్యాస విరచితములు అందు మొదటి సూత్రము "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"

అధ – అనగా అటు తరువాత; అతః – అందువలన బ్రహ్మజిజ్ఞాస = బ్రహ్మను గూర్చిన విచారణ. కర్తవ్యా చేయవలెను అని పూరించవలెను. 'అందువలన అటుతరువాత బ్రహ్మను గురించిన విచారణ చేయవలెను' అని సూత్రమునకు అర్థము. అధ+అతః. ఈఅధ అను మాటకు సాధనచతుష్టయ సంపత్తిని పొందినతరువాత, అని శంకర మతాను యాయులు వ్యాఖ్యానిస్తారు. సాధనచతుష్టయము అనగా ఒకటి శమాది షట్క సంపత్తి; రెండు ఇహాముత్రార్థఫల భోగవిరక్తి; మూడు నిత్యా నిత్య వస్తువివేకము; నాలుగు ముముక్షుత్వము అని చెప్పారు.

శమము, దమము, ఉపరతి, తితీక్ష, సమాధానము, శ్రద్ధ అను

ఆరు శమదమాది షట్క సంపత్తి.

1. శమము :– అంతరింద్రియ నిగ్రహము. మనస్సును నిగ్రహించుకొని ఇతర విషయములవైపుకు పోనీయకుండుట.

2. దమము :– బాహ్యేంద్రియ నిగ్రహము.

3. ఉపరతిః – కర్మలను చేయవలెను అను ఆసక్తిని విడుచుట.

4. తితీక్ష :– సహనము. శీతోష్ణములను, జయాపజయములను, లోకుల యొక్క శత్రుత్వాదులను సహించుట.

5. సమాధానము :– మనస్సు విషయములవైపుకు వెళ్ళినపుడు, ఆవిషయములలోని దోషములను విమర్శించి, వైరాగ్యభావమును పొందుట.

6. శ్రద్ధ :– గురు వాక్యములందును, వేదాంతవాక్యములందును అత్యధికమగు నమ్మకము.

ఈ ఆరుగుణములను అభ్యసించుట శమదమాదిషట్కసంపత్తి అనబడును.

ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము :–

ఇహ + అముత్ర + ఫలభోగ + విరక్తి

ఈలోకమునందు, పరలోకమునందు ఉన్న ఇంద్రియ విషయములను, పుణ్యఫలములను అనుభవించవలెనను ఆసక్తిని విడిచిపెట్టుట.

నిత్యానిత్యవస్తువివేకము : ఆత్మ నిత్యము. శరీరము అనిత్యము. ఆత్మ లాభము కొరకు దేహేంద్రియములను నిగ్రహించుకొనవలెను. అనాత్మ వస్తువులన్నీ అనిత్యములనీ, ఆత్మ ఒక్కటే నిత్యమనీ తెలుసుకొన్న వివేకి ఆత్మకొరకే ప్రయత్నించును.

ముముక్షుత్వము : "ము ళ్ళ్" అను ధాతువునకు విడిచిపెట్టుట అని అర్థము. పంజరములోనుండి చిలుకను బయటకు విడిచి పెట్టినట్లు ఈ ధాతువు మీదనే మోక్షము అను పదము వచ్చినది. మోక్షము అనగా జననమరణ పరంపరలనుండి, కర్మఫలపరంపరల నుండి, సుఖదుఃఖభోగ

రూపమైన బంధమునుండి విడిచిపెట్టబడుట. 'మోక్షము కావలయును' అను ఇచ్ఛను (కోరికను) "ముముక్షుత్వము" అంటారు.

ఈసాధన చతుష్టయ సంపత్తి కలవాడు బ్రహ్మవిచారణకు ఉత్తమాధికారి. అయితే ప్రారంభదశ యందే ఈసంపత్తి ఎవరియందునూ సాధారణముగా పరిపూర్ణముగా వికసించియుండదు. గురుశుశ్రూష ఫలితముగా, శాస్త్రాధ్యయనము చేసిన తరువాత ఈసాధన చతుష్టయ సంపత్తి బ్రహ్మజ్ఞానముతో సమకాలీనముగా సాధకునియందు వికసించును. అందుచేత సాధన చతుష్టయ సంపత్తి కొంత కలిగివుండి "బ్రహ్మను గూర్చి తెలుసుకొనవలయును" అను జిజ్ఞాస కలవాడు, అధికారిగా పెద్దలు అంగీకరిస్తారు. ఇట్టి జిజ్ఞాసువు "కర్మజ్యేష్టుడు" అనగా "నాచికేత చయన" పర్యంతమైన యజ్ఞయాగములన్నీ చేసిన ఉత్తమాధికారి కానక్కరలేదు. "ఇహజన్మని," "జన్మాంతరేవా" అన్నట్లు ఈజన్మలోకాని, పూర్వజన్మలయందుకాని చేసిన గురు శుశ్రూష వలన, తపఃఫలము వలన కాని అతనికి "జిజ్ఞాస" అనగా తెలుసుకొనవలెననెడి కోరిక ఉదయించవచ్చును. అట్లు జిజ్ఞాస ఉదయించినవారు ఎవరైనా వారు బ్రహ్మవిచారణకు అర్హులే - అధికారులే. యధార్థమునకు బ్రహ్మ విచారణము వలన సాధన చతుష్టయ సంపత్తిలో కలలోపములు సవరింపబడి సాధకుడు పూర్ణమైన యోగ్యత కలవాడగును.

ప్రాపంచిక జ్ఞానము అంతయు అవిద్య, అజ్ఞానము అనియు, అట్టి అవిద్యను నాశనమొనర్చి పరమాత్మ సాక్షాత్కారమును చేర్చు జ్ఞానమే ఉత్తమ జ్ఞానమని భారతీయ దర్శనకారుల మతము.

"జ్ఞానాదేవతుకైవల్యమ్" – వేదశిరోవతంసముల రహస్య సత్యమును స్వానుభవమునకు తెచ్చుకొనుటకు జ్ఞానమే ఉత్తమ సాధనము..

అత్యంత దుర్లభమైన మానవజన్మను పొందినవారికి కూడా ఎంతో పుణ్యము చేత కాని, మోక్షమును పొందవలెననెడి కోరిక కలుగదు. అట్టినరజన్మము కంటెను, నిరంతరము తదేకపరత్వముతో బ్రహ్మ విచారణము జరుపుకొనుటకు వీలుపడు సన్యాసమును స్వీకరించుటకు అర్హత కలుగుట, తాను తరించి, పరులను కూడా తరింపచేయు అవకాశము అనంతపుణ్య వశమున కాని లభింపదు.

**జంతూనాం నరజన్మ దుర్లభమతః పుంస్త్వం తతో విప్రతా**
**తస్మాద్వైదిక ధర్మమార్గ పరతా విద్య త్త్వ మస్మాత్పరమ్ ।**
**ఆత్మానాత్మ వివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థితి**
**ర్ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యై ర్వినాలభ్యతే ॥**
**వివేకచూడామణి.**

అట్టి అవకాశము లభించినంతమాత్రముననే మోక్షము లబించెనని పొరపాటు పడరాదు. అంతకంటెను వేదములందు చెప్పబడిన ధర్మమును ఆచరించగలుగుట మిక్కిలి దుర్లభము. ఎందుచేతననగా సర్వప్రాణులు వాంఛించు సుఖప్రాప్తికిని, దుఃఖనివృత్తికిని వేదములందు చెప్పబడిన ధర్మమును ఆచరించుట మిక్కిలి ఆవశ్యకము. అట్టి వైదిక ధర్మాచరణ ప్రవృత్తి కంటెను వేద శాస్త్రాది పాండిత్యము మిక్కిలి దుర్లభము.

**"జ్ఞాత్వా కర్మాణి కుర్వీత తదేవ వీర్యవత్తరంభవతి**

**యదేవ విద్యయా కరోతి"**..... ఇత్యాది వాక్యములను బట్టి మంత్ర, మంత్రార్థముల యొక్కయు, విధి నిషేధాదుల యొక్కయు విజ్ఞానము ఆవశ్యకమని తెలియుచున్నది. అటువంటి విజ్ఞానమునకును, అంతేకాక ఆత్మజ్ఞాన సాధనమగు ఉపనిషద్వాక్యార్థ విచారణకును పాండిత్యము అత్యంత ఆవశ్యకము. కావున అట్టి పాండిత్యము అత్యంత దుర్లభముగా చెప్పబడినది.

అట్టి పాండిత్యము కంటెను ఆత్మానాత్మ వివేచనము మరింత దుర్లభము ఏలననగా వేదాశాస్త్రాధ్యయనము వలన లభించు పాండిత్యము పరులకు బోధించుటకు మాత్రమే ఉపయోగపడును. కాని, తాను స్వయముగా తరించుటకు ఉపయోగపడదు.

అట్టి పాండిత్యము కలిగియున్నందులకు తదేక నిష్ఠతో ఆత్మస్వరూపమును, అనాత్మ స్వరూపమును వేరుపరచి తెలుసుకొనవలెను. అప్పుడు మాత్రమే సంపాదించుకొన్న పాండిత్యము సార్థకమగును. అన్నింటికంటెను స్వానుభవము అనగా అపరోక్ష సాక్షాత్కారము అనబడు బ్రహ్మాత్మైక్య సమ్యక్పరిజ్ఞానము మిక్కిలి దుర్లభము. ఏలననగా దృఢమైన బ్రహ్మ పరోక్షానుభవము వలనకాని, ఆత్మయందు అనాత్మ ధర్మములను,

అనాత్మవస్తువులందు ఆత్మధర్మములను ఆరోపించుట అను విపరీతభావన నశింపదు. ఆత్మ, అనాత్మలను ఎంతగా తెలుసుకున్నను ఈస్వానుభవము లేనిచో జన్మజన్మాంతరములుగా అనుహ్యూత మగుచున్న జగద్వాసనా బలముచే, అన్ని అనర్థములకు కారణమైన మిధ్యాజ్ఞానము మొలకెత్తుచునే యుండును. కావున నిరంతరము నిధిధ్యాసనము చేయుచు బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవ నాపరః – ఏకమేవా ద్వితీయం బ్రహ్మ – సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ – తత్త్వమసి – నేహనానాస్తి కించన"– ఇత్యాది వాక్యముల యొక్క అర్థమును విచారించుటచే కలుగు సత్యజ్ఞానమును బలపరచుకొనవలెను. అటువంటి పూర్ణ ఆత్మ అనుభవము దృఢపడినకొలది మిధ్యా జ్ఞానము దానివలన జనించు అసత్కార్యములు నిశ్శేషముగా నశించును.

అట్టి స్వాభవము కంటెను బ్రహ్మాత్మనా సంస్థితిరూపమగు జీవన్ముక్తి అత్యంత దుర్లభము.

నేను అసంగుడను, అక్రియుడును, అద్వితీయుడను, పరిపూర్ణుడను, సచ్చిదానందఘనుడను, పరబ్రహ్మ స్వరూపుడను" అను దృఢమైన అనుభవముచే జీవన్ముక్తునకు వేరు కర్తవ్యములు ఉండవు. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను త్రిపుటికూడా నశించును. కావున స్వస్వరూపముగా గుర్తింపబడిన నిర్వికల్ప బ్రహ్మముగా నిరంతరము అప్రమత్తుడై యుండుటను "బ్రహ్మాత్మనా సంస్థితి" యందురు. ఈ స్థితియే అజగరావస్థ. అజగరవ్రతమనగా అజగరము (కొండ చిలువ) వలె ఆహారము కొరకు దేహ సంరక్షణార్థము కొరకు ప్రత్యేకముగా ప్రయత్నము చేయకుండుట. కొండచిలువ ఆహారాన్వేషణము కొరకై ఎక్కడకు వెళ్ళదట. భగవంతుడే దానికి కావలసిన ఆహారమును అందునట్లు చేయునట. అట్లే శారీరకమైన అవసరములకొరకు ప్రత్యేకముగా ప్రయత్నము చేయకుండా పూర్తిగా ఈశ్వరునిపై ఆధారపడి యుండుట. అనగా భవిష్యత్కాలమునకు సంబంధించిన ఊహలు, ఆలోచనలు (Future plans) లేకుండా "యధాప్రాప్తవర్తీభవ" అనునట్లు ఉండవలెను. అనగా పూర్తిగా ఈశ్వరునిపైననే ఆధారపడి, ఆయాకాలములందు అనుభవించుటకు లభించిన దానితో తృప్తుడై

యుండవలెను. గృహస్థుడైతే "యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తం" అన్నట్లు ప్రవర్తించవలయునని శంకరుల బోధ. అనగా తను చేయు పనివలన లభించిన విత్తముతో కుటుంబపోషణము చేసుకొనవలెను. ముఖ్యముగా "లోకేషణ" విడిచిపెట్టవలయును. భగవంతుడు తనకు అవకాశము కలిగించిన కర్మలలో తనకు ఇది కర్తవ్యము, ఇది తను విడిచిపెట్టరానిది అను కర్మలను మాత్రమే చేయుచు, అప్పుడుకూడా కర్మఫలమును తనకు కోరకుండా ఈశ్వరార్పణముగా చేయవలెను.

"ఈశ్వరార్పణం నేచ్ఛయాకృతమ్
చిత్తశోధకమ్ ముక్తిదాయకమ్".. అన్నారు శ్రీరమణ మహర్షి

కోరికతో తాను కర్మను చేయకూడదు. కర్మలను, కర్మఫలములను రెంటినీ కోరకూడదు. ఈశ్వరుడు అవకాశమిచ్చిన యజ్ఞదాన తపోరూపములైన కర్మలను లోక సంగ్రహార్థము విడిచిపెట్టకుండా చేసి ఆకర్మఫలమును ఈశ్వరునికే సమర్పించవలయును. ఇట్లుచేసినచో చిత్తశుద్ధి కలిగి ఆకర్మలు ముక్తిదాయకములగును.

కావున బ్రహ్మాత్మనా సంస్థితియే అజగరావస్థయనీ, తురీయావస్థయనీ, జీవన్ముక్తి అవస్థయనీ వర్ణింపబడును. ఇట్టి జీవన్ముక్తదశ కోట్ల కొలది జన్మలలో చేసిన అనంత పుణ్యము వలనకాని లభింపదు. ఇచ్చట ముఖ్యముగా గమనింపదగిన అంశములు రెండు –

<u>ఒకటి</u> : – జీవుల ఉత్తమ, మధ్యమ, అధమ శరీరప్రాప్తికి వారు వారు కావించు పుణ్యపాప మిశ్ర కర్మములే కారణము.

<u>రెండు</u> : – మానవ జీవితము యొక్క పరమ లక్ష్యము "బ్రహ్మాత్మనాసంస్థితి" రూపమగు జీవన్ముక్తిని పొందుట.

అత్యంత దుర్లభమగు మానవశరీరమును పొంది కూడా, సంసారబంధమునుండి విముక్తి రూపమగు మోక్షమును పొందుటకు ప్రయత్నించక, అశ్రద్ధ వహించు సోమరి మిక్కిలి మూర్ఖుడు అనటంలో సందేహంలేదు.

"ఉద్ధరేదాత్మనాత్మానం మగ్నం సంసారవారిధౌ
యోగారూఢత్వమాసాద్య సమ్యగ్దర్శన విషయం"
వి.చూ

సంసారసముద్రమునందు మునిగిపోయి ఉన్న ఆత్మను తనకు తానే ఉద్ధరించుకొనవలెను. సమదృష్టికల వానికి విషయమగు యోగా రూఢత్వమును పొంది నిర్మలమైన తనబుద్ధితో సంసార సముద్రమునందు మునిగియున్న అజ్ఞాన దూషితమైన తన చిత్తమును తానే ఉద్ధరించు కొనవలెను.

తప్పనిసరిగా చేయవలసిన పనులను చేయుటయందు అశ్రద్ధ వహించుట, అనవసరపు పనులయందు శ్రద్ధ వహించుట అజ్ఞానుల సహజ లక్షణము. అట్టివారు దుర్లభమగు మనుష్య జన్మను పొందికూడా జీవితమును వ్యర్థము కావించుకొందురు. పెక్కుదుఃఖములపాలగుదురు. అట్లుకాకుండా నిత్యసుఖమును పొందుటకై అజ్ఞాన బంధమునుండి మానవుడు ముక్తుడు కావలయును. అట్టి ముక్తిని పొందుటకు జ్ఞాన మొక్కటియే సాధనము.

గురోపదిష్టమగు శాస్త్రజ్ఞానమును పొంది శ్రవణమనన నిధి ధ్యాసనలచే సాధనచేయగా, అంతఃకరణ వృత్తి రూపమగు బ్రహ్మాకారవృత్తి ఏర్పడును. ఈవృత్తికి సాక్షిగా నిలిచియుండు చైతన్యము తానే అని రూఢిగా తెలిసినప్పుడు అపరోక్షజ్ఞానము కలుగును. ఇట్టి జ్ఞానమును పొందుట స్వప్రయత్నముచేత మాత్రమే సాధ్యమగును. కావున అవిద్యా యనెడు బంధమునుండి విముక్తిని తనకు తానే సాధించుకొనవలెను. అది ఇతరుల వలన జరుగు పనికాదు. భ్రాంతి చేత తనకు కలిగిన సంసారబంధము, తనకు కలిగిన యదార్థ అనుభవము వలన మాత్రమే తొలగును. రోగియైన వాడు వైద్యుడు సూచించిన విధముగా ఆరోగమునకు తగిన ఔషధమును సేవించి, వైద్యుడు చెప్పినవిధముగా తగిన పథ్యము చేసినప్పుడు మాత్రమే స్వస్థత ఎట్లు కలుగునో, అట్లే తనకు తానే బంధ విముక్తికై కృషిచేసి విముక్తిని పొందవలెను.

ఆరోగ్యమును పొందుటకు పథ్యము, ఔషధ సేవయు సాధనములైనట్లు, సంసారబంధమునుండి విముక్తిని పొందుటకు సాధన చతుష్టయ సంపత్తి, వేదాంతశ్రవణము సాధనములు. పూర్వపుణ్యఫల విశేషముచే బ్రహ్మసాక్షాత్కారమును పొందినవానికి శాస్త్రాధ్యయనముతో పనిలేదు. నది దాటినవానికి ఇక తెప్పతో పనిలేనట్లు, ఆత్మసాక్షాత్కారము పొందినవానికి శాస్త్రముతో పనిలేదు. వారి స్వానుభవమే వారికి ప్రమాణము. అవిచ్ఛిన్న బ్రహ్మవిద్యాగురుపరంపర నేటివరకు ఉన్నదని అద్వైతులు వక్కాణిస్తారు. ఈబ్రహ్మవేత్తల యొక్క స్వానుభవము శ్రుతి సిద్ధము అయిన అద్వైతశాస్త్రముతో ఏకీభవించుచునే యున్నది. అద్వైత శాస్త్ర ప్రామాణ్యమునకు ఇది ఒక గొప్ప ఋజువు.

బ్రహ్మజ్ఞుడై బ్రహ్మనిష్ఠలో ఉన్న వానికి శాస్త్ర వాసనకూడా ప్రతిబంధకమే అగును. కావున సభలలో "శాస్త్రార్థమును" అనగా చర్చలను వీడవలెను.

శబ్ద జాలం మహారణ్యమ్ చిత్తభ్రమణ కారణమ్ ।
అతః ప్రయత్నాత్ జ్ఞాతవ్యం తత్త్వ జ్ఞాతత్త్వ మాత్మనః ॥
వివేక చూడామణి. 62

ఇతర మతములను ఖండించుచు, స్వమతమును బల పరచుకొనుచు, అందుకొరకై కావలసిన యుక్తి ప్రయుక్తులతో కూడి శాస్త్రకోలాహల రూపమగు శబ్దజాలము మహా అరణ్యము వంటిది. చిత్తమునకు నిరంతరము భ్రాంతి విక్షేపములు కలిగించుచుండును.

"ఘటోవా మృత్పిండోప్యణురపిచ ధూమోగ్నిరచలః
పటోవా తంతుర్వా పరిహరతికిం ఘోరశమనమ్ ।
వృథా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమ సౌఖ్యం వ్రజసుధీః
శివానందలహరి.

'ఓ విద్వాంసుడా ! మట్టిముద్ద అనీ, పరమాణువులు అనీ, ధూమము, అగ్ని, పర్వతము మొ॥ మాటల వలనకాని, వస్త్రము, దారములని కానీ, ఈవిధముగా తర్కసంబంధములైన వచనములను

వల్లించుట వలన కాని, కష్టములు తొలగిపోవునా ? ఇట్టి తర్క వాక్కులు వ్యర్థములు. కంఠక్షోభకరములు. ఈతర్కవచనములు ఏస్థితిని కలిగించలేవు. ఆ పరమశివుని యొక్క పాదపద్మములను సేవించుట చేతనే పరమ సౌఖ్యమును పొందగలరు !" అన్నారు ఆదిశంకరాచార్యులు. అనవసర తర్కప్రసంగములు వృధా కాలయాపనకు, కంఠక్షోభమునకు దారితీయునే కాని జీవిత పరమార్థమును సాధించుటకు ఎంతమాత్రము ఉపయోగించవని శంకరుల బోధ.

దట్టమైన అడవిలో ప్రవేశించినవాడు దారి తెలియక, క్రూర జంతువుల వలన ఏ విధముగా బాధపడునో, అదే విధముగా 'శాస్త్రార్థము' (చర్చలు) లందు చిక్కుకున్నవాని మనస్సుకూడా పూర్వపక్ష సిద్ధాంతము స్పష్టముగా తెలియకపోవుట చేతను, యుక్తియుక్తాభ్యాసములను, ప్రామాణ్యసిద్ధాంతములను సరిగా అర్థముచేసుకొని, నిర్ణయముచేసుకొన లేకపోవుట వలన అనేకరకములుగా భ్రమించుచుండును. అందుచేత ఆత్మస్వరూపము యధాతధముగా గోచరించదు. కావున తత్వవేత్తయగు సద్గురువును ఆశ్రయించి, ఆత్మయొక్క వాస్తవిక స్వరూపమును ప్రయత్న పూర్వకముగా గ్రహించవలెను. అజ్ఞానము మానవుని మోహగ్రస్తునిగా చేయును. అట్టి అజ్ఞానమనెడు మోహమును పోగొట్టి స్వస్థత కలిగించునది బ్రహ్మజ్ఞానమనెడు ఔషధము మాత్రమే. వేదములు, శాస్త్రములు, మంత్రములు, ఇతర ఔషధములు ఏవియు ఈఅజ్ఞానమును పోగొట్టలేవు.

ఔషధమును సేవించి, దానితోపాటు వైద్యుని సలహా మేరకు పాటించిన పథ్యము వలన వ్యాధి నయము అవుతుంది. కానికేవలము ఔషధము పేరు అనేక సార్లు ఉచ్ఛరించినంత మాత్రమున వ్యాధి నయము కాదు. అట్లే ఆత్మ యొక్క అపరోక్ష సాక్షాత్కారము వలన మాత్రమే బంధ విముక్తి కలుగుతుంది. అంతే కాని పెక్కు పర్యాయములు బ్రహ్మము, బ్రహ్మము అని నా మోచ్ఛారణమును చేయుట వలన బంధ విముక్తి కాదు. బ్రహ్మ శబ్దమును కేవలము ఉచ్ఛరించినంత మాత్రమున ముక్తులు కాలేరు.

విషయ సుఖములందలి వ్యామోహమును, వాంఛను తొలగించు కున్ననే కాని మోక్షములభింపదు. విషయములందు దృఢమైన వైరాగ్యము

మాత్రమే మోక్షమునకు సాధనము. ఇంద్రియ సుఖములు మానవుని పతనము చేయును.

**శబ్దాదిభిః పంచభిరేవ పంచ**
**పంచత్వమాపు స్స్వగుణేన బద్ధాః**
**కురంగ మాతంగ పతంగ మీన**
**భృంగాః నరః పంచభి రంచితః కిమ్ ॥**

శబ్దము నందలి వ్యామోహముచే లేడి, స్పర్శ వలన ఏనుగు, రూప భ్రాంతి చేత కీటకము, రసలోభముచే చేప, గంధము యొక్క ఆకర్షణ చేతతుమ్మెద ఏ విధముగా భ్రమించి మృత్యువు పాలగుచున్నవో మనకు తెలిసిన విషయమే! ఒక్కొక్క ఇంద్రియము వలన కలుగు ఆకర్షణయే ప్రాణుల పతనమునకు కారణమగుచున్నచో, మరి ఇక ఐదుఇంద్రియములకు వశమగు మానవుని గతి ఏమగునో విచారించ వలెనని శంకరాచార్యులు "వివేకా చూడామణి' యందు హెచ్చరించి యున్నారు.

తాను కానటువంటి దేహము మొదలైన వాటి యందు 'తాను' అను భ్రాంతి కలిగి యుండుటయే మానవునకు బంధము. ఆత్మను గురించి సరైన జ్ఞానము లేకపోవుట వలన మానవుని అజ్ఞాన భ్రాంతి అనాదిగా బాధించుచున్నది. ఈ భ్రమవలననే జననము, మరణము మొదలగు సమస్తమైన కష్టములు కలుగుచున్నవి. భ్రాంతిరూపమైన ఈ బంధమువలననే జీవుడు అసత్యము, అనిత్యము అగు శరీరమును సత్యమని భావించుచున్నాడు. తానే శరీరమును భావముచేత ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, ధనము మొదలగు వ్యామోహములో పడిపోవుచున్నాడు. ఎప్పటికప్పుడు ఈ శరీరమే తానని శరీరపోషణకై, రక్షణకై ప్రయత్నించుచున్నాడు.

పట్టుపురుగు తన నోటి నుండి స్రవించు ద్రవముతో గూడును అల్లుకొని చివరకు అందులోనే చిక్కుకొని, మరణించుచున్న విధముగా మానవుడు కూడా ఈ శరీరమే తానని భ్రమించి, మృత్యువు పాలగుచున్నాడు. ఈ భ్రమ తొలగుటయే జ్ఞానము కలుగుట. అట్టి జ్ఞానము కలిగిన పిదప జీవుడు తన స్వరూపము దేహము కంటె

విలక్షణమైనదనియు, సచ్చిదానంద ఘనమైనదనియును తెలుసుకొన గలుగును.

అందుచేత "నేను దేహమును కాను, పరబ్రహ్మమునే" అని తెలుసుకొని మోక్షఫలమునిడు "బ్రహ్మ సంస్థిత పరమశాంతి"ని పొందుటకు ప్రయత్నించవలయును. అదియే జీవిత పరమార్థము.

ఈ విధముగా శ్రేష్ఠమైన హృదయాకాశము నందలి బుద్ధి గుహ యందునిగూఢముగా ఉన్నట్టి పరబ్రహ్మమును ఎవడు తెలుసుకొనుచున్నాడో అతడు బ్రహ్మవిత్ స్వరూపమున ఒక్కసారిగా సమస్త కోరికలను పొందగలుగుచున్నాడు.

ఏనుగు అడుగు వేస్తే కుందేలు వంటి చిన్న చిన్న జంతువుల యొక్క అడుగులన్నీ ఏ విధంగా అందులో ఇమిడిఉంటాయో, అట్లే బ్రహ్మానందము సర్వాతిశయము అగుట వలన, ఇతరములైన కావ్యానందము, విద్యానందము, దేవానందము, లౌకికానందములు మొదలైనవన్నీ బ్రహ్మానందములో ఇమిడిపోవును. అందుచే బ్రహ్మజ్ఞానికి సర్వ ఆనందములు ఒకే మారు (యుగపద్- Simultaneously) సిద్ధించిన అనుభవము కలుగుతుంది. "సోzశ్నుతే సర్వాన్‌కామాన్ సః-" (తైత్తిరీయ ఉపనిషత్)

విద్య, అవిద్యలు రెండింటిని ఎవరు తెలుసుకొనుచున్నారో అట్టి వారు మృత్యువును దాటి అమృతత్త్వమును పొందునని ఈశావాస్యోపనిషత్తు తెలుపుచున్నది.

"అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాz మృత మశ్నుతే "

**ఈశావాస్యోపనిషత్తు IIవ మంత్రం.**

ఈ మంత్రములో విద్యను, అవిద్యను రెండింటిని తెలుసుకున్నవారు అవిద్య చేత మృత్యువును దాటి, విద్య చేత అమృతత్వమును పొందుదురని ఈ ఉపనిషత్తు నందు చెప్పబడినది.

ఈశావాస్య ఉపనిషత్తు (ఈశోపనిషత్తు) లోని ఈ మంత్రమునకు వేరు వేరు విధములుగా, వేరు వేరు సాంప్రదాయముల వారు వ్యాఖ్యానములను చేశారు. ఈ వ్యాఖ్యానములు వివాదాస్పదములైనవి.

అద్వైత సాంప్రదాయము ప్రకారము మృత్యువు అనగా జననమరణ రూపమగు సంసారము. అమృతము అనగా బ్రహ్మాత్మైక్య రూపమైన మోక్షము. అవిద్య అను మాటను ఇక్కడ దేవతా ఉపాసనా పరముగా వివరించారు. విద్య అంటే బ్రహ్మ అపరోక్షజ్ఞానము. శివుడు, విష్ణువు మొదలైన దేవతలను ఉపాసన చేయుటచే ఈ సంసార సాగరమును దాటుటలో ఆ దేవతలు సహాయము చేసి చేయూత నొసగెదరు. దేవతా ఉపాసన చేత సంసారసాగరమును తరించి బ్రహ్మాత్మైక్య జ్ఞానముచే మోక్షమును పొందవలెనని అర్థము.

"భగవద్గీత యందు" దేవాన్ భావయతా zనేన" అను మంత్రము నందు దేవతా ఉపాసన యొక్క ప్రాముఖ్యము చెప్పబడినది.

**"దేవాన్భావయతా నేన తేదేవా భావయస్తువః**
**పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ ॥**
**భగవద్గీత 3-11**

"దేవతలను ఉపాసన చేయుము. ఆ దేవతలు మిమ్ములను సంతోషపెట్టెదరు. ఈ విధముగా పరస్పర సంతుష్టి నొందుచు శ్రేష్ఠమైన శ్రేయస్సును పొందగలరు.

దేవతలను పూజించుము; యజ్ఞయాగాదులచే వారిని సంభావించుము. మొదలైన వాక్యములకు ఉపాసనా ప్రాశస్త్యమును. అనగా భక్తి యోగమును ప్రతిపాదించే వాక్యములుగా విశాలమైన అర్థమును చెప్పుకొనవచ్చును. అందుచే ఈశోపనిషత్తు మంత్రమునకు 'అవిద్య' అనగా దేవతా ఉపాసన అని లేక ఈశ్వర భక్తి అని విశాలార్థమును చెప్పుకొన్నచో" భక్తిచే సంసారసాగరమును దాటి, జ్ఞానముచే మోక్షమును పొందవచ్చును" అని అర్థము. భక్తి యనునది జీవన విధానము. జ్ఞానము అనగా అపరోక్షాను భవముచే సత్యమును తెలుసుకొనుట.

"Bhakti is a way of living in God
Jnana is ultimate realisation" అని అర్థము.

***

# సృష్టి క్రమము

సృష్టిని వర్ణించు శ్రుతులు వివిధములుగా సృష్టిక్రమమును వివరిస్తున్నాయి. "ఆత్మనుండి ఆకాశము పుట్టినది. ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి భూమి సృజించబడినవి" అని కొన్ని శృతులలో చెప్పబడినది. ఇది పరిణామ క్రమమును తెలియచేయుచున్నది.

"తస్మాద్వా ఏ తస్మాత్ ఆత్మనః ఆకాశస్సంభూతః"
శ్రుతి

"ఆత్మ నుండి ఆకాశము పుట్టినది." అనగా ఆత్మ తన స్వస్వరూపములో ఏమాత్రము మార్పు చెందకుండా ఆకాశభూతమును సృజించినది అని అర్థము.

ఆత్మ→ఆత్మ+ఆకాశము
ఆత్మ→ఆకాశము+వాయువు
ఆత్మ→ఆకాశము+వాయువు+అగ్ని
ఆత్మ→ఆకాశము+వాయువు+అగ్ని+జలము
ఆత్మ→ఆకాశము+వాయువు+అగ్ని+జలము+భూమి

ఈ విధముగా ఎట్టి మార్పు లేకుండా పరిపూర్ణముగా ఉంటూ "పంచభూతముల ఉత్పత్తి జరుగుట ఎట్లు ?' 'అను విషయమును విచారించవలసియున్నది. దీనికి రెండు సమాధానములు చెప్పబడినవి. అందు మొదటిది - ఆత్మ తనయందు ఉన్న స్వకీయమైన మాయాశక్తివలన సృష్టి చేయుచున్నది. మాయ అనునది ఈశ్వర సంబంధమైన అద్భుతశక్తి.

రెండవ సమాధానము – "ఆత్మ"యందు అధ్యాసవలన సృష్టి జరుగుచున్నట్లుగా తోచుచున్నది" అనుట. దీనిని "వివర్తవాదము" అంటారు. రజ్జువునందు కలుగు సర్పభ్రాంతి ఇందుకు ఉదాహరణ. అయితే ఇటువంటి అధ్యాసకలుగుటకు ఒక అధిష్ఠానము ఉండవలెను. అనగా సర్పము అని తోపించుటకు ఒక రజ్జువు (త్రాడు) ఉండవలెను కదా! సమస్త సృష్టికి పరబ్రహ్మయే అధిష్ఠానమైయున్నాడు. రజ్జువునందు

సర్పమును చూచుటకు పూర్వము చూచువానియందు సర్పమును గూర్చిన జ్ఞానము (సర్పము యొక్క రూపగుణముల జ్ఞానము) ఉండవలెను. సర్పమే తెలియని వానికి తాడును చూస్తే సర్పము అని అనిపించదు. సృష్టికి పూర్వము జగత్తులేదు. కాబట్టి అధ్యాసవలన జగత్తు కలిగినదని ఎలా చెప్పవచ్చును ? అని పూర్వ పక్షము. సమాధానము - సృష్టిస్థితి లయములు ఈశ్వరునిచే చేయబడుచున్నవి. మహాప్రళయమునందు లయము చెందిన తరువాత జగత్తు కనబడకపోయినను జగద్రూప సమష్టి సంస్కారములు ఈశ్వరునియందు నిలిచి యుండును. అందుచే పూర్వసృష్టి యొక్క సమష్టి సంస్కారము వలన ఈశ్వరునికి బ్రహ్మయందు అధ్యాసకలిగి జగత్తు ఉదయించును. మరల పూర్వ పక్షమునందు "ఈశ్వరుడు సృష్టిస్థితిలయములు చేయుచున్నాడు కదా! ప్రతిసృష్టి యందును పూర్వ సంస్కారములు మిగిలి ఉండవచ్చును. కాని, ఆది సృష్టియందు పూర్వ సంస్కారములు ఎక్కడివి ? అని ప్రశ్నించెదరు.

అందుకు సమాధానము - సృష్టి అనాది. మొట్టమొదటి సృష్టి, తరువాత సృష్టి అనునది ఏమీ లేదు. ఎప్పుడూ ప్రాచీన సమష్టి సంస్కారముల చేత అధ్యాసవశమున సృష్టి జరుగుతూనే ఉన్నది. వివర్త వాదమున అధ్యాసచేత సృష్టి జరిగినట్లు కనబడుచున్నది. అంతే కాని యదార్థమునకు జరుగుట లేదు అని చెప్పబడుచున్నది.

పరబ్రహ్మనిర్గుణ వస్తువు అని అద్వైతము చెప్పుచున్నది. సృష్టిస్థితి లయములు చేయు ఈశ్వరుడు సగుణుడు. "శుద్ధసత్వప్రధానమైన మాయయందు పరబ్రహ్మప్రతిబింబించుటచే ఈశ్వరుడుగా అయినాడు" అని అద్వైతులు అంటారు.

ఏదో ఒక కాలంలో బ్రహ్మమాత్రమే ఉండి ఈశ్వరుడు ఇంకా పుట్టకుండా ఉండాలి కదా ! అంటే శుద్ధమాయయందు బ్రహ్మచైతన్యము ప్రతిఫలించుట జరగకముందు ఏ కారణంచేత ఆ ఈశ్వర ఉత్పత్తి జరుగుతోంది? అని పూర్వపక్షము. సృష్టిక్రమమును చెప్పు శ్రుతులు ఉన్నాయి కాని, ఈశ్వరసృష్టికి పూర్వము ఉన్న బ్రహ్మ ఈశ్వరుని సృజించుచున్నట్లు ఎక్కడా ఏ శ్రుతియందును చెప్పబడలేదు కదా ! అని పూర్వపక్షము.

దీనికి సమాధానముగా అద్వైతులు ఈశ్వరుడు అనాది అని అంటారు. అనగా ఈశ్వరుడు ఒక కాలంలో పుట్టినవాడు కాదు. ఆయన కాలాతీతుడు. దేశకాలములను ఆయనే సృజించెను. కాబట్టి అద్వైతమతమున పరబ్రహ్మ అనాది. మాయాశక్తి అనాది. ఈశ్వరుడు అనాది. సృష్టి అనాది. జీవుడు అనాది జీవునకు కల అజ్ఞానము కూడా అనాది. ఈ విధముగా చెప్పునపుడు ద్వైతవాదులు అనగా మధ్వాచార్య సాంప్రదాయము వారు అద్వైతములోని అధ్యాస ప్రకరణమును చాలా గట్టిగా పూర్వపక్షము చేస్తారు.

తాడును చూచి పాము అని భావించటం ఎప్పుడు జరుగుతుంది? పామును గురించిన జ్ఞానము మనసులో ఉండి, సగం కనబడీ కనబడని మందకాంతి ఉంటే, ఆ మసకచీకటిలో సరిగా కనబడకుండా ఉన్న తాడు పామేమో! నన్న భ్రాంతి (అధ్యాస) మానవునికి కలుగుతుంది. పామును గురించిన జ్ఞానమే లేకపోయినా, వెలుతురు స్పష్టంగా ఉన్నా, అప్పుడు రజ్జుసర్పభ్రాంతి కలగటానికి అవకాశం ఉండదు. 'ఈశ్వరుని వలన సృష్టిజరిగినది' అని చెప్పు శ్రుతులు ఈ పరిస్థితులను గురించి చెప్పుట లేదు. ఈశ్వరునికి అన్యమైన రజ్జువు దృశ్యమానమగుటలేదు. మందకాంతి, మందాంధకారము లేదు. అందువలన అధ్యాసచేత సృష్టిజరిగినది అని చెప్పుటకు వీలులేదు. అంతేకాక జీవునకు పరబ్రహ్మయందు కలిగే అధ్యాసవలన జగత్తు భాసమాన మగుచున్నదను మాట కూడా ద్వైతులు అంగీకరించరు. తనకన్న వేరుగా ఉన్న రజ్జువునందు సర్పభ్రాంతి కలుగుచున్నది. అంతేకాని, ఎవనికీ తనయందే తనకు అధ్యాసకలిగి "నేనే సర్పమును" అని అనుకోడు. జీవునకు బ్రహ్మదృశ్యము కాదు. కాబట్టి బ్రహ్మయందు అధ్యాస ఎట్లు కలుగుతున్నదని ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నలన్నింటికి "చతుస్సూత్రీ" భాష్యములో ఆదిశంకరులు ఈ విధంగా సమాధానం చెప్పారు.

"ముత్యపు చిప్పను సూర్యరశ్మిలో చూచినప్పుడు వెండివలె ప్రకాశిస్తుంది. దీనిని 'అధ్యాస' అని అంటారు. ఈ అధ్యాస రెండు రకములుగా ఉంటుంది. (1) అర్థాధ్యాస (2) జ్ఞానాధ్యాస. ఒక వస్తువును చూచి మరియొక వస్తువు అని అనుకోవటం అర్థాధ్యాస.

యదార్థజ్ఞానమునకు బదులు అయదార్థ జ్ఞానము కలిగియుండుట జ్ఞానాధ్యాస. ఈ జ్ఞానాధ్యాసకు "అహమిదం", "మమేదం" అనుకొనుటను శంకరులు ఉదాహరించారు. "అహమిదం" అనగా "ఇదే నేను" అనగా తాను కానటువంటి (ఆత్మకానటువంటి) దేహప్రాణ ఇంద్రియ మనోబుద్ధుల యందు (నేను' అనగా ఆత్మ అనే భావం కలిగి ఉండుట - 'అహమిదంతా జ్ఞానాధ్యాస'.

తనదికాని ఆరామ క్షేత్రాదులయందు "తనవి" అనే భావం "మమేదంతా జ్ఞానాధ్యాస", అజ్ఞానము వలన, అవిద్య వలన జీవుడు తాను బ్రహ్మమును అని గుర్తించక, తాను కర్మపాశబద్ధుడనని తలచుటయే అధ్యాస.

ఈ అవిద్య, అజ్ఞానములే రజ్జుసర్పభ్రాంతి కలిగినప్పుడు, ఆ భ్రాంతి కలుగుటకు కారణమైన మందఅంధకారము, మందకాంతివంటివి.

"వైవిధ్యముతో, భిన్నత్వముతో ఉన్న ఈ జగత్తువలన అద్వితీయమైన పరబ్రహ్మయందు ఎటువంటి మార్పు పారమార్థికముగా లేదు" అని మాత్రమే ఈ సృష్టిక్రమమును వర్ణించు శృతుల వలన తెలియవలసిన పరమార్థము. వేరువేరు శృతులయందు ఈ సృష్టిక్రమము కొద్దిపాటి భేదముతో చెప్పబడినప్పటికీ ఈ పారమార్థికసత్యమునకు భంగము కలుగదు.

ఒకచోట శ్రుతియందు "తదైక్షతా" అని ఈ క్షణక్రియ వలన సృష్టి ప్రారంభము అయినదని వుంటుంది. మరొకచోట "సోకామయత" - ఆ పరబ్రహ్మ అనేకముగా అగుదును గాక! అని కోరెను" అని చెప్పబడి ఉంటుంది. మరొకచోట "ఏకాకీనరమతే" ఆ పరబ్రహ్మ ఒక్కడుగా ఉండి ఆనందించలేదు. అందువలన పతి పత్నీ భావమును పొందెను" అని చెప్పబడుచున్నది. 'పతి' అనగా ఇచ్చట పరబ్రహ్మ'. 'పత్ని' అనగా మాయ లేక ప్రకృతి.

ఈ విధముగా అనేక వైవిధ్యములతో శ్రుతులలో వర్ణింపబడినప్పటికీ ఈ శ్రుతుల యొక్క పరమార్థము "నేహ నానాస్తి కించన" అనగా ఇక్కడ నానాత్వము కొంచెము కూడా లేదు. "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" -

సజాతీయ, విజాతీయ స్వగతములని చెప్పబడు త్రివిధములైన భేదములు లేక అద్వితీయుడైన బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు" అని చెప్పబడిన సత్యమే.

## పంచీకరణము

పంచీకరణము అని చెప్పబడు ఈ ప్రకరణములో సృష్టి క్రమము మరికొంత వివరింపబడుచున్నది.

మాయ అనునది బ్రహ్మయొక్క "అనపాయిని" అయిన శక్తి. (అనగా ఎల్లప్పుడు విడిచిపెట్టక వెంట ఉండునట్టిది.) ఈ మాయనే అజ్ఞానమనీ, ప్రకృతియని కూడా అంటారు. ఈ ప్రకృతియందు సత్వ గుణము, రజోగుణము, తమోగుణము అను మూడు రకములైన గుణములు ఉండును. గుణములు అనగా పరమాణువుల లక్షణము అని స్థూల బుద్ధితో అనుకొనవచ్చును. అనగా ప్రకృతిలో సత్త్వగుణపరమాణువులు, రజోగుణ నరమాణువులు, తమోగుణపరమాణువులు ఉంటాయని అర్థము చేసుకొనుటకై స్థూలముగా మనము చెప్పుకొనవచ్చును. ప్రథమములో ప్రకృతియందు ఈ మూడు గుణములూ సమతాస్థితియందు (equilibrium) ఉండును. ఈ గుణముల యొక్క సమతాస్థితినే ప్రళయావస్థ అని అంటారు. ఈ మహాప్రళయావస్థలో ప్రకృతిలో అనేకకోట్ల జీవరాసులు పూర్వసృష్టినుండి తమ తమ కర్మములు, వాసనలు, అదృష్టములతో కూడా లయము చెంది యుండును. త్రిగుణాత్మకమైన సామ్యావస్థ యందు ఉన్న ఈ ప్రకృతి నుండి శుద్ధ బ్రహ్మ చైతన్య సాన్నిధ్యముచే సత్వగుణము విజృంభించును. అట్లు విజృంభించిన శుద్ధ సత్త్వగుణమును మాయ అని చెప్పుదురు.

(1) మాయయందు ప్రతిఫలించిన బ్రహ్మచైతన్యము, (2) మాయ, (3) మాయాధిష్ఠానమైన బ్రహ్మచైతన్యము - ఈ మూడునూ కూడి ఈశ్వరుడని చెప్పబడును. ఈ ఈశ్వరునికే అంతర్యామి అనియు, అవ్యాకృతుడనియు రెండు పేర్లు గలవు. ఈశ్వరుడే "జగస్స్రష్ట" అని కూడా చెప్పబడును. బ్రహ్మచారి వివాహము చేసుకొన్నప్పుడు గృహస్థుడవుతాడు. అంతేకాని బ్రహ్మచారి వేరు, గృహస్థువేరు అని అర్థము కాదు. అట్లే జరుగుతున్న సృష్టి కార్యమును బట్టి ఈశ్వరునికే బ్రహ్మ అని పేరు

వచ్చును. అట్లే స్థితికారకత్వమైన పాలన, రక్షణాదులు చేయునప్పుడు ఈశ్వరునే విష్ణువని అంటారు. లయకారకుడైనప్పుడు ఈశ్వరునే రుద్రుడు అని అంటారు. ఈ రుద్రుడే చిత్తలయమును కలిగించి జ్ఞానప్రదుడై మంగళకారకుడైనప్పుడు "శివుడు" అని అంటారు. కాబట్టి బ్రహ్మ, విష్ణు, శివ నామరూపగుణభేదములు ఒకే ఈశ్వరునికి తత్తత్కార్యముల వలన కలుగుచున్నవి. బ్రహ్మ విష్ణురుద్రులు ముగ్గురూ ఒక్కరేనని, వేరువేరు కాదని కనుగొనినవాడు "అత్రి" మహర్షి అని గాథ.

సృష్టికి ఉపాదానకారణమనీ, నిమిత్తకారణమనీ చెప్పబడు రెండు కారణములూ ఈశ్వరుడే అగుటచే ఆయనను "అభిన్న నిమిత్త ఉపాదాన కారకుడు" అంటాము.

ఘటమును తయారు చేయుటకు మృత్తిక ఉపాదాన కారణము. కుమ్మరివాడు, కుమ్మరిసారె, చేయుపనులు నిమిత్త కారణములు. అట్లే వస్త్రమునకు దారములు ఉపాదాన కారణములు. ఇదే విధముగా సృష్టికి మాయ ఉపాదాన కారణమనీ, ఈశ్వరుడు నిమిత్త కారణమనీ కొందరు ప్రతిపాదిస్తారు.

అనగా ఈశ్వరుడు ప్రకృతిలోని పదార్థములను, పరమాణువులను అమర్చి, కలిపి లేక తీసివేసి "సాలెవాడు వస్త్రమును నేసినట్లు" సృష్టి చేసెను. ఇది శ్రుతి విరుద్ధమైన వాదన. ఎందుచేతననగా ఈశ్వరుడు ఈ జగత్తునకు నిమిత్త కారణము, ఉపాదానకారణము కూడా అయి వున్నాడు. ఇందుకు ఉదాహరణముగా ముండకోపనిషత్తు యందు "ఊర్ణనాభి" అనగా సాలెపురుగు యొక్క దృష్టాంతమును చెప్పారు.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ**
**తథాక్షరాత్సంభవతీహం విశ్వమ్ ॥**

**ముండకోపనిషత్తు I-7**

సాలెపురుగు తనలోనుండి దారమును ఏ విధముగా సృజించునో అనగా బయటకు వదులునో, మరల ఆదారమును ఎట్లు లోనికి గ్రహించునో, అదే విధముగా అక్షరుడైన పరబ్రహ్మనుండి ఈ విశ్వము పుట్టుచున్నది" అని ముండకశృతి చెప్పుచున్నది.

సాలె పురుగు తనలో నుండి దారమును తీయుటకు బాహ్యపదార్థ సహాయమును అపేక్షించుట లేదు ఆదారమునకు నిమిత్త కారణము, ఉపదాన కారణము కూడా సాలె పురుగే.

ఉపాదాన కారణము ఎప్పుడూ కూడా సత్పదార్థమై ఉండవలెను. అసత్పదార్థము నుండి సృష్టి చేయబడదు. మాయ కనుక ఉపాదాన కారణమైతే మాయ సత్పదార్థము కావలెను. సత్పదార్థమగు మాయ, సత్పదార్థమగు బ్రహ్మ ఉన్నచో ద్వైతము కలుగును. కావున అద్వైత హాని కలుగును. మాయనిమిత్త కారణము, ఈశ్వరుడు ఉపాదానకారణము అనియు చెప్పుదమన్నచో నిమిత్త కారణము చైతన్యవంతము కావలెను. అప్పుడు అద్వైతహానియే కాక మాయ స్వతంత్రమైన చైతన్య పదార్థము అని చెప్పవలసి వచ్చుటచే ఇది కూడా శ్రుతి విరుద్ధము.

మాయ అచేతనమైన నిమిత్తకారణము కాకూడదా? అనినచో లోకములో చేతనములే, నిమిత్తకారణముగా ఉండుట గమనించు చున్నాము. అచేతనమైన వస్తువు నిమిత్త కారణముగా ఉండుట ఊహింపరానిది. ఇన్ని దోషములుండుట వలన మాయనిమిత్త కారణము కానేరదు. ఈశ్వరుడే నిమిత్త, ఉపాదాన కారణము. రెండు కారణములు ఈశ్వరునికే ఎట్లు చెప్పవలెననిన శ్రుతి సాలెపురుగు దృష్టాంతమును చెప్పియున్నది. సాలెపురుగు శరీరప్రధానమైన ఉపాదాన కారణము. బుద్ధి ప్రధానమైన నిమిత్త కారణమై దారమును తయారు చేయును. అటులనే ఈశ్వరుడు సత్త్వగుణ ప్రధానమైన మాయతో కూడి నిమిత్త కారణము అగును (కుమ్మరివాడు వలె). తమోగుణ ప్రధానమైన మాయతోకూడి ఉపాదాన కారణమయ్యేను (మృత్తిక వలె).

శుద్ధ సత్త్వగుణ ప్రధానమైన మాయతో కూడిన ఈశ్వరుడు, తమోగుణప్రధానమైన మాయతో కూడిన తనను వీక్షించెను. (ఈక్షణ చేసెను.) తమోగుణ ప్రధానమైన మాయతో కూడిన చైతన్యమునుండి ఆకాశము జనించెను. ఈ ఆకాశము త్రిగుణాత్మకము. అనగా సత్త్వ, రజ స్తమోగుణాత్మకములైన అపంచీకృత ఆకాశభూత తన్మాత్రలు పుట్టెను - అని అర్థము.

ఆత్మనుండి ఆకాశము పుట్టెను. ఆకాశము నుండి వాయువు,

వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృధ్వి అను పంచభూతములు పుట్టినవని శ్రుతి చెప్పుచున్నది. ఇందులో ముఖ్యముగా తెలుసుకొనవలసిన మొదటి విషయము - ఈశ్వరుడు తానుగానే ఉండి, ఏ మార్పు చెందకుండా, పంచభూతముల సృష్టికి నిమిత్త, ఉపాదాన కారణమయ్యేను.

ఈశ్వరుడు → ఈశ్వరుడు + ఆకాశము + వాయువు + అగ్ని + జలము + భూమి.

రెండవ ముఖ్య విషయము ఏమనగా ఈ జన్మించినవి స్థూల పంచభూతములు కావు. సూక్ష్మములైన, త్రిగుణాత్మకములైన భూత తన్మాత్రలు. సూక్ష్మములైన పంచభూత భాగములను తత్+మాత్రలు = తన్మాత్రలు అని అంటారు. నేటి భాషలో వీటిని పరమాణువులు అని చెప్పుకొనవచ్చును.

ఆకాశము జనించినది... అనగా ఆకాశ త్రిగుణాత్మక తన్మాత్రలు జనించినవి అని అర్థము.

= సాత్త్విక ఆకాశ తన్మాత్ర+రాజసిక ఆకాశ తన్మాత్ర+తామసిక ఆకాశ తన్మాత్ర. ఇదే విధముగా పంచభూతములకు సంబంధించిన త్రిగుణాత్మకములైన 15 తన్మాత్రలు ఏర్పడును. వీటినే అపంచీకృత భూతములు అనీ, సూక్ష్మ భూతములు అని కూడా అంటారు. ఈ తన్మాత్రల వలన వ్యష్టి, సమష్టి ఆత్మకమైన లింగ శరీరము పుట్టెను. లింగ శరీరమునే సూక్ష్మ శరీరము అని అందురు. దీనిలో 17 అవయవములుండును. స్థూల శరీరమును "భోగస్థానము" (భోగాయతనము) అని అంటారు. అనగా కర్మఫలమును అనుభవించే గృహము వంటి ప్రదేశము అని అర్థము. సూక్ష్మ శరీరమును "భోగసాధనము" అని అంటారు.

"సూక్ష్మాంగం భోగసాధనమ్" అని శంకరుల ఆత్మ బోధ. సూక్ష్మ శరీరములో పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు, మనస్సు, బుద్ధి అను 17 భాగములుండును. అపంచీకృత తన్మాత్రల యొక్క సాత్త్వికాంశముల వలన జ్ఞానేంద్రియములు పుట్టినవి.

ఆకాశతత్వము యొక్క సాత్వికతన్మాత్రల వలన (పరమాణువుల వలన) శ్రోత్రేంద్రియము ఏర్పడును. అట్లే

వాయుభూతము సాత్త్విక తన్మాత్ర పరమాణువులు త్వక్ఇంద్రియము
చర్మము

| | | | | |
|---|---|---|---|---|
| అగ్నిలేక తేజస్తత్వము | " | " | " | చక్షువులు. (కన్నులు) |
| జలభూతము | " | " | " | జిహ్వేంద్రియము (నాలుక) |
| పృధ్వీ భూతము | " | " | " | ఘ్రాణేంద్రియము. (నాశిక) |

ఈ ఇంద్రియములు స్థూలశరీరములో కనబడు ఇంద్రియ గోళముల కన్న భిన్నమైనవి. చక్షురింద్రియము అనగా పైకి కనబడు కన్ను మాత్రమే కాదు. కళ్ళు, ముక్కు, చెవులు మొదలగునవి స్థూల శరీరము లోనివి. ఇంద్రియములు సూక్ష్మ శరీరములోనివి.

ఈ పంచభూతముల యొక్క రజోగుణ తన్మాత్ర పరమాణువుల వలన కర్మేంద్రియములు పుట్టును. అట్లు ఆకాశము నుండి వాక్కు, వాయువు నుండి చేతులు (పాణి ఇంద్రియములు) తేజస్సు నుండి కాళ్ళు (పాదేంద్రియము), పృధ్వి నుండి జననేంద్రియము - ఈ ప్రకారముగా ఉత్పత్తి అయ్యెను.

ఈ పంచభూతముల యొక్క సమష్టి రజోగుణాత్మక తన్మాత్ర పరమాణువుల వలన ప్రాణము పుట్టును. ఈ ప్రాణము వృత్తి భేదములచే అనగా తాను చేయు పనుల భేదముచే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములను ఐదు విధములైనది. ఈ పంచ ప్రాణములలో నాగ, కూర్మ మొదలగు ఉపవాయువులు అంతర్భూతములైనవి.

పంచభూతముల యొక్క సమష్టి సాత్త్విక తన్మాత్ర పరమాణువుల వలన అంతఃకరణము ఏర్పడును. ఈ అంతఃకరణమునే అంతరింద్రియము అంటారు. ఇది మనోబుద్ధిచిత్త అహంకారములు అను నాలుగు విధములుగా ఉండును. బుద్ధియందు అహంకారమును

అంతర్భాగముగా తలచి, మనస్సునందు చిత్తమును అంతర్భావముగా తలచినప్పుడు అంతఃకరణము, మనస్సు, బుద్ధి అను రెండు భాగములుగనే ఉన్నట్లు చెపుతారు. అప్పుడు సూక్ష్మ శరీరమునకు 17 భాగములు అగును.

ఈ సూక్ష్మశరీరము సమష్టి, వ్యష్టి ఆత్మకముగా ఉండును. అనగా సమష్టి అంతఃకరణము నందు వ్యక్తి యొక్క అంతఃకరణము భాగము. మనకు కలిగే సంకల్పములన్నీ సమిష్ట్యాత్మకములైన ఒక మనస్సు ముద్రములో భాగము. సమష్టి సూక్ష్మశరీరమునకు, వ్యష్టి సూక్ష్మశరీరమునకు అంతఃకరణ స్థాయిలోను, ప్రాణశక్తి యొక్క స్థాయిలో కూడా ఆదాన ప్రదాన రూపమైన సంబంధము నెలకొని యుండును. వ్యక్తి శరీరములోని ప్రాణశక్తి విశ్వములోని ప్రాణశక్తిలో ఒక భాగము. అట్లే వ్యక్తి యొక్క మనోబుద్ధులు విశ్వములోని మనోబుద్ధులలో భాగమే.

ఆత్మ శుద్ధ చైతన్య స్వరూపము. ఈ శుద్ధ చైతన్యము ప్రకృతితో సంబంధము కలిగియుండుట వలన జీవత్వము ఏర్పడుతున్నది. ఈ ప్రకృతి అనగా అపంచీకృత, సాత్విక పంచభూత తన్మాత్రల వలన ఏర్పడిన అంతఃకరణములోని బుద్ధియే. ప్రకృతి అనగా వేరే ఎక్కడో లేదు. బుద్ధియే ప్రకృతి యొక్క ప్రథమ రూపమని, మనస్సు, చిత్తము అనునవి ప్రకృతి రూపములేనని గ్రహించాలి. శుద్ధ చైతన్యమునకు బుద్ధితో సంబంధము కలగటాన్ని రెండు విధములుగా వర్ణిస్తారు. కొందరు బుద్ధిచేత చైతన్యము కప్పబడుతున్నది పరిచ్ఛిన్నమగుచున్నది (అవచ్ఛిన్నము అగుచున్నది) అని చెపుతారు.

మరి కొందరు బుద్ధియందు చైతన్యము ప్రతిఫలిస్తున్నది అని చెపుతారు. దీనినే బింబ ప్రతిబింబవాదమని అంటారు. విద్యారణ్యస్వామికి ఈ వాదమే ప్రియమైనది. బుద్ధియందు ప్రతిఫలించిన చైతన్యమును "చిదాభాసుడు" అంటారు. ఈ చిదాభాసుడే జీవుడు. అయితే సామాన్యుల అనుభవములో "నేను" చిదాభాసుడను అను భావము కలుగదు. నేను కర్తను, భోక్తను అను కర్తృత్వ, భోక్తృత్వభావ విశిష్టమైన అహంకార రూపములో మాత్రమే సామాన్యులకు అనుభవమౌతుంది. యోగసాధన వలన నిరహంకారత్వము పొందినప్పుడు తాను చిదాభాసుడనని

స్ఫురిస్తుంది. ఇది రెండవ దశ. అటు తరువాత యోగసాధన వలన బుద్ధి నిశ్చలమైనప్పుడు తాను బుద్ధి కన్న వేరైన చైతన్యము అను అపరోక్ష అనుభవము తనలో తనకే కలుగుతుంది.

ఈశ్వరుడే సమష్టి సూక్ష్మ శరీరమునందు అభిమానము కలవాడైనప్పుడు హిరణ్యగర్భుడు అని పిలువబడును. ఈ హిరణ్యగర్భునికే సూత్రాత్మ అనీ, ప్రాణుడు అనీ పేర్లు గలవు.

పంచభూతముల యొక్క ఆ పంచీకృత తమోగుణాత్మకతన్మాత్ర పరమాణువులు, అప్పుడు "పంచీకరణము" అను మార్పును చెంది స్థూల పంచభూతములుగా ఏర్పడును.

పంచీకరణములో ఒక్కొక్క భూతము ఎనిమిది (8) అంశములు కలదిగా భావించవచ్చును. ప్రతిభూతము 4+4 అను రెండు సగములుగా విడిపోతుంది. అప్పుడు రెండవ సగములో నాలుగు అంశములు నాలుగు భాగములుగా విడిపోతాయి.

ఆకాశతన్మాత్ర = 4 పాళ్ళు + (1 + 1 + 1 + 1). ఈ విధముగా పంచభూతాలు విడిపోతాయి. అప్పుడు

| | | | | |
|---|---|---|---|---|
| ఆకాశతన్మాత్ర 4 పాళ్ళు + | 1 + | 1 + | 1 + | 1 |
| | వాయు | అగ్ని | జలము | పృధ్వి |

ఇవన్నీ కలిసి స్థూల ఆకాశ భూతము అవుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| వాయుతన్మాత్ర 4 పాళ్ళు + | 1 + | 1 + | 1 + | 1 |
| | ఆకాశ | అగ్ని | జలము | పృధ్వి |

స్థూల వాయుభూతము

| | | | | |
|---|---|---|---|---|
| అగ్నితన్మాత్ర 4 పాళ్ళు + | 1 + | 1 + | 1 + | 1 |
| | ఆకాశ | వాయు | జలము | పృధ్వి |

స్థూల అగ్నిభూతము

| | | | | |
|---|---|---|---|---|
| జలతన్మాత్ర 4 పాళ్ళు + | 1 + | 1 + | 1 + | 1 |

ఆకాశ వాయు అగ్ని పృథ్వి
<u>స్థూల జలభూతము</u>

పృథ్వి తన్మాత్ర 4 పాళ్ళు + 1 + 1 + 1 + 1
ఆకాశ అగ్ని వాయువు అగ్ని
<u>స్థూల పృథ్వీభూతము</u>

ఈ విధముగా స్థూలపంచభూతములు ఏర్పడుచున్నవి. ఈ స్థూలభూతములనుండి ఈశ్వరుని యొక్క వీక్షణముచేత బ్రహ్మాండము, బ్రహ్మాండములోని ఏడు ఊర్ధ్వలోకములు, ఏడు అధోలోకములు, వానిలోని జీవరాసులు పుట్టినవి. స్థూలజగత్తునందు అభిమానముకల ఈశ్వరుని "విరాట్" అనీ "వైరాజుడు" అనీ "వైశ్వానరుడు" అనీ పిలుస్తారు.

వ్యష్టి సమష్టియందు అంతర్భాగమే అయినప్పటికినీ, జాగ్రదవస్థ యందును, స్థూలశరీరమునందును వ్యవహారముకల ఆత్మను వ్యష్టి వ్యక్తిత్వము (Individual Self) ను విశ్వుడు' అని అంటారు. ఇతనికే 'వ్యావహారికుడు' మరియు 'చిదాభాసుడు' అని కూడా పేర్లు కలవు. స్వప్నావస్థయందును, మనోమయకోశమునందును, సూక్ష్మశరీరము నందును అభిమానముకల ఆత్మను "తైజసుడు" అంటారు. ఇతనికే ప్రాతిభాసికుడనీ, స్వప్నకల్పితుడనీ పేర్లుకలవు.

సుషుప్తి అవస్థయందును, కారణ శరీరమునందును అభిమానము కల ఆత్మను ప్రాజ్ఞుడు అని అంటారు. సమష్టిలో స్థూల ప్రపంచాత్మకుని విరాట్ అనియు, సమష్టి సూక్ష్మప్రపంచ అభిమానిని హిరణ్యగర్భుడనీ, సమష్టి కారణశరీర అభిమానిని ఈశ్వరుడనీ అంటారు.

| | వ్యష్టి | సమిష్టి |
|---|---|---|
| స్థూల శరీరాభిమాని | విశ్వ | విరాట్ |
| సూక్ష్మశరీరాభిమాని | తైజస | హిరణ్యగర్భ |
| కారణశరీరాభిమాని | ప్రాజ్ఞ | ఈశ్వర |

కారణశరీరము అనగా తాను నిర్గుణ పరబ్రహ్మము అను జ్ఞానము లేకుండుట. జీవుని పరముగా చెప్పినప్పుడు దీనిని అవిద్య అంటారు.

అనగా తనను తాను తెలుసుకొనలేకపోవుట. ఈ అవిద్యా కారణముగానే జీవునకు వ్యక్తిత్వము, బంధము కలుగుచున్నవి. కావున అవిద్యోపాధినే కారణోపాధి అంటారు.

అవిద్య, విద్యవలన నివర్తించబడుచున్నది. బ్రహ్మజ్ఞానముచే అవిద్య పోగా కారణోపాధిభంగమై బ్రహ్మాత్మైక్య అపరోక్షఅనుభవము కలుగును.

ఈశ్వరునికి ఉన్న కారణశరీరము శుద్ధసత్వప్రధానమైన మాయవలన ఏర్పడిన ఉపాధి. ఈ ఉపాధివలన ఈశ్వరునకు రెండు విధములైన అనుభవములు నిత్యముగా నుండును.

1. తాను నిర్గుణ, నిష్కల, సచ్చిదానంద పరబ్రహ్మనను జ్ఞానము ఉండును.

2. అట్టి జ్ఞానము ఉంటూనే "సర్వోహం" అనుభావము కూడా అనుభవములో ఉండును. సమస్త జగత్తు, సర్వలోకములు తానేనని, సర్వజీవులు, వారి అనుభవములు తనకు కలుగుచున్నవనీ ప్రత్యక్షముగా తెలుసుకొనుచుండును. అంతేకాక, ఈశ్వరునకు అప్రతిహతమైన త్రికాల జ్ఞానము ఉండును. ఏ జీవునకూ ఇట్లు ఉండదు. అది ఈశ్వరలక్షణము మాత్రమే. జీవుడెప్పుడూ ఈశ్వరుని పూర్తిగా తెలుసుకొనలేడు. ఈ విషయాన్నే భగవద్గీతలో

**వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన.**
**గీత 7-26.**

"గడచిపోయినది అంతయు నాకు తెలియును. జరుగుచున్న దంతయు నాకు తెలియును. ప్రాణులకు జరుగ బోవునదంతయు నాకు తెలియును. ఓ అర్జునా ! నన్ను మాత్రము ఎవ్వరూ ఎరుగజాలరు" అన్నాడు శ్రీ కృష్ణపరమాత్మ.

అందుచే శుద్ధ సత్వప్రధానమైన మాయోపాధి కలిగిన ఈశ్వరుడు జీవునికన్న అత్యంతము భిన్నుడు అని చెప్పుటలో ద్వైతవాదులతో, అద్వైతవాదులు పూర్తిగా ఏకీభవిస్తారు. అయితే జగత్తు, జీవుడు,

ఈశ్వరుడు అనే భేదము మాయవలన కల్పింపబడుచున్నదని, జ్ఞానమువలన ఆ బేధభావము నివర్తించబడుచున్నదని మాత్రము అద్వైతులు నొక్కివక్కాణిస్తారు. మాయ యొక్క ముఖ్యలక్షణము ప్రతిపాదించటానికి అద్వైతులు "జ్ఞాననివర్తకము" (అనగా జ్ఞానము చేత తొలగిపోవునది) అని నిర్వచించారు.

ఉపాధిబేధము తొలగిపోతే జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అనే భేదము లేదు. జీవుడు అవిద్యోపాధిని, అహంకార మమకారములను కలిగి వున్నంతవరకు జీవేశ్వరభేదము, జీవజీవభేదము ఉంటుంది. అట్టి సమయములో జీవుడు పరతంత్రుడు, కర్మ బద్ధుడు, కించిజ్ఞుడు, అల్పశక్తిమంతుడు, సుఖదుఃఖభోక్త. ఈశ్వరుడు స్వతంత్రుడు, సర్వజ్ఞుడు, కర్మబద్ధుడు కానివాడు, సర్వశక్తిమంతుడు, నిరతిశయ పరమానంద స్వరూపుడు.

సమష్టిసూక్ష్మ శరీరములో ఇంద్రియ అధిష్ఠాన దేవతలు ఉంటారు. వ్యష్టి సూక్ష్మశరీరములో కూడా ఇంద్రియములకు ఆ దేవతలే అధిపతులై ఉంటారు. ఉదాహరణకు నేత్రేంద్రియమునకు సూర్యుడు, మనసునకు చంద్రుడు మొదలగు వారు. ఆయాదేవతలను ఉపాసించినందువలన, వారి అనుగ్రహబలముచే ఇంద్రియ పటుత్వము, ఆయురారోగ్యములు కలుగును.

పంచీకరణ విద్య సృష్టి క్రమమును తెలియజేయుచున్నది. ఈ విద్యను లయ యోగమునకు ఆధారముగా చేసుకొని, బ్రహ్మజ్ఞానమును పొందవచ్చును. సాధారణముగా ప్రాకృతబుద్ధికి "స్థూలజగత్తులోని ఘటపటాదులు బ్రహ్మ ఎలా అవుతాయి?" అనే సందేహము కలుగుతుంది. స్థూల జగత్తు పంచభూతములవలన ఏర్పడుచున్నదని, ఆ భూతములు అపంచీకృత తన్మాత్రల నుండి పుడుచున్నవని తెలుసుకొనవలెను. ఇంద్రియార్థములు భూత తన్మాత్రల యొక్క తమోగుణాంశవలన వచ్చుచున్నవి. ఆ తన్మాత్రలయొక్క రజోగుణాంశములవలన కర్మేంద్రియములు, సత్త్వగుణాంశముల వలన జ్ఞానేంద్రియములు ఏర్పడుచున్నవి. మనోబుద్ధి చిత్త అహంకారములు తన్మాత్రల సాత్త్విక అంశచే ఏర్పడుచున్నవి. అహంకారము నేను కాదని, ప్రకృతిలో

భాగమని తెలిసినచో చిత్తలయము కలుగును. నేను-నాది అనెడు భావముల వలన మనసు విస్తరిస్తుంది. నేను – నాది అనుభావములను వదిలిపెడితే మనసు లయము చెందుతుంది. వ్యష్టికి, సమష్టికి కల సంబంధమును గుర్తిస్తే, సమష్టి అంతఃకరణలో సాధకుని అంతఃకరణ భాగమేనని తెలిసి, దానికి సాక్షియైయుండుటయే జ్ఞానయోగము.

అజ్ఞానముచే సంసారసాగరమున ఊపిరాడక కొట్టుమిట్టాడుచున్న జీవునకు, కర్మ పరిపక్వమైనప్పుడు ఏదో ఒక జన్మయందు ఆచార్యుని కృపవలన, దైవానుగ్రహమువలన తత్త్వవిచారణ చేసి, జీవుడు బ్రహ్మము ఒక్కటేనను ఆత్మజ్ఞానము కలిగి, బ్రహ్మాత్మైక్య అపరోక్షానుభవము కలుగును. ఇదియే స్వస్వరూపజ్ఞానము. ఇట్టి స్వస్వరూప జ్ఞానమును పొందుటయే జీవిత పరమార్థము.

"ప్రతి మనుజునికి స్వీయమగు దేహము ఒకటి, పుత్రాత్మకమగు దేహమొకటి. ఇట్లు దేహద్వయము కలదు. మరణము ఆసన్నమగుచుండగా తాను చేయవలసిన పుణ్యకర్మలను ఆచరించుటకు తన ప్రతినిధిగా తన సంతానమును ఏర్పరిచి, తండ్రి తాను చేసిన కర్మ ఫలమగు భావిశరీరమును వాసనారూపముగా గ్రహించి ఈ శరీరమును వదిలిపెట్టును. మరియొక శరీరమునందు జన్మించును. ఇదియే తండ్రియొక్క తృతీయ జన్మము" అని ఉపనిషత్తులందు చెప్పబడినది.

జననమరణరూపమగు ఈ సంసారమును అంతమొందించుటకు జ్ఞానము తప్ప మరే ఉపాయము లేదని బాగుగా ఆత్మ విచారణము చేసిన వారి బుద్ధికి గోచరమగును.

నిరంతరధ్యానాదుల చేతను, సద్గురువు యొక్క ఉపదేశము చేతను కలిగిన 'సర్వంఖల్విదం బ్రహ్మ' అను జ్ఞానము చేత అజ్ఞానము నాశనమగును.

బాణమును సంధించువానికి ఏకాగ్రత లేనిచో లక్ష్యమును భేదింపజాలడు. అట్లే బాహ్య, అంతరింద్రియ నిగ్రహము లేనిచో సాధకుడు బ్రహ్మమును పొందజాలడు. ధ్యానయోగి ఓంకారమును ధనుస్సుగాను, ఆత్మను శరముగను సంధించి బ్రహ్మమును లక్ష్యముగా

ఉంచుకొని ధ్యానించినచో శరము లక్ష్యమును చేరునట్లు జీవాత్మ పరమాత్మయందు ఐక్యమొందగలుగును.

సకల వేదములకు మూలము, పరబ్రహ్మస్వరూపము అయిన ఓంకారమునందే సమస్తవేదములు, మంత్రములు అంతర్గతములై ఉన్నవి. మలిన హృదయులకు ఇట్టి ఓంకారోపాసన సాధ్యముకాదు. అది జ్ఞానగమ్యము.

వేదముల యొక్కయు, ఆచార్యుని యొక్కయు అనుగ్రహము వలనను, ఈశ్వరుని కరుణవలనను జ్ఞాన, ధ్యానయోగాది అనుష్ఠానముల చేతను నిజమైన ఆత్మబోధ కలుగును. ఆత్మజ్ఞానమునకు సంసార దుఃఖ నివృత్తి కారకమగు వైరాగ్యము ఆవశ్యకము. అనేక శాస్త్రములు చదువుటవలన కలిగిన "పుస్తక జ్ఞానము"తో దుఃఖనివృత్తి కలుగదు. కేవలము ఆత్మ జ్ఞానము మాత్రమే సంసారదుఃఖమును ఉపశమింపచేసి, మోక్షప్రాప్తిని కలిగించును. బాహ్య,అభ్యంతర భేదము లేనట్టిదియు, పూర్ణమైనట్టిదియునగు సర్వాత్మభావమే ఆత్మయొక్క సర్వోత్తమస్థితి. ఇదియే మోక్షము. ఆత్మజ్ఞానము సర్వకర్మ హేతువినాశకము !

పూజలను చేయుట, జపమును చేయుట మనసును సంకల్ప రహితముగా వికల్ప శూన్యముగా చేసి, చిత్తము ఏకాగ్రత పొందజేయుటకు మాత్రమే. కాని, లోకములో అనేకులకు జ్ఞానము పొందవలెనన్న కోరిక ఉన్నను, వారివారి యొక్క పూర్వ జన్మ కర్మములు జ్ఞానమార్గమునకు కావలసిన కార్యములను చెయ్యనివ్వక, వాటికి కావలసిన శాస్త్రపఠనాదులయందు ఆసక్తి కలిగించకుండును.

సంసారనివృత్తియనునది జ్ఞానమువలన కలుగవలెనేకాని, కర్మము వలన కలుగదు. పూర్వజన్మపుణ్యకర్మము పరిపక్వము అయిన వారికి మాత్రమే సంసారమునందు విరక్తి కలిగి జ్ఞానమును పొందుటకు ప్రయత్నించెదరు. ఇట్లు ప్రయత్నించుచున్న వారే మోక్షమునకు అర్హు లగుదురు.

"నహిజ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే"
**గీత 4 అ. 38 శ్లో.**

జ్ఞానముతో పోలినది మరేదియును లేదు. కర్మయోగమువలన చిత్తశుద్ధి, చిత్తశుద్ధి చేత భక్తి, భక్తి పరాకాష్ఠ స్థితిచే జ్ఞానము కలుగును. అజ్ఞానము తొలగి స్వస్వరూప జ్ఞానము కలుగుటచే సర్వము బ్రహ్మముగా గోచరించి తానే బ్రహ్మమను విషయము బోధపడును. కనుక అట్టి జ్ఞానమును సంపాదించుటకు వివేకియగువాడు ప్రయత్నించును. అపురూపమగు మానవజన్మ లభించినందువలన, ఈ శరీరము నశించక ముందే జననమరణ రహితమగు మోక్షమును పొందుటకు తప్పక ప్రయత్నించవలెను.

## "కోహం" విచారణ

20వ శతాబ్దం ప్రధమార్థములో జీవించిన శ్రీరమణ మహర్షి జ్ఞానయోగులందరి పైనా ప్రగాఢమైన ముద్రను వైచి లక్షల కొలది సాధకులను ప్రత్యక్షముగను, పరోక్షముగను తమకు శిష్యులుగా చేసుకున్నారు. 1400 సంవత్సరములనుండి వివిధ మతముల వారు భక్తి ప్రచారము చేస్తున్నప్పటికీ, ప్రతికాలంలో కూడా జ్ఞానులు ఉద్భవించి అద్వైత సత్యాన్ని చాటుచునే ఉన్నారు. మహత్తరమైన అధ్యాత్మిక తుఫానులకు చెక్కుచెదరకుండా నిలబడే "కులపర్వతము" వలె, 20 వ శతాబ్దములో శ్రీ రమణ మహర్షి బ్రహ్మ విద్వరిష్ఠులై నిల్చినారు. వారు దక్షిణ భారతదేశములోని "తిరుచుళి" అనే గ్రామంలో 1879వ సంవత్సరం డిశంబరు 29వ తేదీన జన్మించి, 1950వ సంవత్సరం ఏప్రిల్ నెల 14వ తేదీన తిరువణ్ణామలై వద్ద దేహత్యాగం చేశారు.

జ్యోతిర్లింగమైన తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని సాన్నిధ్యంలో తన పదహారవ ఏట చేరి, అప్పటినుండి శరీర పరిత్యాగము వరకు అదే ప్రదేశములో నివసించారు. దాదాపు 30 సంవత్సరములు మౌనంగా ఉన్న శ్రీ రమణ మహర్షి తరువాతి కాలంలో వేలాది శిష్యులకు జ్ఞానబోధ చేశారు. వారి ముఖ్యమైన బోధను ఈ క్రింది శ్లోకంలో గ్రహించవచ్చును.

**హృదయకుహర మధ్యే కేవలం బ్రహ్మ మాత్రం**
**"హ్యహామహా" మితి సాక్షాదాత్మ రూపేణ భాతి;**

**హృది విశ మనసా, స్వం, చిన్వతా, మజ్జతా వా**
**పవనచలన రోధా; దాత్మ నిష్ఠోభవత్వమ్॥**

స్థూల శరీరంలో హృదయము ఎడమ భాగంలో ఉంటుంది. సూక్ష్మ శరీరం స్థూల శరీరాన్ని ఆశ్రయించి ఉంటుంది. సూక్ష్మ శరీరంలో హృదయం కుడి ప్రక్కన ఉంటుందని అన్నారు రమణ మహర్షి. మళయాళభాషలోని "అష్టాంగహృదయము" అను ఆయుర్వేదగ్రంథములో తాను ఈ విషయాన్ని చూచినట్లు కూడా రమణ మహర్షి అన్నారు (ఇప్పుడు ఆ గ్రంథం లభించటం లేదు.).

"నీవు ఎవరు? .... "ఈ పని ఎవరు చేశారు?" అని ప్రశ్నించినపుడు, ఏ వ్యక్తి అయినా తన ఛాతీకుడి భాగం వైపు చేయి పెట్టుకొని "నేను" అని సమాధానం చెపుతూ ఉంటారు. "సూక్ష్మ శరీరంలోని హృదయస్థానమును చూపించటమంటే ఇదే" అని అనేవారు రమణమహర్షి. కుహరము అనగా గుహ. ఈ హృదయ గుహయందు బ్రహ్మ విశుద్ధమై, నిరావరణమై, అసత్పదార్థములతో మిశ్రితము కాకుండా తాను ఒక్కటే ఉంటుంది. ఈ పరబ్రహ్మ నేను నేను అని సాక్షాత్తుగా, ప్రత్యక్షముగా, ఆత్మరూపముగా ప్రకాశించుచున్నది. అనగా తెలియ బడుచున్నది. మనసుతో ఈ "నేను" ను వెతుకుట (Searching) వలనకాని; లేక దానియందు మునిగిపోవుట (Immersing) వలనకాని; ప్రాణవాయువు యొక్క చలనమును అరికట్టుటవలన కాని; హృదయమునందు ప్రవేశించుము. ఆ విధముగా నీవు ఆత్మ నిష్ఠుడవు కమ్ము" అని పై శ్లోకమునకు అర్థము.

ఈ శ్లోకములో ఆత్మనిష్ఠకు మూడు మార్గములు చెప్పిరని కొందరు, కాదు రెండు మార్గములే చెప్పిరని కొందరు వ్యాఖ్యానించారు. "పవనచలన రోధాత్" అంటే కుంభక ప్రాణాయామమువలన హృదయమున ప్రవేశించుట మొదటి మార్గము. ఈ 'ఆత్మ'ను లేక 'నేను' ను వెతుకుట రెండవ మార్గమని, ఆత్మయందు మునుగుట మూడవ మార్గమనీ కొందరు వ్యాఖ్యానించారు. ఆత్మను వెతుకుట, అందులో మునుగుట రెండునూ ఒకే మార్గమనీ, ఆత్మను వెతికినవాడే దానియందు నిమగ్నుడై ఆత్మనిష్ఠుడు అగునని శిష్యులలో అధిక సంఖ్యాకులు అంగీకరించారు.

అయితే ఈ వెదుకుట అనగా ఏమి?

ఎవరైనా ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు రమణమహర్షి సాధారణంగా ఇలా అనేవారు ... "ఈ ప్రశ్న ఎవరివలన కలుగుచున్నదో తెలుసుకో"మని అనేవారు. "నిన్ను నీవు తెలుసుకోమని" బోధించేవారు. ఈ విధానాన్ని కొంచెం ఇక్కడ వివరించి చెప్పాలి. రమణమహర్షిగారు దీని అర్థం ఈ విధంగా తెలియచేశారు --

"సాధకుడు విశ్రాంతిగా కూర్చుని, తన మనస్సంకల్పములను పరిశీలిస్తూ, ప్రతి సంకల్పమూ ఉదయించినప్పుడు ఈ సంకల్పం ఎవరికి కలుగుతున్నదని ప్రశ్నించుకోవాలి. "నాకే ఈ సంకల్పం కలుగుతున్నది" అనే సమాధానం వస్తుంది. అప్పుడు "నేను" అంటే ఎవరు? (కోహం?) అని ప్రశ్నించుకోవాలి. ఈ విధంగా అనేక పర్యాయములు మరల మరల మననం చేస్తూ ఉండాలి. "నేనంటే ఎవరు?" అన్నప్పుడు దీనికి సకారాత్మక సమాధానము కాని (positive reply), నకారాత్మకమైన సమాధానముకాని (Negative reply) రాబట్టటము సాధకుని ఉద్దేశము కాదు.

"బ్రహ్మను, నారాయణుడను, శివుడను.. అనుకోవటం సకారాత్మకమైన సమాధానములు. నేను దేహమునుకాను, ప్రాణమునుకాను, ఇంద్రియములను కాను అని అనుకోవటం నకారాత్మకమైన సమాధానములు. పూర్వశాస్త్రములలో కొన్ని చోట్ల శివోహం మొదలైన పద్ధతులలో ధ్యానంచెయ్యమనీ, మరికొన్ని చోట్ల దేహోనాహం మొదలైన పద్ధతులలో భావన చెయ్యమనీ చెప్పిన సందర్భములు ఉన్నవి. కాని, రమణమహర్షిగారు ఆ విధంగా ప్రతిపాదించలేదు.

"కోహం?" అని ప్రశ్నించునపుడు మనస్సులో ఏదైనా సమాధానం ఉదయిస్తే ఈ సమాధానం ఎవరికి కలుగుతున్నది ? అని అడగాలి. నాకే కలుగుచున్నది. కావున నేనంటే ఎవరు? అని మరల అడగాలి. ఈ విధంగా చేయటం వలన 'కోహం?' అను ప్రశ్నకు సమాధానంగా చెప్పబడే సకారాత్మక, నకారాత్మక ప్రత్యుత్తరములు ఆగిపోతాయి. ఆ విధముగా చిత్తలయము కలుగుతుంది. సమాధానం లేని ఆ ప్రశ్న మాత్రం మిగులుతుంది. ఆ తరువాత ఈ "కోహం"? అని అడుగుతున్నది

ఎవరు? అని ప్రశ్నిస్తే 'నేను' అని సమాధానం వస్తుంది. నేను అంటే ఎవరు? అని మరల మరో ప్రశ్న ఉదయిస్తుంది. ఈ విధంగా చేయగా, చేయగా మనసు పూర్తిగా లయము చెంది బ్రహ్మసాక్షాత్కారం అపరోక్షంగా కలుగుతుంది.

రమణమహర్షిగారు చెప్పిన ఈ సాధన పూర్వ శాస్త్రములలో చెప్పబడినదే. హృదయమునందు స్ఫురించే ఆత్మతత్వాన్ని శ్రీశంకరులు తమ "ప్రాతః'స్మరణ" శ్లోకంలో ఈ విధంగా వివరించారు.

**ప్రాతః స్మరామి హృది సంస్ఫురదాత్మ తత్వం**
**సచ్చిత్సుఖం పరమహంస గతిం తురీయమ్,**
**యత్స్వప్న జాగర సుషుప్తిమవైతి నిత్యం**
**తద్బ్రహ్మ నిష్కళ మహం నచ భూత సంఘః**

**ప్రాతః స్మరణత్రయమ్ - శ్రీశంకరులు**

"హృదయమునందు బాగుగా స్ఫురించుచున్న ఆత్మతత్వమును ప్రాతః కాలమున స్మరించుచున్నాను. ఏ ఆత్మ తత్వము నిత్యమూ జాగ్రత్స్వప్న సుషుప్తి దశలను సాక్షిరూపముగా నుండి తెలుసుకొనుచున్నదో అట్టి నిష్కళమైన బ్రహ్మమును నేనే అయివున్నాను."

నేను పంచభూతములుకాని, వాని వికారములైన భూత వర్గములోని వాడనుకాని కాను!"

ఈ విధముగా అనేకచోట్ల పూర్వాచార్యులు శ్రీ రమణమహర్షి చెప్పిన విషయమునే ప్రతిపాదించారు. అయినప్పటికి శ్రీరమణులు ఈ సత్యమును స్పష్టముగాను, వినూత్నశైలిలోను ప్రతిపాదించారని, అందువలన ఆయన మహర్షి అని చెప్పదగిన వారని, రమణమహర్షి శిష్యులలో ప్రధములైన శ్రీ కావ్యకంఠం గణపతి శాస్త్రిగారు అన్నారు.

ఈ విధంగా "కోహం?" (నేను ఎవరను?) అను విచారణ ద్వారా చిత్తలయమును పొంది ఏ విధముగా మోక్షసాధన చేయవచ్చునో శ్రీ రమణమహర్షి బోధించియున్నారు.

భగవద్గీత ఆరవ అధ్యాయం చివర అర్జునుడు కృష్ణ పరమాత్మను

ఒక ముఖ్యమైన ప్రశ్న అడిగాడు – "యోగసాధన కొరకు ఒకడు శ్రద్ధగా ప్రయత్నముచేసి, కొంతకాలమైన తరువాత ఆ మార్గమునుండి చలించిన మనస్సుకలవాడు అయినచో, యోగసిద్ధిని పొందని అతనికి ఏ గతి కలుగుతుంది? ఐహిక సుఖములకు, మోక్షమునకు రెండింటికి చెడినవాడై, చెదిరిపోయిన మేఘమువలె నిరాధారుడై, బ్రహ్మపథమునందు అజ్ఞానుడైన ఆ యోగి నశించిపోడు కదా?" అని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించెను.

అందుకు సమాధానముగా శ్రీకృష్ణభగవానుడు ఇట్లు చెప్పెను. "నాయనా ! అర్జునా ! మంచిపనిచేయువాడు ఎప్పుడూ దుర్గతిని పొందడుకదా! ఇహలోకములోను, పరలోకములోను కూడా అట్టియోగి వినాశమును చెందడు. కొంతకాలము యోగమార్గమున సాధన చేసి, లక్ష్యము చేరకమునుపే చనిపోయిన యోగి, పుణ్యాత్ములు పొందు లోకములకు వెళ్ళి, అనేకములైన సంవత్సరములు అక్కడ సుఖభోగములను అనుభవించును. అటుతరువాత సదాచారము కలవారు, శ్రీమంతులు అయిన గృహస్థుల కుటుంబములలో అతడు జన్మించు చున్నాడు. ఒక్కొక్కప్పుడు అతడు యోగుల యొక్క కుటుంబములందే జన్మించవచ్చును. ఈ విధముగా అతడు యోగుల కుటుంబములలో జన్మించుట మిక్కిలి దుర్లభమైన జన్మ. పూర్వజన్మలయందలి జ్ఞానవాసనను మరుజన్మలోకూడా పొంది మోక్షసిద్ధికొరకు మరల ప్రయత్నము చేయును. ఈ జన్మలో ప్రత్యేకముగా ప్రయత్నము చేయక పోయినను, పూర్వజన్మలో చేసిన అభ్యాసబలముచేత యోగమార్గములోనికి ఆకర్షించబడుచున్నాడు.'

"యోగమును తెలుసుకొనవలెను" అని జిజ్ఞాస చేయువాడు కూడా వేదములయందు చెప్పబడిన కర్మకాండల వలన కలుగు ఫలమును అతిక్రమించుచున్నాడు. అనగా యోగమార్గములో ప్రారంభసాధకుడికి కూడా కర్మకాండలో చెప్పబడిన చిత్తశుద్ధిమాత్రమే కాక, పుణ్యలోకప్రాప్తి మొదలైన ఫలములు కూడా కలుగుచున్నవి.

ఈ విధముగా పాపములు పోగొట్టుకొనినవాడై, ప్రయత్నపూర్వకముగా సాధనచేయుచు అనేకజన్మల అనంతరము సిద్ధిని పొంది, మోక్షమును పొందును. శ్రీ విద్యారణ్యస్వామివారు 'వేదాంత పంచదశి"యను గ్రంథమునందు ధ్యానదీపప్రకరణములో నిర్గుణోపాసనను

గురించి ప్రతిపాదించారు. 46వ శ్లోకము నుండి 50వశ్లోకము వరకు గీతలో చెప్ప బడిన అర్థములే చెప్పిరి.

"యోగభ్రష్టస్య గీతా యామ తీతే బహుజన్మని,
ప్రతిబన్ధ క్షయః ప్రోక్తోన విచారోఽప్యనర్థకః ॥"

(వేదాంత పంచదశి. ధ్యా. దీ. ప్ర. 46వ శ్లోకము)

యోగసాధన చేసి పరాకాష్ఠను చెందక మధ్యలో ఆగిపోయిన వానిని "యోగభ్రష్టుడు" అని అంటారు. అనేక జన్మల సాధన తరువాత ఇట్టివానికి "ప్రతిబంధక్షయము" ప్రాప్తమగునని భగవద్గీతయందు చెప్పబడినది. అనగా అనేక జన్మల సాధన తరువాత యోగసిద్ధి కలుగునని అర్థము. అట్లే "నవిచారః అపి అనర్థకః" అనగా బ్రహ్మవిచారము కూడా వ్యర్థము కాదు అని భావము.

అపరిపక్వ బ్రహ్మ విచారము కల జిజ్ఞాసువు పుణ్యలోకములకు వెళ్ళి, మరల భూలోకములో జన్మించిన తరువాత బ్రహ్మ విచారము చేసి సిద్ధిని పొందును.

గీతలో చెప్పిన శ్లోకములకు బాగుగా సరిపోవునట్లు, మిక్కిలిపోలియున్న రెండు శ్లోకములను విద్యారణ్యస్వామి రచించారు.

"ప్రాప్యపుణ్యకృతాం లోకానాత్మ తత్త్వవిచారతః
శుచీనాం శ్రీమతాం గేహే సాభిలాషో భి జాయతే.

ధ్యా. దీ. ప్ర. 47 శ్లోకము.

అధవా యోగి నా మేవ కులే భవతి ధీమతామ్
నిస్పృహో బ్రహ్మతత్త్వస్య విచారాత్తద్ధి దుర్లభమ్"

ధ్యా. దీ. ప్ర. 48.

ఈ శ్లోకములలో (1) "ప్రాప్యపుణ్యకృతాం లోకాన్" - అనీ (2) శుచీనాం శ్రీమతాంగేహే - అనీ, (3) అధవా యోగినామేవ కులే భవతి ధీమతామ్–అనీ తరువాతి రెండు శ్లోకములలో "తత్ర, తం బుద్ధి సంయోగమ్ లభతే పూర్వ దైహికమ్" అనీ మరియు అనేక జన్మ సంసిద్ధః తతోయాతి పరాంగతిమ్" అనీ గీతా వాక్యములను విద్యారణ్య స్వామి యథాతథముగా అనువదించినారు.

అనగా ... "యోగభ్రష్టునకు వలె అపరిపక్వబ్రహ్మ - విచారకునకు కూడా (1) పుణ్యలోకప్రాప్తి (2) ఉత్తమజన్మ (3) తరువాతి జన్మలలో సాధన పూర్తియగుట జరుగును" – అని భావము.

ఆత్మతత్వ విచారకుడు చేసిన ఆత్మ విచారణము పరిపక్వము కాకపోయినను, ఆ విచార ఫలము వలన పుణ్యాత్ములు పొందులోకములకు వెళ్ళి, అనేక సంవత్సరములు అక్కడ నివసించి, సదాచారపరులు, శ్రీమంతులు అయినవారి గృహములందు, బ్రహ్మవిచారణాభిలాష నిలబెట్టుకొన్నవాడై జన్మించును.

అథవా .... అనగా అట్లు కాకపోయినచో తల్లిదండ్రులు యోగులుగా గల ధీమంతులగు వారి వంశమునందే జన్మించవచ్చును. నిస్పృహులు అనగా కోరికలు లేని వారు, బ్రహ్మతత్వ విచారణాపరులు అయిన అట్టి బుద్ధిమంతుల ఇండ్లలో జన్మించుట కూడా దుర్లభమే కదా!

**తత్రతం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహికమ్**
**యతతేచ తతోభూయస్తస్మాదేతద్ధి దుర్లభమ్.**

ధ్యా.దీ.ప్ర - 49

**పూర్వాభ్యాసేన తే నైవ హ్రియతే హ్య వశోపిసః**
**అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాంగతిమ్.**

ధ్యా.దీ.ప్ర - 50.

49వ శ్లోకం: అక్కడ అనగా మరుజన్మయందు, పూర్వ దేహసంబంధమైన బ్రహ్మ విచారాత్మకమైన జ్ఞానవాసనను మరల పొందును. దాని వలన బ్రహ్మ విచారమునకు మరల ప్రయత్నము చేయును. కావున ఇట్టి జన్మదుర్లభమైనది.

50వ శ్లోకం: ఈ జన్మయందు అవశుడైనను అనగా ప్రత్యేకముగా ప్రయత్నము చేయనివాడైనను, పూర్వజన్మ అభ్యాస బలము చేత బ్రహ్మవిచార మార్గమునకు ఆకర్షింపబడును. అనేక జన్మలందు ఈ విధముగా మరల మరల బ్రహ్మవిచారము చేసి, అంతట పరమగతియైన మోక్షమును పొందును.

ఇదే విధముగా పూర్వజన్మలో చేసిన భక్తియోగ సాధన వలన మరుజన్మలోకూడా పరమభక్తులైపుట్టి, సాధన చేయుచుందురని

శ్రీమద్భాగవతములో వర్ణింపబడిన నారదుడు మొదలగు వారి జన్మవృత్తాంతముల వలన తెలియుచున్నది. ఇట్లే కర్మయోగులకు కూడా జరుగును. అనగా పుణ్యపాపకర్మల వలన బుద్ధిలో వాసనలు ఏర్పడును. ఆ కర్మఫలానురూపమైన జన్మలు వచ్చును. ఆయా జన్మలలో పూర్వవాసనలను అనుసరించి మరలసాధన చేయును.

సాధకుడు ప్రాథమిక దశలో పాపములను ఎక్కువగా చేస్తూ, పుణ్యములను తక్కువగా చేస్తూ ఉంటాడు. అందుచేత మరుసటి జన్మలో పాపవాసన ఎక్కువగాను, పుణ్యవాసనలు తక్కువగాను ఉంటాయి. ఈవాసనలు మరల కర్మలకు ప్రేరేపిస్తాయి అనుకుంటే జన్మజన్మములలో పాపమే ఎక్కువగా పెరుగుతూ ఉంటుంది. కాని పాప సంస్కారములు ఎప్పుడూ బలహీనమైనవిగాను, పుణ్యసంస్కారములు బలీయముగాను ఉంటాయి. పుణ్యమువలన సత్వగుణము కలుగును. సత్వగుణమువలన జ్ఞానము కలుగును. అందుచేత పుణ్యసంస్కారములు బలీయములు. పాపము వలన రజోగుణ, తమోగుణములు కలిగి జ్ఞానమునకు దూరుడగును. ఎంతగొప్ప పాపసంస్కారమైనప్పటికి అది పుణ్య సంస్కారముల వలన బలహీనమగును. అందుచే జన్మజన్మలలో కర్మ ఫలములను అనుభవించునపుడు సమస్తజీవులకు కూడా శ్రేయస్సే కలుగుతుంది. అనగా పుణ్యసంస్కారములు బలపడుతూ ఉంటాయి. పాప సంస్కారములు క్రమముగా నశించిపోతాయి. సృష్టిలో, పరిణామములో ప్రయత్నము చేయకుండానే సమస్త జీవులు శ్రేయోమార్గమునే అనుసరించి కొద్దికొద్దిగా ముందడుగు వేస్తూనే ఉంటారు. అడవిలో చెట్లు సహజముగా పెరిగినట్లు, జీవులకు సహజమైన అభివృద్ధి కలుగుతూనే ఉంటుంది. అయితే ఎరువులు వేసి, నీళ్ళుపోసి, దోహదము చేస్తే మొక్కలు చక్కగా పెరుగునట్లు, జీవుడు ఆచార్యపురుషులను ఆశ్రయించి, సద్గురు సాంప్రదాయములను తెలుసుకొని, సరియైన మార్గమునందు సాధన చేస్తే, మోక్షమార్గమున త్వరగా ముందడుగు వేయగలుగును.

కొన్ని విధములైన పాపములు అనుభవిస్తేనే కాని నశించవు. మరికొన్ని విధములైన పాపములు ప్రాయశ్చిత్తాదులవలన, పుణ్యకర్మల వలన, ఉపాసనలవలన శాంతిస్తాయి. పుణ్యములలో రెండు రకములున్నాయి. ఒకటి కేవలము ఐశ్వర్యప్రదములు, భోగప్రదములు,

పుణ్యలోకప్రదములు. ఇవన్నీ కూడా సకామపుణ్యకర్మలు.

రెండవ రకము పుణ్యకర్మలు చిత్తమాలిన్యమును తొలగించి, రాగద్వేషములను పోగొట్టి, చిత్తశుద్ధిని కలిగించి, బ్రహ్మవిచారమునకు అధికారము కల్పించుచున్నవి. కనుక ఇట్టి నిష్కామ పుణ్యకర్మానుష్ఠానము మిక్కిలి బలమైన సంస్కారమును కలిగించును.

పరమేశ్వరుని యందున్న భక్తిభావన, బ్రహ్మవిచారము, ఆత్మ విచారము వలన కలిగిన సంస్కారములు, సమస్త పాపసంస్కారములను పోగొట్టుటయే కాక, మనోవృత్తులను లయము చేయగల శక్తిని కలిగి ఉంటాయి. అందుచేత నిష్కామపుణ్యకర్మానుష్ఠానము కంటెను భగవద్భక్తి భావ సాధన మరియు బ్రహ్మవిచారణ లేక ఆత్మ విచారణ అనునవి ఉత్కృష్టమైన సాధనలు.

"ప్రయత్నాద్యత మానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః"

గీత 6వ అధ్యాయం, 45వ శ్లోకం

అను గీతా వచనము చే ప్రయత్నపూర్వకముగా సాధనచేయుచున్న యోగి సర్వపాపములను పోగొట్టుకొని, శుద్ధత్వమును పొందినవాడగును. కాబట్టి భక్తి యోగము చేత, బ్రహ్మ విచారము చేత, కర్మయోగముచేత కూడ ఇదే విధముగా సర్వపాపప్రణాశనము జరుగునని వేరే చెప్పనక్కరలేదు కదా!

ఈ విధముగా జ్ఞానమార్గము ద్వారా జీవితపరమార్థమగు మోక్షమును పొందవచ్చునని, ఈ జన్మలో కొంత సాధన చేసి ఏ కారణము చేతనైన అది కొనసాగించలేక ఆ జీవుడు మధ్యలో తనువుచాలించినచో మరుజన్మలో కూడా అతను పూర్వ వాసనా బలముచే తన సాధనను కొనసాగించునని శ్రీకృష్ణపరమాత్మ గీతాబోధ ద్వారా తెలియుచున్నది. ఇట్లే నిష్కామకర్మ యోగులు, భక్తి యోగులు, బ్రహ్మ విచారణాపరులు కూడా చేసిన సాధన వృథాకాదని విద్యారణ్యస్వామి మొదలగు వారి అభిప్రాయము ప్రకారము తెలుపబడినది.

యోగ మార్గము ద్వారా జీవిత పరమార్థము నెట్లు పొందవచ్చునో తరువాతి ప్రకరణములో తెలుపబడుచున్నది.

# పంచమ అధ్యాయము

## యోగమార్గము

**విషయము:-** చిత్తవృత్తి నిరోధమే యోగమని పతంజలి మహర్షి "యోగదర్శనము" నందు చెప్పబడినది. స్వస్వరూపజ్ఞానము వలన చిత్తవృత్తులు లయము నొంది సమాధి స్థితి కలుగుట, ప్రాణాయామ మార్గము ద్వారా చిత్త శాంతి కలిగి సమాధిస్థితిని పొందుటను గురించి అందుకల సూక్ష్మమైన భేదములను గురించి ఈ అధ్యాయమునందు చర్చించబడినది. యోగము అనగా నేమి ? యోగమార్గమున జీవిత పరమార్థమగు మోక్షమును పొందుట ఎట్లు? అష్టాంగ యోగసాధన, ప్రాణాయామము, యోగ ఆసనములు మొదలగునవి.

# యోగమార్గము

యోగము అను పదము "యుజ్" (Yuj) అను ధాతువు నుండి ఏర్పడుచున్నది. ధాతు పాఠములలో "యుజజ్" "సమాధౌ!" అని ఉన్నది. ఈ ధాతువు యొక్క ప్రకృతి "యుజజ్" దాని బీజము "యుజ్". అనగా సమాధి యందు ఉండుట లేక ప్రవేశించుట అని అర్థము. యోగదర్శనము యొక్క వ్యాస భాష్యము నందు ఈ అర్థములోనే యోగ శబ్దమును ఉపయోగిస్తారు. ఇది నాలుగవ వర్గమైన "దివా"దులలోని ధాతువు.

ధాతుపాఠములో "యుజిర్ష్" అనే మరో ప్రకృతి ఉన్నది. "యుజిర్ష్ యోగే" అని ధాతు పాఠము. ఈ ప్రకృతికి కూడా బీజము యుజ్. ఇది ఏడవ వర్గములోని "రుధా"ది గణములోనిది. దివాదులలో పఠించినప్పుడు యుజ్యతే, యుజ్యేతే, యుజ్యంతే అని లట్ ప్రథమ పురుషరూపములో వస్తాయి. రుధాదులలో పఠించినప్పుడు యుంక్తే, యుంజాతే, యుంజతే అని లట్ రూపములు వచ్చును. భగవద్గీతలో "యోగీయుంజీత సతత మాత్మానం రహసిస్థితః" అని చెప్పబడినది.

"యోగి ఒంటరిగా ఉండి ఎల్లప్పుడు ఆత్మను యోగమార్గమున సాధనచే పొందవలెను" అని అర్థము. ఇక్కడ "యుంజీత" అనునది ఏడవ వర్గమైన రుధాది గణములోని విధిలి జ్ రూపము.

**యుంజీతా - యుంజీయతాన్ - యుంజీరన్.**

అందుచే గీతలో చెప్పిన యుంజీత అనురూపము కావున యుజ్ ధాతువు నుండి వచ్చిన యోగ అను పదము ఏడవగణమైన రుధాదులలో పఠించబడిన ధాతువునకు సంబంధించినవి.

యుజిర్ష్ = యోగే అని పాణిని ధాతుపాఠము కదా!

ఈ యుజ్ ధాతువు రుధాదులలోని ఉభయపది అగుటచే దీనికి ఆత్మనే పది రూపములు కూడా ఉంటాయి.

యునక్తి - యుంక్తః -యుంజంతీ అని 'లట్' ప్రథమ పురుషరూపములు.

ఈ యుజ్ ధాతువునకు కలుపుట, తగిలించుట, ఐక్యము చేయుట

(To join, to attach, to unite) అని అర్థములు ఉన్నవి. సంయోగము అనగా "కలియుట" లేక "కలుపుట" అనీ వియోగము అనగా విడిపోవుట అను అర్థములో వాడబడుచున్నవి. అందుచే యోగ శబ్దమునకు భగవంతునితో సంయోగము కలుగచేయునది అను అర్థము చెప్పవలెను. భగవద్గీత 6వ అధ్యాయములో "తం విద్యా, దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞతం" అని వున్నది. అనగా "యోగము" అని పేరు గల ఆ విద్య దు:ఖముతో సంయోగము కలుగుకుండా విడదీయునది అని అర్థము.

ఈ యోగ శాస్త్రము అన్ని సంప్రదాయముల వారికి, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతులకు, మంత్ర, తంత్ర, శాస్త్రజ్ఞులకు అందరికీ సమాదరణీయమే కాక ప్రమాణభూతమైన గ్రంథము.

"యోగదర్శనము" అను పేరుతో పతంజలి విరచితములగు యోగసూత్రములను ఆధారముగా చేసుకొని యోగమార్గమున జీవిత పరమార్థమగు మోక్షమును పొందు విధానమును గూర్చి ఈ యోగ ప్రకరణమునందు ప్రధానముగా వివరింపబడినది. "అథ యోగాను శాసనమ్" అను మొదటి సూత్రముతో యోగదర్శనము ప్రారంభమవుతుంది. "యోగశ్చిత్త వృత్తి నిరోధః" అను రెండవ సూత్రము యోగము అను పదమును నిర్వచిస్తుంది.

చిత్తవృత్తులను నిరోధించుటయే యోగము అని పతంజలి మహర్షి నిర్వచనము. ఈ చిత్త వృత్తులను సంపూర్ణముగా నిరోధించినందువలన "సమాధి" కలుగుతుందని చెపుతారు. ఈ 'సమాధి' సిద్ధించుటకు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానసమాధులు అను ఎనిమిది (8) మెట్లు కలిగిన అష్టాంగ యోగమార్గమును పతంజలి మహర్షి వివరించెను. యోగదర్శనములోని మూడవసూత్రము -

**"తదాద్రష్టు : స్వరూపే అవస్థానమ్"**

తదా = అపుడు ; ద్రష్టుః = ద్రష్టకు (షష్ఠీ విభక్తి), స్వరూపే = స్వరూపమునందు, అవస్థానమ్ = ప్రవేశించుట లేక ఉండుట ; (భవతి = కలుగును).

"అప్పుడు (అనగా చిత్తవృత్తులను పరిపూర్ణముగా నిరోధించినప్పుడు) ద్రష్ట తన యథార్థ స్వరూపము నందునిలుచుట సంభవించును".

ఈ సూత్రమునకు వేరు వేరు సంప్రదాయముల వారు వేరు వేరు విధములుగా వ్యాఖ్యానిస్తారు.

ఈ సూత్రమునకు అద్వైత వేదాంతులు చెప్పు అర్థము -

తదా - అప్పుడు అనగా చిత్తవృత్తి యొక్క ఆత్యంతిక నిరోధము కలిగినపుడు అనగా మనస్సు నిస్సంకల్పమైనపుడు, సకల వాసనాక్షయ మైనపుడు,

ద్రష్టుః - ద్రష్టకు అనగా యోగసాధకునికి ;

స్వరూపే - స్వ స్వరూప స్థితి యందు అనగా ఆత్మ యొక్క యథార్థ స్థితి యందు

అవస్థానమ్ - ఉండుట, భవతి = కలుగుచున్నది.

నవీన కాలంలో పతంజలి యోగ సూత్రములను వివరిస్తూ 'వివేకానందస్వామి ఇచ్చిన ఉపన్యాసములను రామకృష్ణమఠం వారు ప్రచురించారు.

20 వ శతాబ్దంలో పతంజలి యోగసూత్రములపైనా, రాజయోగము అను పేరుతో ప్రకటింపబడిన గ్రంథములు అన్నీ కూడా ఏదో ఒక విధముగా వివేకానందస్వామి ఉపన్యాసములపై ఆధారపడియున్నవే. పతంజలి యోగ సూత్రములపై ప్రాచీనమైన, వ్యాసకృతమని చెప్పబడు భాష్యము ఒకటి కలదు. బ్రహ్మశ్రీ వేదమూర్తులైన వేలూరు శివరామశాస్త్రి గారు కూడా పతంజలి యోగ సూత్రములపై పరిశోధనాత్మకమైన వ్యాసములు వ్రాసి చాలా కాలము క్రితము భారతి పత్రికలో ప్రకటించారు.

యమ, నియమములు అని ఇక్కడ చెప్పబడినవి భగవద్గీతలో చెప్పబడిన ఆత్మగుణములే. అంతరింద్రియ నిగ్రహము, బాహ్యేంద్రియ నిగ్రహము వీనిలోనివే. (1) అహింస, (2) సత్యము, (3) ఆస్తేయము (దొంగతనము చేయకుండుట) (4) బ్రహ్మచర్యము (5) అపరిగ్రహము (దానము గ్రహింపకుండుట) - వీనిని యమములు అని అంటారు. ఇవి

వ్రతములలో కెల్ల మహావ్రతములని పతంజలి మహర్షి చెప్పెను. వీనికి జాతి, దేశ, కాల, సమయముల వలన భంగము కలుగదని, అన్ని జాతుల వారు, అన్ని మతముల వారు, అన్ని దేశములలోను ఎల్లప్పుడు అనుసరించవలసిన మహావ్రతములని పతంజలి చెప్పెను. మహాఫలమును ఇచ్చునవి కనుక ఇవి మహావ్రతములని చెప్పవచ్చును.

శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అనునవి నియమములు.

ఈ యమ నియమములు భారతీయములైన సర్వ మతములందును పూర్వాంగములుగా పేర్కొనబడియే ఉన్నవి. బౌద్ధమతములో కూడా వీనిని సంయగ్దృష్టి, సమ్యక్ సంకల్పము, సమ్యక్ వచనము అనే ప్రజ్ఞాంగములుగను, సమ్యక్ కర్మాన్త, సమ్యక్ ఆ జీవికా అనే శీలాంగములుగను, సమ్యక్ వ్యాయామ, సమ్యక్ స్మృతి, సమ్యగ్సమాధి అను సమాధి అంగములుగను పేర్కొనబడినవి. వీటన్నింటిని కలిపి బౌద్ధులు "అష్టాంగికమార్గము" అన్నారు. ఇదే విధంగా జైనాది అన్ని భారతీయ మతములందును ఈ యమ నియమములు పేర్కొనబడియే ఉన్నాయి.

యోగదర్శనము భారతదేశములోని అన్ని సాంప్రదాయముల వారిని ఏదో ఒక రూపములో ప్రభావితము చేసింది. యోగులలో హఠయోగులు అని చెప్పబడేవారు కొందరున్నారు. వీరు శరీరమును, ప్రాణము... ముఖ్యసాధనములుగా స్వీకరించి మోక్షమును పొందవచ్చునని భావిస్తారు. నేతి ధౌతి, వస్తి, నౌళి, త్రాటకము, కపాలభాతి మొదలగు యోగక్రియల చేత శరీరమును శుద్ధము చేయవలెనని భావిస్తారు. వివిధ రకములైన ఆసనములను వేసి శరరీమును రోగరహితముగా చేస్తారు. కుంభక ప్రాణాయామమును అభ్యసించి, దాని వలన సమాధిని పొందవచ్చునని అంటారు (వాదిస్తారు). ఈ హఠయోగమునకు యోగదర్శనములోని "స్థిర సుఖమాసనమ్" అను సూత్రము, "ప్రచ్ఛర్ధన విదారాణాభ్యాంవాప్రాణ స్య" 'అనే సూత్రము ముఖ్యమైన ఆధారములు.

"స్థిర సుఖమాసనమ్" అనగా యోగి దేని యందు స్థిరముగాను, సుఖముగాను చాలాకాలము ఉండగలుగునో అదియే "ఆసనము" అని

అర్థము. సుఖముగా నుండుట యనగా కండరములకు పీడనా రూపమైన దుఃఖము కలుగరాదు. వీలైనంత విశ్రాంతిగా ( relaxed) ఉండాలి. స్థిరముగా ఉండుట యనగా కంపనములు లేకుండుట. కాని, హఠయోగులు ఎన్నో రకములైన ఆసనములను గురించి, పరిశోధించి వ్యాయామశాస్త్రము వంటిది తయారు చేసారు. మొత్తము సృష్టిలో 84 లక్షల జీవరాసులున్నవని, ప్రతి జీవి ఒక ఆసనములో స్థిరముగాను, సుఖముగాను ఉంటుందని, అందుచేత మొత్తం 84 లక్షల ఆసనాలు ఉంటాయనీ, అందులో 84 ఆసనములు ముఖ్యమైనవనీ చెపుతారు.

మాయూరాసనము, కుక్కుటాసనము మొదలైనవి జంతువుల పేర్ల మీద వచ్చిన ఆసనములు. అర్థమత్స్యేంద్రాసనము, మత్స్యేంద్ర ఆసనము మొదలైనవి మత్స్యేంద్ర నాథుడను సిద్ధుని పేరుమీద వచ్చినవి. శీర్షాసనము అనగా శిరస్సు భూమిపై పెట్టి తలక్రిందులుగా చేయునది. చక్రము వలె వెనుకకు వంగుటకు వచ్చునది చక్రాసనము. శలభాసనము, భుజంగాసనము కూడా జంతువుల పేర్లపై వచ్చినవే. మహావీరాసనము ఆంజనేయస్వామి పేర వచ్చినది. మహావీరుడు అనగా ఆంజనేయుడు. సంజీవి పర్వతమును తీసుకువెళ్ళుచున్నప్పుడు ఆయన మహావీరాసనము పై ఉన్నట్లు చిత్రపటములలో చూడవచ్చును. కాలి మడమలు రెండూ తొడపైన ఉంచినపుడు పద్మపు రేకుల వలె కనబడు ఆసనమునకు పద్మాసనమని పేరు. ఈవిధముగా అనేక ఆసనములకు పేర్లు పెట్టబడినవి వాయువును పశ్చిమాభిముఖము చేయు ఆసనమును పశ్చిమొత్తాన ఆసనము అంటారు. ఇట్లు వాయువును. పశ్చిమాభిముఖము చేయు విధానము ప్రాణాయామ సిద్ధులకు తెలియును.

ఒక్కొక్క ఆసనములో స్థిరముగా మూడు గంటలు ఉండగలిగితే ఆసనసిద్ధి అయినట్లు లెక్క. ఆ ఆసనములకు "హఠయోగ ప్రదీపిక" మొదలైన గ్రంథముల యందు ఎన్నో ఫలితములను చెప్పారు. ఉదాహరణకు శీర్షాసనము వలన జుట్టు నల్లబడుతుందని, శరీరము ముడతలు పడకుండా ఉంటుందని (వలపలిత విరహితాంగులు అవుతారని) వ్రాయబడి ఉంది. తగిన గురువు సమక్షంలోను, వైద్యుల సలహా మేరకు ఈ ఆసనములు చేయుట వలన సరైన ఫలితములు కలిగి మేలు చేయును. ఎందుచేతననగా హ్రస్వదృష్టి, రక్తపోటు, హృదయ రోగములు ఉన్నవారు ఈ శీర్ష ఆసనములను

వేయరాదు. కపాలము పై భాగము యొక్క మందము అందరికీ సమానముగా ఉండదు. కొందరికి మాడు భాగము పలుచగా ఉంటుంది. కాబట్టి శీర్షాసనము అనేకమందికి సత్ఫలితములనిచ్చినా మరికొందరికి హాని కలిగించవచ్చును. ఒక వేళ శీర్షాసనము వేసినపుడు తలనొప్పి కనుక వస్తే వెంటనే ఆ ఆసనము వేయుట మానివేయవలెను. అదే విధముగా గర్భిణీ స్త్రీలు అనేక ఆసనములు వేయుట నిషిద్ధము.

ఈ ఆసనముల వలన 'స్పాండిలైటిస్ ( Spondylities) వంటి వ్యాధులు నివారించబడుతాయను మాట కూడా సత్యమే. కాని సరిగ్గా తెలుసుకొని, వైద్యుల సలహా మేరకు, శరీర స్థితిని అనుసరించి మాత్రమే ఆసనములను వేసినచో అవి శరీర దారుఢ్యమును కలిగించి రోగములను నివారించగలుగును. కావున తగిన జాగ్రత్తలు తీసుకొని ఆ ఆసనములు వేయవలెను.

**తతో ద్వంద్వానభిఘాతః**

**సాధన పాదము 47వ సూత్రము**

ఆసన సిద్ధి వలన శీతోష్ణాది ద్వంద్వముల వలన దెబ్బ తినకుండా ఉండే దృఢమైన శరీరము లభించును.

**"తస్మిన్ సతి శ్వాసప్రశ్వాస యోగతి విచ్ఛేదః ప్రాణాయామః"**

48వ సూత్రము

తస్మిన్ సతి = ఆసనసిద్ధి అయిన తరువాత, అనగా ఆసనమునందు స్థిరముగా ఉండుట జరిగిన తరువాత

శ్వాస ప్రశ్వాసయోః = ఉచ్ఛ్వాస నిశ్వాసల యొక్క

గతి విచ్ఛేధః = మార్గమును అడ్డగించుటను

ప్రాణాయామః = ప్రాణాయామము అని అంటారు.

సమాధిపాదములోని 34వ సూత్రములో పతంజలి మహర్షి ప్రాణాయామమును గురించి ప్రస్తావించెను.

**ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వాప్రాణస్య**
**సమాధి పాదము 34వ సూత్రము.**

ప్రచ్ఛర్దన విధారణాభ్యాం = ముక్కు ద్వారా బయటకు గాలిని విడిచిపెట్టుట, మరియు బిగబట్టుట అను రెండింటి వలన, వా = లేక; ప్రాణస్య = శరీరములోని వాయువును ఆ విధముగా విడిచిపెట్టుట లేక నిలబెట్టుట వలన కాని అని అర్థము.

అనగా నాసికాపుటముల ద్వారా ప్రయత్న పూర్వకముగా గాలిని బయటకు విడిచి, మరల పీల్చకుండా నిలబెట్టుట వలనకాని, లేక గాలిని లోపలికి పీల్చి బయటకు విడవకుండా లోపలనే బిగబట్టుట వలనకాని అని అర్థము.

ప్రచ్ఛర్దనము అనగా లోపల ఉన్న గాలిని ప్రయత్న పూర్వకముగా వమనము చేయుట, విధారణము అనగా విశేషముగా ధరించుట.

పై రెండు సూత్రములలో ప్రాణాయామము గురించి పతంజలి ప్రత్యేకముగా వివరించారు. తరువాతి కాలంలో వచ్చిన "హఠయోగ ప్రదీపకాది గ్రంథములలో ప్రాణాయామమును గురించి చాల విశేషముగా వర్ణించటం జరిగింది.

సాధన పాదము 50వ సూత్రములో

**బాహ్యాంభ్యంతర స్తంభవృత్తిః దేశకాల సంఖ్యాభిః**
**పరిదృష్టో దీర్ఘ సూక్ష్మః** అని చెప్పారు.

ఈ ప్రాణాయామము బాహ్యావృత్తి అని, అభ్యంతరవృత్తియని, స్తంభవృత్తి యని మూడు విధములుగా ఉంటుంది. మరియు దేశకాల సంఖ్యాదులచే దీర్ఘము అనగా (పొడవుగాను) సూక్ష్మము అనగా (హ్రస్వముగా) ఉంటుందని చెప్పారు. ఈ సూత్రములోని బాహ్య వృత్తినే రేచకము అని అంటారు. అనగా లోపలి గాలిని వెలుపలకు వదులుట. అభ్యంతరవృత్తిని "పూరకము" అని అంటారు. బయట గాలిని లోనికి పీల్చుకొనుట. స్తంభవృత్తిని కుంభకము అని అంటారు. కుంభకము రెండు విధములు. పూర్ణకుంభకము అనగా గాలిని పీల్చి వదిలిపెట్టకుండా బిగపట్టుట. శూన్య కుంభకము అనగా గాలిని వదిలిపెట్టి పీల్చకుండా బిగపట్టుట.

ఈ ప్రాణాయామములు చేయుటవలనప్రాణ శక్తి శరీరమందంతటా ప్రవహిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రాణాయామము చేసే యోగి ప్రాణశక్తిని శరీరములోని ఏ భాగమునకైనా నడిపించగలడు. అక్కడ కొంత కాలము నిలబెట్టగలడు. ఒక శరీర భాగము నుండి మరియొక శరీర భాగమునకు ప్రాణశక్తిని ప్రవహింపచేయగలడు. శరీరములో ఏదైనా ఒక భాగము రోగగ్రస్తమై అస్వస్థతగా ఉంటే అక్కడికి ప్రాణ శక్తిని ప్రవహింపచేస్తే స్వస్థత కలుగుతుంది. అందుచేతనే "దేశకాలపూర్వభిః" అని పతంజలి మహర్షి చెప్పినప్పుడు దేశము అనగా శరీరములోని ప్రాణశక్తిని ధారణ చేయవలసిన భాగము. కాలము అనగా ఆ ప్రదేశములో ప్రాణశక్తిని ఎంత కాలము ఉంచవలయునో అంతకాలమే ఉంచుట (అంతే కాని కాలమనగా ఉదయము సాయంకాలము సమయము తెలుపుట కాదు).

దీర్ఘము, సూక్ష్మము అనగా ఈ రేచక, పూరక, కుంభకాదులను మంత్రభేదముచే ఎక్కువ కాలములేక తక్కువ కాలము చేయుట. పూర్వులు ప్రాణాయామము అభ్యాసము చేయునపుడు గడియారము సహాయము లేకుండానే చేసేవారు. ఓంకారాది మంత్రముల సహాయముతో మాత్రలను లెక్కించేవారు. ఉదాహరణకు నాలుగు పర్యాయములు మంత్రమును ఉచ్ఛరించుచు పూరకమును చేసి, పదహారు పర్యాయములు మంత్రమును ఉచ్ఛరించుచు కుంభకమును చేసి ఎనిమిది పర్యాయములు మంత్రమును ఉచ్ఛరించుచు రేచకమును చేసేవారు.

కుడిముక్కునకు ఇడానాడి లేక సూర్యనాడితో సంబంధము ఉండును. ఎడమముక్కునకు పింగళనాడి లేక చంద్రనాడితో సంబంధము ఉండును. ప్రాణాయామము చేయువారు కుడి ముక్కుతో గాలిని లోనికి పీల్చి, కుంభకము చేసి, ఎడమముక్కుతో వదిలి పెడతారు. ఈ ఇడ, పింగళ అను నాడులు వెన్నెముక చివరి భాగము నుండి కపాలము వరకు వ్యాపించియున్నవని చెప్తారు. ఈ నాడులకు మధ్య సుషుమ్నానాడి ఉంటుంది.

పతంజలి మహర్షి ప్రాణాయామమును గురించి పై మూడు సూత్రములు మాత్రమే చెప్పెను. కాని ఇడ, పింగళ, సుషుమ్న నాడులను గురించి, షట్చక్రములను గురించి, కుండలినీ జాగరణను గురించి

ప్రస్తావించి యుండలేదు. హఠయోగ ప్రదీపికాది గ్రంథములలోను, అమృతనాద ఉపనిషత్తు మొదలైన యోగ ఉపనిషత్తులందు ఈ ప్రాణాయామమును గురించి బాగుగా చెప్పబడినది. అనేక ఇతర యోగ ఉపనిషత్తులయందు, శాక్త ఉపనిషత్తులయుందు, శంకరులు వ్రాసిన సౌందర్యలహరి యందు కుండలినీ విద్యను గురించి, షట్చక్రములను గురించి వివరించబడి యున్నది. కాని ఇవన్నీయు పతంజలి యోగదర్శనము నందు లేవు. ప్రాణాయామములు అనేక విధములుగా విస్తరించి హఠయోగులచే పరిశోధింపబడినవి. అందులో మొదటిది కుంభకము లేకుండా గాలిని పీల్చి వదలుట (కుడి ముక్కునుండి పీల్చి ఎడమ ముక్కు నుండి వదులుట, మరల ఎడమ ముక్కు నుండి పీల్చి కుడి ముక్కు నుండి వదులుట). దీనిని నాడీ శుద్ధి ప్రాణాయామము అని అంటారు. ఇతర ప్రాణాయామములు చేయుటకు ముందు కనీసము ఆరు మాసములు ఈ ప్రాణాయామమును చెయ్యాలి. ఉదయం కనీసం 80 మార్లు, సాయంకాలం 80 పర్యాయములు ఇట్లు చేయవలెనని అంటారు. పూరకము, రేచకము 1:1 నిష్పత్తిలో ఉండాలి. ఆ తరువాత కుంభకమును అభ్యాసము చేయునపుడు కొందరు 2:8:4 నిష్పత్తిలో చేయిస్తారు. అనగా రెండు మాత్రలు పూరకము, ఎనిమిది మాత్రలు కుంభకము, 4 మాత్రలు రేచకము.

మరికొందరు పూరకము, రేచకములను సమానముగా ఉంచెదరు. సాధారణంగా ప్రారంభములో పూర్ణకుంభకమును మాత్రము అభ్యసిస్తారు. తరువాతి దశలో పూర్ణ కుంభకము, శూన్య కుంభకము రెండింటిని కలిపి 4:16:4:8 లేదా 4:16:4:16 ఈ విధమైన నిష్పత్తులలో చేస్తారు. సూర్యభేదిని అనీ, ఉజ్జయిని అనీ, కపాలభూతి, భస్త్రిక, భ్రామరి అని, అనేక రకములైన ప్రాణాయామ విశేషములు ఉన్నవి. ఈ ప్రాణాయామశాస్త్రము బహు విస్తారముగా వ్యాపించినది. కపాలభాతి యను ప్రాణాయామములో నోటితో గాలిని పీల్చి, ముక్కుతో వదులుతారు. కొన్ని ప్రాణాయామములలో నాలుకను సన్నగా మడిచి లోనికి గాలిని పీలుస్తారు. భ్రామరీకుంభకము చేయువారు గాలిని కుంభించి భ్రమరము యొక్క ఝుంకారము వలె వినబడు హ్రీంకారమును ధ్యానము చేస్తారు. రేచకము చేయునపుడు పెద్ద ధ్వనితో దీర్ఘ కాలము హ్రీంకారమును ఉచ్చరిస్తారు. గుహలలో కూచుని

భ్రామరీ కుంభకము చేస్తే ఎంతో దూరము వరకు ఝ్రీంకారము వినపడుతుందిట.

'భస్త్రిక' అనే ప్రాణాయామం కుండలినీ జాగరణమునకు ఎంతో ముఖ్యమైనదని హఠయోగ గ్రంథములందు చెప్పబడినది.

"భస్త్రిక" యందు త్వరత్వరగా గాలిని పీల్చి, వదులుతూ, కొలిమి తిత్తుల వలె గాలిని పీలుస్తూ, వదులుతారు. ఈ విధంగా 80 లేక 100 పర్యాయములు చేసిన తరువాత పూర్ణకుంభకము లేక శూన్య కుంభకము చేస్తారు. భస్త్రిక వలన వెంటనే కొద్ది సేపు నిస్సంకల్ప స్థితి వస్తుంది. ఈ ప్రాణాయామ విశేషములు తెలుసుకొనుటకు యోగ గ్రంథములను పరిశీలించవలెను.

ప్రాణాయామము అభ్యసించు వారు ఆ విద్య పూర్తిగా తెలిసిన యోగిని గురువుగా స్వీకరించి, ఆయన సాన్నిధ్యములో ఉండి నేర్చుకోవాలి. స్వతంత్రముగా నేర్చుకొనుట ( Self instructions), పోస్టు ( Post) ద్వారా నేర్చుకొనుట ( Correspondence) ఈ విద్యను అభ్యసించుట, సాధ్యము కాదు. హిమాలయములలోను, టిబెట్‌లోను నివసించే "లామాలు" అని పిలవబడే బౌద్ధ సన్యాసులలో ఈ ప్రాణాయామ విద్య బాగుగా వ్యాపించియున్నదంటారు.

ప్రాణాయామమును అభ్యసించువారు బ్రహ్మచర్యమును విధిగా పాటించవలసి ఉంటుంది. ప్రాణాయామము చేయువారు ఆహార నియమమును పాటించాలి. ఉప్పు, కారము లేని సాత్త్విక ఆహారమును భుజించాలి. లేని యెడల అనారోగ్యము కలుగును. శుభ్రమైన గాలి లేని, వాతావరణ కాలుష్యము కల ప్రదేశములలో ప్రాణాయామము చేయరాదు. ప్రాణాయామ అభ్యాసమును కూర్చుని ఉన్నప్పుడు మాత్రమే చెయ్యాలి. నడుస్తూ, పడుకుని ఇష్టం వచ్చినట్లు చెయ్యకూడదు.

కుంభక అభ్యాసము చేసినపుడు మూడు స్థితులు వస్తాయని హఠయోగ గ్రంథములలో చెప్పబడినది (1) స్వేదనము (2) కంపనము (3) దర్దురీ వృత్తి ( Darduri).

స్వేదనము అనగా ఒళ్ళంతా చెమట పట్టుట. అయితే ఈ చెమటను

గుడ్డతో తుడిచి వేయకూడదు. దానంతట అదే ఆరిపోవునని ఊరుకొనవలెను. లేకపోతే చేతితో ఒళ్ళంతా రుద్ది చెమట ఆరిపోవునట్లు చెయ్యాలి. ఆ చెమటను గుడ్డతో తుడిచి వేస్తే అనారోగ్యం కలిగి శరీరం క్షీణిస్తుంది.

కంపనము అను స్థితి స్వేదనము తరువాత కలుగును. పద్మాసనముపై కూర్చుండి ప్రాణాయామము చేయువాని శరీర మధ్య భాగము బాగుగా కంపించుటను కంపనము అంటారు.

తరువాతి స్థితి దర్దురి. దర్దురః అనగా కప్ప, మామూలుగా గొంతుకు కూర్చున్నవాడు ఎగురగలడు. కాని పద్మాసనముపై కూచుని ఉన్నవాడు ఎగురలేడు. కాని పద్మాసనముపై కూచుని కుంభక ప్రాణాయామము చేసిన యోగి యొక్క శరీరము ప్రయత్నపూర్వకముగా కప్ప ఎగిరినట్లు గదిలో ఒక చోటి నుండి మరియొక చోటుకి ఏడు, ఎనిమిది అడుగులు ఎగురగలదు. కాని ఇది ఆకాశగమన శక్తి కాదు. కప్ప వలె కొన్ని సెకనుల కాలము వీరు ఇట్లా ఎగురగలుగుటను దర్దురీ వృత్తి లేక "దరుద్రీ" వృత్తి అని అంటారు. ఇది ఆకాశగమన సిద్ధి మాత్రము కాదు.

ప్రాణాయామ సిద్ధులకు తరువాత కలుగు దశ 'ఉత్థానము" అంటారు. అనగా పద్మాసనముపై నుండి కుంభకము చేసిన యోగి శరీరము భూమిపై నుండి కొన్ని అడుగులు పైకి లేచి ఆకాశములో స్థిరముగా కొంత సేపు ఉండుట. ఇట్టి స్థితి చాలా అరుదుగా కలుగును అని అంటారు.

**"మనః ప్రాణముల సమాన ప్రవృత్తి".**

ప్రాణము అంటే శ్వాస కాదు. ప్రాణమనగా జీవశక్తి. ఏ శక్తి లేకపోతే రక్తములోని ఒక్క కణము కూడా జీవించి యున్న దని అనిపించుకొనదో అదే ప్రాణ శక్తి. ఈ ప్రాణశక్తిని స్వాధీనము చేసుకొనుటకు శ్వాసను నియమించుట ఒక ఉపాయము. మనిషి తెలియకుండానే అవసరమైనప్పుడు ఈ ప్రాణాయామము చేస్తూ ఉంటాడు.

బరువులు ఎత్తి, నెత్తిన పెట్టుకొని మోయువారు కూడా అప్రయత్నముగా ప్రాణాయామము చేస్తున్నారని ఒకసారి శ్రీరమణ మహర్షి

అన్నారు. (బరువు ఎత్తేటప్పుడు గాలిని బిగబెట్టి ప్రయత్నించటం చేత ప్రాణాయామము జరుగుతుంది) అదే ప్రాణాయామము.

అన్ని పూజలయందు, సర్వ అనుష్ఠానముల యందు సంకల్పము చెప్పుటకు ముందే "ప్రాణాన్ ఆయమ్య" లేక "వాయుధారణం కృత్వా"... అనగా "ప్రాణాయామము చేసి" అని చెప్పుచున్నారు.

ప్రాణము, మనస్సు అను రెండూ ఒకే స్థానములో పుట్టుచున్నవి అని యోగులు అంటారు.

"శాఖ యోర్ద్వయీ, శక్తిరేకికా" అన్నారు శ్రీరమణ మహర్షి. ప్రాణము, మనస్సు అనునది ఒకే శక్తి యొక్క రెండు శాఖలు. ప్రాణమును నియమిస్తే మనస్సు నియమింపబడుతుంది. మనసును నియమిస్తే ప్రాణము నియమించబడుతుంది. భక్తి, యోగ; జ్ఞానయోగములందు మనసును నియమించుకొని సాదన చేస్తారు. హఠయోగి ప్రాణమును నియమించి తద్వారా చిత్తలయమును పొందగోరును.కేవల హఠయోగులు ఉండుట అరుదు. సాధారణముగా కర్మ, భక్తి, జ్ఞానమార్గములను అభ్యసించువారు, మంత్రానుష్ఠానము చేయు వారు కూడా యథాశక్తిగా ప్రాణాయామము, హఠయోగాభ్యాసము చేస్తూ ఉంటారు. అట్లే హఠయోగులు కూడా కర్మ, భక్తి, జ్ఞాన యోగములు అనుసరిస్తూనే ఉంటారు. అందుచే తెలిసి చేసిన వారికి ఈ యోగములు పరస్పరము సహకారులుగా ఉండును. చిన్న తనములో ప్రారంభించిన ప్రాణామాయ అభ్యాసమును అరువది సంవత్సరముల వరకు కూడా కొనసాగించవచ్చును. కాని వృద్ధాప్యములో ప్రాణాయామము చేయుట కష్టము. 35, 40 సంవత్సరములు దాటిన తరువాత క్రొత్తగా ప్రాణాయామమును అభ్యాసము చేయుటకు శరీర దార్ఢ్యము తగ్గుట చేత అనువుగా ఉండదు.

పూరక, రేచక, కుంభాకాత్మకములైన ప్రాణాయామములు అగర్భము, సగర్భము అని రెండురకములని కొందరంటారు. మంత్రరహితముగా చేసినచో అది అగర్భము. మంత్ర సహితముగా చేస్తే అది సగర్భము. మంత్రముతోపాటు మంత్రార్థమును కూడా భావన చెయ్యాలి.

కుంభక ప్రాణాయామము వలన ఉచ్ఛ్వాస నిశ్వాసలునిరోధింప

బడినప్పుడు చిత్తములయమగుటను యోగులు అనుభవించుచున్నారు. ఈ విధముగా చిత్తలయమగుట వలన కలిగిన స్థితినే సమాధి అంటారు. ఈ సమాధులు సబీజమనీ, నిర్బీజమనీ, సవితర్కమనీ, నిర్వితర్కమనీ, సంప్రజ్ఞాతమనీ, అసంప్రజ్ఞాతమనీ అనేక విధములుగా ఉన్నట్లు యోగదర్శనము చెప్పుచున్నది. ఎక్కువలోతుగా చర్చించకుండా ఇక్కడ ఈ సమాధి స్థితులను గురించి కొన్ని విషయములను స్థూలముగా చెప్పవచ్చును. ఈ కుంభకము శాశ్వత స్థితి కాదు. వాయువును కుంభించిన పిదపకొంత కాలము తరువాత ఏదో ఒక సమయములో గాలిని లోనికి పీల్చక తప్పదు. కుంభకము వలన సమాధి అవస్థ వస్తే, పూరకము వలన మరల జాగ్రదవస్థ వస్తుంది. శాశ్వతమైన జ్ఞాన స్థితి కానందు వలన, కుంభకము వలన వచ్చిన ఈ స్థితి నిద్ర లేక స్వప్నముతో పోల్చవచ్చునని అద్వైతులు అన్నారు.కాని అట్లనుట కూడా న్యాయము కాదు. కుంభక జన్యమైన సమాధి స్థితి తాత్కాలికమే అయినప్పటికీ అది సిద్ధిప్రదమైన స్థితి అగుటచే నిద్ర, స్వప్నముల కంటె భిన్నమైన, గాఢమైన అనుభూతిని కలిగించును.

ఒకడు జాగ్రదవస్థలో బ్రహ్మ విచారముచే బ్రహ్మాత్మైక్య జ్ఞాన నిష్ఠారూపమైన సమాధిని పొందును. మరియొకడు కుంభక ప్రాణాయామము చే చిత్తలయమును పొంది సమాధిని పొందును. ఈ ఇద్దరి సమాధి స్థితుల యందు కల భేదమును పరిశీలించవలెను.

సమాధి అనుభవించు కాలములో జ్ఞానయోగి, హఠయోగి అనుభవము ఒకే విధముగా ఉండునని మనము అంగీకరించినను సమాధి నుండి జాగృతమైన హఠయోగికి పూర్వ మానసిక వాసనలన్నీ యథాతథముగా ఉండును. హఠయోగికి వాసనాక్షయముకాదు. హఠయోగ మార్గములో ప్రాణనిరోధము వలన తాత్కాలికముగా చిత్తలయమగుటయే కాని, శాశ్వత వాసనారాహిత్యము, ఆత్యంతిక దుఃఖ నివృత్తి కలుగవు. ప్రాణాయామ ఫలముగా ఆత్మగుణములు కాని, ఈశ్వరుని యందు భక్తి భావం కాని, సర్వ భూత సమత్వము కాని కలుగవు. అంతేకాక జనాకర్షణ, రోగ నివారణా శక్తి మొదలైన కొన్ని సిద్ధులు లభించుట వలన ఆధ్యాత్మిక పురోభివృద్ధి కష్టమగును.

అయితే సగర్భ ప్రాణాయామము చేయుచున్నటువంటి వారు మంత్రార్థమును మననము చేస్తూ కుంభకము చేస్తే మరల పూరక రేచకములు చేయునపుడు కూడా ఆ మంత్రముతోనే చేయుదురు. ఇతర సమయములలో కూడా మంత్రజపము, తదర్ధభావన చేయుచుందురు. దీని వలన దేవతానుగ్రహము, సత్త్వ గుణ సంపత్తి, దేవతాభక్తి మొదలగునవి సిద్ధిస్తాయి. ఇట్టివారు కేవలము "హఠయోగులు" కారు. బ్రహ్మ విచారమార్గముచే సమాధిని అభ్యసించిన వారికి సమస్తమైన వాసనలు నశించి, ఆత్యంతిక దు:ఖనివృత్తి కలుగును. అట్టి స్థితిని పొందిన వారు మరల సంసార సాగరమున ప్రవేశించరు.

అయితే కుంభక ప్రాణాయామము వలనకలుగు సమాధి వ్యర్థము అనుభావన సరైనది కాదు. బ్రహ్మ జిజ్ఞాస చేయు సామాన్యసాధకుడికి జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు అవస్థలను గురించి మాత్రమే తెలిసి ఉంటాయి. తురీయావస్థను గురించి శాస్త్ర జ్ఞానము తప్ప అనుభవ జ్ఞానము ఉండదు. ప్రత్యేకముగా మంత్రోపాసనాదులు చేస్తే దేవతాదర్శనాదులు, తజ్జనిత సంరక్షణ ఉండి సాంసారిక జీవనములో కలిగే ఒడుదుడుకులకు తట్టుకోగలిగి ఉంటాడు. ఆ ఉపాసనకూడా లేకపోతే కేవలము ప్రబలమైన విశ్వాసముతో బ్రహ్మ విచారము చేయవలెను. భగవంతుడు అట్టి వారికి కూడా రక్షణకల్పించి దరికి చేర్చును. కుంభక ప్రాణాయామ సిద్ధునకు జాగ్రత్స్వప్న సుషుప్తులే కాక తురీయము అని చెప్పబడే సమాధి స్థితి అనుభవ పూర్వకముగా తెలిసి ఉంటుంది. అందుచే బ్రహ్మ విచారణ సులభము అవుతుంది. యదార్థమునకు కర్మయోగి, భక్తుడు, హఠయోగి..... వీరందరూ బ్రహ్మజ్ఞానమార్గమున ఉత్తమాధికారులై ప్రకాశిస్తారు. సామాన్య సాధకునకు ఎంతోకాలమునకు గాని కలుగని జ్ఞాన సిద్ధి, బ్రహ్మ విచారణ చేసే హఠయోగికి ఆసిద్ధిత్వరగా కలుగుతుంది. అంతేకాక నా zయ మాత్మా బలహీనేన లభ్యః" శ్రుతి.

"బలహీనులైన వారి చేత ఈ ఆత్మ పొందబడదు" అని ఉపనిషద్వాక్యము. హఠయోగికి దృఢమైన శరీరం ఉంటుంది.

**"అపానే జుహ్వ త్రి ప్రాణం ప్రాణేపానంత థాzపరే**
**ప్రాణాపానగతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః"**

**గీత 4 అ. 29 శ్లో.**

ప్రాణాయామ తత్పరులగు కొందరు ప్రాణాపానముల యొక్క గతులను (మార్గములను) నిరోధించి అపాన వాయువు నందు ప్రాణ వాయువును, ప్రాణవాయువు నందు అపాన వాయువును హోమము చేయుచున్నారు. (పూరక, రేచక, కుంభకములను చేయుచున్నారని భావము.

కనుక ప్రాణా యామము ఒక విధమైన యజ్ఞము వంటిది. అందుచేత దాని వలన గొప్ప పుణ్యము కలుగుతుంది.

కనుక యజ్ఞమువంటిదగు ఈ ప్రాణాయామమును అభ్యసించుట వలన పాపక్షయమై గొప్ప పుణ్యము కలుగునని గీతాచార్యుని బోధ. అందువలన ప్రాణాయామపరుడు బ్రహ్మవిచారణ మార్గమునకు ఉత్తమాధికారి యగును.

"Yoga is the future Religion of Humanity"

"రాబోయే రోజులలో మానవజాతి అనుసరించేమతము యోగమార్గమే' 'నని చాలా మంది పెద్దల అభిప్రాయము.

యోగదర్శనము నందు ప్రత్యేకముగా ఏదేముని పేరూ చెప్పబడలేదు. హిందూ, బౌద్ధ, జైనాది ధర్మముల పేర్లు కాని, అద్వైత, ద్వైత, విశిష్టా ద్వైతాది మతముల పేర్లు కాని, శైవ, వైష్ణవ, శాక్తేయాది శాఖా భేదములు కాని ఏమీ చెప్పబడలేదు. అందుచేతనే యోగదర్శనము సర్వులకు ఉపాదేయమై (అనుసరించదగినది) ఉన్నది.

**"తపస్విభ్యో ఽధికో యోగీ జ్ఞానిభ్యో ఽపి మతోఽధికః**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున"**
**గీత - 6 - 46**

ఓ అర్జునా! యోగి యగువాడు తపస్సులు చేయువారి కంటెను, శాస్త్ర జ్ఞానము కల వారి కంటెను కూడా శ్రేష్ఠుడని తలంపబడుచున్నాడు. కాబట్టి నీవు యోగివి కమ్ము" అని శ్రీకృష్ణుడు అర్జునునికి యోగ వైశిష్ట్యమును గురించి బోధించెను.

కావున శ్రీకృష్ణుని అభిప్రాయము ప్రకారము యోగమార్గము సర్వోత్కృష్టమైనది.

యోగ దర్శనము నాలుగు పాదములుగా అనగా, నాలుగు అధ్యాయములుగా ఉన్నది. ఒకటి సమాధి పాదము. రెండు సాధన పాదము, మూడు విభూతి పాదము. నాలుగు కైవల్య పాదము అని వీటికి పేర్లు.

**"సమాధి సిద్ధిః ఈశ్వర ప్రణిధానాత్"**

**2అ 45వ సూ**

ఇది సాధన పాదములోని 45వ సూత్రము. ఈశ్వర ప్రణిధానము వలన సమాధి సిద్ధించును అని అర్థము. మరల సమాది పాదములో "ఈశ్వర ప్రణిధానాద్వా" అను 23వ సూత్రము కలదు. సమాధి కలుగుటకు ఇతర మార్గములను చెప్పుచు ఈశ్వర ప్రణిధానము వలన కూడా సమాధికలుగునని చెప్పబడినది. ఈ రెండు సూత్రములలోను చెప్పబడిన ప్రణిధానము అను మాటకు "ఈశ్వరునకు ఆత్మ సమర్పణ చేయుట, ప్రపత్తి చేయుట, ఈశ్వరుని యందు మనసు స్థిరముగా నుంచుట, ఈశ్వరుని శరణమును పొందుట మొదలగు మాటలలో అర్థము చెప్పవచ్చును. ఈ రెండు సూత్రముల సారమే భక్తి యోగముగా విరాజిల్లునది.

సాధన పాదములో మొదటి సూత్రము నందు "తపస్స్వాధ్యాయ ఈశ్వర ప్రణి ధానాని క్రియా యోగః" అని చెప్పారు. సాధనకు తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణి ధానములతో కూడిన కర్మయోగమును అవలంబించవలెను' అని ఈ సూత్రమునకు అర్థము.

ఈ "క్రియా యోగః" అన్న పదము కర్మయోగము అన్న అర్థములో ఉపయోగించినట్లు పూర్వులు వ్యాఖ్యానించారు. అయినప్పటికీ నేటి కాలములో క్రియాయోగము అనునది ఒక ప్రత్యేక సాధన మార్గముగా యోగానంద పరమహంసవారి సాంప్రదాయమున ప్రచారము చేయుచున్నారు. యోగి ఆత్మకథ" ( Autobiography of a Yogi) అను సుప్రసిద్ధ గ్రంథకర్త ఈ యోగానందపరమహంసగారే. ఈ సాంప్రదాయములో క్రియా యోగము అనునది ధ్యానముతో కూడిన ఒక ప్రాణాయామ విశేషము. ఈ ప్రాణాయామములు ప్రథమ క్రియ, ద్వితీయ క్రియ, తృతీయ క్రియ, చతుర్థక్రియ అని నాలుగు విధములుగా చెపుతారు.

మహర్షి మహేష్ యోగి గారు ప్రచారము చేయుచున్న భావాతీత ధ్యానము (Transcedental Meditation) అనునది కూడా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో కూడిన ధ్యాన విశేషమే. అందులో కూడా గాలి పీల్చుచూ, వదులుచూ మంత్రముల వంటి పదములు కొన్ని ధ్యానం చేస్తూ వుంటారు. యోగానందుల క్రియాయోగమునకు, మహేష్ యోగి గారి భావాతీత ధ్యానమునకు కొన్ని పోలికలున్నవి.

సుషుమ్నా నాడి కొండనాలుక యొక్క వెనుక భాగము నుండి వెళ్లి మెదడులో ప్రవేశించునని వేదములందు చెప్పబడినది. ఈ శతాబ్దములోని అనేక ధ్యాన సంప్రదాయములలో గాలి పీలుస్తూ, వదులుతూ, శ్వాస జపమూచేయుచూ, ఏదో ఒక రూపములో కొండనాలుక పై భాగమున దృష్టిని కేంద్రీకరించుట చాలా సాంప్రదాయములలో నున్నది. ఈ ధ్యాన మార్గములలోని విశేషములు, నియమములు ఆయా గురువుల వద్ద జాగ్రత్తగా తెలుసుకొని అభ్యసించవలెను.

యోగదర్శనము సాంఖ్యదర్శనముపై ఆధారపడి యున్నది. అయితే సాంఖ్యదర్శనము నందు ఈశ్వరుని గురించి ప్రత్యేకముగా చెప్పబడలేదు. అందుచే సాంఖ్య దర్శనమును నిరీశ్వర దర్శనముగా లిఖించారు. అయితే యోగదర్శనములో ఈశ్వరుని అంగీకరించి, ఆయనకు ప్రణి ధానము చేయుట సమాధి సిద్ధికి మార్గముగా "ఈశ్వర ప్రణి ధానాద్వా" అను సూత్రములో చెప్పబడినది. అందుచే యోగదర్శనమును "సేశ్వర సాంఖ్యము" అన్నారు. (స+ఈశ్వర= సేశ్వర) అనగా ఈశ్వర భావముతో కూడిన సాంఖ్యము అని అన్నారు.

అయితే యోగదర్శనములో చెప్పిన ఈశ్వర భావమునకు, మామూలుగా భాగవతాది పురాణములందు చెప్పిన ఈశ్వర భావమునకు కొంత భేదమున్నది.

సమాధి పాదములోని ఇరువది నాలుగవ సూత్రములో "క్లేశకర్మ విపాకాశయైః అపరామృష్టః పురుష విశేషః ఈశ్వరః" అని చెప్పబడినది. పురుషుడు అనగా జీవుడు. క్లేశము వలన, కర్మ వలన, కర్మ ఫలము వలన, వాసనల వలన స్పృశించబడని విశేషుడైన, శ్రేష్టుడైనన పురుషుడు ఈశ్వరుడు అని నిర్వచించారు.

సాధన పాదములో తరువాతిదగు 26వ సూత్రములో "పూర్వే షామపి గురుః కాలేన అనవచ్ఛేదాత్" అని చెప్పబడినది.

అనగా ఈశ్వరుడు కాలముచేత పరిచ్ఛిన్నుడు కాడు. ( Unconditioned by Time) అనగా ఒకప్పుడు వుండి, మరియొకప్పుడు ఉండని వాడుకాడు, అనగా త్రికాలములందును ఉండువాడు ఈశ్వరుడు. అట్టి ఈశ్వరుడు మనకు, పూర్వులైన మహాపురుషులందరికీ కూడా గురువు. ఇక్కడ రెండు ముఖ్యమైన భావములున్నవి. మొదటి భావము ఈశ్వరతత్వము ప్రధానముగా గురుతత్వము. జీవులకు జ్ఞాన బోధ కలుగచేసి, వారికి ఆత్మజ్ఞానమును కలిగించి, తనంత వానిగా గురురూపుడగు ఈశ్వరుడు చేయును. అందుచేతనే లలితా సహస్ర నామముల యందు గురుమూర్తిః, గుణనిధిః అను రెండు పుంలింగ నామములు చెప్పబడినవి.

గురుమూర్తయేనమః, గుణనిధ యేనమః అని నామములను చదువుకొనవలెను. ఇక్కడ చెప్పినటువంటి గురుమూర్తి యోగదర్శనములో చెప్పబడిన "పూర్వేషామపి గురుః" అను సూత్రముతో సమన్వయము చేయవలెను. రెండవ ముఖ్య విషయము - యోగులు పరమగురురూపములో ఈశ్వరుని భావించి ధ్యానిస్తారు. గురువును సమస్త దేవతాత్మకుడుగా భావించి, అన్ని విధములైనటువంటి మంత్రముల తోను, సహస్రనామములతోను, ఆ గురు విగ్రహమునకు, గురువునకు పూజలు చేయవచ్చును (చేస్తారు). ఉదాహరణకు కొందరు భక్తులు శ్రీరామకృష్ణ పరమహంస గారిని కాళికాదేవిగా భావించి, ఆయన విగ్రహమునకో, పటమునకో కాళికానామములతో లేక మంత్రములతో నమస్కారము, పూజలు చేస్తారు. దేవతానుగ్రహము పొందటానికి ఇది సులభమైన మార్గమని భావన. అలాగే సాయిబాబాను కూడా శివ, విష్ణు, సహస్రనామాదులతో చాలా మంది పూజిస్తారు.

కావున గురుతత్వము యొక్క ఉపాసనము యోగదర్శనము గట్టిగా సమర్థించుచున్నది. "శిఖ్" మతమంతా ఈ విధముగా గురువులను ఉపాసించుటపైననే ఆధారపడియున్నది.

తరువాత కాలములో యోగదర్శనమును ఉపయోగించుకొనిన ఇతర మత సాంప్రదాయముల వారు ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు

"ఈశ్వరుని గురించిన నిర్వచనములోని భేదమును", పతంజలి అభిప్రాయమును పట్టించుకోలేదు. పతంజలి చెప్పిన ఆదిగురు రూపమైన ఈశ్వరుడు, సృష్టి స్థితి లయములు చేయు ఉపాస్యదైవమగు ఈశ్వరుడు ఒకరేనన్న భావము లోకములో ప్రచారమై అందరూ అట్లే భావించుచున్నారు. అందుచే భక్తి మార్గములోని వారికి, జ్ఞాన మార్గములోని వారికి, అందరికీ యోగమార్గము అంగీకారమైనది.

సమాధి పాదములో 27వ సూత్రము "తస్య వాచకః ప్రణవ:" " ఆ ఈశ్వరుని గురించి చెప్పునట్టి నామము ప్రణవమై యున్నది. తరువాత సూత్రములో "తజ్జపః తదర్థ భావనమ్" అని ఉన్నది. అనగా ఆ ప్రణవ మంత్రమును జపించుట, ఆ మంత్రార్థమును మరల మరల చింతనము చేయుట, ఈశ్వర ప్రణిధానరూపమైన సాధనయై సమాధిని కలుగచేయు చున్నది.

ఈ రెండు సూత్రములను మంత్రయోగమును అభ్యసించువారు ప్రమాణముగా గ్రహింతురు. ఓంకారమునుండి నిఖిల మంత్రములు ఉద్భవించుచున్నవికదా! అట్లే నామస్మరణము ప్రచారము చేయు భక్తి యోగులు కూడా ఈ సూత్రమునే ప్రమాణముగా గ్రహించెదరు.

విభూతి పాదములో 'సంయమము' అనగా ఏమిటో వివరించబడినది. ధారణధ్యాన సమాధులు ఒకే విషయముపై చేసినప్పుడు అది "సంయమము' ' అవుతుంది. (త్రయమేకత్ర సంయమః). ఈ సంయమములో కొంత కాలము ధారణ, ఆ తరువాత కొంత కాలము ధ్యానము. అటు తరువాత ఎప్పుడో సమాధి వచ్చునని భావించరాదు. ఒక ధ్యానము వలన సమాధి అనుభవము కలిగిన యోగికి, ఇతర ధ్యానములలో కూడా వెంటనే సమాధి కలుగును. అందుచే ధారణ, ధ్యాన సమాధులు సిద్ధపురుషునకు వెంట వెంటనే జరిగి సంయమ సిద్ధి కలుగును. ఈ సంయమాల వలన అనేక సిద్ధులుకలుగునని పతంజలి యోగదర్శనము నందు చెప్పబడినది.

వీటిలో "ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్" అని విభూతి పాదములో 19వ సూత్రములో చెప్పబడినది. ఇతరుల యొక్క ప్రత్యయము మీద సంయమము చేయుట వలన వారి చిత్త జ్ఞానము కలుగును. ఇక్కడ ప్రత్యయము అనగా చిత్తవృతులను తెలుపునట్టి వారి ముఖకవళికలు,

రూప లక్షణాదులు. యోగి ఒక వ్యక్తి యొక్క ప్రత్యేక ము
సంయమము చేయుట వలన అవతలి వ్యక్తి మనసులో
తెలియును. నేటి కాలములో కూడా ఈ సంయమ
వైశారాద్యమును ప్రకటించు మహానుభావులు ఎందరో
ఎవరివైపు చూచినా, అవతలి వారి యొక్క మనసులో
తక్షణమే గ్రహించగలరు. ఇట్లే "భువన జ్ఞానమ్ సూర్యే
సూర్యుని యందు సంయమము చేయుట వలన లో
జ్ఞానము కలుగును.

'చంద్రేతారావ్యూహ జ్ఞానమ్" - చంద్రుని యంద
చేయుటచే నక్షత్ర సముదాయము యొక్క జ్ఞానము కలుగ
అద్భుత విషయములు మన ఊహకు ఎంత మాత్ర
పతంజలి మహర్షి విరచితములై విభూతి పాదములో చె

ఈ ధారణ, ధ్యాన, సమాధి రూపమైన సంయ
యందే చేసినట్లైతే బహుజన్మ దుర్లభమైన ఆత్మజ్ఞానము క
భగవానుడు గీత యందు

**"శనై శ్శనై: ఉపరమేద్బుద్ధ్యా ధృతి గృహీతయా**
**ఆత్మసంస్థం మనః కృత్వా నకించి దపి చిన్తయేత్"**
**గీత 6-25**

ధృతి గృహీతయా = ధైర్యముగా దృఢముగా చేపట
= బుద్ధి చేత, మనః = మనస్సును, ఆత్మ సంస్థం కృ
యందుంచి (ప్రవేశింపజేసి), శనై: శనై: = మెల్ల మెల్లగా,
బాహ్య విషయములనుండి వెనుకకు మరల్చవలెను. అట్లు
మనసును ఉంచిన తరువాత, న కించి దపి చిన్తయేత్ =
ఆలోచింపకూడదు.

విషయములనుండి మనసును వెనుకకు మరల
పరమార్థము. కాని విషయములందు మనసును విస్తరింప
పరమార్థము కాదు.కావున ఆత్మ యందు ధ్యాన, ధారణ,
సంయమమును చేసి జీవిత పరమార్థమును పొందుటకు సా

యోగమార్గము ప్రతిపాదించుచున్నది.

కాబట్టి నిష్కామకర్మాచరణ ద్వారా, అనన్య భక్తి ద్వారా, ఆత్మజ్ఞానమును పొందుట ద్వారా, ధ్యాన ధారణాదులను ఆత్మయందు సంయమమును చేయుచు, యోగమార్గము ద్వారా జీవిత పరమార్థమగు జన్మరాహిత్యము (మోక్షమును) పొందు విధానమును వేదాంత శాస్త్రము బోధించుచున్నది.

ఇంకా ఎంతోకాలం జీవిస్తాము కదా, తరువాత ఎప్పుడో చూసుకోవచ్చునని అమూల్యమైన జీవితకాలమును వ్యర్థము చేసుకొనేవారు. అంతిమ ఘడియలలో వ్యర్థమైన జీవితాన్ని గురించి వాపోయినందువలన ఎంత మాత్రమూ ప్రయోజనము ఉండదు. అందుచేత చిన్న తనం నుండే సద్గుణ సంపదను పెంచుకొనే విధముగా ఈనాటి యువతకు తగిన వాతావరణం ఏర్పడాలి అంటే; సంఘంలోని భావకాలుష్యము నశించి పవిత్ర భావములు నెలకొని, ప్రజలంతా కులమత విద్వేషాలులేకుండా జీవించాలంటే; నిష్కామ కర్మాచరణ ద్వారా చిత్తశుద్ధి కలిగి, సంఘ సేవ యందు ఆసక్తి కలిగి, భక్తి భావములు పెంపొందింపచేసుకొనుటయే ఈనాటి సమస్యలకు మెరుగైన పరిష్కారము.

అంతఃకరణశుద్ధి ఏర్పడినపుడు వైరాగ్యంతో కూడిన జ్ఞానం అలవడుతుంది. ఏది నిత్యము, ఏది అనిత్యము అను వివేకము కలుగుతుంది. ఆ వైరాగ్యంతో కూడిన జ్ఞానం ద్వారా ఆత్మసాక్షాత్కారం కలిగి పరమాత్మయే జీవాత్మయనే సత్యం బోధపడి అనుభవానికి వస్తుంది. తానే పరబ్రహ్మ స్వరూపమునని తెలుసుకున్న తరువాత జనన మరణ భయమునకు తావుండదు. మరొక జన్మ లేకుండా చేసుకొనుటయే జన్మరాహిత్యము. అంతేకాని మోక్షము పొందటము అంటే మరణం లేకుండా శాశ్వతంగా ఈ శరీరంతోనే బ్రతికి ఉంటామని అర్థం కాదు.

ప్రపంచంలో దుర్మార్గం పెచ్చుపెరిగినప్పుడు, అధర్మం ప్రబలమైనప్పుడు నిర్గుణపరబ్రహ్మము, సగుణరూపంలో ఎక్కడో ఒక చోట, ఏదో ఒక రూపంలో జన్మించి దుష్టశిక్షణకు, శిష్ట రక్షణకు పూనుకోవటం తప్పనిసరిగా జరుగుతుందని భగవానుని ప్రతిజ్ఞ!.

**యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుద్ధానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.**
**గీత 4అ - 7శ్లో**

ఆత్మ జ్ఞానాన్ని సంపాదించుకోవటమే విద్య నేర్చుకోవటానికి అర్థం-పరమార్థం. అశాశ్వతమైన ఈ ప్రపంచంలోని విషయసుఖాలను అనుభవించాలని ప్రయత్నిస్తున్నంత వరకూ ఆత్మజ్ఞానం అలవడదు. ఆత్మజ్ఞానం అలవడే వరకూ జనన మరణ పరిభ్రమణము తప్పదు.

సమస్త సంకల్పములకు, వాసనలకు నిలయమైన మనస్సును నియమించి మనో విజయమును సాధించుటకు ప్రయత్నం చేయాలి. బంధ మోక్షములకు కారణమైన ఈ మనస్సును నియమించుకోవటానికి నిష్కామకర్మాచారణ, అనన్యభక్తి, ఆత్మజ్ఞానము, ప్రాణవాయువును నియమించుట ద్వారా మనోలయమును పొందుట ఏ విధముగా మార్గములు, సాధనములవుతున్నాయో మనము కర్మ, భక్తిజ్ఞాన, యోగ ప్రకరణముల ద్వారా వివరముగా పరిశీలించాము కదా!

అనిత్యమైన ఈ లోకంలో నిత్యమైనది ఆత్మ ఒక్కటి మాత్రమే.

దేహాభిమానంతోజీవుడున్నంతవరకే మమతాభిమానాలు ఉంటాయి. దేహాన్ని త్యజించిన తరువాత ఆదేహం మీద గాని, అంతవరకు దానిని అనుసరించియున్న ఇతర విషయములపై కాని జీవునకు ఏ విధమైన అభిమానం ఉండదు.

**అధ్యాత్మ విద్యా విద్యానాం ప్రధానం తత్కథాశ్రయమ్**
**శాస్త్రం సచ్ఛాస్త్రమిత్యాహుర్ముచ్యతే తద్విచారణాత్.**

విద్యలలో కెల్ల ప్రధానమైనది ఆత్మ విద్య. ఆత్మజ్ఞాన ప్రతిపాదకమగు ఆధ్యాత్మ విద్య. తద్విచారణారూపమగు, లేదా తద్వివరణరూపమగు ఉపనిషత్తులు మొదలైన గ్రంథములే 'సచ్ఛాస్త్రము' అనబడును. అట్టి సచ్ఛాస్త్రమును విచారించుటచే మనుజుడు ముక్తుడగును.

బ్రహ్మచర్యము, ధైర్యము, ధృఢమైన శరీరము (మంచి ఆరోగ్యము), తీవ్రమైన వైరాగ్యము లేని వారు ఆత్మజ్ఞానమును పొందలేరని శ్రుతి

(నాయమాత్మాబలహీనేనలభ్యః)

ముందుగా సచ్ఛాస్త్రముల చేతను, సజ్జన సాంగత్యము చేతను మనస్సును నిర్మలముగ, పరిశుద్ధముగా చేసుకొనవలెను. నిర్మలమైన చిత్తము నందు భక్తి కలిగి, ధృఢమైన వైరాగ్యము జనించినపుడు సద్గురు ఉపదేశము ద్వారా, సాధన చేసి మనుష్యులు క్రమముగా జీవిత పరమార్థమగు మోక్షమును పొందగలరని వేదాంత శాస్త్రము బోధించుచున్నది. ఎన్ని శాస్త్రములు చదివినను, ఎంతటి పండితులతో చర్చలు జరిపినను, ఎంత విచారించినను కోరికలను, ఆశలను సంపూర్ణముగా త్యజించి మౌనముగా ఉండుట కంటే ఉత్తమమైన పదవి మరేదియును లేదని శ్రీవశిష్టుల వారి బోధ.

శరీరము ఎప్పటికైనను నశించిపోవునదే అను జ్ఞానము వలన వాసనలు పుట్టకుండా ఉంటాయి. వాసనా రాహిత్యమే మోక్షము. వాసనలు నశించగనే తైలములేని దీపమువలె మనసునశిస్తుంది. మనసు నశించినచో మనసునకు అధిష్టానమగు ఆత్మ మాత్రము మిగులును. అదియే పరమానందమైన నిర్వాణస్థితి. అదియే మోక్షము.

తత్త్వ జ్ఞానముచే, తత్త్వవిచారణచే వాసనాక్షయమౌతుంది. వాసనాక్షయము చేత మనోనాశనము, మనోనాశనము చేత ఆత్మానుభూతి ప్రాప్తించును. అదియే మోక్షక్రమము అని వశిష్ఠుల వారు "యోగ వాశిష్టము ద్వారా బోధించియున్నారు.

ఆనందానికి, సుఖానికీ కారణం తెలిసో తెలియకుండానో దేహభావంపోయి చిత్తంలో బ్రహ్మభావం వ్యాప్తి చెందటం తప్ప మరేమీ లేదు.

మమకారము, అహంకారము అనేటువంటి మాలిన్యములు తొలగినపుడు ఆత్మజ్యోతి దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. బాహ్య విషయవిశ్వాసం వలన ఏపనీ విజయవంతం కాదు. నిస్వార్థ భావంతో ఏపనిని చేసినా "భగవంతుడా! ఇది నీ కార్యం. ఈ కార్యం అయినా, కాకపోయినా దీని లాభనష్టాలతో నాకు సంబంధం లేదు. నీతో అభేదంగా ఉండటమే నాకు ఆనందం." అని ప్రార్థించి కర్మఫలం ఆశించకుండా

ఈశ్వరైక్య భావముతో కర్మలను నిష్కామముగా ఆచరించినచో, ప్రపంచం లోని సర్వశక్తులూ ఏకమై ఆకార్యమును నెరవేరుస్తాయి. అటువంటి సత్కర్మలకూ, నిస్వార్థమైన కర్మలకు ఆటంకం ఎప్పుడు కలుగదు.

**"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే**

**తే షాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్"**

**గీత 9అ - 22శ్లో**

"అనన్య చిత్తంతో నన్నే చింతిస్తూ, నన్నే ఉపాసిస్తూ నిత్యయుక్తులై, భగవత్సేవకు ఉపయోగపడే శరీరాన్ని నిలుపుకోవటానికి చేసే ప్రయత్నం తప్ప మరి వేరే ఏ ఇచ్ఛయూ లేని భక్తుల యొక్క యోగక్షేమములను నేను వహిస్తున్నాను" అని భగవానుని ప్రతిజ్ఞ.

మనం పది అడుగులు భగవంతుని వైపు వేస్తే వంద అడుగులు ఆయన మనవైపుకు వేస్తాడు. ఏదో ఒక మార్గాన సాధన చేసే ప్రయత్నం ప్రారంభిస్తే, చేయూత నిచ్చి లక్ష్యమును చేరుకునేలా చేస్తాడు.

అందుచేత

శరీరాన్ని గురించి చింతించకండి ! విషయ వాసనలను పరిత్యజించండి ! కోరికలను త్రుంచివెయ్యండి! కోరికలే మానవుని దు:ఖమునకు మూలకారణము! అట్టి కోరికలకు లొంగి ఇతరులను దేహీ అని ఆశ్రయించవద్దు! అంతర్ముఖులు కావాలి! ఆత్మదృష్టిని స్థిరం చేసుకోవాలి!అదే మీ **జీవిత పరమార్థము** అని బోధిస్తున్నది **వేదాంత శాస్త్రము.**

కాబట్టి

"చనిపోయేటప్పుడు అంతిమ క్షణాలలో కాదు గీతాధ్యానం, గీతా శ్రవణం చేయటం! మీ జీవితాన్నే భగవద్గీతగా మలుచుకోండి ! ప్రాణదీపం ఈ దేహంలో వెలుగు తుండగానే ఇల్లు చక్కబెట్టుకొని పరమార్థసాధన చేసి, జీవితమును సార్థకం చేసుకోండి ! ఇప్పుడే....... ఈ క్షణ మందే......... మీ హృదయంలో జ్ఞాన దీపాన్ని వెలిగించుకొనే ప్రయత్నం చెయ్యండి !

జీవిత పరమార్థమును పొందుటకు దృఢ ప్రయత్నం కొనసాగించుకోండి !'....... అని ప్రభోదిస్తున్నది **వేదాంత శాస్త్రము**

**"తపముల్ సేసిననో మనోనియతినో దానవ్రత ప్రీతినో**
**జపమంత్రంబులనో శ్రుతి స్మృతులనో సద్భక్తినో యెట్లు ల**
**భ్యప దుండౌనని బ్రహ్మ రుద్రముఖరుల్ భావింతురెవ్వానిన**
**య్యప వర్గాధిపు । డాత్మ మూర్తి సులభుండౌ గాక నాకెప్పడున్"**

**" భాగవతము ద్వితీయస్కంధము - 64వ పద్యము".**

*ఓం శాన్తిః శాన్తిః శాన్తిః !*
"సర్వే జనా స్సుఖినో భవన్తు"
"సర్వేషాం మంగళం భవతు".